# ఆధునికాంధ్ర కవిత్వం

## తిలక్
## దాశరథి
## నారాయణరెడ్డి



కావ్యబింబ పరికల్పన
ప్రత్యేక పరిశీలన

**శ్రీమతి ఎస్. పద్మావతి**, ఎమ్.ఏ., ఎమ్.ఫిల్.

పరిశోధన పర్యవేక్షకులు
ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు గారు,
ఎమ్.ఏ., పిహెచ్.డి.

హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయం
హైదరాబాదు
1982

# CERTIFICATE

Dr.K.Veerabhadra Rao,
Professor of Telugu,
Centre of Regional Studies,
University of Hyderabad.

Dated:

This is to certify that this thesis, entitled "Modern Poetry in Telugu: A Study of Imagery in the Poetry of Tilak, Dr.Dasarathi and Dr.Narayana Reddy", submitted for the award of Ph.D., degree is a record of research work done by Smt.S.Padmavati, during the period of her study as a research student under my supervision.

Signature: K Veerabhadra Rao. 27/9/82

(Dr.K.VEERABHADRA RAO),
Research Supervisor.

**Prof. of Telugu**
Centre for Regional Studies
University of yderabad
Hyderabad.

# DECLARATION

I, S.Padmavati, declare that this thesis, entitled "Modern Telugu Poetry: A Study of Imagery in the Poetry of Tilak, Dr.Dasarathi and Dr.Narayana Reddy", is prepared by me on the basis of my own independent research work done under the guidance of Dr.K.Veerabhadra Rao, Professor of Telugu, University of Hyderabad, and this dissertation has not previously formed the basis for the award of any other degree or diploma to me.

Dated: 27-9-'82    Signature: S. Padmavati

# కృతజ్ఞతా నివేదనం

ఆధునిక ఆంధ్ర కవిత్వంపై పరిశోధన సాగించాలనే నా చిరకాల వాంఛ యథార్థం కావడానికి మూల పురుషులు ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావుగారు. నా కోరికనిని చిరునవ్వుతో ప్రోత్సహించడమేకాక ''కావ్యబింబ పరికల్పన''ని పరిశీలించమని విషయ నిర్ణయం చేశారు. హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో పిహెచ్.డి. కి ప్రవేశ అనుమతిని ఇచ్చి, నా పరిశోధనకి అద్యంతం సాదర సహకారం అందించారు. ఆంధ్ర, ఆంగ్ల, సంస్కృత భాషలలో అసమానమైన పాండిత్యంతోపాటు హిందీ సాహిత్యంతోను, విమర్శన సంప్రదాయాలతోను ప్రగాఢమైన పరిచయం కలిగి పాశ్చాత్య విమర్శనా సంప్రదాయాలని, హిందీ విమర్శనా రీతులని నాకు పరిచయం చేసి, నా పరిశీలనకి ఈ రూపాన్ని కల్పించిన ఆచార్య వర్యులకి -

తమ కవిత్వంపై పరిశోధన చేస్తున్నానని తెలియచేయగా తమ గ్రంథాలని అందించి, నా సందేహాలనుతీర్చి, నా కృషిని మొదటినుంచి ప్రోత్సహించి, '**మీ పరిశోధన పూర్తి** అయిందా?' అని మాటిమాటికి హెచ్చరించిన ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవి డా. దాశరథిగారికి -

నేను ఎమ్.ఫిల్ పరిశోధనచేసే సందర్భంలో, నాకు ప్రోత్సాహము ఇచ్చి, తమ కవిత్వాన్ని పిహెచ్.డి. పరిశోధన అంశంగా ఎన్నుకుని, వారి సహకారాన్ని కోరగా, వారి పుస్తకాలని, జీవిత విశేషాలని ఆప్యాయంగా అందించి, కవులలో ఆచార్యులు, ఆచార్యులలో కవి అయిన డా. నారాయణరెడ్డి గారికి -

హైదరాబాదు విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖని పరిపుష్టంచేస్తూ, ఆధునిక కవిత్వం గురించి నాకు ఎక్కువ అవగాహన కలిగించిన డా. జి. వి. సుబ్రహ్మణ్యంగారికి, డా. సి. ఆనందారామంగారికి -

జన్మతోపాటు సాహిత్య అభిలాషని, సంస్కృత ఆలంకారిక పరిజ్ఞానాన్ని ప్రసాదించిన మా నాన్నగారు ప్రస్తుతం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సంస్కృతశాఖలో ఎమిరిటస్ ప్రొఫెసరుగా ఉన్న ఆచార్య వేలూరి సుబ్బారావుగారికి -

పాశ్చాత్య సాహిత్యాన్ని, విమర్శనా సంప్రదాయాన్ని నేను అవగాహన చేసుకోవడంలో తోడ్పడి, నా పరిశోధనని అన్నివిధాలా ప్రోత్సహించిన మా శ్రీవారికి -

రెండు సంవత్సరాలు జూనియర్ రిసెర్చి ఫెలోషిప్‌ని, సంవత్సరంపైగా సీనియర్ రిసెర్చి ఫెలోషిప్‌ని ఇచ్చి, నా పరిశోధనని ఆర్థికంగా ఆదుకొన్న విశ్వవిద్యాలయ నిధుల సంఘం (U.G.C.) న్యూఢిల్లీ వారికి -

కావలసిన పుస్తకాలని అడిగినప్పుడల్లా అందించిన కేంద్ర విశ్వవిద్యాలయ ( గోల్డెన్ థ్రెషల్డ్ ) గ్రంథాలయ సిబ్బంది సభ్యులకి -

తన పనులన్నీ పక్కకి పెట్టి నాపనే తనపనిగా అనుకుని టైపు పని అందంగా నిర్వహించిన డి.రవికుమార్‌కి -

నా హార్దిక కృతజ్ఞతా పూర్వక నమస్సుమాంజలులు అర్పిస్తూ

ఎస్. పద్మావతి.

# పీ ఠి క

ఆధునికాంధ్ర కవిత్వ తత్వాన్ని గురించి సమాలోచనం ఈమధ్య కాలంలో విరివిగా సాగుతోంది. ఇది శుభసూచకం. సమకాలీనులైన విమర్శకులు సమకాలీన సాహిత్యాన్ని పరామర్శిస్తే కొన్ని చిక్కులు ఉన్నా విశిష్ట ప్రయోజనంకూడా ఉంది. మల్లినాథుడు కాళిదాసుకి సమకాలీనుడు కాకపోవడం కొంతలోటే. తెలుగు కవిత్వాన్ని సూక్ష్మంగా పరిశీలించి, ఆ కవిత్వంపై ఆంగ్ల సాహిత్యప్రభావాన్ని సాధికారికంగా నిరూపించి, ఈ సమాలోచనకి దారితీసింది. ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావుగారు. తరువాత వచ్చిన సమాలోచనలన్నీ వీరి మార్గదర్శక కృషికి ఋణపడి ఉన్నాయి. డా. సి. నారాయణరెడ్డిగారు ''ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు - ప్రయోగములు''లో నవ్యాంధ్ర సాహిత్యాన్ని అందలి ఉద్యమాలని సమగ్రంగా పరిశీలించారు. వీరువేసిన దారిలో కొంత ముందుకి సాగి ఆంగ్ల సాహిత్య విమర్శలో ప్రముఖస్థానాన్ని ఆక్రమించిన కావ్యబింబ వివేచనని ఆధునికాంధ్ర కవిత్వానికి వర్తింపచేసి పరిశీలించటం నా ప్రస్తుత పరిశోధన లక్ష్యం. ఎనిమిది దశాబ్దాలకి పైగా బహుముఖంగా వందలాది కవుల కవిత్వంలో విస్తరిల్లుతున్న ఆధునిక కవిత్వ ప్రక్రియలలోని కావ్యబింబాల నన్నింటిని పరామర్శించటం అసాధ్యం. ముఖ్యమైన కవితోద్యమాలకి సంబంధించిన కావ్య బింబాలని ఆధునికాంధ్ర కవిత్వ సింహావలోకనంలో పరిశీలించాను. మానవతా ఉద్యమం, భావకవితోద్యమం, అభ్యుదయ కసిత్వ ఉద్యమం, అధివాస్తవిక ఉద్యమం, దిగంబర విప్లవ ఉద్యమం, నవ్యభావ కవిత్వ ఉద్యమం, తాత్త్విక కావ్య ఉద్యమం నేను సింహావలోకనం చేసిన ఉద్యమాల్లో ముఖ్యమైనవి. ఈ పరిశీలన ఒక కేంద్రంవైపు పరిక్రమించడానికి పరిశీలనా పరిధిని తగ్గించి, సమన్వయ కవితా మూర్తులుగా బాలగంగాధర తిలక్, దాశరథి, నారాయణరెడ్డి గార్ల కవిత్వాన్ని, నారి కవిత్వంలో కావ్యబింబ పరికల్పనని ప్రత్యేకంగా, సన్నిహితంగా పరిశీలించాను. ఈ కవుల వ్యక్తిత్వ ఆవిష్కరణ, సమకాలీన సామాజిక సాంఘిక, రాజకీయ వాతావరణం సునిశిత అవగాహన ఈ పరిశీలనవలన కలిగిన రెండు ప్రయోజనాలు.

ఆధునికాంధ్ర కవిత్వంలో కావ్యబింబ పరికల్పనని పరిశీలించేముందు ఆంధ్రకవిత్వంలో 'భారత' అనువాద కాలం నుంచి ఆధునిక కాలం వరకు జరిగిన కావ్యబింబ పరికల్పనలు పరిశీలించాను. దీనికి పూర్వరంగంగా విశ్వసాహిత్యంలో కావ్యబింబాలని తలస్పర్శిగా సింహావలోకనం చేశాను. మొదటి భాగంలో కవిత్వసృష్టి, కవిత్వ నిర్వచనం విషయంలో భారతీయ, పాశ్చాత్యాలంకారికుల అభిప్రాయాలని క్రోడీకరించి, కవిత్వంలో భావప్రస్థానాన్ని భావవ్యక్తీకరణలో కావ్యబింబస్థానాన్ని నిర్ణయించడానికి ప్రయత్నంచేశాను. కావ్యబింబం గురించి పాశ్చాత్యవిమర్శకులు వెలిబుచ్చిన అభిప్రాయాలని, డా.నగేంద్రవంటి హిందీ విమర్శకుల అభిప్రాయాలని సమాలోచించి, కావ్యబింబవర్గీకరణలో ఔచిత్యాన్నికూడా పరామర్శించాను. ఉపమ రూపకాది ఇతర అలంకారాలతో కావ్యబింబం ఏలీ ఉన్నా, వాటి అన్నింటి సమగ్ర సమాహారంగా కావ్యంలోని కవిత్వపు విలువలని నిర్ణయించే నికషోపలంగా పరిగణించ తగింది. ఈ కావ్యబింబ మాధ్యమంద్వారా కవులు తమ అభిరుచులని వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తారు. వారి వ్యక్తిత్వాన్ని దర్శించడానికి కావ్యబింబ సమాలోచనం ఉపకరిస్తుందని ఆశిస్తాను.

ఆంధ్ర సాహిత్యవిమర్శలో పాశ్చాత్య సంప్రదాయాలని అనుసరించి ప్రగతి సాధించడానికి ఎక్కువ అవకాశాలున్నాయి. నాకు చేతనయినంతలో ఈ దారిలో కొంత కృషిచేయడానికి నేను చేసిన చిన్నప్రయత్నానికి ఆకృతి ఈ పరిశీలన.

---

# విషయ సూచిక


ప్రథమ ఖండం

కవిత్వం - స్వరూప, స్వభావ సమాలోచనం 1-58

కావ్యబింబం

ప్రాముఖ్యం - వ్యాపారం - వైశిష్ట్యం 59-104

ద్వితీయ ఖండం

కావ్యబింబ ప్రయోగం - సింహావలోకనం

విశ్వ సాహితి 105-126

ప్రాచీన ఆంధ్ర సాహితి 127-141

ఆధునిక ఆంధ్ర సాహితి 142-189

తృతీయ ఖండం

ఆధునిక ఆంధ్ర కవిత్వం - కావ్యబింబ పరికల్పన ప్రత్యేక పరిశీలన 190-196

బాలగంగాధర తిలక్ 197-285

డా॰ దాశరథి 286-418

డా॰ నారాయణరెడ్డి 419-574

కవిత్వం - కావ్యబింబం విమర్శనాత్మక వివేచన - ఉపసంహారం 575-601

ఉపయుక్త గ్రంథదర్శిని 602-617

# ప్రథమ ఖండం

# కవిత్వం

స్వరూప, స్వభావ సమాలోచనం

భావప్రస్థానం

కవిత్వసృష్టి

# కవిత్వం - స్వరూప స్వభావ సమాలోచనం

## కవిత్వతత్త్వం - భారతీయాలంకారికుల మతాలు - అభిమతాలు

అనాదిగా మానవుడు తన సుఖదుఃఖాలని వ్యక్తం చేయడానికి అనేక ప్రయత్నాలు చేస్తూవచ్చాడు. ఈ అభివ్యక్తీకరణ ప్రయత్నానికి భాష ప్రధాన సాధనం. మానవుడు తన ఆనందాన్ని ఆవేదనని, వివిధానుభూతులని రమణీయంగా, రసాత్మకంగా అభివ్యక్తీకరించే ప్రయత్నం 'కవిత్వం' అని, ఆ వ్యక్తి 'కవి' అని వ్యవహారంలోకి వచ్చాయి. శబ్దవ్యుత్పత్తిని అనుసరించి ఈ శబ్దానికి మూడు అర్థాలు స్ఫురిస్తాయి. కబృ (వబయోరభేదాత్) కవృ = వర్ణే: కవతే ఇతి కవిః చాతుర్యముచేత వర్ణించువాడు. కు = శబ్దే; కవతే ఇతి కవిః కై = శబ్దే: కాయతేతి కవిః[1]. వీటినన్నింటిని క్రోడీకరిస్తే 'కవి' రుచిరశబ్దవ్యాపార సంపన్నుడని తెలుస్తోంది. ఈ శబ్దం సంస్కృతభాషలో మొదట పరబ్రహ్మబోధకంగా ప్రయోగించబడింది. ఋగ్వేదమంత్రంలో కవి శబ్ద ప్రయోగం ఇలాఉంది.

గణానాం త్వా గణపతి గ్ం హవామహే  
కవిం కవీనాముపమశ్రవస్తమమ్

'ఋగ్వేదం' 2మం. 23సూ. 1ఋక్కు.

---

1. గురుబాలప్రబోధిక, 'అమరకోశము', పుట, 439.

ఈశావాస్యోపనిషత్తులో ''కవిర్మనీషీ పరిభూస్స్వయంభూః ''[2] అనే సందర్భంలోను, భగవద్గీతలో ''కవిం పురాణ మనుశాసితా రమణో రణీయాంస మనుస్మరేద్యః ''[3] అనే శ్లోకంలోను ఈ శబ్దం పరమాత్మ వాచకంగా ప్రయోగించబడింది

'మునీనామప్యహం వ్యాసః కవీనా ముశనాకవిః '[4]

అని భగవద్గీతలో 'కవి' అనే శబ్దానికి సాధారణార్థంకాక శుక్రుడనే నామాంతరము కలిగిన ఉశనుడని ప్రత్యేకమైన అర్థం కనిపిస్తుంది. అతనికి చనిపోయినవారిని పునరుజ్జీవింపచేయగల అమోఘశక్తి, సూక్ష్మజ్ఞానం ఉండేవి. అందుచేత ఇక్కడ కవి శబ్దానికి సూక్ష్మజ్ఞానవివేకవంతుడని అర్థం. ఋగ్వేదంలో 'అత్వామంత్రాః కవిశస్త్వావవాస్తు' (X, 14, 4) అనే సందర్భంలోను, 'నతోబంధమసతి నిరవిందన్హృది ప్రతీష్యకవయో మనీషా' (X, 129) అనే సందర్భంలోను కవిని ఋషిగా, జ్ఞానిగా అభివర్ణించారు. వేదాల్లోని ఈ శబ్దప్రయోగంనుంచి 'నానృషిః కురుతేకావ్యమ్', 'కవయః క్రాంత దర్శినః' అన్నవి ప్రచారంలోకి వచ్చాయి.

'కవి' కేవలం ద్రష్టగా మిగిలితే కవిశబ్దానికి ఈనాడు ప్రచారంలో ఉన్న అర్థం సార్థకం అయ్యేదికాదు. కవి ద్రష్టమాత్రమేకాడు, స్రష్టకూడా. ఆదికవి వాల్మీకి నిషాదుని దుష్టత్వాన్నిచూసి వికలచిత్తుడైశోకాన్ని అనుభవించగానే కవి కాలేదు. తాను అనుభవించిన శోకాన్ని అభివ్యక్తీకరించినపుడే కవి కాగలిగాడు.

---

2. 'ఈశావాస్యోపనిషత్తు', మంత్రం, 8.
3. 'భగవద్గీత', VII, శ్లోకం, 9.
4. 'భగవద్గీత', X, శ్లోకం, 37.

ఈ అభివ్యక్తే కావ్యసృష్టి. ఈ విషయాన్నే విద్యాధరుడు 'కవయతీతి కవిః తస్యకర్మ కావ్యమ్' అని వివరించాడు. మమ్మటుడు 'లోకోత్తర వర్ణనా నిపుణ కవి కర్మకావ్యమ్'[5] అని కవికి వర్ణనానైపుణ్యం ఆవశ్యకమని నిర్ధారించాడు. ఆనందవర్ధనుడు కవిని అపరబ్రహ్మగా వర్ణిస్తూ

అపారే కావ్యసంసారే కవిరేకః ప్రజాపతిః
యథాస్మై రోచితేవిశ్వం తథేదం పరివర్తతే[6]

అని వివరించాడు. మమ్మటాచార్యుడు కవిసృష్టి చతుర్ముఖుని సృష్టికంటె విశిష్ట తరమయిందని తెలియచేస్తూ, బ్రహ్మసృష్టి నియతధర్మసముపేతం అయిందయితే కవిసృష్టి పరమస్వతంత్రం అయింది[7] అని కవికి అత్యున్నతస్థానాన్ని ఇచ్చాడు.

---

5. మమ్మటుడు, 'కావ్యప్రకాశము', ప్రథమోల్లాసము, 2.
6. ఆనందవర్ధనుడు, 'ధ్వన్యాలోకం', 3.
7. మమ్మటుడు, 'నియతికృత నియమరహితాం హ్లాదైకమయీమనన్య
   పరతంత్రాం నవరస రుచిరాం నిర్మితి, మాదధతీ
   భారతీ కవేర్జయతి'

   ''కావ్యప్రకాశము'', 'ప్రథమోల్లాసము, 1.

భారతీయాలంకారికులు కావ్యశరీరాన్ని గురించి, కావ్యాత్మని గురించి సమగ్రమైన వివేచన చేశారు. భామహుడు శబ్దార్థాలు కావ్యం అంటే వామనుడు గుణాలంకారయుక్తములయిన శబ్దార్థాలు కావ్యంఅని భావించాడు. దోషరహితాలై, గుణసహితాలై ఒక్కొకసారి అలంకారరహితాలైనా శబ్దార్థాలు కావ్యం అని మమ్మటుడు భావించగా, నిర్దోషమై, గుణాలంకార రసవంతమైన వాక్యం కావ్యం అని భోజుడు అభిప్రాయపడ్డాడు. వాగ్భటుడు గుణాలంకారరీతి రసోపేతమైన సాధుశబ్దార్థ సంబంధం కావ్యమని అనగా, పీయూషవర్షుడు నిర్దోషమైన గుణాలంకార రీతివృత్తిమంతమయిన వాక్యం కావ్యమని భావించాడు. విశ్వనాథుడు రసాత్మకమైన వాక్యం కావ్యమని, జగన్నాథుడు రమణీయార్థప్రతిపాదక శబ్దం కావ్యమని విశదీకరించారు. దండి ఇష్టార్థభూషితమైన పదావళి కావ్యమని తెలియచేస్తే, కేశవమిశ్రుడు రసాలంకార యుక్తమయిన సుఖవిశేషసాధకం కావ్యమని స్పష్టీకరించాడు[8].

---

8. భామహుడు, ''శబ్దార్థౌ సహితౌ కావ్యం''.
వామనుడు, 'గుణాలంకార యుక్తార్థౌకావ్యం'.
మమ్మటుడు, 'తదదోషౌశబ్దార్థౌ సగుణావనలంకృతీ' పునః, క్వాపి.
భోజుడు, నిర్దోషం గుణాలంకార రసవత్ వాక్యం కావ్యం.
వాగ్భటుడు, 'గుణాలంకారరీతి రసోపేతః సాధుశబ్దార్థ సంబంధః కావ్యం'.
పీయూషవర్షుడు, 'నిర్దోష గుణాలంకార రీతి వృత్తిమత్ వాక్యం కావ్యం'.
విశ్వనాథుడు,'వాక్యం రసాత్మకం కావ్యం'.
జగన్నాథుడు, 'రమణీయార్థప్రతిపాదకశబ్దః కావ్యం'.
దండి, 'ఇష్టార్థవ్యవచ్ఛిన్నా పదావళీ కావ్యం'.
కేశవమిశ్రుడు,'రసాలంకారయుక్తం సుఖవిశేష సాధనం కావ్యం'.
శ్రీ సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి, ''కావ్యాలంకార సంగ్రహం''.
నుంచి
ఉదాహృతాలు, పుటలు, 104-105.

కావ్యసృష్టికి హేతువులని చర్చిస్తూ, ప్రాచీనులు ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసము వేటి ఆవశ్యకతని విపులంగా విమర్శించారు. ఈ ప్రతిభని భామహుడు ''ప్రజ్ఞా నవనవోన్మేషశాలినీ''[9] అని వర్ణించగా అభినవగుప్తుడు ''అపూర్వవస్తు నిర్మాణ క్షమా ప్రజ్ఞా''[10] అని నిర్వచించాడు. నిత్యనూతనంగా భాసించే కావ్య నిర్మాణం చేయగలిగే ప్రజ్ఞ కావ్యసృష్టికి ముఖ్యం అని దీనివలన విశదమవుతోంది. ఈ ప్రతిభతో పాటు శబ్దార్థవిజ్ఞానం, విద్వత్సేవ, పూర్వకవికృతుల పరిశీలన ఆవశ్యకాలని భామహుడు ఈ విధంగా తెలియచేశాడు.

శబ్దాభిధేయ విజ్ఞాయే కృత్వాతద్విదుపాసనామ్
విలోక్యాన్య నిబంధాంశ్చ కార్యః కావ్యక్రియాదరః

భామహుడు, 'భామహాలంకారమ్', 1-10.

దండి 'కావ్యాదర్శం'లో సహజసిద్ధమైన, బహుముఖమైన శాస్త్రజ్ఞానం, గట్టి కార్యదీక్ష కావ్యహేతువులు[11] గా పేర్కొన్నాడు.

---

9. భామహుడు, 'భామహాలంకారమ్', ప్రథమపరిచ్ఛేదం.
10. అభినవగుప్తుడు, 'ధ్వన్యాలోకలోచనము', పుట, 34.
11. 'నైసర్గికీచ ప్రతిభాశ్రుతంచ బహునిర్మలమ్
ఆమందశ్చాభియోగోஉస్యాః కారణం కావ్యసంపదః', దండి, 'కావ్యాదర్శం', 1-103.

రుద్రటుడు ''త్రితయమిదం వ్యాప్రియతే శక్తిర్వ్యుత్పత్తిరభ్యాసః[12]
అని ఈ మూడింటికి సమాన స్థానాన్ని ఈయగా మమ్మటుడు

శక్తిర్నిపుణతా లోకశాస్త్రకావ్యా ద్యవేక్షణాత్।
కావ్యజ్ఞ శిక్షయాభ్యాస ఇతిహేతు స్తదుద్భవే[13]

అని ఈ మూడు కావ్యహేతువులు ఏకరూపమైనవని తెలియచేయడానికి 'ఇతిహేతుః' అని ఏకవచన ప్రయోగం చేశాడు. కాని కావ్యనిర్మాణానికి కవియొక్క ప్రతిభ అన్నిటికంటె ముఖ్యమయిందని చాలామంది ఆలంకారికులు పేర్కొన్నారు. భామహుడు ''కావ్యంతు జాయతే జాతు కస్యచిత్ ప్రతిభావతః'' అని ప్రతిభకే అగ్రతాంబూలం ఇచ్చాడు. యాయావరీయుడు ప్రతిభని ''సాకేవలం కావ్యహేతుః'' అని ప్రతిభ ఒకటే కావ్యహేతువని అన్నాడు. వాగ్భటుడు ''కవులకి ప్రతిభే కావ్యహేతువు వ్యుత్పత్తి అభ్యాసము ఆ ప్రతిభకి శోభని కలిగిస్తాయి కాని అవి కావ్యహేతువులు కావని స్పష్టంచేశాడు[14].

జగన్నాథపండితుడు కావ్యానికి కవిప్రతిభ ఒకటే కారణమని ''తస్యచ కారణమ్ కవిగతా కేవలం ప్రతిభా''[15] అని నొక్కివక్కాణించాడు.

---

12. రుద్రటుడు, కావ్యాలంకారము, I - 14.
13. మమ్మటుడు, 'కావ్యప్రకాశము', ప్రథమోల్లాసము, 3.
14. 'ప్రతిభైవచ కవీనాం కావ్యకరణ కారణం వ్యుత్పత్త్యభ్యాసౌతస్యా ఏవ సంస్కార కారకౌ నతుహేతూ'.
వాగ్భటుడు, 'ఆంధ్రప్రతాపరుద్రయశోభూషణము' నుంచి ఉదాహృతం, పుట, 62.
15. జగన్నాథపండితుడు, 'రసగంగాధరం', పుట, 9.

అభ్యాసానికి, వ్యుత్పత్తికి, ఉచితస్థానం ఇచ్చినా కవితాసృష్టికి ప్రతిభ ఆవశ్యకం అనడం నిర్వివాదాంశం. ఈ ప్రతిభ మూలంగానే కవి పేలవమైన లౌకిక వాస్తవికతని రమణీయ, రసాత్మక కవితగా మలచగలుగుతాడు. ఇందుకు కవివద్ద ఉన్న పరుసవేది ''ప్రతిభ'', ''భావనాశక్తి'', ''కల్పనాశక్తి'' అని ఆలంకారికులు తెలియచేశారు. ఈ ప్రజ్ఞ త్రైకాలికమయిందని, ఇందులో స్మృతి గతాన్ని జ్ఞప్తికితెస్తుందని, మతి భవిష్యత్తుని సూచిస్తుందని, బుద్ధి వర్తమానాన్ని వివరిస్తుందని ఆలంకారికులు తెలియచేశారు[16]. కవిత్వసృష్టికి త్రికాలజ్ఞానమైన ఈ ప్రజ్ఞ ముఖ్యమయింది. కాబట్టి ఈ ప్రజ్ఞగల కవి ఋషితుల్యుడు కాగలిగి భారతీయాలంకారికుల దృష్టిలో ఉన్నతస్థానాన్ని అధిష్ఠించగలిగాడు.

---

16. 'స్మృతిర్వ్యతీత విషయామతి రాగామిగోచరా
బుద్ధిస్తాత్కాలికీజ్ఞేయా ప్రజ్ఞా త్రైకాలికీమతా'.
'సాహిత్యదర్పణము'లో ఉదాహృతము, 99.

## పాశ్చాత్యాలంకారికుల పథాలు - దృక్పథాలు

పాశ్చాత్య సాహిత్యంలో కవిత్వచర్చ మొట్టమొదట కవులే సాగించినట్టు మనకి కనిపిస్తుంది. పాశ్చాత్యసాహిత్యాల్లో పురాతనమైన గ్రీకు సాహిత్యంలో హోమరు కవి దైవాంశసంభూతుడని, కవిత్వసృష్టి దైవప్రేరణచేత జరుగుతుందని అభిప్రాయం వెలిబుచ్చాడు. ఇందుచేతనే హోమరు ( క్రీ.పూ. 685 ) తన బృహత్కావ్యాలని ప్రారంభించేముందు కవిత్వదేవత (Muse) ని గురించి ఇష్టదేవతా ప్రార్థన (invocation ) చేస్తూ, తనకవిత్వం ఆదేవత అనుగ్రహంవలన సాగుతోందని తెలియచేశాడు[1]. హోమరు తన 'ఒడిస్సీ' కావ్యంలో డెమడోకస్ అనే దివ్యగాయకుణ్ణి(divine ministrel ) వర్ణిస్తూ

> God has given ministrelsy to him as to
> none other to make men glad in what
> way so ever his spirit stirs him to sing[2]

మానసికానందాన్ని కలిగించడం కవి కర్తవ్యమని హోమరు సూచించాడు.

---

1. When Homer begins his epics with an invocation to the Muse he is uttering a theory about his poems -- namely, that they are written, or had better be written, with the help of divine inspiration.
   Wimsatt and Brooks, "Literary Criticism", 3.
2. Quoted in "Literary Criticism", 3.

తరవాత మనకే సాహిత్యచర్చ అరిస్టోఫేనిస్ రచించిన 'Frogs' (క్రీ.పూ. 405 ) అనేనాటికలో చర్చారూపంలో (agon) కనిపిస్తుంది. ఏస్కిలస్ అనేకవికి యూరిపిడేస్ అనేకవికి మధ్య జరిగిన చర్చఇది. ఏస్కిలస్ కవి గౌరవం దేనిమీద ఆధారపడి ఉంటుందని యూరిపిడేస్‌ని ప్రశ్నిస్తే

> If his art is true and his counsel sound,
> and if he brings help to the nation by
> making men better in some respect[3].

అని సమాధానం చెప్పి 'ఉపదేశం' కవితాప్రయోజనమని వెల్లడిస్తాడు.

గ్రీకువేదాంతి సోక్రటీస్ కవిత్వాన్నిగురించి వెల్లడించిన అభిప్రాయాలని ఆయన శిష్యుడు ప్లేటో (క్రీ. పూ. 428-478) Dialogues (క్రీ.పూ.403 ) అనే గ్రంథంలో చర్చారూపంలో వివరించాడు. సోక్రటీస్ కవిని 'దైవశక్తి' ని ఇనుపవలయాలగుండా ప్రసరించే అయస్కాంతం[4] తో పోల్చాడు. ఇంకా అది ఒకరకమైన ఉన్మాదమని ఇలా తెలియచేశాడు:

---

3. Aristophanes, Frogs, Ll. 1361-63.
4. "The rhapsode in a Socratic dialogue likens" the poet to a magnet radiating a kind of divine power (theia dunamis) out through a chain of iron rings". Wimsatt and Brooks, "Literary Criticism", 6.

> The poet is a light and winged and holy thing,
> and there is no invention in him until
> he has been inspired and is out of his senses,
> and the mind is no longer in him: when he
> has not attained to this state, he is powerless
> and unable to utter his oracles[5].

సోక్రటీస్ ఉద్దేశంలోనేకాక ప్లేటో ఉద్దేశంలోకూడా కవిత్వం ఒకరకమైన ఉన్మాదం వంటిది. ఇందువల్లనే ప్లేటో కవులని తన ఆదర్శసామ్రాజ్యం నుంచి బహిష్కరించాడు. మానవుల ఆవేశాలని అతిశయింపచేసే కవిత్వాన్ని నిరసించి దేవతలని నుతించే ప్రార్థనాగీతాలు, ప్రసిద్ధ వ్యక్తులని కొనియాడే కీర్తనలు మాత్రమే తన సామ్రాజ్యంలో అడుగుపెట్టగలవని ప్లేటో నిష్కర్షగా తెలియచేశాడు.[6]

---

5. Plato, 'Dialogues', Tr.by Benjamin Jowett (Oxford 1953), 534.

6. We must remain firm in our conviction that hymns to the gods and praises of famous men are the only poetry which ought to be admitted in to our state,
'- Plato 'Republic', X - 607 .

ప్లేటో కవిత్వం ఉపదేశాత్మకంగా ఉండటం ముఖ్యం అని భావించాడు. పిండార్ అనే గ్రీస్‌కవి కవిత్వానికి ప్రతిభ (phua) ముఖ్యకారణం కాని శిల్పం (techne) కాదని తెలియచేశాడు.

అరిస్టాటిల్ (క్రీ.పూ. 384-322) కవిత్వం ప్రకృతికి అనుకరణ (mimesis) అని చెప్పినా ప్లేటో ఉద్దేశంలోను, అరిస్టాటిల్ ఉద్దేశంలోను అనుకరణ అన్నపదానికి అర్థాలువేరు. ప్లేటో ఉద్దేశంలో "mimesis" అన్న పదానికి వాస్తవానికి దూరంగా ఉండటం లేదా వాస్తవాన్ని వికృతంచేయడం అని అర్థం. కాని అరిస్టాటిల్ ఈ పదాన్ని వాస్తవాన్ని మెరుగుపరచటం అనే అర్థంలో "Art imitates nature" అని తన "Meteorology" అనేగ్రంథంలో ప్రయోగించాడు. అరిస్టాటిల్ దీనినే ఉన్నతమైన సత్యం (beltion) అని వ్యవహరించాడు. కవిత్వం వస్తువులని తమ యథార్థరూపంలోనే కాక అవి ఉండవలసిన ఆదర్శస్వరూపం (hoia einai dei) లో ప్రదర్శించాలని అరిస్టాటిల్ తన "Poetics" లో తెలియచేశాడు[7].

---

7. The impossible in the higher thing, for the ideal thing must surpass the reality. Aristotle: 'Poetics' XXV. Translated by S.H.Butcher: London 1907.

ఈ దృష్టితో పరిశీలిస్తే ప్లేటోకి, అరిస్టాటిల్‌కి కవిత్వతత్వంగురించి మౌలికమైన భేదం ఉందని తెలుస్తోంది. అరిస్టాటిల్ దృష్టిలో అనుకరణ నిజానికి అనుకరణకాదు. అది పునః సృష్టితో సమానం . కవిత్వం మానవుని అంతర్వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించగలిగిన ఏకైక సాధనం. కవి తన కవిత్వంలో మానవుల శీలాన్ని, నైతిక వర్తనలని, ఆవేశాలని, అనుభవాలని (Ethe, Pathe, Praxies) అనుకరించి వాటి నిజమైన వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తాడనిచెప్పి అరిస్టాటిల్ కవికి ద్రష్టగాను, స్రష్టగాను ఉన్నత స్థానాన్ని ఇచ్చాడు.

లాటిన్ భాషలో కవిత్వతత్వాన్ని విశదంగా వివేచనచేసిన హోరేస్ ( క్రీ.పూ. 65-8) తన "Ars Poetica" అనేగ్రంథంలో కవిత్వసృష్టికి పుస్తక పరిజ్ఞానం వలన లభించే శిల్పం ముఖ్యమా ? లేదా కవితావేశం ముఖ్యమా ? అని ప్రశ్నించి ఇవి రెండూ పరస్పర పోషకాలే అని నిశ్చయించాడు[8].

---

8. So far as I can see neither book learning without a lot of inspiration nor unimproved genius can get very far. The two things work together and need each other: Horace, **Ars Poetica**, 408-411. Loeb classical library Edition, tr.by Wimsatt & Brooks.

లాంజైనస్ (క్రీ.శ. 1వ శతాబ్దం) "Peri Hupsons" అనే తన గ్రంథంలో మానవహృదయాన్ని ఉన్నతస్థానానికి తీసుకుని వెళ్ళటం కవిత్వలక్ష్యం అని నిర్ణయించాడు.

> The effect of elevated language upon an audience is not persuasion but transport[8].

Transport అంటే ఈతని అభిప్రాయంలో 'రసానందం'. సహృదయుడైన పాఠకుడు అనుభవించే ఈ ఔన్నత్యం ఆత్మయొక్క ప్రతిధ్వని / "sublimity is the echo of a great soul" అని వ్యవహరించాడు. ఋషితుల్యుడైన కవియొక్క ఆత్మని ఆవిష్కరించే ప్రయత్నం కవిత్వం అని తెలియచేశాడు.

దృశ్యమానమైన ప్రకృతి ఎన్నోవిధాలైన వైవిధ్యాలని కలిగి ఉంటుంది. ఈ ప్రకృతి వెనకఉన్న ఏకత్వాన్ని దర్శించడం కవి కర్తవ్యం అని ప్లోటినస్ తన 'ఎనియడ్స్' (Enneads) అనే గ్రంథంలో తెలియచేశాడు. ఈ దివ్యపథాన్ని చేరుకోడానికి ఆత్మ (psuche) జ్ఞానం (nous) ఏకత్వం (tohen) అనే శక్తిత్రయం అవసరమని ప్లోటినస్ వివరించాడు. సామాన్యమానవుని దృష్టికి విభిన్నంగా కనిపించే బాహ్యమైన వాస్తవాలలో కూడా ఏకతాసూత్రాన్ని గ్రహించటం అవసరం అని, కావ్యసౌందర్యం ఏకత్వంవలన ఉద్బుద్ధమవుతుందని తెలియచేశాడు. కావ్యసౌందర్యానికి, కావ్యనిర్మాణానికి అవసరమైన వివిధసామగ్రి సుందరంగా ఉండటమేకాక వీటినన్నింటిని చేకూర్చగా రూపొందిన సమాహారంకూడా సౌందర్యవంతంగా

ఉండాలని ప్లోటినస్ అభిప్రాయపడ్డాడు[9]. కవిప్రదర్శించే ఈ సమన్వయశక్తి పాశ్చాత్యాలంకారికులదృష్టిలో కూడా దైవదత్తమయింది. సెయింట్ అగస్టీన్ (354-430 AD) అనే రోమన్ తత్వవేత్త 'De Musica' అనేగ్రంథంలో ఈ సమన్వయాన్ని మానవుని మేధకి సంబంధించిన విషయంగా కాక భగవద్దత్తమైన వరం అని (divine gift) అన్నాడు. Allon Tate అనే ఇటీవలికాలపు అమెరికన్ రచయిత ఈ శక్తినే "Angelic imagination" అని వ్యవహరించాడు. ఈ శక్తివల్లనే కవి ప్రకృతిలోని ద్వైతాన్ని (Duas) అధిగమించి అద్వైతాన్ని (Monas) దర్శించగలుగుతాడు.

సెయింట్ థామస్ ఎక్వినాస్ కవిత్వసౌందర్యానికి ముఖ్యాంగాలు మూడని తన "Summa Theologiae" అనే గ్రంథంలో తెలియచేశాడు. అవి సంపూర్ణత లేదా సమగ్రత (integritassive perfectio) సానుపాతికత లేదా సమన్వయం (debita proportiosive consonantia) జ్ఞానప్రకాశం (claritas) అని వివరించాడు. సౌందర్యతత్వశాస్త్రం (Aesthetics) లో జ్ఞానజ్యోతి అనేపదం claritas, splendour, lux అనే రూపాల్లో మనకి కనిపిస్తుంది. కవిత్వంలో ఈ జ్యోతిచేసే వ్యాపారాన్ని

---

9. Only a compound can be beautiful, never anything devoid of parts, and only a whole, the several parts will have beauty, not in themselves, but only as working together to give a comely total: Yet beauty in an aggregate demands beauty in details.

Plotinus, 'Enneads', I, VI, 1.

"resplendentia formal" అని వివరించారు[10]. కావ్యసౌందర్యానికి సంబంధించిన కాంతి ప్రకృతిలో ఉన్న వివిధ అంశాలకి ఒక ఆకృతిని, ఏకత్వాన్ని కలిగిస్తుందని ఈ తత్వవేత్త విశ్వసించాడు. 'కవి వచస్సువిత్రకాంతి' ప్రకృతి అంతరాంతరాలలోని జ్యోతిస్సమల్ని బహిర్గతంచేయాలి అని ఆధునిక కవి బాలగంగాధర తిలక్ ఆశించడం రోమన్ తత్వవేత్తల సౌందర్యదృష్టిని గుర్తుచేస్తోంది.

ఇంగ్లీషు భాషలో కవిత్వతత్వ విచారం 16వ శతాబ్దంలో ప్రారంభమయిందని చెప్పవచ్చు. సర్ ఫిలిప్ సిడ్నీ "Defense of Poesie" (1585) లో అరిస్టాటిల్ చెప్పినట్టుగా కవిత్వం అనుకరణ అని అంగీకరించాడు. ఈ అనుకరణ వేరొకసత్యాన్ని వ్యక్తీకరించి వాటికి ఆకృతి కల్పించాలని, రూపకవిధానంలో మాట్లాడాలని, మాట్లాడేచిత్రం అని వివరిస్తూ కవిత్వంయొక్క లక్ష్యం ఉపదేశం, ఆనందం అని తెలియచేశాడు[11]. షేక్స్పియరు (1564-1616) "A Midsummer Night's Dream" అనే నాటకంలో

---

10. The splendor of form shining upon the proportioned parts of matter or upon diverse powers of actions.
St Thomas Aquinas, 'Summa Theologiae', Quoted by Wimsatt & Brooks. "Literary Criticism", 126.

11. Sir Philip Sidney, 'Defense of Poesie' (Ed by A.S.Cook.Boston, 1893) 9.

The poet's eye in a fine frenzy rolling,
Doth glance from heaven to earth,
from earth to heaven.....
.....the poets' pen.....gives to airy nothing
A local habitation and a name[12].

షేక్స్పియరు ఈ పంక్తుల్లో కవిని, ఉన్మాదిని, ప్రేమికుణ్ణి ఒకేవర్గానికి చెందిన వ్యక్తుల్లా పరిగణించాడు. అంతేకాక వీరందరిది ఒకరకమైన ఉన్మాదమని (frenzy) తెలియచేశాడు. కాని దానిని సాధారణమైన ఉన్మాదంగా కాక అలౌకికమైన ఉన్మాదంగా చెప్పుకోవచ్చు. కవిత్వం మానవమేధని ఉన్నతస్థాయికి తీసుకుని వెడుతుంది. దీనికి దైవశక్తియొక్కప్రేరణ అవసరమని బేకన్ తన "Proficience and Advancement of Learning" లో తెలియచేశాడు. 17వ శతాబ్దంలో డ్రైడెన్, పోప్ వంటి కవులు కావ్యాలంకార చర్చ చేసిన సందర్భంలో కవిత్వంలో 'wit' ప్రధానాంగమని భావించారు. డ్రైడెన్ ఈ పదాన్ని

The definition of wit is only this: that it
is a propriety of thoughts and words; or
in other terms thoughts and words
elegantly adapted to the subject[13].

---

12. Shakespeare, "A Midsummer Night's Dream", V,i, 21-28.
13. John Dryden, 'Apology for Heroic Poetry'(1677) Quoted in 'Literary Criticism,' 230.

అని నిర్వచించి ఈ పదాన్ని 'imagination' పదానికి తుల్యంగా ఉపయోగించాడు. కవి ప్రకృతినేకాక పూర్వకవులని కూడా అనుకరించవచ్చునని పోప్ అభిప్రాయపడ్డాడు. పూర్వకవులలోను, ప్రకృతిలోను ఉన్న సూత్రాలని గ్రహించి వాటిని క్రమబద్ధంగా వ్యక్తీకరించడం కవిత్వమని, కవిత్వంలో Nature methodized మనకి కనిపిస్తుందని పోప్ తన Essay on Criticism లో తెలియచేశారు. ప్రకృతిని అందమైన వేషంలో ప్రదర్శించడం కవిత్వానికి ముఖ్యం అని వివరిస్తూ

True Wit is Nature to advantage dress'd
What oft was thought, but n'er so well express'd

Essay on Criticism, 297-98.

కవిత్వానికి చిత్రకళతో ఉన్న సన్నిహితసంబంధాన్ని పాశ్చాత్య ఆలంకారికులు సూక్ష్మంగా పరిశీలించారు. అరిస్టాటిల్ పూర్వుకుడైన సిమొనైడిస్ అనే తత్వవేత్త చిత్రకళ మాటలులేని కవిత్వంఅని, కవిత్వం మాట్లాడే చిత్రం అని తన అభిప్రాయం వెల్లడించాడు[14]. ఈ అభిప్రాయం హొరేస్ వ్రాసిన "Ars Poetica" కావ్యానికి మరింత ధృఢపడింది. హొరేస్ని అనుసరిస్తూ

---

14. Painting is mute poetry, poetry a speaking picture - statement attributed to Simonides and repeated by Plutarch.

Quoted in 'Literary Criticism', 263.

చార్లెస్ అల్ఫోన్సుడు ఫ్రెస్నాయ్ అనే ఫ్రెంచి చిత్రకారుడు 'De Arte Graphica' అనే గ్రంథంలో 'కవిత ఒక చిత్రంలాంటిది అందువల్ల చిత్రం కవిత్వంలా ఉండటానికి ప్రయత్నించాలి. చిత్రం తరచుగా మౌనకవిత్వం అని పిలువబడుతుంది. కవిత్వంకూడా మాట్లాడే చిత్రంగా పిలువబడుతుంది.'[15] అని తెలియచేశాడు.

కవిత్వానికి చిత్రానికి ఉన్న భేదాన్ని చర్చిస్తూ, డ్రైడెన్ Parallel between Poetry and Painting" అనే ఉపోద్ఘాతంలో కవితలో కథావస్తువు చిత్రానికి సంబంధించిన రేఖాచిత్రం వంటిదని, ఆ రేఖలు సర్వాంగ సుందరమైన చిత్రంగా రూపుదిద్దుకోడానికి అనేకమైన రంగులు అవసరమైన విధంగా కవితావస్తువు సుందరమైన కవితాస్వరూపాన్ని పొందడానికి శైలి, కావ్యబింబాలు అవసరం[16] అని వివరించాడు. ప్రకృతిలోని ఆకృతుల భౌతిక రూపాలని చిత్రించడం మాత్రమే కవిత్వంయొక్క లక్ష్యంకాదు. ఆ భౌతిక ఆకృతులు

---

15. Charles Alphonse Du Fresnoy,
'ut pictura poesis erit; similisque Poesi
Sit Pictura;.....
.....muta Poesis
Dictur haec, Pictura loquens solet illa. Vocari'.
Quoted in 'Literary Criticism', 264.
16. According to Dryden, the plot of a poem is like the line drawing or sketch for a painting. The diction and imagery are like the colours.
(the outline "to advantage" filled).
"Literary Criticism", 264.                264.

దృశ్యాలన్నీ చూపించే ప్రభావాన్ని వ్యక్తపరచడం కవిత్వం అని లెస్సింగ్ అనే జర్మన్ తత్వవేత్త "Laokoon" అనే గ్రంథంలో వివరించాడు. లెస్సింగ్ కవిత్వానికి, చిత్రానికి ఉన్న ప్రధాన భేదం చలనచిత్రాలకి, అచలనచిత్రాలకి ఉన్న మౌలికమైన భేదంవంటిదని భావించాడు. భావనాశక్తిని ఉపయోగించుకుని ఒక సుందరస్వప్నాన్ని సృష్టించడంవలన కవిత్వం చిత్రంకంటె ఉన్నతస్థానాన్ని పొందగలుగుతోంది.

కవిత్వంలో ఉదాత్తత (sublime) స్థానాన్ని వివరిస్తూ లాంజైనస్ "On the sublime" అనే రచనలో ఈ విధంగా వివరించాడు. కవి యొక్క ఆత్మకి సంబంధించిన ఆలోచనలు, ఆవేశాలు ఈ ఉదాత్తతకి కారణాలు. ఉదాత్తత శైలికి సంబంధించిన విషయంఅయినా ఈ విశేషగుణాన్ని బాయిలూ అనే ఫ్రెంచి విమర్శకుడు "Du sublime" (1674) లో

> The element of the extraordinary in discourse the marvellous, the striking, that in virtue of which a work exalts, ravishes, transports[17].

అని వర్ణించాడు. ఎడిసన్ తన "Spectator Essays" లో కవిత్వానికి కవిహృదయంలోని ఆవేశాలు, భావాలు మాత్రమేకాక అనేక అనుభూతుల, అనుభవాల సమన్వయం అవసరమని తెలియచేశాడు. ఈ సమన్వయశక్తినే వర్డ్స్‌వర్త్ "mental chemistry" అని వర్ణించాడు.

---

17. Quoted in Literary Criticism, 285.

షిల్లర్ అనే జర్మన్ తత్వవేత్త కళని సృష్టించడానికి రెండు శక్తులు అవశ్యకం అని భావించాడు. కవి పరిమిత భౌతికశక్తి (Stofftrieb) అపరిమిత భావశక్తి (formtrieb) నేటి రెండింటిని తన సంపూర్ణ వ్యక్తిత్వం (spieltrieb) తో సమన్వయపరచి కవిత్వంలో వ్యక్తీకరిస్తాడని తెలియచేశాడు. దీనినిబట్టి కవి ప్రస్తుతాంశాలని, శాశ్వతసత్యాలని, భౌతికాన్ని ఆధ్యాత్మికాన్ని, ఇంద్రియానుభవాలని, అతీంద్రియ భావనాశక్తిని సమన్వయపరచగలిగే ప్రతిభాసంపన్నుడని స్పష్టమౌతోంది. వార్డర్ కవిత్వం ఇంద్రియజ్ఞానానికి మాత్రమే పరిమితమయింది కాక ఆత్మసంగీతాన్ని వినిపించగలుగుతుందని భావించాడు. నోవాలిస్ 'కవిత్వం కవి భావాలచేత స్వేచ్ఛగా మార్చబడే అంతరంగసంగీతం లేదా అంతరంగ చిత్రరచన'[18] అని వర్ణించాడు. కవిత్వం ప్రకృతికి అనుకరణ మాత్రమేకాదు. సృష్టికి ప్రతిసృష్టి చేయగల ప్రక్రియ అని జర్మన్ తత్వవేత్తలు భావించారు. వీరిదృష్టిలో కవి రెండవ సృష్టికర్త.

ఆంగ్ల కవిత్వంలో కాల్పనికోద్యమకాలంలో కవిత్వసృష్టికి భావనాశక్తి అవశ్యకత అధికమని స్పష్టీకరించారు. ప్రకృతి అనుభవాలు, అనుభూతులు కవి మనసులో అనేక బింబాలని సృష్టిస్తే, ఆ బింబాలని కావ్యబింబాలుగా మలచి కవిత్వాన్ని సృష్టించేది భావనాశక్తి. ఈ భావనాశక్తిని వర్డ్స్‌వర్త్ conferring, abstracting, modifying and endowing power అని

---

18. Novalis thought of poetry as either inner music or inner painting "freely modified by the nature of feeling"

'Literary Criticism', 373.

తెలియచేశాడు. ఈ శక్తే వివిధ అనుభవాల బింబాలని, జ్ఞాపకాలని సమన్వయ పరచి, సంశ్లేషించేసి, ఆకృతికల్పించి సృష్టిచేయుగలుగుతుంది అనికూడా వివరించాడు[19], కవిత్వానికి మూలభూతమైన భావనాశక్తి (imagination) ప్రాథమిక (primary) గౌణ (secondary) అని రెండు విధాలని వివరించి కాల్‌రిడ్జ్ 'fancy' "imagination" అని రెండు ముఖ్యమైన భేదాలు తెలియచేశాడు. భౌతికప్రపంచాన్ని ఇంద్రియజ్ఞానం ద్వారా అర్థం చేసుకోవడం ప్రాథమిక భావనాశక్తి (primary imagination) భౌతికమైన పదార్థాలలో ఏకత్వాన్ని గ్రహించేశక్తి గౌణభావనాశక్తి (secondary imagination) అని వ్యవహరించాడు[20]. కావ్యబింబాలు కవితాస్థాయిని

---

19. Wordsworth, 'The imagination unites and coalesces. It shapes and creates,' 'Prose Works', III, 465.

20. Imagination reveals itself in the balance of reconciliation of opposite or discordant qualities: of sameness with difference, of the general with the concrete, the idea with the image, the individual with the representative.

Ed by G.Shanweross, 'Biographia Literaria', X, IV, 11.

పొందడానికి అవసరమైన పరిస్థితులని

> Images become poetic when a human and intellectual life is transferred to them from the poet's own spirit[21].

అని కాల్‌రిడ్జ్ వివరించాడు.

కవిత్వం యదార్థాలకి మాత్రమే పరిమితమయింది కాదు అనే విషయాన్ని చాలామంది ఆలంకారికులు స్పష్టీకరించారు. అంతేకాక కవిత్వంలో అసత్యాలకి కూడా స్థానం ఉందని ఫ్రెంచి సాహిత్యవేత్త డిడెరొ తన "Salon de" (1767) లో "poetry always contains a pinch of untruth" (unpen de mensonge) అని స్పష్టంచేశాడు. భౌతికమైన అసత్యంకూడా కవిత్వసత్యంగా పరివర్తన చెందుతుంది. నార్వేజియన్‌భాషలో 'Digter' అనే పదానికి కవి, అసత్యవాది అనేరెండర్థాలు ఉండటం పేర్కొనదగిన విశేషం. భావనలో కల్పింపబడే 'మాయ' (illusion) ఈ అసత్యానికి కారణమని మెకాలే తన Essays లో ఇలా అన్నాడు:

---

21. 'Biographia Literaria', ch. XV.

> By poetry we mean the art of employing words in such a manner as to produce an illusion in the imagination, the art of doing by means of words what the painter does by means of colours[22].

Shelley కవులని చట్టాలని నిర్మించేవారని, నాగరకసంఘాన్ని స్థాపించేవారని, జీవనకళలని సృష్టించేవారని[23] తెలియచేస్తూ, unacknowledged legislators of mankind" అని తెలియచేశాడు. అంతేకాక

> Poetry strips the veil of familiarity from the world and lays bare the naked and sleeping beauty which is the spirit of its forms[24].

---

22. T.B.Macaulay, 'Essays', 154.
23. Shelley, 'Defence of Poetry', 5.
24. Shelley, 'Defence of Poetry', 42.

అని కవిత్వతత్వాన్ని వివరించాడు. కార్లైల్ కవిని భగవంతుని సృష్టిలోని రహస్యాలు దర్శించగల 'ద్రష్ట' అని స్పష్టపరచాడు. లాటిన్‌భాషలో కవిని 'Vates' ద్రష్టవంటివాడని, భూతభవిష్యత్తులని వర్తమానానికి ప్రతిరూపాలుగా భావించగలడని, ఒకేపర్యాయంకవి వివిధరూపాలని ధరించగలిగినవాడని కార్లైల్ భావించాడు.

> I fancy there is in him the politician, the thinker, legislator, philosopher;in one or the other degree,he could have been, he is all these[25].

కవిత్వం మౌలికంగా జీవితంయొక్క విమర్శ అని భావించిన మాథ్యూఆర్నాల్డ్ కవిత్వ సృష్టికి కవి ఒక్కడే కారణభూతుడుకాదు, ఆ కవి జీవించిన కాలంకూడా ముఖ్యం అని భావించాడు[26]. కవిత్వం ప్రకృతిసిద్ధమైన గారడి అని, కవిత్వానికి భౌతిక యదార్థంతోపాటు, నైతికగాంభీర్యం (moral profundity) ఆవశ్యకం అని, సత్యం, ఉన్నతమైన గాంభీర్యం ముఖ్యం అని తెలియచేశాడు. ప్రకృతికి పురుషుడికి మధ్య డెకార్టె సూచించిన ద్వైతం క్రమంగా కాంట్‌వంటి తత్వవేత్తల

25. Carlyle, 'On Heross, Hero worship and the Heroic in History! Quoted in 'Literary Criticism', 429.

26. For a literary masterpiece, two powers must conquer, the power of the man and the power of the moment, and the man is not enough without the moment.

M.Arnold, 'The Function of Criticism at the present time', 4.

ప్రభావం వలన అంతరించి, ప్రకృతి పురుషులమధ్య అద్వైతభావం నెలకొనసాగింది. మానవుని మనసు శూన్యఫలకంకాదని, ఆతని భావనలు, ఆవేశాలు ఆతని మనసుని ప్రభావితం చేస్తాయని, ఈ భావనలు ప్రకృతినికూడా ప్రభావితంచేసి ప్రకృతి పురుషులమధ్య అద్వైత సంబంధాన్ని నెలకొల్పుతాయని, ఈయన స్పష్టంచేశాడు. ఈ తాదాత్మ్యం ప్రకృతిని బహుముఖాలైన ప్రతీకలకాణాచిగా మలచగలిగింది. కవియొక్క సూక్ష్మపరిశీలనాశక్తి ప్రకృతి వివిధరూపాలని ప్రతీకభరితంగా ప్రదర్శిస్తుంది. ఎమర్సన్ ఈ పరిశీలనాశక్తిని భూమియొక్క అంతరాంతరాలని దర్శించగల Lynceans చాక్షుషశక్తితో పోల్చి ఈ విధంగా తెలియచేశాడు.

> As the eye of Lynceans were said to see through the earth, so the poet turns the world to glass, and shows us all things in their right series and procession[27].

కవికి ప్రకృతియావత్తు వివిధరూపాల్లో ప్రతీకాత్మకంగా కనిపిస్తుంది. కవి బహుముఖమైన ప్రకృతిలో అద్వైతానుభూతిని అనుభవించడంవలన సృష్టిసమస్తం ప్రతీకలతో నిండి ఉన్నట్టు భావిస్తాడు. ఈ భావాన్నే బొదిలేర్ అనే ఫ్రెంచికవి "Correspondences" (1857) అనే తనకవితలో ప్రకృతి అంతా ఒక

---

27. Emerson, 'The Poet, The works', III, 25.

ఆలయమంతని, అప్రకృతి అనే ఆలయానికి వృక్షాలు సజీవస్తంభాలని, ఈ ప్రతీకల అరణ్యంలో (Forest of symbols) [28] మలయానిలం వీచినపుడు అస్పష్టమైన పదాలు వినిపించగా కవి ఆ పదాల ప్రతీకార్థాన్ని గ్రహించి వాటివెనకవున్న ఆధ్యాత్మిక సౌందర్యాన్ని దర్శించగలుగుతాడని తెలియచేశాడు. రెంబో అనే ఫ్రెంచి కవికూడా కవిని (Voyant) ద్రష్టగా వర్ణించి, బొదిలేర్‌ని ఆదిద్రష్ట, కవిరాజు, దేవత అని వర్ణించాడు.

ప్రకృతిలో ప్రతివస్తువు, ప్రతిశబ్దము, ప్రతివర్ణము, మానవునిలో ఒక్కొక్క రకమైన భావాన్ని పుట్టిస్తుందని, ఇవే మానవునిలో ఉండే వివిధశక్తుల్ని మేల్కొలుపుతాయని, ఈ శక్తులు మానవహృదయాలమైనచేసే అడుగుల సవ్వడులే భావనలని ఏట్స్ తెలియచేశాడు. అంతేకాక కవిత్వం అనంతమైన, అనిర్వచనీయమైన ప్రతీక (a continuous, indefinable symbolism )[29] అనికూడా నిర్వచించాడు. - అత్యున్నతస్థాయిలో ఆత్మావిష్కరణకి ఉపకరించే కవిత్వం సాధారణమైన యదార్థంనుంచే ఆవిర్భవిస్తుందని ఇలా స్పష్టంచేశాడు.

---

28. Bandlaire, 'Correspondences', Quoted in "Literary Criticism", 607.
29. W.B.Yeats, 'Ideas of Good and Evil', 241-43.

A mound of refuse or the sweepings of a
street, old kettles, old bottles, and a
broken can old iron, old bones, old
rags, that raving slut who keeps the till[30].

కాని కవి అరుచికరమైన వాస్తవజగత్తుని అధిగమించి సమస్తప్రకృతి సృష్టిసౌందర్య భాసితంగా చూపించగలగాలని ఏట్స్ "God Appointed" అనే పద్యంలో తెలియ చేశాడు.[31]. కవి ప్రకృతిలోని అనంతమైన మార్మికతని, నవ్యత్వాన్ని అనుభవించ డానికి ప్రకృతి అనే సముద్రంలో మునకలు వెయ్యడానికి సంసిద్ధుడు. చివరికి తీరానికి చేరుకుని ఒక అద్భుతమైన, శాశ్వతమైన సత్యాన్ని సందర్శించగలుగుతాడని ఆడెన్ అభిప్రాయం వ్యక్తంచేశాడు[32].. కొందరు సౌందర్యశాస్త్రజ్ఞులు వస్తువు సౌందర్యం దృష్టిమీద ఆధారపడి ఉంటుంది. కాని కేవలం ఆ వస్తువు మీద మాత్రమే ఆధారపడి ఉండదని అభిప్రాయపడ్డారు. వారిలో అమెరికాదేశస్థుడు జార్జ్ శాంతాయనా ప్రముఖుడు. శాంతాయనా తన "Sense of Beauty" అనే గ్రంథంలో ప్రేక్షకులభావాల్ని వస్తువులకాపాదించటమే ఆ వస్తువుల సౌందర్యంఅని[33]; కవిత్వసౌందర్యం ఇటువంటిదేనని తెలియచేశాడు. వ్యక్తికి

---

30. W.B.Yeats, "Collected poems", 233.
31. W.B.Yeats, "Collected Poems", 233.
32. W.H.Auden, "The Enchafed Flood", 85.
33. The beauty we attribute to objects is merely the objectification of our emotions,: George Santayana, "The Sense of Beauty", 47.

బాహ్యంగా ఉన్నప్రకృతిలో తన వ్యక్తిగతభావాలని, ఆవేశాలని సందర్శించడం సౌందర్యదర్శనానికి ముఖ్యం అని జర్మన్ తత్వవేత్త థియోడోర్‌లిప్స్ అభిప్రాయపడ్డాడు. ఈ ప్రక్రియని 'empathy' అని అభివర్ణించాడు. ఈ ప్రక్రియ మూలంగా వ్యక్తికి, వస్తువుకి మధ్య వైరుధ్యం (antithesis) అంతరించి ఆ రెండింటి మధ్య తాదాత్మ్యం ఏర్పడుతుంది. ఈ ప్రక్రియలో వ్యక్తి వస్తువుతో తాదాత్మ్యం చెందడానికి వ్యక్తియొక్క భావాలు, ఆవేశాలు సమన్వయమయేస్థితి (synaesthesis) అవసరమని ఐ.ఎ.రిచర్ట్స్ అభిప్రాయపడ్డాడు. కవిలో ఏ అనుభూతిఅయినా అనేక భావాల్ని ఉద్బుద్ధం చేస్తుంది. ఈ భావాలు కొంతవరకు పరస్పరం విరుద్ధంగా ఉండవచ్చు. కాని వాటిని ఒక క్రమపద్ధతిలో సమన్వయపరచినపుడే సౌందర్యదర్శనం కాగలదని రిచర్ట్స్ తెలియచేశాడు[34]: ఈ మానసికస్థితిని "simple resolution" అని ఏట్స్ వర్ణించాడు. వ్యక్తి జీవితంలో వివిధ అనుభూతుల్ని అనుభవించిన తరువాత అతని కనులకి కప్పిన పొరలు విడిపోయి, అసంపూర్ణమైన మనసు సంపూర్ణమై, ఒక క్షణకాలం విశ్రాంతినిపొంది, అతని హృదయం శాంతిమయమై చిరునవ్వు చిందిస్తుంది[35] అని తెలియచేశాడు.

---

34. In any equilibrium of this kind, however momentary, we are experiencing beauty, 'I.A.Richards, 'The Foundationsof Aesthetics', 75.

35. W.B.Yeats: Something drops from eyes long blind
He completes his partial mind
For an instant stands at east
Laughs aloud, his heart at pleace
"Under Ben Bulben", "Collected Poems", 342.

ఈ ప్రక్రియద్వారా కలిగే సమన్వయాన్ని "Internal equilibrium" అని టి.ఎస్.ఎలియట్ వ్యవహరించాడు. కవి దర్శించే వివిధఅనుభవాల్ని వర్ణిస్తూ, ఎలియట్ 'టైపు రైటర్ శబ్దం, వంటశాలలోకువాసనలు, స్పినోజాని చదవటం, ప్రేమలో పడటం' పేర్కొన్నాడు. ఆ అనుభవాలు కలిగించే భావాలని కవి నవ్యసమగ్రరూపాలుగా పర్యవసింపచేస్తాడు. ఎలియట్ దృష్టిలో కవిత్వం ఆలోచనకి, భావనకి మధ్య సమ్మేళనం (fusion) . కవిత్వం కవి యొక్క వ్యక్తీకరణ కాదని, నిజానికి వ్యక్తిత్వంనుంచి పరారీకావడంఅని ఎలియట్ ఒక నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు[36]. ఇది నిజానికి ఆత్మాశ్రయకవిత్వ ధోరణిని నిరసిస్తూ, వస్త్వాశ్రయ కవిత్వధోరణిని ప్రోత్సహించేవిధానం. ఇందుకు ఎలియట్ సాహిత్యంలో తనని 'classicist' గా వర్ణించుకుని వానికి అనుగుణంగా తన దృక్పథాన్ని మలచుకోడానికి ప్రయత్నించడం కారణం.

కవిత్వంలో ఉపయోగించే శబ్దాలు, శబ్దవైచిత్రి కవి వ్యక్తిత్వాన్ని సమగ్రంగా చిత్రించలేవు. కవి వ్యక్తిత్వం అతని అనుభవాలు అనుభూతులమీద ఆధారపడి ఉంటుంది. వాటిని తన కవిత్వం అనే కాంతిపేటికద్వారా పాఠకులకి వీలయినంత సమగ్రంగా, రసవంతంగా అందించడానికి కవి ప్రయత్నిస్తాడు. ఈ కాంతిపేటిక ఆవిష్కరణే సద్విమర్శ లక్షణం.

---

36. T.S.Eliot: 'Poetry is not a turning loose of of motion; it is not the expression of personality, but an escape from personality',

'Tradition and Individual' Talent,'
"Selected Essays", 10.

## కవిత్వం - భావప్రస్థానం

కవి మనసులో కలిగే భావాలకి వ్యక్తీకరణచేసే ప్రయత్నం కవిత్వం. ఈ 'భావం' అంటే ఏమిటో కొంత వివరంగా పరిశీలించవలసి ఉంది. ఈ 'భావం' అనే పదం మనకి ముందుగా భరతముని నాట్యశాస్త్రంలో కనిపిస్తుంది. భరతుడు రసనిష్పత్తిని వివరిస్తూ ''విభావాను భావవ్యభిచారిసంయోగా ద్రసనిష్పత్తిః'' అని బహుళ ప్రాచుర్యం పొందిన రస సూత్రాన్ని విరచించాడు. తరవాత ఈ విషయమే 'దశరూపకం' లో

విభావైరను భావైశ్చ సాత్త్వికైర్వ్యభిచారిభిః
అనీయమానః స్వాదుత్వం స్థాయీభావో రసః స్మృతః[1]

అని స్థాయిభావమే రసమని వివరించబడడం జరిగింది. శబ్దార్థవిచారంచేసే సందర్భంలో 'భావ' శబ్దానికి అమరకోశం ''ఇంగితం హృద్గతో భావో భావస్స్యా ద్భావబోధకః'' అని అర్థం ఇచ్చింది. ఈ శబ్దాన్ని ''భావయతి, హృదయగత మితి భావః'' అనికూడా వివరించారు. ''భావయతీతి భావః''[2] భావింప చేయునది భావం. అనే వ్యుత్పత్త్యర్థంలో కూడా ఈ భావం సహృదయుల పరంగా ప్రయోగించినట్లు కనిపిస్తుంది. వాచికాంగిక సాత్త్వికాభినయాలచేత

---

1. ధనంజయుడు, 'దశరూపకమ్', VI, 1.
2. గురుబాలప్రబోధిక, 'అమరకోశమ్', పుట, 148.

సహృదయుని మనసులో చెలరేగే మనోవికారం 'భావం' అని 'వికారోమానసోభావః' అని అమరకోశం వివరించింది[3]. దీనివలన భరతుని దృష్టిలో భావం ముఖ్యంగా సహృదయుల పరమైన మనోవికారం అని తెలుస్తోంది. సహృదయుడైన ప్రేక్షకుడు ఒక నాటకాన్ని దర్శించినపుడు ఆ పాత్రలు అభినయించే సుఖదుఃఖాది అనుభవాల వలన ఆ ప్రేక్షకుని హృదయంలో 'వికారం' కలిగే అవస్థ 'భావం' అని ఈ క్రింది శ్లోకం స్పష్టం చేస్తోంది.

సుఖదుఃఖాది భిర్భావైర్భావస్తద్భావ భావనమ్[4].

భరతునిదృష్టి ముఖ్యంగా నాటకంమీద కేంద్రీకరింపబడటంవలన అతనిదృష్టి నాటకం ప్రేక్షకుని మీద కనబరచే ప్రభావాన్ని విశ్లేషించడంలో నిమగ్నమయింది. ప్రేక్షకులలో ఈ భావోత్పాదన జరగడానికి ముందుగా కవి హృదయంలో ఈ భావోత్పాదన జరగటం అవసరం. కవి అనుభవించిన లేదా ఊహద్వారా తాదాత్మ్యం చెందిన సుఖదుఃఖాదికములైన అనుభూతులు, అనుభవాల మూలంగా ఈ భావోత్పాదన జరుగుతుంది. పాశ్చాత్య విమర్శకులదృష్టి ముఖ్యంగా కవి హృదయంలో చెలరేగే భావాలపైన, ఆభావప్రేరకాలైన అనుభూతులపైన కేంద్రీకృతమై ఉండటం గమనార్హమయింది. భరతముని వివరించిన విభావాది శబ్దాలలో 'భావం' అనే పదం ఉన్నప్పటికి ఆపదం భరతుడు కొంతవరకు పరిమితమైన అర్థంలో ప్రయోగించినట్లు కనిపిస్తోంది.

---

3. గురుబాలప్రబోధిక, అమరకోశము, పుట, 154.
4. ఆంధ్రప్రతాపరుద్రయశోభూషణములో, ఉదాహృతం, పుట, 278.

ఆధునికులదృష్టిలో 'భావ' శబ్దానికి విస్తృతార్థం ఉంది. ఈ 'భావ' శబ్దాన్ని కవిపరంగా, సహృదయపాఠకులపరంగాను కూడా ప్రయోగించవచ్చు. కవిహృదయంలో కలిగిన మనోవికారాలని శబ్దమాధ్యంద్వారా పాఠకుల హృదయాల్లోకూడా తదనురూపమైన భావాలని కలిగించటం కవిత్వప్రయోజనాల్లో ముఖ్యమయింది. ఈ ప్రయోజనాన్ని సాధించడానికి కవి తన భావనాశక్తిని సమృద్ధిగా వినియోగించుకుంటాడు. ఈ విషయాన్నే బసవరాజు అప్పారావుగారు ''అట్టిభావనాబలమున కవి కావ్యనిర్మాణము గావించి ప్రకృతి సుందరీ సౌందర్యమును ప్రదర్శించి స్వయముగ నానందముననుభవించి యితరుల నానందము ననుభవింపచేయును''[5] అని వివరించారు. కవి పాఠకుల హృదయాల్లో ప్రస్ఫుటమైన భావాలని కలిగించడానికి కవి మనసులో ప్రస్ఫుటమైన భావాలు ఆవశ్యకాలని స్పష్టీకరిస్తూ దువ్వూరి రామిరెడ్డిగారు

భావమునకు ప్రకటనకు బింబప్రతిబింబ భావసంబంధము కలదు''[6]

అని తెలియచేశాడు.

---

5. బసవరాజు అప్పారావు, ''ఆంధ్రకవిత్వ చరిత్రము'', పుట, 108.
6. దువ్వూరి రామిరెడ్డి, ''కవికోకిల గ్రంథావళి'', పుట, 206.

రసోపస్కారకమైన స్థాయిభావం విభావాదిభావాల సంయోగంవలన స్థిరమైనభావంగా మనసులో ఏర్పడుతుంది. భరతుడు దీనినే శ్రేష్ఠమైన భావంగా ''విభావానుభావవ్యభిచారి పరివృత: స్థాయిభావో రసనామలభతే''అని వెల్లడి చేశాడు. ఈ స్థాయి భావమే రసంగా పరిణమిస్తుందని భరతుడు తెలియ చేసినప్పటికి స్థాయిభావాన్ని రసోపస్కారకమైన, కావ్యాంగమైన భావానికి సమీప మయినదిగా గ్రహించవచ్చు.

మన ఆలంకారికులు ప్రయోగించిన ''భావనాశక్తి'' అనే శబ్దం పాశ్చాత్యాలంకారికుల "imagination" శబ్దానికి సమానార్థకంగా కనిపిస్తుంది. "Imagination" అనే పదానికి ''ప్రతిభ'' అనే శబ్దాన్ని కూడా సమానార్థ కంగా స్వీకరించడం పరిపాటి.[7] ప్రతిభని యోగసూత్రాలు ''ప్రాతిభాదివసర్వం ప్రతిభ''[8] అని వర్ణిస్తే అభినవగుప్తుడు ప్రతిభని 'మహోజ్ఞానమని అభివర్ణించాడు. భామహుడు ప్రతిభని ''శక్తి'' తో సమానార్థకంగా స్వీకరించాడు. ఈ ''మహోజ్ఞాన'' సమానమైన ''శక్తి'' కవిత్వహేతువుల్లో ముఖ్యమయింది. ఈ అద్భుతశక్తి కవిత్వానికి అపూర్వతని కలిగిస్తుంది. గ్రీకుదేశస్థులు కవిత్వసృష్టికి (phusis) ప్రతిభ (techne) కళాజ్ఞానం (meleta) అభ్యాసం (euphues) అదృష్టమైన అవకాశం విమర్శకుల సహాయం అవసరమని పేర్కొన్నారు.

---

7. కావ్యాలంకారసంగ్రహము, 120.

8. Quoted by Prof.K.Viswanatham, "Pratibha and Imagination".
"Essays in Criticism" and Comparative Poetics", 421.

వీటిలో ప్రతిభకే అగ్రతాంబూలం ఇచ్చారు. ఈ ప్రతిభని భట్టతౌతుడు. ''ప్రజ్ఞా నవనవోన్మేషశాలినీ ప్రతిభామతా[9]'' అని, అభినవగుప్తుడు ''ప్రతిభా అపూర్వ వస్తు నిర్మాణక్షమా ప్రజ్ఞా''[10] అని వర్ణించి ప్రతిభ నవనిర్మాణశాలి అని స్పష్టీకరించారు. పాశ్చాత్యాలంకారికులు ప్రయోగించిన "imagination" అనే పదానికి ''మహాజ్ఞాన''సమానమైన ''ప్రతిభ'' సమానార్థకశబ్దం. భావనాశక్తిని పాశ్చాత్యులు దివ్యశక్తిగా విశ్వసించారు. వర్డ్స్‌వర్త్ ఈ పదాన్ని ఇలా వర్ణించాడు.

Absolute power
And clearest insight amplitude of mind
And reason in her most exalted mood[11].

ఈ భావనాశక్తివల్లనే కవి నిస్సారమైన వాస్తవానికి కవిత్వాన్ని సంతరించగలుగుతాడు. ఈ శక్తిచేతనే వాల్మీకికి వర్షర్తువులో పర్వతాలు

మేఘ కృష్ణాజినధరాః ధారాయజ్ఞోపవీతినః
మారుతాఽపూరితగుహాః ప్రాధీతా ఇవ పర్వతాః

కిష్కింధకాండ, 28వసర్గ, 10వశ్లోకం.

గా సాక్షాత్కరించాయి.

---

9. భామహుడు, 'కావ్యాలంకారము', ప్రథమ పరిచ్ఛేదం.
10. అభినవగుప్తుడు, 'ధ్వన్యాలోక లోచనము', పుట, 34.
11. Quoted by Prof. K.Viswanatham, "Essays", 418.

ఈ శక్తినే అభినవగుప్తుడు

> దృష్టపూర్వా అపి హ్యర్థాః కావ్యేరసపరిగ్రహాత్
> సర్వేనవా ఇవాభాన్తి మధుమాస ఇవద్రుమా

అని వర్ణించాడు. ప్రొఫెసర్ లోవెస్

> The touch of genius is like the
> miracle of spring[12].

అనేవర్ణన అభినవగుప్తుని భావనకి దగ్గరగా ఉందనిపిస్తుంది. ఈ "imagination" రెండు విధాలని కాల్‌రిడ్జి వివరించాడు. వీటిని "imagination""fancy" అని వేర్కొని వేటిభేదాన్ని ఈవిధంగా తెలియ చేశాడు.

> The imagination then I consider either as primary or secondary. The primary imagination I hold to be living power, the prime agent of all human perception.....the secondary imagination I consider as an echo of the former, co-existing with conscious will. It dissolves, diffuses, dissipates in order to recreate.

---

12. Prof. Lowes, 'Convention and Revolt in Poetry', 70.

Fancy on the contrary, has no other counters to play with but fixities and definites. The fancy is indeed no other than a mode of memory emancipated from the order of time and space[13].

కాల్‌రిడ్జి ఉద్దేశంలో "primary imagination" భౌతిక వస్తుజ్ఞానానికి సంబంధించినదయితే, "secondary imagination" ఈ భౌతిక వాస్తవికత వెనకఉన్న అంతస్సూత్రాలకి సంబంధించింది అనవచ్చు. భౌతిక విషయాలని అధిగమించి వాటివస్తుస్వభావాన్ని విసర్జించి నూతనసృష్టిచేసే శక్తిని "secondary imagination" అని గ్రహించవచ్చు. యదార్థవిషయాలకి సంబంధించిన జ్ఞాపకాలే "fancy" అని కాల్‌రిడ్జి అభిప్రాయం. వర్డ్స్‌వర్త్ ఈ రెండింటి భేదాలని వివరిస్తూ ఈ విధంగా తెలియచేశాడు.

One was frolicsome and inferior, the other was totally serious and superior.

కవిత్వసృష్టికిమూలం imagination కాని fancy కాదు అని స్పష్టీకరిస్తూ ఆ భావనాశక్తిని ఇలావివరించాడు:-

---

13. S.T.Coleridge, "Biographia Literaria"(Ed by John Shawcross, Oxford 1907), 202.

> That intellectual lense through the medium of which the poetic observer sees the objects of his observations modified both in form and colour[14].

స్థూలభేదాలు ఉన్నప్పటికి కాల్‌రిడ్జ్, వర్డ్స్‌వర్త్ 'fancy' అన్న పదాన్ని స్థూలంగా భౌతిక ప్రపంచ ప్రత్యక్షజ్ఞానాన్ని సూచించడానికి ప్రయోగించినట్లు కనిపిస్తుంది. 'Imagination' అనేపదాన్ని ఈ భౌతిక వాస్తవికతని కవితామయంచేసే కల్పనాశక్తికి సమానార్థకంగా ప్రయోగించినట్లు కనిపిస్తుంది. జర్మన్ తత్వవేత్తల ప్రభావంచేత కాల్‌రిడ్జ్ ఈ రెండు పదాలకి ఈ విధమైన భేదాన్ని నిర్వచించాడు. కాంట్ అనే జర్మన్ తత్వవేత్త జ్ఞానానికి (verstand) బోధకత (anschauung) భావనాశక్తి (einbildungs kraft) ఆవశ్యకం అని తన "Critique of Judgement" (1790) లో తెలియచేశాడు[15]. షేట కూడా కవిత్వానికి ప్రాతిపదికగా ఇంద్రియజ్ఞానాన్ని వ్యవహరించాడు. కవి బాహ్య పరిజ్ఞానానికి సంబంధించిన ఇంద్రియబోధకతని కావ్యస్థాయికి తేసుకుని ఏవడానికి మనః శక్తి అవసరం. ఆ శక్తినే కాల్‌రిడ్జ్ "a mighty inward power, a feeling" అని వర్ణించాడు. కవి ప్రకృతి బాహ్యస్వరూపానికి ప్రతికృతి కల్పించడం "natura naturata" అని, అది వ్యర్థమైన వ్యాపారమని చెప్పి, కవి భావప్రకృతిలోని అంతస్సూత్రాలని దర్శించడం

---

14. Wordsworth: 'Prose works', III(Ed by G.Grossart), 465.
15. Quoted by Wimsatt and Brooks: "Literary Criticism", 371.

'natura naturans' అని, అదే కవి చేయవలసిన విశిష్టవ్యాపారమని వివరించాడు. ఈ అంతస్సూత్రాలని దర్శించడానికి 'imagination' ఉపకరించే శక్తి అని, బాహ్యప్రపంచంలోని విభిన్న, విరుద్ధ వాస్తవాలని సమన్వయించేసే శక్తి 'imagination' కి ఉందని ఇలా స్పష్టంచేశాడు.

> Imagination.....reveals itself in the balance or reconciliation of opposite or discordant qualities: of sameness with the difference, of the general with the concrete, the idea with the image, the individual with the representative, the sense of novelty and freshness with old and familiar objects[16].

భావనాశక్తిని గురించి ప్రాచ్య పాశ్చాత్యాలంకారికుల పరిశీలనవలన కవికి ప్రాతిపదికగా ఇంద్రియబోధకమైన పరిజ్ఞానం, ఆవశ్యకం అని స్పష్టమౌతోంది. కవి కేవలం భౌతిక పరిజ్ఞానం మీదే ఆధారపడితే కవి శబ్దానికి తగినవాడు కాడు. కవికి కల్పనాశక్తి, భావనాశక్తి, imagination లేదా "Einbildungs kraft" అని వ్యవహరించబడే అలౌకికశక్తి అవసరం. ఆ శక్తే కవిని సాధారణవ్యక్తి కన్న, పత్రికా విలేఖరికన్న విశిష్టమైన వ్యక్తిగా నిలబెట్టగలుగుతుంది.

---

16. Coleridge: 'Biographia Literaria', Chapter XIV, (II, 12).

## కవిత్వసృష్టి - విమర్శనాత్మక వివేచన

కవి భౌతిక ప్రపంచంలో జీవిస్తాడు. ఆ ప్రపంచంలో వివిధ సంఘటనలని తన తీక్షణమైన దృష్టిలో దర్శించి, సున్నితమైన మనసులో ఆ సంఘటనలకి సంబంధించిన ఆనందాన్నికాని, విషాదాన్నికాని తదితరప్రేక్షకుల కన్న ప్రగాఢంగా అనుభవిస్తాడు. ఆ అనుభవాలు తన హృదయంలో కలిగించిన అనుకంపనలకి రూపకల్పన చేసే ప్రయత్నమే కవిత్వం. ఆదికవి వాల్మీకి క్రౌంచద్వంద్వ వియోగాన్ని చూసి వికలమైన మనసుతో ఆ క్షణంలోనే తన శోకాన్ని

మానిషాద ప్రతిష్ఠాం త్వమగమశ్శాశ్వతీస్సమాః
యత్క్రౌంచమిథునాదేకమవధీః కామమోహితం

అని శ్లోకరూపంగా వెలువరించాడు. వాల్మీకివంటి ప్రతిభావంతుడైన కవికి తాను దర్శించిన ప్రాపంచిక సంఘటనలని హృదయంలో చిత్రించుకుని వానికి కవిత్వరూపకల్పన చేయడానికి వ్యవధి అవసరం లేకపోవచ్చు. కాని సామాన్యమైన కవికి కొంత వ్యవధి అవసరం కావచ్చు. పాశ్చాత్యులలో కవి, విమర్శకుడు అయిన వర్డ్స్‌వర్త్ కవిత్వం "spontaneous overflow of powerful feelings" అని కవిత్వం ఆశులక్షణాన్ని ప్రతిపాదించినప్పటికి, "Daffodils" అనే కవితలో ప్రాపంచికానుభవాలు కవిత్వంగా పరివర్తన చెందడానికి కొంతవ్యవధి అవసరం అని కూడా తెలియచేశాడు. తాను చూసిన Daffodils అంత సౌందర్యం తన అంతశ్చక్షువుద్వారా కవి పునరాలోకం చేయగలుగుతాడని, ఈ ప్రక్రియ ఏకాంతపు ఆనందం (bliss of solitude) లో జరుగుతుందని

When oft on my couch I lie
In vacant or in pensive mood
They flash upon the inward eye
Which is the bliss of solitude -

అని తెలియచేశాడు. కవిత్వకళ (poietike) లో కవితారచన (poeisis) ప్రముఖమైన అంగం అని అరిస్టాటిల్ తెలియచేస్తూ ఇది "actual process of composition, the activation, the putting together of the poietike అని "Poetics" లో వివరించాడు[1]. గ్రీకు భాషలో కవిని "poietes" (maker) అని పిలుస్తారు. ఈ పదం " Poiem" (to make) నుంచి ఏర్పడింది. అంటే కవిత్వం ఒక నిర్మాణ ప్రక్రియ అని వారి అభిప్రాయం.

కవి తన హృదయంలోని వివిధ అనుభూతుల్ని వ్యక్తీకరించడానికి ''కావ్యబింబం'' అనే సాధనాన్ని ఉపయోగించుకుంటాడు. హృదయగతభావాలు కావ్యబింబంగా పరివర్తన చెందడానికి అవసరమైన మానసిక పరిస్థితులని పాశ్చాత్యకవులు కొందరు స్వానుభవపూర్వకంగా వివరించారు. కవితాసృష్టిజరిగే సమయంలో కవి మానసికస్థితి వేరుకుని మానసికస్థితి వంటిదని సి.డె.లెవిస్

---

1. Aristotle, "Poetics", Translated by Gerald F.Else, 79.

భావించాడు[2]. కవి భావనాశక్తి ప్రపంచంలో ఉండే అస్తవ్యస్తమైన పరిస్థితిని క్రమబద్ధం చేసే దివ్యశక్తి అని భావించారు. కవి మొదట తన అనుభవాలకి సంబంధించిన సంస్కారాల (impressions) తో ప్రారంభిస్తాడు. ఈ అనుభూతిశకలం అనుభవాలనదిలో ఒక బిందువులాంటిది. ఈ శకలాలు కావ్యబింబంగా ఘనీభవిస్తాయని సి.డె.లెవిస్ భావించాడు[3]. కవికి లౌకికానుభవాల ముద్రలు అవసరం అని వివరిస్తూ గెథె

> I received within myself impressions-
> impressions of a hundred sorts,
> sensuous, lively, lovely, many hued
> as an alert imaginative energy presented
> them[4].

అని వివరించాడు. ఈతని దృష్టిలో కవితాసృష్టి ఇంద్రియగోచరమైన పదార్థాల అనుభవాలతో ప్రారంభం అవుతుంది. దానికి వ్యతిరేకంగా షిల్లర్ అనే జర్మన్ కవి తన కవితాభావగ్రహణం అరూపమైన, అనిశ్చితమైన పదార్థాల అనుభవాలతో

---

2. C.Day Lewis, 'The Poetic Image', 68.
3. 'The poet starts with an impression, a drop of the river of experience, crystalized perhaps into an image', 'The Poetic Image', 66.
4. Quoted by C.Day Lewis, 'The Poetic Image', 68.

ప్రారంభం అవుతుందని తెలియచేశాడు[5]. ఆంగ్లకవులలో స్వాప్నికకవి అని వర్ణించతగిన ఏట్స్ కవిత్వసృష్టిలో కావ్యబింబాలు ఏర్పడే మానసికస్థితి సమాధి సదృశస్థితి (trance - like state) అని అభివర్ణించి, అంతశ్చేతననుంచి ఈ భావాలకి రూపకల్పన చేయడానికి కోరికని, మేధని క్షణకాలం అపుచేయాలని భావించాడు. ఈ భావాలకి రూపకల్పన చేయడానికి కవి తన ప్రజ్ఞ ద్వారా కొన్ని బింబాలని స్వీకరించి, కొన్నింటిని తిరస్కరించడంలో విమర్శనాశక్తినికూడా ఉపయోగించుకుంటాడు. అంతశ్చేతననుంచి భావాలు కావ్యబింబాలుగా ఉద్బుద్ధమయ్యే ప్రక్రియని డ్రైడెన్ తన "The Rival Ladies" అనే గ్రంథానికి పీఠికలో ఈ విధంగా స్పష్టంచేశాడు.

> First it is only a confused mass of thoughts,
> tumbling over one another in the dark,
> when the fancy was at its first work moving
> the sleeping images of things towards the light,
> there to be distinguished and then either
> chosen or rejected by judgement[6].

---

5. Schiller, 'The perception with me is at first without a clear and definite object, this forms itself later, a certain musical mood of mind precedes, and only after this does the poetical idea with me', Quoted by C.Day Lewis, 'Ibid', 69.
6. Quoted by C.Day Lewis, Ibid, 69.

కవి తన పంచేంద్రియాలతో, భావనాశక్తి సహాయంతో తన సూక్ష్మ పరిశీలనాశక్తితో, అనుభూతిపరంపరతో మనసులో అనేక భావాలని మాలికరూపంలో ఏర్పరచుకుంటాడు. ఆ భావాలస్తోకాన్ని ఒక సుముహూర్తంలో కావ్యబింబాలుగా మారగలుగుతాయి. ఈ విషయాన్ని ముచ్చటిస్తూ, సి.డే.లెవిస్ కవిని 'ఎరగా ఉంచిన గాలంతో చేపకోసం ఎదురుచూసే జాలరి'తో పోల్చాడు. కాని కవి ఏదైనా భావాన్ని స్వీకరించే జాలరికాడు. తనకి నచ్చిన, నలుగురు మెచ్చగలిగిన భావం కోసం ఎదురుచూసే నిరంతర అన్వేషి అని కవిని వర్ణించడం సమంజసం. కవి అనుభవాల విశాల సముద్రంలో కవితార్హమైన అనుభూతి తరంగానికై ఎదురు చూసే రసవేది , సౌందర్యారాధకుడు. కవి అనుభూతుల్ని వ్యక్తీకరించే కావ్యబింబ సృష్టి ప్రయత్నపూర్వకంగా కాకుండా సహజసిద్ధంగా జరగాలని కీట్సు తన అభిప్రాయాన్ని తెలియచేస్తూ

> The rise, the progress, the setting of imagery
> should come natural to him - shine over
> him and set soberly, although in magnificience,
> leaving him the luxury of twilight[7].

అని వివరించాడు.

---

7. Quoted by C.Day Lewis, "The Poetic Image", 75.

కవిత్వం అంటే భావాలు, ఆవేశాలు మాత్రమేకావు, కవికి సంబంధించిన అనుభవాలు అని రిల్కే అనే జర్మన్ కవి స్పష్టీకరించాడు.

> The gestures that the little flowers make
> when they open out to the morning.....
> i.e., memories.....must have turned to
> blood within us to glance and gesture,
> nameless no longer to be distinguished
> from ourselves - only then can it happen
> in a most rare hour the first words of
> poem arise in their midst and go forth
> from them[8].

కవిత్వసృష్టిని గురించి ప్రాచీనసంస్కృతకవులు, పాశ్చాత్యకవులు వెలువరించిన అభిప్రాయాలని పరిశీలించిన తరువాత ఈ విషయంమీద ఆంధ్రకవుల అభిప్రాయాలని సమీక్షించడం అవసరం. ఆంధ్రభాషలో కవితావతరణ అనువాద సాహిత్యంతో ప్రారంభం కావడంచేత ఆదికవి నన్నయ కవితాసృష్టిని గురించి స్వంత అభిప్రాయాలని వెల్లడించడానికి అవకాశం తక్కువ. నన్నయ తన భారతరచనావతారికలో తాను రాజరాజనరేంద్రుని కోరికననుసరించి కవితారచనకి పూనుకున్నానని స్పష్టీకరించాడు.

---

8. Quoted by C.Day Lewis, 'The Poetic Image', 85-86.

రాజరాజనరేంద్రుడు ఎన్నో పురాణాలని, శాస్త్రాలని, ఉదాత్తరసాన్వితకావ్యనాటకాలని భక్తితో విన్నా, చూసినా తన హృదయం భారతశ్రవణాసక్తితో నిండి ఉందని వివరించాడు. చివరికి

"..... విమలసద్గుణ శోభితులైన పాండవో
త్తముల చరిత్ర నాకు సతతంబు వినంగ నభీష్ట మెమ్మెయిన్[9]"

అని తన కులబ్రాహ్మణుడు, అనురక్తుడు, అవిరళజపహోమతత్పరుడు అయిన నన్నయని భారతాంధ్రీకరణము చేయమని అభ్యర్థించాడు. నన్నయ దిద్దిన ఒరవడి భారతాంధ్రీకరణచేసిన తిక్కన, ఎఱ్ఱాప్రగడల కవితాసృష్టికికూడా మార్గదర్శకమయింది. సత్కవిరచితమైన కావ్యానికి, అసత్కవిరచితమైన కావ్యానికి ఉన్న భేదాన్ని వివరిస్తూ నన్నెచోడుడు తన కుమారసంభవంలో

పరగ సువర్ణబంధ మృదుభావము గల్గియులోన, జూడగా
బొరపగు చిత్రరూపమును బోలె నసత్కవి కావ్యమిమ్మహిన్
బరగు సువర్ణబంధమృదు భావ విశేషములోన నెల్లెడన్
సరియగు రత్నపుత్రికయు సత్కవి కావ్యము నొక్కరూపమై.

కుమారసంభవము ఆశ్వా.1, ప. 33.

---

9. నన్నయ, "మహాభారతము", ఆదిపర్వము, ప్రథమాశ్వాసం, పద్యం. 14.

అని కవి కానినాడు మంచి వర్ణాలని ఉపయోగించినా చిత్రపటం వెలుపలిభాగం మాత్రమే ఆకర్షణీయంగా ఉంటుంది, కాని సత్కవి రచించిన కావ్యం రమణీయమైన వర్ణాలు కలిగి బంగారంచే పొదగబడిన రత్నపుత్రికలా వెలుపల లోపల ఒకేరీతిగా ఆకర్షణీయం అవుతుందని కవి వివరించాడు. ఈ కవి కవిత్వాన్ని ఒక శిల్పంగా భావించి కావ్యాన్ని స్వర్ణకారక్రియాతుల్యమైన రత్నపుత్రిక అనే సామ్యంద్వారా తెలియచేశాడు. కవి శిల్పనైపుణ్యం కలవాడని నన్నెచోడుడు సూచించగా తిక్కన తన ''నిర్వచనోత్తర రామాయణం''లో ''అమలోదాత్తమనీషమైను భయ కావ్య ప్రౌఢిపాటించుశిల్పమునం బారసడన్ గలానిదుడ''[10] నని తెలియచేశాడు. తిక్కన శిష్యుడు మంచన తన ''కేయూరబాహు చరిత్ర''లో ''ఆంధ్రకావ్య శిల్పము'' అనే పదప్రయోగంచేసి ఆ శిల్పక్రియని

చతురోక్తుల నుత పదబహు
గతుల నలంకార భావకాంతి రసార్ద్ర
స్థితి గతి నతిరసికులు దర
సతిగతినెఱిగింప వలదె సౌభాగ్యమునన్

ఆశ్వా1, ప. 35.

నేర్పుగల మాటలచేత, పొగడదగిన నడకచేత, అలంకారాలు ధరించి రసభావాలతో మనసుని చూరగొనే సతిలాగా కావ్యసతిని మంచన వర్ణించాడు. ఈ కావ్యాంగాలు రసానందకారకాలుగా కవి భావించాడు. కవిత్వంలో ఉండవలసిన లక్షణాలని నిర్దేశిస్తూ శ్రీనాథుడు ''భీమఖండం''లో

---

10. తిక్కన, నిర్వచనోత్తర రామాయణము, ఆశ్వా1, ప. 9.

హరచూడా హరిణాంక వక్రతయు గాలాంతస్ఫురచ్చండికా
పరుషోద్గాఢ పయోధర స్ఫుటతటీపర్యంతకాఠిన్యమున్
సరసత్వంబును సంభవించె ననగా సత్కావ్యముల్వ్రేకులం
జిరకాలంబు నటించుచుండు గవిరాజీ గేహరంగంబులన్

భీమఖండము, ఆశ్వా1, ప. 11.

అని ఉత్తమ కవిత్వానికి శివజటాజూటానికి అలంకారమైన చంద్రవంకలాగా వక్ర సౌందర్యం, రౌద్రమూర్తి అయిన చండికాదేవి పరుషపయోధర కాఠిన్యం, రసనిర్భరత్వం ఉండాలని తెలియచేశాడు. ప్రబంధకవులలో సమున్నతస్థానాన్ని అలంకరించిన పెద్దన సంస్కృతాంధ్రభాషలలో సమానంగా కవిత్వం చెప్పినవారికి గండపెండేరాన్ని బహూకరిస్తానని కృష్ణదేవరాయలు ప్రకటించగా ఉత్తమకవిత్వ లక్షణాన్ని సంస్కృతాంధ్రభాషల ప్రయోగంద్వారా వివరిస్తూ ''పూతమెఱుంగులు'' అనే పద్యమాలిక ఆశువుగా చెప్పినట్లు ప్రతీతి. ఇందులో కవిత్వం ''రాతిరియుం బవల్ మఱపు రాని హొయల్ చెలియారజంపు నిద్రాతరితీపులం బలెను దారసిలన్వలె'' నని కవిత్వ లాలిత్యాన్ని తెలియచేస్తూ అచ్చతెలుగు పదాలలో కవిత్వాన్ని వివరిస్తూ

.....దమ్మిచూలిదొరకొమ్మవసన్తం జవరాలి నిబ్బెప్పు
న్నే తిలియుబ్బురంపు జిగినిబ్బరపుబ్బగు గబ్బిగుబ్బపొం
బూతల నున్నకెంపు సరిపోడిమి

అని సంస్కృతంలో వివరిస్తూ,

శీతనగాత్మజా గిరిశశేఖర శీతమయూఖరేఖికా
పాతసుధాప్రపూర బహుభంగ ఘుమం ఘుమ ఘుంఘుమార్భటీ
జాతకతాళయుగ్మ లయసంగతి చుంచువిపంచికే మృదం గా

ధ్వనులతో కింకిణీస్వనములతో చేతము చల్లచేయువలె ''మనోహర దోహక
గోస్తనీఫల మధుద్రవ గోఘృత పాయసప్రసారాతి రసప్రసార రుచిర ప్రసరంబుగ''
అని కవిత్వం పంచేంద్రియాలకి ఆనందానుభూతిని కలిగించాలని నిర్దేశించారు.
కాని ఆంధ్రకవితాపితామహుని దృష్టి కవితాసృష్టికి పూర్తిగా ప్రసరించలేదని
చెప్పక తప్పదు. కాని అనుభూతంగా అల్లసానివారు చెప్పినట్లు భావింపబడే ఈ
క్రింది పద్యంలో ఆయన కవిత్వ సృష్టికి అవసరమయిన ప్రేరకశక్తులని సంపుటీ
కరించాడు.

నిరుపహతి స్థలము రమ
ణీ ప్రియ దూతిక తెచ్చియిచ్చుక
ప్పురపువిడె, మాత్మ కింపయిన
భోజన, ముయ్యెలమంచ, మొప్పు
తప్పరయు రసజ్ఞు, లూహ తెలి
యంగల లేఖక పాఠకోత్తముల్
దొరకిన గాక యూరకకృ
తుల్ రచియింపుమటన్న శక్యమే.

అల్లసాని పెద్దన ఇక్కడ ఈ విషయాన్ని ప్రసన్నధోరణిలో ముచ్చటించాడని అనుకోవచ్చు. ప్రబంధయుగంలోనే స్వతంత్రభావనాచమత్కృతి పుష్కలంగా కలిగినకవి పింగళిసూరన. పింగళిసూరన కళాపూర్ణోదయ ప్రబంధంలో కవితాసృష్టికి హేతువులైన కవితా సామగ్రిని ఇలా వివరించాడు.

> పొసగముత్యపు సరు ల్పోహళించినలీల దమలనేదొరయుశబ్దములగూర్చి
> యర్థంబు వాచ్యలక్ష్యవ్యంగ్యభేదంబు లెఱిగి నిర్దోషతనెసగజేసి
> రసభావములకు సర్వాంబుగ వైదర్భి మొదలైనరీతులనిమ్ముగ నమర్చి
> రీతుల కుచితంబు లై తనరారెడు పాకంబు లింపుగా బాదుకొల్పి
> యమర నుపమాదులును యమకాదులునగు
> నట్టి యర్థశబ్దాలంక్రియలు ఘటించి.......,[11]

అని కావ్యరచన కుపకరించే కవితా సామగ్రిపైనే తనదృష్టిని కేంద్రీకరించాడు. ఇంకా

> చలువగల వెన్నెలల చెలువునకు సౌరభము
> గలిగినను సౌరభము జలువయు దలిర్పం
> బొలుపెసగు కప్పురపు బలుకులకు గోమలత
> నెలకొనిన సౌరభము జలువపసయుం గో
> మలతయును గలిగి జనముల మిగుల చెంపెసగు
> మలయు పవనంపు గోదములకు మధురత్వం
> బలవడిన, నేడు మఱి కలదనగవచ్చు, గడు
> వెలయుగల యా సుకవి పలుకులకు నెంచన్[12]

---

11. పింగళిసూరన, కళాపూర్ణోదయము, ప్రథమాశ్వాసము, ప. 81.
12. పింగళిసూరన, కళాపూర్ణోదయము, ప్రథమాశ్వాసము, ప. 83.

అనికూడా కవితాలక్షణాలని పింగళిసూరన వివరించాడు. పింగళిసూరన దృష్టిలో కవిత్వం చలువ వెన్నెలలు చల్లదనంతోపాటు సౌరభాన్ని, కర్పూరం చల్లదనం సౌరభంతోపాటు కోమలత్వం, మలయానిలం చల్లదనం సౌరభం, కోమలత్వంతోపాటు మాధుర్యంకూడా కలిగి ఉండాలి.

కావ్యసృష్టిని గురించి సవిమర్శక పరిశీలన ఆధునికకాలంలో ఆరంభమయింది అనడం అతిశయోక్తికాదు. ఆధునికాంధ్ర సాహిత్యంలో యుగకర్తగా పరిగణింపబడే శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారు కవితాసృష్టిమై ప్రశంసనీయమైన వివేచన చేశారు. రాయప్రోలువారు తమ సాహిత్యవిమర్శకసూత్రాలని చాలావరకు సంస్కృత ఆలంకారికులనుంచి స్వీకరించారు. కాని ఆ సూత్రాలని యథాతథంగా కావ్యవిమర్శకి అన్వయించకుండా కవిత్వసృష్టిలో తమ వ్యక్తిగత సమస్యలని ఏవిధంగా పరిష్కరించుకోగలిగారో అనుభవపూర్వకంగా తెలుసుకుని ''రమ్యాలోకం'' ''మాధురీ దర్శనం'' ''వనమాల'' అనే రచనలలో తెలియచేశారు. కవి హృదయంలో జాలువారిన భావన కవితగా, గీతికగా, ఏవిధంగా రూపుదిద్దుకుంటుందో రాయప్రోలువారు 'ఈ గీతము' లో సవివరంగా, కవితాత్మకంగా చిత్రించారు. అస్పష్టమయిన భావం కవి హృదయంలోకి ప్రవేశించే విధానాన్ని

జారిందినాలోన
స్వాతి బిందుప్రభాతి[13]

---

[13]. రాయప్రోలు సుబ్బారావుగారు, 'ఈ గీతము', ''వనమాల'', పుట. 22.

అని వర్ణిస్తూ ఆ భావం చిమ్ములై, చిలపలై, చెరువులై నిండిందని, ఆ భావ వ్యాకోచాన్ని మనకి దృశ్యమానం చేశారు. ఈ భావం మొదట్లో అమూర్తం కాబట్టి ''కన్నులన్నీ తిప్పి మిన్ను మన్నూ కాంచినా'' కనబడదు. తలపుదీపం చూపిస్తే, మూర్తం అయ్యే అవకాశం ఉంది. అస్పష్టంగా ఉన్న ఈ భావం క్రమంగా స్పష్టమైన నాదస్వర పరిచ్ఛేదమై, అనుభవవేద్యమైన ఆకృతిని దాలుస్తుంది. ఈ భావం కొండలా పెరిగి, మంచులా విరిగి కవి అనుభూతి ఆవరణలో ప్రవేశించి

తాకింది హృదయంబు
తడిసింది నడి గుండె
పాకింది నిలువెల్ల
బ్రహ్మరంధ్రము దాక[14].

కావ్యసృష్టికి శుభతరుణం ఆసన్నమయింది. మాధురీ భగవత్ప్రసాదం కవికి లభ్యం కాగా లోకమే అశోకవాటికగా ప్రాదుర్భావం చెందుతుంది. ఆ శుభ ముహూర్తంలోనే అంతఃకరణలో

ఆనందవల్లికనే
పూయించికాయించి[15].

---

14. రాయప్రోలు సుబ్బారావుగారు, 'ఈ గీతము', ''వనమాల'', పుట, 22.
15. రాయప్రోలు సుబ్బారావుగారు, 'ఈ గీతము', ''వనమాల'', పుట, 22.

కవిత్వసృష్టి అనే పూర్ణక్రతువుని పరిసమాప్తం చేస్తుంది. ఆధునిక కవులలో కవిత్వసృష్టిని ఇంతటి రమ్యాలోకనంతో మాధురీదర్శనం చేసిన మరొకకని కనిపించడు. కవి బాహ్యజగత్తులో చైతన్యాన్ని శ్రవణేంద్రియం, నేత్ర కవాటం వలన అనుభవించి, ఆ అనుభవాల స్పందనానుగతులని శబ్దబ్రహ్మాండమైన 'సాహితీఫణితి' లో వెలువరిస్తాడు. సీతారాములవంటి ఇతరుల కష్టసుఖాలని కూడా సుకవి తన మనసులో అనుభవించటమే భావసృష్టికిమూలం అని రాయప్రోలు వారు తమ ''మాధురీదర్శనం'' లో తెలియచేశారు. మనసులో మొలకెత్తిన మెత్తని భావాలు కావ్యరూపాన ఆవిష్కరించటమే కావ్యసృష్టి అని భావించారు. పంచభూత చిత్రితమయిన ఈ ప్రపంచము కవిలో

ఆపజాలని భావోదయం వెలార్చ
ననుకరించెను సుకవి కావ్యములవాని[16]

అని ''రమ్యాలోకం'' లో వెల్లడించారు.

భావకవితా సారథి కృష్ణశాస్త్రిగారు కవితావిర్భావాన్ని గురించి ''పల్లకీ'' అనే కవితా సంకలనంలో 'భావకవి' అనేఖండికలో కొంత వివరించారు. పడమటిగాలి వీచకుండా ఉండడానికి కారణం వివిధవ్యక్తులకి ఎలాతోస్తుందో తెలియచేస్తూ ఒకరు

---

16. రాయప్రోలు సుబ్బారావుగారు, ''రమ్యాలోకం'', 6వ దళం, పద్యం. 3.

అలసి సొలసి వాలెను వరుణావరోధ
భామినీగండ కర్పూర పాళులందు[17]

అని భావిస్తే

తాను ప్రియా వియోగ
నిబిడ నిశ్వాసములురేగి
నేడు ముసర
వందరూ గుండెలేని వారగుటచేత

అని ప్రకృతిసత్యం కవిలో కలిగించే వివిధభావాలని విశదం చేశారు. మబ్బు చూస్తేచాలు 'అనార్ద్రవంపు నర్తనముచేసె పురివిచ్చి నా యెడంద' అని

ఇంక శ్రావణమేఘ మంటేనా, గుండె
నేల గగనమ్ము గాలియుయ్యాల రెక్క.

---

17. కృష్ణశాస్త్రి, 'భావకవి', 'పల్లకీ', పుట, 81.

అని ప్రకృతిసత్యం కవిలో కలిగించే భావచైతన్యం కని వివరించారు. ఆ ఆనంద తరుణంలో కవి కళ్లెత్తి పైకి చూస్తే అపుడు

నాకు కనబడుతుండేవి ఆకసమున
పోయుసే మేఘ మేఖలయో, ఎదురుగ
ఊర్వశీ కౌశికేచ్ఛాయయో కదలుచు[18].

అని తన కవితాశక్తితో కవి ప్రాపంచిక యదార్థాన్ని రమణీయ కవితగా ఏ విధంగా సంతరించుకోగలడో వివరించారు.

అభ్యుదయ కవిత్వ యుగకర్త శ్రీశ్రీ కవిత్వ అవతరణకి సంబంధించిన పూర్వరంగాన్ని కవితామయంగా 'కవితా ! ఓ కవితా ! ' అనే రచనలో మనకి సాక్షాత్కరింపజేశారు. ఈ కవి 'యువకాశల నవపేశల సుమగీతావరణం' లో నుంచి విముక్తుడై కవిత యథార్థ స్వరూపాన్ని తనచుట్టూ ఉన్న సమాజంలో దర్శించాడు. క్రమంగా యథార్థలోకపు పిలయానర్తాల్లో, ప్రచండ ఝంఝూ ప్రభంజనంలో చిక్కుకుని ఏవో ఘోషలు భాషలు, ఆచిక్షనవోలు అనుభవించిన తరువాత కవితయొక్క విశ్వరూప సాక్షాత్కారం పొందారు. అప్పుడు ఆయనకి కనిపించిన దృశ్యాలు, విన్నభాషాలు, విన్నపించగా మాటలక్కై వెదుకాడగబోతే అవి

---

18. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు, ''పల్లకి'', భావకవి, పుట, 81.

పుంఖాను పుంఖంగా
శ్మశాన నిఘంటువులు దాటి
వ్యాకరణాల సంకెళ్ళు విడిచి
ఛందస్సుల సర్ప పరిష్వంగం వదలి
వడిగా వడివడిగా
వెలువడినై, పరుగిడినై, నాయెద అడుగిడినై[19].

ఈ విధంగా అడుగిడిన భావాలు కవిలో 'కలగాపులగపు విలయావర్తపు బలవత్ ఝరవత్ పరివర్తన' కలిగించాయి. ఆ సుముహూర్తంలోనే కవి ఆనంద వశంవదుడయ్యాడు. ప్రాణం నిర్వాణం పొందింది. నాదబ్రహ్మం అతని నాడుల్ని పరిచుంబించింది. కవిత్వం గానంగా రూపుదిద్దుకుని సుఖ దుఃఖాదిక ద్వంద్వాతీతమయిన దివ్యానుభవంగా పరిణమించిందని శ్రీశ్రీ వివరించారు. కవితాసృష్టిని శ్రీశ్రీ అత్యంత ప్రతిభావంతంగా ఈ కవితలో మనకి చూపించారు.

నవకవిత్వసతినొసట ''నిత్యరసగంగాధరతిలకం!'' అని శ్రీశ్రీ చేత పొగడబడిన బాలగంగాధరతిలక్ కవిత్వసృష్టిని గురించి కొన్ని గమనార్హమైన అభిప్రాయాలని వెల్లడించారు. ''నవత ! కవిత !'' అనే ఖండికలో తిలక్ కవిత్వాన్ని అస్పష్టపు అనుభూతికి, అర్థంలేని ఇమేజరీ కలగాపులగపు వర్ణనలతో ఒకదేశం, నిర్దేశం లేని అనుకరణ కాకూడదని హెచ్చరించారు. కవి అనుభూతి

---

19. శ్రీశ్రీ, 'కవితా ! ఓ కవితా !', ''మహాప్రస్థానం'', 34.

కవిత్వానికి మూలం అని, ఆ అనుభూతి ఆకారం పాఠకుడికి అందాలి, హృత్సుకహారి అని స్పష్టంచేశారు. కవి తన పంచేంద్రియాలతో ఈ లోకాన్ని అనుభవించాలని సూచిస్తూ ఇలా అన్నారు.

ఈ కాలంలో బ్రతుకు, యీ ప్రపంచాన్ని ప్రతిఫలించు
ఇంటికున్న కిటికీలని తెరిచి అన్ని పవనాల్ని ఆహ్వానించు
నువ్వు చెప్పేదేదైనా నీదై ఉండాలి నేలోంచి రావాలి, చించుకుని రావాలి[20].

కావ్యసృష్టికి ఆధారభూతాలైన కారణాల్ని తిలక్ ''కావ్యసృష్టి'' అనే వ్యాసంలో చర్చించారు. ''కవిత్వం అవ్యక్తమైన అనుభూతిని పదాలద్వారా తెలియచేయుటం'' అని భావిస్తూ కవి తనకున్న సామగ్రి అంటే పద, భావ, దృశ్యాల ద్వారా తన అనుభవాలని ప్రకటించడానికి ప్రయత్నిస్తాడు. కవి సేకరించుకున్న దృశ్యాలు , అనుభవాలు, అతని సున్నితమైన మనోదృష్టి వలన భావాలుగా మారతాయి. వీటిలో ప్రయోజనకరమైనవి, కవి దృక్పథానికి, సంస్కారానికి అనువైనవి కవిలో నిలుస్తాయి. మిగిలినవి మరుగైపోతాయి. అవ్యక్తమైన అనుభూతిని వ్యక్తం చేయడానికి వ్యక్తమయిన పదజాలాన్ని ప్రయోగిస్తాడు. ఈ పదజాలం

---

20. తిలక్, 'నవత - కవిత', ''అమృతం కురిసిన రాత్రి'', 76.

కావ్యబింబాన్ని సృష్టిస్తుంది.[8] కవి అనుభవాన్ని పాఠకుని హృదయంలో కూడా కలిగిస్తుంది. ఈ శక్తినే తిలక్ ''ప్రతిభ'' అని వ్యవహరించారు. డా.దాశరథి తమ కవిత్వసృష్టి మార్గాన్ని వివరిస్తూ తమకంటికి ఎదురైన అనుభవాలని కవితగా రాసేస్తాను అని అనుభవాల ప్రాముఖ్యాన్ని స్పష్టంచేశారు. తనకు కనిపించిన దృశ్యాలని 'ముష్టిలోకం' తల్లిమీద/ఇష్టం వచ్చినట్టుగా తన్నే/అష్టైశ్వర్యాల వాడు', 'అడవినాగజెముడుపూలు', 'మనుష్యమేధం చేసే హోమకుండాలు' గా పేర్కొని, తమకి సామాన్యమైన చాక్షుషశక్తేకాక, అంతస్సత్యాలని గ్రహించగలిగే అతీంద్రియ పరిశీలనాశక్తి ఉన్నదని 'నావి సూక్ష్మ-కిరణాల కళ్ళేమో ! నాకేం తెలుసు లోకమా !'[9] అని తెలియచేశారు. కవిత్వాన్ని ఒక తపస్సుగా భావించి నిరంతరం ఆ తపస్సులో నిమగ్నులై కవిత్వసృష్టిని సాగిస్తున్న డా.నారాయణరెడ్డి తాము బోధిస్తున్నది 'వ్యాకర్తలు బిగించిన సూత్రాల / వ్యాళబంధాలలో నలుగుతున్న అనుభూతులను ఆవిష్కరించే అక్షరతపస్సు'[10] అని స్పష్టంచేశారు. ఉదయ భాస్కరుని అరుణిమలోని చైతన్యంలో, చైత్రమాసచైత్రధ్వజంలోని ఉల్లాసంలో బడుగుజనాన్ని సుత్తెలెత్తి పట్టించే 'తిరుగుబాటులో కవితాస్వరముద్రికలు'[11] ఉన్నాయని కవిత్వ సృష్టిరహస్యాన్ని డా.రెడ్డిగారు విశదీకరించారు.

---

8. బాలగంగాధర తిలక్, 'కావ్యసృష్టి', 'భారతి', జూన్, 1944.
9. డా.దాశరథి, 'కంటికి కనిపించిందంతా కవితగా రాసేస్తున్నాను', ''దాశరథి కవిత'', 253.
10. డా.నారాయణరెడ్డి, 'తేజస్సు నా తపస్సు', 5.
11. డా.నారాయణరెడ్డి, 'భూమిక', 36.

కవిత్వ సృష్టిని గురించి ప్రాచీనులు, ఆధునికులు, పాశ్చాత్యులు, భారతీయులు వెలువరించిన అభిప్రాయాలని పరిశీలిస్తే కవిత్వసృష్టికి అనుభవకేదారం ముఖ్యమని స్పష్టం అవుతోంది. అయితే, కవి ఈ అనుభవాలని యథాతథంగా కాక తన భావనాశక్తిలో రమణీయంగా, కవితాసత్యంగా పరివర్తింపచేసి చిరకాలం నిలవగలిగే కళాకృతిగా ప్రపంచానికి సమర్పిస్తాడు.

# కావ్యబింబం

## వ్యాపారం, ప్రాముఖ్యం, ప్రయోజనం

## వర్గీకరణ

## కావ్యబింబం - స్వరూప స్వభావ సమాలోచనం

తన అనుభవాలని, అనుభూతులని, మానసిక ఉద్వేగాలని అమూర్త స్థితి నుంచి మూర్తస్థితికి తేసుకునిరావడానికి కవి కావ్యబింబమనే మాధ్యమాన్ని ఉపయోగించుకుంటాడు. ఆ కావ్యబింబ స్వరూప, స్వభావాలని, తత్వాన్ని పరిశీలిద్దాం.

కావ్యబింబం ప్రాచీన భారతీయాలంకారికులకి పూర్తిగా కొత్తకాదు. అయినా 'ఇమేజరీ' అనే ఆంగ్లపదానికి సమానార్థకంగా ఈ పదం కావ్యశాస్త్ర చర్చలో ప్రయోగించడానికి పాశ్చాత్య సాహిత్యప్రభావమే ముఖ్యకారణం. ఈ విషయాన్ని ప్రఖ్యాత హిందీ సాహిత్యకారుడు హజారీ ప్రసాద్ ద్వివేది ఇలా తెలియ చేశారు. "పాశ్చాత్యవిమర్శనా శాస్త్రంలో కావ్యబింబాన్ని గురించి విస్తృతంగా వివేచన చేయబడింది. హిందీభాషలోను తదితర భారతీయ భాషలలోను బింబాత్మక విమర్శ పాశ్చాత్య విమర్శన శాస్త్రాల ప్రేరణ మూలంగానే జరుగుతోంది[1]..." 'ఇమేజరీ' 'ఇమేజ్' అనే పదానికి బహువచనరూపం. మానసిక శాస్త్రజ్ఞుల నుంచి సామాన్యులవరకు ఈ పదాన్ని అనేకమైన అర్థాలలో ప్రయోగించటం వలన

---

1. హజారిప్రసాద్ ద్వివేదిప్రసాద్, పాశ్చాత్య సమీక్షా శాస్త్రమే కావ్యబింబ్‌కా విశద్ వివేచనా హువా హై। హిందీ తథా అన్య భారతీయ భాషాఓం మే బింబ్‌విషయక్ చర్చా పశ్చిమీ సమీక్షా శాస్త్ర సే ప్రేరణా పాకర్ హీ హోరహీహై।
   భూమికా, 'కావ్యబింబ్ ఔర్ కామాయనీ కే బింబ్‌యోజనా'।

ఈ పదాన్ని నిర్వచించడం జటిలమయింది[2]. లాటిన్ భాషలో 'ఇమిటారే' (Imitari - to imitate) అనే మూలపదానికి సంబంధించిన ప్రాథమికార్థం ఒక ఆకృతికి అనుకృతి.

> An imitation, representation, reproduction or likeness of the external form of any object, especially of a person either in sound or surface form - that is as an icon, a statue or a painting[3].

అని Webster's Dictionary వివరించింది.

Theodore Ziolkowski ఇమేజరీ అనే పదానికి మూడర్థాలు సూచించాడు.

1. మూర్తి (icon)
2. మానసిక చిత్రం (mental picture)
3. అలంకారం (Figure of speech)[4].

---

2. డా॰నగేంద్ర, 'ఉస్కా బింబ్‌కా స్వరూప్ ఇత్‌నా అస్థిర్, జటిల్ వ్యాపక్ అమూర్త, బన్‌గయాకి బింబ్‌కా స్పష్ట బింబ్ ఇమేజ్ కే సహీ ఇమేజ్ జిజ్ఞాసు కే మన్‌మే స్పష్ట నహీ హో పాతా।, ''కావ్యబింబ్'', 2.
3. Quoted from Webster's Dictionary by Theodore Ziolkowski, "Disenchanted Images", 7.
4. 'Image, as icon, Image as a mental picture, Image as figure of speech', "Theodore Ziolkowski", "Disenchanted Images", 10.

ఇదేవిధంగా E.B.Patridge ఈ పదాన్ని మూడు విధాలుగా వివరించాడు.

1. ఇంద్రియబింబం (Sensory Image).
2. సందర్భ సంబంధమైన బింబం (Contextual Image).
3. రూపక సంబంధమైనవ్యక్తీకరణ (Metaphorical Language)[5].

I.A.Richards కూడా ఈ పదానికి మూడు విధాలైన అర్థాలని వివరించాడు.

1. A copy of sensation.
2. An idea which represents something.
3. A figure of speech, a double unit involving comparison[6].

ఈ పదానికి ఈ మూడు విధాలైన అర్థాలేకాక విస్తృతమైన అర్థం ఉందని M.H.Abrams ఈ విధంగా వివరించాడు:

---

5. E.B.Patridge, 'The Broken Compass', 19.
6. I.A.Richards, "Coleridge on Imagination", 24.

> Its applications range from the mental pictures.....to the totality of the elements which make up a poem[7].

ప్రాథమికంగా ఈ పదానికి శబ్దాలతో నిర్మితమైన చిత్రం అని అర్థం. కవి మనసులో చెలరేగే భావాలకి రూపకల్పన చేయడానికి కావ్యబింబం మాధ్యం. కవి నిజజీవితంలోని అనుభవాలు, అనుభూతులు, ఆలోచనలమూలంగా అతని హృదయంలో అనేక భావాలు ఉత్పన్నాలవుతాయి. కవి ఆ భావాలని బింబరూపంలో సహృదయులకి అందిస్తాడు. ఈ అభివ్యక్తీకరణ వ్యాపారానికి కావ్యబింబం అత్యావశ్యకం.

కావ్యబింబం పంచేంద్రియాలవలన గ్రహించబడిన సమస్తజ్ఞానాన్ని అభివ్యక్తం చేస్తుంది. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములతోపాటు చైతన్యజ్ఞానం (Kenaesthetic) ఇంద్రియ సంశ్లిష్టజ్ఞానం (synaesthetic) కూడా కవి భావాలని ప్రభావితం చేస్తాయి. కావ్యబింబం కవి భావాల (emotions) నే కాక ఆలోచనల(thoughts) కూడా వ్యక్తీకరిస్తుందని Ezra Pound ఈ విధంగా తెలియచేశాడు.

> The image is that which presents an intellectual and emotional complex at an instant of time[8].

---

7. M.H.Abrams, "A Glossary of Literary terms", 76.
8. Ezra Pound, "Literary Essays", 4.

మౌలికంగా కావ్యబింబం శబ్దచిత్రమైనా, అర్థాలంకారాలు కూడా కావ్యబింబానికి సంబంధించినవేనని స్థూలంగా అంగీకరించడం జరిగింది. కావ్యబింబాన్నిగురించి విస్తృతమైన శాస్త్రీయపరిశోధన చేసిన Caroline Spurgeon ఈ పదాన్ని గురించి ఈ విధంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది:

> I use the term 'Image' here as the only available word to cover every kind of simile as well as every kind of metaphor. I suggest that we think of it as connoting any and every imaginative picture and other experience drawn in every kind of way which may have come to the poet, not only through his mind but emotion as well and which he uses in the form of simile and metaphor in their widest sense[9].

E.B.Patridge కూడా ఈ పదాన్ని రూపకార్థంలోనే ప్రయోగించాడు. సాహిత్య ప్రతీకను గురించి ప్రత్యేక పరిశోధన చేసిన Tindall ''కావ్యబింబం ప్రతీకలాగా ఆలోచనలకి, భావాలకి శబ్దరూపకలుగ'' అని వివరించాడు[10].

---

9. Caroline Spurgeon, 'Shākespeares' Imagery', 5.
10. The image like the symbol appears to be a verbal embodiment of thought and feeling.
    W.Y.Tindall, "The Literary symbol", 105.

పై విషయాలని క్రోడీకరించి కావ్యబింబలక్షణాలని ఈ విధంగా నిర్ణయించవచ్చు:

1. కావ్యబింబం పదార్థంకాదు. పదార్థాల ప్రతికృతి. ఇది మూలసృష్టికాదు; పునస్సృష్టి.

2. కావ్యాలు బింబం మూలరూపం మూర్తంగాకాని, అమూర్తంగా కాని ఉండవచ్చు. కాని బింబరూపం మూర్తమయింది.

3. కావ్య బింబం శబ్దార్థాలద్వారా నిర్మితమైన మానసికచిత్రం. దీనికి భావం మూల ప్రేరణం.

4. అర్థవంతాలైన శబ్దాల మూలంగా కావ్యబింబం రూపాన్ని ధరిస్తుంది.

5. కవి సహజానుభూతి బింబోత్పాదన చేస్తుంది. ప్రత్యక్షంగా సహజానుభూతికి, బింబోత్పాదనకి భేదం లేకపోయినా మూలంలో వీటి రెండింటికి ఉత్పాదక, ఉత్పాద్య సంబంధం ఉంది[11].

---

11. డా.ధర్మశీల, 'కావ్యబింబ్ ఔర్ కామాయనీ కే బింబ యోజనా', 69.

కవి తానుగ్రహించిన భావాలని, ఆలోచనలని, అనుభూతుల్ని ఆధారం చేసుకుని వ్యక్తం చేసే చిత్ర సదృశమైన మాధ్యం బింబం అని పై చర్చ సారాంశం.

హిందీభాషలో కావ్యబింబ సమాలోచన విస్తృతంగా జరిగింది. కావ్యబింబ నిర్వచనం కొంతవరకు సంతృప్తికరంగా చేయబడింది. కావ్యబింబ సమాలోచనంలో డా. నగేంద్ర ప్రశంసనీయమైన కృషి చేశారు. 'కావ్యబింబ్' అనే తమ గ్రంథంలో కావ్యబింబ 'పూర్వానుభూతికి కాని ప్రత్యక్షానుభూతికికాని సంబంధించిన మానసికచిత్రం' అని వివరించారు[12]. పూర్వానుభూతులు కవి మనసులో పునరుద్బుద్ధమైనపుడుకాని, ప్రత్యక్షానుభవం వలన మనసులో ఏర్పడిన ప్రత్యక్షజ్ఞానం వలన కాని కావ్యబింబసృష్టి జరుగుతుందనికూడా డా. నగేంద్ర తెలియచేశారు. మనోవిజ్ఞాన శాస్త్రదృష్టిలో పరిశీలిస్తే, కావ్యబింబాన్ని మనసులో కలిగే అనుభూతుల పునరావృత్తి అని వివరించవచ్చని డా. పద్మా అగర్వాల్ తెలియచేశారు[13]. ''కామాయనీ'' లో కావ్యబింబాలని పరిశీలన చేసిన డా. ధర్మశాల కావ్యబింబాన్ని ''ఏదేనాపదార్థం యొక్క మానసికచిత్రం''[14] అని వివరించారు.

---

12. డా. నగేంద్ర, ''కావ్యబింబ్'', 22.
13. డా. పద్మా అగరవాల్, ''మనోవిజ్ఞానకోశ''.
14. డా. ధర్మశాల, ''కావ్యబింబ్ ఔర్ కామాయనీ కే బింబయోజనా''; పుట, 74.

ఆంధ్రసాహిత్య విమర్శలో కావ్యబింబ పరిశీలన మల్లవరపు విశ్వేశ్వర రావుగారి ''నవాంధ్ర కవిత్వము భావచిత్రణ''[15] అనే వ్యాసంలో కనిపిస్తుంది. ఈ వ్యాసంలోనే ఆంగ్లంలోని "poetic image" అనే పదానికి ''భావచిత్రణ'' ని పేరు సమానార్థకంగా స్వీకరించారు. కాని 'చిత్రణ' అనే పదం చిత్రించే విధానాన్ని సూచిస్తుంది. చిత్రితమైన చిత్రాన్ని సూచించడంలేదు. అందుచేత శ్రీ సర్వేశాయి తిరుమలరావు వంటి విమర్శకులు ''భావచిత్రం'' అనే పదాన్ని స్వీకరించారు[16]. డా.నారాయణరెడ్డిగారు ''పదచిత్రం'' అనే పదాన్ని స్వీకరిస్తూ 'ఇమేజరీ' అనగా స్థూలముగా కల్పన యని వచ్చును. ఇమేజ్ అనగా కల్పనా చిత్రమువంటిది. కాని దీనికన్న పదచిత్రమనుటలోనే సామంజస్యమున్నది''[17]. అని తెలియచేశారు. అంతేకాకుండా పదచిత్రాలని రెండు తెగలుగా విభజిస్తూ వేరు 'భావప్రకర్షవలన పదచిత్రాలని, భావచిత్రాలని ఊహాధిక్యమున్న చిత్రాలని ఊహాచిత్రాలని పేర్కొన్నారు. భావచిత్రాలు హృదయసంబంధమైనవి ఊహాచిత్రాలు బుద్ధికి సంబంధించినవి.[18] అని వివరించారు. కృష్ణశాస్త్రి, వేదుల వంటి భావకవుల భావచిత్రాలని, విశ్వనాథ, జాషువా వంటి కవుల ఊహాచిత్రాలని డా.రెడ్డి గారు కొంత విపులంగా పరిశీలించారు. శ్రీ తిరుమల రామచంద్ర ''సాహితీసుగతిని స్వగతం''లో ఈ పదాన్ని చర్చిస్తూ 'భావచిత్రణ' అనే పదాన్నే ప్రయోగించారు.

---

15. మల్లవరపు విశ్వేశ్వరరావు, 'నవాంధ్రకవిత్వము, భావచిత్రణ', ''భారతి'' ఏప్రిల్, 1930.
16. శ్రీ సర్వేశాయి తిరుమలరావు నాకు వ్రాసిన లేఖలో ఈ విషయం తెలియచేశారు.
17. డా.సి.నారాయణరెడ్డి, ''ఆధునికాంధ్ర కవిత్వము'', పుట, 461.
18. డా.సి.నారాయణరెడ్డి, ''ఆధునికాంధ్ర కవిత్వము'', పుట, 466.

భావచిత్రం అలంకార సామగ్రికి సంబంధించిందని భావిస్తూ ''భావచిత్రం కవితలో ఉంటే దానిలో భావోద్వేగం, వైషయికత, చెప్పిన అభిప్రాయాన్ని తారీలా తెలియచెసి చూపినట్లుగా వెలుగుపూతలుపూసే శక్తి, ఒక సంవిధాన క్రమం ఉంటాయి[19]'' అని ఆయన తెలియ చేశారు. 'ఇమేజరీ' అనే పదాన్ని భావన, మనః కల్పనాసృష్టి, స్వకపోల కల్పన అనే మాటలతో కూడా వ్యవహరించవచ్చని, భావచిత్రం శబ్దానికి విశిష్ట స్ఫోరకశక్తి ఉందని ఆయన అభిప్రాయ పడ్డారు. శ్రీ శేషేంద్రశర్మ ఈ పదానికి 'బింబం' అనే పదాన్ని సమానార్థకంగా స్వీకరిస్తూ కవిత్వంలో ''ఊహాశాలిత అంటే అదికూడా లోకాన్ని గురించి ఒకవిధంగా అర్థం చేసుకోవడమే అయితే బింబాలుగా (మార్చుకుని) అర్థం చేసుకోవడం'' అని వివరించారు[20]. ''ఆధునిక కవిత్వము నందలి మానవుడు - ప్రకృతి'' అన్న అంశం మీద పరిశోధన చేసిన డా.అరిపిరాల విశ్వం ''ఇమేజ్'' కి ''భావచిత్రం'' అన్న పదాన్ని వాడుతూ ''ఒక ప్రత్యేక భావప్రేరణ యొక్క ముద్రయే కవితా భావచిత్రము'' అని వివరించి ''ఆ భావచిత్రము యొక్క ప్రధాన లక్షణాలు నిశిత వ్యక్తిత్వము, కళా సంక్షిప్తత, తీవ్రతర భావోత్తేజములు[21]'' అని తెలియ చేశారు. వీరు కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ వంటి ఆధునిక కవుల భావచిత్రాలని అన్యాపదేశ భావచిత్రాలుగాను (allegorical image) ప్రతీక భావ చిత్రాలుగాను (symbolic image) వస్తుప్రతినిధ్య భావచిత్రాలుగాను (emblematic image)

---

19. శ్రీ తిరుమల రామచంద్ర, ''సాహితీ సుగతిని స్వగతం'', భారతి, జూన్, 1959.

20. శ్రీ గుంటూరు శేషేంద్రశర్మ, 'కవిసేనమేనిఫెస్టో', 26.

21. డా.అరిపిరాల విశ్వం, 'ఆధునిక కవిత్వమునందలి మానవుడు - ప్రకృతి'. అముద్రితసిద్ధాంతగ్రంథం 164, 166.

విభజించి పరిశీలించారు. డా. జి. వి. సుబ్రహ్మణ్యంగారు ''శ్రీశ్రీ కవితలో పురాణప్రతీకలు''[22] అనే వ్యాసంలో మహాకవి రచనలలోని పురాణ స్పృహ కలిగిన ప్రతీకలని పరిశీలించారు. శ్రీ సుధామ డా. నారాయణరెడ్డిగారి ''మంటలు - మానవుడు'' అనే కవిత్వంలో భావచిత్రాలని విశ్లేషించి చూపించి వేటిని ''శబ్దచిత్రాలు, మనశ్చిత్రాలు, మనః కల్పనలు, మనస్సృష్టి, మాటలతో బొమ్మ కట్టడం'' అని వ్యవహరించారు[23]. కాని ఈ రంగంలో సమగ్రమైన పరిశీలన ఇంకా జరగలేదని చెప్పకతప్పదు.

---

22. డా. జి. వి. సుబ్రహ్మణ్యం, 'శ్రీశ్రీ కవితలో పురాణప్రతీకలు,' 'విమర్శిని' 1.
23. శ్రీ సుధామ, 'ఇమేజరీ', ''చైతన్య శిఖరం'', 48.

## కావ్యబింబం - ఇతర కవితాసామాగ్రి - తులనాత్మకపరిశీలన

### భారతీయ సంప్రదాయం

కావ్యశరీరం, కావ్యాత్మ, కావ్యహేతువులు గురించి భారతీయాలంకారికులు సూక్ష్మంగా పరిశీలనచేశారు. కావ్యహేతువుల నిర్ణయంలో ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసాల ప్రాముఖ్యాన్ని చెప్పి, ప్రతిభ సర్వోత్కృష్టంగా భామహుడు, రాజశేఖరుడు, యాయావరీయుడు, ఆనందవర్ధనుడు మొదలైన ఆలంకారికులు భావించారని, ఈ 'ప్రతిభ' శబ్దానికి పాశ్చాత్యుల 'imagination' (competence) సమానార్థకం అని ఇంతకుముందు వివరించటం జరిగింది. అపూర్వమైన ఈ ప్రతిభకి ( భావనాశక్తికి ) మూర్తరూపాన్ని కల్పించి వ్యక్తంచేయడం కావ్యబింబ ప్రయోజనం. భావ వ్యక్తీకరణలో ఆ భావప్రేరకవిషయం యథాతథంగాకాని, సాదృశ్యప్రమాది అలంకారాలుగా కాని, వ్యంగ్యంగాకాని కవి వ్యక్తం చేస్తాడు.

భారతీయాలంకారికులు బింబం అనే పదాన్ని నవీనమైన అర్థంలో ప్రయోగించకపోయినా ఈ పదం వారికి పూర్తిగా క్రొత్తదికాదు. దృష్టాంతాలంకారం, నిదర్శనాలంకారం వివరించే సందర్భంలో 'బింబ' 'ప్రతిబింబ' శబ్దాలు ప్రయోగించారు.

దృష్టాంతస్తు సధర్మస్యవస్తునః ప్రతిబింబనమ్[1].

ఉపమేయ, ఉపమాన సాధారణధర్మాల బింబ ప్రతిబింబ భావం దృష్టాంతాలంకారం.

యత్రబింబాను బింబత్వమ్ బోధయేత్ సానిదర్శనా[2].

ఉపమేయ, ఉపమానాల్లో ఉండే పరస్పర సంబంధం బింబ ప్రతిబింబ భావాలని బోధపరచడం నిదర్శనాలంకారం. బింబ ప్రతిబింబ పదాలు భావసామ్యం, ప్రభావ సామ్యం అనే అర్థాల్లో ప్రయోగించబడ్డాయి. మూర్త, అమూర్త భావాలని వ్యక్తం చేయడానికి కవి అప్రస్తుతాంశం బింబరూపంలో ప్రయోగం చేస్తాడు. కాని ప్రాచీన భారతీయాలంకారికులు ప్రయోగించిన బింబపదానికి ఆధునికులు ప్రయోగించిన బింబపదానికి అర్థభేదం ఉంది అని డా.నగేంద్ర తెలియచేశాడు.[3] భారతీయాలంకారికుల దృష్టిలో బింబప్రతిబింబాల సంబంధం ఉపమాన ఉపమేయ భావం. వారికి బింబం మూలభావాన్ని సూచిస్తుంది. ప్రతిబింబం ఆ భావాన్ని మూర్తరూపం చేసేవిధానం. ఆధునికుల దృష్టిలో బింబం భావవ్యక్తీకరణ విధానం. అందువలన ఆధునికుల 'బింబం' ప్రాచీనుల 'ప్రతిబింబ' పదానికి సమానార్థకం. ఉపమాలంకార భేదాలలో ఒకటయిన బింబ ప్రతిబింబోపమ అలంకారంలో కూడా ఈ పద ప్రయోగం కనిపిస్తుంది. ఇక్కడ కూడా వీటి అర్థం ఉపమాన ఉపమేయ

---

1. విశ్వనాథుడు, 'సాహిత్యదర్పణమ్', 20/51.
2. విశ్వనాథుడు, 'సాహిత్యదర్పణమ్', 20/52.
3. డా.నగేంద్ర, 'కావ్యబింబ్', పుట, 40.

సంబంధమే. దృష్టాంతాలంకారంలో ''బింబ'', ''ప్రతిబింబ'' భావం వాక్యద్వయంలో ఉండగా బింబప్రతిబింబోపమలో ఒక్కవాక్యమే ఉండటం వీటి రెండింటి భేదం.

సాదృశ్య సారూప్యమూలకాలైన ఉపమ, రూపకాలంకారాలని కావ్యబింబాలుగా పరిగణించవచ్చు. కావ్యబింబం లాగా ఈ అలంకారాలు కూడా అప్రస్తుతవిధానం మీద ఆధారపడ్డాయి. ఇందువలన అప్రస్తుత విధానం కూడా ప్రాథమికంగా బింబాత్మకంఅని అంగీకరించవచ్చు. కాని భారతీయాలంకారికులు పేర్కొనిన అప్రస్తుతప్రశంసాలంకారం సంపూర్ణంగా కావ్యబింబం కాజాలదు. ఈ అలంకారంలో అప్రస్తుతం మాత్ర ఉంటుంది. బింబవిధానంలో ప్రస్తుతం, అప్రస్తుతం కూడా ఉండవచ్చు. అందుచేత బింబవిధానం అలంకారాలతో ఏకీ ఉన్నా వాటికంటె ఎక్కువ వ్యాప్తి కలిగింది.

ప్రస్తుతాంశాలద్వారా అప్రస్తుతాంశాలని సూచించే ప్రక్రియకాబట్టి కావ్యబింబానికి భారతీయాలంకారికులు కూలంకషంగా చర్చించిన ధ్వన్యాత్మక శబ్దశక్తికి అత్యధికసామ్యం, సంబంధం కనిపిస్తాయి. కావ్యబింబం శబ్దమూలకం. శబ్దవ్యాపారం.

'తిశ్రేనవృత్తయః పదానాం భవంతి శక్తిర్లక్షణా వ్యంజనాచేతి'

అని కేశవమిశ్రుని ''అలంకారశేఖరము'' తెలియచేస్తుంది. శబ్దమే సంకేతమని మనపాచీనులు అభిప్రాయపడ్డారు. ఈ సంకేతాన్ని గ్రహించేశక్తి అభిధ అని నాగేశభట్టు[4] తెలియచేశాడు. కావ్యబింబం కవితావస్తువుని యథాతథంగా ప్రదర్శించే సందర్భంలో అభిధాతులలం. ఈ అభిధావ్యాపారం వలన శబ్దాలయొక్క అర్థం వాచ్యం అవుతుంది. మమ్మటుడు 'కావ్యప్రకాశ' లో వాచకాన్ని

'సాక్షాత్ సంకేతితం యోఽర్థమభిధత్తే స వాచకః। [5]

అని నిర్వచించాడు. ఏవ్యాపారం సాక్షాత్తుగా సంకేతితమైన అర్థాన్ని తెలియ చేస్తుందో అది అభిధ. మమ్మటుడు లక్షణని

ముఖ్యార్థ బాధే తద్యోగే రూఢితోఽథ ప్రయోజనాత్
అన్యోఽర్థో లక్ష్యతే యత్సాలక్షణాఽరోపితాక్రియా[6]

అని నిర్వచించాడు. ముఖ్యార్థానికి అనుపపత్తి, అర్థాంతరం సూచింపబడటం అనేవి రూపకాద్యలంకారాలల్లోకూడా ముఖ్యవ్యాపారం. అందుచేత లక్షణకి,

---

4. నాగేశభట్టు, 'సంకేతగ్రాహ్యం శక్యాలంభ్య పదార్థాంతర మభిధా'. 'కావ్యప్రకాశ ప్రదీపోద్యోతము', 'సాహిత్య దర్శనము' లో ఉదాహృతము, 311.
5. మమ్మటుడు, కావ్యప్రకాశము, ద్వితీయోల్లాసము, 7.
6. మమ్మటుడు, కావ్యప్రకాశము, ద్వితీయోల్లాసము, 9.

కావ్యబింబానికి అర్థాంతరప్రాప్తి వలన పోలిక కనిపిస్తుంది. వ్యంజనని విద్యానాథుడు ప్రతాపరుద్రీయములో

> అన్వితేషు పదార్థేషు వాక్యాంశేప స్వారార్థమర్థాంతర
> విషయ శబ్దవ్యాపారాం వ్యంజనావృత్తిః[7]

అని వివరించాడు. వాక్యార్థానికి శోభాహేతువైన అర్థాంతరాన్ని స్ఫురింపచేసే శబ్దవ్యాపారం వ్యంజన. వ్యంగ్యార్థం ప్రధానమై, వాచ్యార్థం అప్రధానమైతే ధ్వని అని వ్యవహరిస్తూ, ఆ వ్యంగ్యాన్ని ధ్వనింపచేసే కావ్యం ధ్వని కావ్యం అని ఆనందవర్ధనుడు

> యత్రార్థః శబ్దో వా, తమర్థముపసర్జనీకృతస్వార్థౌ,
> వ్యంక్తః - కావ్యవిశేషః సధ్వని రితిసూరిభిః కథితః[8]

తెలియచేశాడు. ఆనందవర్ధనుడు చేసిన ఈ నిర్వచనానికి ప్రతీకకి Tindall చేసిన ఈ క్రింది నిర్వచనానికి పోలికలు కనిపిస్తాయి.

---

7. విద్యానాథుడు, 'ప్రతాపరుద్రీయము', 'సాహిత్యదర్శనము'లో ఉదాహృతము, 355.
8. ఆనందవర్ధనుడు, 'ధ్వన్యాలోకము', 1-13.

> A symbol is that which stands for or
> suggests something else by reason
> of relationship, association conventional
> or accidental but not intentional resemblance[9].

ఆనందవర్ధనుడు తన ధ్వని సిద్ధాంతానికి మూలం వైయాకరణులు ప్రతిపాదించిన 'స్ఫోట' అని అంగీకరించాడు. వర్ణములకంటె భిన్నమై ఆ వర్ణములచేతనే అభివ్యక్తమై అర్థబోధకము, నిత్యము అయిన శబ్దం 'స్ఫోట' అని

> వర్ణాతిరిక్తః వర్ణాభివ్యంగ్యః అర్థప్రత్యాయకో
> నిత్యశబ్దః స్ఫోటః [10]

అని వివరించే సందర్భంలో కావ్యబింబంలో అర్థాంతర స్ఫురణాశక్తి, స్ఫోటకి, వ్యంజనామూలకమైన ధ్వనికి దగ్గరగా ఉన్నట్లు కనిపిస్తుంది. ధ్వని శబ్దగత, వాక్యగత రూపాల్లో ఉండవచ్చునని ఆలంకారికులు అంగీకరించారు. ఇందువలన ధ్వని ప్రతీకకి (symbol) ప్రతీకాత్మకప్రబంధం (allegory)కి దగ్గరగా ఉందని భావించవచ్చు.

---

9. W.Y.Tindall, 'The Literary symbol', 5.
10. 'సాహిత్య దర్శనము' లో ఉదాహృతము, 381.

కుంతకుడు కావ్యజీవితమని నిర్ణయించిన వక్రోక్తికి కావ్యబింబ వ్యాపారానికి కొంత సామ్యం గోచరిస్తోంది. ''వైదగ్ధ్యభంగీ భణితి''[11] యే వక్రోక్తి అని కుంతకుడు నిర్వచించాడు. సర్వాలంకారాలకి బీజం వక్రోక్తి అని భామహుడు తెలియచేయగా, వామనుడు, ''సాదృశ్యలక్షణా వక్రోక్తిః''[12] అని వక్రోక్తి సాదృశ్యలక్షణ మూలకమని తెలియచేశారు. ఇందువలన వక్రోక్తి కావ్యబింబ లక్షణమైన సాదృశ్యాన్ని కలిగి ఉండి కావ్యబింబానికి కొంతపోలి ఉం

ఈ చర్చ సారాంశం భారతీయ కావ్యశాస్త్రాలకి కావ్యబింబం పూర్తిగా క్రొత్తదికాదు. బింబవివేచన ఇందులో అనేక రూపాల్లో జరిగింది. కాని ఈ వివేచన ప్రకరణాంతంగా, సంక్షిప్తంగా జరిగింది. అలంకార లక్షణ నిర్వచనాల్లో బింబ, ప్రతిబింబ శబ్దప్రయోగాలతో పాటు, సాదృశ్యమూలకాలంకారాలలోను, శబ్దం యొక్క మూడు విధాలైన వ్యాపారాల్లోను, కుంతకుని వక్రోక్తికి సంబంధించిన ప్రక్రియలలోను బింబ వివేచన స్ఫురణ కలుగుతుంది.

---

11; 12. సాహిత్య దర్శనము' లో ఉదాహృతములు, 84.

కాని ఆధునిక పాశ్చాత్యాలంకారికులు ప్రయోగించిన 'కావ్యబింబ' శబ్దం వీటినన్నింటిని అంతర్లీనం చేసుకొనే తగిన సమాహారస్వరూపం. ఈ విషయాన్ని డా. ధర్మశీల స్పష్టంచేస్తూ, ''కావ్యబింబం రసంయొక్క వ్యక్తీకరణ, అలంకారానికి చెందిన శోభ, వ్యంజన యొక్క వక్రత, సంగీతం యొక్క ధ్వని సాధన, శిల్పంయొక్క సౌష్ఠవం, చిత్రలేఖనం యొక్క భావబోధనశక్తి, శైలి యొక్క వైయక్తికశక్తి కలబోసిన సమగ్ర సమాహారం.''[13] అని వివరించారు.

---

13. డా. ధర్మశీల, 'కామాయనీ ఔర్ కావ్యబింబ కాయోజనా', ౯౨.

## పాశ్చాత్య సంప్రదాయం

పాశ్చాత్యాలంకారికులు కావ్యానికి శోభాహేతువులైన కవితాసామగ్రికి Image ( కావ్యబింబం ) symbol ( ప్రతీక) simile ( ఉపమ ) Metaphor ( రూపకం) Archetype (ఆదిబింబం ) Allegory (ప్రతీకాత్మక ప్రబంధం ) అనే పదాలని తరచుగా ప్రయోగించారు. ఈ పదాలకి సమానార్థకాలైన ఉపమ, రూపకాది పదాలు కొన్ని ఉన్నప్పటికి ఆర్కిటైప్ వంటి పదాలు మన సంప్రదాయంలో కనిపించవు. ఆంధ్రభాషలో 'ఇమేజ్' అనే పదానికి 'మూర్తి', 'భావచిత్రం', 'పదచిత్రం' వంటి పదాలు అసమగ్రాలని భావించి, హిందీ సాహిత్య విమర్శలో ప్రాచుర్యం పొందిన 'కావ్యబింబ' శబ్దాన్ని స్వీకరించాను. హిందీ సాహిత్య విమర్శకులు కావ్యబింబాన్ని గురించి ప్రశంస నీయమైన కృషి చేశారు. డా.నగేంద్ర ('కావ్యబింబ్' ) డా.సుధా సక్సేన ( 'జాయసీ కా బింబ యోజనా') రామచంద్ర శుక్ల ('చింతామణి' ) డా.కుమార విమల్ ('సౌందర్యశాస్త్ర కా తత్వ') డా.ధర్మశీల ( 'కావ్యబింబ్ ఔర్ కామాయనీ కా బింబ యోజనా') వంటివారు ఆధునిక విమర్శనా విధానాలని తమ రచనల్లో ప్రయోగించారు. వారు తమ రచనల్లో పాశ్చాత్య విమర్శకులు ప్రయోగించిన పదాలకి హిందీలో తగిన పారిభాషిక పదాలని ఏర్పరచు కున్నారు. ఆ పదాలు చాలాభాగం సంస్కృత భాషా జన్యాలు కావడం వలన తెలుగులో విమర్శకి ఈ పదజాలం కొంతవరకు ఉపకరిస్తుంది. Archetype అనే పదానికి 'ఆదిబింబం' symbol కి 'ప్రతీక' Emblem కి 'చిహ్నాత్మక ప్రతీక', Allegory కి 'ప్రతీకాత్మక ప్రబంధం' అనే పదాలని సమానార్థకాలుగా స్వీకరించవచ్చు. ఈ పారిభాషిక పదాలని నిర్ణయించుకున్న తరువాత కావ్యబింబానికి తదితర కవితా సామగ్రికి ఉన్న సామ్యాలని, తారతమ్యాలని పరిశీలిద్దాం.

కావ్యబింబం - రూపక, ఉపమాలంకారాలు

కావ్యబింబానికి సాదృశ్య మూలక అలంకారాలైన ఉపమ, రూపకాలంకారాలకి అత్యంత సామ్యం కనిపిస్తుంది. భారతీయాలంకారికులు ఉపమ, రూపకాలంకారాల లక్షణాలని సూక్ష్మంగా చర్చించారు. ఉపమాలంకార లక్షణాలని

ఉపమా యత్ర సాదృశ్యలక్ష్మీ రుల్లసతి ద్వయో:[1]

అని, రూపకలక్షణాలని

విషయ్యభేద తాద్రూప్యరంజనం విషయస్యయద్ రూపకం[2]

అని వివరించారు.

ఉపమా రూపక భేదాలని గురించి పాశ్చాత్యులు కూడా విస్తృతంగా వివేచన చేశారు.

---

1. జయదేవుడు, 'చంద్రాలోకం', 'చంద్రాలోక సమున్మేషము', 3.
2. జయదేవుడు, 'చంద్రాలోకం', 'చంద్రాలోక సమున్మేషము', 32.

Middleton Murry

> Metaphor is a compressed simile[3].

అని వర్ణించాడు. ఉపమ, రూపకాలంకారాలని భేదం అతిస్వల్పం అని తెలియ చేస్తూ, Nelson Goodman ఇలా తెలియచేశాడు.

> The difference between simile and metaphor is negligible whether the locution be 'like' or 'is', the figure likens picture to person by picking out a certain common feature[4].

అరిస్టాటిల్

> Metaphor leads to a perception of resemblance[5]

అని వివరించాడు. Ted Cohen రూపకాలంకార ప్రయోజనాన్ని చర్చిస్తూ,

---

3. Quoted by Donald Davidson, 'What Metaphors Mean', "Critical Inquiry", 38.
4. Nelson Goodman, "Languages of Art", 77-78.
5. Donald Davidson, Ibid, 39.

Metaphors are crystalised works of art[6].

అని వివరించాడు. ఈ అలంకారం కవి హృదయాన్ని అవగాహన చేసుకోడానికి పాఠకునికి సహాయం చేస్తుందని, కవికి పాఠకునికి మధ్య భావసేతువుని నిర్మిస్తుందని తెలియచేశాడు. వర్డ్స్‌వర్త్ ఉపమ రూపకాలంకారాలు సామ్య మూలకాలని అవి

Observation of affinities, in objects where no brotherhood exists to passive minbs [7].

అని తెలియచేశాడు.

ఉపమా రూపకాలని రెండింటినీ సమాన లక్షణలక్షితాలుగా నిర్ణయించి పాశ్చాత్యులు రూపకపదాన్ని ఏకపదంగా ప్రయోగించవచ్చని అభిప్రాయపడ్డారు. అరిస్టాటిల్ రూపకాలంకారానికి ప్రముఖస్థానాన్ని ఇచ్చాడు.

---

6. Ted Cohen, 'Metaphors and the cultivation of Intimacies', "Critical Inquiry", 7.
7. Quoted by C.Day.Lewis, 'The Poetic Image', 35.

> The greatest thing by far is to have command of metaphor. This alone cannot be imparted to another. Making good metaphor depends on perceiving the likeness in things[8].

అని అరిస్టాటిల్ వివరించాడు.

రూపకానికి కావ్యబింబానికి సాదృశ్య, సారూప్య సామ్యం సమాన గుణం. వీటి మధ్య తారతమ్యంకూడా ఉంది.'Every image is to some degree metaphorical' అని Day Lewis తెలియచేశాడు. కొందరు ఆలంకారికులు కావ్యబింబాన్ని రూపకపదానికి పర్యాయపదంగా స్వీకరించారు. రూపకంలోను, కావ్యబింబంలోను అప్రస్తుత, ప్రస్తుతాంశాల మధ్య సామ్యదర్శనం గోచరిస్తుంది. కాని కావ్యబింబం, రూపకం పర్యాయపదాలుగా అంగీకరించడానికి వీలుపడదు. అవి సజాతీయాలు మాత్రమే. రూపకం ఒకటే కావ్యబింబ ప్రదర్శనకి తోడ్పడేది కాదు. కావ్యబింబం ప్రతీక మొదలైన వాటిచేతకూడా ప్రదర్శితమౌతుంది. కావ్యబింబం వాస్తవానికి దర్పణం లాటిదికూడా అవుతుంది. అందువలన స్వభావోక్తికూడా కావ్యబింబం కాగలదు.

---

8. Aristotle, 'Poetics', Translated by Gerald F.Else, 60-61.

## కావ్యబింబం - ప్రతీక

ఇంగ్లీషులో 'symbol' అనే పదానికి 'ప్రతీక' అనే పదాన్ని సమానార్థకంగా స్వీకరిస్తున్నారు. 'Symbol' అనే పదం గ్రీకు భాషలో "symblon" అనే పదం నుంచి వచ్చింది. ఈ పదానికి "chance encounter, throwing together" అని అర్థం. 'శబ్దసాగర్' అనే గ్రంథంలో ప్రతీక శబ్దాన్ని ''ప్రతీయతే అనేన ఇతి ప్రతీక అర్థః'' అని వివరించారు. దేని వలన అయితే ప్రతీతి జరుగునో లేదా ఏదైనా వస్తువుయొక్క కాని భావనయొక్కకాని అభివ్యక్తీకరణ జరుగునో దానిని ప్రతీక అంటారు.

> A symbol is a visible or audible sign or emblem of some throught, emotion or experience, interpreting what can be really grasped only by the mind and imagination, by something which enters the field of observation[9].

9. 'Encyclopaedia of Religion and Ethics', Vol.XII,139.

ప్రతీక ఒక జ్ఞాపిక. ఇది భిన్నపదార్థాలమధ్య ఉన్న సామాన్యగుణాల్ని సంకేతిస్తుంది. ఈ దృష్టిలో ప్రతీకకి, ఉపమ, రూపకాలంకారాలకి కొంత పోలిక ఉంది. ఇవన్నీ సాదృశ్య సారూప్యమూలకాలు. ఈ విషయాన్ని చర్చిస్తూ డా.నగేంద్ర ''మూల రూపంలో ప్రతీక ఉపమా సంబంధి'' అని అంగీకరించారు. ప్రతీక రూఢమైన ఉపమకి మరో పేరు, అని ఉపమా స్వతంత్రతకోల్పోయి ఏదేనా పదార్థ విశేషానికి రూఢమయినపుడు ప్రతీకగా మారుతుందని, రూఢమైన ఉపమ చివరికి స్థిర లేక అచలబింబంగా మారుతుందని డా.నగేంద్ర తెలియచేశారు.

> ప్రతీక ఇస్ ప్రకారకా రూఢ అపనా కాహి దూసరా
> నామ్ హై। జబ్ ఉపమాన స్వతంత్ర న రహకర్
> పదార్థ విశేష కేలియే రూఢ హో జాతా హై తో
> వో ప్రతీక బన్ జాతా హై। ఇస్ ప్రకార్ ప్రత్యేక
> ప్రతీక అపనే మూలరూప్ మే ఉపమాన్ హోతా హై।
> ధీరే ధీరే ఉస్‌కా బింబ్‌రూప యా చిత్రరూప సంచరణ
> శీల న రహకర్ స్థిర్ యా అచల్ హో జాతా హై। అతః
> ప్రతీక ఏక్ ప్రకార్ కా అచల బింబ్ హై।[10].

ఈ ప్రక్రియకి సంఘం ఏర్పరచే కొన్ని సంప్రదాయాలు ముఖ్య కారణం. అనుభూతి జనితమైన సాదృశ్యదర్శనం వ్యక్తిలో ఉపమ, రూపకాలని సృష్టించ గా

---

10. డా.నగేంద్ర, 'కావ్యబింబ్', 8.

క్రమశః అవి సంఘ నిష్ఠాలై స్థిరమైన ప్రయోగాలుగా పరివర్తనం చెంది ప్రతీకలుగా పరిణమిస్తాయి. ఈ విషయాన్నే Morris Weitz

> Most symbols derive their rich suggestiveness from their gradual accumulation of association in the speech and thought of mankind at large[11].

అని వివరించాడు.

ఏదేనా దృశ్యానికికాని, అమూర్తభావానికికాని ప్రాతినిధ్యం వహించడంచేత ప్రతీకని భారతీయ కావ్యశాస్త్రంలోని ఉపలక్షణ లేదా సాధ్యవసాన గౌణ ప్రయోజనంవలె లక్షణ అని కూడా వ్యవహరించవచ్చు. రెండు భిన్న పదార్థాలమధ్య సంబంధానుపపత్తి ఉండటం లక్షణకి ప్రతీకకి సామ్యాన్ని సూచిస్తోందని[12] డా.ధర్మశీల తెలియచేశారు. ఈ సంబంధానుప పత్తినే జార్జివాలే " a focus of relationship" అని అభివర్ణించారని Archibald Macleish[13] తెలియచేశారు. సామాన్య దృష్టికి భిన్నంగా

---

11. Morris Weitz, 'Problems in Aesthetics', 452.
12. డా.ధర్మశీల, Ibid, 32.
13. Archibald Macleish, "Poetry and Experience", 78.

కనిపించే వస్తువులమధ్య సంబంధాన్ని దర్శించడం కవి ప్రతిభ. ఈ సంబంధాన్ని వ్యక్తం చేయడానికి కవి కావ్యబింబంవంటి సామగ్రిని ఉపయోగించుకుంటాడు. ప్రతీకలనికూడా కవి ఈ ప్రయోజనార్థం ప్రయోగించుకుంటాడు. కాని కావ్య బింబానికి ప్రతీకకి కొన్ని ముఖ్య భేదాలున్నాయి. T.E.Hume కావ్యబింబం ప్రతీక వంటిదేనని భావించి ప్రతీక అనిశ్చితపదార్థాన్ని సూచిస్తుందని, కావ్యబింబం నిశ్చితపదార్థాన్ని సూచిస్తుందని తెలియచేశారు [14]. కాని ఇది ఆమోదయోగ్యంగా కనిపించడంలేదు. కవి వ్యక్తిత్వానికి సంబంధించిన కావ్యబింబం అనిశ్చితంగాను, విస్తృతమైన అర్థసూచకంగాను ఉండటం సహజం. సంప్రదాయాలచేత స్థిరీకరింపబడిన ప్రతీకకి నిశ్చితమైన అర్థం ఉండటం సహజం. ఈ విషయాన్నే Ezra Pound ఇలా స్పష్టీకరించాడు.

> Symbol has a fixed traditional meaning.
> The image, on the other hand, has variable significance[15].

---

14. T.E.Hulme, An image is not unlike a symbol..... but where as our symbol.....suggests something, indefinite, his image suggests something as definite as itself.
    Quoted by Tindall, 348.
15. Quoted by Tindall, 'Ibid', 35.

కావ్యబింబానికి, ప్రతీకకి ఉన్న భేదాలని చర్చిస్తూ డా.ధర్మశేల ఈ విధంగా వేర్కొన్నారు.

1. బింబ నిర్మాణంలో వ్యక్తిముఖ్యం. ప్రతీక జాతీయ చేతన వలన ఉద్భవిస్తుంది.

2. బింబంలో వ్యక్తికి సంబంధించిన రాగాత్మక స్పర్శ ఉంటుంది. ప్రతీక ప్రత్యయాత్మకమయింది.

3. బింబం ముఖ్యంగా కావ్యాల్లో కనిపిస్తుంది. ప్రతీకలు ప్రముఖంగా ధర్మశాస్త్రాల్లో, దర్శనాల్లో కనిపిస్తాయి.

ఈ భేదాల్లో ప్రతీక సంఘ నిష్టమయింది, బింబం వ్యక్తినిష్టమ యింది అనే భేదం ముఖ్యంగా కనిపిస్తోంది. కావ్యబింబం కవి వ్యక్తిత్వ వ్యక్తీకరణకి దోహదకారికాగా, ప్రతీక సామాజికచేతన ఆవిష్కరణకి దోహదకారి అవుతుంది. అందుచేత కవిలో వ్యక్తిత్వ దర్శనానికి కావ్యబింబం ఎక్కువగా ఉపకరిస్తుంది అనటంలో సందేహంలేదు.

కావ్యబింబం - ఆదర్శబింబం - ప్రతీకాత్మకప్రబంధం

ఇరవయ్యోశతాబ్దంలో పాశ్చాత్య సాహిత్య విమర్శలో Archetype అనేపదం అధికప్రాచుర్యంలోకి వచ్చింది. ఈ పదానికి డా.నగేంద్ర 'ఆదర్శబింబం' అనే పదాన్ని సమానార్థకంగా స్వీకరించారు. తెలుగు సాహిత్యవిమర్శలోకూడా ఈ పదాన్నే స్వీకరించడం సమంజసం. ఈ పదాన్ని సూక్ష్మంగా పరిశీలించిన వారిలో Carl Jung అనే జర్మన్ మనోవైజ్ఞానిక శాస్త్రజ్ఞుడు ముఖ్యుడు. ఆదర్శబింబాలు ఆదిమానవుల కాలంలోనే వారి సామూహిక అచేతన (collective unconscious) లో ఏర్పడే భావాలకి సంకేతాలుగా మనం అర్థంచేసుకోవచ్చు. Archetype అనేపదం మొదట "Philo Judaeus" అని మానవునిలోని భగవంతుని ప్రతిబింబం (Imago Dei) గా కనిపించింది అని Jung తెలియచేశాడు[16]. ఈ పదాన్ని Jung

> archaic.....or premordial types, that is, universal images that have existed since the remotest time[17].

అని వివరించాడు.

Northrope Frye అనే ఆధునిక విమర్శకుడు ఆర్కిటైప్‌ని recurring

---

16. Carl Jung, "Archetypes of the collective unconscious",.

Included in "Twentieth Century Criticism", 206.

17. Carl Jung, Ibid.

image" అని వర్ణిస్తూ

> I mean by archetype a symbol which connects one poem with another and thereby helps to unify and integrate our literary experience[18].

అని వివరించాడు. ఫ్రై ఉద్దేశంలో ఆదికాలంనుంచి ఆధునికకాలం వరకు కొన్ని సంకేతాలు మానవ సంప్రదాయంలోను, సాహిత్యంలోను పునరావృత్తం అవుతూ ఉంటాయి. ఇందువల్లనే సాహిత్యానుభూతి నిరంతర జీవనప్రవాహం (continuum of life) లో ఒకభాగం[19] అని ఈతడు అభిప్రాయ పడ్డాడు. ఆదిమానవులు దర్శించిన సూర్యదేవుడు (Sun god) సముద్రం, అనుభవించిన ఋతుచక్రం మానవజీవితంలోని అనేక పరిణామాలకి ఆదిసంకేతాలుగా ప్రారంభమై, సాహిత్యంలో ఈనాడు కూడా మనకి దర్శనం ఇస్తున్నాయి. సాహిత్యంలో సజీవసంప్రదాయానికి పునరావృత్తమయ్యే ఆదర్శబింబం చక్కని ఉదాహరణ.

---

18. Northrope Frye, 'Anatomy of Criticism', 99.
19. Northrope Frye, Ibid, 99.

కావ్యబింబం, ప్రతీక, ఆదర్శబింబం వంటి మాధ్యమాలలో భావ వ్యక్తీకరణకి ఒకబింబం ప్రయోగించటం సామాన్యగుణం. ఈ బింబ ప్రయోగంలో మూడింటి మధ్య భేదం ఉంది. ఆదర్శబింబం ఆదిమకాలంలో ఏర్పడిన బింబం. అందువలన అది ఎన్నో పర్యాయాలు పునరావృత్తమై సాహిత్యంలో సంప్రదాయాన్ని సూచించినప్పటికి అధికప్రయోగంవలన దాని సుషమ, నవీనత కోల్పోతుంది. ప్రతీక ఆరంభదశలో వైయక్తికమైనా ప్రయోగంలో సంఘనిష్ఠం కావడం వలన వైయక్తిక అనుభూతుల ఆవిష్కరణకి ఎక్కువగా ఉపకరించడదు. కాని కావ్యబింబం కవి వ్యక్తిగత తత్వాన్ని, అనుభూతుల్ని వ్యక్తీకరించగలిగే మాధ్యమం కావడం వలన వై రెండింటి కంటె సమర్థవంతమయిందని భావించవచ్చు.

ఇంగ్లీషుభాషలో Allegory అని పిలువబడే సాహిత్యప్రక్రియకి 'ప్రతీకాత్మక ప్రబంధం' సమానార్థకంగా స్వీకరించవచ్చు. ఒక కావ్యంకాని, ప్రబంధంకాని కవి నిర్దేశించిన తాత్విక దృక్పథాన్ని కేంద్రంగా నిలుపుకుని, ఆ తత్వం పాఠకులకి సులభంగా, స్పష్టంగా అవగాహనకావడానికి ''ఎలిగరి'' ఉపకరిస్తుంది. కవి మనసులోని ఆశయాలని బింబాల ద్వారా వ్యక్తీకరించే సందర్భంలో వాటి పరస్పర సంబంధాన్ని కవి స్పష్టీకరించడం 'ఎలిగరి' అని షెప్లి తెలియచేశాడు.

> We have actually allegory when the poet explicitly indicates the relationship between images and examples when the poet says "by this I also (allos) mean that"[20].

ఇంగ్లీషు భాషలో 'The Faerie Quene' ఇటాలియన్ భాషలో 'Divine Comedy' సంస్కృతభాషలో 'పంచతంత్రం' కథలు ప్రతీకాత్మక ప్రబంధాలుగా పేర్కొనవచ్చు. ఇటువంటి కావ్యాలకి కేంద్రస్థానంలో కావ్యబింబం ఉండవచ్చు. ఒక్కొక్కసారి కావ్యంలో విస్తృతమైన ప్రతీకాత్మకతకి కావ్యబింబాల సముచ్చయం దోహదం కావచ్చు. భావాలకి వాటి సంకేతాలకి మధ్య సంబంధం రెండు విధాలుగా ఉండవచ్చని ఫ్రై తెలియచేస్తూ

> A concrete approach.....begins with the images of actual things and works outward to ideas and propositions and an 'abstract' approach begins with ideas and then tries to find concrete images to represent it[21].

---

20. Northrope Frye, 'Ibid', 90.
21. Northrope Frye, 'Ibid', 89.

అని ప్రతీకకి, ఎలిగరీకి ఉన్నభేదాన్ని సూచించాడు. తాను బోధించదలచిన నీతిని వ్యక్తంచేయదలచుకున్న భావాలని బింబాలరూపంలో పరివర్తనంచేయడం 'ఎలిగరీ' ముఖ్యప్రయోజనం. ఈ దృష్టితో పరిశీలిస్తే ప్రతీకాత్మక ప్రబంధానికి కావ్యబింబం కేంద్రస్థానంలో ఉంటుంది. కాని కవి భావావిష్కరణకి ప్రతీకాత్మక ప్రబంధం అనేక కావ్యబింబాల సహాయంతో విస్తృతపరిధిని ఆక్రమించి ఎక్కువగా తోడ్పడుతుంది.

## కావ్యబింబం - సృష్టి, ప్రయోజనం, ప్రాముఖ్యం

మనోవైజ్ఞానికదృష్టిలో కావ్యబింబాన్ని ప్రత్యక్షఅనుభవాలకి సంబంధించిన స్మృతి అని భావించవచ్చు. ఈ విషయాన్నే డా. పద్మాఅగర్వాల్ ''సంవేదనాత్మక ఉత్తేజన్ కే అనుపస్థితిమే సంవేదన్ అనుభూతికే పునరావృత్తి,''[1] అని వివరించారు. కవి తాను అనుభవించిన అనుభవాలని ప్రత్యక్షంగానే కాకుండా, వాటిస్మృతినికూడా తన కవిత్వంలో వ్యక్తీకరించడానికి ప్రయత్నిస్తాడు. ఆ ప్రయత్నంలో ఆతనికి కావ్యబింబం అతిసమర్థవంతమైన మాధ్యం అయినా కావ్యబింబం కేవలం మనోవైజ్ఞానిక బింబంలా అనుభవాల స్మృతికి మాత్రమే బింబంకాదు. కవి తన అనుభూతులకి గతిశీలమైన, సజీవమైన స్పందనాన్ని కలిగించి అతని సమగ్ర వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించగలుగుతుంది.

తన పంచేంద్రియాలలో పొందిన అనుభవాలు, గ్రహించిన ప్రభావాలు, తీవ్రంగా ఆవేదనచెందిన తత్వాలు గంభీరంగా ఆలోచించి గ్రహించిన సత్యాలు కవిలో భావాలని సృజిస్తాయి.[2]. వీటిని 'మూలబింబాలు' అని వ్యవహరించవచ్చు. ఇవి కవిమనసులో క్రమశః సంస్కార రూపంలో రూపుదిద్దుకుంటాయి. ఈ స్థితిలో ఇవి సంస్కారసంబంధమైన అమూర్తస్థితిలో ఉంటాయి.

---

1. డా. పద్మాఅగర్వాల్, 'మనోవిజ్ఞానకోశ్', 26.
2. Archibald Macleish, 'Imagery bears correlative of thoughts and experience', "Poetry and Experience", 120.

కవి భాగసంబంధమైన కల్పనాశక్తిమూలంగా ఈ అమూర్తభావాలు మూర్త రూపకల్పనపొంది కావ్యబింబాలుగా సృష్టింపబడతాయి. ఈ కల్పనాశక్తిని E.S.Dallas

> A thought in its automatic or unconscious operation.....a lighted ring of sense girdled by an oceans of darkness[3]

అని వివరించాడు. కవి మనసులో ఉద్బుద్ధాలైన భావాలు మొదట స్పష్టంగా ఉండవు. ఈ ప్రాథమికబింబాలు చేతనకి ప్రతిబింబాలు. ద్వితీయబింబాలు తర్కం మీద ఆధారపడి చేతన, అచేతనల సహకారంతో సృష్టించబడతాయి. ఈ బింబ సృష్టికి కవి సంస్కారం, స్మృతి, కల్పన, సంశ్లేషణ అనే సోపానాలు[4] అవసరం. భౌతికమైన అనుభవాలని ముందు ఆలోచించుకుని, వాటిసంస్కారాలని తన సృజన స్మృతిలో ఉద్బుద్ధం చేసుకుని, తన వివేకం ద్వారా అనావశ్యకాలని విసర్జించి, ఆవశ్యకాలని గ్రహించి ఉచిత సంశ్లేషణ చేసి బింబసృష్టి సాగిస్తాడు[5] అని డా. నగేంద్ర వివరించారు.

---

3. Quoted by C.Day Lewis, 'Ibid', 70.
4. Quoted by C.Day Lewis, 'Ibid', 70-71.
5. డా. నగేంద్ర, 'కావ్యబింబ్', 49.

కావ్యబింబానికి మూలభూతమైన అంతర్గుణం అనుభూతి. కావ్య బింబ బాహ్యస్వరూపాన్ని చర్చిస్తూ, కావ్యబింబానికి సరూపకత (integrity) సందర్భ సటీకత (consonance) స్పష్టత (clarity) అవసరం అని డా. బ్రజనందన్ ప్రసాద్ అఘోరి తెలియచేశారు[6]. ఉత్కృష్టకావ్యబింబానికి భావోత్తేజకశక్తి (evocativeness) భావతీవ్రత (intensity), నవీనత, తాజాతనం (novelty and freshness) పరిచితత్వం (familiarity) ఔచిత్యం (congruity) అవశ్యకాలు. ఉత్తమ కవి ఉత్కృష్టకావ్యబింబాల సృష్టి ద్వారా సమత, సంఘటన, సానుపత్తికత, భావాలకి బుద్ధికి మధ్య ఏకీభావం, పరస్పర సంయోజన సాధించగలుగుతాడు. ఈ సానుపత్తికతని దర్శించటమే కావ్యబింబ ప్రయోజనం అని సి.డె.లెవిస్ తెలియచేశాడు[7].

''భావాలని అభిధేయంనుంచి విముక్తంచేసి ప్రకాశితం చేయడం'' కావ్యబింబం ముఖ్య వ్యాపారం అని, ఈ కావ్యబింబ వ్యాపారాలు నాలుగు విధాలని తెలియ చేస్తూ డా. భగీరథమిశ్ర

---

6. డా. బ్రజనందన్ ప్రసాద్ అఘోరి, 'కావ్యాత్మకబింబ్', 29.
7. C.Day Lewis, 'In this knowledge of proportion lies the essential character of great imagery', Ibid, 47.

అ. కావ్యార్థాలని సంపూర్ణంగా స్పష్టంచేయడం - అర్థవ్యక్తి.

ఆ. భావాలని సంప్రేషితాలు, ఉత్తేజితాలుచేయడం - భావసంప్రేషణం.

ఇ. వస్తువులని, కార్యాలని ప్రత్యక్షంచేయడం - ప్రత్యక్షీకరణం.

ఈ. రూపం, సౌందర్యం మొదలైన గుణాలని హృదయంగమంచేయడం -
సౌందర్యాత్మకానుభూతి

అని వింగడించారు[8].

స్రష్ట, పాఠకుడు, విమర్శకుడు, కావ్యవ్యాపారంలో భాగస్వాములు. కావ్యబింబం ఈ ముగ్గురికి సంబంధించిన ప్రక్రియ. స్రష్ట బింబం ద్వారా తన సంపూర్ణవ్యక్తిత్వాన్ని వ్యక్తీకరిస్తాడు. తన పంచేంద్రియాలచేత గ్రహించిన ఇంద్రియ బింబాలని తన కల్పనాశక్తిద్వారా రమణీయ బింబాలుగా పరివర్తింపచేసి రస, అలంకార, ధ్వని, రీతి వంటి కావ్యనికషాలని కావ్యబింబగతం చేయగలుగలతాడు. పాఠకుడు కవికి సంబంధించిన వ్యక్తిగత రాగాత్మకతని తన సంస్కార విశేషంచేత కావ్యబింబంద్వారా గ్రహించగలుగుతాడు. కావ్యానందం పాఠకునికి సంబంధించింది. ఆ ఆనందమే కావ్యసార్థకత. దీనికి కావ్యబింబం ఎక్కువగా ఉపకరిస్తుంది. డా.ధర్మశీల ఈ విషయాన్నే తెలియచేస్తూ' బింబం కవికి పాఠకునికి మధ్య నిర్మించబడిన చిన్మయసేతువు'[9] అని వర్ణించారు. కావ్యానందంలో మూడవపక్షమైన విమర్శకుడు కవి సంపూర్ణవ్యక్తిత్వాన్ని, మౌలికతని,

---

8. డా.భగీరథమిశ్ర, 'కావ్యశాస్త్ర', 281.

9. డా.ధర్మశీల, Ibid, 101.

ప్రతిభని, వ్యుత్పత్తిని, జీవితపు విలువలని కావ్యబింబం సహాయంతో గ్రహించ గలుగుతాడు. కావ్యబింబసృష్టికి కవి ప్రత్యక్ష అనుభవాలతోపాటు, అతని స్మృతికి, జ్ఞానానికి సంబంధించిన పురాణ, ఇతిహాస పరిజ్ఞానం, స్మృతిసంస్కృతినుంచి, దర్శనాల నుంచి, జాతి జీవితంలో అవిభాజ్యంగా వెనవేసుకున్న సంప్రదాయాలనుంచి కవి పొందిన భావోత్తేజం దోహదం చేస్తాయి.

ఉత్తమ కవిత్వసృష్టికి వ్యక్తి (man) కాలం (moment) సంప్రదాయం (milieu) ఆవశ్యకం. వీటి సమాహారమే కావ్యబింబం. కావ్యబింబం సంఘనిష్ఠమైన ప్రతీక కంటె, సంప్రదాయ బద్ధమైన ఆర్కిటైప్‌కంటె ఉత్కృష్టమై, కవి వ్యక్తిగత అనుభవాలని, విశిష్ట తత్వాన్ని ఆవిష్కరించగలిగితే ఉన్నతస్థాయికి చెందిన కవిత్వసృష్టి జరుగుతుంది. ఉత్తమ సాహిత్యానికి ఆవశ్యకమయిన రసం, ధ్వని, అలంకారం, ప్రతీకాది భావ వ్యక్తీకరణసాధనలకి విశిష్ట కావ్యబింబం ఆలంబనం అయి కవి ఆత్మకి, కావ్యాత్మకి సమ్యగ్రూపాల్ని ప్రసాదించగలుగుతుంది.

Ezra Pound సాహిత్యసృష్టిలో కావ్యబింబానికి అత్యున్నతస్థానాన్ని ఇస్తూ "It is better to present one image in a life time than to produce voluminous works" 10 అని స్పష్టం చేశాడు. ఇటువంటి కావ్యబింబ వివేచన కవి వ్యక్తిత్వానికి సంబంధించిన నిగూఢసత్యాలని అవగాహన చేసుకోడానికి ఉపకరిస్తుంది.

---

10. Quoted by C.Day Lewis, Ibid, 25.

## కావ్యబింబ వర్గీకరణ

కవి వివిధ అనుభూతులని, అనుభవాలని కావ్యబింబాల ద్వారా వ్యక్తీకరిస్తాడన్నది ఇంతవరకు జరిపిన చర్చల సారాంశం. కవి తాను ప్రయోగించే కావ్యబింబాలని తన ప్రత్యక్షఇంద్రియ పరిజ్ఞానం మూలంగానే కాక తన సంప్రదాయ అధ్యయనం వలన కూడా సంతరించుకుంటాడు. కావ్యబింబ నిర్మాణానికి ముఖ్యంగా కవి తన ఇంద్రియ సంబంధమైన స్వానుభవంమీద ఆధారపడతాడు. ఇవి ప్రాథమికంగావైయక్తికమైన వి. ఈ బింబాలు కవియొక్క విశిష్ట, వ్యక్తిగత లక్షణాలని వెల్లడిస్తాయి[1] అని కావ్యబింబాలని గురించి మౌలిక పరిశోధనచేసిన Caroline Spurgeon తెలియచేశింది. కవి వ్యక్తిత్వాన్ని తెలుసుకోడానికి అతడు ప్రయోగించిన బింబాలని పరిశీలించడం ప్రయోజనకరం. ఈ బింబాలని కవి వివిధములైన తన అనుభవకేదారాల్లో పండించుకుంటాడు. ఈ అనుభవాలు వివిధాలు కనుక కావ్యబింబాలని కూడా వివిధాలుగా వర్గీకరించడం అవసరం. ఈ బింబ వర్గీకరణలో కూడా కారొలిన్‌స్పర్జన్ అగ్రగామి. కాని ఆధునిక విమర్శనాదృష్టిలో ఆమెచేసిన వర్గీకరణ ఆమోదయోగ్యం కాలేదు. షేక్‌స్పియర్ ప్రయోగించిన కావ్యబింబాలని ఆమె ఎనిమిది విధాలైన ముఖ్యవిభాగాలుగా వర్గీకరించింది. Nature, animals, domestic, body, daily life, learning, arts, imaginative అనే ఎనిమిది ముఖ్య వర్గాలలోను

---

1. 'A poets imagery reveals his own idiosyncrasies, and not only the usages of his period..... and will of itself throw light on his mind and interests', "Shakespeare's Imagery", 43.

పూలు, వర్షాలు, సముద్రం, ఋతువులు, పక్షులు, నాలుగు కాళ్ళ జంతువులు, క్రిమికీటకాదులు, సాంసారిక బాంధవ్యాలు, శారీరకారోగ్యము, మతసంబంధమైన, వైజ్ఞానిక సంబంధమైన అధ్యయనం, చిత్రకళ, నాటకమువంటి సృజనాత్మక కళలు వంటి అనేక అంతర్విభాగాలుకూడా ఆమెచేసింది. వీటి ప్రయోగాలని గణాంకపద్ధతిని లెక్కించి మొత్తం బింబాలలో వాటి అనుపత్తిని (proportion) కూడా ఆమె పట్టికలో సూచించింది. ఈ వివరాలని ఆధారం చేసుకుని ఆమె షేక్స్పియర్ అభిరుచులని, రాజకీయ, నైతిక దృక్పథాలని ఆవిష్కరించడానికి ప్రయత్నించింది. ఈ విషయంలో కొందరు ఆక్షేపణ చేసినప్పటికి, కావ్యబింబ ప్రయోగం కవి ఆత్మావిష్కరణకి దోహదకారి అని స్థూలంగా మనం అంగీకరించవచ్చు.

Robin Skelton "Poetic Pattern" అనే తన గ్రంథంలో కావ్యబింబాలని పదివిధాలుగా వర్గీకరించాడు. ఇంద్రియజ్ఞాన ప్రేరకాలయిన బింబాలని "simple images" అని, భావసంబంధమైన బింబాలని "abstraction images" అని, ప్రత్యక్షానుభవంతో తక్షణమే ఉద్బుద్ధమయ్యే బింబాలని "immediate images" అని ఇంకా "diffused image", "abstract image" (అమూర్తభావానికి మూర్తకల్పన జరిగే బింబాన్ని స్కెల్టన్ abstraction image కంటె భిన్నంగా పరిశీలిస్తాడు. కాని ఈ విభజన సమగ్రనేయంగా కనిపించదు. భావ సంబంధమైన బింబాలని అన్నింటిని abstract images గా పరిగణించటం సమంజసం) , Combined images complex image, combined abstract image, complex abstract image, abstract combined and abstract complex image అని వర్గీకరణచేశాడు. ఈ విభజన అతి క్లిష్టమై అతిసూక్ష్మ దృష్టితో జరిగింది.

Henry Wells అనే అమెరికన్ రచయిత "Poetic Imagery" (1924) అనే తన గ్రంథంలో కావ్యబింబాలని ఏడువిధాలుగా వర్గీకరించాడు. వాటిని decorative, sunken, violent, radical, intensive, expansive, exuberant అని ఆయన వ్యవహరించాడు[2]. వీటిలో violent, decorative కావ్యబింబాలు తక్కువ స్థాయికి చెందినవని, ఇవి నిజానికి ప్రజల రూపకాలంకారాలు (metaphors of the masses) అని తెలియచేశాడు. Exuberant image లో రెండు పదార్థాల మధ్యఉన్న పోలిక ప్రధానమని, ఈ పోలిక ప్రగాఢంగా ఉండవలసిన అవసరంలేదని, intensive image లో ఈ పోలిక ప్రగాఢంగా ఉండడమే కాక, బొమ్మగీసినట్టుగా ఉంటుందని Wells తెలియచేశాడు. Sunken, radical, expansive images మిగిలిన వాటికంటే ఉన్నతమైనవని ఈయన భావించాడు.

కావ్యబింబ అధ్యయనంతోపాటు కావ్యబింబ వర్గీకరణకూడా హిందీ సాహిత్యంలో విపులంగా జరిగింది. డా.నగేంద్ర 'కావ్యబింబ్' అనే తమ గ్రంథంలో ఈ వర్గీకరణకి మార్గదర్శకులుగా కనిపిస్తారు. ఇంద్రియానుభూతిమీద ఆధారపడి బింబాలని దృశ్య, శ్రవ్య, స్పృశ్య, ఘ్రాతవ్య, ఆస్వాద్య బింబాలని అయిదువిధాలుగా[3] ఆయన విభజించారు. ఇవేకాక బింబసృజనవై

---

2. Henry Wells, "Poetic Imagery", Quoted by Rene' & Wellek and Austin Warren, 'Theory of Literature', 20[...]
3. డా.నగేంద్ర, ''కావ్యబింబ్'', 6.

ఆధారపడి రెండువిధాల వర్గీకరణకూడా చేశారు. స్మృతిద్వారా ఉద్బుద్ధమైన బింబాన్ని స్మృతబింబమని, కల్పనాశక్తివలన ఉద్బుద్ధమైన బింబాన్ని కల్పిత బింబమని వర్గీకరించారు. ప్రేరకానుభూతుల్ని ఆధారంచేసుకుని అయిదు విధాలైన మరిఒక వర్గీకరణకూడా ఆయన చేశారు. ఇవి సరళ, జటిల, పూర్ణ, సమాకలిత బింబాలు. ఇంకా ఖండితబింబమని, వికీర్ణబింబమని విభజించడమే కాక కావ్యశాస్త్రదృష్టిలో ముక్తబింబం, సంశ్లిష్టబింబం అని విభజనచేశారు. కావ్యబింబం అనేక అనుభూతుల వలన, స్మృతులవలన, సంప్రదాయ విజ్ఞానం వలన, సామాజిక పరిశీలన మొదలైన వాటివలన ఉద్బుద్ధం కావడం వలన కావ్యబింబ వర్గీకరణ బహుక్లిష్టంగా ఉండటం సహజం. డా. కుమార్‌విమల్ ''సౌందర్యశాస్త్రకాతత్వ''[4] అనే తమ గ్రంథంలో ఈ క్రింది వర్గీకరణచేశారు. చాక్షుస్ శ్రావణ్, స్పర్శ, ఘ్రాణిక, రాసనిక, ఆంగిక, వేగోద్బోధ. వీటితో పాటు అతిరిక్త, ఐంద్రియప్రభావాలకి సంబంధించిన మరి రెండు అనుభూతులమై ఆధారపడిన బింబాలని సంవేదనాత్మక సంశ్లిష్టబింబం (synaesthetic) సహానుభూతి క బింబ్ (empathetic) అని కూడా విభజించారు. ఈ విభజన సంప్రదాయవిజ్ఞానం వలన ఏర్పడేబింబాలని, సామాజిక పరిశీలనవలన ఏర్పడే బింబాలని పూర్తిగా విడిచి పెడుతుంది. అందువలన ఈ విభజన సమగ్రంకాదు.

---

4. డా. కుమార్ విమల్, 'సౌందర్యశాస్త్ర కా తత్వ', 219.

"కామాయని" లో కావ్యబింబాలని పరిశీలించిన డా. ధర్మశీల[5] ఈ క్రింది వర్గీకరణ చేశారు. ఐంద్రియబింబం, ప్రకృతి లేదా జీవనబింబం, మనోవైజ్ఞానికబింబం, పారస్పరిక లేదా స్వచ్ఛంద బింబం, కేంద్రీయ లేదా సహకార్య బింబం, గీతాత్మక లేదా ప్రబంధాత్మక బింబం. ఈ విభజన కొంత వరకు సంతృప్తికరంగా ఉన్నప్పటికి ఒకగీతికలో ఉండే కావ్యబింబాలని కావ్యమంతటిలో ఉండే పలిగరే తో ముడిపెట్టడం సముచితంగా కనిపించడంలేదు.

పై వర్గీకరణలన్నింటిని స్థూలంగా పరిశీలిస్తే ఏ ఒక్క వర్గీకరణ కూడా సమగ్రంకాదని స్పష్టమవుతోంది. కవి అనుభూతి అనంతమయింది. అనంతమైన ఈ అనుభూతిని కవి సహస్రవిధకావ్యబింబాలతో వ్యక్తీకరిస్తాడు. వీటిననిటిని ఏదో ఒక విభజనలో శాస్త్రీకరించప్రయత్నించడం సాధ్యంకాదు. ప్రస్తుత కావ్యబింబపరిశీలన ముఖ్యోద్దేశం. కావ్యబింబ వర్గీకరణకాదు. స్థూలంగా కవి కావ్యగతంచేసే అనుభవాలని, అనుభూతులని వర్గీకరణచేసి ఇవి కవి ఆత్మావిష్కరణకి ఏవిధంగా దోహదం చేస్తాయో పరిశీలించడం ప్రస్తుత పరిశీలన ముఖ్యోద్దేశం.

---

5. డా. ధర్మశీల, Ibid, 95.

ఈ దృష్టితో వర్గీకరణలన్నిటిని పరిశీలించిన తరువాత ప్రస్తుత కావ్యబింబ అధ్యయనానికి ఈ క్రింది వర్గీకరణ ఉపయోగకారిగా ఉండగలదని భావిస్తున్నాను. సాహిత్యవిమర్శలో ఏవర్గీకరణ అయినా విజ్ఞాన శాస్త్రాలలోవలె నిష్కర్షగా, నిశితంగా చేయడం సాధ్యంకాదు. ఏ వర్గీకరణ అయినా ఒక పరిశీలన చేయడానికి వీలయ్యే విధంగా, కవి వ్యక్తిత్వ ఆవిష్కరణకి దోహదకారి అయ్యేలా స్థూలంగా చేయబడుతుంది. ఈ వర్గీకరణకూడా స్థూలంగా చేయ బడిందే. ఇందులోని విభాగాలు ఒకదానితో ఒకటి ఏమాత్రం సంబంధంలేనివి కావు. ఈ వర్గీకరణని ఈ విధంగా సూచించవచ్చు.



ఈ విభజన కావ్యబింబసృష్టిని దృష్టిలో ఉంచుకుని చేయబడింది. కావ్యబింబం కవికి సంబంధించిన అనుభవాలని, అనుభూతులని వ్యక్తీకరించే సాధనం. ఈ అనుభూతులు అనుభవాలు స్థూలంగా రెండువిధాలని భావించవచ్చు. ప్రత్యక్ష అనుభవానికి సంబంధించినవి, స్మృతి మీద ఆధారపడి పరోక్ష అనుభవానికి సంబంధించినవి. ఈ విభజనలో అంతర్విభాగాలు కూడా ఉండవచ్చు. ప్రకృతిని, వ్యవసాయరంగాన్ని, సమాజాన్ని, వైజ్ఞానికరంగాన్ని, నగరజీవనాన్ని కవి ప్రత్యక్షంగా తన పంచేంద్రియాల సహాయంతో పరిశీలించడం వలన కలిగిన అనుభవాలు ఇందుకు సంబంధించిన కావ్యబింబ పరికల్పనకి ఉపకరిస్తాయి. కవి తాను ప్రత్యక్షంగా పరిశీలించిన ఈ విషయాలకి తన వ్యక్తిగత అభిరుచుల వలన అతీంద్రియ భావాలని ఆపాదించడం జరుగుతుంది. ఈ భావాలు కావ్యబింబ స్వరూపాన్ని అమితంగా ప్రభావితం చేస్తాయి. ఈ భావాలనే కవి తన ఇంద్రియానుభూతులకి చేసే వ్యాఖ్యలుగా అర్థంచేసుకోవచ్చు. ఈ వ్యాఖ్యలు అభ్యుదయ భావాలని, మానవతా దృక్పథాన్ని వెల్లడిస్తాయి. కావ్యబింబ సృష్టికి పరోక్షంగా కవి తన స్మృతిపథంలో గ్రంథపఠనంవలన, సంప్రదాయ విజ్ఞానం వలన, చారిత్రక అవగాహన వలన ఏర్పడిన జ్ఞాపకాల బింబాలని కూడా ఉపయోగించుకుంటాడు. ఇందుకు కవి చదివిన పురాణ గ్రంథాలు చారిత్రక గ్రంథాలు మాత్రమే కాక, తరతరాలుగా సంప్రదాయం జాతిజనులకందరికీ అందించే ఆదర్శబింబాల (Archetype) వంటి జ్ఞాపకాలుకూడా ఉపకరిస్తాయి. వీటిలోని అంతర్విభాగాలు పౌరాణిక, చారిత్రక, సంప్రదాయవిజ్ఞానానికి సంబంధించినవి. ఈ పరిశీలన కారలిన్ స్పర్జన్ చేసిన విధంగా గణాంక పద్ధతిలో

ద్వితీయ ఖండం

# కావ్యబింబ ప్రయోగం

సింహావలోకనం

విశ్వసాహితి

ప్రాచీన ఆంధ్రసాహితి

ఆధునిక ఆంధ్రసాహితి

## సాహిత్యంలో కావ్యబింబప్రయోగం - సింహావలోకనం

విశ్వసాహిత్యసీమలో ప్రతిభావంతులైన కవులు తమ అనుభవాలని, అనుభూతులని సహృదయపాఠకులకి హృదయాకర్షకాలుగా, రమణీయంగా వెలువరించడానికి వివిధ రసోపస్కారకాలైన కావ్యబింబాలని ప్రయోగించారు. ఈ కావ్యబింబాలు కేవలాలైన యథార్థాలకి రమణీయవాగ్రూపాన్నిచ్చే అలంకారాలేకాక, కవి చెప్పదలుచుకున్న విషయాలని, ప్రజలకి అందించదలచుకున్న సందేశాలని హృదయాలకి హత్తుకునే విధంగా చేయగలిగిన కవితాసామగ్రిలో ప్రధానమైనవి. కాంతాసమ్మితంగా ఉపదేశం చేయవలెననే కవిత్వ ప్రయోజనాన్ని నెరవేర్చడంలో కవికి ఈ కావ్యబింబాలు అత్యంతఉపస్కారకాలు.

### ప్రాచీన సాహిత్యం

భారతీయ ఆర్ష సంస్కృతికి కాణాచి అయిన వేదవాఙ్మయంలో కూడా శాశ్వత ధర్మసూత్రాలని వెలువరించినపుడు ఆ సూత్రాలు సులభగ్రాహ్యాలై హృదయాలమై గాఢప్రభావాన్ని కలిగించడానికి, సమర్థమయినవిగా భాసించడానికి వేదస్రష్టలు ఉపమలవంటి కావ్యబింబాలు ఉపయోగించారు. ప్రజలు పరస్పర ద్వేషరాహిత్యంతో, సమానచిత్తవృత్తితో, మానవతాపాదకమైన సఖ్యాన్ని కలిగి ఉండాలని విశ్వప్రేమని బోధిస్తూ

> సహృదయం సాం మనస్యమవిద్వేషం కృణోమివః ।
> అన్యో అన్యమభిహర్యత్ వత్సం జాత మివాఘ్న్యా ॥

---

1. అథర్వవేదం, III-30-38.

అని ప్రజలలో పరస్పరప్రేమ లేగదూడలకి, గోవులకి మధ్య ఉండే ప్రేమతో ఉపమించి సొదంగా వెలువరించారు. యజుర్వేదంలో సత్సంకల్పాల సముదాయా నికి శివసంకల్పమని పేరు. ఆ శివ సంకల్పంలో మనసు జీవులమీద చేసే అధికారం రమణీయ కావ్యబింబం ద్వారా వ్యక్తీకరింప బడింది. నేర్పరి అయిన రౌతు గుర్రాలని కొరడాతో ఏవిధంగా నడుపుతాడో, పగ్గాలతో ఎలా నిలువుతాడో ఆలాగే మనసు జీవులని నడుపుతుంది, నిలువుతుంది అనే విషయాన్ని ఈ క్రింది శ్లోకంలో స్పష్టంచేశారు.

సుషారథి రశ్వానివ యన్మనుష్యాన్నేనీయతే౽భీశుభిర్వాజిన ఇవ।
హృత్ప్రతిష్ఠం యదజిరం జవిష్ఠం తన్మే మనః శివసంకల్పమస్తు॥[2]

ఉపనిషత్తులు జీవాత్మ పరమాత్మల పరస్పర సంబంధాన్ని ధనుస్సు ఓంకారం, జీవాత్మ బాణం, పరమాత్మ లేదా బ్రహ్మం లక్ష్యం అని చిత్రించారు.

ప్రణవో ధనుః శరో హ్యాత్మా బ్రహ్మతల్లక్ష్య ముచ్యతే।
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్తన్మయో భవేత్॥[3].

---

2. యజుర్వేదం, 3-1-6.
3. ముండకోపనిషత్తు, ('సంస్కృతకావ్యసంగ్రహం'లో ఉదాహృతం, 18.)

ఆదికవి వాల్మీకి శ్రీమద్రామాయణ మహాకావ్యంలో రసవత్తరాలైన వర్ణనలు అనేకం మనకి దర్శనమిస్తాయి. అరణ్య కాండలో రాముడు భరతునికి ప్రవచించిన హిత వచనాలలో సంసారంలో భార్యాపుత్రులు, బంధువులు వీరిమధ్య ఉన్న సంబంధం

యథా కాష్ఠంచ కాష్ఠంచ సమేయాతాం మహార్ణవే।
సమేత్య వ్యపేయాతాం కాలమాసద్య కంచక।।
ఏవం భార్యాశ్చ పుత్రాశ్చ జ్ఞాతయశ్చ వసూనిచ
సమేత్యవ్య వధావన్తి ధ్రువో హ్యేషాం వినాభవః।।[4]

అని మహాసముద్రంలో దుంగ దుంగ కలుసుకుని కొంతకాలానికి విడిపోయేవిధంగా సంసారంలో భార్యాపుత్రాదులతో కొంతకాలం కలిసిఉండి తరవాత విడిపోవడం తప్పనిసరి అని చిత్రించారు. రావణవధానంతరం తన ముందు నిలబడిన, సందేహానికి ఆస్కారమైన నడవడి కలిగిన సీత రామునికి కండ్లరోగం ఉన్నవాడికి దీపంలాగా అనే కావ్యబింబాన్ని తలపింపచేసింది.

ప్రాప్త చారిత్ర సందేహానుమప్రతిముఖేస్థితా।
దీప నేత్రాతురస్యేవ ప్రతికూలాసి మేధృఢమ్।।[5]

---

4. వాల్మీకి, 'శ్రీమద్రామాయణము', అరణ్యకాండ, 105-26-27.
5. వాల్మీకి, 'శ్రీమద్రామాయణము', అరణ్యకాండ, 118-17.

కవికులగురువుగా ఎన్నదగిన కాళిదాసు ''ఉపమా కాళిదాసస్య'' అనే ఆంశోక్తి మూలంగా అలంకార ప్రయోగంలో సంకేతమన్నుడని విశదమవుతుంది. ఈ కవేంద్రుడు ముగ్ధసౌందర్యానికి ప్రతీకగా మనకనులముందు నిలబెట్టిన శకుంతల ఆ కవిచేసిన రూపకల్పనలో ద్విగుణీకృతసౌందర్యాన్ని సంతరించుకుంది. సాహితీ పిపాసువులందరికీ సువిదితమైన శకుంతల వర్ణనము అపూర్వం, అనన్యసామాన్యం.

అనాఘ్రాతంపుష్పం కిసలయమలూనం కరరుహై
రనావిద్ధంరత్నం మధునవ మనాస్వాదిత రసం.....[6].

శ్రీరాముని పట్టాభిషేకాన్ని నిర్ణయించమని దశరథుని చెవిచెంతచేరి, కైకేయివలన భయపడిన వార్ధక్యం నెరసిన జుట్టు అనే మిషతో తెలియచేసినట్టు చమత్కారంగా వర్ణించాడు.

తంకర్ణమూల మాగత్య పలిత ఛద్మ నాజరా।
కైకేయా శంకయేవాహ రామే శ్రీన్యస్యతామితి।।[7].

కాళిదాసు ప్రయోగించిన ఉపమలలో దీపశిఖ' ఉపమ సంకేతప్రాప్తమయింది. వినయచంద్రుడనే అలంకారికుడు ''కావ్యశిక్ష'' అనే తన గ్రంథంలో ''దీపికా కాళిదాసః'' అని కాళిదాసుకి బిరుదు ఉన్నట్టు పేర్కొన్నాడు. ''దీపశిఖ''

---

6. కాళిదాసు, 'అభిజ్ఞాన శాకుంతలం', అంకం, 2-10.
7. కాళిదాసు, 'రఘువంశము', సర్గ, 12, శ్లో. 2.

అనే విషయంమైనా కాళిదాసు ఆరువిధాలైన కల్పనా చమత్కృతుల్నిలని ప్రదర్శించాడని విమర్శకులు తెలియచేశారు[8]. ఇందుమతి స్వయంవరసందర్భంలో సంచరిస్తున్న దీపశిఖలాగా ఇందుమతీదేవి ముందు ముందుకి సాగుతున్నపుడు వెనుకటి రాజుల ముఖాలు వెనకపడ్డ గృహాలలాగా వెలవెలపోవ ప్రారంభించాయి అని అపూర్వంగా ఇలావర్ణించాడు.

> సంచారిణీ దీప శిఖేవరాత్రౌ
> యం యం వ్యతీయాయ పతింవరా సా ।
> నరేంద్ర మార్గాట్ట ఇవ ప్రపేదే
> వివర్ణ భావం సస భూమిపాలః ॥ [9].

సర్వమంగళాదేవి శర్వాణి రూపవైభవాన్ని వినూత్నంగా విలసిల్లే రేఖాచిత్రంలాగా నవవికాసామోదాలతో ప్రతిభగ్రంగా ప్రకాశించే పద్మంలాగా స్వతస్సిద్ధమైన అందం, యౌవన ప్రాదుర్భావంచేత ఉజ్జ్వలంగా ఉద్భాసించిందని ఇలా వర్ణించాడు.

> ఉన్మీలితం తూలికయేవ చిత్రం సూర్యాంశుభిర్భిన్నమివారవిందం
> బభూవతస్యాశ్చతురస్ర శోభిః వపుర్విభక్తం నవయౌవనేన[10].

---

8. శ్రీ ఖండవల్లి సూర్యనారాయణశాస్త్రి, 'కాళిదాసహృదయము', పుట, 20.
9. కాళిదాసు, 'రఘువంశము', సర్గ 6, శ్లో. 67.
10. కాళిదాసు, 'కుమారసంభవమ్', సర్గ 1, శ్లోకం, 33.

కవులలో లబ్ధప్రతిష్ఠుడైన మాఘుడు 'శిశుపాలవధ' కావ్యంలో ఆత్మాభిమానం, పౌరుషం మానవునికి అత్యంత ప్రధానాలని బలరామునిచేత పలికించిన సత్యం రమ్య కావ్యబింబాలంకృతం. కొండకి ఎత్తు ఉంటుంది. లోతు ఉండదు, సముద్రానికి లోతు ఉంటుంది, ఎత్తు ఉండదు. పౌరుషం ఆత్మాభిమానం ఉన్నమానవునికి ఎత్తు లోతుకూడా ఉంటాయి. కాబట్టి, అతనిని ఎవరూ ఆక్రమింపలేరు అని ఈ విధంగా వర్ణించాడు.

> తుంగత్వ మితరానాద్రౌనేదం సింధావగాధతా।
> అలంఘనీయతా హేతు రుభయం తన్మనస్విని।।[11].

మెత్తని వస్తువు ఆధారంగా ఉంటే తేజస్సు ప్రయోజనాన్ని సాధిస్తుంది అనే సామాన్య ధర్మాన్ని వ్యక్తీకరించడానికి మాఘకవి మెత్తని వత్తి ఆధారంగా దీపం నూనెని పీలుస్తూ బాగా వెలుగుతుంది అని ఉపమని ప్రయోగించాడు.

> మృదు వ్యవహితం తేజో భోక్తుం మర్థాన్ ప్రకల్పతే
> ప్రదీపః స్నేహమాదత్తేదశయా భ్యంతరస్థయా[12].

---

11. మాఘుడు, 'శిశుపాలవధ', 2, 48.
12. మాఘుడు, 'శిశుపాలవధ', 2, 85.

భారవి ''కిరాతార్జునీయం''లో వంచకులు అమాయకుల్ని బాధపెట్టే విధానాన్ని కవచంలేని యోధుని శరీరంలో వాడిబాణాలు గుచ్చుకునే రీతితో ఈ విధంగా పేర్కొన్నాడు.

వ్రజంతి తే మూఢధియః పరాభవం
భవంతి మాయా విషయేన మాయినః
ప్రవిశ్య, హిఘ్నంతి శరాస్సథావిధా
నసంవృతాంగా న్నిశితా ఇవేషవః[13].

లోకోత్తరులైన మహాపురుషుల హృదయ తత్త్వాన్ని వజ్రంకన్న కఠోరమయిందిగా, కుసుమంకన్న మృదువయిందిగాను భవభూతి ''ఉత్తరరామచరిత్ర''లో ఈ విధంగా చిత్రించాడు.

వజ్రాదపి కఠోరాణి మృదూని కుసుమాదపి
లోకోత్తరాణాం చేతాంసికోను విజ్ఞాన మర్హతి[14].

ధర్మసూత్రాలని లోకవ్యవహారానికి అనువర్తింపచేస్తూ, సులభగ్రాహ్యాలైన సుభాషితాలుగా రూపుదిద్దేసందర్భంలో భర్తృహరి అనేకమైన కావ్యబింబాలని ప్రయోగించాడు. దుర్జనుల చెలిమి ఉదయకాలంలో నీడలాగా మొదట అధికంగా ఉండి

---

13. భారవి, 'కిరాతార్జునీయమ్', 1-30.
14. భవభూతి, 'ఉత్తరరామచరిత', 117.

క్రమంగా క్షీణిస్తుందని, సజ్జనుల మైత్రి మధ్యాహ్నకాలం నీడలాగా ఆరంభంలో కొలదిగా ఉండి క్రమక్రమంగా అభివృద్ధిచెందుతుందని వర్ణించాడు.

ఆరమ్భ గుర్వీ క్షయిణీక్రమేణ, లఘ్వీ పురావృద్ధిముపైతి పశ్చాత్।
దినస్యపూర్వార్ధ పరార్ధ భిన్నా ఛాయేవ మైత్రీఖల సజ్జనానామ్[15].

సమర్థుడైన సజ్జనుడు కర్మవశాన హీనస్థితి పొందినా తిరిగి ఉన్నతస్థితిని ప్రయత్నంచేత సాధిస్తాడని వివరించడానికి బంతి పైనుంచి క్రిందపడి తిరిగి పైకి ఎగురుతుంది అనే పోలికతో ఆ సత్యాన్ని వెల్లడించాడు. మందబుద్ధిమాత్రం మట్టిముద్దలాగా ఒక పర్యాయం హీనస్థితిని పొందితే పైకి రాజాలడని ఈ విధంగా వివరించాడు.

యథాకందు క పాతే నోత్పతత్యార్యః పతన్నపి
తథాత్వనార్యః పతతి మృత్పిండ పతనం యథా[16].

గ్రీకు సాహిత్యంలో, బృహత్కావ్యరచన చేసిన Homer తన Iliad లో ట్రోజను యుద్ధసందర్భంలో మరపురాని యుద్ధచిత్రాలని ప్రదర్శించాడు.

---

15. భర్తృహరి, నీతిశతకం, శ్లోకం, 50.
16. భర్తృహరి, నీతిశతకం, శ్లోకం, 34.

Achilles అనే వీరుడు Hephaistos ని అగ్నిదగ్ధుణ్ణి చేసిన సంఘటనని

he, burnt with fire, for his fair steams
were bubbling
And as a cauldron boileth within,
beset with much fire, melting the lard
of some fatted hog spurting up
and the logs of firewood lie thereunder[17].

అని కళ్ళకి కట్టినట్టు చిత్రించాడు.

ఇటాలియన్ సాహిత్యంలో లబ్ధప్రతిష్ఠుడైన Dante 'Divina commedia' అనే తన కావ్యంలో స్వర్గ, నరకాలని అనన్య సామాన్యంగా వర్ణించాడు. Purgatory అని పిలువబడే నరకాన్ని వర్ణిస్తూ

The flames of onward, leaning, as they went
The air behind them painted them as with
trail of liveliest pencils[18].

అని నరకలోకపు మంటలని కవి ప్రదర్శించారు.

---

17. Homer, 'Iliad', XXI, 393 (tr.by S.H.Batcher & Andrew Lang), The Modern Library, New York, 1950.

18. Dante, 'Divina Commedia', "The Vision of Dante", tr.by Henry Francis Cary, Canto XXIX, LL.73-75, 220

## ఆధునిక సాహితి

ఫ్రెంచి సాహిత్యంలో సింబలిస్టు ఉద్యమం అత్యుత్తమ కవితాసృష్టికి దోహదం చేసింది. కవిత్వానికి పరమావధి Le Bean (అందం) అని విశ్వసించిన మలార్మే, బోదిలేర్ వంటి కవులు కవిత్వాన్ని అత్యున్నత స్థాయికి తీసుకుని వెళ్ళగలిగారు. కవిత్వానికి పరమలక్ష్యం "not the being but the beautiful"[1] అని విశ్వసించిన మలార్మే ప్రతీకవాదోద్యమానికి మూలపురుషుడని చెప్పవచ్చు. మలార్మే L'Azur ( నీలాకాశం ) అనే గీతంలో ఆకాశం విరుద్ధ శక్తుల కలయిక అని తెలియచేయడానికి పూవుల్లా అందంగాను, అసహాయుడైన కవిని అణచివేసే శక్తిగాను, ఆకాశాన్ని భావిస్తూ

> The tranquil irony of the eternal sky,
> Indolently beautiful like flowers,
> crushes the impotent poet .....
> Across a sterile wilderness of sorrows[2].

అని ప్రకృతిలో ఉండే దయాగుణాన్ని, క్రౌర్యాన్ని దర్శింపచేశారు. బోదిలేర్‌కి ప్రకృతి సమస్తం ప్రతీకాత్మకంగా కనిపించింది. ప్రకృతి ఒక ఆలయంగా, వృక్షాలు ఆ ఆలయస్తంభాలుగా భావించిన బోదిలేర్‌కి

---

1. Quoted by C.M.Bowra, 'The Heritage of Symbolism' P, 5.
2. Mallarme, 'L'Azur' Translated by George Gabronsk "Modern French Poetry", P, 45.

> Each flower is scented like an incense bowl,
> A violin trembles like a broken heart;
> The senses turn in a slow, and languid dance
> The sky is sad and splendid like an altar[3].

గా కనిపించాయి. ఈ కవితలో ప్రకృతిలోని సౌందర్యంతో పాటు విషాదస్మృతిని కూడా సూచించే కావ్యబింబాలని కవి ప్రయోగించాడు. దీనికి కారణం కవి గతించిన తన ప్రేమానుభవాల్ని జ్ఞాపకం చేసుకోవడం Paul Verlaine కి వెన్నెల

> The tranquil moonlight, beautiful and sad
> sets the birds among dark branches dreaming,
> while enraptured sob the water falls,
> Great fountains sauve against the marble gleaming[4]

గా కనిపించింది. కవి వృక్షశాఖలకి, జలపాతాలకి, మానవుల సుఖసంతోషాలని ఆపాదించి ప్రకృతికి, మానవునికి మధ్య అవిభాజ్య సంబంధాన్ని సూచించాడు. రెండో దృష్టిలో కవి ప్రకృతి బాహ్యస్వరూపం వెనక ఉన్న అంతస్సూత్రాలని

---

3. Baudalaire, "Harmonie du Soir", Quoted by Clarles Chadwick, "Symbolism", 9.
4. Paul Verline, 'Moonlight' translated by Patrica Terry, "Modern French poetry", P,67.

దర్శించగలిగే 'Voyant' (ఋషి); ఈ అంతర్దర్శనానికి ప్రకృతి బాహ్య స్వరూపాన్ని పంచేంద్రియాలతో సూక్ష్మంగా పరిశీలించడం అవసరం. ఈ కవి అనేక పుష్పాలని తన పరిశీలనాత్మకమైన చక్షువులతో చూచి వాటి సొబగులని నైపుణ్యంతో విశ్లేషించి పాఠకులని ఆ అందాలన్నీ సాక్షాత్కరించే విధంగా ప్రదర్శించాడు. 'Fleurs' (పువ్వులు) అన్న ఖండికలో 'Water rose' ని

> Yellow gold coins strewn over the agate
> mahagony pillars supporting an emerald dome,
> while satin bouquets and slender wands
> of rubies surround the water rose[5].

అని వర్ణించాడు. అధివాస్తవిక కవిత్వానికి పితామహునిగా పరిగణించదగిన అపొలినేర్

> My glass is full of wine that wavers like a flance
> My glass is shattered like a burst of laughter[6].

అనిచిత్రించాడు.

5. Arthur Rimbaud, 'Flowers' Translated by Patrica Terry. "Modern French Poetry", 103.
6. Guillaume Appollinaire, 'Nuit Rhinane'(Rhinish Night Translated by Serge Gavronsky, Ibid, 129.

జర్మన్ కవుల్లో రిల్కేకి సమున్నతస్థానం ఉంది. కవిత్వానికి ప్రగాఢ వాంఛ (Sehnsucht) ప్రాణమని విశ్వసించిన రిల్కే బాహ్యప్రపంచాన్ని చూడటంతో సంతృప్తిపడక మానవుని అంతరంగంలో బంధించబడి ఉన్న వివిధ అంతరంగ చిత్రాలని కవితల్లో వెలువరించాలని ఆశించాడు. ప్రకృతి మానవుని అంతరంగంలో ప్రవేశించి మానవునితో తాదాత్మ్యం పొందుతుందని విశ్వసించి

A single space spreads through all things that lie,
world's inner space. The birds are flying still
Through us through and across, O, I that will
grow, I look out and in me grows the tree[7].

ఆధునిక కాలంలో నగరజీవితపు అర్థరాహిత్యాన్ని తన "Duinaser Elegien" (డూఇనొ స్మృతిగీతాలు) లో రిల్కే

Squares, O squares in Paris infinite show place,
Where the modiste, Madame Lamort,
Winds and binds the restless ways of the world[8].

---

7. R.M.Rilke, "Wendung" (The Turn) Translated by J.B.Leishman 'Heritage of Symbolism', 71.
8. R.M.Rilke, Quoted in 'Heritage of Symbolism', 81.

అని చతురస్రాకారాలని వర్ణించి జీవితంలోని రసహీనతని కవి ప్రదర్శించాడు. వర్తులాకారం జీవితంలో అందానికి, ఆనందానికి, చతురస్రాకారాలు జీవితంలో రసహీనతకి ప్రతీకలుగా ప్రయోగించడం పాశ్చాత్య కవులకి పరిపాటి నిత్య నైమిత్తిక జీవితంనుంచి విముక్తం చేసి ఉన్నతస్థాయికి తీసుకుని వెళ్ళటం తన కవిత్వ ఆశయంగా భావించిన Stefan George తన ఉన్నత ఆశయాన్ని "die Herrim" (ఆశయ దేవత) గా చిత్రించి ఆమెని

> Earthward the Mistress flies
> Moon - coloured veils of gauze around her clinging
> Half-open are her dream-encumbered eyes
> She bends to you[9].

అని వర్ణిస్తూ ఆమె నిసర్గ సౌందర్యాన్ని కవి వర్ణించాడు.

రష్యన్ సాహిత్యంలో అలెగ్జాండర్ బ్లాక్ ప్రముఖ కవి తన కవిత్వంలో 'Sophia' అనే దివ్య జ్ఞానాన్ని అన్వేషించడానికి ఈ కవి ప్రయత్నించాడు. ఆ అలౌకిక జ్ఞానానికి, వాస్తవానికి మధ్య ఉన్న అగాధాన్ని అధిగమించడానికి మానవుడు ప్రయత్నం చేయాలని ఆదేశిస్తూ, ఆ ప్రయత్నం ఫలవంతం కాకపోవచ్చునని భావించాడు. అన్వేషించే జీవితాన్ని ఒక పడవగా చిత్రిస్తూ

---

9. Stefan George, "Weile" ('Consecration,') Translated by Cyril Scott, Quoted in 'Heritage of Symbolism', 106.

Life, our bark, has stranded
On a shoal profound.
High the shouts of labourers
Far away resound[10].

అని వర్ణించి, మానవుని అన్వేషణ వాస్తవ పరిధిలో చిక్కుకుని అతని జీవితాన్ని ఆశయాల ఆవరణకి సుదూరంగానే నిలిపి వేస్తుందని కవి సూచించాడు. రష్యాలో విప్లవం కవికి నూతన ప్రపంచానికి నాందిగా, పాతప్రపంచానికి భరత వాక్యంగా కనిపించింది. "The Twelve" అన్న ప్రసిద్ధగీతంలో పాత ప్రపంచాన్ని

The old world, like a homeless mongrel,
stands by, with tail between its legs[11].

అని చిత్రించాడు.

ఆంగ్లనాటక సాహిత్యంలో మకుటంలేని చక్రవర్తిగా పేర్కొనదగిన షేక్స్పియర్ భావుక చక్రవర్తిగా కూడా ప్రసిద్ధుడు. "Sonnets" వంటి

---

10. Alexander Blok, "Neva Delta" Translated by Oliver Elton, Quoted in 'Heritage of Symbolism', P, 15
11. A.Blok, "The Twelve", Ibid, P, 172.

ప్రత్యేక కవితారచనలేకాక ఆతని నాటకాలు అన్నింటిలోను రసవత్తరమైన, కవితామయమైన ఘట్టాలు కనిపిస్తాయి. ఈ సందర్భాలల్లో ఈ కవి రమణీయమైన, వివిధ భావస్ఫోరకమైన కావ్యబింబాలని ప్రయోగించాడు. ప్రభాతకాలపు సోయగాన్ని కవి రమణీయంగా తన "Sonnets" లో

Full many a glorious morning have I seen
Flatter the mountain tops with sovereign eye,
kissing with golden face the meadows green
Gilding pale streams with heavenly alchemy[12].

అని వర్ణించాడు. ప్రాణంలేని పదార్థాలని సజీవంగా చిత్రించడం కవిత్వంలో ఒక ప్రయోగం. ఈ ప్రయోగాన్ని షేక్స్పియర్ తన కవిత్వంలో అనేక పర్యాయాలు చేశాడు. ఉదాహరణకి

That pale, that white faced shore,
whose foot spurned back the Ocean's roaring tides[13].

అని సముద్రతీరాన్ని సజీవంగా చిత్రించారు.

---

12. Shekespeare, Sonnet, XXXII.
13. Shakespeare, 'King John'II, 1, 23-24.

వీనస్ ఎడోనిస్ చేతిని తనచేతిల్లోకి తీసుకోవడం కవికి

A lily prisoned in a gaol of snow
Or ivory in an alabaster bond[14]

గా కనిపించింది. ఒక మానసిక స్థితిలో క్లియోపాత్రాకి మృత్యువు

A lover's pinch
which hurts and is desired[15]

గా కనిపిస్తుంది. ప్రేమకోసం ఆత్మార్పణం చేసుకున్న క్లియోపాత్రా మనస్తత్వాన్ని ఈ కావ్యబింబం సంపూర్ణంగా చిత్రించగలిగింది. షేక్‌స్పియర్ తన నాటకాల్లో వ్యక్తిగతంగా కనిపించకపోయినా తన కావ్యబింబసృష్టివలన తన అభిరుచులని, అభిమానాలని సూచించ గలిగాడని విమర్శకులు అంగీకరించారు. ప్రకృతిని తన కళ్ళతో కాక పుస్తకాల కళ్ళతో పరిశీలించాడనే విమర్శకి గురిఅయినా, మిల్టన్ ప్రకృతిని తన కవిత్వంలో అందమైన శబ్దచిత్రాల ద్వారా ప్రదర్శించాడు. ప్రకృతిలో ఉండే వేరువేరు రంగులని కవి దర్శించి తన కవిత్వంలో ప్రదర్శించాడు అని చెప్పడానికి "Lycidas" అనే స్తుతి గీతంలో ఈ పదచిత్రాలు నిదర్శనం.

---

14. Shakespeare, 'Venus & Adonis', 4362-63.
15. Shakespeare, 'Antony and Cleopatra', V, ii, 295.

Wanton winds and gushing brooks
On whose fresh lap the swart star sparely looks
Throw hither all your quaint enamell'd eyes
that on the green turf suck the honey'd showers
And purple all the ground with vernal flowers[16].

విరుద్ధచిత్రాలని జతపరచి నూత్న కావ్యబింబసృష్టి చేసిన కవులలో Donne వంటి metaphysical కవులు ప్రత్యేకంగా పేర్కొనదగినవారు. ప్రేయసీ ప్రియులని "two legs of compasses" లో పోల్చిన ఈ కవికి ఏమాత్రం పోలికలేని వస్తువుల్ని పోల్చి ఒక నూత్న సంబంధం ప్రదర్శించడం ప్రీతి. "The Flea" అనే ఖండికలో

The Flea is you and I, and this
Our marriage bed and marriage is[17].

అని మానవుల్ని, వివాహాన్ని ప్రేమికుల శయ్యని రక్తంపీల్చే కీటకంతో పోల్చడం ఎన్నో నిగూఢార్థాల్ని సూచిస్తోంది. వారి అవినాభావ సంబంధాన్ని

16. Milton, 'Lycidas', ll. 137-141.
17. John Donne, 'The Flea', "Poems".

The soul the fix't foot makes no show
To move, but doth, if the other doe[1]

అనే పాదాల్లో డన్ సూచించాడు. భావనాశక్తిని ఉన్నత శిఖరాలమీద అధిష్ఠింప చేసిన కవులలో ఆంగ్లసాహిత్యంలో భావకవులకి విశిష్టస్థానం ఉంది. ఈ కవితాదేశానికి అధ్యుడని వర్ణింపతగిన వర్డ్స్‌వర్త్ సామాన్యమైన కాలిబంతిని తన ఊహాశక్తితో అసామాన్యమైన కవితావస్తువుగా మార్చగలిగాడు.

The inglorious foot ball mounted to the Pitch
of the bark's flight - or shaped a rain blow curve
Aloft in prospect of the shouting field[19].

షెల్లీకి ఆకాశంలో పాడేపక్షి (skylark) "a poet hidden/in the light of thought" గా "a glow worm golden/in a dell of den" గా "a rose embower'd/in its own green leaves"[20] గాను కనిపించింది. దీనికి ఆ పక్షిలో ఉన్న సూచనాశక్తి కన్న కవి భావనాశక్తి ముఖ్య కారణం. అదే విధంగా కీట్సుకి ప్రకృతిలోని ఋతువులు మానవ జీవితంలో వివిధ అవస్థలకి ప్రతీకలుగా "Human Seasons" లో కనిపించాయి. "Ode to A Nightingale" అనే ప్రసిద్ధ ఖండికలో కీట్సు ప్రత్యక్ష పరిశీలనాశక్తిని ప్రతిఫలించే ఈ పాదాలు కనిపిస్తాయి.

---

18. John Donne, 'A Valedeition, Forbidding Mourning'.
19. W.Wordsworth, 'The Prelude'.
20. P.B.Shelley, 'Ode to Skylark'.

A beaker full of the warm south,
Full of the true, blushful Hippocrene,
with beaded bubbles winking at the brim[21].

Hippocrene ని సిగ్గుపడే యువతిగా, మాధ్వీచషకం అంచుమీద మెరిసే బిందువులు కన్నుగీటు తున్నట్టుగా ఊహించడం కీట్సు వంటి భావుక చక్రవర్తికి సహజకవితా లక్షణం. ఆ గీతంలోనే రాత్రి మృదువుగా ఉంది(Tender is the night) అని వర్ణించడంలో (Synaesthetic) సంశ్లిష్ట కావ్యబింబప్రయోగం కనిపిస్తుంది.

ఆధునిక ఆంగ్లసాహిత్యంలో టి.ఎస్.ఎలియట్‌కి యుగకర్తగా స్థానం ఉంది. ఆధునిక నాగరక జీవితాన్ని పరిశీలించి, అనుభవించి, ఈ అనుభవాలకి సంబంధించిన కావ్యబింబాలని కవిత్వంలో ప్రయోగించిన వారిలో ఎలియట్ ముఖ్యుడు. "The Love Song of J.Alfred Prufrock" అనే గీతంలో సాయంసమయాన్ని అపూర్వంగా ఇలా చిత్రించాడు.

Let us go then you and I,
When the evening is spread out against the sky
Like a patient etherised upon a table[22].

---

21. John Keats, 'Ode to A Nightingale', Ll. 15-17.
22. T.S.Eliot, 'The Love Song of J.Alfred Prufrock'.

సాయంకాలపు కళాసివీహీనతని స్పృహాలేకుండా పడివున్న రోగితో పోల్చడం నగరజీవిత అనుభవాలకి కవి పట్టిన దర్పణం. రెండవ ప్రపంచ యుద్ధానంత రపు ప్రపంచాన్ని మరుభూమి "Wasteland" అనే ప్రతీక ద్వారా చిత్రిస్తూ, ఈ ప్రపంచం "A heap of broken images" అని ఎలియట్ వర్ణించాడు. పడిపోయే కొండ జార్జ్ బార్కర్‌కి కరిగిపోయే స్త్రీముఖంగా కనిపించింది.

The falling cliff that like a melting face
Collapsing through its features, leaves a stare[23]

అంటూ పర్వతం పడిపోవడం నాగరకత శిథిలమయిపోవడానికి ప్రతీకగా కవి చిత్రించాడు. నగరజీవితంలో ముఖ్యభాగమైన వ్యాపారానికి సంబంధించిన అనుభవాలని Auden

Loss is their shadow wife. Anxiety
Receives them like a grand hotel[24]

అని వ్యాపారస్థుల ఆందోళనలని, భయాన్ని కవి కళ్ళకి కట్టినట్టు చిత్రించాడు. అధివాస్తవిక కవులలో ప్రముఖుడైన డేవిడ్ గాస్కాయిన్ విసూత్న కావ్యభింబాలని ప్రయోగిస్తూ

---

23. George Barker, 'Calamiterror'.
24. W.H.Auden , 'The Refugee' .

The face of the precipice is black with lovers:
The Sun above them is a bag of nails: the springs
First rivers hide among their hair[25].

ఆధునిక ప్రపంచంలో అస్పష్టమైన మానసిక స్థితిని అర్థరహితమైన ఉపమానాల ద్వారా కవి వ్యక్తం చేశాడు. సహస్రకిరణుడైన సూర్యుడు ఈ కవికి మేకుల మూటగా కనిపించడానికి ఈ నాగరక వ్యవస్థలోని అవ్యవస్థ ముఖ్యకారణం.

---

25. David Gascoyne, 'In Defence of Humanism'.

## ప్రాచీనాంధ్రకవిత్వం - కావ్యబింబప్రయోగం

ప్రాచీనాంధ్ర కవిత్వంలో మహాభారత రచనకి శ్రీకారం చుట్టిన నన్నయ సందర్భానుసారంగా స్మరణీయమైన కొన్ని కావ్యబింబాలు ప్రయోగం చేశారు. ఆ కావ్యబింబాలు పాఠకుని మనసులో రమణీయమైన రేఖాచిత్రాలని సృష్టించి, కవి సూచించదలచిన భావాన్ని ప్రతిభావంతంగా రూపకల్పన చేయ గలిగాయి. దేవదానవుల యుద్ధాన్ని వర్ణిస్తూ

నరచాప ప్రవిముక్త దారుణ బృహన్నారాచధారల్ భయం
కరదైతేయ నికాయ కాయములపై గప్పెన్ దిశల్నిండబం
ధుర ధాత్రీధరతుంగ శృంగ తట సందోహంబుపై గప్పడు
ర్ధర ధారా ధరముక్త సంతత పయోధారావళిం బోలుచున్

మహాభారతము, ఆదిపర్వము, ద్వితీ. ఆ. 23.

అని నన్నయ బాణధారలని వర్షధారలుగా కన్నులకు కట్టినట్లు చిత్రించారు. మృగయా వినోదియై కణ్వాశ్రమప్రాంతంలో ప్రవేశించిన దుష్యంతునిపై పూలతీవలు తమ కుసుమాక్షతల్ని జల్లిన తీరుని

లతా లలనల్ మృదులానిలా పవ
ర్జిత కుసుమాక్షతా వళులు సేసిన దట్టిన యట్టిర్పొరి సం
పత దళినే నినాద మృదుభాషల దేవన లొప్పు నిచ్చుచున్.

మహాభారతము, ఆదిపర్వము, వం.ఆ. 17.

అని ప్రతిభావంతంగా వర్ణించారు.

వివేకబ్రహ్మ అని ప్రసిద్ధిపొందిన నన్నెచోడకవి తన ''కుమార సంభవం''లో బీభత్సరసాన్ని ప్రదర్శిస్తూ అతిసహజమైన చిత్రాన్ని రచించాడు. యుద్ధరంగంలో శరీరావయవాలన్నీ ముక్కలుగా ఖండితాలై ఇదితల, ఇదిమొల అని వేరుపరచడానికి వీలులేక ఉన్నవాటిని నన్నెచోడుడు

దురమున మెడదొడ మొల
బరి శిరమురమక్కుప్రక్క బడును ములుంగె
డెరవై యేరపడ కని భీ
కర మయ్యెం జముడు కుడిచి క్రక్కిన భంగిన్

కుమార సంభవము, 11 - 194.

అని ఆ అవయవాలని యముడు భుజించి జీర్ణము చేసుకోలేక వాటి స్వస్వరూపము లో వమనము చేసుకోగా భూమిపై పడి ఉన్నట్లుగా కవి చిత్రించాడు. శివ కవులలో ప్రసిద్ధుడైన పాల్కురికి సోమనాథుడు శివుని వర్ణించే సమయంలో

తనకి పరిచితులైన గొల్లవారిని, చండాలురని దుషిల ఉంచుకుని స్వభావ సిద్ధంగా వర్ణించాడు:

ములుకత్తి నుచ్చుకోలు జాడ గొడుపు - లత్తితిత్తి
నిడిదొడ్డమొల గచ్చ కట్టి
గాలి దప్పుల నెంట్రికలు దాలియాడ - నేల
వెట్టుచు నిటిమిటి చూచుచును
గుక్కల బిలుచుచు చిక్కవెట్టుచును - నెకొన
నోరగాల నిలుచుచు జనుచు
గొడ్డలి బరిగమ్మి కూటి కుండయును - దుడ్డుగోలయుబట్టి
త్రోడి త్రోడి కొన్ని
మేక పిల్లల దన చాకటి [illegible]కి - మేక దబ్బర నాటి
నిసిరి వేయుచును
కొన్ని మేకల దొబ్బికొని చిచ్చి తుమ్ము - నున్న కాయులరాల్చి
యును నంతబోక

బసవపురాణం, III.

అని కని గొల్లవాని బాహ్యరూపాన్ని రేఖా చిత్రంగా మనముందు నిలబెట్టాడు. ఇది ఒక ఛాయాచిత్రంగా కనిపించి స్వభావోక్తి లా ఉంది. ఈ చిత్రంలో భావనాశక్తి ఎక్కువ లేదు. ఈ నాటి వాస్తవికరచనలతో ఈ చిత్రణ పోలి ఉంది.

కథాకథనశిల్పమైన, పాత్రపోషణమైన దృష్టిని కేంద్రీకరించిన తిక్కన సోమయాజి సందర్భోచితంగా తాను చిత్రించదలచిన పాత్రల స్వభావాలు పాఠకుల హృదయాల్లో చెరగని ముద్ర వేయడానికి ఉపకరించే ప్రతిభావంతమైన కావ్యబింబాలని ప్రయోగించారు. పద్మవ్యూహాన్ని ప్రవేశించి అనన్యసామాన్యంగా పోరాడిన అభిమన్యుణ్ణి తిక్కన అనన్యసామాన్యంగా ఇలా చిత్రించాడు.

కరికళేబరములు ధరణీధరములు తురంగ
గాత్రములు గ్రావసమితి
నరశరీరములు మీనములు కౌక్షేయక
క్షురికాది శస్త్రంబు లురగకులము
రుధిరార్ద్ర శరములు రుచిర ప్రవాళముల్
ప్రేవుల ప్రోవుల ఫేనతతులు
నెత్తురు వెల్లువ నీళులు భూషణ
స్తోమాస్థిచయములు తుమురలిసుక
గాగ నంబురాశి కరణి సంగ్రామ భూ
భాగ మొప్పు మిగుల భవ్యయోగ
నిద్రనున్న విష్ణునకు బాటియగుచుశో
భిల్లె నమ్మురారి యల్లుడందు.

రణభూమిని పర్వతాలు, మత్స్య మకర ఉరగాలు మొదలైనవాటితో నిండి ఉన్న అంబురాశితో కవి పోల్చడం ప్రతిభావంతమైన రూపకల్పన అభిమన్యుని మరణాన్ని చిత్రిస్తూ అతనిని చంద్రునిగా ''సితాయుధ ఖండ భూషణోదాత్త మణి ప్రవాళములు' తారలుగా కవి ఉపమించాడు. ఉత్తరగోగ్రహణ సందర్భంలో కౌరవసేనను చూసి విజృంభించిన ధనంజయుని కవి

సింగం బాకటితో గుహాంతరమునం జేడ్పాటుమై నుండి మా
తంగ స్ఫూర్జిత యూథ దర్శన సముద్యత్క్రోధమై వచ్చుచో
జంగాంతార నివాస ఖిన్నమతి నస్మత్సేనపై వేడ్క వ
చ్చెం గుంతీసుత మధ్యముడు సమరస్థేమాభి రామాకృతిన్.

మహాభారతము, విరాటపర్వము, ౯౫.

అని ధనంజయుని ఆకటిగొన్న సింహంతో పోలుస్తూ అతని అరిభయంకర పరాక్రమాన్ని మన కళ్ళముందు కవి ప్రదర్శించాడు.

సర్వజ్ఞకవితాసనాధుడు శ్రీనాథుడు తన కావ్యాలలో ప్రకృతిని వర్ణించే సందర్భాలల్లో ప్రశంసనీయమైన మౌలికతని, భావుకతని ప్రదర్శించాడు. క్షేత్ర మహాత్మ్యాన్ని వర్ణించే ''కాశీఖండం'' లో అరుణోదయాన్ని మధుర గంభీరంగా చిత్రిస్తూ

చిఱుసాన బట్టించి చికిలి సేయించిన
        గండశిగొడ్డలి నిశాగహన లతకు
గారొన్న నిబిడాంధర ధారాచ్ఛటా
        సత్వ్రవాటికి వేదిహోత్రి జిహ్వ
నక్షత్రకుముద కాననము గిల్లెడు పొంటె
        పాదియెత్తిన హస్త పల్లవాగ్ర
మరని మింటికి మంటి క్కైక్య సందేహంబు
        బరి హరింపగ బాలుడ్డ యువధి

కాశీఖండం, 1 - 121.

అని వైయక్తికమైన ప్రతిభని జోడించి, పురాతన ఉపమానాలకి చిఱుసానబట్టి, , చికిలిచేసి, నిత్యనూతనమైన కావ్యబింబాన్ని కవి సృష్టించాడు. ''శృంగార నైషధము'' లో సంధ్యావర్ణన అతి సహజంగా పంచేంద్రియానుభూతి జనితమైన వర్ణనలతో చేయబడింది. నేలకి జారుతున్న పొద్దు కవికి ''గగన హరినీల శైల శృంగమునుండి'' జరిపడిన 'జేగురుగల్లు' లా కనిపించింది. దినసాన సంధ్య ''తన్నిపాత సముద్భూత ధాతుధూళిగా'' కనిపించింది. ఈ రెండు కావ్యబింబాలు అనితర సాధ్యమైనవి, నిసర్గమనోహరాలైనవి. కవి తన ప్రత్యక్షానుభవాన్ని ఈ కావ్యబింబసృష్టిలో ప్రయోగించాడు. ఇంకా సంధ్యాసమయపు అరుణవర్ణాన్ని వర్ణిస్తూ

కుసుమం బద్దిన విధమున
బసుపున వాత్తించినట్లు, బంగారమునం
బస నిచ్చినగతి, సంధ్యా
వసరంబున నింగి యరుణ వర్ణం బయ్యెన్

శృంగారనైషధము, ఆ.8, ప. 157.

అని ఆకాశం సంధ్యాసమయంలో క్షణ క్షణం మారేరంగులు విలాసాన్ని కవి ప్రతిభావంతంగా చిత్రించాడు. శ్రీనాథుడు సంప్రదాయ బద్ధమైన శబ్దచిత్రాలని ప్రయోగించడం కంటె, వైయక్తికమైన కావ్యబింబాలని ప్రయోగించడంలో అధికమైన అభిరుచిని ప్రదర్శించి ఆధునికకవితా మార్గదర్శకుడు కాగలిగాడు.

రసవత్తరమైన, భక్తిరసనిర్భరమైన వర్ణనలపై ఎక్కువ మక్కువ ప్రదర్శించిన పోతన కవిత్వంలో హృదయాకర్షకములైన కావ్యబింబాలు ఎక్కువ కనిపిస్తాయి. సంధ్యాసమయంలో సూర్యుణ్ణి వర్ణిస్తూ

గగనారణ్య చరాంధకార గజముం గాలాహ్వయ వ్యాధుడు
చ్చుగ బట్టన్ గమకించి మచ్చిడుటకై చూతాంకుర శ్రేణిచే
వొగి గల్పించిన కందుకంబనగ సూర్యుండంత వీక్షింపగా
దగె మంద ప్రభతోడ బశ్చిమ మహా ధాత్రీ ధరేంద్రంబునన్

శ్రీమద్భాగవతమ్, దశమస్కంధము,
పూర్వభాగము, ప.1286.

అని అరుణవర్ణశోభితుడైన సూర్యుణ్ని చూతాంకురశ్రేణిచేత కల్పింపబడిన కందుకంగా వర్ణించడం అతి సహజంగా ఉంది. పోతన ఉత్తమ వర్ణనా ప్రతిభకి నరకాసురవధ సందర్భంలో కవిచేసిన వర్ణన మచ్చుతునక

జ్యావల్లీధ్వని గర్జనంబుగ సురల్ సారంగ యూథంబుగా
నావిల్లింద్ర శరాసనంబుగ సంరంభాక్షుండు మేఘంబుగా
దా విద్యుల్లలభంగి నింతి సురజిద్దావాగ్ని మగ్నంబుగా
బ్రావృట్కాలము సేసె బాణచయ మంభశ్శీకరశ్రేణిగాన్

దశమస్కంధము, ఉత్తరభాగము, ప. 182.

అని యుద్ధరంగంలో ప్రావృట్కాలాన్ని దర్శించగలిగిన నవనవోన్మేషమైన ప్రతిభ గలిగినకవి పోతన. ఇటువంటి వర్ణనలే కాకుండా శ్రీకృష్ణుని దివ్యమంగళరూపాన్ని మన కనుల ముందర నిలబెట్ట గలిగిన సుందర చిత్రాలని కూడా పోతన ఎన్నో ప్రదర్శించాడు.

నల్లని వాడు పద్మనయనంబులవాడు, కృపారసంబుపై
జల్లెడు వాడు, మౌళి పరిసర్పితపింఛమువాడు, నవ్వురా
జిల్లెడు మోమువాడొకడు

దశమస్కంధం - పూర్వభాగం - 1010.

అనే వర్ణనలో కృష్ణుని మోహనరూపం దర్శనమిస్తుంది.

ఆంధ్ర ప్రబంధ పితామహుడని వర్ణింపదగిన అల్లసాని పెద్దనకి పాండిత్యప్రాభవంతోపాటు అపూర్వమైన పరిశీలనాశక్తి కూడా పుష్కలంగా ఉంది. ప్రబంధాలలో ఉండవలసిన పురవర్ణనాది అష్టాదశ వర్ణనలని తన కావ్యవస్తువుకి అనుగుణంగా వర్ణింపచేసుకున్న ఉచితజ్ఞుడు పెద్దన ''మనుచరిత్ర'' ఆరంభంలో పురవర్ణన తక్కువగాచేసి కావ్యనాయకుడైన ప్రవరుని వ్యక్తిత్వ ఆవిష్కరణకి ఉపకరించే ''మకరాంకశశాంకుడు'' వంటి అంశాలని ప్రత్యేకంగా పేర్కొన్నాడు. ప్రకృతిని తన పంచేంద్రియాలతో పరిశీలించి, అనుభవించి ఆ అనుభవాలని తన రచనలో విరివిగా ఉపయోగించుకున్న కవులలో పెద్దన ప్రముఖుడు. కళ్ళకి కనిపించే హిమవత్పర్వత దృశ్యాలనేకాక, శ్రవణేంద్రియంద్వారా గ్రహించే వివిధ శబ్దాలని కూడా కని తన హిమవత్పర్వత వర్ణనలో అనన్యసామాన్యంగా ప్రదర్శించారు.

అట జని కాంచె భూమిసురు డంబర చుంబి శిరస్సర ఝ్ఝరీ
పటల ముహుర్ముహుర్లుఠదభంగ తరంగ మృదంగ నిస్వన
స్ఫుట నటనాను కూల పరిఫుల్ల కలాప కలాపి జాలమున్
కటక చరత్కరేణు కరకంపిత సాలము శీతశైలమున్

మనుచరిత్ర, చ. ఆ. 2, ప. 2.

ఈ వర్ణనలో కవి తన పంచేంద్రియానుభవాలని ఉపయోగించుకోవడంతోపాటు, తాను వర్ణించిన వస్తుసముదాయం భావికథాసూచకంగా ప్రయోగించడం పెద్దన విశిష్టత. ఇందులో వర్ణితమైన కరేణువు ఆడ ఏనుగు వరూధినిని, కరేణు కర కంపిత సాలము ప్రవరాఖ్యుణ్ణి సూచిస్తున్నాయి. కవి వరూధిని సౌందర్యాన్ని ఆమె శరీరంనుంచి వెలువడే సుగంధ పరిమళంద్వారా సూచించడానికి తన ఘ్రాణేంద్రియ శక్తిని ఉపయోగించి ఈ విధంగా వర్ణించాడు.

మృగమద సౌరభ విభవ
ద్విగుణిత ఘనసార సాంద్ర వీటీగంధ
స్థగితేతర పరిమళమై
మగువ పొలుపు దెలుపు నొక్క మారుత మొలసెన్.

ఆ. 2, ప. 24.

అని మగువ పొలుపుని గంధ మారుతం ద్వారా కవి తెలియచేయడం ఇందులో విశేషం. ప్రకృతి వర్ణనలో పెద్దన ప్రశంసనీయమైన ప్రతిభని ప్రదర్శిస్తూ, సూర్యాస్తమయాన్ని

తరణి యిదె క్రుంకుచున్నా
డరుదెమ్మని చంద్ర బిల్వ నరిగెడు రజనీ
తరుణ మణి దూతిక లన
నరిగెన్ దూర్పునకు నేడ లతి దీర్ఘములై.

అని వర్ణించాడు. తృ.ఆ. ప. 13.

ఆంధ్రభోజుడని కీర్తినార్జించి, కవిపోషకునిగా, స్వయంగా కవిగా ఆంధ్రసాహిత్యంలో అనన్యసామాన్య స్థానాన్ని సముపార్జించిన శ్రీకృష్ణదేవరాయలు తన ''ఆముక్తమాల్యద'' లో విలుబుత్తూరి వర్ణన అద్భుతంగా చేశాడు. తామరమొగ్గల్లా మలచిన కెంపుల కలశాలు కలిగిన గృహాలు కవికి ఎర్రని శిరస్త్రాణాలు ధరించినట్లుగా కనిపించడం ప్రశంసనీయం. ఆ పురంలో కాలువల ప్రక్కనున్న బాతుల్ని స్నానార్థులై ఆ కాలువ కొచ్చిన బ్రాహ్మణుల అంగవస్త్రములతో ఉపమించడం కవి నిశిత పరిశీలనాశక్తిని సూచిస్తోంది.

తల పక్షచ్ఛటఁ గ్రుక్కి బాతువులు కేదారంపు గుల్యాంతర
స్థలి నిద్రింపఁగఁ జూచి యారెకులు సుస్నాతప్రయాత ద్విజా
వళి పిండీకృత శాటుల న్నవి దదావాసంబు జేర్పంగరే
వుల డిగ్గ న్వెస బాఱు వానిఁగని నవ్వ న్వ్రాలి గోపోఘముల్.

ఆముక్తమాల్యద, ఆ.1, ప. 65.

వర్షర్తు వర్ణనలో రాజకవి తన ప్రత్యక్ష పరిశీలనాశక్తిని వెల్లడిచేశాడు. వడగండ్లని బాలదంతాలతో పోల్చడం ఒక అపూర్వ భావన. ఈ భావనకి కవి నిశిత జీవన పరిశీలన ఆధారం. అతి సహజమైన లోకవాస్తవికతకి కవి ప్రతిభ కలిగించే అద్భుత కవితాశక్తిని వెల్లడిస్తూ

కృతపయః పాననవ మేఘ పృథు కములకు
రాలె నొరయున వడగండ్లు పాలపండ్లు
మది బలాకా ద్విజాళి సంప్రాప్తి గలిగె
బెరుగ బెరుగంగ ధ్వనియు గంభీరమయ్యె.

ఆ.4, ప. 82.

అని పసిపిల్లల పాలపండ్లురాలి మళ్ళీవచ్చే దంతపంక్తిని వర్షధారలకి మురిసే కొంగల బారుతో కవి పోల్చాడు. గ్రీష్మర్తు వర్ణనలో కూడా కవి తన పరిశీలనా శక్తిని వ్యక్తంచేస్తూ

తారుణ్యాతిగ చూతనూత్న ఫలయుక్కాలాభిఘారస్వన
ద్వారా ధూపిత శుష్కదంబు హృత మాత్సర్యోద్ధత పాకోద్గతో
ద్గారంపుం గనరారు భోగులకు సంధ్యావేళలం గేళికాం
తారాభ్యంతర వాలుకాన్విత హిమాంతర్వారి కేళాంబువుల్.

ఆ. మా. ఆ. 2, ప. 69.

అని తన రాజ్యంలోని ప్రజల ఆహారపు అలవాట్లతో తనకున్న పరిచయాన్ని కవి వెల్లడించడం కవి భావుకుడేకాక సామాజిక స్పృహ ఉన్న బాధ్యతాయుతుడైన ప్రభువుగా వెల్లడిస్తోంది.

పదగుంఫనానికి ప్రసిద్ధికెక్కిన ''పాండురంగమాహాత్మ్య'' కర్త తెనాలి రామకృష్ణ కవి ప్రతిభావంతమైన వర్ణనా నిపుణుడు. పాండురంగ మహాత్మ్యములో ఈ కవి సందర్భోచితంగా మనోహరాలైన కావ్యబింబాలని ప్రయోగించాడు. పాండురంగమూర్తిని ఆయా ఋతువులలో అర్చించే విధానాన్ని చిత్రిస్తూ గ్రీష్మర్తువులో అర్చనావిధానాన్ని

గంగ గాటుక కొండ గప్పునొప్పిదము దళొత్తనావుల పాలనేలార్చి
బలితంపు నురువు జొంపము ధాప్త రాష్ట్రంబు జుట్టిన క్రియ దెల్లపట్టుగట్టి
ముదురు వెన్నెల యొప్పు మున్నీటి గమిచి పట్టిన లీల గ్రొలజందనమ్ము బూసి
వడగండ్లు పొదువు శాద్వల మహిబొల్పు పొల్పుగ మల్లెపువ్వుల .బూజచేసి
మండు వేసవి వాసవి మనుపుకాపు విబుధ తతిపాలి వేదరవెల్ల మ్రొక్కు
భక్త సులభుని దెలిచి పూంపేక్కభూరి భక్త భోజాటులరిఖపభద్రియొదవు.

పాం. మ. ఆ.2, ప.109.

అని వర్ణిస్తూ నల్లని కృష్ణుని విగ్రహాన్ని తెల్లని ఆవుపాలతో అభిషేకం చేయగా స్వచ్ఛమైన గంగాప్రవాహం నల్లని అంజనాద్రిని కప్పినట్టుందని, కృష్ణుడా నల్లని కాళ్ళు, ముక్కు గల హంసలా అతనికి చుట్టిన పట్టువస్త్రం నురుగుజొంపములా, కృష్ణుడు నల్లని సముద్రంలా అతనికి పూసిన చందనం తెల్లని వెన్నెలలా, కృష్ణుడు పచ్చిక బయలులా అతనికి కైసేసిన మల్లెపూలు వడగండ్లలా ఉన్నాయని కవి మనోహరంగా, సహజసుందరంగా చిత్రించాడు. ప్రబంధరచనలో ముద్దుపలుకులకి ప్రసిద్ధిచెందిన ముక్కు తిమ్మన ''పారిజాతాప హరణం'' ఇష్టదేవతాస్తుతిచేసే సందర్భంలో చంద్రుని స్తుతి ప్రత్యేకంగా పేర్కొన దగింది. దీనికి కృతిపతి

వంశకర్త అయిన చంద్రుణ్ణి వర్ణించడం ఒక కారణం. కావ్యంలో ప్రధానరసమైన శృంగారాన్ని సూచించడానికి చంద్రుణ్ణి స్తుతించడం జరిగి ఉండవచ్చు. అంతే కాక తన కావ్యంలో ప్రధానమైన వస్తువు పారిజాతాన్ని సూచించడానికి కూడా చంద్రుణ్ణి

వలిమల యల్లువాడు తలవాక ధరించిన పూవుగుత్తి

పా., ఆ.1, ప. 6.

అని వర్ణించాడు. తిమ్మన పరిశీలనాశక్తి,లౌకిక జ్ఞానం చంద్రోదయవర్ణనలో మనకి సాక్షాత్కరిస్తుంది.

పొందుగ బశ్చిమాబ్ధితట భూస్థలి నంశు మదంశు సత్వలా
కందము వాసరాంతహాలిక ప్రవరుండిడ సాంధ్యవారి భూ
త్కందళము ల్మొదళ యుతంబులు నై గెలపండినాలెబా
ర్యేందుని వేర బ్రాచినది పేతువు వెన్నెల కల్కి కల్కికిన్

పా. హా. ఆ.2, ప.42.

అని చంద్రోదయాన్ని తూర్పున అరటిగెల వేయడంవలన వచ్చేసంపదగా కవి చిత్రించాడు. లోక ప్రసిద్ధమైన విశ్వాసాన్ని ఆధారం చేసుకుని తన పరిశీలనలో ఉన్న ప్రకృతి దృశ్యాలని అరటిచెట్టుకి సంబంధించిన వివిధ దశలతో పోల్చి కవి తన పరిశీలనాశక్తిని వెల్లడించాడు.

ప్రబంధ యుగానంతరం కావ్యాల్లో పురవర్ణన తప్పనిసరి కాసాగింది. ఈ వర్ణనలు దీర్ఘసమాసాలతో చేయబడసాగాయి. వీటికి ''మనుచరిత్ర''లో వరణాద్వీపవతీ తటాంచలమునన్'' వంటి వర్ణనలు ఒరవడి పెట్టాయి. చేమకూర వెంకట కవి తన ''విజయవిలాసం''లో ఇంద్రప్రస్థపురాన్ని వర్ణించే సందర్భంలో ఈ సంప్రదాయాన్ని అనుసరిస్తూ

> చంద్ర ప్రస్తర సౌధ ఖేలన పరస్త్రీమా కుచద్వంద్వని
> స్యంద్ర ప్రతతమాలిప్త గంధకలనా సంతోషిత ద్విభునీ
> సాంద్రప్రస్ఫుట హాట కాంబురుహ చంచచ్చంచరీకోత్కరం
> బింద్రప్రస్థపురంబు భాసిలు రమావేలా కళావాసమై

అని ఇంద్రప్రస్థ పురంలో సౌధాలు ఆకాశాన్ని స్పృశించేటంత ఉన్నతమైనవి కావడం వలన ఆసౌధాల్లో స్త్రీలు అలదుకునే కస్తూరి స్వర్గంలోని తుమ్మెదలని ఆనందపరస్తున్నాయని అతిశయోక్తియుతంగా కవి వర్ణించాడు. ఇందులో కొంత సహజవర్ణన లేకపోలేదు. మేడలు తెల్లనవి, అందువలన అని సౌధాలు. ఆ సౌధాల్లో స్త్రీలకుచద్వంద్వాలు బంగారు వన్నెగలవి. వారు అలదుకున్న కస్తూరి లేపనాలు నల్లనివి. స్వర్గంలో ఆకాశగంగ తెల్లనిది. అందులో ఉండే పద్మాలు బంగారు వన్నెగలవి. వాటిపైనుండే తుమ్మెదలు నల్లనివి. ఈ విధంగా కవి బహు చమత్కారంగా భూలోకంలో ఇంద్రప్రస్థపురానికి, స్వర్గంలో ఆకాశగంగకి బింబ ప్రతిబింబ భావం రూపొందించాడు. అయినా ఇది సహజత్వానికి బహుదూరంగా ఉండి అతిశయోక్తిపాలు ఎక్కువైనట్టు కనిపిస్తుంది.

## ఆధునికాంధ్ర కవిత్వం - కావ్యబింబ ప్రయోగం

ఆధునికాంధ్ర కవిత్వంలో గురజాడ అభ్యుదయ పథ నిర్దేశకుడు. సామాన్య మానవుణ్ణి మకుటాలంకృతుణ్ణి చేసిన మానవతావాది. ప్రారంభదశలో గురజాడ ''అనుక్రమాలంకద'' వంటి ప్రబంధాల ప్రభావాలకి లోబడి ప్రాచీనానికలు, విటులుచేసే నర్మసంభాషణలని, వర్ణనలని తమ రచనలలో ప్రయోగించారు. ''సుభద్ర'' కావ్యంలో నాయిక వర్ణన ప్రబంధ ధోరణిలో ఇలాసాగింది.

చెలరేగు ముంగురుల్ చేర్చి కట్టిన జడ
యిరులమై రిక్కల కరణి వెలుగ
మైట పై దూగాడు ముత్యాల హారముల్
చలదింద్ర చాపంబు చాటు జూప.....[1].

అని కవి సుభద్రని వర్ణించారు. కాని ఇటువంటి గతాను గతికమైన వర్ణనల మీద కవికి మోజులగ్గి తన ప్రజ్ఞకి తగిన కవిత్వ మార్గాన్ని అన్వేషించసాగారు. ఈ అన్వేషణలోనే కవి కావ్యవస్తువుని సమకాలీన సమాజం నుంచి స్వీకరించి, ఆ వస్తువుకి తగిన ప్రజలభాషని, వర్ణనలని ప్రయోగించారు. కవిత్వంలో వాస్తవికతని ప్రవేశపెట్టినా, అయినది నీరసమైన వాస్తవికత కాదు. శ్రీశ్రీ చెప్పినట్లు అయున వాస్తవికత వట్టి ఫొటోగ్రఫీ కాదు, ఎక్సురే ఫొటోగ్రఫీ[2]

---

1. గురజాడ అప్పారావు, ముత్యాల సరాలు ( తృతీయ ముద్రణ )
2. సి.నారాయణరెడ్డి, 'ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు, ప్రయోగములు' లో ఉదాహృతం, 206.

తమ సుకుమార భావనలని అలతి పదాలతో చిత్రించడం వీరి ప్రత్యేకత. పూర్ణమ్మలో దీనికి తగిన ఉదాహరణ.

వెలుగు నీటను గ్రుంకె చుక్కలు
చదల చీకటి కదల బారెను.....
మేలుకొలుపులు కడికూసెను
విరులు కన్నులు విచ్చిచూసెను[3].

పుత్తడి బొమ్మగా తీర్చిదిద్దిన పూర్ణమ్మని చిత్రిస్తూ కవి ఆమె నడకలు 'పళ్లను మీరిన తీపి' కలవని, ఆమె నడకలో అందంతో పాటు మాధుర్యగుణాన్ని కూడా కవి ధ్వనింప చేశారు. ఈ మాధుర్యం ఆమె మనో లక్షణానికి సంబంధించింది. ఆమె మనసులోని మాధుర్యమే ఆమె నడకలలో కూడా కనిపిస్తోందని డా.నారాయణ రెడ్డి వివరించారు[4]. ''లవణరాజు కలలో'' నాయిక పాటపాడిన ఘట్టాన్ని వర్ణిస్తూ

పాట పాడెను, చెట్టు చేమలు కొటి చెవులను గోళియలరగ
లాటి వనమున నాగి చంద్రుడు తాను చెవి యొగ్గెన్

అని ప్రకృతిని పరవశింపచేసే సంగీతాన్ని మన కన్నులముందు కవి ప్రదర్శించారు.

---

3. గురజాడ అప్పారావు, 'ముత్యాలసరాలు'.
4. డా.నారాయణరెడ్డి, Ibid , 208.

నవాంధ్రకవిత్వంలో భావకవిత్వమార్గానికి నిర్దేశకులై, యుగకర్తగా సంభావింపబడిన ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారు నిసర్గ రమణీయమైన కావ్యఖండాలని తమ కవిత్వంలో ప్రదర్శించారు. ''లలిత'' అనే పేరి కావ్యం 'హార్మిట్' అనే ఆంగ్లకావ్యానికి అనుసరణ అయినా అందులో చీకటిని

జగమను విచిత్రనాటక శాలయందు
తరణి యస్తంగతుడైనతరి, విషాద
భరముసూప దించిన నీలి తెరయనంగ
అంధకారంబలమె దిశాబంధురముగ.

లలిత, 'అభినవకవిత', 195.

అని స్వతంత్రంగా చిత్రించారు. కావ్యంలో వర్ణనలు వర్ణనల కోసమే కాక కవితావస్తువుని సూచించడానికి, కవి ఉద్దేశాన్ని, హృదయానికి హత్తుకునేలా చెప్పడానికి వర్ణన ప్రయోగించడం ఉత్తమ కవితాలక్షణం. ''స్నేహలత'' అనే కావ్యఖండికలో

నితసంధ్యా కుమారీ మణిమతల్లి
కటుచీర వెలుంగులు కాలువిల్కి
అస్త గిరి మస్తకమున సనస్తకాంతి
కాయుడగు సూరభగవాను చాయలలమె.

స్నేహలత, 7

అని సూరాస్తమయాన్ని వర్ణించడంలో స్నేహాలత ఆత్మార్పణాని కవి సూచించారు. ''తృణ కంకణం''లో నాయికానాయకులు తమ చిననాటి ప్రేమభావాన్ని అధిగమించి ''అంతరంగంబుల నతుకంగ జాలిన అపూర్వపు లంకె యే స్నేహమని'' గ్రహించి ఉన్నతమైన అమలిన శృంగార భావాన్ని పెంపొందించుకున్న స్థితిని

కడిగిన మృగమద పాత్రిక
విడువని పరిమళము పగిది, విధినియమములన్
విడబడియును వారలవెం
పుడు మైత్రీప్రేమ బంధములు తెగనవురా

తృణకంకణం, 24.

అని వర్ణించారు. ''మిశ్రమంజరి'' అనే కవితా సంకలనంలో మంగళమాఘం రాయప్రోలువారి ఋతు వర్ణనా ప్రతిభకి మచ్చుతునక. తొలకరిలో మబ్బులని

కొప్పుకందని కురులపోలిక
వెదలి చెదరిన వెయ్యిలట్టుల

మంగళమాఘమ్, ''మిశ్రమంజరి'', 46.

కనిపించినట్లుకవి వర్ణించడం ఆయన పరిశీలనాశక్తిని వ్యక్తం చేస్తోంది
వర్షాకాలపు చీకటిని కవి మౌలిక ప్రతిభతో

జున్నుగడ్డల భంగి చుక్కలు
వెన్నెలను వెరుగన్నమట్టుల
మ్రింగె దెయ్యమువంటి చీకటి

మిశ్రమంజరి, 46.

అని వ్యక్తిగతమైన తమ అనుభవాన్నిప్రకృతి పరిశీలనతో జోడించి నిసర్గ
మనోహరంగా చిత్రించారు. శరత్కాలపు మబ్బులని

స్నానమాడిన చా నలటనట
నీళ్ళుపిండి బయళ్ళనరచిన
చీరలు

మిశ్రమంజరి, 47.

అని సహజ సుందరంగా రూపకల్పనచేశారు. భావకవితా పతాకని అత్యున్నత
శిఖరాలమై ఎగురవేసి, ఆ కవిత్వానికి బహుళ జనాదరణ, సాహిత్యగౌరవం
కలిగించిన ఘనత దేవులపల్లి కృష్ణశాస్త్రిగారికి దక్కింది. ఆత్మాశ్రయ కవిత్వానికి
ఉజ్జ్వలమైన ఒరవడిదిద్ది, సమకాలీనులైన, తదనంతర కవులమైన చెరగని

ముద్రవేసి, కవిని ఉన్నతస్థాయిలో నిలబెట్టి ''దిగిరానుదిగిరాను దివినుండి భువికి'' అనే ఆత్మన్యోరాన్ని ఈ తరహా కవులకి వీరు కల్గించారు. తమ జీవితంలోని అనుభవాలకి అక్షర రూపకల్పనచేసే సందర్భంలో కవి తత్త్వతః దుఃఖాన్నే ఎక్కువగా గ్రహించడం జరిగింది. ఈ విషయాన్ని ముచ్చటిస్తూ, శ్రీ తల్లావజ్ఝల శివ శంకరశాస్త్రిగారు ''దుఃఖమే ఈయన భావతరంగిణిలో ద్వితీయ వేణిక..... దుఃఖమే ఈయనకు ప్రియతమమని తోచును'' అని అభిప్రాయపడ్డారు[5]. షెల్లీ అన్నట్లు 'Our sweetest songs are those of saddest thoughts' అని ఈ కవి కూడా భావించి ''అమల మోహన సంగీతమందు హృదయదళన దారుణ రోదన ధ్వనుల'' ని ఈ కవి వినగలిగారు. తాము ''అనంత శోక భీకర తిమిర లోకైకపతిని'' అని వర్ణించుకుంటూ తమ భార్య మరణాన్ని

నావిరుల తోట వెంచుకొన్నాడ నొక్క
పవడపు గులాబిమొక్క నాప్రణయజీవ
నమ్ము వరషమ్ముగా ననయమ్ముకురిసి
..... అల్లదిగియె.

---

5. తల్లావజ్ఝల శివ శంకరశాస్త్రి, 'కృష్ణపక్ష సింహావలోకనం' ''కృష్ణపక్షం'', పుట, XVIII.

నొక్క క్రూరార్క కిరణమ్ము, ఉర్వివ్రాలి
నా గులాబి సోలి తూలి నన్నువీడె

కృష్ణపక్షం, 44.

అని భార్యపై తమ ప్రేమని అతి సుకుమారంగా తెలియచేయడానికి ఆమెని పసడపు గులాబితో పోల్చి, ఆమె మరణ కారణాన్ని క్రూరార్క కిరణంగా కవి చిత్రించారు. ఈ శబ్దచిత్రాలు సంప్రదాయ బద్ధమైనవైనా కవి వీటిని ప్రయోగించిన సందర్భం నవ్యమయింది. తమ స్నేహ ప్రియత్వాన్ని వెల్లడిస్తూ

నేను గగన
పథవిహార విహంగమ పంక్తిని, నేను
మోహన వినీల జలధరమూర్తి

కృష్ణపక్షం, 8.

అని ప్రకృతిలోని స్నేహ ప్రతీకలతో తమ అవిభాజ్య సంబంధాన్ని కవి ప్రకటించారు. చందమామని వర్ణిస్తూ

నీలాభ్ర సరసిలో నిండు జాబిల్లి
రాయంచ వలె విహారము సల్పుచుండె

కృష్ణపక్షం, 25.

నని లలిత భావనని కవి వెలువరించారు. శిథిలమైన తమ జీవితానికి క్రొత్త వెలుగుని సంతరించ గలిగే సౌభాగ్యవతిగా తమ తల్లిని చిత్రిస్తూ 'పల్లకీ' అనే కవితా సంకలనంలో ''మా అమ్మ'' అనే ఖండికలో

పొడుపు బంగరు నెలుం గొడలంత పూసిన
సరణి క్రొంబసుపు పచ్చని మొలాము,
ఆకాశఫాల మధ్యాన దిద్దిన క్రొత్త
అరుణ మండలము చెందిరపు బొట్టు,
తొలిపొద్దు పులుగుల కల కూజితములైన
కాలిగుందెల కడియాల రవళి,
ప్రత్యూష తుషారార్ద్ర పారిజాతమువోని
కరుణారస స్విన్న దరహాసతము

పల్లకీ, 2.

అని వర్ణిస్తూ తమ మాతృమూర్తి స్వరూపాన్ని ప్రకృతిలో దర్శించగలిగారు.

ప్రకృతి రామణీయకతని, ప్రణయార్ద్రభావనని కవితలో హృదయంగమంగా రూపకల్పన చేసిన అబ్బూరి రామకృష్ణారావుగారు భావకవితోద్యమంలో 'శిల్పి' గా పేర్కొనదగినవారు. ప్రకృతి పరిశీలనని వెల్లడిస్తూ ''మల్లికాంబ'' అనే కవితా సంపుటిలో 'విభీతగీతి' అనే ఖండికలో ప్రభాతకాలపు మలయానిలాన్ని

ఊగెడు పారిజాతముల నుయ్యెల లూగుచు చిక్కి కొమ్మలన్
డాగి కుహూర గంధముల నాచికొనం బుపురేకులాడి, లే
దీగెల జిక్కువెట్టి పూతతేయువతీమణి చేరకొంగులన్
లాగుచు నవ్వుటాలకు వనమ్ముల కేగు..... ।

ఊహాగానము, ఇతరకృతులు, 57.

నని వర్ణించారు.

స్వయంగా వ్యవసాయ క్షేత్రజ్ఞుడై, సాహిత్య క్షేత్రంలో కూడా కావ్య సస్యాలని పండించిన కవికోకిల దువ్వూరి రామిరెడ్డి, తను వ్యవసాయానుభవాలని, పంటపొలాలలో తనకున్న గాఢ పరిచయాన్ని పురస్కరించుకుని ''కృషీవలుడు'' వంటి కావ్యాలలో వ్యవసాయ భావచిత్రాలు ప్రతిభావంతంగా చేశారు. ''ఇతరుల్ భగ్నాశులై ఈర్ష్యలో / నన్నుం గర్షకపక్షపాతియని నిందావాక్యముల్ వల్కరే'' అని ఒకింత బాధపడినా వీరి కవిత్వంలో అనుభవానిష్కరణ వ్యవసాయ సంబంధిగా ఉండటం ప్రత్యేకంగా పేర్కొనదగిన విశేషం. ''కృషీవలుడు'' లో ఉషాకుమారిని కాపుదిల్లాలితో పోలుస్తూ,

ఉషయనెడు కాపుటిల్లాలు పొన్నురాజ
నముల వరియెన్న గంప గేహమునదింప
సంబరంబున నెగురుచు సరసజేరు
పిల్లలన బులుగుపిట్టలు మింటికెగసె

కృషీవలుడు, పద్యం. 6.

అని పల్లెలలో ప్రతినిత్యం ప్రభాతసమయాన కనవచ్చే పక్షిగణాల్ని చిన్నపిల్లలతో పోల్చి అతిసహజంగా కవి మనకళ్లముందు నిలబెట్టారు. పొలాలలో గరిక పోచల మీద మెరిసే మంచు బిందువులు సూర్యకిరణాల కాంతిలో తేలుతూ కవికి మంచి ముత్యాలుగా కనిపించిన ప్రకృతి రమణీయ చిత్రాన్ని

గనిమల తుంగకున్ గటికకాడల నల్లిన సాలెగూళ్లన
న్నని పటికంపు మంచు పడి నాణెపుముత్యె సరాల పోలికం
గనుగొన రమ్యమయ్యె రవికాంతుల దేలుచు,

కృషీవలుడు, ప. 20.

ఉహ్నాయని తమ ప్రకృతి పరిశీలనకి భావనాశక్తిని జోడించి నిసర్గము హారమైన చిత్రాన్ని కవి సృష్టించారు. కవి ప్రకృతిలో యథార్థాలని పరిశీలించడమేకాక , తన భావనాశక్తిని కూడా వినియోగించడం అవశ్యకం. ఈ ప్రతిభ రాయప్రోలు రెడ్డి గారి ''జలదాంగన''లోను ''పలితకేశము'' లోను వ్యక్తమయింది. ఆకాశం లో నక్షత్రాలని

గగన రత్నాకరంబు నాగ్రహమునొంది
కాలమనెడు నగస్త్యర్షి, కమలబాంధ
వాంశు నీరమ్ముగ్రోలిన నసటదోచు
రత్నములనంగ నక్షత్రరాజి మెఱయు

జలదాంగన, పద్యం, 7.

నని ఉత్ప్రేక్షాపూరితంగా ప్రబంధధోరణిలో కవి చిత్రించారు.

ఆధునికాంధ్ర కవిత్వంలో సంప్రదాయ దిగ్విజయ స్తంభంగా, ఉన్నతంగానిలిచిన విశ్వనాథ సత్యనారాయణగారు తాను ఎన్నుకున్న కావ్యవస్తువుకి తగిన సహజమైన, సరళమైన కావ్యశిల్పంబాలని ప్రయోగించారు. వారి భావుక శక్తి ''కిన్నెరసాని''లో మనకి అధికంగా కనిపిస్తుంది. కిన్నెరసాని బాహ్య స్వరూపాన్నే కాక అమె మానసికస్థితినికూడా కవి అతినైపుణ్యంతో ప్రదర్శించారు.

ఆమె దుఃఖాన్ని

బొట్టు బొట్టుకొక వేయి యెదలుగా
తరగ తరగకొక వేయి నళ్ళుగా
బడలినే రమ్మో యేడుపుమయమ్మో

కిన్నెరసానిపాటలు.

నట్టు చిత్రించారు. అలాగే కిన్నెర స్త్రీరూపాన్ని విడిచి నదిగా మారడాన్ని

బంగారు తీగలో పానకమ్మో పోయె
కొబ్బరిపాలు వాకలు కట్టినట్లుయ్యో
వెయ్యావు లొకసారి పితికినట్లో పోయె.

నని కిన్నెరసాని జలాల తీయదనాన్ని, కమ్మదనాన్ని, స్వచ్ఛతని మనకి అనుభవైక వేద్యం చేశారు. ఈ కవికి పల్లె ప్రాంతాలలో ప్రకృతి దృశ్యాలు, పంటసీమలు పరిచితమైనవి. ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ వెన్నెలని

కరి కరికొత్తత్రోవ కరకట్టగ బోసిన నింగిలోని జం
దిరుడను తూమునన్ మెరపుతేవల చెర్వులనుండి దంపతి
స్ఫుర దురుచేతమున్ పొలముబోదెల వెంబడి బర్వులెత్తుచున్
విరిసిన జాలు వెన్నెలలు.....

శశిదూతము, 18.

అని చిత్రించారు. సీతారాముల దివ్యసుందరరూపాలని పాఠకులకి సాక్షాత్కరింప చేస్తూ ''శ్రీ మద్రామాయణ కల్పవృక్షం''లో

అలుపములు రెండు మూడు ముత్యాలు నిలిచి
సీతపాపటలో జీరు చెమటల్పోసె
వాల్కుక్రొని గందపూత ముత్యాలు రెండు
రామచంద్రుని మేన దారకలు పొలిచె

శ్రీ మద్రామాయణ కల్పవృక్షము,
బాలకాండము, 84 పద్యం.
వల్లీ పబ్లికేషన్స్, విజయవాడ, 1976.

నని రమణీయ కావ్యబింబాన్ని ప్రదర్శించారు.

జానపదుల నిసర్గమనోహరజీవితాలకి దర్పణం పట్టిన నండూరి సుబ్బారావుగారు తమ ''ఎంకి పాటల''లో సహజసుందరమైన కావ్యబింబాలని సృష్టించారు. ''నవిలి ఫింగిన నాయెంకి'' అని ఎంకిని వర్ణిస్తూ ఆమె స్వరూపాన్ని

మెళ్లో పూసలపేరు
తలలో పూవులసేరు
కళ్లెత్తితేసాలు
కనకాబి నేకాలు

'నమిలిమింగిన నాయెంకి'
'ఎంకి పాటలు', 12.

అని చిత్రించారు. రాత్రిసమయంలో నిశ్శబ్దంగా ప్రవహించే ఏటికి ప్రతిభావం తమైన రూపకల్పనచేస్తూ నండూరి ''యొలుతురంతా తేసి యేరు నెమరేసింది'' అని చిత్రించారు. ఆంగ్లభాషా మర్యాద ప్రభావం ఉన్నప్పటికీ[6] తెలుగులో సహజంగానే ధ్వనించే విధంగా ఆకాశాన్ని వర్ణిస్తూ

ఆకాశ మావొ రస
ఆవులించిన రేయి

'కలత నిదర', ''ఎంకి పాటలు'', 55.

అని జడ ప్రకృతికి చైతన్యస్ఫూర్తిని కవి కల్పించారు.

---

6. ఈ కావ్యబింబానికి తిరుమల రామచంద్ర చేసిన వ్యాఖ్య, ''ఇది పూర్తిగా నోరార చేసిన ఆంగ్లేయుల ఆవులింత'', సాహితీ సుగతిని స్వగతం, భారతి, జూన్ 1959, పుట, 67.

ఆధునికాంధ్ర కవితా రథాన్ని అభ్యుదయ మార్గాన్ని పట్టించి, భూకంపం పుట్టించిన శ్రీరంగం శ్రీనివాసరావుగారు ( శ్రీశ్రీ) తమ ''యువకాశల నవపేశల సుమగీతావరణంలో'', ప్రభవోదయకాలంలో భావకవితాప్రవాహంలో పగడాల పడవల్లో ప్రయాణించిన వారే. తమ వ్యక్తిత్వాన్ని వెలువరిస్తూ, తమ స్వంత గొంతుకని వెతుక్కుంటూ 1933 జూన్ 2వ తేదీన శ్రీశ్రీ మ్రోగించిన ''జయభేరి'' అభ్యుదయ కవితావిర్భావానికి మంగళతూర్యరావం. తెలుగు కవిత్వంలో శ్రీశ్రీ సాధించిన విప్లవం కార్మిక వర్గపు కళ్యాణానికి, శ్రామిక లోకపు సౌభాగ్యానికి మాత్రమే సంబంధించిందికాదు. ఆయన ఎన్నుకున్న భాష, ఛందోరీతులు, కావ్యబింబ సముచ్చయం కూడా ఆయన అతినవ్యధోరణిని, వైయక్తిక ప్రతిభని వెల్లడించాయి. ప్రపంచంలో సంఘ సౌభాగ్యానికి వ్యక్తి ఆత్మార్పణ అవశ్యకతని

నేనుసైతం
ప్రపంచాగ్నికి
సమిధ నొకటి ఆహుతిచ్చాను.

'జయభేరి', ''మహాప్రస్థానం'', 21.

అని వెల్లడించారు. తమ సౌందర్యారాధనని

నేనుసైతం
ప్రపంచాబ్జపు
తెల్లరేకై పల్లవిస్తాను.

'జయభేరి', ''మహాప్రస్థానం'', 22.

అని వెల్లడించారు. ప్రతిభావ్యుత్పత్తులు, అద్వితీయమైన మౌలికత ఫలంగా ఉన్న శ్రీశ్రీ కవిత్వంలో కవి భావవైవిధ్యాన్ని వ్యక్తీకరించే కావ్యబింబాలు అనేకం ప్రత్యక్షం అవుతాయి. వీటిలో ప్రముఖమైన బింబాలని కొన్నింటిని మాత్రమే పరిశీలించడం సాధ్యం అవుతుంది. ఒక నూతన సాంఘిక వ్యవస్థ సృష్టిని, నూతన కవితావిర్భావాన్ని కవి ''అవతారం'' అనే ఖండికలో ఎన్నో పురాణ ప్రతీకలని ప్రయోగించి సూచించారు. ఇందులో ''యముని మహిషపుల లోహ ఘంటలు'' ''నరకలోకపు జాగిలాలు'' ''సప్తహయములు'' ''కనకదుర్గా చండసింహం'' వంటి ప్రతీకల ప్రయోగంలో కొంత స్పష్టత లోపించి విమర్శకులకి వివిధ అర్థాల్ని స్ఫురింపించాయి[7]. తెలుగు కవిత్వంలో నవ్యతానికి, ఔచితానికి అధికప్రాధాన్యాన్నిచ్చిన కావ్యబింబాలసృష్టి ''ఒకరాత్రి'' అనే ఖండికలో శ్రీశ్రీ ప్రారంభించారు. బహుళపంచమి జ్యోత్స్నని చిత్రించడంలో కవి అపూర్వమైన ప్రజ్ఞని ప్రదర్శించారు. ఆ రాత్రి ''కరి కళేబరంలా కదలదుకొండ'' అని అతిసహజంగా చిత్రిస్తూ

ఆకాశపు టెడారి
లో కాళ్ళుతెగిన
ఒంటరి ఒంటెలా
గుంది జాబిల్లి

మహాప్రస్థానం, 54.

---

7. డా. జి.వి.ఎస్.సుబ్రహ్మణ్యం, 'శ్రీశ్రీ కవిత్వంలోని పురాణప్రతీకలు'
( విమర్శిని, జూన్, 1976, 126-127) అనే వ్యాసంలోను, డా. మిరియాల రామకృష్ణ 'శ్రీశ్రీ కవిత్వం' అనే గ్రంథంలోను ఈ ప్రతీకలకి వేరువేరు అర్థాలు సూచించారు.

అని జాబిల్లిని అపూర్వమైన పద్ధతిలో ఒంటరి ఒంటెతో పోల్చడం ఆయన పరిశీలనా శక్తికి, ప్రతిభకి నిదర్శనం. ''ఆకాశదీపం'' అనే ఖండికలో చీకట్లు ''గదిలో పల చినుకులవలె'' ఉన్నాయని వర్ణిస్తూ ఆ గదిలో దీపం

చీకటి బోనులో
సింహములా నిలుచున్నది
కత్తి గంటుమీద
నెత్తుటి బొట్టులాగున్నది

మహాప్రస్థానం, 56.

అని దీపాన్ని గంభీరతకి, త్యాగ అరుణిమకి సంకేతంగా కవి ప్రయోగించారు. ''బిక్షు వర్షీయసి దారిన కుంపటి విధాన కూర్చున్నది ముసల్దొకత్తె'' అని ఆమె దైన్యస్థితిని మనసుకి హత్తుకునే విధంగా చిత్రించారు. ''ఖడ్గసృష్టి'' (1966) కవితాసంకలనంలో కవితాశిల్పం కన్న రాజకీయ ప్రచారలక్ష్యం ఎక్కువని విమర్శకులంగీకరించారు[8].

---

8. అద్దేపల్లి రామమోహనరావు, 'ఈ ఖడ్గసృష్టి ఘనీభవించిన కొన్ని అభిప్రాయాల్ని, సిద్ధాంతాల్ని కవితారూపంగా మలచడానికి చేసిన ప్రయత్నం ..... సర్వతోముఖమైన శిల్పసృష్టి ''మహాప్రస్థానం''లో ఉన్నది..... ''ఖడ్గసృష్టి''లో ఆ శక్తి లేకపోయింది', 'విమర్శవేదిక', 97-98.

ఈ కవిత్వశిల్ప రాహిత్యానికి కావ్యబింబాలు తక్కువగా ఉండటం ఒక నిదర్శనం. ''ఖడ్గసృష్టి''లో కంటె ''మంత్రపుష్పం'' (1980) లో కావ్యబింబాలు మరీ తక్కువగా ఉంది. ఈ మూడవ సంపుటంలో రాజకీయ నిబద్ధత, ప్రచార ప్రాముఖ్యం ఎక్కువ అని తెలియచేస్తోంది. శరచ్చంద్రికని నూత్న దృష్టిలో అవలోకిస్తూ వెన్నెల ఆధునిక కాలంలో అసంగతమైన పదార్థమని వివరించడానికి

నవీన విశ్వవిద్యాలయాల్లో
పురాణ కవిత్వం లాగా
శ్రవణ యంత్ర శాలల్లో
శాస్త్రీయ సంగీతం లాగా

ఖడ్గసృష్టి, 9.

వెన్నెల వచ్చిందని చిత్రించారు. ఈ ఖండికలో కొన్ని రమణీయమైన కావ్యబింబాలు కనిపిస్తాయి. చంద్రుడు ''మబ్బుతునక జేబురుమాలు మాటు చేసుకుని'' నవ్వు తున్నాడని చిత్రించడం, చంద్రుడు సముద్రానికి కలిగించే శోభని కాలమే కాపాడుతుందని భావిస్తూ

ఇదిగో జాబిల్లీ నువ్వు
సముద్రం మీద సంతకం చేసేటప్పుడు
గాలి దాన్ని చెరివెయ్యకుండా
కాలమే కాపలా కాస్తుంది లే.

ఖడ్గసృష్టి, 18.

అని అన్నారు. నవ్య కవిత్వంలో అతినవ్య కావ్యబింబ సృష్టిచేసి ఒక విశిష్ట కవితామార్గాన్ని తెలుగు సాహిత్యంలో సృష్టించిన శ్రీశ్రీని యుగకర్త అని సంభావించడం సముచితం.

కవి మానసికస్థితికి, ప్రవృత్తికి అనుగుణంగా ప్రకృతిలో వివిధ పదార్థాలు అతని మనసుమై ముద్రలు వేస్తాయి. ఆకాశంలో మెరిసే నక్షత్రాలు కృష్ణశాస్త్రికి ''నింగిమూలల / నేలి పందిళ్ళు వైచి / వింతచిరుమల్లెతోట వేయించి''నట్లు కనిపిస్తే అభ్యుదయ కవిత్వానికి మార్గదర్శకులలో ఒకడైన శ్రీరంగం నారాయణబాబు

నల్లని త్రాచుకోరలు
తెల్లని మశూచి కుండలు
గగనమ్మున చుక్కలు.

రుధిరజ్యోతి.

అని అత్యాధునిక దృష్టితో చిత్రించారు. ఆధునిక అభ్యుదయ కవుల కవిత్వం పుస్తకాల్లోనుంచికాక జీవితంలనుంచి నేరుగా రావడం ఒక విశేషత. నారాయణ బాబు కావ్యబింబాలు జీవితంలో ఆయన అనుభవాలనుంచి ఉద్భవమయినవి. అందుకే వాటికి తీవ్రత, స్వచ్ఛత ఎక్కువ. గగనంలో చుక్కని ''పేదవారి కడుపుమంట / కాలి పేలిపోపుకొర్కె'' గా చిత్రించడం ఆయనకి జీవితం నేర్పిన పాఠాలకి పర్యవసానం. ఎండాకాలంలో పన్నెండు గంటల సమయాన్ని ''కాలిన గుడ్డపేలిక్క / ధూళి రేగినది'' అని వర్ణించడం, గాలిని

చచ్చిన తల్లిశవం
మెళ్ళో గజ్జెల
పట్టెడలా
ఉల్లాసంగా ఆడుకునే
పసి పిల్లాడు

'కవి', ''రుధిరజ్యోతి'' [36]

అని వర్ణించడం, ఆరుబయట మిల్లుని ''కాటకంపు / లాటకిలా'', పొగగొట్టాన్ని, ''విశ్వకర్మ హృదయంలో / దుస్స్వప్నంలా / భుగభుగమను'' నని చిత్రించడం, కవి వినూత్న భావనాప్రతిభకి నిదర్శనాలు.

భావకవిత్వ సంప్రదాయాల మీద తిరుగుబాటు చేసి తమ అనుభవాలని పఠాభి అతి వాస్తవికంగా - ఒకొక్కసారి అకవితా ధోరణిలో - చిత్రించారు. భావకవులు అభిమానించిన చంద్రునివంటి కవితావస్తువులని తిరస్కరిస్తూ

తగిలించబడియున్నది జాబిల్లి
చయినాబజారు గగనములోన, పయిన
అనవసరంగా, అఘోరంగా

పిడేలురాగాల డజను, పుట, 7.

అని నవ్యంగా వర్ణించారు. అంతేకాక, చంద్రుడు వెండిరూపాయికన్న, రంగు ఎలక్ట్రిక్ దీపాలకన్న, ''నాగరిక కన్యల పవుడర్ పూయబడిన ముఖాల కన్న'' తక్కువ వాడిగా కవి చిత్రించారు. నగరజీవితంలో వసంతశోభ అనుభవైక వేద్యం కాదని, బస్సు, ట్రాముల గోడవతప్ప ''కోకిలా రావం బేదీ వినబడలేదే నాకు'' అని అతిసామాన్యమైన అనుభవాన్ని చిత్రించారు. అమరంలోని వనౌషధివర్గాన్నంతా గుప్పిస్తూ పండితులు చేసే వర్ణనలు మద్రాసు నగరంలో ఎక్కడా కనపడకపోయినా స్త్రీల తలలందు ''కుప్పలు కుప్పలు పూలు కల్గి / చేరల్నిండా మహోన్నతవృక్షజాతుల'' లో వికసిత లతాకుంజాల్లా, స్త్రీలు కనిపించి మద్రాసుకి వసంతం వచ్చినట్టు నిరూపిస్తున్నారని కవి విశదం చేశారు. ''మెరీనా'' అనే ఖండికలో రోడ్డు మీద పరిగెత్తే మోటారు కార్లుకూడా ''ఉబ్బుకుని వచ్చే నెక్స్ ఆపిళ్ళు''గల అమెరికన్ స్త్రీలలా ఉన్నాయని కవి నాగరకతచేత ప్రభావితుడై, నగరచిత్రణాన్ని స్వభావసిద్ధంగా రూపకల్పన చేశారు.

నవ్యాంధ్ర సాహిత్యంలో నగరజీవన చిత్రణాన్ని, ప్రతిభావంతంగా సహజసుందరంగా చేసిన కవులలో ఆరుద్ర ప్రముఖులు. ''నీటిగడియారం'' అనే కవితలో ఆరుద్ర పాతబడిన మనస్తత్వాన్ని

నువ్వు ఎక్కదలచుకున్న రైలు
ఎప్పుడూ ఒకజీవిత కాలం లేటు
నీ ఆదర్శాల లగేజి
ఎక్సెసంటాడు టీ.సీ.
నీ ఈ షిలాల ట్రంకుపెట్టి
కలల బేకులో పారెయ్యాలి

త్వమేవాహం, పుట, 26.

అని నేటి నగర జీవితంలో సామాన్య అనుభవమైన రైలు ప్రయాణంలో చెప్పారు. నగరంలో మధ్యతరగతి జీవుల పరిస్థితికి దర్పణం పడుతూ వారి జీవితాన్ని

కన్ ఫ్యూజన్ ముట్టడి నుంచి
హంగ్ ఝుయిటీ గుపిటినుంచి

రక్షించాలని కవి కోరతారు. ఈ ఆంగ్లపదాల్లో 'ఝు' కార ప్రయోగం అర్థవంతమయింది. వారి జీవితాల్లో సందిగ్ధతని, ఆవేదనని తీవ్రతరంగా చిత్రించడానికి ఉపకరిస్తుంది. ''సినీవాలి'' అనే వారి ఆధునిక కావ్యానికి నగర జీవితం కథావస్తువు. ఈ నగరజీవితం ''కాలకూట మకరందం'' వంటిది. క్లార్కు సూర్యారావు జీవితాన్ని ''కడుపు మంటతో కాలిపోతూ కన్నీళ్లవై స్ప్రే చేస్తూ ''కలల పద్మము నేసి'' నట్లు కవి చిత్రించారు. నగరాన్ని ''బొగ్గుపులుసు గాలుల బోను''లా వర్ణించడం ఈనాడు రోజు రోజుకీ తీవ్రమవుతున్న వాతావరణ కాలుష్యాన్ని సూచిస్తోంది. నగరజీవి ''మంత్రాల అనల వేదికముందు కాక యంత్రాల అనిల వేదిక లందు'' తన ప్రేయసిని పరిణయ మాడతాడని వర్ణిస్తూ జీవితంలో భార్యాభర్తలు భాగస్వాములు అనే సామాన్య సత్యాన్ని

జీవితం రేడియో సెట్టుకి
భర్త సీరియల్ భార్య ఎర్త్

సినీవాలి, పుట, 58.

అని వైజ్ఞానిక బింబప్రయోగం ద్వారా వినూత్నంగా అరుద్ర చిత్రించారు.

ఆండ్రేబ్రెటన్ ప్రచురించిన సర్రియలిస్టుమేనిఫెస్టో (1924) చేత ఫ్రాయిడ్, యుంగ్ ప్రచుచించిన మనో విశ్లేషణ సిద్ధాంతాల చేత ప్రభావితులై శ్రీశ్రీ, నారాయణబాబు వంటి కవులు అధివాస్తవిక కవిత్వాన్ని తెలుగులో ప్రవేశ పెట్టారు. ఈ కవిత్వాన్ని వివరిస్తూ నారాయణబాబు ''వాక్యాన్ని వదిలిపెడతాము: వాక్యావాక్యంలో కోతకొడతాము. ఏదో విధమైన శక్తి మమ్మల్ని పూనుకుంది అదేదో రాయిస్తుంది. అర్థమనర్థం. అదేది రాయిస్తే అది కవిత్వం''[9] అని వివరించారు. శ్రీశ్రీ 'ఖడ్గసృష్టి'లో ''రుబాయత్'', ''కొంటెకోణాలు'' విదూషకుని ఆత్మహత్యతో పాటు ''అధివాస్తవికుల ప్రవేశం'', ''మహాకవి ఆశ్చర్యం'' వంటి అధివాస్తవిక రచనలు ప్రచురించారు. వీటిలో కొంత అయోమయమైన అవాక్యాల పాటు వైచిత్రి ప్రియత్వం కనిపిస్తుంది.

జీబ్రాకి, Algebra చిహ్నాల
లాంతరుకీ పాంతరోష్మ పాడిరి
సాహిత్య సౌంహితం యిస్తే
వెర్రికాదు, Surrealism రాసోదరా.

ఖడ్గసృష్టి, పుట, 57.

---

9. శ్రీరంగం నారాయణబాబు, ''ప్రవర'', సంఘర్షణ, నారాయణరెడ్డి, 'ఆధునికాంధ్ర కవిత్వము' లో ఉదాహృతం, 585.

అనే విచిత్ర వర్ణన ఇటువంటి కవితకి ఉదాహరణ. ఇందులో కవి అనుభూతికి కాని, ఆ అనుభూతిని స్పష్టంగా వ్యక్తీకరించే ప్రయత్నానికిగాని అవకాశం తక్కువ. శ్రీశ్రీ సుఖవ్యాధిని అధివాస్తవిక దృష్టితో జుగుప్సాకరంగా ''అభిసారికి కడసారి'' అనే గేయంలోను, నారాయణబాబు ''చిన్న'' అనే గేయంలో ''మన్నుతింటున్న చిన్నని'' వ్యస్త వాక్య ధోరణిలో వర్ణించారు. ఇటువంటి కవిత్వం అస్పష్టతకి అనుభూతిరాహిత్యానికి దోహదకారి కావడం వలన ఆంధ్ర కవిత్వంలో కాలాని నిలవ లేక పోయింది.

తెలుగులో వచన కవితోద్యమానికి మూలపురుషుడని వర్ణించదగిన కుందుర్తి ''కవిత్వపు శైలి సామాన్యప్రజల సంభాషణ స్థాయికి రావాలి'' అని ఆశించి తమ కవిత్వంలో ప్రజల సమస్యలని ప్రజల భాషలో, శైలిలో వ్యక్తం చేశారు. 1944 నాటి నయాగరాలో వెట్టిబళ్ళప్రభుత్వాల ని ఎదిరిస్తూ

కనపడ్డది
కార్మికలోకం
శివమెత్తిన రక్త పతాకం

కుందుర్తి కృతులు, 30.

అని రాబోయే కార్మిక విజయాన్ని కవి సూచించారు. పర దేశీయుల పాలనలో క్షోభితమవుతున్న ఆసియా ఖండాన్ని చిత్రిస్తూ

ఆసియా ఖండం భాండంలో, గతం
పోసిన అమృతం కారిపోయింది బొట్లుబొట్లుగా
మూడు వైపుల సముద్రాల ఫేనాన్ని తోసేసి
అధర్మ తరంగాలు లేచినై

కుందుర్తి, కృతులు, 39.

అని సంస్థానాలు కుక్కమూతి పిందెలుగా కనిపంచాయని చిత్రిస్తూ, దేశదైన్యాన్ని

సాయంత్రం రాసుకుంది ముఖాన నెత్తురు
లోకం పువ్వు తెలివి రేకులు మూసుకుంది
దేశపటపు ఆకాశం చీకటి
రాసులు రాసులు క్రక్కింది.

కుందుర్తి, కృతులు, 39.

అని భావస్ఫోరకంగా, ఆవేదనాత్మకంగా కవి చిత్రించారు.

''భావకవుల నపుంసక హావభావాలకి'', నల్లమందు తిని నిద్రపోయిన అభ్యుదయ కవులకి సవాలుగా ప్రాపంచిక ఆచ్ఛాదనల్ని చీల్చుకుని భావతీవ్రత, ఆశయశుద్ధి మహాస్త్రాలుగా తెలుగు కవిత్వంలో నూతనశకాన్ని 1965లో దిగంబరకవులు ఆరంభించారు. వీరి కవితా సంపుటులు 1965, 66, 68 సంవత్సరాల్లో ప్రచురింపబడి తెలుగు సాహిత్యంలో నవచైతన్యాన్ని

సృష్టించాయి. సంఘంలో నటన, వంచన తీవ్రంగా అనుభవించి అసంతృప్తిచెంది, ఈ వ్యవస్థని కుష్ఠువ్యవస్థ అని నిరసిస్తూ ఆరుగురు దిగంబరకవులు చదివేవారి స్తబ్ధతని, రాజీపడేతత్వాన్ని తీవ్ర శబ్దాఘాతాలకి గురి చేశారు. వీరి భావ తీవ్రతకి అనుగుణమైన కావ్యబింబాలు ఈ కావ్య సంపుటల్లో ప్రత్యక్షమవుతాయి. వీరికి ''ప్రబంధాంగనల తొడలు తాడి మొద్దులు'' గా భూమి ''మధ్య మధ్య ఊగుతున్న వరిబీజము''లా కనిపించాయి. మహాస్వప్నకి

డాక్టర్ మనిషి మేకప్ చేసుకుని
వెన్నెల నేపథ్యగానంతో విలాసంగా చంద్రుడు ఆకాశాన్ని పాలిస్తున్న

'గ్లానిర్భవతి భారత', దిగంబరకవులు, 21.

ట్లుగా కనిపించాడు. చంద్రుణ్ణి అందానికి కాక అతినీచమైన కాముక క్రియకి దోహదకారిగా చిత్రించడం ఈ కవుల దృష్టిదోషానికి నిదర్శనం. ఈ కవికే భూదేవి

దేశదేశాల సుఖవ్యాధి పుండ్లతో
చీడపురుగులు నిండిన మేడి పండ్లతో
వెలయాల్లై, పతితయ్యై, భ్రష్టయ్యై

'దిగంబరకవులు', 22.

కనిపించింది. జ్వాలాముఖి మానవతని ధ్వంసంచేసే వ్యవస్థని చిత్రిస్తూ

రాచరికం గులాబీల
రక్తం నులిమీ నులిమీ
ఖద్దరు కంపుల దేహాలకు
పులిమీ పులిమీ
గద్దల్లాంటి గుణాలను
లోలోన కప్పేస్తున్నాం.

అవలోకన, ''దిగంబరకవులు'', 29.

అని ఈ వ్యవస్థ నగ్నస్వరూపాన్ని చిత్రించారు. నగ్నముని ''ఆకలి నా నెచ్చెలి'' అని తెలియచేసి ''నగ్నశిశువు''లో

ఎవరికీ అక్కర్లేని ఆత్మల్ని
శిశువులు శిశువులుగా విసిరేస్తున్నా రెవరెవరో యీలోకంలోకి
నల్లటి సొరంగాల్లోంచి రహస్యాల్లోంచి పొగల్లోంచి, పొరల్లోంచి
కారిమబ్బుల్లోంచి లావానెగల్లోంచి కొట్టుకొచ్చాం

దిగంబరకవులు, 221.

అని మన పుట్టుకని అతివాస్తవికంగా చిత్రించారు. సంప్రదాయానికి దాసులైన వారిని నిఖిలేశ్వర్ ''శవభోగులు''గా చిత్రిస్తున్నారు

వెన్నెముక విరిగిన బుద్ధిజీవులు
అపారమైన అమృత జనసాగరంలో
రాలుతున్న విషబిందువులు.

దిగంబరకవులు, 152.

అని కొంత కవితాత్మకంగా చెప్పగలిగారు. ఈ కవులు తమ కవిత్వ లక్ష్యాన్ని ఒక్కొక్కసారి విస్మరించి అసభ్య ప్రతీకల్ని శ్రుతిమించిన విధంగా ప్రయోగించారు. రచనావిధానంలోని ఈ ''అతి'' వారి కవితా లక్ష్యానికే దెబ్బతీసింది. చివరికి ఈ కవితా ఉద్యమాన్నే ఒక తీవ్రమైన ఆవేశం కలిగిన నేటిబుడగగా మాత్రమే తెలుగు సాహిత్యంలో నిలిచేలా చేసింది. అయినా తత్త్వతః నగ్నముని, నిఖిలేశ్వర్ వంటివారు కవితాత్మకమైన, తాత్త్వికచింతనాభరితమైన రచన చేయగల సమర్థులు. ఉదాహరణకి నిఖిలేశ్వర్ మానవుని మౌలికమైన ఏకాకి మనస్తత్వాన్ని

నేను నా దేశానికి పరాయివాడిని
జ్వలిస్తున్న ఏకాకిని
స్నేహం ఇవ్వని దేశంలో
స్నేహంలేని ప్రతివాడు ఒక్కొక్క ద్వీపం.

దిగంబరకవులు, 73.

అని చిత్రించారు. ఈ కవికే చంద్రుడు ''ఒక తెల్లని గబ్బిలం''గా నక్షత్రాలు ''అల్యూమినియమ్ నాణాలు''గా కనిపించడం కవిలో అతని విషాద మానసిక స్థితి, నాగరకతల ప్రభావాన్ని తెలియచేస్తోంది. దిగంబర శకానంతరం నగ్నముని తాత్విక చింతన కొంత పరిణామం చెంది ప్రభుత్వవ్యవస్థని ''కొయ్యగుర్రం'' అనే ప్రతీకద్వారా ''స్తబ్ధతకీ, మూర్ఖతకీ, అజ్ఞానానికీ, అహంకారానికీ, అసమర్థ పరిపాలనకీ'' సంకేతంగా ప్రయోగించినా మానవచరిత్రలో అనాదిగా సామాన్య జీవుడు మోసపోతూనే ఉన్నాడు. అనే సాంఘిక సత్యాన్ని

నాగలి బుజాన వేసుకొని
పొలం వెళ్ళే ప్రతిరైతూనాకు
శిలువమోస్తున్న క్రీస్తులాకనిపిస్తాడు.

''కొయ్యగుర్రం'', 5.

అని ప్రతిభావంతంగా చిత్రించారు. ఈ మోసాల చరిత్రలో మానవత్వం కూడా నిత్య సత్యంగా భాసిస్తుంది అని విశ్వసిస్తూ

మానవత్వం మాత్రం
ప్రతిరోజూ ప్రతిక్షణం పుట్టి చచ్చే
వెలుగు కిరణం.

''కొయ్యగుర్రం'', 6.

అని చిత్రించారు. ఈ తాత్త్విక దృక్పథం కొందరు దిగంబర కవులనికూడా, ఆ దిగంబరశకానంతరం కొంతకాలం గుర్తుంచుకోవలసిన కవులుగా తీర్చి దిద్దగలిగింది. ఈ విప్లవశకంలో సమన్వయ పథానువర్తులైన కవులుకూడా విప్లవ నినాదాలు తమ కవిత్వంలో చేయక తప్పలేదు. డా. దాశరథి ''వెన్నుజేబులో పెట్టి గన్ను చేత పట్టాలనే ''కోరికని వెల్లడిస్తే, డా. నారాయణరెడ్డి విప్లవపంథాన్ని అనుసరించక పోయినా, ఆ పంథాలో నడిచే తమ్ముడి గుండె ధైర్యాన్ని మెచ్చుకుంటున్నానని తెలియ చేశారు.

విప్లవ స్ఫూర్తి కలిగిన కవుల భావన రక్తారుణ వర్ణశోభిత కావ్యబింబాల ద్వారా వ్యక్తీకరింప బడింది. ఇటువంటి భావననే కేవలం ''అగ్నిశిఖలు'' అనే గీతికలో వ్యక్తీకరిస్తూ

నా అక్షరాలు
నెత్తుటి కన్నీటిబొట్లు
కోమలి వేదాలవ్వే కొన్నెత్తురు చిందించిన గాట్లు.....
తాగుబోతు కళ్లలో
తొంగిచూసే ఎర్రజీర

''రాత్రి'', 3.

తన కైత అని చిత్రించారు. ''అడవి'' ఋషుల తపోనిష్ఠకి ఏకాంతతకి కాక దేవిప్రియకి విప్లవ కార్యక్రమాలకి ఆటపట్టుగా, విప్లవదృక్పథానికే సంకేతంగా ''రేపటి ఆకాశానికి / ఈనాడే పూచిన సూర్యపుష్పానిగా'' కనిపించగా

నీ ముళ్ళ ఒడిలో నావాళ్ళు విశ్రమించారు
నీ చల్లని కనురెప్పల నీడలో
నావాళ్ళు నిద్ర దీరారు
నీకొమ్మలే నీ ఆకులే
నీ గాలులే సాక్షిగా
నావాళ్ళు ఒరిగి పోయారు

అమ్మచెట్టు, 1

అని ప్రకృతిని తమ రాజకీయలక్ష్య సాధనకి దోహదకారిగా కవి చిత్రించారు. కవిత్వమే తమ లక్ష్యసాధనకి దోహదకారిగా భావిస్తూ

కాగితం పొలంలో
కలం నాగలేసి దున్నితే మొలకెత్తేవి
అక్షరాల విత్తనాలు
వెట్టుబడి గుండెల్లో
తిరుగుబాటు బరిసె గుచ్చి ఎత్తితే ప్రభవించేవి
అరుణారుణిమ విప్లవాలు

అమ్మచెట్టు, 4.

అని కవితాక్షరాలు అరుణారుణ విప్లవ కారకాలుగా కవి చిత్రించారు. విప్లవ కాంక్షతో పాటు ఈ కవులలో కొంత భావుకశక్తి కూడా ఉంది. ఈ కవికి చంద్రుడు

ఎక్కడో
ఆకాశం ఏనుగు మెడలో
వెండి గంటలా వేలాడే ఒంటరి మెరుపుల

అమ్మచెట్టు, 5.

వాడిగా కనిపించాడు. ''దేన్నీ ధ్వంసం చేయకుండా / దేన్ని నిర్మిస్తావు?'' అని ఘాటుగా ప్రశ్నించిన శివారెడ్డి ''చూపు'' విలక్షణమైంది. ఆ చూపుతో కవి

మొనదేలిన గరికపోచలో పిడి బాకునే
''నల్లమేఘాల రవిక'' వెనక ''రవిస్తనాన్ని చూడలేనివాడు
మనుషుల్లోని తిరుగుబాటు పొద్దుటి పూటల్ని చూడలేడు

నేత్రధనుస్సు, 3.

అని నిర్మొహమాటంగా స్పష్టంచేశాడు. ఆయనకి ''వెలుగు ఎలుగెత్తి బతికే బతుకు / కటకటాలవెనక కూడా కాఠిన్యం కోల్పోని వజ్రగీత సంగీతంగా''

వినిపించింది. విప్లవ చైతన్యస్ఫూర్తి కలిగిన కవి ''తనే గీతమయి పారపుచ్చు కాళ్ళ / పొలంలో దమ్ము చేస్తాడు'' అని ఈయన కవికి కర్తవ్యబోధ చేశారు. రామప్పగుడి, అక్కడి చెరువు కాల్పనిక కవులకి కాకతీయుల శిల్ప సౌందర్యాన్ని జ్ఞప్తికి తెస్తే దేవప్రియకి రాజరికం సృష్టించిన బానిసలని జ్ఞప్తికి తెస్తుంది. రామప్ప చెరువు ''రానున్న చరిత్రకింక బానిసలొద్దు'' అని హెచ్చరిస్తోంది

ఒడ్డువెంట వరసగా
కొంగల్లా నిలిచివున్న నల్ల రాళ్ళమీద
రామప్ప చెరువు
కెరటాల కత్తులు నూరుతోంది

అమ్మచెట్టు, 68.

అని రామప్ప చెరువులో కెరటాలని బూజుపట్టిన రాజరిక వ్యవస్థని సవాలుచేసే ఆవేశానికి సంకేతంగా కవి చిత్రించారు.

విప్లవ కవుల్లో ముఖ్యునిగా పరిగణించదగిన వరవరరావు తమ కవిత్వంలో ప్రశంసనీయమైన భావుకతని కూడా వెల్లడించారు. ''ఆడ్వర్డ్స్'' అనే ఖండికలో ''ద్వారంలో బిచ్చగాడు తోరణమై వేళ్ళాడిన'' సమాజచిత్రాన్ని ప్రదర్శించి తమ భావనాశక్తిని వెల్లడిస్తూ

వెన్నెల అద్దంలో నాకలం అక్షరాల కురులు దిద్దుకుని
భావాంబరాలు వేసుకుని బయలుదేరింది

రాత్రి, 7.

అని ''శిశిరోషస్సు''ని

జలాశయాల గట్టుమీద
ప్రత్యూష కిసలయం ప్రభవించింది
నిశాదేవి తుషారమయ నిషాతాలింగిపోయి
ఉషాబాల కషాయ వసనావృతయై తొంగిచూసింది.

రాత్రి, 41.

అని
ప్రబంధ ధోరణిలో ప్రకృతిని చిత్రించగల భావుకత ఈ కవికి ఉంది. ప్రకృతిలో తాము స్వయంగా అనుభవించిన రంగు, రుచి, ఒ చిస్సు హిమబిందువుకి కూడా ఆపాదిస్తూ, శెనగ కాయ పచ్చదనం, పులుపు వెచ్చదనాన్ని కవి పాఠకులకి అనుభవైకవేద్యం చేశారు. రాజకీయ దృక్పథం ఏదైనా కవికి అనుభూతి, సౌంద ర్యాత్మకమైన అభివ్యక్తి, భావుకశక్తి కవితారచనకి ఆవశ్యకాలని దిగంబర కవుల్లో నగ్నముని, నిఖిలేశ్వర్ వంటివారు, విప్లవకవుల్లో వరవరరావు వంటి వారుకూడ నిరూపిస్తారు.

ఇటీవలి కాలంలో కవిత్వంలో సందేశం ముఖ్యమా? శిల్పం ముఖ్యమా? అనే వివాదం కవుల, విమర్శకుల దృష్టిని అధికంగా ఆకర్షించసాగింది. ''ఎలా చెప్పాడో ముఖ్యం కాదు. ఏది చెప్పాడో అన్నదేముఖ్యం'' అని ఒక వర్గపు విమర్శకులు ఎలుగెత్తి చాటుతుంటే కవిత్వంలో శిల్పప్రాధాన్యాన్ని నొక్కి చెపుతూ, శ్రీ శేషేంద్రశర్మ ''ఏది చెప్పాలి అనే విషయం విసర్జించి ఎలా చెప్పాలి అనే విషయాన్ని గురించి చర్చించండి''.[9] అని యువకులని ఉద్బోధించారు. తమ కవితా విశ్వాసాన్ని వీరు తమ కవిత్వంలో ఎన్నోచోట్ల ప్రదర్శించారు. కవిత్వం అనుభూతికళ అని భావచమత్కారం, కళాత్మక అభివ్యక్తి కవిత్వానికి ముఖ్యం అని సాంస్కృతిక ప్రపంచం లో సార్వకాలిక సాహిత్యగౌరవాన్ని అందుకున్న వాల్మీకి, గాలిబ్, బోదలేర్ వంటి కవుల మార్గాన్ని అనుసరించిన శ్రీ శేషేంద్రశర్మ ''శేష జ్యోత్స్న'' వంటి కావ్యాల్లో సౌందర్య మయమైన కావ్యబింబాల్ని సృష్టించారు. ''ఆ రెండు కళ్ళు'' అనే ఖండికలో ఆ కనులు

నా సువర్ణ ఇంద్రనీలాల గనులు.....
ఆ కన్నులలో
హిమాలయ శిఖరాలధిష్ఠించిన ఒకనగరం
తారల తీరాల కెగిరిపోయే ఒక పతంగం
కటి కిరణాల అంతరంగం

శేషజ్యోత్స్న, 5.

---

9. శ్రీ గుంటూరు శేషేంద్రశర్మ, కవిసేన మేనిఫెస్టో, 46

దర్శనీయాలు అని తమ ప్రేయసిని విశ్వాంతర వ్యాప్త సౌందర్యదేవతగా కవి చిత్రించారు. ''వీనస్ డి మెలో'' శిలా విగ్రహాన్నిచూసి కవి

నీవు శిలవుకాదు కలవుకాదు నావలపుల వలలో చిక్కిన
శబల వర్ణసంచాలిత శఫరివి

శేషజ్యోత్స్న, 16.

అని సుందర కావ్యబింబాన్ని కవి సృష్టించారు. ''నా దేశం నా ప్రజలు''లో

సముద్రాలు భూమి ప్రేమ లేఖలు రాసుకునే నీలిసిరా
గిన్నెలు. ఆ సిరాలో నించి గాలులు మోసుకొచ్చే
అక్షరాలే సామ్రాజ్యాలు, నాగరకతలు, విజ్ఞాన
పరిమళాలు..... ఆ సిరాతో లిఖించినవే మానవ ఇతిహాసాలు

నాదేశం - నాప్రజలు, 13.

అని ప్రకృతికి వినూతన చారిత్రక ప్రయోజనాన్ని కవి సూచించారు. కవికి అభ్యుదయ భావస్పృహకూడా ఉంది. హైదరాబాదు నగరంలో స్వాతంత్ర్యానంతర నాగరకతని చూసి ఆ నగరంలో చెట్లని ''ఈ చెట్లు పూలెందుకు పూస్తాయి. ఈ నికృష్టపు నాగరకత విడిచే బొగ్గుపులుసు వాయువు పీలుస్తూ, ఇవి బుల్లెట్లెందుకు పూయవు?'' అని ప్రశ్నించి కవి తమ విప్లవ వాంఛని వెలువరించారు. మానవజీవితంలో

శ్రమ విలువని తెలియచేస్తూ, చరిత్రలో చెమట ఒక శాశ్వత అంతర్వాహినిలా ప్రవహిస్తూ ఉంటుంది. మానవయంత్రం కండరాలు బ్రహ్మాండమైన కొయ్య చక్రాల్లా తిరుగుతుంటాయి'' అని

కవిత్వం ఎర్రగుర్రంలా పరిగెత్తుకు వస్తోంది - రక్తంలో
మునిగిన బాణంలా వీరుడు విడిచిన ప్రాణంలా

నాదేశం - నాప్రజలు, 29.

అని విప్లవ వాంఛని శిల్పసౌందర్యయుక్తంగా కవి వెలువరించారు. కవిత్వంలో భావ వ్యక్తీకరణకి భావం కంటె వ్యక్తీకరణలో చమత్కారం, వక్రోక్తి, శిల్పం వంటి సౌందర్య కారకాలు ముఖ్యం అని వీరు విశ్వసించి తమ కవితల్లో అధికంగా ప్రయోగించారు. సామూహిక చైతన్యానికి వ్యక్తి వాహకుడని విశ్వసించి వీరు ''నేర్పారి పోయింది'' అనే సుదీర్ఘ కవితలో ప్రకృతితో తాము తాత్వికతాదాత్మ్యాన్ని అనుభవించి ''నా స్మృతుల ఉషస్సులో నిదురిస్తున్న పక్షిఖచితాల్ని ఇక్కడ పక్షులు తాగుతున్నాయి '' అని వెల్లడించి గంగానదిని అపూర్వంగా

హిమాలయాలు భూమధ్యరేఖకు దూరంగా పడుకోబెట్టి
పోయిన నగ్నశిశువు గంగానది ఇసుక తీరాల మధ్య
మూసిన పుస్తకంలా నిదురిస్తోంది.

నేర్పారిపోయింది, 13.

అని సృష్టి ప్రథమదశకి, అర్థంకాని నిగూఢ రహస్యానికి సంకేతాలుగా ''నగ్న శిశువు'' ''మూసిన పుస్తకం'' ప్రయోగించి కవి తమ తాత్త్విక దృక్పథాన్ని వ్యక్తీకరించారు.

గుండె లోతుల్లో అనుభూతుల్ని దండలు గుచ్చి కవితలుగా అందించిన డా. అరిపిరాల విశ్వం రచనలలో కొంత మార్మికత, కొంత తాత్త్విక చింతన గోచరిస్తాయి. రేపటి స్వర్గాన్ని చిత్రిస్తూ తనగొంతులో

స్వర్గపు గుసగుసలు వినిపిస్తాయి
నెలయేటి గలగలలు నిలుస్తాయి
రేపటి వసంతపు
లేత లేత కలలు కురుస్తాయి.

రేపటి స్వర్గం, 12.

అని భవిష్యత్తు ఆశామయమని కవి తమ తాత్త్విక దృక్పథాన్ని వెల్లడించారు. ''ఏకాంత గీతం'' అనే ఖండికలో ''ఏకాంత మానసికస్థితిని జలతారు మైనపు పరదా'' గా ''కల తెమ్మెర నునుసిగ్గ వాసన'' గా విభిన్నమైన ఇంద్రియాల అనుభూతులకి రూపకల్పనచేస్తూ

ఎడబాటు తెరనుంచు చాటున
కదలి వచ్చే నిశ్శబ్దంలాగ
గడ్డకట్టిన ఏకాంతపు మంచు
ఏ స్నేహ సూర్యుని కరస్పర్శకైనా

రేపటి స్వర్గం, 63.

ద్రవించదని కవి చిత్రించారు. ఇందులో కవి తమ భావవ్యక్తీకరణకి పంచేంద్రియాల అనుభూతుల్ని ప్రయోగిస్తూ, సంశ్లిష్టబింబం (synaesthetic images) సృష్టించి ప్రతీక కవితకి తెలుగులో ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించారు. కాని ఈ ప్రతీకల వ్యక్తీకరణలోని కొంత అస్పష్టత కవిత్వప్రయోజనానికి అంతరాయం కలిగించింది అని చెప్పక తప్పదు.

ఇటీవలికాలంలో భావకవిత్వం తిరిగి తలెత్తి కావ్యజగత్తులో నవ్యభావ కవిత్వంగా పిలసిల్లుతున్నట్లు కనిపిస్తోంది. ఇటువంటి పునరావృత్తి ఇంగ్లాండులో డబ్ల్యు.హెచ్.డేవిస్ వంటి కవుల రచనలలోను, అమెరికాలో రాబర్ట్‌ఫ్రాస్ట్ వంటి వారి రచనలలోను మనకి కనిపిస్తుంది. 1977 లో స్వతంత్ర కవితారచన ప్రారంభించిన డా.బి.గోపాలరెడ్డిగారు భావకవిత్వ పునరుజ్జీవనానికి దోహదం చేశారని చెప్పవచ్చు. ఆయన ప్రచురించిన కావ్యసంపుటులలో ''కాలనాళిక'' కవిత్వ దృష్టిలో ప్రముఖమయింది. తాజమహల్‌ని దర్శించి ఆనందపరవశుడైన కవి తమ సంప్రదాయ పరిజ్ఞానంలో ''తాజమహల్'' ని ''ద్వాపరమున వెన్నముద్దలు ముచ్చటించి /

ఋణపడిన గోపాలుడు పశ్చాత్తాపపడి / వ్రజయువతులకు తిరిగి యిచ్చిన / కలి యుగ నవనీత గిరిరాజు'' అని మనోహరంగా చిత్రించారు.

కాలవాహినిలో ''నేడు'' కవికి ''చీకటి కొండల రెంటినడుమ / జాలువారు సన్నని వెలుగు వాగుగా

భూతకాలం
చేసి వెడలిన
వెండి అక్షరాల
ఆటోగ్రాఫ్

కాలవాహిని, 29.

గా కనిపించింది. రోడ్డుమీద చలన రహితంగా ఉండే మైలురాయిని కవి తమ అల్కెమీతో కవితా వస్తువుగా తీర్చిదిద్ది ఆ రాయిని

నదీ ప్రవాహాన్ని చూస్తూ
అలరే అశ్వత్థ హృదయం
ప్రయాణి జపమాలనుత్రిప్పు
నిశ్చల మునీశ్వరుడు

కాలవాహిని, 60.

అని నిశ్చలత్వానికి సంకేతంగా కవి చిత్రించారు.

కవిత్వానికి అనుభూతి ముఖ్యప్రేరకశక్తి అని విశ్వసించి తమ కవితా సంకలనానికి ''అనుభూతిగీతాలు'' అని పేరు పెట్టుకున్న శ్రీకాంత శర్మ కలం ''కెలైడొస్కోప్''లో ''రంగు రంగుల గాజుముక్కల వంటి / రకరకాల అనుభూతులు'' గుచ్ఛలుగా ఆకారం దాల్చడం పరిశీలించి

మనస్సు రంగుల చేప
లోకపు ఉపరి తలం పైకి
ముక్కువగా గిరికీలు కొట్టబోతే
వాస్తవికత వల, మీదపడుతుంది.

అనుభూతిగీతాలు, 23.

అని స్వాప్నిక ప్రపంచానికి, యథార్థప్రపంచానికి ఉన్న అంతరాన్ని, అవరోధాన్ని కవి అనుభూతి పరిధిలో ప్రదర్శించారు. ఈ కవికి అనుభూతిని చిత్రించే వాంఛతోపాటు తాత్త్విక దృష్టికూడా ఉంది. తన తనువుని ''పటకుటీరం''గా భావించి జీవితంలో పాంచభౌతిక శరీరంతో తాను అనుభవించిన ఆనంద విషాదాలని

గుప్తంగా దాచుకొన్న
మైత్రీ మరకత మాణిక్యాలను
కాంక్షా స్ఫటికాలను
ప్రణయ కాంచన మాలికలను

అనుభూతి గీతాలు, 29.

కవి అనుభూతి క్షేత్రాలుగా చిత్రించారు. కవి తమ ప్రత్యక్షానుభూతిని ఆధారం చేసుకుని వైయక్తికత కలిగిన ''బూజువంటి వెన్నెలలో గోదావరి చిక్కిపుంది'' ''జ్ఞాపకం తొడిమ లాంటిది / అది ఎప్పుడో రాలిన పూవుకి సంకేతం, మౌనం ద్రవించినట్టున్నది / తడి తడి కనురెప్పలను / నాచింపలకురాస్తు - గాలి (13) వంటి రమణీయ కావ్యబింబాలని . ప్రయోగించారు.

ప్రకృతి పరిశీలన, సామాజిక చిత్రణ లక్ష్యాలుగా కవితని ప్రారంభించిన శ్రీ జె.బాపురెడ్డి ఇటీవలి రచనలలో భావభౌతిక తత్త్వం గోచరిస్తోంది. ''అనంత సత్యాలు'' అనే కవితా సంకలనం కవి పరిణత తాత్త్విక దృష్టిని విపులంగా ప్రదర్శిస్తోంది. ''భావ భౌతికాలు'' అనే గీతంలో కవి తమ తాత్త్విక దృష్టిని వివరిస్తూ ''మనకు కనిపించే / చరాచరాలు / సృష్టిలయాలు / భావం వెలిగించే / భౌతిక రూపాలు'' అని ఈ భౌతిక ప్రపంచానికి వ్యక్తి భావన ప్రాతిపదిక అని కవి స్పష్టం చేశారు. అందుకే ఈ కవికి

భావభ్రమర భ్రమా భ్రాజితం
భౌతిక లోకం

అనంత సత్యాలు, 12.

ఆకాశంలో నక్షత్రాలు కనికి

దైవత్వం, అనంతత్వం కలిసి
నిర్మలాకాశంలో కట్టుకున్న
ధర్మ హార్మ్యాల వజ్రస్తంభాలు

అనంత సత్యాలు, 9.

గా కనిపించాయి. అశాశ్వతమైన జీవితాన్ని చిత్రిస్తూ

అనంత తిమిర సాగరంలోని
అద్భుత ద్వీపం మీద
మబ్బులా వచ్చి కురిసి
వాగులా పొంగి పొరలి
వారాశిలో కలిసి పోయే
వర్ష బిందువు

అనంత సత్యాలు, 23.

అని మబ్బుని పరోపకార బుద్ధికి, వాగుని చైతన్యపూరితమైన ఆచరణకి సంకేతాలుగా కవి ప్రయోగించారు. చివరికి వారాశిలో వర్షబిందువు లీనమవడం మనిషి జీవితం పరిసమాప్తమవడానికి కవులు సంప్రదాయ బద్ధంగా ప్రయోగించే ప్రతీక

ప్రకృతి ఆరాధన, సమాజపరిశీలన, వాస్తవిక చింతన తమ కవితా ప్రస్థానత్రయంగా బహుముఖరచనా వ్యాసంగాన్ని సాగిస్తున్న డా. బోయి భీమన్న ఇటీవల రసాద్వైత తాత్విక చింతన అధికంగా ప్రదర్శిస్తున్నారు. ''మధుబాల'', ''రాగోదయం'' వంటి కవితా సంపుటాలలో ప్రకృతి ఆరాధన, ''కాన్యకుసుమాలు'' ''జానపదుని జాబులు'' ''గుడిసెలు కాలిపోతున్నై'' వంటి రచనలలో సమాజపరిశీలన, ''పిల్లిశతకం'' వంటి రచనలలో సంఘంలోని దురాచారాలమై వ్యంగాత్మక విమర్శ కనిపిస్తాయి. వీరి కవిత్వంలో అంతర్వాహినిగా ఉంటూ ఇటీవల ప్రముఖంగా కనిపిస్తున్న ప్రకృతి పురుషుల సంయోగ సూచకమైన రసాద్వైత సిద్ధాంతం వీరి తాత్విక దృక్పథాన్ని తెలియచేస్తోంది. ''మణిమానసం'' అనే కావ్యానికి వేరు వ్రాసిన అవతారికలో ''ద్వైతం, అద్వైతంగా, అద్వైతం ద్వైతంగా రూపం మార్చుకుంటూ పరిభ్రమిస్తున్న ఆనంద చేతనా చక్రమే రసాద్వైతం[10] అని వివరించారు. ఈ రసాద్వైతానికి

---

10. బోయి భీమన్న, ''అవతారిక'', ''మణిమానసం'', VIII.

శృంగారమే ప్రధానమైన రసం అని వీరి విశ్వాసం. ''రాగవైశాఖి'', ''శివాలకలు'', ''మణిమానసం'' ''బొమ్మ'' వంటి రచనలలో వారి తాత్త్విక దృక్పథం మనకి గోచరిస్తుంది. వీరి ఆరంభరచనలలో ఒకటైన ''దీపసభ'' అనే కావ్యంలో కవి తమకి దీపానికి సామ్యాన్ని ప్రదర్శిస్తూ

ఏ పరం జ్యోతిలో వెలిగి, ఈ ప్రపంచ
విధులు నెరవేర్చుచున్న దివ్వెలము మనము.
దీపికా! నిన్ను నన్నొక నాసి ముందు
అంధకారమ్మె దండ యాత్రమనది

''దీపసభ''.

అని మానవుడు చీకటిమీద చేసే దండయాత్ర జీవితంగా 1955 లోనే కవి చిత్రించారు. ఈ తాత్త్వికచింతన ''గుడిసెలు కాలిపోతున్నై'' అనే సంకలనం లో సామాజిక స్పృహతో కలిసి కనిపిస్తుంది. ''కులమతాల ఉమ్మడి కాష్టం'' ఆధునిక కాలంలోని ''నమః స్వామికం'' చిత్రించిన కవి రసాద్వైతం'' అనే ఖండికలో ప్రకృతి పురుషులకి, **తమ** తమ శృంగారదేవతకి ఉన్న రసాద్వైతాన్ని వివరిస్తూ

నా ఇచ్ఛా స్పందన సౌందర్యపథం నీవు
నీ ఐశ్వర్యకళా ప్రదర్శన రథం నేను
రసానంద బ్రాహ్మీ బ్రహ్మలమే మనం
బ్రహ్మానంద విహారవనీ సబ్రహ్మచారులం

గుడిసెలు కాలిపోతున్నై, 120.

అని తన శృంగార భావనని బ్రహ్మానంద సదృశంగా కవి చిత్రించారు. వారిద్దరూ ప్రకృతి పురుషులమని తెలియచేస్తూ,

ఈ పరమ ప్రకృతి కాంతకూ ప్రతినిధివి నీవు
నీ పమిట కొంగుకు వేసుకున్న ముడిని నేను

గుడిసెలు కాలిపోతున్నై, 121.

అని వారి విడివడని ఐహిక సంబంధాన్నికూడా కవి స్పష్టంచేశారు. తమ ప్రియురాలితో ప్రత్యక్షంగా చెప్పుకోలేని ప్రేమని ఆమె బొమ్మ (ఫొటో) తో చెప్పుకుని చివరికి ఆ బొమ్మని ఒక ప్రతీకగా భావించి తద్వారా విశ్వచైతన్యశక్తినే దర్శించిన లజ్జాళువైన నాయకుణ్ణి కవి ''బొమ్మ'' అనే గేయ కావ్యంలో చిత్రించారు. నాయకుడు తన ప్రియురాలి చిత్రంలో

రమ్యాక్షరాంతః పు
రాలు నీ చరణాలు,
ఎచట సోకిన అచటె
ఇందూ దయాలు

బొమ్మ, 3.

అని ఆమెని పూజార్హారాలుగా చిత్రించి ఆమెని పూవులలో, రంగులలో, ఋతువులలో, నాదంలో, వేదంలో దర్శించి

అమృత స్వరూపమౌ
ఆత్మ నీ దేహముండ
తమి యేలొ వట్టి
తనువుకై అనుకోకు

బొమ్మ, 67.

అని ఆమెని ఆత్మ స్వరూపిణిగా సంభావించి, వారిద్దరి తాదాత్మ్యాన్ని

నేను నీదరి జేర
నీవుగా విరిసేను -
నీవు నా దరిజేర
నేనుగా వెలిగేవు -
ప్రత్యేకతలే శుభాక్షతలై
జీవికై
శ్వరమ్మై, ఇక మనెద మొకటై

బొమ్మ, పుట, 78.

అని చిత్రించారు.

ఆధునికాంధ్ర కవిత్వం గురజాడతో సామాన్య మానవుణ్ణి మకుటాలంకృతుణ్ణి చేయడంతో ప్రారంభమైంది. కొంతకాలం భావకవితా కాశంలో విహరించి, అభ్యుదయ మార్గంలో దగాపడిన తమ్ముళ్ళపై సానుభూతి ప్రదర్శిస్తూ, సంఘంలో కుష్ఠువ్యవస్థ, దిగంబర స్వరూపాన్ని ప్రదర్శిస్తూ, సాంఘిక దురన్యాయాలకి 'ఉంది ఒకేదారి చారుమజుందారి' అనే విప్లవ మార్గాన్ని చాటిస్తూ, మళ్ళీ సౌందర్యారాధన, కావ్యశిల్పాభిమానం పునరావృతంచేసే నవ్య భావ కవిత్వ కాంతులతో విరాజిల్లుతూ బహుముఖంగా విస్తరిస్తోంది. ఈ శతాబ్దంలో వివిధ కవితా ప్రక్రియలు మానవుని వివిధ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తూ, సమగ్రమానవతత్వ స్వరూపాన్ని చిత్రించాయి. ఈ తత్వాలని ఈ కవులు వివిధ కావ్యబింబాలద్వారా ఆయా కవితల్లో ప్రతిభావంతంగా, రమణీయంగా, భావస్ఫోరకంగా అభివ్యక్తీకరించారు.

తృతీయ ఖండం

# ఆధునికాంధ్ర కవిత్వం

## తిలక్, దాశరథి, నారాయణ రెడ్డి

### కావ్యబింబ పరికల్పన
### ప్రత్యేక పరిశీలన

## ఆధునికాంధ్ర కవిత్వం - కావ్యబింబ పరిశీలన

## తిలక్, దాశరథి, నారాయణరెడ్డి

## కవిత్వ ప్రత్యేక అధ్యయనం

పందొమ్మిదవ శతాబ్దం చివర భాగంలో తెలుగు కవిత్వం కందుకూరి వీరేశలింగంగారు ''సరస్వతీనారద విలాపం''లో వాపోయినట్లు ''ఛందోబద్ధంబగు పదబృందా టోపంబు''గా తయారై కవితా వస్తువులలోను, శిల్పాలలోను నవ్యత కోల్పోయింది. కట్టమంచి రామలింగారెడ్డిగారు ''ముసలమ్మ మరణం'' అనే తమ కావ్యంలో రచనావిధానంలోను, శిల్పంలోను సంప్రదాయ పద్ధతిని అనుసరించినా ఎన్నుకొన్న కావ్యవస్తువులోను, ఆ కథని విషాదాంతం చేయడంలోను నవ్యతని ప్రదర్శించారు. 1900 సంవత్సరంలో ప్రచురించబడిన ఈ కావ్యం 20 వ శతాబ్దంలో ప్రాచుర్యం పొందిన నవ్యకవిత్వానికి నాందిగా నిలుస్తుంది. ''శ్రీ''తో ప్రారంభమై మరణాంతమైనా భరతవాక్యంతో ముగిసిన ఈ కావ్యంలో సంప్రదాయానుసరణ సుస్పష్టం. వస్తు నవ్యతలోను, భావనవ్యతలోను, శిల్ప నవ్యతలోను నవ్యకవిత్వానికి శ్రీకారం చుట్టిన కీర్తి గురజాడది. వస్తు నవ్యతలో ప్రశంసనీయమైన ప్రగతిని ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారు 1909 లో ప్రచురించబడిన ''లలిత'' అనే కావ్యంలో సాధించారు ఈ దశకంలోనే

---

1. డా. నారాయణరెడ్డి, ''ఆధునికాంధ్ర కవిత్వము'', 145.
కొందరు విమర్శకులు 'ఆధునిక' కవిత్వాన్ని 'నవ్య' కవిత్వం అనే వ్యవహరించారు. ''ఆధునిక' కవిత్వం అంటే ఇప్పటి వాళ్ళదంతా అవుతుంది. భావకవిత్వమంటే కథానికాదిరూపమైన నవ్యకవిత్వానికి అన్వయించక అవ్యాప్తిదోషము పాలవుతుంది. కాబట్టి నవ్యకవిత్వమను పదము మాత్రమే ఔచితీ వంతమైనది'', నోరి నరసింహశాస్త్రి, 'నవ్యకవిత్వము దాని ఉద్దేశము', 'ప్రతిభ', జనవరి, 1938.

'ముత్యాల సరాలు' (1910) కూడా గ్రంథరూపం తాల్చడం తెలుగు కవిత్వ చరిత్రలో చెప్పుకోతగిన విశేషం. మానవతాదృక్పథానికి నాందిపలికిన గురజాడ, భావ కవిత్వ ప్రస్థానానికి వైతాళికుడైన రాయప్రోలు నవ్యకవిత్వ మార్గదర్శకులుగా, ఇరువురు యుగకర్తలుగా ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావుగారు భావించారు.[2] 'కవిత్వం అందంగా ఉండాలని సుకుమారమైన మాటలు ఉండాలని..... ఏర్పరచిన నియమం[3] అంటే భయపడే ఆధునిక విమర్శకులు గురజాడ తరువాత రాయప్రోలు అనతరణ హేతుబద్ధంకాదని భావించారు. కాని తెలుగు సాహిత్యంలోను, భారతీయ సంస్కృతిలోను ఉన్న చిత్రం ఇదే. విభిన్న మార్గాల్ని, దృక్పథాలని ఒకే కాలంలో ప్రదర్శించి, సమన్వయించి హుందాగా ప్రవహించే జీవనది భారతీయ సంస్కృతి. ఆ సంస్కృతి సాహిత్యంలో మొదటినుంచే ప్రతిఫలిస్తూనే ఉంది. ఆధునికత అంటే సమకాలీనత మాత్రమే కాకపోయినా ఇరవయ్యోశతాబ్దంలో కవిత్వాన్ని సృష్టించి వస్తువులో, శిల్పంలో నవ్యతని ప్రదర్శించిన కవులు ఆధునికులే. ఈ ఆధునికతకి వారు సమకాలీనులు అవడం ఒక్కటే కారణంకాదు. విశ్వకవి టాగోరు ఆధునికత్వాన్ని కాలవాచిగా అంగీకరించక ''కవిత్వములో ఆధునికత్వమనగా స్వభావమును బట్టిన ఆధునికత్వమేకాని కాలమునుబట్టి కానేకాదని స్పష్టపరిచిరి[4]...

---

2. 'అభినవకవిత్వంలో రెండుశాఖలకి మార్గ - దేశి క్రమముగా రాయప్రోలు గురజాడలు మార్గదర్శకులు,' ''తెలుగు పై ఇంగ్లీషు సాహిత్య ప్రభావము''.
3. వి.నారాయణరావు, ''తెలుగులో కవితావిప్లవాల స్వరూపం'', 154.
4. కవిత్వంలో ఆధునికత్వం, (Tagore, 'Modernity in poetry) Modern Review) వ్యాసానికి తెలుగు అనువాదం, ''భారతి'', అక్టోబరు, 1946.

అందువల్లనే ఇరవయ్యోశతాబ్దంలో రచించబడ్డా తిరుపతివెంకటకవుల ''బుద్ధ చరిత్రము'', శ్రీపాదవారి ''యాజ్ఞవల్క్య చరిత్ర'', మధునా పంతులవారి ''ఆంధ్రపురాణము'' ఆధునిక కవిత్వంగా పరిగణించలేము.

'నవ్యత', 'ఆధునికత' విమర్శకులలో గాఢమైన అభిమానాన్ని, అభిశంసనని కలిగిస్తాయి. శ్రీ విశ్వనాథ 'నవ్యత' కి ఇచ్చిన నిర్వచనం వారి ప్రాచీన భారతీయ సంస్కృతిపై గౌరవాన్ని మాత్రమేకాక, పాశ్చాత్యసంప్రదాయాలపై వారి విముఖతని కూడా వెల్లడిస్తోంది. శ్రీ విశ్వనాథ

> 'సృష్టిక్రమంలో సృష్ట్యాదినుండి కాలనిర్ణయంలో, భిన్న రాజచరిత్ర నిర్ణయంలో, ధర్మనేతులలో, ఆర్థిక రాజకీయాల్లో, సారస్వత పథాల్లో ఒకవిశిష్టమైన సంస్కారంతో కూడిన సిద్ధాంతాలమీద మనజాతి నడచింది. ఇవ్వాళ ఆంగ్లేయులు మన్ని ఆక్రమించటం చేత ఆ మహా సంస్కారం మీద అభిమానంపోయింది. పాశ్చాత్యదేశీయుల సంస్కారం మీద అభిమానం ప్రబలింది. ఏతదభిమానపురస్కృతములైన భాషాతత్త్వం, చరిత్ర నిర్మాణం, సృష్ట్యాదికాల నిర్ణయం, సంఘధర్మాలు, విశ్వాసాలు వీటిని యేయేగ్రంథం పరామర్శిస్తుందో అదంతా నవ్యసాహిత్యం'.[5]

అని నవ్య సాహిత్యాన్ని పాశ్చాత్య నాగరకతా ప్రభావితంగా అభిశంసించారు. ఇది ఒక అతివాద ధోరణికి నిదర్శనం. ఆధునిక కవిత్వం

---

5. శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, 'నవ్యసాహిత్య పరిషత్తు సప్తమవార్షిక సమావేశాధ్యక్షోపన్యాసము', 'భారతి', ఏప్రిల్, 1940.

ఆంగ్లసాహిత్యం చేత ప్రభావితం అయిందని అందరూ అంగీకరిస్తారు. అయితే శ్రీ విశ్వనాథ దృష్టిలో అది ఒక అపరాధం. కొత్త అంటే అవాంఛనీయమనే అభిప్రాయం ఈ దృక్పథానికి మూలం. ఇంకొక అతివాద ధోరణి మార్క్సిస్టు విమర్శకుల రచనలలో కనిపిస్తుంది. 'మార్క్సిజం ఆధునిక భావచేతనలో ఒక ప్రధానమైన అంశం. వర్గాలు వాటిమధ్య సంఘర్షణలు ఉన్నంతకాలం మార్క్సిజానికి దోషం పట్టదు. దాన్ని కళలకి అన్వయించడానికి సిద్ధాంతాన్ని గుర్తెరిగి ఉంటే మంచిది' అని శ్రీ కె.వి.రమణారెడ్డి ఆధునికతకి మార్క్సిస్టు అవగాహన అవసరం అని అభిప్రాయపడ్డారు. 'ఆధునికత' అనేది మధ్యయుగాల భావవల్మీకాల్ని తవ్వి పారేసిన ఆయుధం అని రాచరికంపైన, మతంపైన విప్లవం అనే ఇంకో విమర్శకుడు స్పష్టీకరించారు[7]. ఆధునికసాహిత్యం ఒక రాజకీయ దృక్పథానికి నిబద్ధమై ఉండాలి అని నిర్దేశించడం ఆధునిక సాహిత్య వికాసానికి సంపూర్ణంగా దోహదం చేసిందని చెప్పడం కష్టం. రాజకీయ నిబద్ధత, పార్టీల ప్రత్యక్ష పరోక్ష దోహదాలు కవిత్వానికి తాత్కాలికమైన 'గిరాకీ' ని కలిగించినా సార్వకాలికమైన సాహిత్యసృష్టికి ఎక్కువ ఉపయోగించవు. మార్క్సుకూడా ఈ విషయంలో తీవ్ర ధోరణిని సమర్థించలేదు.

---

6. కె.వి.రమణారెడ్డి, 'తెలుగు సాహిత్యం - మార్క్సిజం ప్రభావం', 'మహతి', 76.
7. ఆర్వేయార్, 'సాహిత్యతత్వం', 37-39.

మార్క్సు సహచరుడు ఏంజెల్స్ 'చిల్లర రచయితలు తమ ప్రజ్ఞాలేకపోవడాన్ని దాచిపెట్టుకోడానికి రాజకీయాలని ఉల్లేఖిస్తార'ని, అది సాహిత్యానికి అభిలషణీయం కాదని భావిస్తూ

> It became more and more the habit, particularly of the inferior sorts of <u>literati</u>, to make up for the want of cleverness in their productions by political allusions, which were sure to attract attention .....a worthless fellow who, due to lack of talent, has gone to extremes with tendentious junk to show his convictions, but it is really to gain an audience[8].

అని కవిత్వానికి కావలసింది ప్రజ్ఞకాని, రాజకీయ నినాదాలు కావు అని స్పష్టం చేశారు. లెనిన్ కూడా ఇదే భావాన్ని వ్యక్తంచేస్తూ "Literature is least of all subject to mechanical adjustment or levelling, to the rule of majority over the minority" అని రాజకీయాలని, సాహిత్యాన్ని యాంత్రికంగా సమానస్థాయికి చేర్చే ప్రయత్నాన్ని )(equalisation of politics and literature) తీవ్రంగా విమర్శించారు[9]. ఈ మాటలు కవికి కావలసింది రాజకీయస్పృహకాని రాజకీయ నిబద్ధత కాదు అని స్పష్టంచేస్తున్నాయి.

---

8. Engels, Letters, Quoted in 'Marxism and Literature' (ed by Raymond Williams), 200.
9. Quoted in 'Kavisena' Manifesto (Vol.1), 39-40.

ఆధునిక కవిత్వం ప్రాచీన సంప్రదాయాన్ని పునరుద్ధరించాలని దీక్షాకంకణం ధరించ నవసరంలేదు. అభ్యుదయం అంటూ వీరావేశంతో ''ఎర్రెర్రని కేకలు' వేయనూ అక్కరలేదు. ఆధునిక మానవ జీవితాన్ని సూక్ష్మదృష్టితో, సున్నిత హృదయంతో పరిశీలించి పాఠకుల హృదయాలపై ప్రగాఢమైన ముద్రవేసే విధంగా తదుచితమైన శబ్దమాధ్యంతో ఆ అనుభూతులని, అనుభవాలని ఆవిష్కరించాలి.

అధునికాంధ్ర కవిత్వంలో తీవ్రవాద ధోరణులని - ప్రాచీనమైనా అధివాస్తవికమైనా - ప్రతిబింబించే ప్రయోగాలు కనిపిస్తాయి. సమకాలీన సామాజిక రాజకీయ వ్యవస్థని కుష్ఠువ్యవస్థగా భావించిన దిగంబరకవులు, ఆయుధం అలీనంగా ఉండదు అని ప్రకటించిన శ్రీశ్రీ విప్లవ భావాన్ని అనుసరించిన విప్లవకవులు అతి తీవ్రధోరణిలో, ఒక్కొక్కసారి అశ్లీలంగా అకవితావేశంతో రచనలు చేశారు. కాని అవి తాత్కాలిక ప్రయోజనాన్ని సాధించి, పరిమితపాఠకులనే ఆకర్షించగలిగాయి. సజీవంగా భారతదేశంలో ప్రవహించే సంప్రదాయధార నవ్యప్రక్రియల్లోని సుగుణాలని, సౌందర్యాలని తనలో చేర్చుకుంటూ ముందుకు సాగిపోతుంది. ఈ సమన్వయశక్తి భారతీయాత్మ సజీవ శక్తిని, ఔన్నత్యాన్ని వెల్లడిస్తుంది. ఋగ్వేదవాణి అన్ని దిక్కులనుంచిని ఆహ్వానిస్తూ 'ఆ నభద్రాః క్రతవో యన్తు విశ్వతః' ఋగ్వేదం, (I-89-1) అని భారతీయాత్మ వైశాల్యాన్ని, ఔన్నత్యాన్ని ప్రకటించింది. ఆధునికాంధ్రకవిత్వంలో సాహిత్యప్రక్రియల్లో రాజకీయ సాంఘిక దృక్పథాల్లో, తాత్త్విక చింతనలో విభిన్న మార్గాలని అనుసరించి తమ కవిత్వంలో సమగ్ర సమన్వయాన్ని సాధించిన కవులు 'ఆధునికత' కి నిజమైన ప్రతినిధులు.

ఈ దృష్టిలో పరిశీలిస్తే ''కొత్తపాతల మేలు కలయిక''ని సాదరంగా ఆహ్వానించిన గురజాడ అచ్చమైన ఆధునికుడు. ఇటువంటి సమన్వయ దృక్పథాన్ని తమ కవిత్వంలో ప్రతిభావంతంగా ప్రదర్శించిన ఆధునిక కవులలో బాలగంగాధర తిలక్, డా.దాశరథి, డా.నారాయణరెడ్డి ప్రముఖులు. సామాజిక దర్పణంగా, వ్యక్తిత్వ ఆవిష్కరణగా వీరికవిత్వం వివిధ ప్రక్రియలని ప్రదర్శిస్తోంది. ఈ వివిధ ప్రక్రియలని వ్యక్తీకరించడానికి ఈ కవులు వివిధ కావ్యబింబాలని తమ కవిత్వంలో ప్రయోగించారు. ఈ కావ్యబింబాలని విపులంగా ఆధునిక కాలానికి, కవులవ్యక్తిత్వానికి అభివ్యక్తీకరణ చేసే ప్రయత్నాలుగా పరిశీలనచేసి ఈ కావ్యబింబాలు వీరి కవిత్వపు విలువల్ని నిర్ణయించగలిగే నికషోపలాలుగా వివేచన చేయడానికి ఈ భాగంలో ప్రయత్నం చేశాను.

# బాలగంగాధర తిలక్

నైక నదీనద-అంత స్సింధువు

## బాలగంగాధర తిలక్

## నైకనదీనద అంతస్సింధువు

ఆధునికాంధ్ర సాహిత్యంలో వివిధ కవితా మార్గాలకి, విరుద్ధ రాజకీయసిద్ధాంతాలకి, విభిన్నదృక్పథాలకి సంగమం అని వర్ణించదగిన సమన్వయ కవితాస్రవంతికి సముజ్జ్వల ప్రతినిధి దేవరకొండ బాలగంగాధర తిలక్.

ఏదేశ సంస్కృతి అయినా ఏనాడూ కాదొక స్థిర బిందువు
నైక నదీనదాలు, అదృశ్యంగా కలిసిన అంతస్సింధువు
ఐదు ఖండాల మానవ సంస్కృతి
అఖండ వసుధైక రూపాన్ని ధరిస్తోంది [1]

అని విశ్వసించిన తిలక్ తమ కవిత్వంలో తమకి అత్యంత ప్రీతిపాత్రమైన సౌందర్య దృష్టిని, అభ్యుదయ భావనని, మానవతాదృక్పథాన్ని, వెల్లడించారు. వీరు తమ కవిత్వంలో కృష్ణశాస్త్రి భావకవితా సంప్రదాయాన్ని, శ్రీశ్రీ అభ్యుదయభావనలని, గురజాడ మానవతా దృక్పథాన్ని, మేళవించి శ్లాఘనీయమైన కవితాశిల్పంతో అభివ్యక్తీకరించారు. తిలక్ కీ అభివ్యక్తీకరణకి ప్రతిభావంతమైన, రసోపస్కారకమైన కావ్యబింబపరికల్పన చేశారు. కావ్యబింబ సృష్టికి కవి ప్రత్యక్షానుభవాలతో

---

1. తిలక్, 'మనసంస్కృతి', ''అమృతం కురిసిన రాత్రి'', 74.

పాటు పంక్త్య జ్ఞానాన్నికూడా ఉపయోగించుకున్నారు. తిలక్ ప్రయోగించిన కావ్యబింబాలని వివరంగా పరిశీలించేముందు ఆయన కవితాతత్వాన్ని వివరించే ''నా కవిత్వం'' అనే ఖండికలో వారు వివరించిన కవిత్వలక్షణాలని పరిశీలించడం అవసరం. తమ కవిత్వం రాజకీయ తత్వంకాని, మానసిక వికారాలని విశ్లేషించే మనోవైజ్ఞానికశాస్త్రం కానికాదు. కాపిటలిజం, సోషలిజం వంటి ఆర్థిక వ్యవస్థలకి చెందింది కాదు. తమకవిత్వం అయోమయంగాని, ఛాంద సమయిందికాని కాదు. తమ కవిత్వం స్పష్టమయింది, యౌవన తోరణాలతో మెరిసేది అని వెల్లడించారు. కవి తమ అపరిమిత భావనాశక్తితో సృష్టించిన కవితా ప్రపంచం సౌందర్యమయమయిందని ప్రప్రథమంగా పేర్కొంటూ తమ సౌందర్యాభిలాషని స్పష్టీకరించారు. తిలక్ తత్వతః సౌందర్యారాధకుడు, తమ కవితా ప్రపంచంలోని చందనశాలని అలంకరించిన సుందరచిత్రవిచిత్రాలని పేర్కొంటూ

గాజు కెరటాల వెన్నెల సముద్రాలు
జాజిపువ్వుల అత్తరు దీపాలు
మంత్రలోకపు మణి స్తంభాలు

అమృతం కురిసినరాత్రి, 5.

అని తమ కవిత్వం మంత్రలోకపు అలౌకిక సౌందర్యానికి సంకేతంగా కవి వర్ణించారు. సౌందర్యారాధనతోపాటు కవి హృదయంలో పీడిత మానవాళిమీద అపరిమిత అనురాగం, సానుభూతి ఉన్నాయని వ్యక్తంచేస్తూ

అగాధ బాధాపాథః పతంగాలు
ధర్మవీరుల కృతరక్తనాళాలు
త్యాగశక్తి ప్రేమరక్తి శాంతిసూక్తి
నాకళా కరవాల ధగద్ధగ రవాలు

అని తమ అభ్యుదయ దృక్పథాన్ని వెల్లడించాడు. తమ భావనాత్మ్యాన్ని సూత్రప్రాయంగా వెల్లడిస్తూ

నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయా పారావతాలు
నా అక్షరాలు ప్రజాశక్తులు వహించే విజయ ఐరావతాలు
నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు.

అని మొదటి పాదంలో దగాపడిన తమ్ముళ్ల బాధలకి కరిగిపోయే తమ హృదయానికి, మానవతా దృక్పథానికి దయాపారావతాలని అనే కావ్యబింబాన్ని, రెండవ పాదంలో దౌర్జన్యాన్ని ఎదిరించే ప్రజాశక్తుల విప్లవవాంఛని వ్యక్తీకరించే విజయ ఐరావతాలనే కావ్యబింబాన్ని, మూడవ పాదంలో తమ సౌందర్యాభిలాషని తెలియచేసే ''వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు'' అనే కావ్యబింబాన్ని తిలక్ ప్రయోగించారు. ఈ ఖండిక తిలక్ కవితాతత్వాని కంతటికీ దర్పణం పట్టే ప్రతిభావంతమైన కావ్యబింబ సమాహారం, కవి వ్యక్తిత్వాన్ని సమగ్రంగా ఆవిష్కరించే సమ్యగ్రచనా ప్రణాళిక.

## ప్రకృతి దర్శనం

సామాన్యంగా కవులకి, అందులో జానపద వాతావరణంలో తమ బాల్యాన్ని గడిపిన కవులకి, ప్రకృతి ప్రతీకల కాణాచి. తిలక్ పుట్టిపెరిగిన తణుకు వంటి గ్రామతుల్యమైన పట్టణం, ఆ పరిసరాలలోని సస్యశ్యామల ప్రకృతి అందించిన రమణీయదృశ్యాలు కవి మనసుమీద ప్రత్యక్షానుభవముద్రలని వేశాయి. కవి మానసిక పరిస్థితికి అనుగుణంగా ఒక్కొక్కసారి ప్రకృతి సౌందర్యదేవతగా శృంగారమూర్తిగా, ఆనంద ప్రదాయినిగా కనిపిస్తే ఇంకొకసారి భయద స్వరూపిణిగా, భీతావహగా, నిర్దయురాలిగా కనిపిస్తుంది. మరొకసారిప్రకృతి కవి హృదయంలో అభ్యుదయ భావాలకి, మానవతా దృక్పథానికి సంకేతంగా, తాత్త్విక దృష్టికి ఆలంబనంగా కనిపిస్తుంది. ఒక్కొక్కసారి వేరు ప్రకృతితో తాదాత్మ్యం చెంది ఉద్రేకభావన పొందుతారు. ప్రకృతిని తమ ప్రియురాలిగా, ఆరాధ్య దేవతగా తమ భావనలని ఆపాదించడానికి ఉపకరించే శక్తిగా కవి భావించి తదుచితమైన కావ్యబింబాలని కని తమ కవిత్వంలో ప్రయోగించారు. వేటిని కవి దృక్పథాలని ప్రతిబింబించే వివిధ వర్గాల కావ్యబింబాలుగా కొంత వివరంగా పరిశీలిద్దాం.

ప్రకృతిని సౌందర్యమూర్తిగా భావిస్తూ ''భ్రాంతి'' అనే ఉత్పలమాల పద్యంలో

తో చెదనేవు రత్నములతో విరచించిన కుచ్చుపాగలతో
వేచిన చందనా నిలపు వీథుల వత్తువటంచు - అరబే
రాచకులాస్య మెక్కి యిరుప్రక్కల బర్హిసుబర్హాదిత్రో చి
త్రోచిత చామరమ్ముల విలోల లతాంత పరాగమేర్పడన్

'భ్రాంతి', ''ప్రతిభ'', 1942.

అని ప్రబంధశైలిలో ప్రబంధఉపమానాలని ప్రయోగిస్తూ కవి ప్రకృతిని వర్ణించారు. 'శిశిరము' అనే ఖండికలో చలిని శృంగార భావోద్దీపకంగా చిత్రిస్తూ

ఈ చలికారు రేయి రచియించిన పాపట జారు మక్కలం
తోచి తుషారపుం జడుల దాగిన మేన తమస్సు శాటిగా
వైచి నికుంజసీమ చలి వాపక వర్ష్యపుజంట కౌగిలిన్
వాచిన పావురాయెలుగు బాధను మ్రాన్పడినిల్చుచిత్రమ్మొ

'శిశిరం', ''ప్రతిభ'', 1945.

అని చలికాలంలో చీకటి రాత్రి ప్రేయసితో నికుంజసీమలో కూడిఉన్న పావురానికి చలిబాధ తప్పదు. ఆ చలిలో గొంతువిడి మాటరాదు అని తెలియచేయడానికి కవి తమ భావుకశక్తిని ప్రదర్శిస్తూ మంచు బిందువులు భూమి మీద రాలడాన్ని

ఆకాశం పాపటనుంచి జారే నక్షత్రాలుగా, చీకటి ఆవరించిన ఆకాశం కింద ఉన్న పాపురం చీకటిని దుప్పటిగా కప్పుకున్నట్టు రమణీయంగా చిత్రించారు. వర్షాన్ని కని శృంగార రసోపస్కారకంగా భావిస్తూ,

నా యెదలోన వర్ష రచనాన్విత చిత్రరవమ్ములట్లె నే
వ్రాయని గీతపుం గతుల భాతిగ నిల్చెను నీలమేఘ కౌ
శేయము దాల్చి చందన పటీర సుగంధిల యౌవనాంగ రే
ఖాయుత కష్టాలాంకనయి కౌగిలిచేరెను వార్షలోకమున్ [2]

''వర్ష'', 44.

అని వర్షం సృష్టించిన వివిధ చిత్రాలని, శబ్దాలని తమ మనసులో కవిత్వ సృష్టిముందు ఏర్పడే స్పష్టాస్పష్ట ఆకృతులుగా చిత్రిస్తూ, అని నీలమేఘమనే పట్టు వస్త్రాన్ని ధరించి చందనం తన యౌవనాంగములకి పూసుకుని శృంగారానుభవానికి సిద్ధమయినట్లు తమ శృంగార భావనని కవి ప్రకృతికి ఆపాదించారు. ఈ ఖండిక కవి యౌవనదశలో రచించడం గమనించదగింది. ఈ దశలో వీరి కవిత్వంలో కావ్యబింబం పరికల్పనకి వారు అధ్యయనం చేసిన ప్రబంధాల ప్రభావమేకాక, భావకవుల కవితారీతులుకూడా అధికంగా ఉపకరించాయి. ప్రకృతి సౌందర్యం కవికి ఆనాటి కవిత్వ వాతావరణానికి, వారితరుణ వయసుకి అనుగుణంగా, శృంగార మయంగా కనిపించడం సహజం. ''శరత్పేయసి'' అనే ఖండికలోకూడా

---

2. డా. ఎ. నరసింహారావు, తిలక్ కవిత్వ తత్వం - అముద్రిత సిద్ధాంతవ్యాసం లో తిలక్ అముద్రిత రచనలు, సంకలితంకాని రచనలు చేర్చబడ్డాయి. ఈ రచనలు సిద్ధాంత వ్యాసం నుంచి సేకరించబడ్డాయి. పుటల సంఖ్య ఉదాహరణల ప్రక్క ఇవ్వడం జరిగింది.

మెత్తని పట్టు చీకటుల మేలిమి దుప్పటిలోన కౌగిలిన్
పత్తుము, నాకపోల గళదూర్మికలై చను బాష్పవారితో
వొత్తెద నీయురమ్ము తడియై ఒకవింత సొబంగు దాల్చియా
మత్తును జోలపాడి నను మై మరపింపుము శర్వరీప్రియా!

శర్వరీప్రియ, 76.

అని శర్వరిని (రాత్రిని) తమ ప్రియురాలిగా భావిస్తూ చీకటిని పట్టు దుప్పటిగా కప్పుకుని, శర్వరీ పరిష్వంగంలో ఆమె అనురాగపు జోలపాటకి మైమరుస్తానని కవి తమ శృంగారాతిశయాన్ని వెల్లడించారు. అముద్రితాలుగా నిలిచిపోయిన కొన్ని రచనలకి తిలక్ శీర్షిక ఏది నిర్ణయించకుండా వాటికి అంకెలను మాత్రమే నిర్ణయించి వదలిపెట్టారు. ఈ కవితలు కవి పరిణత కవిత్వ శిల్పాన్ని వెల్లడిస్తున్నాయి. తిలక్ దృష్టిలో బ్రతుకులో మధుర క్షణాలు స్వప్నలోకానందాన్ని కలిగిస్తాయి. అటువంటి క్షణాలలో ఆనందం ఒకరకమైన విషాదానికి దగ్గరగా ఉంటుంది అని భావిస్తూ

స్వప్నజీవ న

స్నపితములైన భావములు, చల్లని వెన్నెలనంటి జాలితో
యెడద కరింగి యేడిచిన నిశీథపు టొంటరివేళ నాత్మలో
శివమయితాండ ప్రచలిత నాదము వేదముపోలె మ్రోవగన్

240.

అని జాలిని చల్లని వెన్నెలగా రాత్రి ఒంటరివేళ ఆత్మలో చెలరేగేనాదాన్ని శివతాండవ సదృశమైన వేదంగా కవి చిత్రిస్తూ ప్రకృతిలో ఆనంద విషాదాల సమ్మేళనాన్ని కవి సూచించారు. ప్రకృతి రమణీయకతని వర్ణిస్తూ

తెరలై జారిన లేతమబ్బుగములందే అందకనేము తె
మ్మెర లోయావనములోలబుసేసినవి సుమ్మీ మందమందాక్షసుం
దర సాయం రమణీ కపోల యుగళోత్పలమ్ము లన్నింటి, చెం
దిర పూతల్ ఒకయింత రేగికొన తత్సమంత సీమాంతముల్

241.

అని చెదిరిన లేతమబ్బుల్ని సంధ్యారమణీ కపోలాలపై అల్లలాడేముంగురులుగా కవి రమణీయంగా చిత్రించారు. జీవితం అందంగా, ఆనందంగాకొనసాగాలనే కోరిక కవి

సరికొత్తగ తెరలెత్తిన తొలివేకువ వెలుతురులో
సరదాగా సంగీతపు నెలయేరై ప్రవహిద్దాం

పదం 5, 252.

అని జీవితం శృంగారమయం కావాలనే ఆశని

మనకి వలపు హవాయ్ ద్వీపంలో విరిసిన వెన్నెల
మనకి సదా మామిడి తోపున కట్టిన నూగే ఉయ్యాల

పదం 6, 252.

అని తమ శృంగార భావనకి ప్రకృతిని ఆలంబనగా కవి చిత్రించారు. ప్రకృతిని ప్రణయ దేవతగా భావిస్తూ, ఆమె ప్రణయ కేళిని

> పయోద తన పయ్యెదగా వేసుకొన్న సాయంసతి
> నక్షత్రపు కనులుగీటి నెలరాజును రమ్మన్నది
>
> పద్యం 11, 252.

అని చిత్రించారు. ''వసంతం'' అనే ఖండికలో

> గుసగుస లాడుతూ వస్తున్న గాలివెంట తొలగి పోయినట్టి దేనిది మల్లెచెట్టిలా
> ఆడదానిలా వుందేనిది
>
> 258.

అని ప్రకృతిని నవయౌవనంతో మిసమిసలాడే కన్యగా భావించి, ఆ యౌవనంతో మంతనాలాడే గాలి గుసగుసల్ని కవి మనకి వినిపించారు. ''శరద్రాత్రి'' అనే అమృతరాత్రి రచన తిలక్ వెన్నెలకి చేసిన అందమైన, అపూర్వమైన శబ్ద రూపకల్పన. కవి వెన్నెలని తను పంచేంద్రియాలతో అనుభవించి, ఆ అనుభవానికి చిరస్మరణీయమైన, రమణీయమైన కావ్యబింబ పరికల్పన చేశారు. కార్తీకమాసపు రాత్రివేళ కవి ''చల్లని కమ్మని వెన్నెల''ని ''తెల్లని మెత్తని వెన్నెల''ని, వెన్నెలలో చల్లదనాన్ని, సువాసనని, ధావళ్యాన్ని, మెత్తదనాన్ని అనుభవించి పాఠకులకికూడా ఆ అనుభవాలని అందించారు.

శిశువు లాంటి వెన్నెల, నవ
వధువు మనస్సులాంటి మధువులాంటి వెన్నెల
కలవంటి వెన్నెల కాళిదాసు కవితలాంటి వెన్నెల.....

259.

అని వెన్నెల నిసర్గమనోహరమైన అనుభూతిని కవి చిత్రించారు. వెన్నెల సృష్టిలో కాలకి బాట అనిభావిస్తూ

ఈ రాత్రి నిద్రిత సర్వధాత్రిమీద
ఎవరో తళుకు తళుకు ఊహల కలలపుప్పొడిని వెదజల్లి వెళ్ళారు
ఎవరో మెరిసే ముఖమల్ జంబుకానా పరచి వెళ్ళారు.

అని వెన్నెల మోహ కవాటాన్ని తెరుస్తుందని కవి సూచించారు. వెన్నెలని శృంగార భావోద్దీపకంగా భావిస్తూ

చలి చలిగా సరదాగా ఉంది వెన్నెల
చెలితొలి రాత్రి సిగ్గులాఉంది
పడక గదిలో వెలిగించిన అగరొత్తుల వాసనలావుంది

260.

అని వెన్నెలఅందాలని, సువాసనలని ప్రశ్నిస్తూ

ఇది సృష్టి సౌందర్యానుభూతికి టీక
ఇది తరుణశృంగార జీవితానికి ప్రతీక

261.

అని ప్రకృతిని తాము సౌందర్యానికి, శృంగారానికి అధిదేవతగా భావించినట్లు, కవి తమ కవిత్వానికి తామే టీక చెప్పినట్లు తెలియచేశారు.

✓ తిలక్ తత్వతః సౌందర్యారాధకుడు. వీరి సౌందర్యారాధన ప్రకృతి చిత్రణలో అధికంగా కనిపిస్తుంది. వీరిని ఆధునిక వచనకవులలో అగ్రగణ్యునిగా, వచనకవితాసారథిగా నిలబెట్టిన ఏకైక కవితా సంకలనం ''అమృతం కురిసినరాత్రి''. ఈ సంకలనంలో వీరు ప్రకృతిలో తమ సౌందర్య కాంక్షని దర్శించి, ఆ ఆనందానుభూతికి రమ్యాక్షరాకృతి కలిగించిన సందర్భాలు అనేకం. ''అమృతం కురిసిన రాత్రి!'' అనే ఖండికలో తమ సౌందర్యపిపాసని ప్రకృతిలో దర్శిస్తూ, అందరూ నిద్రపోతున్న సమయంలో తాము ఇల్లువిడిచి, దూరంగా వెన్నెల మైదానంలోకి వెళ్ళి నిలుచున్న సమయంలో దర్శించిన దృశ్యాలని చిత్రిస్తూ

ఆకాశంమీద అప్సరలు
ఒయ్యారంగా పరుగులెత్తు తున్నారు
వారి పాదాల తారా మంజీరాలు
ఘల్లు ఘల్లుమని మ్రోగుతున్నాయి.
వారిధమ్మిల్లాల పారిజాతాలు
గుత్తులు గుత్తులై వేలాడుతున్నాయి

'అమృతం కురిసిన రాత్రి', 6.

అని రమణీయమైన వర్ణనచేసి తమ భావుకశక్తిని వ్యక్తంచేశారు. ఇంకా

వారు పృథు వక్షోజ నితంబ భారలై
యౌవన ధనుస్సుల్లా వంగిపోతున్నారు...... 6.

అని వారి అందాన్ని వంగుతున్న ధనుస్సుల్లారమణీయంగా వర్ణించారు. తనని అందానికి ప్రతిరూపంగా వర్ణించుకుంటూ ఆ అప్సరోభామినులు తనని

అందమైన వాడు
ఆనందం మనిషైనవాడు
కలంపట్టు కుచ్చు లూగుతున్న కిరీటం ధరించాడు
కళ్ళచివర కాంతిసంగీతాన్ని రచిస్తున్నాడు..... 6.

అని వర్ణించుకుని అందానికి, ఆనందానికి ప్రతినిధిగా కవి నిలబడ్డారు. ఆ మధుర క్షణాలలో దుఃఖాన్ని, చావుని జయించగలిగే ''అమృతంపుసోన'' కురిసింది. ఆ అమృతాస్వాదనంచేసి కవి తాను అమరుడై.

కాంక్షా మధుర కాశ్మీరాంబరం కప్పుకున్నాను
జీవితాన్ని హసన్మందార మాలగా ధరించాను 7.

అని అస్వతంత్రికి, అలవాటుకి దూరంగా ''అనంత చైతన్యస్రోతోవాహాన్ని'' అందుకున్న సౌందర్యారాధకుడిగా కవి చిత్రించుకున్నారు. ఈ సౌందర్యారాధనే కవిని అమరుణ్ణి చేసింది. 'Beauty is truth and truth beauty' 'A thing of beauty is a joy for ever"[3] అని విశ్వసించిన కీట్సు సౌందర్యారాధనకి తిలక్ ఆంధ్రసాహిత్యంలో ఏకైక వారసుడు. నెహ్రూ మరణానంతరం రచించిన ''స్మృతిగీతం''లో ''ప్రిన్స్ ఛార్మింగ్'' అయిన నెహ్రూని

చలజ్జీవన దైనందిన కోలాహల పాంశుపరాగంలో
తనలో తానొక ఏకాంతసౌందర్యం రచించుకున్న స్వాప్నికుడు.
56.

---

3. John Keats, 'Beauty is truth and truth beauty' 'Ode On a Grecian Urn', L:49.
'A thing of beauty is a joy for ever' Endymion, L:1.

అని స్వప్న రికలు అతని శిరసుచుట్టూ పరిభ్రమిస్తున్నాయని స్వాప్నికునిగా నెవారి సౌందర్యమూర్తిని కవి ప్రదర్శించారు. ''యుగళగీతిక'' అనే ఖండికలో ప్రకృతి అందాలని తమ చాక్షుషశక్తితో , ఘ్రాణశక్తితో అనుభవించి పాఠకులని అమితంగా ప్రభావితంచేసే విధంగా కవి చిత్రించారు.

కిటికీ అవతల
కుండులోని పూలమొక్కలు
పచ్చని ఆకుల పచ్చివాసనలు 67.

కవి మనచేత ఆఘ్రాణింపచేసి

ఆకాశపు వంపువద్ద
తెలిమబ్బుల వలయంలో
మెరుస్తున్న అరవ్ర 67.

ని మన కళ్ళముందు నిలబెట్టారు. గదిలో ఉన్న తనప్రేయసిని ''కన్నుదుల జాలి వంటి ఆనందం వంటి / ముగ్ధమైన, స్నిగ్ధమైన / ఆకర్షణ'' ని ప్రతిభా వంతమైన, విశిష్ట కావ్యబింబాల ద్వారా చిత్రించి తమ శ్రవణేంద్రియాన్ని సున్నితంగా ఉపయోగిస్తూ

కిటికీ అవతల
ఒకవెన్నెల బిందువు
కొబ్బరి మొవ్వల నీకి-జారినట్లు
వినపడి వినపడని చప్పుడు 68.

ని కవి విని మనకి వినిపింపచేశారు. ''అదృష్టాధ్వగమనం'' అనే ఖండికలో తనని ఒక ఊహా మనుష్యునని, ఏకాకినని వర్ణించుకుంటూ, తమ విశిష్ట వ్యక్తిత్వానికి రూపకల్పన చేస్తూ ''నన్ను కికురించిన కలలకోసం / నా కోర్కెల వెలుగుల వజ్రాలకోసం'' 78 నిత్యాన్వేషణ చేస్తానని తెలియచేస్తూ తను స్వాప్నిక దృక్పథాన్ని ఈ విధంగా వెలువరించారు.

అర్ధరాత్రివేళ
ఊరి పొలిమేరలో లోటిలో
రాలిపడిన నక్షత్రాన్ని నిర్ఝరీ సురుచిర స్వప్నాన్ని
ఏరుకొని జేబులో దాచు కుందామని
ఎంత ప్రయత్నించే వాణ్ణి
అప్పుడు నావీపుమీద తారల తళుకు
నా నొసటిమీద క్రొన్నెలవంక కులుకు 78.

కష్ట పరంపరలలోకూడా తాము సౌందర్యాన్వేషణ చేయగలమని, ఒక్కక్షణమైనా సౌందర్య దర్శనాన్ని పొందగలనని తమ ఆశాభావాన్ని కవి వ్యక్తంచేశారు. తమ సౌందర్యపిపాస పుట్టుకతోనే అబ్బిందని భావిస్తూ

నే పుట్టినపుడు
ఏ పిచ్చి పొగడ పువ్వుల గాలిసోకిందో
ఏపండు వెన్నెల నుత్తు కమ్మిందో 79.

అని తమ జన్మ సౌందర్యాభినివేశానికి జన్మగా చిత్రించారు. తమ సౌందర్యాన్వేషణకి ఇంద్ర ధనుస్సులని, అదృశ్యస్వరాలని, అశ్రుత గాంధర్వాలనికూడా కవి ప్రతీకలుగా గ్రహించారు. జీవితంలో ఎన్నో కష్టనిష్ఠురాలకి లోనవుతూ ''కంటకిత కానన మార్గాల / పడుతూ లేస్తూ'' ఉన్నసమయంలోకూడా తమ మనస్సులో ''అద్భుత సౌధాల మణికవాటాలు తెరచుకోవటం మానలేదు'' అని తమ నిరంతర సౌందర్య పిపాసని తెలియచేశారు.

ఇప్పటికే మధుమాసంలో
సహకార తరువుల కింద పవ్వళించినవేళ
నా గళాన సౌందర్యమధూళి చిందుతుంది.....
కఠిన మనస్సరస్తీరాల నా కవిత
కలికల కళాకారపు కొత్తచెట్లని నాటుతుంది 80.

అని తను ప్రగాఢమైన ఆశని ప్రకృతిలో దర్శించారు. ''దృశ్యభావాలు'' అనే ఖండికలో ప్రకృతిలో అందమైన దృశ్యాలు తనలో కలిగించే భావాలకి రూపకల్పన చేస్తూ ''చదలచుక్క, నెమలిరెక్క, అరటిమొక్క, ఆమెనొసటి కస్తూరిచుక్క

కొలని గట్ల పడుచుపిల్ల
కుచ్చెళ్ళతో పంతమాడి
కలలమెట్ల వంగి నడచి
అలల కడలి అంచులొరసి
నా తలపులో కలిసిపోయి
నా పలుకులలో పరిమళించు ౯౦.

నని రమ్యకావ్యబింబ పరికల్పన చేశారు. ప్రకృతి అందాలు తన మనసులో ప్రవేశించి తన వ్యక్తిత్వంతో తాదాత్మ్యం పొంది, ఆ వ్యక్తిత్వానికే ఒక సుందర రూపాన్ని సంతరిస్తాయి. కవితాసృష్టికి అవసరమైన ఈ సత్యాన్ని కవి సూచించారు. ''వానకురిసిన రాత్రి'' అనే ఖండికలో వానచినుకులని

చినుకు చినుకుగ వానకురిసి నటు నిశికి
సన్నచీకటి దోమతెర కట్టినటు 96.

అని సహజసుందరంగా చిత్రించారు. గోదావరి వరదలలో భీతహరిణేక్షణలాగా అందంగా ఉన్న రాజమండ్రి పట్టణాన్ని ''రాజమండ్రి పాటలు'' అనే ఖండికలో

భయం మీద రాజమండ్రి తెప్పలా తేలుతోంది
అంచులు మోసిన గోదావరి ఆకాశంకిందకి దిగినట్టుంది
ముచ్చటగా రైలు వంతెన ముత్యాల వడ్డాణంలా అమరింది.

98.

అని ప్రకృతి బీభత్సాన్నికూడా కవి రమణీయంగా ఊహించి చిత్రించారు. గ్రీష్మంలో రాజమండ్రి అనే యువతిని వర్ణిస్తూ,

రెల్లుపూల బార్డరు వేసిన
నీలాల నేటినైలాన్ చీర
ఒంటిమీద నుంచి జారుతూ 100.

ఉన్నట్టు చిత్రించారు. ''వానలో నేతో'' అనే ఖండికలో ప్రకృతిని తమ శృంగార భావోద్దీపకంగా భావిస్తూ,

ఆకాశాన్ని మేఘం నల్లని కంబళిలా కప్పుకుంది
ఆనందం మనసులో మయూర బర్హాంలా విప్పుకుంది

106.

అని ప్రకృతిని ఆనంద నిధానంగా వర్ణించారు. ప్రకృతిని ఇంకా తమ శృంగార భావాలకి ప్రతిబింబంగా వర్ణిస్తూ,

అరటి తోట నడుంచుట్టి కాలువ పేటవాలుగా మలుపు తిరిగింది
నారికేళ వనాంతాన ప్రాదినం సంకేతంలా మెరుపు మెరిసింది

106.

అని చిత్రిస్తూ 'ధరిత్రి చినుకుల కలనేత వస్త్రాన్ని సింగారించుకుంది'' అని అతిమనోహరంగా శృంగారభావాన్ని వ్యక్తీకరించారు. తమ ప్రేమ ఒక ప్రదేశానికి పరిమితం కాక విశ్వవ్యాప్తము, సార్వకాలికము అయిందని సూచించడానికి తమ ప్రేమ ''మేఘ సందేశం''లోని ప్రియుని ప్రేమవంటిదని, ఆ ప్రేమ ఈజిప్టు నాగరకతా స్తూపాలలో ప్రత్యక్షం అవుతుందని తెలియచేస్తూ

వార్షుకోద్భిం నాకు యక్షసతీ సౌందర్యాన్ని రచిస్తుంది
బాబిలోనియన్, ఈజిప్షు నాగరకతా స్తూపాలలో నీడలలో
ప్రాణప్రియా! మనమిరువురం మధువునేవించినట్టు గుర్తుకొస్తుంది

106.

అని వర్ణించారు. ''విరహోత్కంఠిత'' భావకవితా రీతిలో నడిచిన ప్రేమగీతిక. ఈ ఖండికలో ప్రణయభావన సౌందర్యదృష్టికలిగిన సహృదయులకు లలితంగా, రమణీయంగా కనిపిస్తుంది. కాని 'అభ్యుదయ' విమర్శకులకి ''స్మరశరం'' వంటి పదాల ప్రయోగం కవిని భావకవిత్వపు అగాధాల్లోకికాక 'ప్రబంధకవితా పాతాళంలోకి' తోసినట్లు కనిపించడం విమర్శకుల దృష్టి తారతమ్యానికి నిదర్శనం[4]

---

4. రాచమల్లు రామచంద్రారెడ్డి, 'సారస్వత వివేచన', 116.

తన గది స్వప్నాలతో నిండిపోయింది, ఎన్నో ''సరదాల అగరవత్తులు వెలిగించుకున్నాను'' అని తమ ప్రణయభావాన్ని వెల్లడిస్తూ ''రివ్వున స్మరశరం హృదయాన్ని దూసుకుపోతుంది'' అని విరహ బాధని వ్యక్తంచేశారు. ఆ విరహబాధ ప్రాన..

కిటికీ అవతల హిమస్నాత మాలతీలత నన్ను పలకరించదు
కిటుకు తెలిసిన పొదలలోని గువ్వజంట నన్నూరడింపదు 107.

అని ప్రకృతి తమ వేదనకి ప్రతిధ్వనిగా చిత్రించారు. ''చిన్నారికి చిన్నమాట'' అనే ఖండికలో

జీవితం దేవతల దరస్మితం
బ్రతుకే లలిత లలిత లతాంతమాల 109.

అని జీవితంమీద కవి తమ నిర్ణయాన్ని లలితంగా తెలియచేశారు. ''అద్వితీయం'' అనే ఖండికలో ప్రేయసీప్రియుల మధ్య ప్రణయ భావన రసాద్వైతసిద్ధిని కలిగించిన తాదాత్మ్యాన్ని చిత్రిస్తూ

నేనే శరత్పూర్ణిమల వెన్నెల లాలస నిమ్నగల నేదు కాని
ఓ ఋతు రాజ్ఞీ నాతనువెల్లా నే అనుకూల పవనములు వీచి 123.

అని మానవుల ప్రణయ భావనని ప్రకృతిద్వారా వ్యక్తం చేశారు. ''స్వేచ్ఛా విహారం అనే ఖండికలో ఆనందాన్ని చంపేందుకు అనంతంగా ఉన్న లోకాన్ని వదలి ప్రేయసీ ప్రియులు స్వప్నలోకంలో విహరించడం అభిలషణీయం అని భావిస్తూ అబద్ధాన్ని ఆశ్రయించినా అందం ''నిజాన్ని నిరూపించే నరకం కన్న వెయ్యిరెట్లు నయం'' 125 అని స్వాప్నిక జగత్తుమీద తమ అభిమానాన్ని వ్యక్తంచేశారు. స్వప్నజగత్తుని గురించి

కల ఎప్పుడూ మనిషికిబలం
మిథ్యా జీవన రథ్యలలో
స్వప్నం ఒక సుందర తనుమధ్య 125.

అని తమ అభిప్రాయాన్ని నిర్ద్వంద్వంగా వెల్లడించారు. ఇటువంటి సౌందర్యారాధనని ప్రగతిశీలురం అని ప్రకటించుకునే అభ్యుదయ విమర్శకులు ''ఎస్కేపిస్టు''లని నిందిస్తారని ఊహించి, అటువంటి విమర్శకులు ఊహాశిఖరాల నెక్కలేని భావుకశక్తి విహీనులని స్పష్టంచేస్తూ

ఎవరెస్టుకన్న ఎత్తైన నా
ఊహాశిఖరాన్ని వాళ్ళెక్కలేరు 125.

అని తమ భావుకశక్తి ఔన్నత్యాన్ని కవి వెల్లడించారు. ''నువ్వులేవు నేపాట వుంది'' అనే ప్రేమ గీతంలో నీరవమైన ''ఇజాలూ, రాజకీయాలూ, వాదాలూ,

హత్యలూ, యుద్ధాలూ ఇంకా ఇటువంటి చెత్తా చెదారం" మనసుని మలినం చెయ్యకముందు తమప్రేమ వికసించిందని, ఆ మధురక్షణాలలో

ఆకాశానికీ భూమికీ మధ్యపడిన చిరుచీకటి పలకమీద
రేడియం అక్షరాన్ని వ్రాసుకుంటూ
కాలాన్ని కదలకుండా నిలబెట్టి 128.

ఆ మధుర క్షణాలని శాశ్వతంగా బంధించారు. ఆ క్షణాలలో తమ ప్రణయ కౌగిలిలో తన ప్రియురాలివొడిలో తలపెట్టుకుని అభంగనావిష్టత అయిన ఆమె

వెన్నెల శింజ తనుస్సముద్రాలు పొంగి నేబుజాలు దాటి నా
ముఖాన్ని కప్పి ఒకటే ఒక్క స్వప్నాన్ని కంటున్న వేళ
నా వొంటిని నిమిరి నిర్నిద్ర నిద్రలో పడవేసి నీ ఎర్రని
పెదాలు నానొసటి మీద ఆనందపు నెలవంకల్ని 128.

చిత్రించిన రోజులు తన జీవితంలోకి మళ్ళీ రావనే బాధని వ్యక్తంచేస్తూ, తమ జీవితానికి ఆమెపాట

ఒకటే నిజంలాగ నిర్మలమైన గాలిలాగ నిశ్శబ్దనదీతీరాన్ని
పలకరించే సుక్తిగత మౌక్తికంలాగ 129.

ఉందని చిత్రించారు. ''ప్రాతఃకాలం'' అనే ఖండికలో ప్రభాతసమయాన్ని ''చీకటినవ్విన చిన్ని వెలుతురు'' వాకిట వెలసిన వేకువ తులసి''గా భావించారు. ఇంకా

ఆశాకుంతల ధ్వాంతములో
నవసి యిలపై వ్రాలిన
అలరువా! - అప్స
రాంగనా సఖీ చిరవిరహ
నిద్రా పరిష్వంగము విడ
ఉడు పథమున జారిన
మంచు కలవా ! 132.

అని ప్రభాతకాల సౌందర్యానికి కుసుమపేశలతని, అలౌకిక శీతలత్వాన్ని కవి రమ్యభావనాశక్తితో ఆపాదించారు. ''స్వయంవర'' అనే ఖండికలో సీతాస్వయం వరానికి వచ్చిన శ్రీరామచంద్రుణ్ణి వర్ణిస్తూ, ఆయన సుందరరూపాన్ని దర్శించగానే తనలో ప్రేమ అంకురించిందని వెల్లడించడానికి సీత ప్రకృతి కుసుమ భరితమై పులకించినట్లుగా చిత్రించారు. ''తన వలపు తోరపు పుప్పొడి జల్లు వెల్లువ'' వలన

మాలతీ / పోస మరిచి, మల్లియల యౌవనపున్నునుసిగ్గు, ఏలకీ
వాసిక చిత్ర సౌరభము, పండిన సంపగి తావి వెక్కము

''భారతి'', ఫిబ్రవరి, 1959.

కలిగాయని, సీత తనప్రేమని ప్రకృతిలో దర్శించినట్టుగా కవి చిత్రించారు. అదే విధంగా శ్రీరాముని రాకతో ''నలండల పద్మాల తోరణాలు విరిసె'' నని, ''అడుగు కదిపినంత హల్లకములు పూచి / సభనెల్ల సౌందర్యసరసి జేసె వెదవి చిరునగవు తుంపెసలాడ మల్లెమొగ్గవాన జల్లుజల్లుగ కురిసె'' [26] అని సీత సౌందర్యమూర్తి రాముని ప్రకృతిలో దర్శిస్తూ అతని రూపాన్ని సౌందర్యాభిరామంగా మన కనులముందు నిలబెట్టింది. ''విషణ్ణ వైదేహి'' అనే ఖండికలో నిఖిలాంధ్ర జాతికి సన్నిహితమైన సీతని ప్రకృతిలోని అందాల సమాహారంగా

ఏ శరదిందురేఖ స్పృశియింపగ నవ్విన సన్నజాజి, ఆ
శా నికటాంతరాల చిరుసవ్వడి దొర్లెడి పాలనురుగు, ఏ
మూసిన కొండకోన కొస మ్రోగిన వేకువ వెల్గు మువ్వ

''భారతి'' జూన్, 1961., 78.

అని కవి చిత్రించారు. తను శృంగార భావాలకి అనుగుణంగా ప్రకృతికూడా రూపుదిద్దుకుంటుంది అని తెలియచేస్తూ, కవి హృదయంలో ప్రేమ అంకురిస్తే శిశిరం కూడా అందంగానే కనిపిస్తుంది అనే భావనని

లేత యెండలోన లేమ కౌగిలిలోన
ఋతువొక్క స్వప్న శీధువౌను

ఆటవెలది, ''భారతి''
జూలై, 1963, 38.

అని వ్యక్తీకరించారు. ముద్దుని ప్రకృతినే పులకింపజేసే చేష్టగా భావిస్తూ,

ప్రియుడు తాకినంత పెదవి తేవను పూచె
స్మేర కోరకమ్ము చెలువుమించి

38.

అని వర్ణించారు. మానవుల ప్రణయభావాన్ని ప్రకృతిలో అందానికి సంకేతమయిన నక్షత్రాలకి ఆపాదిస్తూ,

పసుపు లేత యిరుల మునిమాపు వేళలో
చక్కనైన ఒక్క చుక్క పడుచు
మబ్బు తలుపు తెరచి మతకరి జాబిల్లి
కొరకు చూచిలేచి మరలమానె

40.

నని తమ భావుకశక్తిని ప్రదర్శించారు. కవి దుఃఖపడుతుని తన భర్త ఇంటికి తిరిగి రావడం కోసం నిరీక్షించే సామాన్య గృహిణిగా రమణీయంగా చిత్రించారు.

తిలక్‌కి ప్రకృతి ఎక్కువగా సౌందర్యమయంగానే కనిపించింది. తమ సౌందర్యారాధన, శృంగారప్రియత్వం, స్వాప్నికదృష్టి ప్రకృతికి ఆపాదించి ప్రదర్శించారు. ఐ.ఎ.రిచర్డ్స్ వర్ణించిన empathy వీరి కవిత్వంలో బహుముఖాలుగా దర్శనమిస్తుంది. ఫ్రాన్స్‌దేశంలో సింబలిస్టు కవులవలెవీరు అనునిత్యం సౌందర్యాన్వేషణచేసిన సుందరస్వాప్నికుడు. Villiers అనే ఫ్రెంచి కవి అన్నట్టు '' Live ? Our servants can do that for us", (తిలక్‌కూడా జీవితం బతకడం కాదని, అందంగా స్వాప్నిక జగత్తులో జీవించడం అని విశ్వసించారు. కవిత్వం ప్రధాన లక్ష్యాన్ని వివరిస్తూ తిలక్ ''నవత కవిత'' అనే ఖండికలో

> కవిత్వం అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చెయ్యాలి
> విస్తరించాలి చైతన్యపరిధి
> అగ్ని జల్లినా అమృతం కురిసినా
> అందం ఆనందం దాని పరమావధి

''అమృతం కురిసిన రాత్రి'', 76.

అని వెల్లడించారు. ఈ సౌందర్యారాధన సి.ఎమ్. బౌరా సింబలిస్టు కవులని గురించి వెల్లడించిన అభిప్రాయాలకి దగ్గరగా ఉంది.[5] ఇదే భావాన్ని మలార్మే అనే ఫ్రెంచికవి కూడా 'జీవితంలో పరమావధి ఉండటం మాత్రమేకాదు. సౌందర్యం'[6] అని వెల్లడించాడు. తిలక్ తమ కవిత్వంలో ప్రధానంగా సౌందర్యారాధనని ప్రకృతిపరంగా అభివ్యక్తీకరించారు.

కవి తమ మానసిక పరిస్థితికి అనుగుణంగా ప్రకృతిని భీతావహంగా, భయానకంగా, విషాదమయంగా, ద్వేషానికి సంకేతంగాకూడా చిత్రించారు. ''అర్కగీతం'' అనే ఖండికలో ఒకవిషాదస్మృతిని ''విధి తమస్సులు మూసిన దివాంధ రుతిగా'' భావిస్తూ, తమకి శృంగార వాంఛలేదని తెలియచేస్తూ,

కొత్త సింగారమ్ము వలదు, ఉదాత్త సురభిశాత్త
శయ్యా సజ్జితమ్ము వలదు
రసప్లావితము వలదు 10.

అని తమ మానసికస్థితిని ప్రకృతిపరంగా వివరిస్తూ,

నేడు నేను కన్నీరుగా కరిగిన గీతికను, నిగూఢ రెండుగా
చీలిన వెదురు బొంగును
మంటలో అంతరాంతర దగ్ధమైన బూడిదను 10.

5. C.M.Bowra, 'No attempt to serve ends other than beauty,' "Heritage of Symbolism", 4.

6. Mallarme, 'The absolute is not the being but the beautiful', Quoted by C.M.Bowra, "Heritage of Symbolism", 5.

అని తమ పరిస్థితిని చీలిన వెదురు బొంగుతోను, బాడిదతోను పోల్చి స్పష్టంగా తెలియచేశారు. లోకంలో వ్యాపార్తుల్లో ఆవేదనల్ని దర్శించి, వారిపై ఎక్కువ సానుభూతి కలిగి తమ స్వప్నజగత్తు పునాదులు కదిలిపోయాయని తెలియచేస్తూ,

ఈ కనులు
వరదలై పారినవి
ఈ కలలు కాగితపు వేలికలై రాలినవి 12.

అని ప్రకృతిని ఆవేదనాభరితమైన తమ మానసికస్థితికి దర్పణంగా కవి చిత్రించారు. ''వెళ్ళి పోండి వెళ్ళిపోండి'' అనే ఖండికని ప్రతీకాత్మక గీతిక అని వర్ణించవచ్చు. ఈ ఖండికలో శతాబ్దాలుగా మానవజీవితంలో యుద్ధం వలన సంభవించే దయనీయస్థితిని చిత్రిస్తూ, యుద్ధం ఏదైనా, కారకులు ఎవరైనా ఫలితం అమాయకపు జీవుల ప్రాణత్యాగమేనని స్పష్టంచేశారు. కురుక్షేత్రయుద్ధానికి కృష్ణుడు, పానిపట్టు యుద్ధానికి పేష్వాలు, బొబ్బిలి యుద్ధానికి బుస్సీ, ప్రపంచయుద్ధాలకి బిస్మార్క్, హిట్లరు వంటివారు కారకులైనా ఫలితం ఒకటేనని ఈ 'మానవమేధని' ప్రకృతిపరంగా

చీకటి పడే వేళ
చిరుతపులులు పశువుల్ని నోట కరచుకుని పోయేవేళ
చచ్చిన చరిత్ర బొమికల కోసం కుక్కలు కొట్లాడుకునే వేళ
దెయ్యపుమర్రి చెట్టుమీద దీనంగా అరుస్తూ పిట్టలు కళ్ళు తేలవేసే వేళ

20.

ని అతి దయనీయంగా యుద్ధ పిశాచి భయంకర స్వరూపాన్ని కవి చిత్రించారు. అమృతం కురిసినరాత్రి ''అనే సంకలనంలో కని యుద్ధం మానవ సమాజంలో కలిగించే దుష్ట పరిమాణామాలని వై ఖండికలోనే కాక 'పిలుపు' 'సైనికుడి ఉత్తరం', 'టులాన్', 'లయగీతం', 'యుద్ధంలో రేవుపట్టణం' వంటి ఖండికలలో ప్రతిభావంతంగా చిత్రించారు. నిజానికి భారతదేశం మీద, అందులో ఆంధ్రదేశం మీద, యుద్ధం కలిగించే ప్రత్యక్ష ప్రభావం తక్కువే. అయినా రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ప్రపంచమంతట భయాందోళనలు విషవాయువుల్లా వ్యాపించిన మాట నిజం. భయంకర యుద్ధ ప్రభావాలని చిత్రించడానికి కవికి ఆనాటి వార్తాపత్రికలు అందించిన సమాచారమే కాకుండా ఆయనచదివిన (Sigfried Sassoon) Wilfred Owen వంటి ఆంగ్ల యుద్ధకవుల రచనలుకూడా ఉపకరించాయి. ''పిలుపు'' అనే ఖండికలో యుద్ధాన్ని

ధాత్రీజనని గుండెమీద
యుద్ధపు కొరకంచుల ఎర్రని రవ్వలు

22.

అని అపూర్వంగా, భావస్ఫోరకంగా చిత్రించారు. యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన అభాగ్యుల భవిష్యత్తుమీద ఆశలని తుడిచివేసిన రణవిలాసాన్ని

దరిద్రుని నోరులేని కడుపు
తెరచుకొన్న నాలుక బాడిదలో వ్రాసుకున్న మాటలు

22.

అని, మానవత్వం మంటకలిసిపోయిన ఆ దురదృష్ట క్షణాన్ని **వర్ణిస్తూ,**

కాలం విరిగిన బండిచక్రంలా కదలలేక పడిపోతే
మొండి చేతుల మానవత్వం తెల్లబోయిన

22.

దని మానవుని దైన్యాన్ని ప్రకృతిలో దైన్యంగా కవి చిత్రించారు. ఎక్కడో తన వారెదరికీ దూరంగా సైన్యంలో ఉన్న దేశ సంరక్షకుని మనసులో వేరుకున్న భయాన్ని ''సైనికుడి ఉత్తరం'' అనే ఖండికలో కవి పసిగట్టి ఆ భయాన్ని వైయక్తిక కావ్యబింబంద్వారా వ్యక్తీకరిస్తూ,

తెల్లని దళసరి మంచురాత్రి చీకటికి అంచు.....
ఎవరో గడ్డిమేటు మీదనుంచి పడ్డట్టు
నిశ్శబ్దంలో నిద్రించిన సైనికుల గురక
చచ్చిన జీవుల మొరలావుంది 23.

అని సైనికుల క్యాంపుల్లో పేరుకున్న భయాన్ని రవినిమించిన పరిశీలనాశక్తితో కవి ఆవిష్కరించగలిగారు. అక్కడ నెలకొన్న వాతావరణంలో భయాన్ని ప్రస్ఫుటంచేస్తూ

అబ్బ! వణికించే చలి
అందరూ నిద్రపోతున్నారు
అందరూ చచ్చిపోతున్నారు
అర్ధరాత్రి దాటిందని మోగినఒంటిగంట
మంటలా మొహాన్ని కొట్టింది 24.

అని యుద్ధ వాతావరణం కలిగించే భయాన్ని మంటగా కవి ఊహించారు. ఆ సమయంలో అక్కడ కాపలా కాస్తున్న సెంట్రీ

డేరా ముందు గోరీలా నిలబడ్డాడు 25.

అని కార్పొరల్ బూట్సు చప్పుడు ''కడుపులో నేళ్ళు కదులుతున్నట్టు'' గా ఉందని, చుట్టూఉన్న ప్రకృతి వాతావరణంలో ఉన్న చలి తన మనసులో భయానికి కారణంగా భావిస్తూ

అబ్బా! చలి!
చలి గుండెల మీద కత్తిలా తెగింది 25.

అని తమ మనసులో భయాన్ని సైనికుడు ప్రకృతికి ఆపాదించినట్లు కవి చిత్రించారు. రెండవ ప్రపంచయుద్ధ సమయంలో జర్మన్ సైన్య పదఘట్టనలకి లోనైన 'టులాన్' అనే ఫ్రెంచి పట్టణం నిశ్శబ్దప్రశాంతవాతావరణాన్ని కోల్పోయి శత్రు హస్తగతమైన పరిస్థితిని సంకేతాత్మకంగా

నిశ్శబ్దపు మెత్తని పరుపులపైన
నిదురించినది పట్టణమంతా
కొండచివర ఎర్రని నక్షత్రం
రాలిపడింది సముద్రపు నీలంలో 26.

అని పట్టణంలో, ప్రశాంతతని 'నిశ్శబ్దపు మెత్తని పరుపులు' అనే అపురూపమైన కావ్యబింబంద్వారా వ్యక్తంచేశారు. ప్రపంచ విజయాన్ని సాధించాలనే దురాశతో నీలి సముద్రంలా పొంగివస్తున్న జర్మన్‌సైన్యాలకి ఆహుతిఅయిన 'టులాన్' పట్టణాన్ని కొండచివర ఎర్రని నక్షత్రంగా చిత్రిస్తూ, దేశస్వాతంత్ర్య పరిరక్షణకై సన్నద్ధమైన స్వేచ్ఛాపిపాసకి సంకేతంగా టులాన్‌ని కవి ప్రదర్శించారు. యుద్ధం భవిష్యత్తు స్వరూపాన్ని అస్పష్టంగా కొంత భయానకంగా చేస్తుంది అనే చేదు నిజాన్ని

చీకటి కుంపటిలో అస్పష్టభవిష్యత్తు
రాజుకుంటున్నది రవ్వలు రవ్వలై చుక్కలు ముక్కలై 26.

అని మానవాళికి ముందున్న భవిష్యత్తుని చీకటి కుంపటిగా ప్రతిభావంతంగా చిత్రించారు. శత్రునౌకల దాడికిలోనై నీటకలసిన యుద్ధనౌకలని, నావికుల ప్రాణాలని

బలియిచ్చిన ప్రాణదీప్తి
జలధి గర్భాంతరిత బడబాగ్నిలో కలిసి
శిఖలు పఱచి, నాలికలు తెరచి నాట్యమాడింది 26.

అని ప్రకృతి బడబాగ్ని కీలలు పరచి మానవులని అంతంచేసే భయంకర స్వరూపాన్ని కవి చిత్రించారు. ఈ భయానక దృశ్యానికి కారణం ప్రకృతి దయావిహీనతకాదు, మానవుడే మానవునికి ప్రబలశత్రువై తన మరణహోమానికి తయారు చేసుకున్న ఆయుధసామాగ్రి, అకారణ కార్పణ్యం నిజమైన కారణాలు. మానవులలో ఈ దుశ్చింతనని కని ప్రకృతిద్వారా వ్యక్తంచేశారు. జర్మన్‌సేనల దాడికిలోబడిన 'టులాన్'లో కవికి ఫ్రెంచిదేశం విసిమాసిన రక్తపుచురకల ఛాతీ'' కనిపించింది. ఆ సమయంలో డార్లన్, పెటెయిన్, లావెల్‌వంటి చేతకాని ఫ్రెంచి ~~నాయకులు~~ నాయకులు

అధికారపు చీకటిలో గొంతువిరిగిన గుడ్లగూబలు 28.

గా కవికి కనిపించారు. మేల్కొన్న ఖైంచిప్రజల ''నాజీ, నాజీ నరహంతకులు'' అనే కేకలు ''సముద్రపు గుండెలలో తిమింగలములవలె''చెలరేగాయని కవి అతి సహజంగా చిత్రించారు. చరిత్రలో మసకగా మిగిలిన ''పాడుపోయిన ఊరు'' ని చిత్రిస్తూ

ఇది నశించిన ఒకగ్రామం
నిశ్వసించే ఒకశ్మశానం 31.

అని ప్రకృతిని దయనీయంగా చిత్రించారు. రసహీనమైన బ్రతుకుని

కాలిపోయే యిల్లులా జీవితం జరుగుతుంది.....
కాలం పాడు నుయ్యిలా నా కన్నులకు కనబడింది 31.

అని జీవితంలో నిస్సారమైన స్థితిని కవి ఈ ఖండికలో దయనీయంగా చిత్రించారు. గోల్డ్‌స్మిత్ ఆంగ్లంలో రచించిన "The Deserted Village" అనే ఖండిక శీర్షికకి ఈ శీర్షిక అనువాదం అయినా గోల్డ్‌స్మిత్ చిత్రించిన గ్రామం విపులమయింది. ఆ దయనీయ స్థితిని తిలక్ పన్నెండు పాదాలు మించని సంక్షిప్త ఖండికలో చిత్రించారు. ఈ ఖండిక విపుల చిత్రీకరణకాదు. పాడుపడిన ఊరి మీద సంక్షిప్త వ్యాఖ్యవంటిది. ''యుద్ధంలో రేపు పట్టణం''అనే ఖండికలో యుద్ధం ప్రకృతిని వికారస్వరూపిణిగా చేస్తుందని వ్యక్తంచేస్తూ సముద్రంలో ఓడలు

రాత్రిగుండెమీద లేచిన మంటలు
సముద్రంలో ఎర్రని మంటలమాటలు 71.

అని ఆ పీడలు మానవ హృదయాలల్లో రేకెత్తించే భయాలని మంటలుగా ఆ వారి ''జేబుల్లో భయాల బొద్దింకల'' పరుగుల్ని కవి పసిగట్టి వారిమనస్తత్వాన్ని ఆవిష్కరించారు. విమానాలు ఆక్రమించిన ఆకాశం కవికి వికృతంగా కనిపించింది. ఆ విమానాల

రెక్కల మధ్య ఆకాశం ఎర్రని ఎరుపు
చుక్కల మధ్య ఆకాశం చితికిన కుదుపు 71.

అని రణపిశాచి ప్రకృతికి కలిగించిన వికార వికృత స్వరూపాన్ని కవి ప్రదర్శించారు.

''వేసవి'' అనే ఖండికలో కోస్తాజిల్లాలలో వేసవికాలం ప్రకృతి మీద చూపించే ప్రభావాన్ని

కాలం కదలదు గుహల పులి
పంజావిప్పదు, చేపకు
గాలం తగలదు 47.

అని ప్రకృతి ఎండవేడికి నిశ్చలమైన నిశ్చలచిత్రాన్ని(still photograph) కవి ప్రదర్శించారు. ఆ సమయంలో జంతు జాలాన్ని సహజంగా చిత్రిస్తూ

చెట్లనీడ ఆవులుమోరలు
దింపవు, పిల్లిపిల్ల
బల్లిని చంపదు 47.

అని ప్రకృతి భయంకరస్వరూపం ముందు ప్రకృతిలో జీవాలే సహజచేష్టలు కోల్పోతాయని కవి వ్యక్తంచేసి తమ సూక్ష్మపరిశీలనాశక్తిని వెల్లడించారు. తను సహజపరిశీలనకి భావుకశక్తిని జోడించి

ఆకాశం తెల్లని శ్మశానమై
వెదరెను, సూర్యుడు తలలోసెను
మంటలు కదలెను 47.

అని ఉపమించారు. ఇటువంటి సందర్భాల్లో కవి విశ్వసించిన కవిత్వం ఒక ఆల్కెమి అనే సిద్ధాంతం అక్షరసత్యంగా కనిపిస్తుంది. ప్రకృతి భీకర స్వరూపాన్ని గ్రీష్మాతపంలో దర్శిస్తూ మధ్యాహ్నానికి వికృత మానవాకార రూపకల్పనచేస్తూ

నిశ్శబ్దం అంటుకుంది
మధ్యాహ్నం మంటలజుట్టుని విరబోసుకు
నగ్నంగా రోడ్లమీద తిరుగుతోంది 48.

అని ప్రతిభావంతంగా వేసవి తీక్ష్ణతని, వేడితీవ్రతని కవి పాఠకులకి అనుభవైక వేద్యంచేశారు. శ్రీశ్రీ నిస్సహాయురాలైన బిక్షుకస్త్రీని ' భిక్షువర్షీయసి''లో మూర్తీభవించిన దైన్యంగా చిత్రిస్తే తిలక్ ''వై కప్పు వంగి పడు పాడిల్లు వలె'' నిలిచే వృద్ధుణ్ణి ''ముసలివాడు'' అనే ఖండికలో దైన్యానికి సంకేతంగా చిత్రించారు. ఒకనాడు తానునలచి వెండ్లాడిన ఒయారపు భార్య ఆతనికి

విధిలిఖించిన వెర్రి చిత్రమువలె
ఎండిపోయిన ఏటిగట్టువలె 82.

కనిపించింది. చివరికి ఆముసలివాడు ''నాగరికత గమ్యస్థానం'' ''చరిత్రల సారాంశం''అయిన మృత్యువు వైపు పయనిస్తున్నాడని తెలియచేస్తూ, అది ఎవరికీ అర్థంకాని భయంకరమైన చీకటిగా భావిస్తూ

అక్కడ చీకటి లోతెరుగని చీకటి
దట్టపు చీకటి
సుడితిరిగేచీకటి
పాములు బుసకొట్టేచీకటి 83.

అని ఆ చీకటిని సుడిగుండంగా, విషసర్పంగా భీతావహంగా కవి చిత్రించారు. ''ప్రాతః కాలం''అనే ఖండికలో ప్రభాతం సుందరంగానే కాకుండా భయంకరంగా కూడా కవికి కనిపించింది. కడుపునిండిన వారికి ఉదయం కొత్త అందాలకి నాంది అయితే

ఆకలి మాడుచు
వాకిట వాకిట
దిరిగే పేదల
సురిగే దీనుల
సుఖ సుక్షేత్రాని చెరచే
సుందర రాక్షసి 132.

గా కనిపిస్తుంది. మానవులు తమ ఆవేదనలకి ప్రకృతిని ఆలంబనంగా దర్శించుకునే ప్రక్రియని కవి ఇక్కడ ప్రయోగించారు. ''విషణ్ణవైదేహి'' అనే ఖండికలో చాకలివాని మాటలవలన రామునిచేత శంకించబడిన సీత మరోసారి అరణ్యవాసానికి వెళ్ళిన విషాద దృశ్యాన్ని చిత్రిస్తూ ఆ సీత విషాదం ప్రకృతిలో దర్శిస్తూ

ఏమాలోచనలా దృగం వలములందేవార్చ మేఘావళీ
శ్యామాకాశము లోసరిల్లినవి ఆశాహీన కాళచ్ఛవిన్

''భారతి''జూన్, 1961, 77.

అని చిత్రించారు.

సంఘంలో అభాగజీవుల వ్యధామయజీవితాన్ని చిత్రించే సమయంలో ప్రకృతికి రణపిశాచి చేసే వికృత వ్యాఖ్యానాన్ని వివరించే సందర్భంలో కవికి ప్రకృతి కూడా భయానకంగా, మూర్తీభవదైన్యంగా కనిపించింది. ఈ మానసికస్థితి కవికి సహజగుణం కాకపోయినా తోటిమానవుల బాధలకి స్పందించే సుకుమార హృదయం కవికి సహజాలంకారం అని తెలియచేస్తుంది. ''నరకం పాటలు'' అనే అనుముద్రిత రచనలో నరకాన్ని వర్ణిస్తూ

రకరకాల నరకాలు నరకాలు రకరకాలు!
రాకాసి గోళ్ల గీరలు
చీకటి వొంటిమీద నెత్తుటి చారలు
వృశ్చికాలు, వృకాలు, విషకీటకాలు
ఇదేహెల్ ఇదేహెల్ ఇదేహెల్ 259.

అని లోకం నరకప్రాయంగా కవి చిత్రించారు. ఇవేపాటల్లో ప్రతిఋతువు కవికి భయంకరంగా కనిపించింది

శిశిరం పీక నొక్కుతుంది
వర్షం బ్రతుకుని ముంచుతుంది
వేసవి కత్తులు నూరుతుంది
డామిట్! ఋతువులన్నీ దగా కోరులోయ్ 255-256.

అని వాస్తవిక జగత్తుమీద తమ జుగుప్సని వ్యక్తంచేశారు[7].

---

7. ఇదే జుగుప్స తిలక్ లేఖల్లోకూడా మనకి కనిపిస్తుంది. ఒకలేఖల్లో ''అన్ని ఋతువులలోనూకూడా ఎండిపోయిన ఈ మనుషులు, ఊళ్లూ మరీ చికాకు కలిగిస్తున్నాయి. తెలుగుదేశంలో అందం, ఆనందం అనేవి దొరక వేమో!' అని తమ నిరాశని తిలక్ వ్యక్తంచేశారు. 'తిలక్ లేఖలు,' జూన్, 1968

## మానవతా దర్శనం

సౌందర్యారాధనతో పాటు మానవతా దృక్పథం, సర్వమానవ కళ్యాణాన్ని ఆకాంక్షించే అభ్యుదయ భావన తిలక్ కవిత్వంలో ముఖ్యాంశాలు. తమ కవిత్వ లక్ష్యాన్ని వివరిస్తూ ''నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు'' (5) అని తమ అభ్యుదయభావాన్ని కవి వ్యక్తంచేశారు. కవి తమ సమకాలీన సంఘంలో ఉన్న ఆర్థిక అసమానతలని, మూర్తీభవద్దైన్యాన్ని చూసి, ఆ దగాపడిన తమ్ముళ్ళకి కరుణరసభరితమైన రూపకల్పన చేశారు. శ్రీశ్రీ తమ కవిత్వసృష్టికి ప్రేరేపించిన దృశ్యాలని పేర్కొంటూ ''కవితా ! ఓ కవితా ! అనే ఖండికలో నివరించిన ''చిత్ర విచిత్ర శవమంత రోదసీవిహారాన్ని'' స్మరింపచేస్తూ తిలక్ ఆర్తగీతంలో తాను దర్శించిన

ఆకలితో అల్లాడి మర్రిచెట్టు
కింద మరణించిన ముసలివాణ్ని
నిజంగా నిరంధ్రవర్షాన వంతెనకింద
నిండు చూలాలు
ప్రసవించి మూర్ఛిల్లిన దృశ్యాన్ని 13.

కని దయనీయంగా ప్రదర్శించారు. ఒకసామాన్య గుమాస్తా దీనావస్థని అపూర్వ కావ్యబింబ ప్రయోగం ద్వారా

---

8. ''కవిత్వం ఇవ్వవలసింది ఆనందం కాదు. ఉత్తేజం'' అని విశ్వసించే మార్క్సిస్టు విమర్శకులదృష్టిలో తిలక్ అభ్యుదయ కవి కాకపోయినా తిలక్ హృదయంలో అభిమానవులపై స్వచ్ఛమైన సానుభూతి ఉంది. రాజకీయ నినాదాలు, నిబద్ధతమాత్రం లేవు. రాచమల్లు రామచంద్రారెడ్డి, 'సారస్వతవివేచన''. 111.

ప్రచండ వాతూల హతనేష శాఖవలె గజగజ
వణికిపోయిన అరక్త అశక్త గుమాస్తాని
అయిదారుగురు పిల్లలు గలవాణ్ణి

కని చిత్రించారు. ఈ చిత్రణలో మానవసంఘంలో అన్యాయాలకి గురిఅయిన 'గచ్ఛత్ శవాకార వికారుల్ని' కని మనముందు నిలబెట్టారు. ఈ చిత్రణలో కవికి ఈ దీనులపొదఉన్న జాలి, సానుభూతి స్పష్టంగా కనిపిస్తాయి. ''నేడలు'' అనే ఖండికలో మధ్యతరగతి మనుష్యుల్ని చిత్రిస్తూ వాళ్ళ ''భయపీడితులని'' తెలియ చేయడానికి

వీళ్ళందరూ భయపడిపోయిన మనుష్యులు
రేపటిని గురించి భయం సంఘభయం
అజ్ఞాతంగా తమలో దాగిన తమనుచూసి భయం 13.

అని చిత్రిస్తూ మానవులు భూతకాలానికి బానిసలు, సంప్రదాయ భీరువులు అని విమర్శించారు. ఇంకానారిని

గతంలో కూరుకు పోయిన మనుష్యులు
గతించిన కాలపు నీడలు 13.

అని వీరిమనస్తత్వాన్ని నిరసించారు. వీరి సంకుచితమనస్తత్వాన్ని ప్రదర్శిస్తూ కవి

వీళ్ళందరూ తోకలు తెగిన ఎలకలు
కలుగుల్లోంచి బయటకు రాలేరు 13.

అని చిత్రించారు. వీరు పూర్తివ్యక్తిత్వం ఉన్నవాళ్ళుకారు. సగం సగం మనుష్యులు. మరోసగం మరుగుపడిన బాధాగ్రస్తులు అని భావిస్తూ వారి నిజస్వరూపాన్ని ప్రతిభావంతంగా చిత్రించారు.

ముక్కలైన గాజుపెంకులు
చెల్లాచెదరైన మూగ ముత్యాలు
కల్లాకపటం తెలియని కబోది గుంపులు 14.
కల్లాకపటం తెలియని కబోది గువ్వలు

అని వారిదైన్యస్థితిని, అసహాయతని సానుభూతితో చిత్రించారు. ఇటువంటి మధ్యతరగతి జీవుల జీవితాలలో ఆనందోదయం జరగాలంటే

బరువుగా బెదురుగా బతుకుతున్న వీళ్ళమధ్య
డైనమైట్ పేలాలి
డైనమోలు తిరగాలి 14.

అని విప్లవం ఒకటే మార్గమని కవి సూచించారు.

మధ్యతరగతి మనిషి మనస్తత్వాన్ని విమర్శించడంలో తిలక్ బెర్నార్డ్ షా పదే పదే విమర్శించిన ''middle class morality" ని స్మరింపచేస్తారు. అర్థంలేని జీవితాలని నిస్సారంగా సాగదీసే మధ్యతరగతి మానవులని గొంగళి పురుగులుగా చిత్రిస్తూ వారిజీవితాల్లో ''సగం సగం తిన్న కలలని ''ప్రతి భావంతంగా కొంతహేళనతో, మరికొంత సానుభూతితో కవి ప్రదర్శించారు. వీరిజీవితం బల్లపరుపుగా పరచుకుందని చిత్రిస్తూ ఆ జీవితం కింద ''కాషన్'' గా దాచిన కర్రల సీక్రెట్ బాక్స్ ''లో ఉద్రేకాన్ని, సెక్స్ని, శృంగారాన్ని, క్రైమ్ని, షాక్ని, థ్రిల్లర్ కాగితాల్ని కవి మనకి చూపించారు. శిఖరారోహణంచేసే ధైర్యం లేకపోయినా బంగారుకలలు కని అవి యదార్థం కాకపోతే

నవ్వుకుని మీసం మెలేసుకుని
మాట్లాడకుండా జెంటిల్మన్లా మత్తుగా పడుకుంది గొంగళీపురుగు

6 34.

అని కవి స్వభావసిద్ధంగా చిత్రించారు. వీరిజీవితాలు అలవాట్లు ఆచారాల రైలు పట్టాలమీదనే ''దొర్లుకుని'', ''దొర్లుకుని''మళ్ళీ అలనాటిన అస్వతంత్రతలోకి జారుకుంటాయని కవి మధ్యతరగతి మానవులమానసిక స్థితికి దర్పణంపట్టారు. మధ్యతరగతి మానవుని సానుభూతితో ప్రదర్శించిన సందర్భాలలో "Wasteland" లో youngman Carbuncular, 'Love song of Alfred J. Prufrock' లో ఎలియట్ చిత్రించిన Prufrock జ్ఞప్తికి వస్తారు. ''చావులేనిపాట''అనే ఖండికలో తమ దయార్ద్ర హృదయాన్ని వెల్లడిస్తూ,

సర్వమానవ సౌఖ్యం తమ ఆశయంగా వెల్లడిస్తూ

దూరతీరాన తెల్లని ఓడ తెరచాప కదలినపుడు
భావహృదయాన నిశ్వసనానిలం వీచినపుడు
ఒక్క దుఃఖితుడు నవ్వినపుడు
ఒక్కపతితుడు కన్విప్పినపుడు
అక్కడ నా అడుగుజాడ గుర్తించగలవు 17.

అని తెల్లని ఓడతెరచాపని యుద్ధానంతరం శాంతికి ప్రతీకగా 'నిశ్వసనానిలా'న్ని ఆశానిలంగా కని చిత్రించారు. మానవుల ఆనందంలో తాము పాలుపంచుకుంటామని కని ఈ సందర్భంలో స్పష్టంచేశారు. ''మేగ్నకార్టా'' అనే ఖండికలో మానవులు మహాత్ములని ప్రకటిస్తూ వారు

గుండెలోపలి గుండె కదలించి
తీగ లోపలితీగ సవరించి
పాటపాటకి లేచు కెరటంలాగ
మాటమాటకి మోగు కిన్నెరలాగ 29.

ఆడతారని, పాడతారని కవి సగటు మానవుణ్ని మకుటాలంకృతుణ్నిచేశారు. సగటు మనిషి స్వేచ్ఛాప్రియత్వాన్ని, విశృంఖలతని అభినందిస్తూ, వారికి దాస్యంలేదు, శాస్త్రం లేదు అని తెలియచేస్తూ, వారికి

లోకం ఒకగేటురాయి
కరుణ చిగురు తురాయి 30.

అని వారి విలువలు లోకానికి సంబంధించినవి, కరుణవారి సర్వోత్తమలక్షణం అని కవి స్పష్టంచేశారు. ''నిన్నరాత్రి'' అనే ఖండికలో భగవంతునితో తాను లోకంలోని దైన్యాన్ని గురించి ప్రశ్నించలేదని తెలియచేస్తూ, ఆ దైన్యదృశ్యాల్ని వివరిస్తూ ''ఆకలిగొని, ఆకలికని అన్నింట విఫలుడై ఆత్మహత్య చేసుకున్న అబ్బాయిని, యౌవనం అమ్ముకుని జీవితంలో అలసి సంధ్యవేళ ఉరితీసుకున్న సానిపడుచు'ని పేర్కొన్నారు. సర్వమానవాళిపైన సానుభూతిని వెల్లడిస్తూ

కాంగోలో, కూబాలో, సైప్రస్‌లో, లావోస్‌లో
కాలి కమురు కంపుకొట్టే కాలంకథ, మానవ వ్యథ 57.

ని కవి చిత్రించారు. ''ముసలివాడు'' అనే ఖండికలో

బ్రతుకొక్క ఆరిన వత్తికొడిలా తలచి మిథ్యలా కలచి
గతించిన జీతించిన బ్రతుకులోకి
గులకరాళ్ళ గలగలమ్రోగే
గుల్ల బ్రతుకు లోనికి
కల్ల బ్రతుకు లోనికి 89.

చూసి రోసిన ముసలివానిమీద కవి తమ సానుభూతిని చూపిస్తూ మానవతాదృక్పథాన్ని వెల్లడించారు. ముసలివాని బ్రతుకుని ఆరిన వత్తికొడిలా వర్ణించడం శ్రీశ్రీ భిక్షువర్షీయసిని 'ఆరినకుంపటి'' అని వర్ణించటాన్ని జ్ఞప్తికి తెస్తుంది. 'ప్రార్థన' అనే గీతంలో తమ మానవతా దృక్పథాన్ని స్పష్టంచేస్తూ

దేవుడా
నలభైకోట్ల మనుషులు నిజమైన ప్రాణంవున్న
మనుషులతో నిండిన దేశం నాది. 144.

అని దేశంలో సామాన్యమానవులు తమ కనీస కోర్కెలు తీరితే సంతోషిస్తారని, అంతకుమించి నటనలు, గొప్పలు, గోసాయి చిట్కాలు అవసరం లేదని వివరిస్తూ

మంచి గంధంలాగ పరిమళించే మానవత్వం
మాకున్న ఒకే ఒక అలంకారం 145.

అని మానవతాభావానికి కవి అత్యున్నత స్థానాన్ని ఇచ్చారు. ''తపాలా బంట్రోతు'' అనే ఖండికలో సంఘంలో సామాన్య జీవి అయిన పోస్టుమన్ సుబ్బారావుని అత్యంత సానుభూతితో కవి చిత్రించారు. అందరికీ ఆత్మీయుడై, అందరి సుఖదుఃఖాలతో పాలుపంచుకుంటున్న తపాలా బంట్రోతు వ్యక్తిత్వాన్ని ఎవరూ గుర్తించరు. అతని కష్టసుఖాలమీద వారికే మాత్రం సానుభూతి ఉండదు. అని కవి విచారాన్ని వ్యక్తం చేస్తూ,

> ఎన్ని యిళ్ళు తిరిగినా
> నీగుండె బరువు దింపుకోవడానికి ఒక్కగడపలేదు
> ఎన్ని కళ్ళు పిలిచినా
> ఒక్క నయనం నీకట్టుదాటి లోపలికి చూడదు
> ఉత్తరంయిచ్చి నిర్లిప్తుడిలాగా [illegible] వెళ్ళిపోతావు నిన్ను చూసి నవ్వుడు
> తీరం వదలి సముద్రంలోకి పోతున్న ఏకాకి నౌక చప్పుడు
> 149-150.

అని పోస్టుమన్ ఏకాకి జీవితాన్ని ఏకాకి నౌకతో పోల్చి ప్రతిభావంతంగా కవి చిత్రించారు.

## అంతర్జాతీయ భావదర్శనం

విశాల ప్రపంచం వసుధైక కుటుంబకం అని భావిస్తూ తిలక్ తమ అంతర్జాతీయ విశ్వసమన్వయ దృక్పథాన్ని ''వసుధైక గీతం'' అనే ఖండికలో ప్రదర్శించారు. ఈ దృక్పథాన్ని వ్యక్తంచేయడానికి కవి ప్రకృతిని ఆలంబనం చేసుకున్నారు. భూమికి నక్షత్ర నిబిడ విశ్వాంతరాళానికి సమన్వయ సంకేతంగా, విశాల విశ్వంలో గ్రహకూటమికి కేంద్రస్థానంగా తనని భావించుకుని

భూమధ్యరేఖ నాగుండెలోంచి పోతోంది
భ్రుకుటిలోపల నక్షత్రగోళం తిరుగుతోంది.....
సూర్యుడిని చూడు నాతలమీద పువ్వు 81.

అని అపూర్వంగా చిత్రించారు. సకల సృష్టికి తానే కేంద్రమని మనిషి భావించడం మనిషికి ఆధునిక కాలంలో లభించిన మానస్థానాన్ని విశదంచేస్తోంది. దేశాలమధ్య సమన్వయాన్ని ఆశిస్తూ, ఆ సమన్వయానికి తామే సూత్రధారినని భావిస్తూ తాము అట్లాంటిక్ కల్లోల తరంగాల మేను వాల్చానని, పసిఫిక్ లోతుల్లో రత్నాల్ని వెదకి తేశానని, ఉత్తరధ్రువాన ఒకపాదం, దక్షిణధ్రువాన మరోపాదం నిలిపి ''సర్వం సహా చక్రవర్తి''ని అయ్యానని కవి తెలియచేశారు. జాతి మతాల సంకుచితమైన సరిహద్దులని చెరిపివేసి సమన్వయాన్ని సాధిస్తానని తెలియ చేస్తూ

అకుంఠితమైన మానవీయ పతాకను ఎగురవేస్తున్నాను చూడు
చరిత్రల రక్తజలధికి స్నేహసేతువు నిర్మిస్తున్నాను రండి
కవి వచస్సవిత్రు కాంతి పూరమిది స్వేచ్ఛగా జలకమాడండి 8.

"అని మానవతా భావాన్ని అకుంఠితమైన పతాకగా, స్వేచ్ఛగా గగనతలాన రెపరెపలాడే భావనగా కవి వర్ణించారు. ''గతమంతా తడిసె రక్తమున కాకుంటే కన్నీళులతో'' అని శ్రీశ్రీ వర్ణించిన దేశచరిత్రలని తిలక్ ''రక్తజలధి''గా చిత్రిస్తూ, రక్తసిక్తమైన మానవచరిత్రకి భరత వాక్యం పలికి, అన్నిదేశాలమధ్య సుహృద్భావాన్ని పెంపొందించే భావసేతువుని ''స్నేహసేతువు''గా వర్ణించారు." సూర్యకాంతి అన్ని దేశాలకి సమంగా చెందుతుంది. అలాగే కవికూడా అన్నిదేశాలకిచెందిన వాడని భావిస్తూ, అతని కవితాస్రవంతి సంకుచితంకాదు, అందరూ అందులో స్వేచ్ఛగా జలకమాడవచ్చునని ఆహ్వానిస్తూ తమ కవిత్వం ''కవి వచస్సవిత్రుకాంతిపూరం'' అని కవి వివరించారు. తను అంతర్జాతీయ దృక్పథాన్ని స్పష్టంచేస్తూ మధ్యధరా సముద్రతీర ఖర్జూర తరుచ్ఛాయలలో ప్రేయసిని ముద్దాడిన ప్రియుణ్ణని, మౌంట్ వెసూవియస్ అగ్ని పర్వత జ్వాల వెలిగించిదిగ్భిత్తికలు ప్రకంపింప పాడినదితానని, పాల్‌రాబ్సన్ సంగీతంలో, ఆఫ్రికా అంధకారాటవులలో సింహగర్జనగా, కైలాసగిరి గళంలో శాంతి సందేశంగా తాను విశ్వరూపధారినని కవి చిత్రించారు."
Dimension of space లనే కాక dimension of time లో కూడా తాము సమన్వయశక్తిగాభావించుకుంటూ, తాము వర్తమాన కాలాన్ని భవిష్యత్కాలాన్ని సంధానించగలనని తెలియచేస్తూ

వర్తమానం నేడు సుందరాభిసారికవోలె నిలచేపోలగా
ఆగామి కాల గంభీరస్వామి కంఠాన వేయబోయే మాలగా
నిలిచింది నేను పిలిచిందినేను 9.

అని త్రికాలబాధితంకాని తమ వ్యక్తిత్వాన్ని ఈ ఖండికలో కవి ఆవిష్కరించారు..

చుట్టూఉన్న ప్రపంచం అస్తవ్యస్తంగా నిరాశ నిస్పృహలకాలవాలంగా ఉన్నా కవితన అకుంఠిత ఆశాపతాకాన్ని ఎగురవేస్తాడు. జీవితంలో ఎన్నో విషాద స్మృతులని, అనుభవాలని చవిచూసినా తిలక్ తమ కవిత్వంలో ఆశాదృక్పథాన్ని, ప్రదర్శిస్తూనే వచ్చారు." ఈ ఆశాదృక్పథాన్ని కవి ప్రకృతిలో దర్శించారు. ప్రకృతిద్వారా తమ కవిత్వంలో ప్రదర్శించారు. ''చావులేని పాట'' లో ఈ ఆశని వ్యక్తంచేస్తూ ''శతధాభిన్నమైన గుండెలో సంగీతం ఇంకా వినబడుతోంది, చావనని నమ్మకం కలుగుతోంది" అని స్పష్టంచేశారు. "జీవితంలో తమ చేదు అనుభవాలని ' సమ్మెటపేటు''గా చిత్రిస్తూ అటువంటి కష్టసమయాల్లో ప్రకృతి తమపై సానుభూతి చూపిస్తుంది అనే

ఒక్క సమ్మెటపోటుకే
ఉరలిన రక్తాన్ని తుడుచుకునే లోపలనే
చక్కని సన్నజాజి పందిరికింద స్వాప్నికసురవధూటి
నిలబడుతుంది
నవ్వుతూ పిలుస్తుంది
వదనాన జారే స్వేదాంబుకణాన్ని
వలాహక చేలాంచలంతో తుడుస్తుంది 16.

అని చిత్రించారు.

## తాత్త్విక దర్శనం

కవి ప్రకృతి బాహ్యరూపదర్శనం చేసి ఉపరితలంమీద ఉన్న వైరుధ్యాలని వైరుధ్యాలుగా మాత్రమేకాక వాటివెనక ఉన్న సమన్వయసూత్రాన్ని గ్రహించగలుగుతాడు. ప్రకృతి అంతరాంతరాల్లో మౌలికమైన ఐక్యతని దర్శించ గలిగేద్రష్ట. ఈ అంతర్దర్శనం కవికి మేధావుల వర్గంలోకూడా అత్యున్నతస్థానాన్ని ప్రసాదిస్తుంది. ఉత్తమ కవి కర్తవ్యం ఇది అని వర్డ్స్‌వర్త్ వివరించాడు :

The song would speak
of that interminable building reared
By observation of affinities
In objects where no brotherhood exists
To passive minds[9].

ఇటువంటి తాత్త్విక దృక్పథాన్ని వెలువరించే కావ్యాన్ని భారతదేశంలో కవిగా, తత్త్వవేత్తగా సమున్నతస్థానాన్ని అలంకరించిన అరవిందఘోష్ ఆత్మకావ్యం

---

9. Quoted by C.Day Lewis, 'The Poetic Image', 34.

'Epic of the soul' అని వర్ణించాడు[10]. తిలక్ కవితాప్రస్థానంలో ఈ తాత్త్వికశోధన, సందర్శన కనిపిస్తాయి. కవి తమ తాత్త్వికచింతనకి ప్రకృతిని ఆలంబనం చేసుకున్నారు. వీరి తాత్త్విక చింతనకి ''శిఖరారోహణ'' అనే ఖండిక శిఖరసదృశమైన నిదర్శన. జీవితం అర్థరహితమైన అలవాటుకి, అస్వతంత్రతకి కట్టుబడిన మనుగడమాత్రమేకాదు, అని, జీవితం అశ్రుతగాంధర్వాలని ఆలకించి రసాత్మకంగా భాసిల్లాలని ఆశించారు. "అమృతంకురిసినరాత్రి తిలక్ దోసిళ్లతో అమృతం తాగడమే కాక, సృష్టివెనకఉన్న రహస్యాలని, కాలాన్ని, దేశాన్ని అధిగమించిన సార్వకాలిక, సార్వజనీనసత్యాలని ఉదాత్తభావనలని గ్రహించగలిగారు. క్షితిజరేఖ నిలిచి పిలిచే రత్నకంకణహస్తాన్ని ''ఎవరూ చూడకపోయినా, నిద్రకి మెలకువకి మధ్యమోగిన జంత్ర సంగీతాన్ని'' ఎవరూ వినకపోయినా తాము తమ అలౌకిక చైతన్యస్ఫూర్తితో ఈ అనంత సత్యాలని దర్శించగలిగానని కవి తమ తాత్త్విక చింతనని వెల్లడించారు. ఈనాటితమ తాత్త్వికవ్యక్తిత్వం తరతరాల చారిత్రకశక్తుల వారసత్వం వలన సంక్రమించింది.

---

10. The epics of the soul.....are his (epic creator's) possible subject and it is this supreme kind that we should expect from some profound and mighty voice of the future,....that will reveal from the highest pinnacle and with the target field of vision the destiny of the human spirit and the presence and ways of and purpose of the Divinity in men and the Universe', Sri Aurobindo 'The Future Poetry', 377.

నేను కాలతీరాన ఒకణ్ణే నడుస్తున్నాను
చరిత్ర విచిత్ర సముద్రాల వలోకిస్తూ
అవి విసిరిన తుంపరల్లో తడుస్తూ 39.

అని తన వ్యక్తిత్వాన్ని చారిత్రక సముద్రంలో ఒకభాగంగా కవి చిత్రించారు. నేటి మానవుడు ఈ నాటివ్యక్తిమాత్రమేకాదు, చారిత్రక ప్రవాహంలో ఒకభాగం అనే ఈ భావాన్నే గుంటూరు శేషేంద్రశర్మ

(*) ఒక్కొక్కప్పుడు బైట పడతాయి నా రక్త నదీతీరాల్లో
నా పాతరాతి పనిముట్లు - ప్రవాహాల్లో కొట్టుకొస్తాయి
పాచేన సుమేరియాలు, మొహం జోదారోలు ॥ 11.

అని వివరించారు. ఇటువంటి చారిత్రక అవగాహన ఉన్న సమయంలో మానవుడు సృష్టి రహస్యాన్ని తెలుసుకోగలిగే మధుర క్షణాన్ని సద్వినియోగం చేసుకోగలడని కవి తెలియచేస్తూ

అపుడు నా మీదికి భవిష్యద్గగనం వంగి, నా
చెవిలో చెప్పిన రహస్యం విన్నాను
చెదిరిన మబ్బుల మధ్య సూర్యుణ్ణి చూశాను 39.

---

11. శేషేంద్ర శర్మ, 'నేల పారిపోయింది', 1.

అని మబ్బులని బాహ్యప్రకృతిని ఆవరించే సందేహాలుగా, సూర్యుణ్ని అంతస్సత్యంగా కవి చిత్రించారు. ప్రాదేశిక సరిహద్దులని అధిగమించి తాము భారతదేశంలో, అందులో ఆంధ్రదేశంలో తణుకు అనే చిన్న పట్టణంలో ఉన్నప్పటికీ, సరిహద్దులన్నింటిని అధిగమించి, తమ వ్యక్తిత్వాన్ని అంతర్జాతీయ పరిధుల్లోకి వ్యాపింపచేసి తమ సంపూర్ణ వ్యక్తిత్వాన్ని ప్రదర్శించారు.

> "నేను ఈజిప్టు పిరమిడ్ల మధ్య, బాబిలోనియా స్థూపాలమధ్య
> మొహంజొదారో శిధిలాలమధ్య నిలిచి కలలు కన్నాను 39.

అని తమ విశాలతాత్త్విక దృక్పథాన్ని వ్యక్తంచేశారు." చారిత్రకపరిధులని దాటి, సృష్ట్యాదిలో మానవగాథ ఆరంభాన్ని అనాది అంధకార భయంకర అటవుల మధ్య సృష్టి సింహంచేసిన 'ప్రథమ గర్జగా' కవికి వినిపించింది.

> నేను తుఫానుల సముద్రాల ఉప్పెనలో ఊగిఊగి లుంగలు చుట్టుకు పోతున్న
> భూమిపేగుల్ని చూశాను 40.

అని సృష్టిలో ప్రకృతి వైపరీత్యాలని ఎదిరించి మనుగడకోసం పెనుగులాటలో చిక్కుకున్న మానవజీవితాలని "''గజగజలాడుతున్న పెనుగుతున్న ప్రాణహారితం''గా కవి చిత్రించారు." సృష్టిసమయంలో ఆదిమానవుడు విజయుడై పూరించిన శంఖనాదాన్ని విని కవి చారిత్రక ప్రస్థానోపక్రమణికగా ఆ శంఖారావాన్ని

అభినందించారు. మానవపరిణామగాథని సీజరు కౌక్షేయధారలోను, అలెగ్జాండరు అశ్వరింఖాఘటనలోను, షేక్స్పియరు, డాంటే కాళిదాసు, మార్క్స, మహాత్ముడు, పికాసో, సాత్రేవంటి మహావ్యక్తుల నిరంతర నూతన పరిశోధనలో ధ్వనించి ఆ అన్వేషణని సత్యసౌందర్యాన్వేషణగా, ఒకశిఖరారోహణగా కవి ప్రదర్శించారు. కవి సృష్ట్యాది నుంచి ఈనాటివరకు మానవ పరిణామ వికాసాలని చారిత్రక అవగాహనతో, సత్యసౌందర్యాన్వేషణగా చిత్రించడం చారిత్రకదృష్టితోనే కాకుండా కవి అభిరుచులని ఆవిష్కరించేసాధనంగా కూడా పరిశీలించవచ్చు." సాహితీసీమలో షేక్స్పియరు, డాంటే కాళిదాసు, తిలక్‌కి అభిమానపాత్రులుకాగా, తాత్త్విక చింతనకి శంకరుడు, సాత్రే, రాజకీయదృక్పథానికి మార్క్స ,మహాత్ముడు, కళాత్మకదృష్టికి పికాసో వీరి సంపూర్ణవ్యక్తిత్వపరికల్పనకి దోహదంచేశారు. ఈ వ్యక్తులతోపాటు ''నవత-కవిత'' లో తిలక్ కవిత్వం అనే అల్కెమీకిచెందిన రహస్యాన్ని తెలిసిన పెద్దన, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ అని పేర్కొన్నారు. వీరినికూడా చేరిస్తే తిలక్ సమగ్రతాత్త్విక వ్యక్తిత్వం దర్శనీయం అవుతుంది. చరిత్రలో మానవునిప్రస్థానం సత్యసౌందర్యాన్వేషణచేసే ఒకనిరంతర నూతన పరిశోధన, ఒక శిఖరారోహణ అని తిలక్ భావించారు."

వైజ్ఞానిక శాస్త్రంలో ఐన్‌స్టీన్ పరిశోధన తరువాత కాలం అనే నాలుగో పరిమాణంకూడా ప్రకృతితత్త్వ అధ్యయనానికి అవసరంకాసాగింది. "కాలానికి మానవునికి ఉన్న తాత్త్విక సంబంధాన్ని తిలక్ ప్రతిభావంతంగా

"కాలానికి ఒక రూపంలేదు దానికి పాపంలేదు
కాలం అద్దం లాటిది
అంధయుగమైనా స్వర్ణయుగమైనా అది మన ప్రతిబింబం" 40.

అని మానవుడు తన జీవితాన్ని తనకి నచ్చినవిధంగా మలచుకోగలిగే స్వేచ్ఛాజీవి అని చిత్రించారు. కాని ఒక్కొక్కసారి కాలానికి బానిసకూడా. అని అతని ద్వివిధమైన ప్రకృతిని

కాలం వలయం లాంటిది దానికి కేంద్రంలేదు
ఎవడికివాడే ఇచ్ఛాప్రయత్న బలంతో
వంశోజ్జ్వల వలయాలను సృష్టించగలుగుతాడు
కాలం జాలం లాంటిది
కళ్ళుమూసుకు నడిస్తే ఉచ్చులో పడతాడు 40-41.

అని చిత్రించారు. మానవుని ప్రగతికి సాహసం, యుక్తి అవసరమని విశ్వసించి

కాలం సవాల్‌వంటిది
సాహసవంతుడందుకొని ముందు సాగిపోతాడు 41.

అని స్పష్టంచేశారు. మానవప్రగతికి, సమగ్ర వ్యక్తిత్వ ఆవిష్కరణకి. సాహసం ముఖ్యం అని ''మురికి కాల్వమీద, ముసలితనంమీద, మృషాజగతి మీద, మహోదయం వికసించదు'' అని తిలక్ స్పష్టంచేశారు. మృషాజగతిని నిరసించడంలో తిలక్ శ్రీశ్రీ వ్యంగ్యధోరణిలో నిరసించిన మిథ్యావాదిని జ్ఞప్తికి తెస్తారు. జగత్తంతా మాయ అని కర్మవిముఖతకి దారితీసే మెట్టవేదాంతిని తిలక్ ఘాటుగా

''వికారుడు, శకారుడు'' అని నిమర్శించారు. మానసిక భీరత్వాన్ని అధిక్షేపిస్తూ, సాహసాన్ని అభినందిస్తూ

సంప్రదాయ భీరువుకే అస్వతంత్ర వితంతువుకే వసంతంలేదు
సాహసి కానివాడు జీవన సమరానికి స్వర్గానికి పనికిరాడు
హిమసుందర శృంగమైన ఎవరెస్టుని ఒక టెన్సింగే ఎక్కగలడు
సుమ సుందర వసంత గీతంలో ఉగాది నాహ్వానించగలడు 41.

అని మానవప్రయత్నాల పరాకాష్ఠగా ఎవరెస్టు శిఖరాన్ని, ఆ శిఖరాన్ని అధిరోహించ గల సాహసి టెన్సింగుని కని చిత్రించి తమ వ్యక్తిత్వానికి తురాయి అని చెప్పదగిన స్వేచ్ఛాప్రవృత్తిని, సాహసిక దృక్పథాన్ని కని వెల్లడించారు. '' కాస్మాపాలిటన్'' అనే ఖండికలో విశ్వమానవదృక్పథానికి వ్యంగ్యవ్యాఖ్యానంచేసే ' కాస్మా పాలిటన్ బోర్' ని చిత్రిస్తూ, ప్రపంచంలో వివిధ అనుభవాల ఉపరితలాన్ని స్పృశించి, అంతర్జాతీయ మానసిక తత్వాన్ని అలవరచుకున్నామని అభినయించే వ్యక్తుల్ని పరిహసించారు. వారిని పారిస్‌లో కవితని షాంపేన్‌ని కలిపిసేవించారని, ఫ్లారెన్స్‌లో యువతిని, ప్రకృతిని కలిపి అనుభవించారని కవి చిత్రించారు. సకలసిద్ధాంతాలు, మతాలు, ఇజాలు, సైంటిఫిక్ నిజాలు కలబోసి రంగరించి వేరుకనుగొన్న ఒక అద్భుత రహస్యాన్ని వివరిస్తూ

దేవుడూ మానవుడూ వేరిద్దరే ఈ అనంతవిశ్వంలో మూర్ఖులు
ఏకోణం నుంచి చూచినా వేరిద్దరూ మిజరబుల్ ఫెయిల్యూర్స్ 46.

అని స్పష్టం చేశారు. ఇందులో పరిహాసధోరణిఉన్నా కవిదృష్టిలో దేవుడూ, మానవుడూ మొత్తానికి ఏవిషయంలోను విజయవంతులు కాలేకపోయారనే సందేహం ధ్వనిస్తోంది. ఇటువంటి సందేహం కవి హృదయానికి సంబంధించినది. ''కిటికీ'' అనే ఖండికలో జీవితంలో భౌతికానుభవాలతోపాటు జ్ఞానపరిమళంకూడా ప్రవేశించే ద్వారంగా కిటికీని సంభావిస్తూ,

కిటికీ తెరిస్తే
గాలీ వెలుతురుతోపాటు
జాలీ జీవితపు ధూళీ జ్ఞానమధూళీకూడా వస్తాయి 65.

అని వివరించారు. గదికి, మనసుకి మధ్య పోలికని సూచిస్తూ వీటికి గవాక్షాలుంటాయని, ఈ గవాక్షాలద్వారా

అంతరిక్షంలోకి జీవిత రహస్యంలోకి సృష్టిసమక్షంలోకి
విచ్చుకునే విచిత్రాక్షి సమూహాలు
ఆనంద శోకానుభూత్యవిరళ చటిచ్చకితవార్షుక వలాహకాలు
65.

అని పరిమితమైన కళ్ళద్వారా అపరిమిత తాత్త్విక సత్యాన్ని దర్శించగలిగే దార్శనిక శక్తిని కవి సూచించారు. ఈ దార్శనికశక్తి తిలక్‌కి అభిమానపాత్రమయింది.

కవిత్వం అనే ఆల్కెమీ భౌతిక యథార్థ దర్శనాన్ని కవితాసత్యంగా మారుస్తుంది. ఆ సత్యాలని అనంత సత్యాలుగా తాత్త్వికదర్శనాశక్తి రూపొందిస్తుంది. ఈ శక్తిని తిలక్ తమ ఒకసంకలనంలోను, అముద్రితమైన కొన్ని రచనలలోను ప్రదర్శించ గలిగారు. ''షన్ ఇంటు మైనస్'' అనే ఖండికలో దేవుడికీ మానవుడికీ ఉన్న విచిత్ర సంబంధాన్ని సూక్ష్మంగా పరిశీలించి జీవితంలో భౌతికానుభవాలు అన్నీ క్షణిక మైనవి, దేవుడు సమకూర్చిన ''పసందైన గారడీ''లు అని స్పష్టంచేస్తూ దేవుడూ మానవుడూ పరస్పరం అవశ్యకమైన శక్తులని భావించారు.

తాను లేనిదే దేవుడిని తలచే వాడెవడూ లేడంటాడు మానవుడు
తాను లేనిదే మనిషికి ఆలంబన ఏదంటాడు సదరు దేవుడు.....
దేవుడిని తిరగేస్తే మానవుడు, మానవుణ్ణి తలక్రిందుచేస్తే దానవుడు

114.

అని దేవుణ్ణించి మానవుడు, మానవుణ్ణించి దానవుడు ఉద్భవించే దానవ పరిణామ వికృతగాథని కవిసూచించారు. అయినా మానవుడు దేవుడు అనంతంగా ఒకరినొకరు తరుముకుంటూ తిరుగుతుంటారు అని వారి విడివడని అనుబంధాన్ని సూచిస్తూ

సుదీర్ఘ వలయంలాంటి కాలం చుట్టూ ఒకరినొకరు
అదేపనిగా తరుముకుంటూ తిరుగుతుంటారు
గుండ్రంగా, గుండ్రంగా, గుండ్రంగా 115.

అని వివరించారు. ''మైనస్ ఇంటు ప్లస్'' అనే ఖండికలో మానవుడు దేవుడు కాలేకపోవడానికి కారణాలని వివరిస్తూ, మానవుడు జడంగా ఉన్న శాంతినుండి తప్పుకుంటాడు, సంచలనాన్ని కలిగించే సమరాన్నే మానవుడు కోరుకుంటాడు అన్నీ, అందుకే మానవచరిత్రఅంతా యుద్ధమయం అని శ్రీశ్రీ వెల్లడించిన చరిత్రయావత్తూ ''రణరక్త ప్రవాహసిక్తం'' అనే భావాన్ని స్ఫురింపచేశారు. అక్కడక్కడ మహాత్ముని అడుగుజాడలు కనిపించినా మళ్ళీమానవుడు ''అడ్డదారినే గుడ్డిగా పడిపోతాడు'' అని అందుకే

మానవుడు మానవుడిగా దేవుడిగా రూపొందేయాప్రయాణం
అనంతదీర్ఘం పునః పునర్వర్గం బహుయుగవిస్తీర్ణం 116.

అని తమ నిరాశని కవి వ్యక్తం చేశారు. గణితశాస్త్రంలో ప్లస్ యింటు మైనస్ ''మైనస్ యింటు ప్లస్'' గుణించగావచ్చే ఫలితం మైనస్సే. అందుకని తిలక్ ఈ రెండు ఖండికల్లో మానవునిపై దేవుని ప్రభావం, దేవునిపై మానవుని ప్రభావం సూచించడానికి మైనస్, ప్లస్ గుర్తులని ప్రయోగించారు. చివరికి పేరిద్దరి సంయోగం శూన్యానికే దారితీస్తుందని తమతాత్త్విక దృష్టిని వెల్లడించారు. దేవునికి, మానవునికి మధ్య ఉన్న సంబంధాన్ని "The ways of God to man" అని వివరించడానికే మిల్టన్ "Paradise Lost" అనే బృహద్రచన చేశాడు. తిలక్ రెండు సంక్షిప్త గీతాల్లో ఈ అద్భుతసంబంధాన్ని ప్రతిభావంతంగా చిత్రించారు.

అముద్రిత రచనలలో పదకొండవ ఖండికలో కాలాన్ని ఒక వలయంగా భావించి, మానవుడు కాల చక్రంలో బంధితుడై ఎటూ పురోగమించలేనిస్థితిలో ఉన్నట్టు

వలయాకృతిలో నున్నకాలం కేంద్రంలో నిలబడినేను
విల యాగ్ని కీలలతో మండుతూన్న క్షీరవాన్ని చూస్తున్నాను
అంచులమీద అంటుకునిపోయే నగరాలు చరిత్రలశతాబ్దాలు
ఆఖరికి ఆనవాలైనా మిగలని బూడిదలో దేనికోసం వెతకను

245.

అని చిత్రించారు. పద్యాలుగా ఖండికలో అంతరిక్ష రహస్యాలని కనుక్కోవాలని మానవుడు సృష్టికులని పంపించే ప్రయత్నాన్ని ఒకలహాపుముక్క విసరడం అని వర్ణిస్తూ, మనిషి ఎంతప్రయత్నించినా ఈ అన్వేషణ అంతం లేనిదని తిలక్ వెల్లడించారు. సృష్టిలో ప్రాదేశిక ఔన్నత్యాలు పరిగణించతగినవి కావు అని స్పష్టం చేస్తూ

ఇండియాలో హిమాలయం ఒడ్డూపొడుగూ
ఇటలీలో మౌంటువెసూవియస్ అగ్నేయదర్పం
పసిఫిక్ మహాసముద్రం కల్లోల హృదయం
బాద్షా నెపోలియన్ అహంభావం
కాలం మీదస్థలం మీద గీసిన గీతలో
ఆఖరి ఒక బిందువైనా కావుకదా 246.

అని కవి మానవుని పరిమితులని వ్యక్తంచేశారు. మానవుడు ప్రకృతి రహస్యాలు గ్రహించడానికి మేధాసృష్టి అయిన తనపరిమిత శక్తిని ఉపయోగించుకుంటాడు అని

అసలే చీకటి అందులో గుడ్డివాడు
పాపం పేద మూర్ఖుడు 248.

అని కవి స్పష్టంచేశారు. చరాచరసృష్టి సమస్తంలోను చీమలు, తేనెటీగలు, కలరా బేసిలస్, అడ్డదిడ్డంగా నడిచే వారపీతలు అన్నీ మానవుని కంటె ఉత్తమమయినవి అని కవి భావించారు. ''అనంతంగా పరచుకున్న కాలంలో నిన్న ఎక్కడ ? రేపు ఎక్కడ?'' అని ప్రశ్నిస్తూ మానవుని పరిమితశక్తిని వ్యక్తంచేస్తూ

అవధి లేని
అంచు లేని
ఇంత స్థలంలో నువ్వెంత! నీ విలువ ఎంత? 250.

అని నిలదీశారు. తిలక్ తాత్త్విక దృక్పథం, కవితాతత్త్వం సమన్వయమార్గాన్ని అనుసరించాయని అందరూ అంగీకరించే విషయమే. ఈ దృక్పథాన్ని పదిహేడో ఖండికలో స్పష్టంచేస్తూ నిర్ద్వంద్వంగా

ఇటువైపు
అయిదుఖండాల ఆలోచనలమధ్య నిలబడి
అటువైపు
అస్మత్ప్రాచీన సంస్కృతీరథ్యనడుగిడి
ఈనాడు
పూర్వ పశ్చిమాదిక్తటాలనొరసి మెరిసే
ద్విశిఖర భూధరంలాగ నిలబడ్డాను 253.

అని కవిత్వతత్త్వంలో ప్రాక్పశ్చిమాలు కలుసుకుంటాయని, తమ కవిత్వం అన్ని దృక్పథాలని, మతరాజకీయ విశ్వాసాలని ఆహ్వానిస్తుందని, తమ సంపూర్ణవ్యక్తిత్వాన్ని వ్యక్తీకరించారు. తిలక్ జీవితం ప్రత్యక్షంగా తెలిసినవారు ఆయన తమవద్ద టాగోర్ ''గీతాంజలి''ని ఎప్పుడూ ఉంచుకునే వారని అంటారు[12]. ఆధునిక మేధావులలో టాగోర్ అంతర్జాతీయ సమన్వయ దృక్పథానికి సముజ్జ్వల ప్రతినిధి. భారతదేశం స్వాతంత్ర్యస్వర్గం కావాలని ఆకాంక్షిస్తూ, విశ్వకవి విశ్వమానవసౌభ్రాతృత్వాన్ని పరమలక్ష్యంగా నిర్దేశించారు[13]. ఇటువంటి విశాలదృక్పథాన్ని తిలక్ స్వీకరించి దేశకాలపరిమితులని అధిగమించిన కవితామూర్తి.

## నాగరక చిత్ర ప్రదర్శనం

నాగరక జీవితంలో యాంత్రికత తిలక్‌ని ప్రభావితంచేసింది. సౌందర్యారాధకుడైన కవికి నగరజీవితంలో సౌందర్యరాహిత్యం బాధాకరంగా కనిపించింది. ''గొంగళి పురుగులు'' అనే ఖండికలో ఈ యాంత్రిక జీవితాన్ని అతిసహజంగా చిత్రించారు. సామాన్యగుమాస్తా దినచర్యలో చేతులపాత్రని వివరిస్తూ

---

12. అత్తలూరి నరసింహారావు, 'తిలక్ కవిత్వ తత్త్వం', 11.
13. R.Tagore, 'Where the worldis not divided into narrow compartments' Into that heaven of freedom, my lord, let my country wake.

ఆఫీసరు వస్తే సాల్యూట్ చేస్తుంది కుడిచెయ్యి
ఆకలేస్తే గబగబా రాస్తుంది కుడిచెయ్యి
జేబులోంచి సెకండ్ హాండ్ సిగరెట్టుముక్కల్ని తీస్తుంది కుడిచెయ్యి
అయితే యింక ఎడమ చెయ్యి ఉపయోగమేమిటంట? 35.

అని వారి యాంత్రిక జీవితాన్ని కవి మనముందు నిలబెట్టారు. నగరజీవితంలో సామాన్యంగా కనిపించే అనుభవాలు కవికి సుపరిచితాలు. బ్లాక్‌మార్కెట్‌లో బియ్యం, బ్రాకెట్ల ఓపెనింగులు, క్లోజింగులు, థియేటర్‌లో కొత్తసినిమా, [illegible] కాఫీహోటల్ రేడియోలో లత, రోడ్డుమీద ఖరీదైనకార్లు, మొదలైన చిత్రాలతోపాటు మధ్యతరగతి జీవుల ఇళ్ళల్లో కనిపించే కాలేజీరోజులనాటి గోడమీద గ్రూప్ ఫోటోలని కూడా కవి ప్రదర్శించారు. ''శిఖరారోహణ'' అనే ఖండికలో సామాన్యప్రజల కష్టాలని వర్ణిస్తూ,

రైలింగ్ అవతల టిక్కెట్టు దొరక్క ప్రజలు దిగాలుపడినుంచున్నారు
38.

అని నాగరక జీవనంలో సామాన్యమైన అనుభవంద్వారా చిత్రించారు. శృతి మించిన పారిశ్రామికీకరణం వలన మానవత్వపు విలువలు నశిస్తాయనే భయాన్ని వ్యక్తంచేస్తూ ''భూలోకం'' అనే ఖండికలో

ఆవులించు యంత్రశాల
చక్రంలో చిక్కుపడ్డ
మనిషి గుండె ఏడ్చిందట 42.

అని చిత్రించారు. ''కఠినోపనిషత్'' అనే ఖండికలో ''సిటీలో సభావేదిక మీద కథాకళి నృత్యం చేస్తున్న'' వెద్యపులుల్లాండి వెద్యమనుషుల

జరీకండువాలు బిరుదాంకితమైన సువర్ణపతకాలు 49.

వారి వంచన కళకి సంకేతాలుగా ప్రదర్శిస్తూ, నిస్సహాయుడైన సామాన్యజీవి కన్నీళ్ళతో టాయ్‌లెట్ చేసుకుంటున్నాడని ఆతని దీనావస్థని కవి చిత్రించారు. ఈనాటి నగరాల్లో ఆకస్మిక ధనలాభంవల్ల ధనికులైనవారు (Nouve Riche) నైతిక విలువలని కోల్పోయి అట్టహాసాలు, ఆర్భాటాలు చెయ్యడం కొట్టొచ్చినట్టు కనిపించే దృశ్యం. ఈ దృశ్యాన్ని కవి

అర్ధరాత్రి థియేటర్లలో అర్ధనగ్నలాస్యాన్ని, నెక్స్‌షోస్యానికే
అమెరికన్ జాకెట్లు తొడిగిన బంగారపిచికలు కిచకిచలాడినట్లు

49.

చిత్రించారు. ''కిటికీ'' అనే ఖండికలో ఆనందప్రియబాంధవివాసం పడిగాపులు పడినుంచున్న సౌందర్యపిపాసువులని వర్ణిస్తూ

అడ్వాన్స్ బుకింగ్ లేదు ఎప్పుడు రైలొస్తుందో తెలియదు
సిగ్నలిచ్చేవాడు తనగదిలో చిత్తుగాతాగి పడుకున్నాడు 66.

అనే నగరజీవితంలో రైల్వే ప్లాటుఫారాలమీద పడిగాపులు పడే జనానికి అలవాటైన అనుభవంద్వారా చిత్రించారు. నాగరకతని తాత్త్వికదృష్టిలో పరిశీలించి ''ఈ రాత్రి'' అనే ఖండికలో

నాగరికత మొలవడినదుప్పటిలా నన్నుకప్పుకుంది
నాకందని ఏదో రహస్యం
నన్ను వశం చేసుకుంది 94.

అని నాగరకత స్వచ్ఛమైన హృదయానికి, స్వేచ్ఛాప్రవృత్తికి ఒకింత ఆటంకం అయినా మానవులందరూ నాగరకతాలింగనంలో బంధితులవక తప్పదు అనే భావనని కవి వ్యక్తంచేశారు. ''రాజమండ్రి పాటలు'' అనే ఖండికలో రాజమహేంద్రనగరాన్ని అపూర్వంగా వర్ణిస్తూ

మసక మసక విద్యుద్దీపాలు
వృద్ధనగరమాత చత్వారపు నేత్రాలు 98.

అని ఆనగరం ''క్షతగాత్ర అయిన హరిణంలాగ మూల్గుతోంది'' అని చిత్రించారు. ఈ వర్ణనలో నగరం కవిమీద చూపించే ప్రభావం కంటె కవిదృష్టి నగరంమీద కలిగించే ప్రభావం ఎక్కువ కనిపిస్తుంది. నాగరక జీవనంలో మరి ఒక సామాన్య అనుభవం ఇప్పుడు జనపదాల్లోకూడా విస్తృతంగా వ్యాపించి ఉన్న దృశ్యం చతుర్ముఖ పారాయణం. తిలక్ జీవితం ప్రత్యక్షంగా తెలిసినవారు ఈయనకి పేకాటమీద ఉన్న మక్కువని తెలియచేశారు[14]. ''కాయ్‌రాజాకాయ్'' అనే ఖండికలో పేకాట దృశ్యాన్ని చిత్రిస్తూ

---

14. అ.నరసింహారావు, 'తిలక్ కవిత్వ తత్త్వం', 6.

మూడు ముక్కలాట
మూడాసులు తిప్పు
ధనంనేది సుఖంనేది 139.

అని క్షణంలో మనిషిని లక్షాధికారిగాను, భిక్షాధికారిగానుచేసే గారడీని కవి ప్రదర్శించారు. పేకాటలో జోకర్ ముఖ్యం అని ఈ జోకర్ జీవితంలో అదృష్టానికి సంకేతం అని తెలియచేస్తూ

పేకముక్కలు కలిపి పంచినా
ఆసురాజు నీచేతికొచ్చినా
జోకర్ అవతలవాడిది
జయం అవతలవాడిది
జోకర్ అదృష్టానికి చిహ్నం 140.

అని చిత్రించారు. "చరిత్రలో, కావ్యాల్లో విఫలురైన వ్యక్తులని పేర్కొంటూ ఆఖరు మలుపులో హిట్లర్‌కి, రష్యన్ బెరియాకి, రోమియో జూలియట్లకి, లైలామజ్నూలికి లక్షలాది స్వాప్నిక జీవులకి జోకర్ దొరకలేదని కవి చిత్రించారు. ఈ సామాన్య మైన నాగరక అనుభవాన్ని తాత్త్విక అవగాహనకి ఉపయోగించుకుని జీవితం ఆనందమయం కావాలంటే ధైర్యం అవసరం అని ''భేతాళవహులకిచట స్థానం లేద''ని ప్రకటిస్తూ

చినిగిన స్వప్నపుసంచేలో
చితికిన బాష్పం నిలవదు
అందుకే నేస్తం జీవితమే ఒకజూదం 143.

అని సుఖదుఃఖాల అద్వైతస్థితిని గ్రహించిన స్థితప్రజ్ఞత్వానికి కవి చేరుకోగలిగారు. నగరసందర్శనానికి సంబంధించిన తమ అనుభవాలని కావ్యబింబాలుగా పరివర్తనం చేసుకుని తిలక్ సందర్భోచితంగా ప్రయోగించారు. రెండు ప్రత్యేక ఖండికలలో నగరంమీద తమ దృక్పథాలని వ్యక్తంచేశారు. ''అమృతం కురిసినరాత్రి'' అనే సంకలనంలో ''నగరంమీద ప్రేమగీతం'' అనే ఖండికలో కవి తమ అనుపమానమైన అనురాగాన్ని వెల్లడించారు. ఈ ప్రేమ ప్రథమ వీక్షణంలోనే ప్రేమ వంటిది. తిలక్ హైదరాబాదు నగరాన్ని దర్శించినప్పుడు ఆనగరసోయగాలచేత ప్రభావితులై ఈ రమణీయగీతాన్ని కవి రచించారు. కవి ఈ గీతంలో హైదరాబాదు యౌవనం, లావణ్యం తగ్గని అందాలని చిత్రిస్తూ

ట్యాంక్ బండ్ సన్నని నడుంచుట్టూ చెయ్యిచుట్టి
అందమైన, నగరముఖాన్ని దగ్గరగా తీసుకుని
ఆశలతో అలసమైన అబిడ్స్ కళ్ళలోకిచూసి
దీపాల వెలుతురు ప్రతిఫలించే చెక్కిళ్ళపై ముద్దుపెట్టుకో
సిగలో నౌపహాడ్ నాగరం తళుకున మెరుస్తుంది
బంజారా హిల్స్ వక్షోజాలుద్రిక్తంగా శ్వసిస్తాయి
అలాఅలా నైలాన్ చీరకింద మెత్తని గాగరలో
సికిందరాబాద్ జఘనోరు సౌందర్యం నిన్ను కవ్విస్తుంది 69.

అని భాగ్యనగరసుందరిని మనముందు నిలబెట్టారు. ఈ గీతంలోనే పారిశ్రామిక నాగరకత ప్రభావంవలన విలువలవలువలను జారివిడిచే నగరంమీద తమ విముఖతని కూడా కవి ప్రదర్శిస్తూ ''దాపరికంలేని పారిశ్రామిక నాగరికతా నగ్నత్వం'' వై తమ నిరసన తెలియచేశారు. నాగరకజీవితంమీద కవి మనసులో ఈ నిరసన తీవ్రమై ''నగరంలో హత్య'' ''నగరంపై పీడనీడ'' అనే అముద్రిత రచనలు[15] వెలువడ్డాయి. ''నగరంలో హత్య'' అనే ఖండికలో

హైదరాబాద్ నన్ను గుర్తించలేదు పలకరించలేదు
పెద్ద పెద్ద వీధుల్లోంచివైపు సవరించుకుంటూ
తప్పుచేసిన ఆడదానిలా తప్పించుకుతిరిగింది 6.

అని చిత్రించారు. ఈ సమయంలో కవికి హైదరాబాదు భయంకర సంతోష కోలాహలంతో ''తనకి తనే వెరచి తనకి తనే మరచి తందనాలాడు''తున్నట్లు, జిందగీకి మతలబ్, ఇన్సాన్‌కీ మంజిల్ తెలియక బాధపడుతున్నట్లు కనిపించింది. ''నగరంపై పీడనీడ''లో

ఈ నగరంపై ఏదో నల్లని పీడనీడ పడింది
మృత్యువు తన భయంకర పాశాన్ని విసిరింది 8.

అని నగరం శాపగ్రస్తంగా కవికి కనిపించింది.

---

15. ఈ రెండు రచనలు శ్రీ ఎ.సోమసుందర్ సంపాదకత్వంలో వెలువడిన ''కళాకేళి'' (ఆగస్టు 1969 పుటలు 5-8) అనే పత్రికలో ప్రచురించబడ్డాయి.

## వైజ్ఞానిక దర్శనం

తత్వతః ''ఊహా వర్ణాణువాల మీద ఉదయించి'' తనలోతాను ఒకసుందరలోకాన్ని సృజించుకున్న స్వాప్నికుడు అయినా తిలక్ ఆధునికయుగాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, అనుభవించి, ఆ అనుభవాలబింబాలని తమ కావ్యసృష్టిలో ఉపయోగించుకున్నారు. ఆధునికయుగంలో మానవులందరినీ ప్రభావితంచేస్తున్న వైజ్ఞానికప్రగతి తిలక్‌ని కూడా ప్రభావితంచేసింది. సందర్భోచితంగా తిలక్ తమ కవిత్వంలో ఈ వైజ్ఞానిక కావ్యబింబ పరికల్పనచేశారు. కవి తమ కవితారంభ దశలో విజ్ఞానశాస్త్రాన్నికూడా భావకవితాదృక్పథంతో దర్శించి ''సైన్సుసుందరి'' అనే ఖండికలో

నేకనులు చంద్రగోళాలు నేవిలాస
వక్షమొక గండభేరుండ పక్షివలపు
చూరగొను వెన్నశిల సే త్రిపారుణాధ్వ
రాల సురలోకమున కరవాల వేల

ప్రతిభ, 1943

అని వర్ణించారు. ''సైనికుడి ఉత్తరం'' అనే ఖండికలో యుద్ధం సామాన్య సైనికునిమీద కలిగించే దుష్ప్రభావాన్ని చిత్రిస్తూ, ఆమనుష్యమేధంలో ఆహుతి అయ్యే సైనికుని స్థితిని

స్పృహ తప్పిన ఎనెస్తీషియాలో
వెన్నెముక కర్రలా బిగిసింది 24.

అని వైద్యరంగంలో సుపరిచితమైయున్న ఎనెస్తీషియా అనే ప్రక్రియని ఉపయోగించారు. చావుకిముందు ఈ అపస్మారకస్థితి, వెన్నెముక కర్రలా బిగిసిపోవడం సామాన్యమైన అనుభవాలే. మానవచైతన్యం నిర్జీవమై, నిశ్చేతనం అయ్యేస్థితిని కవి ఈ బింబంద్వారా ప్రదర్శించారు. ఆసుపత్రిలో అపస్మారకపరిస్థితిలో ఉన్న పరిస్థితితో టి.యస్. ఎలియట్ సాయంకాలపు నిర్జీవకళని పోలుస్తూ, కల్పించిన కావ్యబింబం "Patient etherised upon a table" ఆధునిక కవితాప్రియులందరికీ పరిచయమయిందే. ''కాస్మాపాలిటన్'' అనే ఖండికలో సర్వశాస్త్రవిదులుగా నటించే వంచకులని సుకుమారంగా హేళనచేస్తూ, వారి వంచన ప్రభావం వారికాలానికే పరిమితంకాకుండా భవిష్యత్తుమీదకూడా దుష్ప్రభావాన్ని కలిగిస్తుందని సూచిస్తూ,

> అణుధూమం వంటి వేరి జీనియస్ భవిష్యత్తులో
> అరవైశతాబ్దాల మీదకి కమ్ముకుంది 46.

అని హిరోషిమా, నాగసాకిలమీద అణుబాంబుపేలుడు వలన కలిగినరేడియేషన్ ప్రభావం ఈ నాటికీ జపాన్ దేశస్థులమీద ఉంది అనే వైజ్ఞానిక సత్యాన్ని కవి యుక్తియుక్తంగా ప్రయోగించారు. ''యుద్ధంలో రేవుపట్టణం'' అనే ఖండికలో యుద్ధసమయంలో భయపడిన మనుష్యులని వర్ణిస్తూ,

> మనుష్యుల ముఖాలమీద ఏసిడ్ మచ్చలు 71.

అని భయాలని ఏసిడ్ మచ్చలుగా నవ్యంగా, వైజ్ఞానికంగా కని చిత్రించారు. ''నవత-కవిత'' అనే ఖండికలో కవిత్వానికి నిర్వచనం ఇస్తూ, తిలక్ వైజ్ఞానికబింబ

ప్రయోగం చేశారు. ''కవిత్వం ఒక ఆల్కెమీ'' (76) అని తెలియచేశారు. ఈనాటి రసాయనశాస్త్రమూలమైన ఆల్కెమీని సూచిస్తూ, కవి తక్కువ విలువ కలిగిన లోహాలని బంగారంగామార్చే ప్రయత్నం ఆల్కెమీ అయితే, అకవితామయమైన జీవిత యథార్థాలని కవితామయంగా మార్చే భావుకశక్తిని ఆల్కెమీ అని కవి వర్ణించారు.

## పరోక్ష బింబ ప్రదర్శనం

పంచేంద్రియాలద్వారా పొందిన ప్రత్యక్ష అనుభవాలతోపాటు తిలక్ తాము చదివిన పురాణాలు, చారిత్రకగ్రంథాలద్వారా సముపార్జించిన జ్ఞానాన్నికూడా ఉపయోగించుకుని ఉచితమైన కావ్యబింబాలని తమ కవిత్వంలో ప్రయోగించారు. ఇవి వీరి విజ్ఞాన పరిధులని, అభిరుచులని వెల్లడిస్తాయి. వీరి కవిత్వంలో ప్రత్యక్ష కావ్యబింబాలకంటె పరోక్ష కావ్యబింబాలుచాలా తక్కువసంఖ్యలో కనిపించడం ప్రత్యేకంగా గమనించదగిన విషయం.

పౌరాణిక బింబ దర్శనం.

తిలక్ రామాయణంలో ప్రధానఘట్టాలని కథావస్తువుగా స్వీకరించి ''స్వయంవర'', ''విషణ్ణ వైదేహి'' అనే రెండు పురాణసంబంధమైన కవితలని రచించారు. 'స్వయంవర'[16] అనే ఖండికలో శ్రీరాముని దివ్యమంగళ స్వరూపాన్ని ''రఘువంశ తత కీర్తి మధుణ / సంపదల్ పేర్చినవారుశేలి, సాకేతసుత యౌ వతవనమ్ము / కన్నట్టి నెత్తావి కలలగుత్తి'' అని కవి చిత్రించారు.

---

16. 'స్వయంవర', ''భారతి'', ఫిబ్రవరి, 1959, 25-27.

స్వయంవర సందర్భంలో శివధనుర్భంగం చేసిన రాముని

తాకిన విల్లు తాకినటు దాశరథి పుధితాంగుళీయక
శ్రీ కిరణాప్తిచేపిరిగె చిత్రము నెచ్చెలి! నిక్వణ క్వణా
నాకులమ్మె ధనుస్సు - ఇటువంగిన నాయెద పిందితోడకే
కీ కలహంసికా పికశుకీ రమణీయ సకాకలీధ్వనిన్

27.

అని మన కన్నులముందు నిలబెట్టారు. అయితే రాముని ఏవో కొన్ని ఆదర్శాలకి, సత్యాలకి సంకేతంగా నిలబెట్టే ప్రయత్నం తిలక్ చేయలేదు. ''విషణ్ణ వైదేహి''[17] అనే ఖండికలో రాముడు అరణ్యానికి పంపిన సీత దైన్యాన్ని చిత్రించడమే కాకుండా

బాధనొందుబ్రతుకు పడతిని సీతమ్మ
యామెయుంచు పిలుతురింటనింట 78.

అని సీతమ్మని దీనావస్థలో ఉన్న స్త్రీలకి ప్రతీకగా కవి ప్రయోగించారు. సీత కష్టాలకి సంకేతంగా మాత్రమే కాకుండా సౌందర్యమూర్తిగా కూడా కనిపించింది

---

17. విషణ్ణవైదేహి, ''భారతి'' జూన్, 1961, 77-78.

ఏ శరదిందురేఖ స్పృశియింపగ నవ్విన సన్నజాజి, ఆ
శాసికతాతలాల చిరుసవ్వడి దొర్లాడి పాలనురుగు, ఏ
మూసిన కొండకోన కొసమోగిన వేకువ వెలుగుమువ్వ 78.

జానకితో సరిపోలవని కవి చిత్రించారు. ''అమృతం కురిసినరాత్రి'' అనే కవితా సంకలనంలో సందర్భోచితంగా పౌరాణిక, చారిత్రక కావ్యబింబ ప్రయోగంచేశారు. ఆధునిక భారతానికి ఉత్తమ నాయకుడైన జవహర్‌ని ''మానవోత్తముడు'' అని వర్ణించడమే కాక ''మేరు నగ ధీరుడు'' ( 55 ) అని వర్ణించడంలో జవహర్ భూత, వర్తమాన, భవిష్యత్కాలాలకే నాయకుడని జవహర్‌ని పురాణప్రసిద్ధమైన మేరునగంతోపోల్చి సూచించారు. మెగాటన్ బాంబులతో నిరంతరం యుద్ధానికి సన్నద్ధం అవుతున్న ప్రపంచాన్ని ''లయగీతం'' అనే ఖండికలో ఊహిస్తూ, భవిష్యత్తులో ప్రపంచం సర్వనాశనంచెంది వారసులు లేరని విలపిస్తుంది అనే కఠోరసత్యాన్ని తెలియచేయడానికి

ఇరుసు వంగి
భూమి కుంగె
జరత్కారు పూర్వీకులు శాఖలమై వ్రేలాడుచు
శరణు శరణు వచనమ్ముల
సాశ్రునయన దీనులైరి 60.

అని పురాణప్రసిద్ధమైన జరత్కారుని పూర్వీకులతో ఈనాటిప్రజలని కవి పోల్చారు. ఇందువలన ఈనాటిదైన్యం సార్వకాలికమైన దైన్యంగా కవి చిత్రించగలిగారు. ఈ ఖండికలోనే చరమయుకాల విషసంధ్యని శివతాండవంగా చిత్రిస్తూ

చషకములో నరరుధిరము
సందిటలో
శివ శిరస్సు
సకల దిశా జిహ్మగవాంతశబలిత గంధకధూమము
జరత్కనిశా శింజాంతముల లయకేలా వలయము 62.

గా మారణాయుధాల భయంకర పరిణామాలని కవి సూచించారు. ''దీపం'' అనే ఖండికలో కవి తమ క్రైస్తవ పురాణస్మృతిని వెల్లడిస్తూ

ఏడమ్ అండ్ ఈవ్‌లు చేసిన పాపం
యిలపై వెలిగించిన తొలిదీపం 64.

అని క్రైస్తవుల తొలిమిథునం ఆంక్షలని అధిగమించి తమస్వేచ్ఛాప్రవృత్తిని[18] వెల్లడించే ధైర్యాన్ని వారు వెలిగించిన తొలి దీపంగా చిత్రించారు. ఈ కవితలో కవి పాపాన్ని దీపంతో పోల్చి, చీకటి పాపానికి వెలుతురు సోయగాన్ని కలిగించి పాపంమీద ఎంతో సానుభూతిని వెల్లడించారు. ''న్యూసిలబస్'' అనే చమత్కార ఖండికలో భారత దేశంలో స్వాతంత్ర్యానంతరం పుట్టుకొస్తున్న స్వార్థపరులని

18. డా. నారాయణరెడ్డికి కూడా ఈ పాపం అహంకృతిగాకాక 'అక్కడే మొదలవుతుంది మానవసంస్కృతి' ('విశ్వంభర', 9) అనే విశ్వాసాన్ని కలిగించడం గమనించదగిన విషయం.

గజానికొక గాంధారి కొడుకు గాంధీగారిదేశంలో 117.

అని ధుంశోధనసములైన ఆధునికులని కవి ఘాటుగా విమర్శించారు. ''కాయ్ రాజా కాయ్'' అనే ఖండికలో ఆధునిక మానవుల ద్యూతవ్యసనాన్ని అధిక్షేపిస్తూ, పేకాటలో ధనం, సుఖం, వనిత, ఘనత పోగొట్టుకున్న మనిషిని

ధర్మరాజా
ఇక అరణ్యవాసం నీకుగతి
దుర్యోధన సార్వభౌమా
ద్రౌపది యిక నీఖాదీ 139.

అని ఈ వ్యసనం పురాణకాలం నుంచే సంక్రమించిన జాడ్యమే అని కవి సూచించారు.''

చారిత్రక బింబ దర్శనం.

తిలక్ చారిత్రక సంఘటనలని తమ కవిత్వంలో ఉపయోగించుకుంటూ సందర్భోచితంగా చారిత్రక కావ్యబింబాలని ప్రయోగించారు. ''టులాన్'' అనే కవితలో జర్మన్ సైన్యాల ఆక్రమణకి గురి అయిన ''టులాన్'' అనే ఫ్రెంచి నగరాన్ని

టులాన్ భూమిమీద
ప్రజల వేడికన్నీళ్ళవాన వాగులై పారింది 26.

అని చిత్రించారు. ఆనాటి ఫ్రెంచి నాయకులు కర్తవ్యతావిమూఢులైనారని తెలియ చేయడానికి

డార్లన్ వెటెయిన్ లావెల్ మొదలగు నాయకులందరూ
అధికారపు చీకటిలో గొంతు విరిగిన గుడ్లగూబలు 28.

అని చరిత్రకి కవి తమ వ్యాఖ్యానంచేశారు. కింగ్ జాన్‌కి 1215 వ సంవత్సరం లో ఆనాడు భూస్వాములు సమర్పించిన ''మాగ్నా కార్టా'' అనే హక్కుల పత్రాన్ని మానవులందరూ, అన్ని కాలాల్లో ఆశించే హక్కుల పత్రానికి సంకేతంగా కవి ప్రయోగించారు. అణుబాంబు విధ్వంసానికి గురిఅయిన జపాన్ పట్టణాలు రెండింటిని ''లయగీతం''లో విలయ సంకేతాలుగా భావిస్తూ

హిరోషిమా
నాగసాకి
నగరస్మృతి చితాభస్మ
మెగిరిపడెను నాకన్నుల
జ్వాల తాకష్ట
మిలా తలం 61.

అని చిత్రించారు. హిరోషిమా, నాగసాకీలు మానవ మారణాయుద్ధపిపాసకి, ఆ పిపాస కలిగించే మనుష్యమేధకి సంకేతాలుగా కవి ప్రయోగించారు. ''రాజమండ్రి పాటలు''ల్లో రాజమండ్రి దృశ్యాలని ప్రదర్శిస్తూ, శారీరకవాంఛ నీతిశృంఖలాలని ఛేదించివేస్తే, జరిగే ప్రమాదాన్ని సారంగధరమెట్ట దగ్గర వినిపించే విషాద సంగీతంగా వినిపిస్తూ

నీటి కట్టు లాంటిది
కోర్కె మంటలాంటిది
అందుకే రాజరాజు కొంపకి నిప్పంటుకుంది 99.

అని రాజరాజనరేంద్రుని చరిత్రలో అనుశ్రుతంగా వస్తున్న గాథకి కవి అన్నికాలాలకి వర్తించే వ్యాఖ్యానం చేశారు. ''కాయ్ రాజా కాయ్''లో ఆఖరిక్షణంలో అదృష్టం వరించక అపజయాన్నిపొందిన నాయకులని జోకర్ దొరకని వారిగా చిత్రిస్తూ, ఇందుకు ఉదాహరణగా

హిట్లర్‌కి జోకర్ దొరకలేదు
ఆఖరి కలుపులో రష్యన్ చెరియాకు
జోకర్ దొరకలేదు 140.

అని దురదృష్టవంతులు చరిత్రలో అనాదిగా పునరావృతం అవుతూ ఉంటారని కవి సూచించారు.

ప్రతీకాత్మక గీతాలు:-

తిలక్ తమ కవితలలో యుద్ధచిత్రంగా కావ్యబింబపరికల్పన చేయడమే కాకుండా కొన్నిభావాలని సమగ్రంగా వ్యక్తీకరించడానికి కొన్ని ప్రతీకాత్మక గీతాలు (allegorical poems) రచించారు. వీటిలో ''సి.ఐ.డి. రిపోర్టు'', ''ప్రకటన'' ''గొంగళిపురుగులు'', ''కాస్మాపాలిటన్'', "త్రిమూర్తులు" ముఖ్యమయినవి.

''సి.ఐ.డి.రిపోర్టు'' నిత్యశంకితుడైన సామాన్యమానవుని మీద సానుభూతి పూర్వకమైన అధిక్షేపం. ఈ ఖండిక W.H.Auden రచించిన "The Unknown Citizen" అనే కవితకి స్వేచ్ఛానుసరణ. ఈ గీతంలో అదృష్టవిజయాలు, ఉద్యోగంలో ''లిఫ్టు''లు లేకుండా చప్పచప్పగా జీవితాన్ని గడిపే మధ్యతరగతి గుమాస్తా జీవితాన్ని చిత్రించారు. అయినాపురం కోటే (టే) శ్వరరావు ఈ వర్గం మనుష్యులకి ప్రతీక. ఇటువంటి వ్యక్తులని డా.నారాయణరెడ్డి 'ఎన్జీవి' అని వ్యవహరించారు. ఈ వ్యక్తి సమగ్రస్వరూపాన్ని

ఇతని తండ్రి గుమాస్తా, తాతగుమాస్తా, ముత్తాతగుమాస్తా
సాంప్రదాయకమైన వినయ విధేయతలకీ, గౌరవకరమైన దరిద్రానికీ
వేళ్ళ వంశం ఒక రాస్తా
ఇతనికియింట్లో ఆరుగురుపిల్లలూ, ఒకముసలితల్లీ, ఒకపిల్లీ
ఒక్కర్తే నీరసంగావున్న భార్య
ఇతనద్దెకున్న వాటాలో రెండున్నర గదులూ, ఒకటెలివిజన్ లాంటి
బాత్‌రూమూ, ఒకవంటకా

19.

అని కవి వాస్తవికంగా చిత్రించారు. అతని మానసిక స్థితిని కూడా కవి ప్రతిభావంతంగా అతనుయోగి కాడని, కవికాడని, లంచాలుపట్టడు, ఎవర్నీ తిట్టడు, ఎవరేమన్నా పట్టించుకోడు అని వర్ణిస్తూ ప్రదర్శించారు. ఈ గీతం సంపూర్ణంగా చదివితే మధ్యతరగతిజీవి సమగ్రబాహ్య, మానసిక స్థితులు వెల్లడి అవుతాయి.

మధ్యతరగతి జీవితాలని తిలక్ ''గొంగళి పురుగులు'' అనే మరో ప్రతీకాత్మకగీతంలో చిత్రించారు. ఎదుగు బొదుగులేక ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్నట్టు; బల్లపరుపుగా పరచుకున్న జీవితాలని వెళ్ళబుచ్చే మధ్యతరగతి జీవులని ''గొంగళి పురుగులు'' అనే ప్రతీకద్వారా చిత్రించారు. జీవితంలో ఏమీ సాధించలేకపోయినా, ఎప్పటికేనా సీతాకోకచిలుకలా రమ్యాకాశంలో ఎగర గలమేమో అనే ఆశ ఈ జీవులకి కలుగుతుంది అని కవి సూచించారు. వీరి జీవితాల్లో సాధించిన విజయాలకంటె చెయిజారుచుకున్న అవకాశాలే ఎక్కువ. ఇటు వంటిస్థితిని ఆరుద్ర ''తాను ఎక్కబోయే రైలు ఒక జీవితకాలం లేటు'' అని వర్ణించారు. ఇటువంటి అభాగ్యులని తిలక్

అసలు అప్పుడే కాంగ్రెస్‌లో చేరివుంటే ఈపాటికి మినిస్టర్ని
అయిపోయి ఉండేవాడినని
వెళ్ళాందగ్గర చెప్పాలని సరాసడి
''హాయ్యోరామ నీబతుక్కి'' అన్నట్టు మూతివిరిచే
అర్ధాంగి ఆకారం తలుచుకుని
ముడుచుకు పోయిన గొంగళీపురుగు
తన్ని తనే తీసుకుని గోడ అవతలికి
తన్ని తనే గిరవాటేసుకుంది 35.

అని కవి చిత్రించారు. జీవితంలో ఎన్నో చప్పటి అనుభవాలు పొందాక చిన్నప్పటి ఆదర్శాలు, అహంకారాలునశించాక ''అలవాట్ల ఆచారాల రైలుపట్టాలమీదే దొర్లుకుని దొర్లుకుని'' రొటీన్ జీవితానికి అలవాటుపడి కోటేశ్వరరావులాగా,

వీరేశ్వరరావులాగా తయారవుతారు. ఒక్కొక్కసారి ఈ జీవితంమీద విరక్తిపుట్టి జీవితాన్ని ''సరుపుచుట్టలా చుట్టి'' ఆత్మహత్య చేసుకుందామని అనుకుంటారు. కాని వెళ్ళాంమాట వినిపించో, బాస్ కేకవినిపించో ఆత్మహత్య చేసుకునే ధైర్యంకూడా లేక మళ్ళీ తన మామూలు జీవితానికి తిరిగివస్తాడని తిలక్ తెలియచేస్తూ

తిరిగితన జీవితాన్ని బల్లపరుపుగా పరుచుకుని
దానిమీద నిద్రపోయింది గొంగళీపురుగు
సగం సగం తిన్న కలల్ని నెమరేస్తూ
సగం సగం చచ్చిన ప్రాణాన్ని జోకొట్టుతూ 37.

అని కవి మధ్యతరగతి జీవితాలకి దర్పణం పట్టారు.

''ప్రకటన'' అనే ఖండిక ''చల్లని తల్లి'' ''చక్కనిచెల్లి'' శాంతి ఆవశ్యకతని పరోక్షంగా తెలియచేసే ప్రతీకాత్మకగీతం. ఈ గీతంలో కవితావస్తువుని కవి మొదట ప్రతిపాదించలేదు. ఎవరో పరారీఅయిన వ్యక్తికోసం ప్రకటనగా స్టేషన్లో టిక్కెట్లని జారిచెయ్యకండి, కేబుల్‌గ్రామ్సు పంపించండి, ఆకాశవాణిలో ప్రకటించండి, సాయుధదళాల్ని దిక్కులలో నిలబెట్టండి అంటూ ప్రకటనగా కవి ప్రారంభించారు. ఈ వ్యక్తి పరారీకావడం వలన ప్రపంచ రాజకీయాలు స్తబ్ధమైపోతున్నాయని, శాస్త్రప్రగతి కుంటుపడుతుందని తెలియచేస్తూ

ఇంక చరిత్రలు వ్రాయనక్కరలేదు
ఇంక రాజ్యాలు పాలించనక్కరలేదు
అణుబాంబు యుగాంతాన్ని నిరూపిస్తున్నది
ఆ ముహూర్తం త్వరలోనే వస్తున్నది 33.

అని వెల్లడిస్తూ చివరికి ఈ పరిస్థితికి కారణమైన శాంతిని

అపార కృపా తరంగితాలైన నయనాంచలాలు
ఆనందం జాలువారే దరహాస పరిమళాలు
సంస్కారపు కేశపాశంలో తురిమిన అనురాగపు గులాబి
సదా ప్రజాహితైషిణి సుభాషిణి గర్వంలేని రాణి
కల్లనే క్రౌర్యాన్నీ కాలుష్యాన్నీ తిరస్కరిస్తుంది
తెల్లని పావురాన్ని సరదాగా ఎగరేస్తుంది
చల్లని తల్లి చక్కనిచెల్లి ఆమెపేరు శాంతి 33.

అని శాంతిని రమణీయసుందరిగా చిత్రించారు.

ఒకజాతికి, ఒకసంస్కృతికి చెందక అన్ని జాతుల, అన్ని సంస్కృతుల ఉపరితలాన్నే స్పృశించి, వాటిఅన్నింటి అంతరాంతరాల్లో ఉన్న ఏకతాసూత్రాన్ని గ్రహించలేక మానసికమైన ఎడబాటు (mental alienation) అనుభవిస్తూ, ఆ లోపాన్ని కప్పిపుచ్చుకోడానికి తాము అంతర్జాతీయ వ్యక్తులం అని చాటుకునే

''కాస్మాపాలిటన్''వ్యక్తులని తిలక్ సున్నితంగా ఎగతాళి చేశారు. ఈ వ్యక్తులు రష్యాలో ''రినిజనిస్టు''ఏడ్చాని నేవింది, చైనాలో ''రివల్యూషనిస్టు''భోజనంచేసి, ప్రపంచంలో అనేకప్రాంతాల్లో అనేక అందాలని చవిచూసినట్టు నటిస్తారు. శంకరుడు, శాంతాయనా, మార్క్స్, కీర్క్‌గార్డ్ అందరూతనకి పరిచితులేనని ప్రకటిస్తారు. అయితే వీరి సాంసారిక జీవితంకూడా శూన్యమయింది. మొదటి భార్యని ఈయని వదిలేశాడు. రెండో ఆవిడ ఈయన్ని తగిలేసింది. ఇటువంటి వ్యక్తుల స్వరూపాన్ని చిత్రిస్తూ కవి వీరు ఎన్ని అనుభవాలని పొందినా చివరికి ఏప్రగాఢతత్వాన్ని అవగాహన చేసుకోలేక అన్ని సిద్ధాంతాల, మతాల సైంటిఫిక్ నిజాల పరమరహస్యం తెలుసుకున్నట్లు భావిస్తారు. అందుకే చివరికి తమ ఎపిటాఫ్‌గా

దేవుడూ మానవుడూ వారిద్దరే యీ అనంత విశ్వంలో మూర్ఖులు

46.

అని ప్రకటించుకుంటారు. అంటే జీవితంలో వివిధ అనుభవాలని ఉపరితలంనుంచే పొందే ఆ అనుభవాల వెనకఉన్న అంతస్సూత్రాలని గ్రహించలేని మనిషి ఎంత కాస్మాపాలిటన్ వ్యక్తి అయినా జీవితంలో మిజరబుల్ ఫెయిల్యూర్ అని కవి సూచించారు.

ఆధునికాంధ్రకవిత్వంలో మూడు కవితామార్గాలకి ప్రతీకలుగా ముగ్గురు కవితామూర్తులని ''త్రిమూర్తులు''అనే ప్రతీకాత్మక గీతంలో తిలక్ ప్రదర్శించారు. సంప్రదాయ కవిత్వానికి మూలస్తంభంగా నిలిచే విశ్వనాథవారిని

మావాడే - మహాగట్టివాడు - మకుటంలేని మహారాజయ్యేవాడు
కాని, ముసలిదాన్ని, మసక మసక కన్నులదాన్ని,
        మూలమూల ముడుచుకు కూర్చున్నదాన్ని
మనువు చేసుకోవాలన్న ఉబలాటంతో
మంచీ చెడ్డా మరచి పోయాడు
మర్యాదల్ని అతిక్రమించాడు 59.

అని మితిమీరిన సంప్రదాయాభిమానంతో ఎక్కవలసిన శిఖరాలని విశ్వనాధ ఎక్కలేక పోయారని కవి అభిప్రాయపడ్డారు. రెండోమూర్తి భావకవితా చక్రవర్తి కృష్ణశాస్త్రి. వీరు సౌందర్యప్రియులు కవిత్వతత్వాన్ని, ఆల్కెమీని పూర్తిగా తెలిసినవారు. అయినా సామాన్యమానవునికి అందకుండా భావాంబరవీధుల్లో విహరిస్తారు.

మల్లెపూల మీద పరుంటాడు, మంచిగంధం రాసుకుంటాడు
మరి ఎందు కేడుస్తాడు ?
మంచిపనివాడు, నాకునచ్చినవాడు, మంత్రనగరానికి వెళ్ళొచ్చినవాడు

అని కృష్ణశాస్త్రి మానసిక తత్వాన్ని ప్రస్ఫుటంచేస్తూ, తిలక్ తన కవితాభిరుచిని కూడా ప్రస్ఫుటంచేశారు. మౌలికంగా తిలక్ భావకవి. అందుకే కృష్ణశాస్త్రిని ''మాకు నచ్చినవాడు, మంత్రనగరానికి వెళ్ళొచ్చినవాడు'' అని మెచ్చుకున్నారు. కవికి ఆల్కెమీ తెలియాలి. పేలవమైన జీవితయధార్థాలని కవితా సత్యాలుగా

పరివర్తించే మంత్రశక్తి ఉండాలి అని తిలక్ గాఢంగా విశ్వసించారు. ఇక మూడవమూర్తి ''చిచ్చరపిడుగు'' శ్రీశ్రీ. ఈయన అభ్యుదయ కవిత్వానికి నాయకుడు. దగాపడిన తమ్ముళ్ళకి ఆశ్రయం ఈయగల వ్యక్తి కాని చవకబారు విదేశపానీయాలు సేవించి తన సృజనాత్మకశక్తిని కోల్పోతున్నాడని కవి తమ బాధని వ్యక్తంచేశారు.

వేడు చిచ్చరపిడుగు, ఎండలోనడిచేమనుషులకి గొడుగు
ముందుకు వేసిన అడుగు
మాకు చిన్నన్న 59.

అని శ్రీశ్రీ అభ్యుదయ కవితామార్గం తమకి సమాదరణీయం అయిందని స్పష్టం చేశారు. అయినా శ్రీశ్రీ తనకి ''చిన్నన్న'' అనడంలో తన ప్రథమ కవితాభిరుచి భావకవితా సంబంధమయిందని, అభ్యుదయ కవితాభిరుచి రెండవది అని తిలక్ సూచించారు.

వైయక్తిక కావ్యబింబ దర్శనం:

కవిత్వ తత్వాన్ని విశదీకరిస్తూ ''నవత-కవిత'' అనే ఖండికలో తిలక్ ''నువ్వు చెప్పేదేదైనా నీదైవుండాలి, నీ లోంచిరావాలి, చించుకుని రావాలి'' అని కవిత్వం వ్యక్తిగత అనుభవాల ఆవిష్కరణకావాలి అని ఆశించారు. ఆధునికాంధ్ర కవిత్వంలో వైయక్తికానుభవాలని వ్యక్తీకరించడానికి విశిష్టమైన, వైయక్తికమైన కావ్యబింబ పరికల్పన సహాయకారి. ఈ దృష్టితో పరిశీలించినప్పుడు తిలక్

కవిత్వంలో ప్రత్యేకంగా వేర్పాటుగల వైయక్తిక కావ్యబింబాలు గోచరిస్తాయి. ఇటువంటి కావ్యబింబాలు తెలుగు సాహిత్యానికి నవ్యతని, తీవ్రతని సంతరిస్తాయి. ''సైనికుడి ఉత్తరం'' అనే ఖండికలో యుద్ధకాలంనాటి పరిస్థితులని చిత్రిస్తూ

లిబియాలో బెర్లిన్‌లో స్టాలిన్‌గ్రాడ్‌లో
స్వార్థం పిచ్చికుక్కలా పరుగెత్తింది 24.

అని మానవుల స్వార్థాన్ని, అదుపు అజ్ఞలేని విధ్వంసప్రవృత్తికి పిచ్చికుక్క ప్రతీకగా కవి ప్రయోగించారు. ఇందులో కవి పరిశీలనాశక్తి, విశిష్టదృక్పథం ద్యోతకం అవుతున్నాయి. ''కఠోపనిషత్'' అనే ఖండికలో స్తబ్ధమైన సాంఘికవ్యవస్థని ఆక్రమిస్తున్న అజ్ఞానాంధకారాన్ని

నీడల కొండచిలువలు వెలుతురు కుందేళ్ళను మింగి
సంఘపు మర్రిచెట్టును చుట్టుకుని మత్తుగా నిద్రపోయే

49.

పరిస్థితిగా కవి చిత్రించారు. అజ్ఞానం జ్ఞానాన్ని జయించింది అనే విలోమస్థితిని వెలుతురిని చీకటి జయించింది అని సూచిస్తూ, వెలుతురిని కుందేళ్ళుగా, చీకటిని కొండచిలువగా అపూర్వంగా చిత్రించారు. అంతులేని సంతానాన్ని కని స్తబ్ధతలోకి జారుకున్న వృద్ధమాత సంఘాన్ని మర్రిచెట్టుగాకూడా కవి ప్రతిభావంతంగా చిత్రించారు. ''దీపం'' అనే ఖండికలో దీపాలకి అతి నవ్యరూపాలని కల్పిస్తూ

దీపాలు బాగుందాయి
పాపల్లాంటి దీపాలు
కనుపాపల్లాంటి దీపాలు
పాపాలవంటి సహజ స్వచ్ఛతీవ్రమైన దీపాలు 63.

అని కవి వర్ణించారు. దీపాలు పాపల్లాగా స్వచ్ఛమైనవని, కనుపాపల్లాగా సహజమైనవని పాపాల్లాగా తీవ్రమైనవని సూచించడానికి కవి ఇటువంటి విశిష్ట కావ్యబింబాలని ప్రయోగించారు. ''యుగళగీతిక''లో తనచుట్టూఉన్న ప్రకృతి అందాలని తన పంచేంద్రియాలతో అనుభవిస్తూ పచ్చని ఆకుల పచ్చివాసనలని, చల్లని కనురెప్పల కదలికలు, అత్తరు సుతారపు సువాసనమనకి అనుభవైక వేద్యంచేశారు.

గదిలో చీకటిలో
చిటిలిన తారలట్లు
సగం కాలిన అగరువత్తుల కొసలు 67.

అని చీకటి గదిలో అగరువత్తుల కొసల మిణుకు మిణుకు కాంతిని చిద్రుపలైన నక్షత్రాల కాంతిగా తిలక్ అతిరమ్యంగా చిత్రించారు. ఈ ఖండికలోనే చీకటిలో కనిపించే వెలుగురేకలని సూచిస్తూ

గడియారపు డయల్‌మీది
రేడియం అంకెలు
చీకటి మార్జాలపు పచ్చని కళ్ళు 68.

అని
అత్యంత ప్రతిభావంతంగా, నవ్యంగా కవి చిత్రించారు. కవిత్వపు విలువలని నిర్ణయించే కావ్యనికషాల్లో కావ్యబింబం ముఖ్యం అని భావించే Ezra Pound ఒక్క రమణీయకావ్యబింబం ఆకవి కవిత్వ ఔన్నత్యాన్ని నిర్ణయిస్తుందని తెలియ చేశారు. తిలక్ కల్పించిన ఇటువంటి విశిష్టవైయక్తిక కావ్యబింబాలు తిలక్‌ని ఆధునికాంధ్రకవితారంగంలో ఉత్తమ కవిగా నిలబెట్టగలిగాయి.

''యుద్ధంలో రేవుపట్టణం'' అనే ఖండికలో యుద్ధసమయంలో మానవులు అనుక్షణం భయపీడితులు అని తెలియచేయడానికి

మనుషుల జేబుల్లో భయాల బొద్దింకల పరుగులు 70.

అనే విశిష్ట కావ్యబింబాన్ని ప్రయోగించారు. భయాన్ని బొద్దింకలతో పోల్చడం కవి పరిశీలనాశక్తిని వెల్లడిస్తుంది. ఇవేకాక ''విరహోత్కంఠిత''లో ''సరదాల అగరవత్తులు'', ''చిన్నారికి చిన్నమాట''లో ''జీవితం సంగీతం వెన్నెల'', ''బ్రతుకే ఉలిపిరి కాగితం'', ''రాత్రివేళ''లో ''ఈగానం ఎవరిదో చీకటి కాగితంమీద ప్లాటినం తీగలాగా మెరుస్తోంది'' (121) , ''నీడావృతి హారం'' లో 'సగం మబ్బు సూర్యుడిమీద శాటిన్ తెరలా కప్పుకుంది'' (124) వంటి అపూర్వమైన, విశిష్టకావ్యబింబాలని తిలక్ తమ కవిత్వంలో సమృద్ధిగా కల్పించి తమ కవిత్వానికి ఒక అనన్యసామాన్యమైన వైశిష్ట్యాన్ని సంతరించుకున్నారు.

తిలక్ తమ కవిత్వంలో ప్రకృతిదర్శనంలో ప్రముఖంగా సౌందర్య దృష్టిని వెలువరించారు. కవిత్వలక్ష్యం 'అందం', ' ఆనందం' అని భావించి వాటినే తమ కవిత్వంలో ఉత్తమ ఆదర్శాలుగా చిత్రించారు. ఈ సౌందర్యదృష్టి

వీరికి ప్రకృతిలో భయానక దృశ్యాలమైన ఏవగింపుని కలిగించింది. ఈ ఏవగింపు వీరి సౌందర్యారాధనకి నిదర్శనం. వీరి కవిత్వంలో వైజ్ఞానిక బింబాలు, వ్యావసాయకబింబాలు వీరి పరిశీలనాశక్తిని వెలువరిస్తాయి. వీరు పరోక్షావణబింబాలని తక్కువగా ప్రయోగించారు. దీనినిబట్టి వీరికవిత్వసృష్టికి ముఖ్యభూమిక వీరి వైయక్తిక అనుభవాలు, ప్రత్యక్ష పరిశీలన అని స్పష్టం అవుతోంది. చారిత్రిక స్పృహ, రాజకీయ పరిజ్ఞానం సమయోచితంగా ఉన్నా వీరు ప్రముఖంగా తమ కవిత్వంలో సౌందర్యదృష్టిని వెలువరించారు. ఈ సౌందర్యదృష్టితోపాటు తోటి మానవునిపై అపరిమితమైన సానుభూతి వీరికి సహజాలంకారం. సగటుమనిషికి వీరు అత్యున్నతస్థానాన్ని ఇచ్చారు. మార్క్సిస్టు విమర్శకులు వీరిని 'అభ్యుదయ' కవి కాదని వాదించినా, సర్వమానవసౌభ్రాతృభావన, అంతర్జాతీయ దృక్పథం, పార్టీరాజకీయాలకి కట్టుబడని ప్రగతిశీలమైన దృష్టి వీరికవిత్వంలో వెల్లడి అవుతున్నాయి. తిలక్ కాలత్రయాన్ని తాత్త్విక దృక్పథంతో సమాలోచించి వాటి మధ్య భావసేతువుని నిర్మించాలని ఆకాంక్షించిన కవిద్రష్ట. ఆధునిక కవిత్వరంగంలో తిలక్ అన్ని దృక్పథాలకి, శిల్పప్రక్రియలకి సమన్వయం సాధించిన సాహిత్య విరాట్ మూర్తి. 'నైక నదీనదాలు అద్భుతంగా కలిసిన అంతస్సింధువు'. కవిత్వంలో రాజకీయదృక్పథాన్ని మాత్రమే కాక, కళాశిల్పవైదగ్ధ్యాన్ని, భావసౌకుమార్యాన్ని, ఆత్మసౌందర్యాన్ని అన్వేషించే వారందరికి సాహిత్యబంధువు.



# డా॥ దాశరథి

## కవితాపుష్పక సారథి

## డా॰దాశరథి
## కవితా పుష్పక॰॰సారథి

నవాంధ్ర కవితాసీమలో మూడు దశాబ్దాలు పైగా కవితాసృష్టి చేస్తున్న డా॰దాశరథి గారికి ఒకవిశిష్టమైన స్థానం ఉంది. వారికవితాసృష్టికి ప్రత్యక్ష పరిశీలనాశక్తి, ముఖ్యమైన ప్రాతిపదిక ప్రకృతి పరిశీలనాశక్తితో పాటు సంస్కృత సాహిత్యపరిచయం, సమాజపరిశీలన, వైజ్ఞానిక శాస్త్రస్పృహ, నాగరక ప్రపంచ పరిజ్ఞానం వీరి కవిత్వంలో వివిధదశలలో వివిధ మానసిక అవస్థలలో గోచరిస్తాయి. సమన్వయ దృక్పథానికి డా॰దాశరథికూడ ప్రశంసనీయమైన ప్రతినిధి[1]. తమ శైశవ కౌమారదశలలో జానపదవాసి కావడంవల్ల వీరు ప్రకృతి ఒడిలో పెరిగిన వ్యక్తిగా కనిపిస్తారు. ''అగ్నిధార'' (1949) అనే వీరి మొదటి ప్రచురణనుంచి ఇటీవలి ప్రచురణ ''ధ్వజమెత్తిన ప్రజ'' (1981) వరకు వీరి కవితా వ్యాసంగంలో ప్రకృతి ప్రధానస్థానాన్ని అలంకరించడమేకాక ఆ ప్రకృతిశక్తి బహుముఖ రూపాలలో దర్శనమిచ్చింది. ఇవేకాక పరోక్షజ్ఞానానికి సంబంధించిన సంప్రదాయస్పృహ, పురాణపరిచయం, సంస్కృత, ఉర్దూ, ఆంగ్ల సాహిత్యాల అభినివేశంకూడా వీరి కవితాసృష్టికి దోహదంచేశాయి. ఇందుకు తగ్గ పంక్తులావలంబించాలని కవి సూచించారు.

### ప్రకృతి దర్శనం

వీరి కవితాప్రపంచంలో ప్రకృతిదర్శనాన్ని ఈ క్రింది విధంగా విభజించవచ్చు.

1. ప్రకృతి శృంగారాధి దేవతగా, కవి శృంగారానురక్తికి సంకేతంగా, ప్రకృతి ఆనందాధిదేవతగా, కవి ఆనందానికి సంకేతంగా.

---

1. Dr.G.V.Subrahmanyam, 'If SriSri is the torch bearer of the revolutionary approach of socio-economic ~~approach to~~ problems, Dasarathi is confirmed advocate of the Gandhian philosophy of peaceful evolution ..... his poems represent respect for tradition and creative instinct for experiment within bounds', 'Synthesis of tradition and Experiment', "The Hindu", Nov., 6th 1977.

2· ప్రకృతి కవిలో విప్లవ, అభ్యుదయ, భావాలకి సంకేతంగా·

3· ప్రకృతి ఆశలకి ఆలవాలంగా, కవి ఆశలకి దర్పణంగా, శాంతి దేవతగా, దయార్ద్రహృదయగా

4· ప్రకృతి భయదస్వరూపిణిగా, కవి హృదయంలో నిరాశకి ప్రతిబింబంగా·

5· ప్రకృతి కవి తాత్త్వికచింతనకి, దార్శనికతకి ఆలంబనంగా సంకేతంగా దాశరథి కవితలో వివిధావస్థలలో ప్రకృతి దర్శనీయం అవుతుంది·

డా·దాశరథి తమ యౌవనప్రాదుర్భావకాలంలో, రెండు పదుల వయసులో ''అగ్నిధార'' రచించారు· ఈ కాలంలో తరుణవయసు, ఉర్దూ సాహిత్యాధ్యయనం వీరిని ప్రభావితంచేశాయి· ఈ ప్రభావం వలన డా·దాశరథికి ప్రకృతి సర్వస్వం ప్రణయదేవతగా, రమణీయాకృతిగా దర్శనీయం అయింది· ''ఉషాకన్య'' అనే ఖండికలో కవికి ప్రభాతసుందరి మందహాసంతో, మదగజగమనంతో నడయాడే తెలుగు లక్ష్మిగా కనిపించింది· ఆమె

జలతారు చీరలో
కదలెడు కౌనుతో తెలుగు గడ్డకు వెల్గులువోయుచున్న దు
న్మదగజరాజయాన మధువిలాస వికాస భాసయై[2] ''అగ్నిధార'', 16·

కనిపించింది·

---

2· 'అగ్నిధార', 'రుద్రవీణ', 'మహాంధ్రోదయం', 'పునర్నవం', కవితాపుష్పకం', 'అమృతాభిషేకం', కవితాసంకలనాలనికూర్చి ఒకేగ్రంథంగా 'దాశరథికవిత' అనే పేరుతో డా·దాశరథి 1977 లో ప్రచురించారు· ఈ పరిశీలనలో ఉదాహరింపబడిన పాదాలని ఆసంకలనం నుంచి సేకరించాను· ఆ పాదాల తరువాత పుటసంఖ్య ఇచ్చాను·

జీవితంలో ''దుర్గతి బడి కుందు మానవులకు / కవితా మదిరానుపానమే అతులిత మోహనౌషధము'' అని ''అమని'' అనే కవితలో భావించినకవికి లలిత మధుర భావనస్ఫురించి అమనిలో చషకమునెత్తి మధుపానముచేసే సమయంలో

> నా ప్రియురాలి నవాధరోష్టమని
> దెదియొాధరచ్ఛదమ్ము కను
> పించె, సుధాచషకమ్ము నొక్కొ

అగ్నిధార, 17.

అని తన ప్రియురాలి నవాధరాన్ని ప్రకృతిలో సౌకుమార్యానికి సంకేతంగా కవి రమణీయ భావవ్యక్తీకరణ చేశారు. ప్రియురాలు తన హృదయంలో ప్రేమోదయాన్ని కలిగించడం నందనవనం పూవుల అంట్లుతెచ్చి తన మనసులో మొక్కకట్టగా అవి ప్రేమ ప్రసవాలుగా, మానస సుమాలుగా, ప్రియాదరహాస సుగ్ధ బుగా రూపుదిద్దుకుని కవి మనసు తోటలో అప్రతిమానమైన సుమవినాశంగా నిలనిల్చినట్లు కవి తమ ప్రణయ భావనని వెల్లడించారు. ''ఉగాది'' ని స్త్రీమూర్తిగా భావించి ''ఒక్కొక నూరు కొప్పు పువు లొలుగ తళుకులమ్మెటజారు'' చక్కని లేమగా కని భావించారు. ఉగాది సౌందర్య వర్ణనలో కవి తమ దృశ్య, శ్రావ్య, రాసనిక ఇంద్రియాను భూతుల్ని ప్రదర్శించారు. ''రిక్కలు రాలిపోన విదలించు ఉషోగగనాంగన'' ని కనులతో దర్శించి మాధవుడు అరుదెంచేవేళ వెచని వేపపూలని స్పర్శేంద్రియంతో గ్రహించి ''వసంత సాంధ్య వికచమల్లికా మధుర హాసాన్ని'' కవి దర్శించి పాఠకులకి దర్శింపచేశారు.

వెల్లువిసిన బాటసారి రస
నాగ్రము నందు మధూక మాలికా
స్రవ మధు విప్రుషమ్ములు

అగ్నిధార, 20.

పాఠకులకి ఇప్పసారరుచిని కొంత తెలియచేస్తాయి. ఉగాదికి ప్రత్యేకత కలిగించే ''వేపపూత చేత ఉపిరాడని మధురధార తిక్కమ్మె చెలంగిన'' కొత్తగుడి పాఠకులకి రాసినిక అనుభూతిని కలిగిస్తుంది. వానలో తడిసిన విరికన్నె కవికి మూర్తీభవించిన ప్రణయసుందరిగా ''ఋతుషట్కం''లో

పసందైన పయంట లోయిన్ పిరుదు
నంటిన చేరయు నానిపోవ

అగ్నిధార, 29.

తన ముందు నిలిచినట్లుగా కవి భావించి పాఠకులముందు ఆ వనకన్నెని నిలబెట్టారు. కలువపూవుమై ప్రసరించే వెన్నెలని

అచ్చపు వెన్నెల గిన్నెలందునన్
చిక్కని తేనె ఏనికొని చిన్నని పొన్నని కన్నెవాగులం
దొక్కొక పాదమూని నడలెత్తును చేపలు మ్రింగుచోయనన్

అగ్నిధార, 30.

అని మనోహరంగా కవి కుముదా మనోహరుణ్ణి వర్ణించారు. శిశిరంలో ఆకులు గాలిపోయిన ప్రకృతిని

దెసలన్నిట చేరలు జారిపోయె న
గ్నీకృతమ్మై మహాప్రకృతి నేలకు మోము వాల్చె 31.

నని కవి ప్రకృతి నగ్నస్వరూపాన్ని ప్రదర్శించారు. వసంతఋతువు కవికి ''వాసంత కుమారి''గా కనిపించి

వీణావాదనానంద సం
ధావేదే పరిజలిత స్తనయుగే
నాభిప్రదేశాలతో

అగ్నిధార, 34.

''సాలంకృత కన్య''లాగా ''రతిరాజ కుమారిక''లాగా ''జ్యోత్స్నేయ శశాంకము''లాగా కవిని ఆనంద పరవశుని చేసింది. గ్రీష్మ ఋతువు ఏకతో వానకాలపు రాక మొదలవుతుంది. ఆ రాకని విహాయసమున దిగి భువికి వనుదెంచిన ''తటిన్నటి''గా కవి ''వానలు'' అనే గీతికలో చిత్రిస్తూ వడగండ్లు ఘామిమై రాలడాన్ని

తటిన్నటీ
కటకరటత్ సువర్ణ జయ
ఘంటలు కింకిణికా ఝుళంఝుళో
తట మయి వీను ఏకె

అగ్నిధార, 37.

నని వడగండ్ల చప్పుళ్ళని కింకిణీస్వనంగా కవి వినిపింపచేశారు. నిశ అంతరించాక ఉదయారుణిమలు తేజరిల్లేసమయం కవికి ఆశలు ఉదయించినట్లుగా కనిపించింది.

లోకపు చీకటి చీరకు
ఆకాశం రైకమీది
చిక్కని చుక్కల పువ్వులు
తళుకువెట్టి గలిగేనా
జరీ అంచు మెరిసేనా

అగ్నిధార, 92.

అని చీకటికి అందాన్ని సంతరించిన తళుకులుగా, జరీపువ్వులుగా నక్షత్రాలని కని రమణీయంగా చిత్రించారు.

కవికి తమ దేశం మీద, రాష్ట్రంమీద, ప్రాంతంమీద అపరిమితమైన అభిమానం (దురభిమానం కాదు) ఉంది. తమకి జన్మనిచ్చి, పెంచి పెద్దచేసిన ''తెలంగాణ'' కవికి

కోటి వెలుగుల బంగారు కొండక్రింద
పరచుకొన్నట్టి సరసు లోపల వసించి
పొద్దుపొద్దున అందాల పూలు పూయు
నా తెలంగాణతల్లి కంజాతవల్లి

మహాంధ్రోదయం, 149.

గా కవికి దర్శనం ఇచ్చింది. తమ మాతృసీమ కవికి సౌందర్యదేవతగా ''అందాల జాణగా'' ''మహాంధ్రోదయం'' అనే కవితా సంకలనంలో కనిపించింది. ఈ కవితాసంకలనంలో ''మహాంధ్రోదయం'' అనే ఖండికలో ముక్కోటి తెలుగువారు ఎదురు చూసిన మహాంధ్రోదయాన్ని ప్రకృతి రామణీయకతతో జతపరచి చిత్రించారు. విశాలాంధ్ర రాష్ట్రావతరణం సూర్యోదయంగా భావిస్తూ ఆ సూర్యోదయం

తరుణీ సుందర దంత ఘట్టన లసత్
తాంబూలరాగ ప్రభా
స్ఫురణీయాధర బింబమట్టు లదిగో
సూర్యుండు ప్రాచీధరా
ధర కూటమ్ము నయిన్ పదమ్ములిడి
సౌందర్యమ్ము చేకూర్చె

మహాంధ్రోదయం, 150-51.

నని రాష్ట్రోదయాన్ని సౌందర్యోదయంగా భావించడం ఒక రమణీయ చిత్రం. ఈ ఖండికలో నిజాం పరిపాలనలో వెతలు చెందిన తెలంగాణకి చీకటి సంకేతంగా, నూతన రాష్ట్రోదయం వెలుగుగా భావించి

తెలుగు నింగి దారులలో
వెలుగు పులుగు రెక్కలార్చి
చిమ్మివేచె తరతరాల
చిక్కని చీకట్ల నెల్ల మహాంధ్రోధయం, 152.

అని అత్యంత రాష్ట్రాభిమానంతో

వెలుగు, వెలుగు, వెలుగు, వెలుగు !
తెలుగు, తెలుగు, తెలుగు, తెలుగు ! 153.

అని తమ ఉత్సాహాన్ని ప్రకటించారు. ''గుండెలో దీపాలు'' అనే ఖండికలో నిరుపేద కోపాన్ని దివ్యదీపావళి కాంతులుగా ప్రదర్శించారు. శృంగారప్రియుడైన ఈ కవికి దీపికలు ప్రేయసి హృదయంలో ప్రియుడు వెలిగించే ఆనంద జ్యోతులుగా, దీపికాతోరణాలు మందార పుష్పాలుగా కనిపించాయి. దివ్వెల లాస్యం .

అంగనామణీ తరుణాధరాంగణమున
మొలక నవ్వులు 162.

గా, దీపమాల ''నేలకాసారమున రమణీయ కమల కళికల్లా''గా కనిపించాయి.

కవి ఆనంద విషాదాలకి దర్పణంగా ప్రకృతిని చిత్రిస్తూ ''పూలలో జ్వాలలు'' అనే ఖండికలో ప్రేయసి తమని ఆహ్వానించిన ''నాడు నేయింటి వెనుక పున్నాగ నవ్వె''నని వద్దు పొమ్మనిన'' నేడు''నాయింటిముందు కన్నెఱ్ఱ జేసెచారు శృంగారసార మందార సుమము'' అని ప్రకృతితో తమ ప్రణయ హృదయాన్ని కవి తాదాత్మ్యం చేశారు. ప్రకృతిలో పూలకి తమకి మధ్య రసాద్వైత భావాన్ని వివరిస్తూ పూలు తమకి వెచ్చని శయ్య అని, తాము పూలకి గాటైన పానీయమని, ప్రకృతి తమకి అమృతమని, తాము ప్రకృతికి అన్నమయితినని

కవి ప్రకృతితో తన సహానుభూతి (empathy) ని వ్యక్తీకరించారు. ''రాగబంధం'' అనే ఖండికలో వసంతలక్ష్మి

వికసించిన వెన్నెలరాత్రివలె నా
లోకివల పాలు పోసినది 180.

అని ప్రతిపువ్వు కిమ్మీరంగా వెలిగిందని, 'లోకం యౌవనాని లాత్యంత వికస్వర పరిమళ ధామమయైనని లోకమంతా తను ప్రణయభావపరవశంగా కవి ప్రదర్శించారు. ''కపోత సందేశం''లో తెల్లని పావురాలని

మనోజ్ఞ శారదో
త్ఫుల్ల సితాభ్ర ఖండములు
దొంతరలై ఒకదానివై నొకం
డల్లిక గొన్నయట్లు 184.

'హరిణాంకుని తెల్లని మల్లికండువా'చల్లని గాలిలో ఎగురుచున్నట్లు కవి రమణీయంగా చిత్రించారు. ఆ పక్షులని శాంతి దూతలుగా భావిస్తూ అవి ''సహస్రపూర్ణ చంద్రబింబములు''గా కవి మనకి దర్శింపచేశారు.

1961 వ సంవత్సరంలో ప్రచురితమైన ''పునర్నవం'' అనే కావ్యసంకలనంలో కవికి ప్రకృతి శోభాయమానంగా కనిపించింది. ఇందుకు సూర్యుడు విప్లవసంకేతంగాకాక కాంతిని వెదజల్లే సౌమ్యమూర్తిగా కనిపించడం నిదర్శనం.

'తెలంగాణం' అనే ఖండికలో ''మండుతున్న సూర్యుడు మన మండలాన విచెను తన కాంతినేత్రము నేడు'' అని సూర్యుణ్ణి కాంతికి, సంకేతంగా చిత్రించారు. ఈ సంకలనంలో మంటలు, రుధిరము కంటె, వెలుతురు, తేజస్సు మనకి అధికంగా కనిపిస్తాయి. స్వేచ్ఛపడసిన తెలంగాణం ''ఉచ్చు త్రెంచుకున్న జింకలా''గని చిత్రించడం స్వభావోక్తిమయంగా, ఆకర్షణీయంగా ఉంది. కవులు బాల్యావస్థని స్నిగ్ధ సౌకుమార్యానికి, అమాయకతకి సంకేతంగా స్వీకరించడం పరిపాటి ముఖ్యంగా బాల్యాన్ని డా. దాశరథి

నిశ్శబ్దంగా నితాంత జీవిత లతాగ్రాన పూచే
నిర్మలమైన ఎర్రరోజా ప్రసూనం

పునర్నవం, 208.

అని ముగ్ధమోహనంగా చిత్రించారు. ''ప్రత్యూష ఘంటిక'' అనే ఖండికలో ఉదయకాల ఘంటిక ప్రాచ్యదేశాల్లో మానవజాతి మేలుకోవడం తెలియచేసే శుభోదయసంకేతంగా చిత్రిస్తూ,

స్వతంత్రతా సుందరత
ఉదయభామినీ తరుణారుణ కపోల యుగళి
మెరసిన దివ్యకాంతి

పునర్నవం, 267.

లాగా ఉందని అంటారు. ''అమృతాభిషేకం'' ( 1962 ) అనే సంకలనంలో

''అమృత పాతము'' అనే ఖండికలో కవి చంద్రుని వివిధావస్థలని అనేక దృక్కోణాలనుంచి దర్శించి చంద్రోదయాన్ని మిళిందబృందమానవహించిన'' అంబుజా కరాంబువులనుండి తలయెత్తి నట్లు''గా వర్ణించారు. చంద్రోదయ వేళలో చంద్రుడు లేత ఎరుపురంగులో ఉండటం ప్రకృతి సహజం. ఆ ఎర్రదనాన్ని కవి చెంగల్వ అరుణిమతో పోల్చడం రమణీయమైన ఉపమ. కవికి చంద్రునిలో మచ్చ మిళిందబృందంగా కనిపించింది. నేటిలో నలుపురంగు సామాన్యగుణం. ఈ ఉపమకూడా అతిసహజంగా భాసిస్తోంది. ఆకాశంలో ఉజ్జ్వలంగా వెలిగే చంద్రుడు రాత్రికే అందాలు చేకూర్చగలుగుతున్నాడని వర్ణిస్తూ, రాత్రికి కప్పిన ''ఇరులముసుగులను'' హరించాడనే సత్యాన్ని తెలియచేశారు. ఆకాశంలో వెన్నెల అలముకుంది అనే ప్రకృతి సత్యాన్ని రమణీయంగా

నాని బుజముజారి ప్రాకెవెన్నెల వల్వ
నగ్నమైన నభము నడుము చుట్టు

అమృతాభిషేకం, 283.

అని వర్ణించి చంద్రుడు యువకుల హృదయాల్లో, ముఖ్యంగా యువకవుల కవుల హృదయాల్లో కలిగించే ప్రణయ భావాలని కవి వ్యక్తం చేశారు. చంద్రుడు యువహృదయాల్లో విరహాగ్నినికూడా రగుల్కొల్పడం విప్రలంభ శృంగార సందర్భంలో జరుగుతుంది. అందుకే కవి చంద్రుడు ''నేడు మెచ్చువెరిగి ఏడులోకమ్ముల కౌముదీ మహాగ్ని గాలిచినాడు'' అని ప్రబంధ కావ్యాల్లో చంద్రోపాలంభనాన్ని గుర్తుచేసేవిధంగా తమ బాధని వెల్లడించారు. చంద్రునిమీద

ఆగ్రహం పొందిన కవి అతనిమీద బాణం వేయాలని నిశ్చయించు కుంటాడు. కాని చంద్రుడు

తార కొప్పులోన తానడాగు
ఆమె కొప్పుకేమి యాపదగలుగునో
అనుచు డించినాడ నంబకమ్ము 285.

అని శాత్రవకాంతలకైనాసరే తలపూవు వాడనీయకూడదనే సుకుమార భావాన్ని కవి వ్యక్తంచేశారు. ఆకాశంలో గూడుకట్టుకొన్న చీకటికి అతిలోకసౌందర్యాన్ని కలిగించే జ్యోతిగా చంద్రుణ్ణి

నలుపే అందముగా నటించిన
అనంత వ్యోమ కాంతామణీ
నిలనిడ్వ్య ముఖమ్మునందు సొగసుల్
బింబించు గోరోచనా
తిలకం బీవు 290.

అని కవి వర్ణిస్తూ చంద్రుణ్ణి అందాన్ని ఇనుమడింపచేసే తిలకంగా భావించారు. ''అమృతాభిషేకం'' కవితాసంకలనంలో కవి హృదయంలో అంగారం కొంత చల్లబడి శృంగారభావాలు పతాకస్థాయికి చేరుకోవడం కనిపిస్తుంది. ఈ కవి సౌందర్యారాధనకి ఇరులలోకూడా అందాన్ని దర్శించడం. ఇందుకు ఒక నిదర్శనం.

''తామసి'' అనే ఖండికలో చీకటి అందానికి ఆలంబనగా, ఒక్కొక్కసారి అందానికి సంకేతంగా కవికి దర్శనమిచ్చింది. ఆ తామసి అందాన్ని కవి ''ఇందు బింబాననం మ్ముఖముపై కస్తూరి బొట్టు''గా ''ఇందీవరేక్షణా పక్ష్మభాగములు''గా ''మృగనేత్రి బంగారు చెక్కిలిపై అగరు చుక్క''లా ''వెండి కొండపైన మబ్బు''లా ''చంద్రకేదారమున లేడిచాయ''గా ''ఆదిశేషునిపై విష్ణువుగా భావిస్తూ''

చీకటులు కూడ నందమ్ము లోకమునకు   292.

అని ప్రకృతిలో అందాలకెల్ల ఈ నలుపే ఆలంబనమని కవి అతి కోమలంగా వర్ణించారు. చీకట్లు ఋతుచక్రభ్రమణాన్ని సూచించే పక్షులుగాకూడా కవికి కనిపించాయి. అవి కోకిలలుగాకాని మధుమాసావతరణ సూచిస్తాయని, తుమ్మెదలై వసంతకాలాన్ని తెస్తాయని, మయూరాలై నవాషాఢాన్ని ప్రదర్శిస్తాయని చమత్కరించారు.

చీకటిని తొలగించి ప్రతి ఇంట ఆనందజ్యోతుల్ని, ''ప్రతి గుండెలో కల్యాణకల్ప శృంగారదేవి''ని నిర్మించే దీపశిఖ కవికి దీపాంగనగా కనిపించింది. దీపశిఖ ''పురంధ్రీ లలాట పట్టి దీర్చిన కుంకుమబొట్టు''గా సకల మంగళకర సౌభాగ్యాలకి సంకేతంగా కవికి కనిపించింది. బాహ్యజగత్తులో దీపాన్ని ముద్దుం పెట్టుకోవడం మధురానుభూతికాదు. కాని కవి భావనాశక్తి ఈ చేదు యథార్థాన్ని మధురంగా పరివర్తింప చేయగలిగింది. 'దీపాంగన కేలాపరి చుంబితంబయిన స్నిగ్ధాధరోష్ఠము పై' ( 301) కమ్మదనాలు ద్రాక్షరసంగా, ప్రతతగ్రి మాధ్వీకంగా పాకాయని, లోకాతీత సుఖాన్ని చేకూర్చాయని తెలియచేస్తూ కవి తన భావుకశక్తిని వెలువరించారు. దీపాంగన

రంచిష్ణు బాహోయుగ
ప్రాకారాంత జృంభమాన
నికుచాభ స్వర్ణ వక్షోజము

''అమృతాభిషేకం'', 301.

లని కవి వర్ణించడంలో స్నిగ్ధ సౌందర్యాభిరామమైన దేహాంగన కవికి రవేంద్ర కల్పిత ఊర్వశిలా వివస్త్రగా కనిపించినట్లు స్ఫురిస్తోంది. బాధితులైన మానవులు ''శీకరస్నాన సౌఖ్యం'' ఆశించే స్థితిని ''జలద సరస్వతి''లో వర్ణిస్తూ, నల్లని మేఘాలు రవిబింబాన్ని కమ్ముకపోడం నల్లని వేణికాభరంలో ముఖం చిక్కుకున్నట్లు చిత్రించారు. ఆకాశంలో వివిధరూపాల్లో కనిపించే మేఘమాలికలు తన హృదయం లో భావాలకి ఆకృతి కల్పించే సుందర చిత్రాలుగా ఈ ఖండికలో కవి ప్రదర్శించారు. ఒక చిరుమబ్బు లేతునక తూరుపుదిశలో'' కామినీధమ్మిల్లకము''గా, ఇంకొక మబ్బుదక్షిణాన ''ప్రేయసీ భుజలతా నేల్లీలాంచలము''గా కొన్ని మబ్బుముక్కలు ''నడిమింట కాంతా పదాంక సంకాశములు''గా కవికి కనిపించాయి. కవికి జలద సరస్వతి

వివిధ ముద్రలతో నాట్యవేదివైన
నృత్యమొనరించు నర్తకి రీతి

అమృతాభిషేకం, 314.

గా కనిపించింది. 1966 లో ప్రచురింపబడిన ''కవితాపుష్పకం''లో ''మంచి ముత్యము నించిన మంచి చినుకు'' అనే ఖండికలో మంచి ముత్యాన్ని ''మానవ జీవితమ్మునకు మంచి ప్రతీక''గా భావించి

నీ తెలిమేను సౌకుమార్యాన
సురాంగనా మణుల నందర మించెను

కవితాపుష్పకం, 340.

అని, తుహిన బిందువు

జలజాతపత్ర గృహవాసం,
శీత విభావరి శశాంకుని కరడోలికా
కుసుమ కోమల తల్పమునన్ శయించి 341.

తన సౌకుమార్యాన్ని రక్షించుకోవాలని కవి ఆశించారు. గ్రీష్మంలో సికతాతలంలో ఒక్క వాః కణమైనా కనరాని సమయంలో తన కన్నుల గిన్నెలలో ప్రేమసుధారసాన్ని నింపుకుని నిలబడే ప్రేయసి కవికి ''ప్రపాపాలిక''లో ప్రపాప్రతిరూపంగా కనిపించింది. ఆమెని గ్రీష్మాతపశత్రువుగా, ప్రణయవర్షదాయినిగా భావిస్తూ

నీనయనాల నీలిమలు నింగిని మేఘములాయె, గర్జన
ధ్వానము లేకయే ప్రణయవర్షములన్ కురియించె.....

కవితాపుష్పకం, 352.

నని ఆమెని నవయౌవన తస్కరుడైన భాస్కరుని కిరణాలనుంచి తనని రక్షించే ఆతపత్రంగా కవి మనోహరంగా వర్ణించారు. ''ఏకాకి నరమేధ'' అనే ఖండికలో

సంక్రాంతి సమయంలో ప్రకృతి లక్ష్మిని ముగ్ధగా భావిస్తూ సూర్యోదయాన్ని

మంచు ముసుగువేసి పొంచి చూచెడితూర్పు
పడతి మొగము నుండి పొడిచినాడు
బాల భాస్కరుండు

కవితాపుష్పకం, 358.

అని కవి చిత్రించారు. ఉదయభాస్కరుని అరుణకిరణాలతో శోభిల్లే ప్రకృతిని

పూల దండవలె పొద్దుటిలేయెండ
ఆమె కంఠసీమ నలరుచుండ
మంచు ముత్యములను సుస్మితమున చల్లె
మల్లికా మనోజ్ఞ మంటపమ్ము 359.

అని సంక్రాంతి సమయంలో లేయెండ ప్రసాదించే ఆహ్లాదాన్ని అప్పుడే కుసుమిస్తున్న మంచుకడిగిన మల్లెపువ్వుల అందాలని కవి ప్రదర్శించారు. ప్రకృతిలో అందాలని ఆస్వాదించే రసికత, ప్రకృతి రామణీయకతని అనురాగంగా స్వీకరించగల రసజ్ఞత దాశరధిగారిలో పుష్కలంగా ఉన్నాయి. ఎవరూ చూడని ''రాజహంసల''ని ఎవరూ ఊహించనంత కోమలంగా ఊహించడం వీరి ప్రత్యేకత. ఈ రాజహంసల అసాధారణమైన తెల్లదనానికి కారణం

వెన్నెలను గడ్డకట్టించి దాన్నినొక్కి
హంసల్ని తయారు చేస్తారు

కవితాపుష్పకం, 417.

అని వివరించి అవి ఆకాశంలోకి చంద్రబింబాల్లా ఎగిరితే

భూదేవి పండిన శ్వేత వసనాలనిపిస్తాయి
అవి దేవతల తలపాగాలుగా కనిపిస్తాయి 417.

అని హంసలని సుందర స్వరూపిణులుగా కవి చిత్రించారు.

1973 లో ప్రచురించిన ''తిమిరంతో సమరం'' అభ్యుదయ భావాలకి, నాగరకతా ప్రతిబింబాలకి ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చి శృంగారభావాలని కొంత పరిమితం చేసినట్టు కనిపిస్తుంది. యుద్ధ భయంతో అరాచకలితో అలమటించే వర్తమాన ప్రపంచాన్ని దర్శించిన తరువాత దాశరథి ''ఆకలితో చచ్చేనాకు / అనురాగం ముందు కొచ్చిందనుకోకు'' అని తమ యథార్థ సామాజిక దృష్టిని వెలువరించారు. ''పలాశ కుసుమాలు'' అనే ఖండికలో కవి తనకి ఒకనాడు

బాలేందు వక్రములై
అనురాగ చక్రములై
సుకుమార కామినీ
సుందర పయోధరాలపై
నఖక్షతాల

'తిమిరంతో సమరం', 35.

లాగా కనిపించాయని, మరి ఒకనాడు ''శుకకన్యా తరుణారుణ చెంచువులై'' (35) కన్నులకింపు కూర్చాయని కవితాప్రస్థానం పూర్వార్ధంలో తమ దుఃఖాన్ని వెల్లడించారు. అయినా ఈ సంకలనంలో కూడా భవిష్యత్తుకి ప్రకృతి అందాలని సంకేతాలుగా భావిస్తూ ఆ భవిష్యత్తు ''ఒత్తుగా పూసిన పూలగుత్తులా / మత్తు గొలుపుతూ''

నందన వన సుగంధంలా
నవరస మధు ప్రబంధంలా
అనురాగబంధంలా.....
పయస్వినే వయః పయస్సరస్సులో
విరిసిన సౌందర్యారవిందంలా

'తిమిరంతో సమరం', 45-46.

రావాలని కవి కోరుకుంటారు. సాంఘిక రాజకీయాల్లో చైతన్యదీప్తిని అభిలషించే కవి ఆ రమణీయ చైతన్యాన్ని ప్రకృతిలో దర్శించి ''నింగి ఆవులించి నేలను కౌగలించినవేళ'' ''మహా మహాకాశాన్ని చుంబించినవేళ'', ''మంచు కంచుకం''తొలగి ప్రకృతి అందం ఆవిష్కరింపబడిన తరువాత

నదీ చేలం తొలగినవేళ
నవయౌవనం రివ్వుమన్నవేళ
చైతన్యం - సకలదిశల
గీతం వినిపిస్తున్నది

'రాజీనగీతం', ''తిమిరంతో సమరం'', 46.

అని ప్రకృతి అంతటా చైతన్యాన్ని కవి దర్శించగలిగారు. తమకి ప్రియతమ నాయకుడైన నెహ్రూరూపాన్ని కవి ప్రకృతిఅందాల్లో దర్శించి ''చిరంజీవి నెహ్రూ'' అనే ఖండికలో

శిశిరు నడించి వనరాజ్యసింహా పీఠి
నధివసించిన కుసుమమ్మునందు నీవు
చీకటుల కూకటులలోన చిగురులెత్తు
ఇందు సుందర కిరణమ్మునందు నీవు

తిమిరంతో సమరం, 71.

అని వెల్లడించారు. అలాగే సేతు హిమాలయాలను, సముద్రజలాలను, వసంత కోకిలాగీతికలను హిమగిరి శృంగాలను, రవళించెడి తీయని భృంగాలను, నరటాచరణోత్కతరంగాలను, కేళీమయ కురంగాలను, ఇంద్రధనుస్సు జాలువారే వెలుగులను తాము నెహాని దర్శించినట్లు చిత్రించారు. నదిని చైతన్యానికి సంకేతంగా స్వీకరించి ''నది నాతో మాట్లాడినది'' అనే ఖండికలో

యౌవనోత్కంఠతో
అల్లకల్లోలం చేసే
ప్రౌఢలా
గాఢంగా కౌగలించు కుంటుంది

తిమిరంతో సమరం, 77.

అని నదిని తమ ప్రియురాలిగా కవి చిత్రించారు.

1975 లో ప్రచురితమైన ''ఆలోచనా లోచనాలు'' అనే కవితా సంకలనంలో కవి ఆలోచనలు, మానవతా దృక్పథం, సాంఘికసమస్యలతో పాటు శృంగార ప్రియత్వంకూడా కొంత కనిపిస్తుంది. మానవులంతా మసిపూసుకున్న మనసులలో తమని విసిగించినప్పుడు తాను మామిడితోటలకి వెళ్ళానని తెలియ చేస్తూ,

వేమిడి
కి పర్యాయపదం మామిడి,
కామిడి
నాలుగవ బాణం మామిడి

'వసంతగీతి', ''ఆలోచనాలోచనాలు'', 32.

అని మామిడి ప్రసాదించే ఆనందాన్ని చిత్రించారు. పాత గతించి కొత్త ఉదయి స్తుందనే సత్యాన్ని

గత వర్షాన్ని తినేసిన కాలకన్య
నవ వర్షాన్ని కనేసి పారిపోయింది

'వసంతగీతి' ''ఆలోచనాలోచనాలు'', 34.

అని రమణీయంగా వర్ణించారు. వర్షం కురిసిన తరువాత మెల్లగా సూర్యుడు ఉదయించే దృశ్యాన్ని కవి ''పరిణామ పర్వం''గా చిత్రించారు. సూర్యకిరణాల తాకిడికి కరిగిపోయే మంచు కవికి వర్షసుందరి హిమచేలాంచలం ఎగిరిపోతున్నట్టు కనిపించింది. పైకివస్తున్న సూర్యుడు

ఆమె భుజాల గిరిశిఖరాల చాటునుంచి
అవతరిస్తున్నాడు 35.

అన్నట్టు కవికి కనిపించాడు. నల్లని చీకట్లని పారద్రోలే సూర్యకిరణాలు

నల్లబారిన ఈ లోకపు కోటగోడలకు
వెల్లవేస్తున్నాయి పరిణామ కాంతికిరణాలు

ఆలోచనాలోచనాలు, 35.

గా కనిపించాయి.

1981 లో ప్రచురితమైన ''ధ్వజమెత్తిన ప్రజ'' అనే సంకలనంలో ముఫ్ఫైరెండు సంవత్సరాల కవితా ప్రాసంగం తరువాతకూడా డా. దాశరథి ప్రకృతి రమణీయ దృశ్యాలచే ప్రభావితులు అయి చేసిన వర్ణనలు కనిపిస్తాయి. మానవజీవితంలో సాంఘిక రాజకీయ వికారాలని మరపింపచేసే రమణీయశక్తిగా ప్రకృతి కవికి ఆయనకి దర్శనమిచ్చింది. ''నవ షస్విని'' అనే ఖండికలో ''భూదేశం బావనినుండి వ్రాలిన వాసంతే సూనమ్మో'' కనిపించినట్టు కవి తెలియచేశారు. ఉగాదితెచ్చే వసంత సౌందర్యం లేకపోతే ''మానవజీవితపు ఎడారిలో మల్లెలెలా వికసిస్తాయి?'' అని ప్రశ్నించి ''వసంతచక్రం'' మోడుపడిన సరసహృదయాలని నవనందనాలుగా మార్చగలదని తెలియచేశారు. కన్నీటిచుక్కని కవి

నవ్వుల పువ్వులమీద
నన హిమబిందువులా
నిలుస్తుంది

'చుక్కలు', ''ధ్వజమెత్తినప్రజ'', 11.

అని చిత్రించారు. ఆకాశంలో వ్యాపించిన మంచుతెరని ''దేవుడి చేతి రుమాలు''గా భావిస్తూ కవి

ఈ సమావృత హిమావ గుంఠనం
దేవుడి తెల్లని చేతిరుమాలు
భూప్రేయసికి అతని జాడను
ఎరుకపడానికి ఇదొకానవాలు

'ధ్వజమెత్తినప్రజ', 20.

అని అతినవ్యంగా మంచుని ప్రేమసంకేతం అందించే సాధనంగా కవి చిత్రించారు. సూర్యబింబం కవికి ''గగనంలో దేవుడి పదచిహ్నంగా'' అపురూపంగా కనిపించింది. ''దీపాల మందార మంజరి''ని

పీతాంబరం కట్టుకున్నది
నిరజాజిలా నవ్వుతున్నది
నగ్నాంధకారాల దారిలో
నడిచేటి దివ్వెలాగున్నది

'ధ్వజమెత్తినప్రజ', 33.

అని సహజసుందరంగా వర్ణించారు. వర్షాగమ సూచకంగా భూమి సౌందర్య దేవతగా కనిపించే దృశ్యాన్ని ''ఇంద్రధనుః కిరీటం'' అనే ఖండికలో

నీలమేఘ చికురాల మీద
నిటారుగా నిలబడేలా
ఇంద్రధనుః కిరీటం ధరించి
ఇలాదేవి ఎంతో సొగసుగాఉంది

'ధ్వజమెత్తినప్రజ', 47.

అని మనోహరంగా చిత్రించారు. కవి తమ అమెరికా పర్యటన సందర్భంలో నయాగరా జలపాతాన్ని దర్శించి

అఖిల జగజ్జనావళికి
హనీమూన్ రాజధాని
నయాగరా జలపాతం
నవదంపతి తొలిగీతం

'ప్రణయుల కీరాజధాని', ''ధ్వజమెత్తిన ప్రజ''

అని నయాగరా ''మహాప్రకృతి కావ్యానికి మంగళసిరా'' అని ''చైతన్యస్వాంతానికి సంకేతం'' అని ఎగిరిపడే జలపాతాన్ని, హరిచాపాన్ని చైతన్యానికి, సౌందర్యానికి సంకేతాలుగా ప్రదర్శించారు.

''అగ్నిధార'' నుంచి ''ధ్వజమెత్తిన ప్రజ'' వరకు కవి ప్రకృతి దర్శనాన్ని నిరంతరం చేస్తూ, ఒక్కొక్కసారి ప్రకృతి అందాలచేత తాము ప్రభావితులై శృంగారభావస్ఫూర్తి కలిగి, మరొకసారి తమ శృంగార భావనని ప్రకృతికి ఆపాదిస్తూ, ప్రకృతితో తమ తాదాత్మ్యాన్ని వెల్లడించారు.

తమ కవిత్వంలో మొదటినుంచే శృంగారంతోపాటు అంగారంకూడా ఉందని డా. దాశరథి స్వయంగా తెలియచేశారు.[2] సంఘంలో ఆర్థిక, అసమానతలు, రాజకీయ నిరంకుశత్వం కవిని విచలితుణ్ణిచేస్తే ఆ ప్రతిస్పందనక్కల్పి ప్రతిఘటించడానికి

---

2. శృంగార వీర రసాలు కలగలిపి నాలో వెల్లుబికేవి. వాటికి తార్కాణం అగ్నిధార..... ఆనందవిషాదులు, శృంగార వీరాలు అహమహమికతో కళ్ళముందు పరిగెత్తుతాయి. మల్లెలు, మోదుగులు రెండూ నాకు నచ్చినట్లు శృంగార, వీర రసాలు రెండూ నాహృదయాన్ని పొంగిస్తాయి. ఆ నాటికి, ఈ నాటికి ఆరెండు రసాల రసాలాల ఫలాల్ని ఆస్వాదించి ఆనందిస్తున్నాను,' ''దాశరథి కవిత'', 'పురస్కృతులు,' 1963, 3-5.

కవిత్వాన్ని వజ్రాయుధంగా ప్రయోగించి డా.దాశరథి సంఘ విరోధులమీద అగ్నిధార కురిపించి, గొప్ప ఆవేశంతో రుద్రవీణ మీటారు. ''అగ్నిధార'' కావ్యసంకలనం శీర్షికలోనే అగ్నికనిపించి, విప్లవభావస్ఫోరకంగా కనిపిస్తుంది. 'అగ్ని అన్న పదం చైతన్యానికి సంకేతం అని, ఆ చైతన్యం ఒక మానవుని హృదయంలోనుండి ఇంకొకనిలోకి ప్రవహించి ఇలా జాతినంతటినీ ఏకసూత్రాన బంధిస్తుంది[3] అని కవి వివరించారు. నిజాం నవాబు పరిపాలనలో దుష్కృత్యాలనుచూసి వాటికి బలి అవుతున్న పేదప్రజల ప్రతినిధిగా వారి బాధని నలుగురికి తెలియచేయడానికి ''పీడిత ప్రజావాణికి మైక్ అమర్చి అభివాదులకున్ వినిపించెదన్'' అని గొంతెత్తి గర్జించారు. ఇటువంటి విప్లవ దృక్పథంతో కవిత రచించే సందర్భంలో కవికి ప్రకృతికూడా విప్లవారుణరంజితమయి కనిపించడం సహజం. వీరు తమ విప్లవభావాలని ప్రకృతిలో అనేక అంశాలకి ఆపాదించి తమ భావవ్యక్తీకరణకి ప్రయత్నించారు. ఈ భావ వ్యక్తీకరణకి విప్లవభావస్ఫోరకాలైన కావ్యబింబాలు అధికంగా ప్రయోగించారు. వీరి కవిత్వంలో ఆదినుంచి ఇటువంటి కావ్యబింబ పరికల్పన మనకి కనిపిస్తుంది.

ఉషస్సు కవికి సహజసుందరంగానేకాక విప్లవ భావస్ఫోరకమైన అరుణరాగరంజితంగా కూడా దర్శనం ఇచ్చింది. ''ఉషః'' అనే ఖండికలో ప్రభాతసుందరిని

---

3. దాశరథి, 'పురాస్మృతులు', 1.

రక్తిల లచనమ్ములు కశారస ధారల పారణమ్ముతో
నర్తకము లయ్యె నానుదుటి యందున కెంపులుదేరి

'అగ్నిధార', 16.

అని ఎర్రదనానికి అంటే విప్లవానికి చిహ్నంగా చిత్రిస్తూ తాము ''రక్తములో ఉషాకరతలములో కవనమ్ములల్లెదన్'' అని తమ విప్లవభావాలని ఉషాకుమారిలో దర్శించారు. ''రుధిరసంధ్య'' అనే ఖండికలో సంధ్యాసమయాన్ని

పూచిన మోదుగుం బువుల పుక్కిటినుండి వసంతరాజుర
క్తా చమనంబు సేయు సమయు

''రుధిరసంధ్య'', 21.

మని వర్ణించి మోదుగు పువ్వులు ''సాంధ్య పరాగరాగ గరించిన లచిన ంచి రుజ్జ్వలంబై'' న సంధ్యాసమయం గన్నేరు కన్నెమొక్కలు, కుంకుమ పువ్వు జవరాలు, పలాశ ప్రసవాలగ్ని జపాలక్త, రక్తరమ వంటి సంకేతాలు కవి విప్లవానురక్తిని సూచిస్తాయి. ''హిమజ్వాల'' అనే ఖండికలో కవి ''మాపుసాంతము కురిసిన మంచులోన రేపు సాంతము మంటలురేగు'' అపూర్వదృశ్యాన్నిచూసి మంచుని మానవ స్తబ్ధతకి, మంచులో దాగిఉన్న అగ్నిపుష్పాలని విప్లవచైతన్య భావనకి సంకేతంగా స్వీకరించారు.

అణగిఉన్న మానవలోకం వెనక విప్లవచేతన కణకణలాడుతూ ఉంటుంది అనే సత్యాన్ని

నిశా హిమానీ తరుణీ నితంబ
లంబి వేణిక నగ్నిపుష్పంబు లేలనో!

'హిమజ్వాల', ''అగ్నిధార'', 68.

అని తమ సందేహాన్ని ఆశగా మార్చుకునే ప్రయత్నంచేస్తూ వివరించారు. ''అంబర చుంబి సౌధములకాయువుపోసే''కూలిదాన్నిచూచి

నే నవా సత్యంబున రుద్రనేత్రి విల
యాగ్నుల కుంకుమ బొట్టు పెట్టుమా

''అగ్నిధార'', 69.

అని కుంకుమ బొట్టుని ''ధనవంతుల బంగరు పళ్ళెరాలలో అంబలిపోసేలాగు'' సమయాన్ని దగ్గరకు తెచ్చే విప్లవ సంకేతంగా కవి చిత్రించారు. ఆ కూలిదాని వంటి బాధాసర్పదష్టుల అభ్యుదయాన్ని కాంక్షించి తమ కలములో ''రక్తమ్ము పోసి అరుణ తరుణాక్షరాల పదాలు''కూరుస్తానని తమ కవితాధ్యేయాన్ని కవి వివరించారు. సాంఘిక రాజకీయ దురన్యాయాలని తమ కళ్ళారాచూసిన కవి అటువంటి వ్యవస్థని రూపుమాపడానికి కృతకృత్యులై ''అంతర్నాదం''అనే గీతికలో

నా గీతానళి ఎంతదూరము ప్రయా
ణంబౌనో, అందాక ఈ
భూగోళమ్మున అగ్గి పెట్టెదను

అగ్నిధార, 80.

అని తిరుగుబాటు తత్వానికి అగ్నిని సంకేతంగా స్వీకరించారు. ప్రతీపశక్తుల యింట అమంగళ ధ్వనులుచేసి వాటి వినాశనానికి దారితేసే తీతువుపిట్టను అవుతానని కవి తమని వర్ణించుకున్నారు. ఆకలితో ఏడ్చేడొక్కల నార్చి పిలిచి వాటికి తను సానుభూతిని, భరవసని ఇస్తూ

తిరగ బడుదును భూమి బొంగరము మీద
ధగధగని మండు లోక బాంధవునిమీద 81.

అని ప్రకృతిశక్తుల్ని పీడితప్రజల శత్రువులుగా భావించి ఆ ప్రకృతిశక్తినికూడా తాము ఎదిరిస్తానని కవి ప్రకటించారు. భూమిని, లోకబాంధవుని ప్రతీపశక్తుల సంకేతాలుగా స్వీకరించడం కవి వైయక్తిక భావనకి ప్రతిబింబం. విప్లవభావ రంజితమైన మనసు ప్రకృతిశక్తులన్నింటిని తనభావాలకి అనుగుణంగా విశ్లేషించుకుని రూపకల్పన చేస్తుంది. స్వార్థప్రపంచంలో ''విప్లవాగ్నుల తుఫాను' రేపుతుంది. తరతరాల దరిద్రాలతో కృంగిపోయిన ప్రజానీకాన్ని బలిపశువుగా భావిస్తూ ఆ శ్రామికజాతి ఇంకమేల్కొంది అని చెప్పడానికి ''దెబ్బతిన్న బెబ్బులి వలె మేల్కొన్నది'' అని శ్రామికజాతి శక్తిని బెబ్బులిశక్తిలో కని ఉపమించారు. ఇక విప్లవం తథ్యం అనే నమ్మకాన్ని

చెలియలికట్టలు దాటిన
ప్రళయ కాల జలధి వలె
తిరుగు బాటు పరుచుకుంది
విశ్వరుద్ర ఫాలంలో
విషవాక్షి విరిసింది

'శ్రామికజాతి', ''అగ్నిధార'', 90.

అని స్పష్టంచేశారు. కడుపునిండ గంజినీళ్ళు దొరకని నిరుపేదల ఖేదాన్ని చిత్రిస్తూ, వారిఖేదంమీద తమ సానుభూతిని వెల్లడిస్తూ,

వేలిన తారాగోళం
రాలిన కన్నీటి చుక్క
కాలిన ఈ కడుపు ఘోష
కూలిన పర్వత శిఖరం

'ఖేదం', ''అగ్నిధార'', 99.

అని ప్రకృతిశక్తుల్ని పీడిత జనుల ఖేదానికి సంకేతంగా ప్రయోగించారు. స్తబ్ధంగా ఉన్న ప్రజాకోటి అంతరాల్లో విప్లవ వాంఛ ఉండదా అనే సదసత్సంశయాన్ని వెల్లడిస్తూ ''?'' అనే ఖండికలో

ఆ చల్లని సముద్రగర్భం
దాచిన బడబానల మెంతో?
ఆ నల్లని ఆకాశంలో
కానరాని భానువులెందరో?

అగ్నిధార, 102.

అని బడబానలాన్ని అంతరాంతరాలలోని విప్లవ వాంఛకి సంకేతంగా ప్రదర్శించారు. ''అనల దాహం'' అనే ఖండికలో ''ఎటుచూచిన చటులానల పటు దాహా''న్ని విప్లవ దాహంగా చిత్రించి, సామ్రాజ్యవాదాన్ని అంతమొందించే వర్తమాన ప్రజాశక్తిని వర్ణిస్తూ,

వర్తమాన మార్తాండుని
పృథా నిదాఘంలో
సామ్రాజ్యపు సాంద్రహిమం
రాలి, గాలిలో కలిసెను

అగ్నిధార, 106.

అని మార్తాండుని విప్లవనాయకునిగా చిత్రించారు. ''అగ్నిధార''లో శృంగార భావనలో మిళితమై కవిపించిన అంగారం ''రుద్రవీణ''లో మరింత ప్రగాఢంగా, ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. విప్లవాభిమానంతోపాటు ఈ ఖండికలో కవి విప్లవ

కారాచరణని సమర్థిస్తూ ధర్మబద్ధమైన సత్యాగ్రహాన్ని అభిలషించడం కనిపిస్తుంది. ''మంగళగీతి'' అనే ఖండిక ''శుభాశంసన'' గీతి మాత్రమేకాక కవిహృదయంలో విప్లవ ఘుసృణారుణ భయాలనికూడా వెలువరించింది. హిమాచలశృంగంనుంచి ప్రవహించే వియద్గంగలో పాదములాని, శిరస్సులో బాలచంద్రుని ధరించిన భస్మాంగుని ఫాలనేత్రం వెదజల్లేనవాగ్ని కణాలు కవికి కనిపించాయి. కుంకుమ ఛాయతో ఎరుపెక్కిన తమ నాస్తతల ద్వయంలో

దివాంధ భయంకరార్భటీ
సంకులకాళరాత్రి తెరజారిన నాటనశాలవందిప్రా
గంకము

'మంగళగీతి', ''రుద్రవీణ'' 115

లో కుంకుమని చిలకరిస్తానని కుంకుమని విప్లవసంకేతంగా ప్రయోగించారు. ''మూర్ఛన'' అనే గీతికలో ''అకట తపించెడి పేదల సమ్మెల''ని బలపరుస్తూ,

మ్రో / గింతున్ రుద్రవీణ పలికింతును విప్లవ గీతికావళుల్

'రుద్రవీణ', 116.

అని తమ విప్లవభావనని సామాజికాభ్యుదయ లక్ష్యలక్షితంగా ప్రకటించారు. ఉషస్సుందరిని తమ విప్లవభావదర్పణంగా భావిస్తూ ఆమెని ''నిశీథ తమః పటలప్రభంజని'' గాచిత్రిస్తూ ఆమెకి క్రొత్త రాజీవాలని ప్రేమ కానుకలుగా ఇచ్చి

ఆమె కపోలాలకి రక్తరాగాలు అద్దుతానని తన విప్లవభావాన్ని ప్రకృతికి ఆపాదించి వివరించారు. శివునిపూజలో కూడా విప్లవభావ వ్యక్తీకరణచేస్తూ

నీకు మదీయ రక్తకణ నిర్మితమైన ప్రవాళమాలికా
నీకము తెచ్చి యిచ్చెద

'స్వామిపూజ', ''రుద్రవీణ'', 122.

నని తమ రక్తనివేదన విప్లవభావ సంవేదనగా కవి వర్ణించారు. ''ముక్తభూమి'' అనే ఖండికలో తెలంగాణప్రజల స్వాతంత్ర్యపిపాసని దావాగ్నిలో పోల్చి నిజాం రాజుని ''జన్మజన్మాల బూజు'' అని ధైర్యంగా ప్రకటించి

శ్రామికుని వేడి నిట్టూర్పుల కు ప్రపంచ
మెన్నడో కాలి బూది కానున్నదేమో!
లేనిచో అద్రి కానన శ్రేణులెల్ల
ఎండ వడగాలి కిట్లేల మండిపోవు?

'రుద్రవీణ', 129.

నని ఎండని విప్లవభావ సంకేతంగా కవి ప్రయోగించారు. ''వనసమాధి'' అనే ఖండికలో ప్రకృతి ''శరన్నిశా శశిశ్రీ'' వలపించే కలువ పూవు తెల్లని కన్నులలో కవికి ''ప్రవాళరేఖా విసరమ్ము'' కనిపించింది. కవితా ప్రపంచం

అంతా ఆ సమయంలో కవికి అభిమాన పాత్రమైన ''అభినవ భావ నాదేవి ముఖా గ్రరక్తిమ''లో కుదించుకుని, తను విప్లవభావానికి అనుగుణంగా సమస్త ప్రపంచం వర్తిస్తున్నట్లు కవి భావించారు. ఆనంద కళా విలాసిని క్షణక్షణ మోహితరూపిణి అయిన ''ఉషస్సుందరిని'' తనవైపు చూడమని కోరుతూ తన నయనాలలో

ప్రళయ నర్తనశాలి మహానటుండు ఈ
శానుడు ఫాలలోచనుడు సాచిన అంగుళికా నఖాంకుర
శ్రేణులు భగ్గుమని రేచిన అగ్నిని ఏలియున్నవి

'రుద్రవీణ', 118.

అని తమ విప్లవాభిమానాన్ని తెలియచేశారు. ప్రథమానురాగవేళలో ఉషస్సుందరి విలాస దృశాంచలములు తనవైపు ప్రసరించగా తాను తన మానస హ్రదంలో పూచిన క్రొత్తరాజీవాలని సమర్పిస్తానని, తన మనసులో జలజాతవల్లికలు ''నీ ఇలు జాడల పూతపూయగా'' వచ్చినపుడు ఆ పద్మాలకి ప్రాగరుణారుణమూర్తి పాదముల సోకనేయుమని అర్థించారు. ఇక్కడ ఎర్రనిపూలనే తమ కావ్యబింబాలుగా ఎన్నుకుని వారిమనసులో విప్లవకాంక్షని వెల్లడిచేశారు. రాత్రి అంతా నిదురరాక ''ప్రవాళ రుచి ప్రసరణ స్మిత దృశాంచలముల''తో తన మోము ఎర్రబడగా బాలరవికిరణాలు ఆమోమున్నె వచ్చి వాలి

/ హాళతము నేయుచున్నది మహోజ్జ్వల ప్రాచ్యదిశాంగణానకున్

119.

అని తమ ముఖములనీ అరుణిమని ప్రభాత అరుణిమనికూడా విప్లవసంకేతాలుగానే కవి చిత్రించారు. ''సుప్రభాతం'' అనే ఖండికలో నిర్భాగ్య, నిరీహ, నిశ్చల నిరుద్యోగ ప్రజల నుద్దేశిస్తూ, క్షుధాస్మశానంలో శుష్కోదరశ్రేణులు కాలినవని, ఈశ్వరుని ''నిటాల భూమి నయనాంచద్వల్లికాగ్రమ్ము''లో వహ్నిపుష్పాలు వికసించాయని వర్ణిస్తూ, సుప్రభాతాన్ని పీడిత ప్రజల జీవితాలలో విప్లవప్రభాతంగా కవి చిత్రించారు. భవిష్యద్వాని రాకక్కాలాము రుద్రవీణాతంత్రిని మీటి

ప్రాచీ దిశారక్త రంజిత హోమమ్ము
లో చిన్ని కాలాగ్ని వల్లికను నాటించి

'రుద్రవీణ', 131.

నదని, రానున్న ప్రభాతాన్ని అరుణమయమైన ఉద్యానవనంగా, తమ భావనని అగ్ని వల్లికగా చిత్రిస్తూ, తాము ప్రకృతితో విప్లవ భావాత్మకమైన తాదాత్మ్యాన్ని పొందినట్లు కవి వ్యక్తీకరించారు. విప్లవ ఝంఝూతి సంకేతమైన తూర్పుగాలి వేచడం మొదలుపెట్టాక ఎక్కడ చూచినా విప్లవసూచనలే కవికి కనిపించాయి. ''భూ వదనమునందు కుంకుమను భగ్గున మండిన దగ్గివలె'' నని తమ విప్లవభావాన్ని ప్రకృతికి ఆపాదించారు. ''రుధిర పక్షుల''నే తమ విప్లవ భావాభిరుచికి సంకేతంగా ప్రయోగిస్తూ ఆ రుధిర పక్షుల రెక్కల బరువుకి కూలిపోయిన గాలిసౌధాన్ని, గాలిసౌధాల పునాదుల్లో కాళ్ళు విరిగిన కొత్తరాజుల్ని మనకి చూపించారు. ''కవాటం'' అనే ఖండికలో దాశరథి శ్రమజీవుల ఘర్మ జలానికి ఖరీదుకట్టే ప్రయత్నం చేయకపోయినా వాటిప్రాముఖ్యం గ్రహించారు.

ఆస్వేద బిందువులే భవిష్యత్తులో మానవుల సుఖసంతోషాలకి పెట్టుబడి అని భావిస్తూ ఆస్వేద జలాన్ని హృద్యంగా

> పొంగిన లవణ సముద్ర తరంగం
> లవణ సముద్రం పెంచిన
> భవితవ్యం - అమృత కిరణ
> చంద్రబింబ పౌర్ణమాసి

రుద్రవీణ, 138.

అని చిత్రించారు. వీరి శ్రమఫలితంగా భవిష్యత్తులో చీకటి తొలగుతుందని ఆశిస్తూ ''రక్తకవాటం కిరకిర''తామువిని పాఠకులకి వినిపింపచేశారు. అభ్యుదయ కవితాసారధి శ్రీశ్రీ ప్రభావం అభ్యుదయ కవులందరిపైన కనిపిస్తుంది. డా.దాశరధి రచించిన ''మహాగీతం''మం ప్రపంచం పిలుపుని వినిపిస్తూ దగాపడిన తమ్ములని మహాప్రస్థానానికి ఆయత్తంచేసి శ్రీశ్రీ కవిత్వాన్ని ఆవేశంలోనే కాక ఉక్తివైచిత్రిలోను, శబ్దవైచిత్రిలోను కొంతవరకు అనుకరించింది. శ్రామిక ప్రజాశక్తిని వర్ణిస్తూ

పరుగెత్తే హిమగిరి
ఎగిరి నడచు గంగాఝరి
కంపించే ఇలాతలం
కదలాడిన గభీర సముద్రజలం
పేలిన కోటికోటి తారలు
కురిసిన ప్రళయ ద్వరషధారలు
గ్రీష్మంలో తగులబడే
పెద్దపెద్ద కొండలు

రుద్రవీణ, 142.

అని నిరుపేదల గుండెలని ప్రకృతిలో అతిశక్తిమంతమైన అంశాలతో పోల్చారు. కవి. నిరుపేదల విప్లవశక్తిని ''రక్తగంగా తరంగం'' అని వారి ''నెత్తుటి రాగం'' ''పడగెత్తిన మహోగ్రనాగం'', ''అరుణారుణ విప్లవమేఘం'' అని చరిత్రపాడని, ధరిత్రిచూడని విప్లవగీతాన్ని కవి ఆలపించారు. ''రుధిర దీపిక'' అనే ఖండికలో అనాధ విశ్వ శ్రామికమూర్తిని ''ఆగామియుగ పరివ్యాప్త కీర్తి'' గా అభివర్ణించారు. ఆ శ్రమజీవి నరనరాల్లో ప్రవహించే నయాగరా, జెరొసొప్పా రుధిర జలపాత ధారల్లో అరుణారుణ విద్యుద్దీపిక, యుగయుగాల దోపిడీ విధానాన్ని అంత మొందించగల శక్తిగాభావించి కవి ఈ అనంతశక్తి అనాదిగా మానవుల అంతరాల్లో ఉందని తెలియచేయడానికి

విరించి పుట్టక ముందునుంచి
మంచులో పొంచుకు కూర్చున్న
పీయూష వాహిక.
ఈ రుధిర దీపిక

'రుద్రవీణ', 148.

అని చిత్రించారు.

రెండుకోట్ల తెలుగు అన్నలని, ఒకకోటి తెలంగాణతమ్ములు కలుసుకుని ఆనందంగా జీవించే మహోత్సవాన్ని ''మహాంధ్రోదయం'' అనే కవితాసంకలనం వర్ణించింది. నిజాం ప్రభుత్వ పరిపాలనా కాలంలో తెలుగు జాతి బానిసజీవితం దాశరథి కవితా ధారని ''అగ్నిధారగా'' కురిపింపచేసి ఆయన చేత ఉద్విగ్నంగా 'రుద్రవీణని పలికింపచేస్తే, మహాంధ్రోదయ శుభసమయాన అగ్నిచల్లబడి వెలుగు వెల్లిన అధికత ఈ కావ్యంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఈ కవితాసంకలనంలో మకుట ఖండిక అయిన మహాంధ్రోదయంలో ''వెలుగు'' చిత్రవిచిత్ర రూపాల్లో మనకి దర్శనమిస్తుంది. పొట్టిశ్రీరాములుచేసిన ఆత్మార్పణం నిద్రాణాంధ్ర ధరాస్థలిని మేలుకొలుపగలిగే వెలుతురుబాకుగా కవికి కనిపించింది. ఆ వెలుతురు బాకు తాకిడికి చిక్కని కాలరాత్రి చిమ్మకోడా గుండెలు జల్లుమనేలా ''రుధిర నిర్ఝరి పారిందని, దిగాంగనాముఖంలో నవ కుంకుమ ప్రభలు తామర మొగ్గల్లా మొలిచాయని కవి భావించారు. ఈ భావన ఆవేశపరమైన విప్లవరౌద్రంగా కాకుండా సుమనోహరమైన అరుణ

శృంగారంగా పాఠకులకి కనిపిస్తుంది.

కొన్ని సందర్భాలలో తమలో ఇంకా ఆరిపోని విప్లవాగ్నిని ప్రదర్శిస్తూ నగ్నీకృతాలైన పలాశ వృక్షాలు ''అగ్ని చేలమ్ములు'' కట్టుకున్నాయని (మాధురి) ''ఉగాది పూవు మంటలు'' వేపలనుండి మల్లికా మండపి దాక ప్రాకాయని (మాధురి) దీపికా తోరణాలు ''కటిమందార పుష్పాలతటి'' (గుండెలో దీపాలు) అని, ''కౌగిలిలో ప్రసవించె ... గోటల్''(మాధురి) అని చిత్రించారు.

''పునర్నవం'' అనే కవితాసంకలనంలో నవయుగోదయ భావ స్ఫోరకాలయిన కవితలు అనేకం కనిపిస్తాయి. ''తెలంగాణం'' అనే ఖండికలో సర్వపీడిత జనాభ్యుదయ సూచకంగా

మండుతున్న సూర్యుడు మన
మండలాన విచ్చెను తన
కాంతి నేత్రమును నేడు

పునర్నవం, 207.

అని చిత్రిస్తూ అభ్యుదయకారకమైన విప్లవాన్ని తేజస్సుగా వర్ణించారు. శ్రామిక జాతి జలపాతానికి నాంది అని ఆ జనశక్తిలో ఉద్భవించే విప్లవశక్తి విద్యుదగ్ని అని ''ఉషస్సంధ్య'' అనే కవితలో చిత్రించారు. కాలంలో చైతన్యాన్ని ప్రకృతిలో దర్శిస్తూ

కాలం ఎక్కడక్కడే వెరగ్గులడా
నయాగరా జలపాతం వలె
నడుం విరిగేట్టు దూకింది తప్పదు కదా!

'మనిషల్లో లెబొరేటరీ', 'పునర్నవమి', 242.

అని చిత్రించారు. నయాగరా జలపాతంలోని ఉధృతవేగం శ్రీశ్రీ మహాప్రపంచ గీతంలో ఆంధ్రపాఠకులకి ఇంతకుముందే ప్రత్యక్షమయింది. దాశరథి ఇంకా క్రిందకి దృష్టిని సారించి ఆ జలపాతం సృష్టించే ''విద్యుద్వల్లీమతల్లికల్ని'' దర్శించి, ఆ జలపాతంలో అంతశ్చేతనాన్ని అందరికి చూపించారు. ''తిమిరంతో సమరం''లో ''పలాశ కుసుమాలు'' అనే ఖండికలో మోదుగ పువులు తమ యౌవనదశలో శృంగారానికి సంకేతాలుగా, ప్రకృతిరామణీయకతకి సంకేతాలుగా కనిపించాయని, కాని ఈ కావ్యరచనాకాలానికి ఆ పువ్వులే

నియంతల దురంతాలకు బలియైన
మహావీరుల గుండెలవలె
దండలు దండలుగా

''పలాశకుసుమాలు', ''తిమిరంతో సమరం'',
35.

కవికి కనిపించాయి. ''విశ్వమానవ విజయ గీతిక'' అనే ఖండికలో పూచిన మామిడి విప్లవానంతర ఆనందానికి సంకేతంగా చిత్రిస్తూ, తత్పూర్వకాలంలో ఉన్న అవ్యవస్థని ''వీచిన చలిగాలులు చేసిన బీభత్సం''గా చిత్రిస్తూ,

మోడుల మేడలలో విరబూసిన
కొరకొర చూసిన అరుణ కిసలయ దీపాంకురముల

తిమిరంతో సమరం, 59.

ని విప్లవ భావోదయంగా వర్ణించి ఈ విప్లవకాంక్ష మండిపోతున్నట్టి గుండెల మంటగా కవి ప్రదర్శించారు. కాలధేనువుని బంధించిన పాపాల పుట్టలవంటి నరహంతలని కవి పాలు పితికేశక్తిలేక రక్తం పితికినట్టుగా, పూలు పూయించే శక్తిలేక వెట్టను నరికే ప్రబుద్ధులుగా చిత్రించారు. ఈ అధర్మానికి శత్రువుగా విప్లవాన్ని

రాలిన ప్రతిరక్తకణం
పలాశమై లేచింది
రుధిరసుమం పూచింది

'రుధిరసుమాలు', ''తిమిరంతో సమరం'', 112.

అని విప్లవ విశ్వరూపాన్ని కవి ప్రదర్శించారు. రుధిర సుమాలు తెగిన సంకెళ్ళని, క్షుధాజ్వలిత మానవవ్యథని వివరిస్తున్నాయి అని తెలియచేసూ కవి

రుధిరసుమ మాలిక
చైతన్య ప్రతీక
వైష్ణవ్య పతాక
నవవత్సర గీతిక

తిమిరంతో సమరం, 113.

అని వ్యాఖ్యానించారు. జీవితంలో సమస్యలకి పరిష్కారం విప్లవం అని సూచిస్తూ

ప్రతి సవాలుకి జవాబుగా మన
బ్రతుకుల వలచిన ఈ కాలం
అనల కేతనం చేతగొని
అరుదెంచేదే భవితవ్యం 115.

అని అనలకేతనాన్ని విప్లవమార్గదర్శిగా చిత్రించారు. వాస్తవ జగత్తులో తమ అనుభవాలకి ఆలోచనలు జోడించి కవితా చషకాలలో ఆలోచనామృతాన్ని నింపి 1975లో ''ఆలోచనాలోచనాలు'' అనే కవితా సంకలనాన్ని డా॰దాశరథి వెలువరించారు. చీకట్లో చిక్కుకుని, ఆకలితో అలమటించే లోకాన్ని అనంతంగా ''ఎదలో సాగుతున్న రొద'' అని ''కాలుతున్న సొద'' అని చిత్రించారు. వేధి మానిని స్వీయగాథ'లో ఆతని జీవితంలోని కడగండ్లని బాధాతమంగా భావించి,

గుండెల కొండల చాటున దాగిన
నిండు సూర్యునిటు రానివ్వు

ఆలోచనాలోచనాలు, 18.

అని బాధల చీకట్లు తొలగించడానికి గుండెలలో దాగిన ప్రేమని బాలభాస్కరుని కిరణాలుగా ప్రకృతిసహజంగా చిత్రించారు. ''స్వాతంత్ర్య మాసం''లో రాజకీయ స్వాతంత్ర్యాన్ని ''స్వేచ్ఛానవార్కబింబం / నే వెలుగులోలికె నేడు'' (19) అని స్వేచ్ఛకి నవార్క బింబాన్ని సంకేతంగా ప్రదర్శించారు. ''జ్వాలా నికుంజం'' లో గుబురుగా పెరిగిన చెట్లలో మోదుగుపూలు కవికి ''అగ్నిపుష్పాల షామియానా'' (25) గా కనిపించింది. భారతదేశంమీద పాకిస్థాన్ చేసిన దురాక్రమణ సందర్భంగా మేల్కొన భారతప్రజావళి శక్తి కవికి ''అరుణప్రవాళ వల్లరి'' గా కనిపించింది.

ప్రాకే అరుణ ప్రవాళ వల్లరి
''పాకే''గొంతుకు ఉరితాడు
ప్రజలకసమ్మె ప్రాణాలొడ్డిన
వేరుల గళాల వికచ మంజరి

ఆలోచనాలోచనాలు, 30-31.

పువ్వులు చిందించే ''ఎర్రటి నవ్వులు'' ఈ దశలో కవికి పయోధరాలమీద వక్ర మనోహరాలైన నఖక్షతాలు, దొంగసన్యాసుల దొరకాని కుబుసాలలో సంధ్యారుణ ద్యుతులు, ప్రభువుల మకుటాలలో పద్మరాగమణులుగా కవికి కనిపించలేదు. అని

కంబోడియా కదనంలో
వియత్నాం విలయంలో
బంగ్లాదేశ్ సమరంలో
పోరు సలిపి చనిపోయిన
వీరుల హృత్కమలాలు 64.

అని చిత్రించడంలో కవి హృదయంలో విప్లవకారులమీద ఆయనకున్న ప్రగాఢమైన అభిమానం వ్యక్తమవుతుంది. ''గుల్మొహర్ కుసుమాంజలి'' అనే కవితా ఖండికలో అరుణ చేలాంచలాల్ని, అగ్నిపర్వతముఖ జ్వాలల్ని, శ్రామికసేనా వాహినుల జయ పతాకల్ని, కుంకుమ రాసుల్ని దర్శించి, ఆ పుష్పాల్ని విప్లవసంకేతాలుగా కవి స్వీకరించారు. ఈ పుష్పాలు దేశభక్తుల హృదయాలలో త్యాగబుద్ధికి కూడా సంకేతాలుగా స్వీకరించి

దేశ రక్షణ కసువులొడ్డిన
ధీరసైనిక చితా జ్వాలల
మాలలై నీలాంబరమ్మున
తేలియాడెను గుల్మొహర్ 68.

అని చిత్రించారు.

డా. దాశరథి ఇటీవల ప్రచురించిన కవితా సంకలనం ''ధ్వజ మెత్తిన ప్రజ'' పేరు అచ్చమైన ప్రజాకవి అని మంసూరు ఋజువు చేస్తోంది. ''హృదయ కమలం'' అనే కవితాఖండికలో నరుని హృదయ విప్లవభావ సముజ్జ్వలంగా భావించి

నరుని ఉరములోని నవహృదయం
పరమేశ్వరుని పాణింధమం
గుండెలనే ఈ కొలిమి
మండు తుంటేనే బలిమి

'ధ్వజమెత్తినప్రజ', 1.

అని చిత్రించారు. ఈ కవికి మండేప్రాణం జ్వాలగా, గుండె తేజోహేలగా కనిపించింది. నిదురించే జీవితాలకి సుందర సుప్రభాతాన్ని ఊహిస్తూ, ఆ సుప్రభాతకారకమైన అభ్యుదయ వాంఛని ''అంధకారపు లంగులో..... మ్రోగని అగ్నిఘంట''గా చిత్రించారు. ''పరిణామం'' అనే ఖండికలో కవికి ఉగాది పరిణామ పతాకగా, విప్లవప్రతీకగా కనిపించింది.

డా. దాశరథి కవిత్వంలో మొదటినుంచే విప్లవకాంక్ష, అభ్యుదయాభిమానం అధికంగా కనిపిస్తాయి. ఈయనకి అతిప్రియమైన ప్రకృతి శక్తులలో అగ్ని ముఖ్యమయింది. వీరు అగ్నిని చైతన్యానికి, విప్లవానికి సంకేతంగా ప్రయోగించారు. అగ్నితోపాటు అగ్నివర్ణరంజితాలైన మోదుగపువ్వులు

(పలాశపుష్పాలు) మందారాలు, పద్మాలు, గుల్మొహార్‌పూలుకూడా కవికి విషాద భావాలనే స్ఫురింపించాయి.

ఒక్కొక్కసారి కవికి వారి మానసిక స్థితికి అనుగుణంగా ప్రకృతి భీతావహంగా కనిపిస్తుంది. ఈ సమయాలలో కనిపించే ప్రకృతి విధ్వంసకారక స్వరూపాన్ని టెన్నిసన్ "Nature red in tooth and claw" గా వర్ణించాడు. డా. దాశరథి ప్రకృతిని ముఖ్యంగా సౌందర్యమూర్తిగా, ఒక్కొక్కసారి విషాదభావసంకేతంగా చిత్రించినా, కొన్ని సమయాలలో ప్రకృతిని భీతావహగాకూడా దర్శించారు. ఆ సమయాలలో వస్తుతః ప్రకృతి భీతావహంగా ఉండటమేకాకుండా, కవి మనసులో భయాలనికూడా ప్రతిబింబిస్తుంది. అంటే కవి తమభావాలని ప్రకృతికి ఆపాదించడం జరిగింది. ''అగ్నిధార'' అనే కవితాసంకలనంలో ''ఎండలు'' అనే ఖండిక ప్రకృతి మానవుల హృదయాలలో కలిగించే భీతికి, బాధకి ఉదాహరణ. ఎండలు జంతుజాలంమీద, ప్రకృతిమీద కనపరచే ప్రభావాన్ని

తన నీడలో తానె కునికిపాటులు పడు
ఇట్టిగుండెల యెండ లెట్టి నయ్యో
పచ్చ పచ్చని ఆకు బ్రతుకు చూడగలేక
ముట్టి పండుల కన్నులెట్టి నయ్యో
మ్రాను నుండి నీటి రాబడిలేక నెలకన్నె
చిక్కుచు శల్యావశిష్టయయ్యో 24.

అని వర్ణిస్తూ ఈ జగత్తు షడ్రుతుగణ బాధితమని, జీవిత స్వర్గమంతా ''నరకమైన విషాద మానవుడు నేడు'' అని వేసవికాలపు వేడి తీవ్రత చేత బాధపడిన మానవుణ్ణి కవి చిత్రించారు. '' జైల్లో'' అనే ఖండికలో కూడా

ఇది నిదాఘము, ఇందు సహింపరాని
వేడి యేడిపించు చున్నది

అగ్నిధార, 26.

అని గ్రీష్మఋతువులో ''జైల్లో'' గడిపిన తమ దుర్భర జీవితాన్ని కవి వర్ణించారు. ఆ ఎండలకి గుండెలో నెత్తురుకూడా కాగి బండబారిన మనసులోనుంచి జారి పచపచని పూ మొగ్గమై నటించి ఎఱ్ఱబారింది అని కవి సహజంగా చిత్రించారు. నిజామాబాదు జైల్లో ఉన్న కవికి లోకం అంతా శోకమయంగా కనిపించింది. దీనికి వాతావరణ గ్రీష్మమేకాకుండా నిజాం నవాబు ప్రభుత్వపు నిరంకుశత్వం కవి హృదయంలో కలిగించిన వేడికూడా కారణం. అందుకే

వెన్నెలలు లేవు, పున్నమ కన్నెలేదు
మెడివన్నెల నెలవంకజాడలేదు
చుక్కలే లేవు ఆకాశ శోకవీధి
ధూమ ధామమ్ము, దుఃఖ సంగ్రామభూమి

అగ్నిధార, 28.

అని తెలియచేశారు.

''ప్రాగ్భూమి'' అనే ఖండికలో పాశ్చాత్యదేశాల దోపిడీ విధానానికి గురియై, ఆర్థికంగా సర్వనాశనమైన ప్రాగ్దేశాలని

పడమటి బొల్లిగద్దలు
పొడిచి పొడిచి తినివిడిచిన
అగ్ని సంస్కారం ఎరుగని
నగ్నశవం ప్రాగ్భూమి

అగ్నిధార, 95.

అని రాజకీయ దౌష్ట్యాన్ని ప్రకృతికి ఆపాదించి కని చిత్రించారు. రాజకీయ, సాంఘిక పరిస్థితుల ప్రభావంచేత భీతిల్లిన కవికి సముద్రం తనని మింగే శక్తిగా కనిపించింది

మింగడానికో యేమో!
నింగికి పొంగుతూ సముద్రం
తొంగి చూస్తోంది నావైపు
దొంగ! చూస్తోంది నావైపు

'ఇల', ''అగ్నిధార'', 97.

అని తనని భూమిగా వర్ణించుకుంటూ, ఆ భూమి సముద్ర ఆర్భాటానికి భయపడి నట్లుగా కవి చిత్రించారు. ''భేదం'' అనే ఖండికలో నిరుపేదల చిద్భేదాల గాథని చిత్రిస్తూ, బరువైన వర్షాకాలం కురిసిన వర్షాలతో నిరుపేదకి కరువులు దిగి వచ్చాయని, నిజాం ప్రభుత్వ దుష్పరిపాలన వలన నిరుపేదల కడుపునిండ గంజి నీళ్ళుకూడా లభించడంలేదని బాధపడుతూ, ఆ క్షుధావ్యథిత మానవజాతి తిరగబడు తుందని తెలియచేశారు. అప్పుడు అధికారాంధులు మట్టికరుస్తారని తెలియ చేస్తూ,

పేలిన తారాగోళం
రాలిన కన్నీటిచుక్క
కాలిన ఈ కడుపు ఘోష
కూలిన పర్వత శిఖరం

అగ్నిధార, ౧౧.

అని నిరుపేదల ఆవేశ విజృంభణ పేలిన తారాగోళంగా, వారి హృదయాలనుంచి ఉద్గమించే ఆవేదన రాలిన కన్నీటి చుక్కగా, వారిక్షుధా బాధ కాలిన కడుపు ఘోషగా, ఈ విప్లవశక్తుల విజృంభణ వలన నేలకొరిగిన నిరంకుశప్రభుత్వాన్ని కూలిన పర్వత శిఖరంగా చిత్రించారు. ఇందులో రాజకీయవ్యవస్థలో ఉండే దుష్టశక్తుల్ని ప్రకృతిలోని విపరీత శక్తులద్వారా కవి సంకేతించారు. గాంధీజీ దుర్మరణవార్తని కవి నిజామాబాద్ జైల్లో ఉండగా విని ఆ వార్తచేత శోక విచలితుడై ప్రకృతిని ఆసమయంలో విషాదమూర్తిగా, మానవుని కష్టాల్లో పాలు పంచుకునే భాగస్వామినిగా భావించారు. అలా భావిస్తూ,

నేల నీలాకాశ ఫాలభాగమునందు
రవి బింబ కుంకుమ చ్ఛవులురాలె
భూదేవతా రమ్యపాదమంజీర శిం
జా సంజనమ్ము శ్రావ్యమయ్యె

'క్షమామూర్తి', ''అగ్నిధార'', 61.

అని గాంధీజీ సంపాదించిపెట్టిన స్వాతంత్ర్యమే ఆయనకి మృత్యువుగా పరిణమించిందని తెలియచేయడానికి

చేతులారగ నీవు పెంచిన స్వతంత్ర
నాగవల్లికయే విషనాగమయ్యె
నీ గళము చుట్టి ప్రాణాలు లాగివేసె

'క్షమామూర్తి', 62.

అని రాజకీయ సంఘటనని ప్రకృతిలో భయంకర విషనాగ శక్తిగా కవి రూపకల్పన చేశారు.

ప్రకృతి భీతావహంగా కవికి కొన్ని సమయాల్లో కనిపించినా కవి హృదయంలో గాఢంగా నెలకొనివున్న ఆశ వారి వ్యక్తిత్వానికి, కవితానికి ఎప్పుడూ నిత్యవసంతశోభని సంతరిస్తోంది. జీవితంలో ఎన్నో కష్టాలని చవిచూసినా

చివరికి ఆ కష్టాలని అధిగమించి ఆనందామృతాన్ని తాము ఆస్వాదించగలమని తెలియ చేశారు. జీవితంలో ఆ అవాంతరాలని హాలాహలంగా చిత్రిస్తూ వాటిని ''వడబోసి అమృతధారలేర్చి త్రాగిలేసెద''నని కవి తమ ఆశని వెల్లడించారు. ప్రకృతిలో గంభీర, కఠోర శక్తుల్ని దర్శించి విచలితులై మళ్ళీ ఆశని పుంజుకుని ''?'' అనే ఖండికలో

ఆ నల్లని ఆకాశంలో
కానరాని భానువులెందరో

అగ్నిధార, 102.

అని ముసురుతున్న చీకటిలో వెలగబోయే ఆశాసూర్యుణ్ణి కవి దర్శించారు. జీవితంలో ఒడుదుడుకులకి భయపడకుండా వాటినన్నింటిని తట్టుకుంటూ, తన చుట్టూ ఉన్నవారికి ఆశలు పంచిపెట్టే ఒకచిన్న సౌధాన్ని కట్టుకోగలనన్న ఆత్మ విశ్వాసాన్ని వెలువరిస్తూ

నావికుని భుజాల ఊపులు
తోసి పారేస్తున్న నీళ్ళకు
తోణికి పోయే పడవమీద
చిన్ని సౌధం కట్టుకుంటా

'సుప్రభాతం', 'రుద్రవీణ', 132.

నని కవి తన ఆశని వ్యక్తంచేశారు. 'రుధిర పక్షులు'ని అన్యాయంతోను, అధర్మంతోను చీకటిగుహలా తయారైన లోకానికి వెలుగు కిరణాలని ప్రసాదించే ఆశాజ్యోతులుగా కవి చిత్రిస్తూ

చీకటింటికి
చిన్ని కిరణం
తెచ్చి విడిచే
రుధిర పక్షులు

'రుద్రవీణ', 136.

అని చిత్రించారు. తమ జీవితంలో గడచిపోయిన శిశిరఋతువుని తలుచుకుని అప్పటి వెతలని మరచిపోలేక కొంత ఆవేదనని వెలువరిస్తూ, ఆ నిరాశలోనుంచే ఆశమళ్ళీ చిగిరిస్తుందనే ఆశావాదిగా కవి కనిపిస్తారు. ఎన్నోమారులు తమలో ఆశలు మోడువారినా మళ్ళీ ''శిశిర శీతవాత శీర్ణాశాలత''తనలో వేరు తన్నుతుందని ఆశిస్తూ

నేడు వలవంత యేతెంచి కీడునేయు
రేపు రాకుండునే హాసరేఖ యొకడు!
ఆకు రాల్చెడి కారు నేడరుగుదేర
రేపు వాసంతమధువు వర్షించకున్నె?

'మహాంధోదయం', 175.

అని నేటి బాధలు రేపటి సుఖాలకి నాందిగా చిత్రించారు. ఈ సందర్భంలో షెల్లీ అన్న "when winter comes can spring be far behind?"[4] అనే మాటల్ని కవి మనదేశ వాతావరణానికనుకూలంగా పరివర్తనం చేసినట్టులోస్తోంది. చిరకాలంగా అణగిమణగిఉన్న ప్రజానీకం తలెత్తి నిలబడుతుందనే ఆశని

తలలు వాల్చిగున్న జనం
గళాలెత్తి పాడుట
కదలలేని ఎదనెమళ్ళు
కండ్లు విప్పి ఆడుట

'అచుంబితం', ''పునర్నవం'', 273.

గా కవి ప్రదర్శించారు. ''వేర్మి మానిసి జీవితం''లో కడగండ్లని బాధాతమంగా భావించి, ఆ చీకటి విడిపోడానికి సూర్యుణ్ణి ఆనందోదయ సంకేతంగా ప్రయోగించారు. కవికి రేపు మీద ఎంతో అభిమానం. భవిష్యత్తు వీరికి ఆశాసంకేతం. ఈ విషయాన్ని వివరిస్తూ ''వసంత గీతి'' అనే ఖండికలో

నిన్న విషమైతే
నేడు మధురసమైతే
రేపు సుధా చషకమౌను

'ఆలోచనాలోచనాలు', 333

4. P.B.Shelley, "Ode to Westwind", 70.

అని ఒక ఆశాగీతాన్ని పాతకోకిలనోట కవి వినిపించారు. వర్షపాతాన్ని క్షామగ్రస్త భూమాతకి ''హర్షపాతం''గా వర్ణిస్తూ

గజ్జె కదిలించ లేని మంజీర
గల్లుగల్లున మ్రోగుతోంది ఊరూర
గుండెపగిలిపోయిన గండిపేట
నిండు చూలాలి వలె కనిపిస్తోందేపూట

'ఆలోచనాలోచనాలు', 74.

అని ప్రకృతిలో నదులు తమ ఆశలకి సంకేతాలుగా కవి చిత్రించారు. కవి ప్రకృతిని తమ రాజకీయ, సాంఘిక విశ్వాసాలకి ఆలంబనంగా చిత్రిస్తూ తమ దేశాభిమానాన్ని, శాంతిప్రియత్వాన్ని, మానవతాదృక్పథాన్ని సముయోచితంగా వ్యక్తం చేశారు. స్వరాష్ట్ర సంపాదనలో స్వాభిమానం అతిశయించిన తెలుగు వేగులని సగౌరవంగా

తలలు వాలిచి యున్న నా తెలుగు జనము
ఉన్నతోన్నత పర్వతాలో యనంగ
తలలు వైకెత్తి

కోటి గొంతులు, 'మహోంధ్రోదయం', 157.

నిలిచారని కవి చిత్రించారు. ప్రకృతిని తమ శాంతిప్రియత్వానికి దర్పణంగా చిత్రిస్తూ, ''కపోత సందేశం''అనే ఖండికలో ''న్యాయోన్నత పర్వతాగ్ర శిఖరోహిత శాంతి కపోత పోతములు''ని మానవుని శాంతిసందేశవాహకములుగాను, మానవునికి శాంతిసందేశాల నందించే దూతలుగాను కవి దర్శింపచేశారు. తామిచ్చిన శాంతి సందేశాన్ని తీసుకుని గగన భాగాని కెగిరిన కపోతాలు

శాంతి దౌత్యమునకు చను పక్షులు సహస్ర
పూర్ణ చంద్రబింబములుగా

'మహేంద్రోదయం', 188.

కవికి కనిపించాయి. తమ శాంతి ప్రియత్వాన్ని, మానవతా దృక్పథాన్ని వెల్లడిస్తూ, ''తుదిశిశిరం''అనే ఖండికలో కవి మానవుని మనసులో రణదాహానికి ప్రతీకగా నిల్చే శిశిరాన్ని రాక్షసిగా చిత్రిస్తూ, ఆ రాక్షసి శిరాన్ని నరకడానికి

మానవతా మలయవాయు
సంచారములే చాలును
శాంతి పుష్ప బాణాలను
కురి యించుటయే చాలును

పునర్నవం, 236.

అని ప్రకృతిలోని క్రౌర్యానికి ప్రకృతిలో ఉండే మలయపవనం, పుష్పాలు విరుగుడని కవి చిత్రించారు. ఎండలో మండిన గుండెలకి శీకర సౌఖ్యాన్ని కలిగించే వార్షుకాంబుదం కవికి పంచభూతమయంగానే కాకుండా గుండె కంటినీటికుండగా, కరుణరసభరితంగా అలరారే దయాశీలిగా కనిపించింది. మబ్బుని మానవజీవితంలో సుఖదుఃఖాలకి ప్రతీకగా భావిస్తూ

మబ్బులోన విందు మదవతీపాద మం
జీరయుగళ మంజు శింజితము
మబ్బులోన కందు మానినీ నయనాంత
దళిత బాష్పబిందు కణగణమ్ము

'జలద సరస్వతి', ''అమృతాభిషేకం'', 315.

అని చిత్రించారు. దేశాలమధ్య శాంతి సౌఖ్యాలు నెలకొల్పగలిగే శాంతి దయామూర్తిగా ప్రకృతిలో సాక్షాత్కరిస్తుందని, ఆమె ముఖకాంతుల వలన అమావాస్యకూడా పౌర్ణమాసిగా భాసించగలుగుతుందని భావిస్తూ కవి

నీ సొగసైన చూపు వెన్
మోడులు మేడగా మలచి, ముళ్ళను మల్లెచేసె

'శాంతి', ''కవితా పుష్పకం'', 337.

నని వర్ణించారు. శాంతిని ప్రపంచంలో నిత్యవసంతాన్ని నెలకొల్పగలిగే అపర ప్రకృతి దేవతగా భావిస్తూ

నీవెట నుందువో అచట నిమ్నగలింకవు, లేళ్ళుజంకవున్
పూవులు వాడ, వంధతమముల్ భువినాడవు, పండువెన్నెలల్
జీవము వీడ, వక్షులు చిందవు, గుండెలుకుంద, పక్షిరా
జీవములందు రాగము నశింపదు, ద్వేషము సంభవింపదున్

339.

అని శాంతిని సకలసౌభాగ్యప్రదాయినిగా చిత్రించారు. ''ఆలోచనాలోచనాలు'' అనే కవితా సంకలనంలో మానవుని రణదాహం వలన ఉత్పత్తిఅయ్యే మారణాయుధాల చేత ప్రకృతి భయకంపితురాలైనట్లు చిత్రిస్తూ కవి శాంతిలేని ప్రకృతి విన్యాల చిత్రాన్ని మనకి సాక్షాత్కరింపచేశారు.

బాంబుల భీకర శబ్దాలు విని
పువ్వు పూయడానికి భయపడింది
పక్షి ఆకాశంలో పిచ్చిల పిడిగా
పల్టీలు కొట్టడానికి జంకింది
సెలయేరు గిలగిల లాడింది

'మంగళాచరణం', ''ఆలోచనాలోచనాలు'',

58-59.

అని భీతిల్లిన ప్రకృతిని మనకి దర్శింపచేశారు. ప్రపంచానికి శాంతి నిత్యావసరంగా భావిస్తూ ''శాంతిబాల'' అనే కవితలో శాంతిని కవి ''ప్రాతస్సంధ్యని విరిసిన లేత లేత రోజాగా వర్ణిస్తూ, ఆ రోజా సాయంసంధ్యకి వాడేపూవు కాదని

> ఆరు ఋతువులోక సారే
> అగుపించును ఆ మోములో
> ఆ లేమలో

'ఆలోచనాలోచనాలు', ౯౮.

అని శాంతిని అనంత సౌఖ్యప్రదాయినిగా కవి చిత్రించారు.

## తాత్త్విక దర్శనం

డా॰దాశరథి ప్రకృతిని భౌతిక భావాలప్రేరణకి మాత్రమేకాక తాత్త్విక దృక్పథానికికూడా అలంబనగా తమ కవిత్వంలో ప్రయోగించారు. ప్రతిభావంతుడైన కవి సాంఘికయధార్థాలని, భౌతిక ప్రపంచాన్ని అవలోకించి వాటిని తనకవిత్వంలో ప్రతిఫలిస్తూనే వాటివెనకఉన్న అంతస్సత్యాలని, వాటి అంతరాంతరాల్లోఉండే తాత్త్విక సత్యాన్ని పరిశోధించి తన కవిత్వంలో ఒక తాత్త్వికదృష్టిని ఆవిష్కరించడానికి ప్రయత్నంచేస్తాడు. ఇటువంటి తాత్త్విక కవిత్వాన్ని దృష్టిలోపెట్టుకుని అరవిందఘోష్ 'కవిత్వం ఒక మంత్రం' వంటిదని నిర్వచిస్తూ ఇటువంటి కావ్యాన్ని ఆత్మకావ్యం (epic of the soul)[5] అని అభివర్ణించారు. 'కాలం అనంతం, పృథ్వి విపులం' అనే తాత్త్విక సిద్ధాంతాన్ని డా॰దాశరథి ప్రకృతిలదర్శించి''అస్తమయం'', అనే ఖండికలో సంధ్యాసమయాన్ని పాతకాలానికి కొత్తకాలానికి వారిధినికట్టే సంధి యుగానికి సంకేతంగా స్వీకరించారు. భౌతికదృష్టిలో కాలానికి అవధులు, పరిమితులుఉన్నా తాత్త్వికదృష్టిలో కాలం అనంతమని, కాలాన్ని కొలిచే దివారాత్రాలు తమదృష్టిని పరిమితం చేయలేవని భావిస్తూ

---

5. Aurobindo, 'The Future poetry', 377.

ఒకటితరువాత ఒకదినమ్ము కదలాడి
ఓడిపోతుంది నాముందు, పాడుపడిన
పాతకాలము, రానున్నలేతకాల
మునకు నెత్తురురంగు చందనమురాయు

అగ్నిధార, 66.

నని అనంత కాలంతో తను అనంతవ్యక్తిత్వానికి తాదాత్మ్యాన్ని సాధించుకున్నారు. సృష్టి, స్థితి, లయ కారకమైన త్రిమూర్త్యాత్మకమైన భగవచ్ఛక్తి వేరు వేరు రూపాలల్లో కనిపించినా నిజానికి వీటికి మూలం ఒకేశక్తి - ముఖ్యంగా సృష్టి లయలు పరస్పర విరుద్ధాలైన ప్రక్రియలుకావు. వీటికి అవినాభావ సంబంధం, కార్యకారణ సంబంధం ఉన్నాయి. లయ సృష్టికి ప్రాతిపదిక అని భావిస్తూ

లయ మహాహోమ వేదిహోత్రమ్మునందు
సృష్టి సుందరదేవి కన్పింప వచ్చు

''అస్తమయం'', 67.

నని సృష్టిలో పరస్పర వైరుధ్యాల మధ్య సమన్వయాన్ని సాధించగలిగిన సమ్యక్ దృష్టిని డా. దాశరథి ప్రదర్శించారు. సమగ్ర సత్యదర్శనానికి త్రికాలబాధితం కాని తాత్త్విక దృష్టి అవసరం. మానవునికి భూత భవిష్యత్కాలాలు రెండూ

ఆవశ్యకాలే అని విశ్వసిస్తూ ''నాపేరు ప్రజాకోటి'' అనే ఖండికలో

ఇవిరెండూ ఒక కత్తికి
అటూ ఇటూ రెండంచులు
నే మాత్రం రెండంచుల
సాము చేయగలను

'పునర్నవం', 214.

అని తమ కాలాతీత దృక్పథాన్ని వెల్లడించారు. గతమే జీవితమనుకుని ''వెనక్కి నడిచేవారి'' ని ''గతమంతా బాదికుప్ప'' అనుకునే ముందుజ్ఞ భావి కాలదర్శులని అసంపూర్ణ తత్త్వవేత్తలుగా నిర్ణయిస్తూ

గతాన్ని కాదనలేను
వర్తమానం వద్దనబోను
భవిష్యత్తు వదులుకోను
కాలం నాకంఠమాల

'నాపేరు ప్రజాకోటి', ''పునర్నవం'', 215.

అని తాము కాలత్రయాన్ని ఒకసూత్రాన బంధించే సమ్యక్ దృష్టిగా చిత్రించుకున్నారు. ఈ దృష్టిలో పరిశీలిస్తే డా.దాశరథి వర్తమానాన్ని ఒకటే నమ్ముకున్న ఉమర్‌ఖయ్యాం లాంటి వంటి కవులకంటె భిన్నంగా, ఉదాత్తంగా కనిపిస్తారు. ఓరుగల్లు కోటలో ముష్కరులు వికలంచేయగా మిగిలిన శిల్పాలని ''రాతిపూలు'' అనే ఖండికలో సజీవసౌందర్యభామాలుగా భావించి వాటి రంగు, రుచి, వాసనలని తామనుభవించడమే కాకుండా తమ కవితద్వారా పాఠకులకికూడా అనుభవైకవేద్యం చేశారు. ఆ శిలలు శయ్యలై, దిండులై అమరిన అనశ్వర సౌందర్యాలని, శిశిర కాలరంపానికి తెగిపోని ''వసంతదివ్య సుమ జాలములు''ని కవి చిత్రించారు. అవి

శబ్దముట్టుల శాశ్వతములు
శతాబ్దముల కనశ్వరములు

'పునర్నవం', 255.

అని నశ్వరులైన శిల్పులు చెక్కిన శిల్పాలు అనశ్వరాలని అంటూ అవి భూత భవిష్యత్కాలాలని కలిపే శాశ్వత సత్యాలుగా కవి చిత్రించారు. శిల్పాలు కాలం అనంతత్వాన్ని సూచిస్తాయని కీట్సు వెలువరించినభావం ఈ సందర్భంలో కవి మనసులో కదలాడి ఉండవచ్చు.[7] ''అమృతాభిషేకం'' రచించిన నాటికి దాశరథి

---

6. 'Unborn tomorrow and dead yesterday
why fret about them if today be sweet.'
Rubaiyat of Omar Khayyam of Naishapur, Translated by FitzGerald, Stanza 37, Ll.147-148

7. Keats,
'Ode on a Grecian Urn'లో గ్రీకుల పాత్రలమై ఉన్నచిత్రాలు ఆ చిత్రకారులు అంతరించినా అవి శాశ్వతాలని ఇలా వర్ణించారు.

Bold lover, never, never, canst thou kiss,
Though winning near the goal - yet do not grieve;
She cannot fade; though thou hast not thy bliss,
Forever wilt thou love, and she be fair.

Stanza 2, Ll. 17-20.

తాత్త్వికదృష్టి పరిణతిపొంది ఆయన తమ అనుభవాలని ఆలోచనతో రంగరించి జీవిత తత్త్వాన్ని ఆవిష్కరించిన తాత్త్వికునిగా కనిపిస్తారు. ప్రకృతి ప్రదర్శించే వివిధ రూపాలని పంచేంద్రియాలతో అనుభవించడమేకాకుండా వాటి వెనక ఉన్న వేదాంత సత్యదర్శనాన్నికూడా చేసుకోగలిగారు. ఈ కవితావస్థలో ఇటువంటి ఉన్నత సత్యాలని వెలువరించేది ''దాశరథి అంతర్వాణి'' అని ఒక సమీక్షక విమర్శకులు[8] వెలువరించిన అభిప్రాయం సత్యదూరం కాదు. ''సుప్రభాతం'' అనే ఖండికలో సూర్యోదయాన్ని ''ఒకడు ఉదయాద్రి బుజమెక్కి నవ్వగా / భూదివమ్ములు వెలుగుపూలు పూసినట్లు ''చిత్రిస్తూ చీకటిని సూర్యకిరణాలు పారద్రోలడం చీకటిపై వెలుతురు విజయంగా మాత్రమేకాకుండా తాత్త్వికదృష్టితో ''గుండెలోపలి తమోగుణము''ను హరింపచేసేశక్తిగా చిత్రించారు. ''తామసి'' అనే ఖండికలో చీకటి సంప్రదాయానుసారంగా అజ్ఞానానికి సంకేతంగాకాక అందానికి ఆలంబనంగా, అందానికి సంకేతంగా దర్శనమిచ్చింది. 'ఇరుల కన్న అందమెచట కానగరాదు' అని కవి స్పష్టీకరించారు. ఈ మానసికస్థితిలో కవికి కానుగుచెట్ల నీడల్లో స్వప్నపునెజ్జలు లభించాయి. మహాంధకారంలో మనసు శాంతిని పొందగలుగు తుంది అందుకే .

> రాను భవత్ కమనీయ కాంతి సౌ
> ధానకు, నన్ను పిల్వకుము తన్వి!

'అమృతాభిషేకం', 294.

---

8. ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం, శ్రీ దాశరథి కవితాలోకం, ''అమృతాభిషేకం'', పుట, XII.

అని తమ అంతర్నేత్రంతో బాహ్యప్రకృతి అంతరాలని దర్శించిన దాశరథి ద్రష్టగా ఈ సందర్భంలో కనిపిస్తారు. సత్యాన్ని రెండు పార్శ్వాలు నుంచి రెండు కోణాల్లో దర్శించి వర్ణించడం దాశరథి కవితలో కనిపిస్తుంది. దీపం సత్యానికి సంకేతంగా ఒక పార్శ్వం నుంచి కనిపించగా, రెండవపార్శ్వంలో చీకటి సత్యానికి సంకేతంగా కనిపించింది. ''చీకటి నది'' అనే ఖండికలో చీకటిని ''దీపాలని దిగమ్రింగెడి పాపిసుమీ'' అని వర్ణిస్తూ, చీకటి శిల్పి ఉలిముక్కుల బలముతో ప్రతిమ చేయగా ఆ చీకటి శిల నది అయిందని, ఆమె అందాలకి అందరూ వందే అంటారని ఆమె చీకటి అందాన్నికూడా కవి చిత్రించారు. ''చేతనాజ్యోతి'' అనే ఖండికలో జ్యోతిని ''జాళువా మెరుగు లొలెకెడి జ్వాలిక''గా బాహ్యజ్యోతిగా మాత్రమేకాక ''అంతరంబైన కాంతినీయగల'' అంతర్జ్యోతిగాకూడా కవి దర్శించ గలిగారు. చీకటిని అభిమానించినట్లుగానే కవి మానవుల్లో నలుపురంగుని కూడా అభిమానించి మిసిసిపీ విశ్వవిద్యాలయంలో మొదటిసారిగా పట్టా నందుకున్న జేమ్స్ మెరిడిత్ అనే నీగ్రో యువకుణ్ణి ''నీలమణి'' అని సంబోధిస్తూ,

నలుపులోంచి నవనాగరకత ఉద్భవిస్తున్నది
నలుపులోంచి వెలుతురు వికసిస్తున్నది

'నేలిరవ్వ', ''కవితాపుష్పకం'', 435.

అని ప్రకృతికి అసహజమైనా ''తమసోమా జ్యోతిర్గమయా'' అనే ఉపనిషద్వాణికి ప్రతిధ్వని అనిపించే తాత్త్విక సత్యాన్ని కవి వెలువరించారు. మానవప్రతాపం క్షణికమయిందని కాలచక్రపరిభ్రమణంలో అహం నిలిచేది కాదని తమ తాత్త్విక చింతనని తెలియచేస్తూ, హేమంతఋతువులో చెట్ల ఆకుల్ని రాల్చడం దుశ్శాసన తుల్యులైన మానవులు మానవతుల దుకూలాల్ని ఊడ్చడంగా భావించి వసంతాగమంతో చెట్లకి మళ్ళీ క్రొత్తవసనాల వసంతం వస్తుందని కవి వ్యక్తంచేశారు. ప్రకృతి పాలముందు మానవుల అహంకారం అతిదుర్బలమై చెల్లాచెదరై పోతుందని కవి భావించారు. ఋతుచక్ర నిరంతర పరిభ్రమణం వీరికి ప్రకృతిశక్తుల శాశ్వతత్వానికి సంకేతంగా కనిపించింది. ఈ ఋతుచక్రం

లయ మన్నది లేదని
జయమన్నది కలగని

'విశ్వమానవ విజయగీతిక', ''తిమిరంతో
సమరం'', 59

అప్పంగా, గుప్తంగా, సంక్షిప్తంగా తెలియచేస్తున్నట్లు కవి వివరించారు. ''తిమిరంతో సమరం'' అనే కవితా సంకలనంలో పరిణతమైన మనసుతో డా.దాశరథి ఆత్మావలోకనం చేసుకోవడం కనిపిస్తుంది. ''కోఽహం'' అని తమని తాము ప్రశ్నించుకుని, తమనితాము తెలుసుకోడానికి చేసే ప్రయత్నంలో ప్రకృతిని తాత్త్వికదృష్టితో దర్శించడం కనిపిస్తుంది. తాను స్థిరత్వానికి సంకేతంగా భావించుకుంటూ తాను

కదలని కరకు రాతికొండలా
ఎన్నటికైనా ఎదిరించే గుండెలా

'తిమిరంతో సమరం', 69.

ఉన్నానన్నీ, సముద్రం ఉవ్వెత్తు కెరటాలతో అనంత చైతన్య మూర్తిగా కనిపిస్తోందని కవి చిత్రించారు. తన నిశ్శబ్దంతో సముద్రపు భీకరశబ్దాన్ని ఓడిస్తానని తెలియ చేశారు. తనకి స్వభావతః నిశ్చల జీవితంమీద అభిమానముందనే సత్యాన్ని

కదలని మెదలనిభూమి
కోవెలలో మూలస్వామి 69.

అనే పాదాల్లో తెలియచేశారు. తాను భూమిలా జీవించాలని నానాబాధలు పడతానని కాని తనహృదయం సాగరమై పొంగిపొరలుతుందని వాస్తవంనుంచి ఆదర్శగగనంపైకి విస్తరించాలని ప్రయత్నిస్తుందని కవి వెల్లడించారు. ఉన్నదానికి ఉండవలసిన దానికి మధ్య సమన్వయాన్ని సాధించడానికి తను వ్యక్తిత్వం ప్రయత్నం చేస్తుందని, నిశ్చితమైన ధరణిని వాస్తవానికి, ఉప్పొంగేజలధి ఆశయసాధనకి జరిగే నిరంతరకృషికి ప్రతీకలుగా కవి ప్రయోగించారు. ఒక్కొక్కసారి తాను కన్నకలలు కల్లలుకాగా, తానుఊహించిన భవిష్యద్దేవత వర్తమాన రాక్షసిగా అవతరిస్తోంటే తాను నిస్సహాయునిగా నిలబడతానని కవి తెలియచేశారు. కవి ఉన్నత ఆశయ శిఖగాలని అధిరోహించలేకపోయినా ఆ ఆదర్శాలని అందుకోడానికి చేసేప్రయత్నం కవి ఆత్మోన్నతాన్ని సూచిస్తో

> To try something you cannot do because it is
> too much (to hope for), but still to try it
> and fail - then try it again - that to me
> is success[9]

అన్న ప్రఖ్యాత అమెరికన్ రచయిత William Faulkner మాటలనిజ్ఞప్తికి తెస్తోంది. కవి తమ భౌతిక పరిశీలనకి ఆలోచనాలోచనాలు జోడించిన డా. దాశరథి 1975 లో ''ఆలోచనాలోచనాలు'' అనే సంకలనంలో తమ ఆలోచనల పర్యవసాయిగా కొంత తాత్త్విక దృష్టిని ప్రదర్శించారు. ప్రకృతిని తమ ''ఆత్మాన్వేషణ''కి దోహదకారిగా భావిస్తూ కవి

> నన్ను నేనే వెతుకుతున్నా నిన్నినాళ్ళు
> వలయునాత్మాన్వేషణకు నీరెండుకళ్ళు

'ఆలోచనాలోచనాలు', 26.

అని ప్రకృతిని మొదట తనకి సహాయంచేసే నెచ్చెలిగా భావించి తరువాత ఆమెని ఆరాధ్య దేవతగా భావిస్తూ ''నీకళ్ళు వెతికితి కానబడె నీరెండు కాళ్ళు'' అని తమ తాత్త్విక చింతన పొందిన పరిణామాన్ని కవి సూచించారు. ప్రకృతికి తనని తాను అర్పించుకుంటు బాష్పముక్తాఫలాన్ని ఆమెకి తెచ్చానని, ఊపిరిదారాలతో హారాలు

---

9. William Faulkner, "Far at Nagano", P.3.

గుచ్చానని, తనురుధిర కణాలని ఆమె పావురాణిమకి కానుకగా ఇచ్చానని వర్ణించారు. తనని తాను తెలుసుకుని ఆత్మదర్శనం పొందడానికి ప్రకృతిమాత కరుణా వీక్షణాలు అవశ్యకం అని కవి తాను ప్రకృతి ఆరాధకునిగా, ప్రకృతి ఒడిలో పసిపాపగా వర్ణించుకున్నారు. ''అంతర్దర్శనం'' అనే ఖండికలో ప్రకృతి అందాలని కళ్ళలో దర్శించి నాటివెనకఉన్న తాత్త్విక సత్యాన్ని గ్రహించి ''ఈ బొమ్మలు అజంతా బొమ్మలు'' అని ముందు వాస్తవికతని తెలియచేస్తూ,

పాలరాతి విగ్రహాలు
వేరినుండి నేర్చుకోవాలి నిగ్రహాలు

'ఆలోచనాలోచనాలు', 50.

అని ఆ విగ్రహాల భౌతికమైన అందాల వెనకఉన్న గాంభీర్యాన్ని, నిగ్రహాన్ని కవి దర్శించారు. ఈ దర్శనం ఆత్మదర్శనంగా పర్యవసించి కవికి అంతర్దర్శనాన్ని కలిగించింది

ఎవరికి వారే నిజానికి ఆదర్శం
అందరికీ కావలసింది అంతర్దర్శనం

'ఆలోచనాలోచనాలు', 51.

అని భౌతిక వాస్తవచిత్రం తాత్త్విక అవగాహనకి సహాయకారి కాగలదని కవి వివరించారు.

మానవతా పతాకని ఎగరవేస్తూ ''ధ్వజమెత్తిన ప్రజ'' (1981) అనే కవితా సంకలనంలో ప్రజల ఆశయాలని, ఆవేదనని సానుభూతితో రూపకల్పన చేసిన దాశరథి ''హృదయ కమలం'' అనే ఖండికలో నరుని ఉరములోని నవహృదయాన్ని'' దర్శించి

సృష్టించే సమయాన దైవం కుమ్మరి
సృష్టించిన తరువాత అతడే కమ్మరి

ధ్వజమెత్తిన ప్రజ, 1.

అని త్రిమూర్త్యాత్మకమైన భగవచ్ఛక్తి సృష్టికారకంగాను, స్థితికారకంగాను చిత్రించారు. కమ్మరి లోహాన్ని అగ్నిలో వేడిచేసి రూపాంతరాభ్యుదయాన్ని కలిగించి నట్లుగా మానవహృదయాన్ని కష్టాల కొలిమిలో వేడిచేసి భగవంతుడు వినూత్నస్ఫూర్తిని కలిగిస్తాడనే తాత్త్విక సత్యాన్ని

గుండెఅనే ఈ కొలిమి
మండు తుంటానే బలిమి

ధ్వజమెత్తినప్రజ, 1.

అని తెలియచేశారు. నశ్వరమైన జీవితానికి శాశ్వతత్వాన్ని ప్రసాదించే సత్కవిత్వానికి హృదయం అవసరమని, చైతన్యస్ఫూర్తి మంతమైన హృదయం ''మానవ జీవన నవనవ్ర స్రోత, జీవులపాలిట నేత'' అని కవి అభివర్ణించారు.

''అదృశ్య కావాలు'' అనే ఖండికలో భౌతిక చక్షువుకి కనిపించని అనంత సత్యాలని దర్శించేందుకు మనోనేత్రం తెరవాలని కోరుతూ ''కనిపించిందంతా సత్యంకాదు'' కనిపించని దంతా అసత్యమూకాదు'' 72 అనే తాత్త్విక సత్యాన్ని

శ్వాస కోశంలోనీ
పవనం కనిపించదు
పసందైన మల్లెలోనీ
పరిమళం కనిపించదు

'ధ్వజమెత్తిన ప్రజ', 71.

అని తెలియచేశారు. ఇందులో ప్రకృతి సహజమైన వాస్తవాన్ని తాత్త్విక అవగాహనకి ఉపయోగించారు. ప్రకృతిని తమ తాత్త్విక దృక్పథానికి దర్పణంగా, సమన్వయశక్తిగా, త్రిమూర్త్యాత్మక భగవచ్ఛక్తిగా అభ్యుదయభావస్వరూపిణిగా డా. దాశరథి తదుచితకావ్యబింబ పరికల్పనద్వారా తమ తాత్త్విక దృక్పథ పరిణామాన్ని ప్రదర్శించారు.

## వ్యవసాయిక కావ్యబింబ ప్రదర్శనం

ప్రముఖంగా వ్యావసాయిక దేశమైన భారతదేశంలో సామాన్య ప్రజలకికూడా కొద్దోగొప్పో వ్యవసాయజ్ఞానం ఉండటం సహజం. పల్లెపట్టులో పుట్టిపెరిగిన డా. దాశరథికి ఈ వ్యవసాయజ్ఞానం ఉండటం ఆశ్చర్యంకాదు. మొదటినుంచే వీరికి రైతుమీద అభిమానం అధికంగా ఉంది. తన ప్రాణము లొడ్డి ఘోర గహనాటవులని పడగొట్టి మంచి మాగాణాలని సృజించిన రైతుదే తెలంగాణము రైతుదే'' (15) అని ఎలుగెత్తిచాటిన కవి సందర్భోచితంగా వ్యవసాయసంబంధమైన కావ్యబింబాలని తమ కవిత్వంలో ప్రయోగించారు. కృషీవలునికి భూమికి అతిసన్నిహితమైన సంబంధం ఉంటుందని, భూమిభాషని కృషీవలుడు, కృషీవలుని మూగభాషని భూమితల్లి పరస్పరం అవగాహన చేసుకో గలరని వర్ణించారు. ఈ అవగాహనతో భూమి తాను ఏనాటికైనా రైతుకే చెందుతానని చెప్పే సాక్ష్యాన్ని వినమని ప్రజని అర్థిస్తూ

మీ నాగేటి కర్రు
రుచిచూచిన
భూమితల్లి పెదవులతెరచి
చెబుతున్న
సాక్ష్యం వినండి

'సుప్రభాతం', ''రుద్రవీణ'', 132.

అని అన్నారు. ఏ మహాత్కార్యానికైనా త్యాగం అవసరం అని తెలియచేయడానికి

పంటలు సిద్ధంకానిపొలం
ఫలితానికి ముందటి త్యాగం

'మహాగీతం', ''రుద్రవీణ'', 143.

అని పల్లెసీమలో సామాన్య కృషీవలుని అనుభవక్షేత్రంలో ఉత్పన్నమయ్యే కావ్య బింబాన్ని ప్రయోగించారు. పండిన పంట ఇంటికి వచ్చి పిల్లపాపలకి దక్కేదాకా నమ్మకంలేని బడుగురైతు జీవితానుభవం కవికి ప్రత్యక్షజ్ఞానం. ఈ ఆశలో ఒక్కొక్కసారి త్యాగమే మిగిలి, ఏనాటికైనా ఆనంద ప్రదాయకమైన భవిష్యత్తుమీద ఆశని మిగులుస్తుందని కవి సూచించారు. భారతదేశంలో సామాన్యరైతులా డా. దాశరథికూడా నిరంతర ఆశాజీవి.

నాగరక దర్శనం

డా. దాశరథి పుట్టి పెరిగినది గూడూరు, ఖమ్మంవంటి పల్లె ప్రాంతాలలోనైనా, తమ రాజకీయ కార్యకలాపాలలో హైదరాబాదు చేరుకున్నాక వారికి నాగరక జీవన అనుభవం అధికం అయింది. వారి కవిత్వంమీద ఈ అనుభవాల ప్రభావం కొంత కనిపిస్తుంది. ఇదికూడా వారి ప్రత్యక్షానుభవాల వలన ఉద్బుద్ధమైన భావనలకి రూపకల్పనచేసే కావ్యబింబ పరికల్పనగా కనిపిస్తుంది.

పట్టణప్రాంతాల్లో స్థాపించబడ్డ పరిశ్రములు శ్రామిక వర్గాన్ని సృష్టించాయి. యజమానులు వారిశ్రమనిలువని గమనించని సమయంలో శ్రమ జీవుల ''ఘర్మంలో ధర్మం / స్వేదంలో ప్రసాదం'' ఉన్నాయని కవి గ్రహించి ఆ అధికారుల ధనస్వామ్యాన్ని నిరసిస్తూ శ్రమజీవులు యజమానుల దోపిడీవిధానానికి బలిఅవుతున్నారనే సాంఘిక సత్యాన్ని

నీ పిల్లల నిల్లాలిని
కిళ్ళీమాదిరి నమిలే
మిల్లు మ్యాగ్నెట్లు
నీ వేడివేడి నెత్తురుతో
షవరుబాతు తీసుకునే
భువనైక ప్రభువులు

'నిగువేప', ''అగ్నిధార'', 87.

అని ప్రదర్శించారు. దోపిడీ దారు యథార్థ వికృతరూపాన్ని ప్రదర్శించడానికి నాగరక వ్యవస్థకి సంబంధించిన కిళ్ళీలని, షవర్‌బాత్‌ని కావ్యబింబాలుగా కవి ప్రయోగించారు. వాటిప్రయోగం వలన ఈ దోపిడీ వ్యవస్థ పట్టణ ప్రాంతాలకి సంబంధించిన ద్రావ్యాలుగా స్థలనిర్దేశం చేయబడింది. ఈ సాంఘిక వ్యవస్థ నగరజీవన ఆర్థికవ్యవస్థకి సంబంధించినదని కవి ఈ కావ్యబింబాలద్వారా సూచించారు. ''శ్రామికజాతి'' అనే ఖండికలో కూడా తరతరాల దరిద్రాలు శ్రమ జీవుల జీవితాలని నాశనం చేసిన యథార్థాన్ని

విశ్వవిపణి వీధుల్లో
వ్యాపుచాల చవకయినది
బ్రతుకుకు బ్లాక్ మార్కెట్‌ధర

''అగ్నిధార'', ౮౨.

అని నాగరక జీవనంలోని వ్యాపార మనస్తత్వాన్ని విశ్వవిపణి వీధుల చిత్రణద్వారా వెల్లడిస్తూ, నాగరక జీవనంలో సామాన్య అనుభవమైన బ్లాక్ మార్కెట్‌ని దీనికోసమే కవి ప్రయోగించారు. మల్టీనేషనల్ వ్యాపార సంస్థలు ప్రపంచమంతా ఆక్రమించి అన్నిదేశాలనుంచి లాభాలు సంపాదించి తమలోతాము పంచుకున్న ఆర్థిక వాస్తవాన్ని

వ్యాపారులు ప్రపంచాన్ని
తుంచుకుని పంచుకుని
పరిపాలిస్తున్నారు ౮౨.

అని ఎంతో ఆవేదనతో కని చిత్రించారు. ''రుధిర పక్షులు'' అనే ఖండికలో కాలమనే మార్గంలో నడిచే జీవితాన్ని కారుగా చిత్రిస్తూ ఆ జీవితం కష్టాల్లో చిక్కుకున్నప్పుడు పంక్చర్ అయి గాలిపోయిన టైరులా కనిపిస్తుంది. అటువంటి కష్టాల్లో ఉన్న జీవితాలకి ఆశని తీసుకుని వచ్చే రుధిర పక్షుల్ని

కాలమార్గం
మీదనడిచే
''కారు''టైరుకు
గాలిపోసే

''రుద్రవీణ'', 137.

ఆశాదూతలుగా కవి చిత్రించారు. ''కవాటం''అనే ఖండికలో గతాన్ని జీర్ణించుకుని, భవిష్యత్తుని ఆహ్వానించే భవిష్యద్వేదిగా తనని చిత్రించుకుంటూ

గతాన్ని / విస్కీగా తాగిన
కవిని నేను!
భవిష్యత్తు నిషానిజం

''రుద్రవీణ'', 138.

అని నాగరక జీవితంలో అంతర్భాగమైన విస్కీసేవనాన్ని కవి ఈ సందర్భంలో ప్రయోగించారు. చుట్టూఉన్న చీకటిని బహిష్కరించి వెలుతురుని ఆహ్వానించి మానవజీవితంలో స్థిర నివాసం కల్పించాలని ఆశిస్తూ,

వెలుతురు సీసాలపోసి
కార్కువేసి సీలువేసి 139.

భద్రంగా ఉంచాలని కవి నగరాలలో ప్రాకింగు వ్యవస్థని దృష్టిలో పెట్టుకుని చిత్రించారు. మేలుకున్న శ్రామికశక్తి ప్రతీపశక్తుల ఆటకట్టిస్తుందని విశ్వసిస్తూ ఆ ప్రతీప శక్తుల్ని

నింగినంటు కరెన్సీ గోడలు
నేలూగుతున్న బాంబుల మేడలు

''మహాగీతం'', ''రుద్రవీణ'', 143.

అని పట్టణాల్లో కేపిటలిస్టుల కరెన్సీనోట్ల కట్టల్ని, యుద్ధోన్మాదుల బాంబుల సమీకరణని చిత్రించారు. ''ఉషస్సంధ్య'' అనే గీతికలో అభ్యుదయోదయానికి భయపడి పారిపోయిన తమస్సుని చిత్రిస్తూ

సిండికేట్లు, మాగ్నేట్లు, నేట్లు
నిరుపేదలకు మూసిన గేట్లు

'పునర్నవం', 218.

గా నాగరక కావ్యబింబాలద్వారా నగరాలలో నిరుపేదలని దోపిడీచేసే వ్యవస్థని కవి ప్రదర్శించారు. ''అమావాస్యదీపాలు'' అనే ఖండికలో మానవుడు యుద్ధాన్ని బహిష్కరించి శాంతిని అభిలషిస్తాడని తెలియచేయడానికి ''మరఫిరంగిలో / మందు ధట్టించేచోట / పిచ్చుకవెంటి నీళ్ళాడింది'' (426 ) అని

బాంబుల కంచెంబుతో
మంచి నీళ్ళు తాగుతున్నది అనాథ

''కవితాపుష్పకం'', 428.

అని మారణాయుధాలు భయాస్పదాలు కాకుండా మానవులకి మచ్చిక అవుతాయని కవి తెలియచేశారు. హింస మానవాళికి జుగుప్సాకరంగా కనిపిస్తుందని తెలియ చేయడానికి నాగరక సమాజంలో పరిచితమైన అనుభవాన్ని ప్రయోగిస్తూ,

హింస, ఇస్త్రీచెడిన బట్టలా
ఇంపు నివ్వదు మానవశరీరం మీద 429.

అని చిత్రించారు. కవి కవితాజగత్తులో విహరిస్తూ, సౌందర్యారాధన చేసే తరుణంలో సంఘంలో ఆర్థిక అసమానతలు, హింస తనని ధర్మయుద్ధానికి సంసిద్ధుణ్ణి చేశాయని తెలియచేయడానికి

వెన్ను కన్నులలో కాపురమున్న నాచే
గన్నుపట్టించిన

'తిమిరంతో సమరం', 84.

దీ హింసా జగత్తు అని చిత్రించారు. అందుకే తాను శాంతిమార్గాన్ని వదలి క్రాంతిపథాన్ని అనుసరించడం మొదలుపెట్టానని తెలియచేయడానికి

శాంతి దుప్పటీ తిరగేసి కప్పుకున్న
క్రాంతి జీవిని 85.

అని తమనితాము వర్ణించుకున్నారు. నవంబరు ఒకటిని ''మధురమంగళోషస్సు'' గా చిత్రిస్తూ, అంతోజ విభేదాలు, విషాదాలు తొలగిపోతాయని

కనిత్వాల రగుని కవ్వేసి
ఉత్సాహపు మాకాతో.....
మనసు మనం తెలుసుకునే

నవంబరు ఒకటి, ''తిమిరంతో సమరం'', 94.

రోజుగా దినాల్ని కవి చిత్రించారు. ఆధునిక జీవితంలో ధనానికి పెరిగిపోతున్న విలువని విమర్శిస్తూ

నోటు జేబులోలేనిది
హోటల్లో చోటులేదు
పైస జేబులో లేనిది
బస్సుల్లో చోటులేదు

'మనిషి-మనీ-షనీ',
''తిమిరంతోసమరం'', 106.

అని మనిషికి విలువ రావాలని ''మనీ'' విలువ తగ్గాలని కవి ఆశించారు. ''గజదంత గోపురం'' అనే ఖండికలో ''కార్మికులు గలపురం కవికి అంతఃపురం'' అని తెలియచేస్తూ, ఆ అంతఃపురాన్ని మన కళ్ళముందుంచారు. పెద్ద పొగగొట్టాలు వేదలకి చుట్టాలని చెప్తూ

ఆధూమ పటలాలు
బాధితుల నిటలాలు

ఆలోచనాలోచనాలు, 37.

అని శ్రమజీవుల దైన్యాన్ని చిత్రిస్తూ, మరుగుదొడ్లైనా లేని నగరప్రాంతాలని చిత్రిస్తూ

మరుగులేని జనాళి
మురుగు కంపున కేళి
చేరనోచని పడుచు
సిగ్గు సైట్టుల మరచు? 37.

అని అత్యంత యథార్థంగా నగర వాతావరణాన్ని అందులో మురికి వాడల మురుగు కంపుని నిర్మొహమాటంగా ప్రదర్శించారు. భాగ్యనగరంలో విలాస మందిరాల్లో పరపురుషుల ఆనందానికి అంకితమైన మగువని చిత్రిస్తూ

''మళ్ళీమోగిన సంజీరం'' అనే ఖండికలో రసికులని, అరసికులని అందరినీ

> పరవశింపచేసే సజీవయంత్రం ఆమె
> అయినా ఆ యంత్రంలో
> మనసును మంత్రముగ్ధులని చేసే తంత్రంఉంది
>
> ''ఆలోచనాలోచనాలు'', 42.

అని ఆమెని హృదయం కోల్పోయిన యంత్రంగా కవి చిత్రించారు. ఉగాదితో ప్రారంభంఅయిన కొత్త సంవత్సరాన్ని సూచిస్తూ ''పూలలోగిలి ముళ్ళకౌగిలి'' అనే ఖండికలో

> గడియారం కంటిలో
> నడిరేయి ఫాల్గుణం ఆఖరుం జాము, రెండు ముళ్ళు
> కౌగలించుకోగా జలదరిస్తుంది ఒళ్ళు
>
> 'ఆలోచనాలోచనాలు', 46.

అని అర్ధరాత్రి పన్నెండుగంటల సమయాన్ని గడియారం కంటిలో రెండు ముళ్ళు కలుసుకున్న క్షణంగా కవి వినూత్నంగా చిత్రించారు. నూత్నవత్సరోదయాన్ని వినూత్నంగా చిత్రిస్తూ ఆ సమయంలో ''నవ వత్సర సౌధ కవాటాన్ని తెరచి నప్పుడు ప్రభాతకిరణం తాళంచెవి చప్పుడు '' మనకి కవి వినిపింపచేశారు.

''జ్ఞాపకాల రూపకాలు'' అనే ఖండికల్లో కవి తమజ్ఞాపకాలకి రూపకల్పన చేస్తూ కొన్ని సందేహాలని, నాటికి సమాధానాలని తానే కూర్చుకుంటున్న తను అవస్థని

తాగి దేవుడికి టెలిఫోన్‌చేస్తే
తాగుబోతు, తానే సవాళ్ళు వేస్తాడు
తానే దేవుడి తరఫున జవాబులు చెబుతాడు

ధ్వజమెత్తినప్రజ, 87.

అని నాగరక ప్రపంచంలో పరిచితమైన టెలిఫోన్‌ని ఉపయోగించుకున్నారు. యుద్ధోన్మాదం వల్ల నాగరకత నశించి బర్బరత్వం పునరావృతం అవుతోంది. అనే ఆవేదనని ''జాతీనిర్ణయనాలు'' అనే ఖండికలో కవి

దూరాన బాంబుల కంచెంబులు
నాగరకతా సోపానం ఒక్కొక్క మెట్టుమీదనుంచి
జారిపడి
బర్బరత్వపు ఆవరణలో పేలుతున్నాయి

తిమిరంతోసమరం, 39.

అని అతిసహజమైన గృహ వాతావరణాన్ని చిత్రిస్తూ, ఆ వాతావరణానికి నేటి యుద్ధోన్మాదం చేస్తున్న కువ్యాఖ్యానాన్నికూడా కవి సూచించారు. మనసుని ఉత్తేజపరచలేని భవిష్యత్తుకు స్వాగతం చెప్పలేనని తెలియచేస్తూ, ఆ భవిష్యత్తుని నాగరక జీవుల అనుభవాలకి సంబంధించిన కావ్యబింబాలద్వారా

రోగిని రాగిని చేయలేని నర్సులా
రేసులో గెలుపొందలేని హార్సులా
కళకళలాడని ఖాళీపర్సులా

తిమిరంతో సమరం, 43.

ఉందని కవి చిత్రించారు. వర్తమాన కాలానికి ఏవిధంగానూ సరిపడని ఫ్యూడల్ వ్యవస్థని నిరసిస్తూ, చైతన్యవంతమైన శ్రామికశక్తిని అభిమానిస్తూ

గడియారం నడవని
పాతకోట గోడకన్న
సూర్యుణ్ణి ఉరికించే
ఫ్యాక్టరీ కూత మిన్న

'రాజీనగీతం', ''తిమిరంతో సమరం'', 49.

అని పనిచేయని గడియారాన్ని పాతవ్యవస్థకి, ఫ్యాక్టరీకూతని సూర్యునికే చైతన్యాన్ని కలిగించగలిగే శ్రామిక శక్తికి సంకేతాలుగా కవి ప్రయోగించారు. ప్రణయక్రీడని వర్ణిస్తూ, ఆనాడు కాళిదాసు నీలమేఘం కొండని చుట్టేసుకుంటే నీలకనబడక కొండ శిఖరం ఎగిరిపోతోందని అమాయక సిద్ధాంగనలు భయపడి తమ ప్రియులని ఆలింగనం చేసుకున్నారని అంటే ఆధునిక నాగరక జీవనానికి అనుగుణంగా

వేగంగా వెళ్తేస్కూటరు హఠాత్తుగా
ఆగిపోయేసరికి, యాక్సిడెంటని భ్రమపడి
పిలియన్ మీద కూర్చున్న పిల్ల
సీటుమీద నేటుకాణ్ని వాటేసుకుంది

'ఆలోచనాలోచనాలు', 92.

అని అతిసహజంగా కవి చిత్రించారు.

వైజ్ఞానిక కావ్యబింబ దర్శనం

ఆధునిక యుగంలో ప్రతిమనిషి తాను స్వయంగా విజ్ఞానవేత్త కాకపోయినా వైజ్ఞానిక, సాంకేతిక ప్రభావాలకి లోనుకాక తప్పదు. తనచుట్టూ ఉన్న వైజ్ఞానిక వాతావరణంచేత ప్రభావితులైన ఆధునిక కవులు తమ కవిత్వంలో వైజ్ఞానిక, సాంకేతిక విషయాలని ప్రధానంగాకాని, సూచనాప్రాయంగా కాని స్వీకరిస్తున్నారు. స్టీఫెన్‌స్పెండర్ అనే ఆంగ్లకవి ''దిఎక్స్‌ప్రెస్'' అనే కవితలో ఎక్స్‌ప్రెస్ రైలుబండిని ప్రధానప్రతీకగా ప్రయోగిస్తూ మానవజీవితాన్ని వ్యాఖ్యానించారు. డా. దాశరథి తమ కవిత్వంలో సందర్భోచితంగా సాంకేతిక కావ్యబింబాలు ప్రయోగించారు. ఈ ప్రయోగం వారివైజ్ఞానిక శాస్త్రస్పృహని వెల్లడించడంతోపాటు తమ అనుభవానికి స్పష్టమైన, ప్రతిభానంతమైన రూపకల్పన చేయడానికి కూడా ఉపకరించింది. పీడిత జనావళికి తాను ప్రతినిధిగా నిలబడి వారి బాధలని అందరికే వినిపింపచేస్తానని తెలియచేస్తూ

వాణికి ''మైక్'' అమర్చి అభ
వాదులకున్ వినిపింప చేసెదన్

అరత్నాదము, ''అగ్నిధార'', 80.

అని సాంకేతిక సంబంధమైన ''మైక్''ని ఉపయోగించారు. ''రుధిరదీపిక'' అనే ఖండికలో విశ్వ శ్రామికమూర్తి నరనరాలలో ప్రవహించే నయాగరా, జంఝాపాత రుధిరజలపాతధారల్లో నిబిడీకృతమైన అనంతశక్తిని విద్యుచ్ఛక్తిగా

జగాన్ని వెంచిన
దేవుళ్లను దెయ్యాలను మించిన
అరుణారుణ విద్యుద్దీపిక

''రుద్రవీణ'', 147.

గా కవి చిత్రించారు. ''కిరణ శకలం''అనే ఖండికలో తమమనసులో భవిష్యత్తు మాట కవికి ''జలప్రపాతంలో వినబడు విద్యుత్ గుసగుసవలె''వినిపించింది. మనిషిని దేవతగామార్చిన చైతన్యశక్తి కవికి''కోతిని మనిషిగా తొలిచిన / కాస్మిక్-రేడియేషన్ / బలంగా'' కనిపించింది. అభ్యుదయభావభరితమైన తమ కవిత్వ ఛందస్సు ''విద్యుచ్ఛందస్సు''అని ఆ కవిత్వంలో ''ఎక్స్ కిరణం హృదయాంత స్సులని శోధిస్తుంది'' అని తమ కవిత్వపు పటుత్వాన్ని వెల్లడించారు. పల్లెవాని గుండెల్లో నిబిడీకృతమైన తిరుగుబాటు తత్వాన్ని చల్లని నీళ్లలో జలవిద్యుత్తుగా కవి చిత్రించారు. ''యుగాంతర రేఖలు''అనే ఖండికలో మానవుని జగద్వ్యాప్తి కాంక్షని ఒకమహాసర్పంగా వర్ణించి, ఆ ఆకాంక్ష కొరియా అనే బొరియలో ఇరుక్కు చచ్చిందని, దానికి కారణాలని పరిశోధించే సందర్భంలో వైద్యశాస్త్ర బింబాలని కవి ప్రయోగించారు.:

అప్పుడు పాథాలజిస్టులు వచ్చి
అకస్మాత్ మృతుని డొక్క చీల్చి
ఏదో పెద్ద కెమికల్ ఔట్‌రేజ్
జరిగిందని ప్రకటిస్తారో కవులే

'పునర్నవం', 229.

ఈ కాంక్ష డాక్టర్లకి అర్థమయ్యే వ్యాధికాదని క్షయ అవరిస్తే తెలియక ''న్యూనల్‌కార్డ్'' బాగుందని డాక్టర్లు లోకేమనుస్తారని వివరించారు. సంపన్న దేశాలనుంచి భారతదేశం వేస్తున్న అప్పుదేశం ఆరోగ్యానికి మంచిదికాదని భావిస్తూ

అలాగే తెలియని పాడుజబ్బు
అప్పుఇవ్వబడుతున్న డబ్బు 229.

అని 1961లో వ్యక్తంచేసిన భయం 1982లో అంతర్జాతీయద్రవ్యసంస్థనుంచి పెద్దఎత్తున అప్పుతీసుకుంటున్న సమయానికికూడ వర్తిస్తుందని భావించవచ్చు. వర్గసంఘర్షణ, సిద్ధాంత సంఘర్షణ జాతికి ప్రళయాన్ని తెస్తుందని తెలియ చేయడానికి

న్యూట్రాను జోరుగా తగిలి
యురేనియం పరమాణువు పగిలి
కిరణాలు చిమ్మితే ప్రళయం 230.

అని పరస్పరం సంఘర్షించేశక్తుల్ని న్యూట్రాను, యురేనియం పరమాణువులుగా కవి చిత్రించారు. ఈ వర్గ సంఘర్షణ జరిగినప్పుడు ఉద్భవమయ్యే అనంతశక్తిని

నిజాలు నిట్టూర్చిన నాడు
బుజాల బరువు ఓర్చిన నేడు
తప్పక ఢీకొంటై న్యూట్రాన్లు
తలలుపైకెత్తుతవి ప్రాణులు 230.

అని సూచించారు. ఈ న్యూట్రాన్ల సంఘర్షణ వలన అనంతశక్తి విముక్తమైన జగత్తులో ఒక కొత్తతరం ప్రభవిస్తుందనే విశ్వాసాన్ని

ఇదే నాసిసలైన ''విజన్''
ఇది శాస్త్రజ్ఞుని ''న్యూక్లియర్‌ఫిషన్'' 230.

అని ప్రతిభావంతమైన వైజ్ఞానికశాస్త్ర సహాయతో చిత్రించారు. ''మస్తిష్కంలో లెబొరేటరీ'' అనే ఖండికలో తన ఇంటివెనక అంటే భూతకాలంలో షాజహాను కీర్తి, వైయాకరణి సమాధి, దుష్ట నృపతుల కఠినశాసనాలు కనిపించగా,

భవిష్యత్తులో లెబొరేటరీ, వెన్నెల ముక్కలో ఉన్న ''జగత్తుకు ప్రాణం ప్రసాదించిన కార్బన్ పరమాణువు'' అని కవి దర్శించారు. సూర్యునిచుట్టూ పరిభ్రమించే సౌర కుటుంబాన్ని.

> న్యూట్రల్ న్యూక్లియస్ చుట్టూ చాంద్రాయణంచేసే ఆరు ఎలక్ట్రానులు
> సూర్యతేజ రాశిచుట్టూ శని, గురువు, మంగళుడు మరొకడు
> వాళ్ళవెంట భూమితల్లి ప్రదక్షిణం చేసినట్లు
>
> పునర్నవం, 240.

గా కవి చిత్రించారు. సౌరకుటుంబాన్ని ఎలక్ట్రాన్ ఆర్బిట్‌లో పోల్చడం భౌతిక శాస్త్రంలో పరిపాటి. ఆరు ఎలక్ట్రాన్లు నవగ్రహాలలో ఆరుగ్రహాలని సూచిస్తాయి. ఆ గ్రహాలతో భూమి తల్లికూడా ప్రదక్షిణం చేస్తుంది అని చెప్పడంవలన ఎనిమిది గ్రహాలు సూర్యునిచుట్టూ తిరగడం సహజం. వైజ్ఞానిక శాస్త్రంలో ఎనిమిది ఎలక్ట్రాన్లు ఉంటే అది స్థిరస్వరూపం (stabl configuration) అవుతుందని శాస్త్రజ్ఞులు తెలియచేశారు. అలాగే భూమి కాకుండా ఎనిమిది గ్రహాలు సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తుంటే అఖిల విశ్వం గతితప్పని గ్రహ భ్రమణంతో నిలనిల్చుతుంది. ఆరు ఎలక్ట్రానులు అనడంకంటె ఎనిమిది ఎలక్ట్రానులు అంటే ఇంకా శాస్త్రసమ్మతంగా ఉండేది. శాస్త్రజ్ఞులు తమ విజ్ఞానాన్ని మానవ ప్రగతికి ఉపయోగించాలని ఆశిస్తూ

దూకి దూకి ఈ జలపాతం
ప్రాకించ నేప్పెకిప్పెకి విద్యుద్వల్లీమతల్లికలను-
సన్నని ఇసుక కణం పరీక్షించి
జగజ్జాతకం వ్రాయించనే శాస్త్రజ్ఞులను 242.

అని బోధిస్తూ తమ విజ్ఞానాన్ని ప్రపంచ వినాశనానికి వినియోగించవద్దని అర్థిస్తూ

నిశ్శబ్దంగా నిద్రపోయే
నిరపరాధి పరమాణువు
డొక్కచించి డోలుకట్టి
ప్రమాదాలు తేబోకు 243.

అని పరమాణు విచ్ఛేదం తెచ్చిపెట్టిన ఉపద్రవాన్ని కవి సూచించారు. కోతినుంచి మనిషిగా పరిణామంచెందే మనిషి ఇంకా మానవునిగా పరిణామం పొందలేదని ఆవేదన చెందుతూ కవి

డార్విన్ బయాలజీల ' పరిణామాల పట్టిక
పదియోజనాలంత వున్నా
మానవుడు మానవుడయ్యేకాలాన్ని
నిర్దేశించగల ప్రదేశం కానరాదు 244.

అని చిత్రించారు. ఈ జీవితం సుఖప్రదంగా ఉండాలి అందుకోసం ''మెతుకులలో ప్రోటీనులు'' మిక్కిలిగా రావాలి అని ఆశిస్తూ, అటువంటి కార్యక్రమాన్ని చేబట్టే మేధావుల మస్తిష్కంలో వెలిగే ''రసరాజ్యం లెబొరేటరీ''అని కవి సృష్టించేశారు. తాము చుట్టూ ఉన్న లోకాన్ని దర్శించి పతిత ప్రజల బాధలని, మనుష్యమేధంచేసే హోమకుండాలని దర్శించి భవిష్యద్వేదియై చివరికి పతితప్రజల విజయాన్ని దర్శించ గలనని ఆశని వ్యక్తంచేశారు. ఆ ఆశని ''నావియక్షు - కిరణాల కళ్ళేమో'' ( 253 ) అని సాంకేతిక కావ్యబింబాన్ని ప్రయోగించి తమ సూక్ష్మదృష్టిని వ్యక్తం చేశారు. ''జ్యోతిశ్చక్రం ''అనే ఖండికలో వంచనాపరులు మాటలకి వేరువేరు అర్థాలు కల్పిస్తూ, ఇతరులని మోసగించే ప్రయత్నాన్ని ఆత్మవిశ్వాసంగల మానవులు హర్షించరు అనేవిషయాన్ని తెలియచేయడానికి ఎలక్ట్రానిక్స్ శాస్త్రంలో పదాలని ప్రయోగిస్తూ,

కొత్త నిర్వచనాలు ''ట్రాన్స్‌మిట్''చేసే
నేటి కపటుల పిరికి గుండెశబ్దం
''రిసీవ్''చేయలేని మన చెవులు

పునర్నవం, 256.

అని చిత్రించారు. పదాలకి వేరు అర్థాలని (విపరీతార్థాలని) సూచింప చేసే ప్రక్రియని జార్జి ఆర్వెల్ ("Double think") అని వ్యవహరించాడు. అటువంటి 'ద్వంద్వభావన'ని కవి ఇక్కడ సూచించారు. పాశ్చాత్యదేశస్థులు

ఆసియాప్రజలని తమ రాజకీయ కుట్రలకి బలిచేయడాన్ని నిశితంగా విమర్శిస్తూ

పాశ్చాత్యుల రాజకీయాల
ఎక్స్‌పెరిమెంటుక్కై పెంచిన
''గినీపిగ్స్''లా ప్రజలు! 264.

అని మానవులని పరిశోధనశాలల్లో ఉపయోగించే జంతువులతో పోల్చి తమ బాధని వ్యక్తంచేశారు. ఇదేబాధని వెల్లడిస్తూ కవి ''పడమర వాళ్ళ విషపు దోమలు'' (265) అని చిత్రించారు. మన జీవన విధానం దారితప్పింది, కూలడానికి సిద్ధంగా ఉంది అని తెలియచేయడానికి

మనది డిరైయిల్ అవుతోన్న పొగబండి 270.

అని చిత్రించారు. తమ ''ఆశాసౌధం''లో 'ఈనాటి ఆశాగేతికి / భవిష్యత్తు ప్రతిధ్వని / ఈనాటి నెగెటివ్‌కి భవిష్యత్తు పాజిటివ్' (311) అని ఫోటోగ్రఫీకి సంబంధించిన కానబింబాన్ని ప్రయోగిస్తూ రేపు నేటికి ప్రతిరూపం అనే భావానికి మాటల బొమ్మకట్టారు. కవితా పుష్పకాన్ని వర్ణిస్తూ

ఏకత్వం అనే పెట్రోలుతో ఎగురుతుంది ఆ విమానం
ఏకత్వం చెడిపోయిననాడు అదికూలుతుంది

కవితాపుష్పకం, 412

అని తమ విధానం ప్రత్యేకతని కవి తెలియచేశారు. అనురాగంతో కాక అధికారంతో ప్రకృతిని శాసించాలని ప్రయత్నించే శాస్త్రజ్ఞుని దాశరథిగారు నీరోతో పోల్చారు. అతడు ''బ్రహ్మాండం అంతా పట్టేసిన నెంబదిస్తుఆనాడు'' (423) అని శాస్త్రజ్ఞుల అహంకారాన్ని పోషణచేస్తూ, మానవునికి కావలసింది శాస్త్రజ్ఞానంతో పాటు ఉదాత్తభావనాన్ని కుసుమింపచేసే హృదయంకూడా అనే నిత్యసత్యాన్ని కవి వెల్లడించారు. మానవులు కాలాన్ని మోసగించే ఇంద్రజాలాన్ని విడిచిపెట్టి తమకళ్ళు తాము తెరుచుకుని సత్యదర్శనం చేసుకోవాలని బోధిస్తూ

''కాటరాక్టు'' ఆపరేట్ చేయించుకోండి
జాతికి ''రెటీనాడిటాచ్‌మెంట్'' జరిగిందా
జన్మ జన్మాలకి కళ్ళు కనపడవు

'అమావాస్యదీపాలు', ''కవితాపుష్పకం'', [illegible]

అనే వాస్తవికతని వైద్యవిజ్ఞాన సంబంధమైన కొన్నిబింబాలద్వారా వ్యక్తంచేశారు. ''తిమిరంతో సమరం'' అనే కవితా సంకలనంలో ''క్షీరసాగరం'' అనే ఖండికలో నాగార్జున సాగరాన్ని క్షీరసాగరంగా జలశక్తిలో అంతర్గతంగా ఉన్న విద్యుచ్ఛక్తిని ప్రదర్శిస్తూ

జలబిందువులో విద్యుత్
కంకణములు కలవు

తిమిరంతో సమరం, 26.

అని వర్ణించారు. 'జ్యోతిర్నయనాలు' అనే ఖండికలో ఆధునిక సమాజంలో అంతరిక్షాన్ని అంటుతున్న ధరలని వర్ణిస్తూ

ఆకాశాన్నంటిన ధరల హైడ్రోజన్ బెలూన్
మళ్ళీ నేలమీదకి ఏనాటికీ వాలదు

అని చిత్రించారు. అరణ్యభట్టుకి స్వాగతంచెప్తూ, ఆకాశావకాశలలో అరణ్యభట్టు పరిభ్రమణం

భూమినుండి వ్యోమానికి
వ్యోమంనుండి భూమండలానికి
నిచ్చెనలువేసే ఆరోగ్యం

ఆలోచనాలోచనాలు, 112.

ని దగ్గరకుతెచ్చే సాంకేతిక ప్రగతిగా కవి చిత్రించారు. దాశరథి అచ్చమైన ప్రజాకవి. ప్రజల నాడిని అర్థంచేసుకుని ప్రజాహృదయాన్ని అవగాహనచేసుకుని తను కవిత్వంలో ప్రజల ఆశలకి రూపకల్పన చేయడం దాశరథి కవిత్వాలలో సామాన్యగుణం. అందుకే ఒక విమర్శకులు వారిని "Poet of human pulse"[10] అని అభివర్ణించారు. ''ధ్వజమెత్తిన ప్రజ''అనే కవితా సంకలనంలో ప్రజా హృదయం మానవజీవిత గమనానికి మార్గదర్శకం కావాలని స్పష్టంచేస్తూ

ఇటు మాపులోంచి ప్రజా హృదయం దిక్సూచి
అటు పయనిస్తే మనకు లేదు వేచే

'హృదయ దిక్సూచి', 74.

అని సాంకేతిక కావ్యబింబాన్ని కవి ప్రయోగించారు. ధ్వజమెత్తిన ప్రజ అసమాన సాంఘిక వ్యవస్థమీద, మతకలహాలమీద తిరుగుబాటు చేస్తుందని తెలియచేస్తూ

10. డా.యస్.యస్.ప్రభాకర్, 'Duel with darkness &other poems', Introduction, 1.

ధరల ఉదజని బుడగను
''ధర''కు రానివ్వని ఆర్థిక వ్యవస్థమీద

ధ్వజమెత్తినప్రజ, ౧౧.

కూడా తిరుగుబాటుచేస్తుందని హైడ్రోజన్ బెలూన్ని ఆకాశానికి ఎగిరేధరలకి సంకేతంగా కవి మంహూరు ప్రయోగించారు. కవి తమ భానాలని క్లుప్తంగా, గాఢంగా పాఠకులహృదయాలకి హత్తుకునేలా చిత్రించడానికి సాంకేతిక, వైజ్ఞానిక సంబంధమైన కావ్యబింబాలని ప్రయోగించారు.

## పరోక్ష కావ్యబింబ ప్రదర్శనం

### పురాణబింబ దర్శనం

తన ప్రత్యక్షానుభవాల జ్ఞానం మీదేకాక పరోక్షంగా సంపాదించిన జ్ఞానం మీదకూడా ఆధారపడి దాశరథి కావ్యబింబపరికల్పన చేశారు. ఇటువంటి పరికల్పనకి కవి చదివిన పురాణాలు, ప్రబంధాలు, చారిత్రక గ్రంథాలు మాత్రమే కాక ఆయనపెరిగిన సమాజం, సంప్రదాయంకూడా ఉపకరించాయి. డా. దాశరథి తమ చిన్నతనంలోనే సంస్కృతకావ్యాలని సంప్రదాయబద్ధంగా అధ్యయనంచేశారు. ఆంధ్రసాహిత్యంలో సుప్రసిద్ధమైన ప్రబంధాలని సూక్ష్మంగా పరిశీలించారు. సంప్రదాయంకూడా వారికి చిరపరిచితమయింది. వేటి అన్నింటిప్రభావం వారి కవిత్వంలో పరోక్షకావ్యబింబ పరికల్పనద్వారా మనకి ప్రత్యక్షం అయింది. ఈ పరోక్ష కావ్యబింబ పరికల్పనలో కవి ప్రత్యక్ష అనుభవాలకి అవకాశం తక్కువ. అందుచేత వైయక్తిక భావనలకి, విశిష్ట వ్యక్తిత్వావిష్కరణకి ఎక్కువగా సహకరించవు. సంప్రదాయం కవికి అందించిన ఇటువంటి కావ్యబింబాలు ప్రతీకలుగా, కవి సమయాలుగా కవిత్వంలో స్థిరపడటం విశ్వసాహిత్యంలో తరచుగా కనిపిస్తుంది. ఇటువంటి కావ్యబింబాల ప్రయోగంవలన ఆ సమాజానికి, ఆ సంప్రదాయానికి చెందిన వ్యక్తులు ఆ ప్రతీకల సంకేతార్థాలని సులభంగా గ్రహించగలుగుతారు. ఇందువలన కవి భావాలవ్యక్తీకరణ సులభసాధ్యంగా, అప్రయత్నంగా జరగడానికి వేలవుతుంది. దాశరథి తమ కవిత్వంలో సందర్భోచితంగా పరోక్ష కావ్యబింబాలని ప్రయోగించారు.

వర్తమానానికి సంబంధించిన తమ అనుభవాలని కాలాతీతములైన పౌరాణిక కావ్యబింబాలద్వారా వ్యక్తీకరించడంవలన కవి పౌరాణిక స్పృహ విశదంకావడమేకాక, వర్తమానసంబంధమైన అనుభవాలు కాలఅవధుల్ని దాటి త్రికాలసత్యాలుగా భాసించే అవకాశంకూడా కలుగుతుంది. సాహిత్యంలో ప్రతీకలు సాధించే ముఖ్యప్రయోజనాల్లో ఇది ఒకటి

''అగ్నిధార''లో ''సంధ్యాలయమూర్తి''దివ్యమంగళస్వరూపాన్ని శృంగార అంగారాల మేళవింపుగా వర్ణిస్తూ,

నే సుకుమార పాదముల నింగి కురంగ ధరుండ వెన్నెలల్
దోసిట బోసితెచ్చి అమరుల్ పులకింపగ తానమార్చు, వి
న్యాస విలాసహాసముల నాట్యము జేసెడి నీ కరాంగుళీ
రాసములో అనంగుడు జరామరణమ్ములు దక్కినిక్కెడిన్

'అగ్నిధార', 41.

అని చిత్రించారు. కవి ఇక్కడ ఈశ్వరుని వర్ణించిన పద్ధతి ప్రబంధమార్గానుసారిణిగా ఉంది. ఇందులో వైయక్తిక అనుభవ ప్రసక్తిలేదు. అలాగే ''నటస్వామి'' నాట్యవర్ణన ప్రబంధ వర్ణనలని పోలినా

శివుని ఫాలాన వెనుకారు చిమ్ములేచి
గగన కబరీ భరమును కప్పుకొనియె
చెంగు చెంగున నెగయు సారంగమొకడు
శివ శిరశ్చంద్ర కేదార సీమదోచె

అగ్నిధార, 44.

అని ఈశ్వరుని బాహ్యస్వరూపాన్ని వర్ణిస్తూనే శివుని ఫాలంలోని కారుచిమ్ము ఆకాశాన్ని ఆక్రమించడం, సారంగం శివుని శిరస్సులో చంద్రుని నమ్మగా కనిపించడంవంటి అలంకారాలు కవి భావుకశక్తిని తెలియచేస్తాయి. ఇటువంటి సందర్భాల్లో కవి ప్రయోగించిన కావ్యబింబం శబ్దశక్తులతో ఒకటయిన వ్యంజన వ్యుత్పత్తిసిరుపాధి జేసిని ''మళ్ళించు రథము'' అనే ఖండికలో 'భవదగ్ని స్ఫార నేత్రాలలో నిలువలేక తుపాకిగుండ్లుకూడా వెనక్కి పరుగుతీస్తాయి' అని ఉత్తేజపరుస్తూ, అటువంటి నిర్భాగులు విజృంభిస్తే లోకంలో విషవాగ్నిని సృష్టిస్తాయని తెలియచేయడానికి

శివనేత్రము బోలె నిచ్చిలో
కానలంయాగ్నికేలికలు కప్పునురా!

అగ్నిధార, 71.

అని నిర్భాగుని కోపజ్వాలని శివనేత్రజ్వాలగా చిత్రించారు. ''అంతర్నాదం'' అనే ఖండికలో అవాంతరాలని భయపడకుండా లోటిమానవులని దోపిడేచేసే వ్యక్తుల్ని అంతమొందించడానికి

నేనుకూడ
రామకృష్ణావ తార ధారణను నేటు.....
వెలుగు చీకట్లమధ్య తప్పించు కొనుచు
దండన మొనర్చు దివ్యకోదండినేను

అగ్నిధార, 82.

అని తనని దుష్టశిక్షణార్థం అవతారమెత్తే రామకృష్ణుల అవతారంగా చిత్రించుకున్నారు. ' కవితా కోపం'లో అస్తవ్యస్తమయిన ఈ లోకానికి

ధూర్జటినై
మారిజన్‌వేయాలెమో.....
ఫాలనేత్ర నిలయాగ్ని మాలతో
నేలగాత్ర విషనగ్న కేలతో

అగ్నిధార, 85.

సంఘంలో దుష్టశక్తుల్ని అంతమొందించాలని తన ఆశని కవి వ్యక్తంచేశారు. శ్రామికజతి మేల్కొని విప్లవమార్గాన్ని అనుసరించడం కవికి

విశ్వరుద్ర ఫాలంలో
విప్లవాక్షి విరిసింది

శ్రామికజాతి, ''అగ్నిధార'', 90.

గా తెచ్చింది. ''అడుగో'' అనే ఖండికలో మేల్కొన్న ఆసియాఖండం

గొంతు విచ్చి
పంచానన
పాంచజన్య
గర్జానిధ్వానం

''అగ్నిధార'', 94.

చేసిందని కవి ప్రకటించారు. ''అనలదాహం'' అనే ఖండికలో నవభారతం చైతన్య జ్యోతిలో వెలుగుతుంటే ''పాత'' అంతమయిందని తెలియచేస్తూ

భూతకాల భేతాళుడు
పాతాళపు పట్టులలో
ఇరుక్కుని మరణించెను

''అగ్నిధార'', 106.

అని వర్ణించారు. శ్రమజీవుల అమృతసిద్ధి సముపార్జన కోసం స్వార్థపూరిత వ్యవస్థ పక్కాల్ని విరగ్గొట్టి

సమిధలుగా తేతెండోయ్
సమతా జమదగ్ని కుమారులార 107.8

అని నేటి యువకుల్ని భవితవ్యపు సాధనానికి హేతులుగా, ప్రచండ ప్రతిజ్ఞా పరిపాలకుడైన పరశురామునిగా కవి చిత్రించారు. నిజాం నిరంకుశ పరిపాలన చేత బాధితమైన ''వీర తెలంగాణము'' ను వర్ణిస్తూ, మహాభారతప్రతీకలని కవి ఎక్కువుగా ప్రయోగించారు. నవాబుని దుర్యోధనునిలాను, వస్త్రాపహరణ ధూర్వహాల్ని దుశ్శాసనులతోను పిలుస్తూ,

ఓడిపోలేదు దుర్యోధనాదులకన్న
బాధించిన నవాబు వానిచేత
చలియింపలేదు దుశ్శాసనాధములోని
వస్త్రాపహరణ ధూర్వహాల జూచి

రుద్రవీణ, 125.

అని సంఘంలో దుష్టశక్తులుకూడా అనాదిగా ఉన్నవే అని కవి సూచించారు. చరిత్ర పాడని ధరిత్రిచూడని పవిత్రగీతంగా ''మహాగీతం'' ఆలపిస్తూ కవి విశ్వశ్రామిక శక్తిని

మహోగ్రఘాతం
ఉల్కాపాతం
వజ్రాఘాతం

రుద్రవీణ, 142.

అని విజయానికి ముందు శ్రమజీవులుచేసే రక్తతర్పణాన్ని ''అమృతం ముందరి హాలాహలం''గా వర్ణిస్తూ వర్తమాన శ్రామిక పోరాటానికి కవి సార్వకాలికత సంతరించిపెట్టారు . . ''రుధిర దీపిక'' అనే ఖండికలో భగవంతుణ్ణి శ్రామిక జన పక్షపాతిగా భావిస్తూ

లే, తండ్రీ!
లయరుద్ర, మహానుభావ!
ప్రియ విశ్వశ్రామిక దేవా!

'రుద్రవీణ', , 147.

అని సాంఘిక దురన్యాయాలని ఎదిరించే ధర్మయుద్ధంలో లయరుద్రుడు శ్రమ జీవులకి సహాయపడడం తథ్యమని కవి సూచించారు. ''క్షమామూర్తి'' అనే ఖండికలో గాంధీజీ వ్యక్తిత్వాన్ని చిత్రిస్తూ ''బుద్ధదేవుని పర్యాయమూర్తి''గా ''లోకబాంధవుని''గా భావిస్తూ ఆంగ్లదేశంలో ''తెల్లవారని అమవస దీర్ఘరాత్రి'' (196) ని దింపిన మహానుభావునిగాకూడా భావించి'' అజాతిశత్రువనే అతనితోడే'' అని స్వతంత్ర భారతదేశ సృష్టికర్తగా గాంధీని ప్రశంసించారు. గాంధీజీని ''సర్వమత సమన్వయం సాధించిన మహాత్ముని''గా సంభావిస్తూ ఆయనని

క్రీస్తో బుద్ధమునీంద్రుడో మహమ్మదో
ప్రీతిన్ దరిద్ర ప్రజా
మస్తంబందు కరంబునుంచి అభయం
బందించి అజ్ఞానతా
గ్రస్తంబైన జగంబు జ్ఞానరుచిలో
లాలించి ఫాలస్థలి
హస్తాంభోజ కరాల నవ్వెడి మహాత్మా
మమ్ము దీవింపవే

'మహాంధ్రోదయం', 197.

అని గాంధీజీ ఔన్నత్యాన్ని దేశకాల సరిహద్దుల్ని అధిగమించినట్లు కవి చిత్రించారు. ''పునర్నవం'' అనే గీతికలో కావ్యకల్పన అబద్ధాలాడ్డం అంతసులభం కాకపోయినా. సత్యంకోసం

హరిశ్చంద్రు నంతగా
అలమటించ నక్కరలేదు

'పునర్నవం', 231.

అని సత్యసంధత మానవునికి కలిగించే సమస్యలకి హరిశ్చంద్రుణ్ణి ప్రతీకగా కవి ప్రయోగించారు. డా. దాశరథికి భారతీయ పురాణస్మృతుల పాటు పాశ్చాత్య పురాణ స్మృతికూడా ఉంది. మానవుడు అనంతశక్తిని ఆర్జించాలి అని ఆశిస్తూ

ఇందుకు గ్రీకుదేవత ''అపోలో''ని ప్రతీకగా ప్రయోగిస్తూ

ఆకాశమంత యెత్తు కోర్కెలను
అధః పాతాళంలోకి తొక్కేలోకాన్ని
అమాంతం మింగేయగలిగిన శక్తిని
ఆర్జించడం అపోలో నద్ద నేర్చుకో                    232.

అని కవి మానవుణ్ణి నిర్దేశించారు. ''తుదిశిశిరం'' అనే ఖండికలో ధనదాహ పీడితులైన మానవులని ''నరకాసురులు, రావణ / పరబ్రహ్మలు, హిరణ్యాక్షులు / హిరణ్యకశిపులు / హిరణ్యానిక్కె / ధరణి నంతటిని / దహనంచేసే / మహాపాపులు'' గా కవి చిత్రించారు. ఈనాటి ధనమదాంధులని పురాణ ప్రసిద్ధులైన రాక్షస వర్గంతో జతపరచి మానవమేధలో దుష్ప్రవృత్తి అనాదిగా ఉంటోందని కవి సూచించారు. ఆధునిక యుగంలో ప్రజాశక్తి దైవశక్తిసమంగా రూపుదిద్దుకుంటుందని భావిస్తూ ''ప్రణవం లో త్రివర్ణాలని''

ఓం మహాప్రజాయైనమః
అకార అంధకారంలో
ఉకారంపుటుడుపులు వేసుకు
మకారంపు మూఢే కాగడాతో
మనిషి ఎవడో వస్తున్నాడు

పునర్నవం, 246.

అని ఓంకారానికి రూపకల్పనచేసి, అంధకారంలోనుంచి శబ్దసన్నిధానిన్యై నుండే ఆశల కాగడాతో పరిశ్రమించే మనిషిని కవి చిత్రించారు. కవి వైదిక విజ్ఞానానికి వర్తమాన కాలోచితంగా చేసిన ప్రతిభావంతమైన వ్యాఖ్యానం మనకి స్పష్టం అవుతోంది. ఓంకారప్రతీకని వైయక్తిక ప్రతిభాయుక్తమయిన కావ్యబింబంగా రూపుదిద్ది

అకార ఆకారం నలుపు
ఉకారంపు ఉడుపులు తెలుపు
మకారంపు మంటలు ఎరుపు 247.

అని త్రివర్ణచిత్రాలని కవి మనముందు నిలబెట్టారు. ''అచుంబితం'' అనే ఖండికలో ఋషిశాపం భీషణమయింది అని ప్రజలకోపం పదునెక్కింది అని తెలియచేయడానికి

భీముని గదలా బరువై
భీతిగొల్పు ఋషిశాపం
రాముని బాణాని కంటె
ప్రబలమైన జనకోపం

పునర్నవం, 272

అని పురాణప్రతీకల్ని ప్రయోగించారు. శబ్దంలో ఉన్న అనంతశక్తిని

మర్రి ఆకుమై విష్ణువు
మాదిరి శబ్దమునశక్తి 273.

అని జగత్తంతా లయమయ్యే సమయంలో అనశ్వరంగా నిలిచే పరమాత్మ స్వరూపంగా శబ్దశక్తికూడా అనంతం, అనశ్వరం అని కవి సూచించారు. ''వాగ్వజ్రం'' అనే ఖండికలో లోకం ఆనందధామంకావాలి కాని నరకతుల్యం కాకూడదు అనే భావాన్ని గాఢంగా వ్యక్తీకరించడానికి

> లంకగా గాక కైలాసమ్ముగా జగము
> రాణించునటు పునారచన చేతము రమ్ము

అమృతాభిషేకం, 321.

అని నరకానికి లంకని, ఆనందధామానికి కైలాసాన్ని ప్రతీకలుగా కని ప్రయోగించారు. స్వర్గధామమైన కైలాసాన్నే కదిలించగలిగిన రావణుని పాశవికశక్తి ఈశ్వరుని ఆధ్యాత్మిక శక్తిముందు తలవంచక తప్పలేదని, లంకాధిపతి కైలాసాధిపతికి భక్తుడైనా అహం కళ్ళు కప్పినప్పుడు నరకలోకాధిపతిగా మారతాడని, చివరికి మానవలోకం కైలాసమేకాని లంకకాదని కవి స్పష్టంచేశారు. ఆధునిక రాజకీయ వేత్తలు భారతదేశంలో రామరాజ్యం స్థాపిద్దామని ఆశపడుతుంటే దాశరథి రావణ రాజ్యానికి ప్రత్యామ్నాయంగా రామరాజ్యం కాకుండా కైలాసాన్ని నెలకొల్పాలి అని ఆశించడం కొంతవిడ్డూరంగాను, విశిష్టంగాను కనిపిస్తోంది. చిన్నప్పుడు తనని వెంచిన భ్రాతృజాయ ''వధూనిక'' పై దాశరథికి అత్యంత మాతృభావం కనిపిస్తుంది. ఆమెని

భారతీ, రమా, ఉమా సమాహారమైన
మాతృత్రితయ స్వరూపిణి

అమృతాభిషేకం, 329.

గా కవి చిత్రించారు. ''అమృతమూర్తి'' అనే ఖండికలో కూడా గాంధీజీని విశిష్ట వ్యక్తిగా భావిస్తూ

బుద్ధుడవో! సకలతప
స్సిద్ధుడవో! శంకరుడవో శ్రీవిష్ణువువో

కవితాపుష్పకం, 369.

అని పౌరాణికదైవాంశ సంభూతునిగా చిత్రించారు. భారతదేశం సస్యశ్యామలంగా ఉండడానికి అహరహం కృషిచేసిన అమృతమూర్తిగా గాంధీజీని భావిస్తూ

ఇంద్రుడవై మాపొలముల
సాంద్రాబ్దములంపి కురియజాలు మహాత్మా 370.

అని ఇంద్రునిగా కూడా చిత్రించారు. భారత పాకిస్థాన్ యుద్ధ సందర్భంలో తన ప్రాణాన్ని ధారపోసిన అబ్దుల్ హమీద్‌ని ప్రశంసిస్తూ

శుభాంగి ఉత్తరను వేడిన
అభిమన్యుడవేవేలే.....
రాకాసుల పీచమడచి
లోకానికి వెలుగు నిచ్చి
నరులను బ్రోచిన శౌరి
పరమవీర చక్రధారి

'చక్రధారి', ''కవితాపుష్పకం'', 408.

అని వర్తమానకాలపు యువ వీరుణ్ణి పౌరాణిక అభిమన్యునితోను, లోక సంరక్షకుడైన చక్రధారిశౌరితోను కవి పోల్చాడు. నమ్మిన సిద్ధాంతాలకోసం తమ అశువులని ధారపోసిన అజ్ఞాతవీరుని ''త్రిమూర్తులు''గా భావిస్తూ వారు తమ సంకుచితమతాచారాలని అధిగమించి అందరికీ తల్లిఅయిన దేశమాత సేవకి తమని ఆత్మార్పణం చేసుకున్నారు అని జాన్, ఉస్మాన్, భగవాన్ అని క్రైస్తవ, మహమ్మదీయ, హిందూ సంస్కృతుల ప్రతీకలుగా చిత్రించారు.

జాన్, ఉస్మాన్, భగవాన్
త్రిమూర్తులు నాహృదయావర్తులు

' కవితాపుష్పకం,' 434.

అని తమ మతసమన్వయ దృక్పథాన్ని వెల్లడించారు. నవచరితకి నాందిఅయిన నాగార్జున సాగరాన్ని పురాణప్రసిద్ధమైన ''క్షీరసాగరం''గా వర్ణిస్తూ

కృష్ణ నాపి నిరుపేదల
తృష్ణ చాపి నటించారు
విష్ణువు కంటె ఘనులని
వేయినోళ్ల చాటింతును

'తిమిరంతో సమరం', 26.

అని నేటి సాంకేతిక నిపుణులు విష్ణువునే మించిన వారనే భావనని వ్యక్తంచేశారు. నాగార్జునసాగర నిర్మాణంలో ఎదురైన కష్ట నష్టాలు, అనంతరం భూమిని సస్యశ్యామలంచేసే మహాత్కార్యానికి నాందిగా భావిస్తూ అంతిమ విజయాన్ని సముద్ర మథనానంతరం ఉద్భవించిన అమృత ధారగా, ఆ కార్యక్రమంలో ఎదురైన అడ్డంకులని అధిగమించే శక్తిని విశ్వేశ్వరునిగా భావిస్తూ

తరచి నపుడె అమృతధార
తరలి వచ్చునోయి
విషము మ్రింగ గలుగునాడె
విశ్వేశ్వరుడోయి 27.

అని నేటి సాంకేతిక ప్రవీణులని ఈశ్వరసమానులుగాకూడ కని చిత్రించారు. ''భవిష్యత్తుకి స్వాగతం'' అనే ఖండికలో తాను గతకాలానికి చెందిన రాజరికానికి, నియంతలకి, నల్లధనం దాచిపెట్టే దొంగ వ్యాపారులకి శత్రువుని అని ప్రకటిస్తూ

కుబేరుడిలా కోట్ల, అర్బుదాల
నల్లడబ్బుగల గళ్ళాపెట్టెను
కుక్షిలో దాచుకుని

తిమిరంతో సమరం, 44.

ప్రజావళిని దోచుకునే వ్యాపారస్థుల్ని కుబేరుడిగా కొంత ఆశ్చర్యకరంగా వర్ణిస్తూ, పురాణంలో దేవతల్ని ఈనాటి ప్రజలతో పోల్చి నేటికాలానికి తగినట్లుగా పురాణాలకి వ్యాఖ్యచేశారు. సమ సమాజ స్వప్నాన్ని సత్యం చేయగలిగినశక్తిగా భవిష్యత్తుని ఊహిస్తూ దాశరథి

అత్యంత శక్తి స్వరూపిణి
కాత్యాయని నాభవిష్యత్తు।
ఆ కాత్యాయని వరించే
కాల కంఠుణ్ణి నేను 46.

అని భవిష్యత్తు శక్తిమంతమై, ఆశాజనకమై నిలనిల్చుకుందని తమ భావాన్ని వ్యక్తంచేశారు. ఆ భవిష్యత్తుకి తాను కష్టాల విషాన్ని కంఠంలో నిలుపుకున్న పరమేశ్వరునిగా నిలబడతానని భవిష్యత్తుమీద ఆశని, కష్టాల నెదుర్కొనే ఆత్మస్థైర్యాన్ని కవి పురాణప్రతీకలద్వారా వ్యక్తంచేశారు. ''నైలునదీ బాలులతో'' అనే ఖండికలో ఆఫ్రికాదేశవాసులని ఉద్దేశిస్తూ రజస్తమోగుణాలతో ఎవరూ విజయం సాధించలేరు,

''సత్వగుణంలో నిజమగు సత్వమ ఉన్నది'' అని భావిస్తూ, ఈ సత్వగుణానికి ప్రతినిధులుగా

బుద్ధుడు చిరునవ్వుచిలికి
ముగ్ధుల గావిస్తాడు
ఏసుక్రీస్తు సిలువనెక్కి
దోషులను క్షమిస్తాడు
మహాత్ముడు ప్రాణమిచ్చి
మాజాతిని బ్రతికిస్తాడు
మహమ్మదు మంచితో
మహికి పూజ్యుడౌతాడు

'తిమిరంతోసమరం', 51.

అని క్రీస్తుపూర్వం భారతావనిలో విలసిల్లిన బుద్ధుని మొదలుకొని ఈ శతాబ్దికి చెందిన మహాత్ముని వరకు మహనీయులని సత్వగుణ ప్రతీకలుగా కవి ప్రయోగించారు. ''బాలమయూఖ విజయం'' అనే ఖండికలో భారతదేశంమీద దురాక్రమణ చేసిన పాకిస్థాన్ సైనికులని

లక్షతలలున్న భీకర రాక్షసుండు
కోటి చేతులలో తుపాకులు ధరించి
''రావి''నది యొడ్డునన్ దోచె రావణుండు

'తిమిరంతోసమరం', 65.

అని లంకలోకాక పడమటివంక ఉదయించిన రావణునిగా కని చిత్రించారు. ''నటశ్రీ'' అనే ఖండికలో హృదయ హిమాచలాగ్రమునెక్కి నటరాజుచేసే నాట్యాన్ని

ప్రథిత నటరాజ పదవారిభవమునేడ
గగనమే చంచరీక సంకారమయ్యె
చిందు చైతన్య మకరంద బిందు చయము
తారలై తోచె బ్రహ్మాండ తోరణమున్

'తిమిరంతో సమరం', 102.

అని కవి భావస్ఫోరకంగా చిత్రించారు. పాకిస్థాన్ దురాక్రమణచేసిన తరువాత ఆ సమస్యని ఐక్యరాజ్య సమితిలో చర్చిస్తూ, భారతదేశం మీదలేని పోని అభాండాలు వేసే వర్తమాన రాజకీయ సంఘటనని మహాభారతంలో సంఘటనగా వర్ణిస్తూ

ఐక్యరాజ్య సమితి కురుసభలో
మ న అమ్మను అవమానించ జూచిన
సైంధవులు

'తిమిరంతో సమరం', 108.

అని చిత్రించారు. ఇందులో కొంత విచిత్రం లేకపోలేదు. కురు సభలో ద్రౌపదిని అవమానించిన వారిలో దుశ్శాసనుడు ముఖ్యుడు. సైంధవుడు పద్మవ్యూహ ఘట్టంలో ప్రవేశమార్గాన్ని నిరోధించడంలో ప్రముఖుడు. కవి సైంధవుని ఈ సందర్భంలో ప్రయోగించడంలో ఐక్యరాజ్యసమితి కార్యక్రమాలకి నిరోధం కలిగించే వీటోని ప్రయోగించే అమెరికన్ రాజకీయ వేత్తలని మనసులో ఉంచుకుని ప్రయోగించి ఉండవచ్చు. ఇటువంటి ప్రయోగంవలన కవి రాజకీయ పరిజ్ఞాన ప్రస్ఫుటం అవుతోంది. దేశరక్షణకోసం పరదేశస్థుల్ని చీల్చిచెండాడే యోధులు ''బలరాములై / చెలరేగారు / పరశురాములై / విరుచుకుపడ్డారు / శ్రీరాములై దస్యుదశ కంఠాలను / ఛేదించారు'' (109) అని పురాణాల్లో వీరులకి వారసులుగా కవి చిత్రించారు. ''ఆలోచనాలోచనాలు'' అనే సంకలనంలో కవి తాత్విక చింతన, ఆలోచనాసరణి వ్యక్తిగతమైనవి కావడంవలన పౌరాణిక కావ్యబింబ ప్రయోగం చాలా తక్కువగా ఉంది. ఒక్కొక్కసారి క్షీరసాగరం వంటి పౌరాణిక కావ్యబింబం కనిపించినా అది ప్రయోగించిన సందర్భం ముఖ్యంగా వ్యక్తిగతమయిందే. ''విప్లవ వీరుడు'' అనే ఖండికలో గాంధీజీని నిజమైన విప్లవవీరునిగా భావిస్తూ ఆ మహాత్ముణ్ని స్మృతించే సమయంలో తమకి ఎంతో ఆత్మవిశ్వాసం కలుగుతుందని, తాము నిస్సహాయ ఆరావం చేయవలసిన అవసరంలేదని స్పష్టీకరిస్తూ

గాంధీ జయంతి శుభసమయాన
గజేంద్రుడిలా ''పాహిమాం'' అని
నిస్సహాయగీతం పాడలేను.
నిరాశా దురాశలు
నిరంతరం దాడిచేస్తున్న ఈనాడు
ఆశావాదిని నేను,
'అలో లక్ష్మణా!' అని అలమటించలేను.

'విప్లవపేరుడు', ''ఆలోచనాలోచనాలు'', 86.

అని నిస్సహాయతకి గజేంద్రుణ్ని, సీతని ముఖ్యంగా పెట్టిన అలో లక్ష్మణా అనే కేకని సంకేతాలుగా కవి ప్రయోగించారు. వర్తమాన కాలంలో తాను నిజమైన విప్లవానికి దోహదకారి అని తెలియచేయడానికి ఆర్ష సంప్రదాయంలో భాగమైన త్రేతాగ్ని అనే సంప్రదాయ కావ్యబింబాన్ని ప్రయోగిస్తూ

నేను త్రేతాగ్నిలో ఒక అగ్నిని;
కర్షక కార్మిక, కవిశక్తుల
కలని వెరసి త్రేతాగ్ని[10] అనుకునే వాళ్ళ 86.

---

10. శ్రీశ్రీ కూడా 'మరోప్రపంచంలోని విప్లవాగ్నులని త్రేతాగ్నిగా' కనబడలేదా మరోప్రపంచపు కణకణమండే త్రేతాగ్ని?' ('మహాప్రస్థానం', 18) అని చిత్రించారు. విమర్శకుల దృష్టిని బట్టి ఈ త్రేతాగ్నులు వివిధశక్తులకి ప్రతీకలుగా కనిపిస్తాయి. డా. మిరియాల రామకృష్ణకి ఈ మూడు అగ్నులు మార్క్సు, ఎంగిల్స్, లెనిన్లు' స్ఫురింపచేస్తాయి ('శ్రీశ్రీ కవిత్వం', 254), దాశరథికి ఈ త్రేతాగ్నులు కార్మిక, కర్షక, కవిశక్తులుగా కనిపించాయి.

అని నవ విప్లవాన్ని ఆర్తత్రేతాగ్నితో పోల్చి, విప్లవం అనాదిగా, అనంతంగా సాగుతున్న ధర్మయుద్ధంగా కవి ఒక ఉన్నత ఆదర్శంగా చిత్రించారు. ''సైనికుడికి సలాం'' అనే ఖండికలో దేశరక్షణకి అనవరతం అనిమేషులుగా పాటుపడే సైనికుల్ని ప్రశంసిస్తూ, శత్రువర్గాన్ని రావణాసుర పాత్రధారులుగా చిత్రిస్తూ, సైనికుడి కేకలో

దుర్జయుడైన అర్జునుని
పర్జన్య గర్జా సదృశ శంఖనాదం 106.

విన్నానని

కురుక్షేత్రయుద్ధంలో దుర్యోధనుని తొడలు
తునాతునకలు చేసిన ఖండన భీముని
ప్రచండ ప్రతాపం 106.

చూశానని, '' ఆతని నయనాలలో పరశురాముని రక్తరంజిత / పరశుచ్ఛటా పటలాలు / '' చూశానని కవి వర్ణించారు. ఇంకా ఆ సైనికుని చేతుల్లో ''హిరణ్యకశిపుని ఉదరారణ్యంలో విచ్చలవిడిగా విహరించే / ఉగ్రనారసింహుని ఖర కర నఖ కాంతులు''చూశానని, ఆతడు మృత్యువును ఓడించిన మృత్యుంజయుడని కొనియాడుతూ భారతసైనికుణ్ని అపురూపంగా ప్రతిభావంతమైన భావుకశక్తితో

బాలభాను ప్రథమకిరణాన్ని పింఛంగా ధరించి
భయంకర మారణాయుధాన్ని వేణువుగా వరించి
రణరంగ బృందావనంలో
విజయ పరంపరా గోపికాగణంతో
రాసకేళి సలిపే
రమ్యగోపాల కృష్ణుడవు 106.

అని చిత్రించారు. ఇంకా నేటి భారతీయునైనికుణ్ణి ''స్వాతంత్ర్య సీతను శాశ్వతంగా హరింపజూసే / శత్రు రావణవినాశనం కోసం / పుంఖాను పుంఖంగా విశిఖాలువిడిచే / పురుషోత్తముడైన శ్రీరామచంద్రుడవు '' అని భారతదేశంలో అనాదిగా వస్తున్న వీరసంప్రదాయాన్ని ఈనాటి వీరులకి సంకేతంగా కవి ప్రతిభా వంతంగా ప్రయోగించారు. ''ధ్వజమెత్తినప్రజ'' అనే సంకలనంలో ''హృదయ కమలం'' అనే ఖండికలో

నరుని ఉరములోని నవహృదయం
పరమేశ్వరుని పాణింధమం 1.

అని ఈ నవహృదయం నవసృష్టికి దోహదకారిఅయినా ఈశ్వరుని పాణింధమంగా కవి భావించారు. ఈ హృదయం

రుధిర గంగకది హిమాలయం
కరుణా గౌరికి శివాలయం 2.

అని మానవ హృదయం ఆవేశగంగకి ఆలయంగా, కరుణఅనే గౌరికి పూజనేయంగా అంటే కరుణాలవాలంగా ఉంటుందని కవి చిత్రించారు. ''బాలహృదయం'' అనే ఖండికలో

క్షీరసాగరంలో
చిన్న వటపత్రంలో
శ్రీ మహావిష్ణువు
చిన్నారి బాలుడు 81.

అని అంతర్జాతీయ బాలల వత్సరంలో నిర్మల మనస్కులైన పసివాళ్ళని భగవత్ స్వరూపులుగా కవి లోకాలన్నీ లయమయ్యేవేళ నిర్వికారంగా, నిర్భయంగా వట పత్రశాయి అయిన శ్రీ మహావిష్ణువుగా, అత్యంత ఔచిత్యవంతంగా కవి చిత్రించారు.

<u>చారిత్రక కావ్యబింబ దర్శనం</u>

దాశరథి కవితలలో సందర్భోచితంగా చారిత్రక పరిజ్ఞానంకూడా కనిపిస్తుంది. చరిత్ర అధ్యయనం వలన ఈ పరిజ్ఞానం సమకూరి చారిత్రక కావ్యబింబ పరికల్పనకి ఉపకరించింది. భారతదేశ చరిత్రమీద, ఆంధ్రదేశ చరిత్రమీద, తెలంగాణ చరిత్రమీద వీరికి ఉన్న అభిమానం ఈ కావ్యబింబాలద్వారా వెల్లడి అయింది. సార్వకాలిక ధర్మసూచకమైన ''ధర్మచక్రం'' అశోకుని శాంతి ప్రియత్వాన్ని చాటి చెపుతూ, ఈనాటికీ సర్వప్రజానీక గౌరవానికి అర్హంగా ఉంది అని తెలియచేస్తూ,

నాడు కళింగ సంగరము
నందొక లక్షగళాల నెత్తురు పా
రాడిన జాడ జాలకం ధ
రాతిరి శాంతి సుధాప్రవాహము
పాడుట కోసమై బ్రతుకు
నంజలి పట్టిన

'అగ్నిధార', 14.

అశోక చక్రవర్తిని శాంతి గంభీర చక్రవర్తిగా కవి చిత్రించారు. నిజామాబాద్ లో సెంట్రల్ జైలుగామారి డా. దాశరథికి కొన్నాళ్ళు శ్రీకృష్ణ జన్మస్థానవాస గౌరవాన్ని కలిగించిన ఒకనాటి ''ఇందుపుర దుర్గము'' కవి మనసులో ఎన్నో

చారిత్రక దృశ్యాలని ప్రతిఫలింపచేసి, ఆదృశ్యాలని వ్యక్తీకరింపచేసే చారిత్రక కావ్యబింబసృష్టికి దోహదంచేసింది. ఆ దుర్గాన్ని ''చరిత్రాత్మకంబైన ఏమహితా లయమో'' అని వర్ణిస్తూ

భారతీయ సం

పడగను కొల్లగొట్టిన నవాబుల గూబలు గుయ్యుమనన్ బదా
బదలయిపోన్ మరాటి భట వర్గములొత్తిన శంఖపుంఖమో

'అగ్నిధార', 72.

అని ఇందుపుర దుర్గం చరిత్రలో నెరవేర్చిన మహాత్కార్యాన్ని చిత్రిస్తూ ఆ గుహాలలో తాను ఇంకా ''శివాజీ అశ్వాలు చేసిన హేషలు'' వినిపిస్తాయని, రాఘవాలయంలో వేద నిర్వచనాలు, సామగానాలు వినిపిస్తాయని, రఘునాథయోధుడు, రామదాసు వంటి గురువాత్మముల మంత్రఘోషములు తనకి జ్ఞప్తికి వచ్చినట్లు చిత్రించారు. భవిష్యత్తుమీద తమ ఆశని వ్యక్తీకరిస్తూ

కాలచక్ర గమన స్వాభావికావర్తక
లక్రమ్మై నిదళ కాలయంబె యగు నీ బందేల పాలింపగన్

'అగ్నిధార', 73.

అనికూడా చిత్రించారు. ఆదుర్గం సమీపంలో ఉన్న రఘునాథ సాగరాన్ని, ఆ సాగర తోయాన్ని త్రావి ''పిట్టలవలెన్ రణమందు దూకెను మరాఠీ గుఱ్ఱముల్'' అని ప్రతిభావంతుడైన చిత్రకారుడు చిత్రించిన చిత్రపటంలాగా ఆ చారిత్రక దృశ్యాన్ని కవి మనకళ్ళముందు ప్రదర్శించారు. ''అదుగో'' అనే ఖండికలో ప్రజల సమ్మతితో అధికారానికి వచ్చి రాజ్య విస్తరణ కాంక్షతో అమాయక ప్రజల ప్రాణాలకి ముప్పుతెచ్చే నాయకులకి ప్రతీకలుగా

హిట్లర్ ముసోలినీలు
అట్లీ ట్రూమన్ల గొంతులతో
ఓట్లడిగి ప్రభువులై
కోట్లాది పేదల ప్రాణాలతో
చేట్లాడి

'అగ్నిధార', 93.

నట్లు కవి చిత్రిస్తూ, అట్లీ ట్రూమన్లని ప్రజాస్వామ్యవాదులుగా నారిగొంతులు ఎరువుతెచ్చుకుని ప్రజలని మోసంచేసే నియంతలుగా హిట్లర్ ముసోలినీలని కవి ప్రయోగించారు. ''వీర తెలంగాణము'' అనే ఖండికలో కాకతీయుల కంచుగంట మ్రోయునాడు, వీర రుద్రమదేవి విక్రమించిననాడు, కాపయ్యనాయకుడు ఏపు చూపిన నాడు తెలంగాణ ఓడిపోలేదు అని చారిత్రకంగా వివరిస్తూ

శ్రావణాభ్ర
మటుల గంభీర గర్జాట్టహాసములరు
నా తెలంగాణ ఏపుచున్నది పథాన

రుద్రవీణ, 126.

అని చిత్రించారు. నిజాం నిరంకుశ ప్రభుత్వాన్ని ఎదిరిస్తూ, నవాబుని ''మా నిజాం రాజు జన్మజన్మాల బూజు'' అని ఎలుగెత్తిచాటిన దాశరథి భారతస్వాతంత్ర్య ఉదయాన్ని

భారతమాత డొక్కలో
కుళ్ళిన పుండుకోసి జయగోపురమెక్కి త్రివర్ణ కేతనాల్

'ముక్తభూమి', ''రుద్రవీణ'', 128.

అని వర్ణిస్తూ హైదరాబాద్ సంస్థానాన్ని విముక్తం చేయడానికి భారతసైన్యం విజయవంతంగా సాగించిన సైనికచర్యని కుయుక్తులు పన్నిన బ్రిటిష్ ప్రతినిధి సిడ్నీ కాటన్‌ని మనముందు నిలబెడుతూ

దూరాన నన్ను చుట్టము
దూరాననే ఆగె! తెల్లదొంగ నభస్సం
చారి యయిపోరె, స్వేచ్ఛా
భారతసైన్యం తలుపు బ్రద్దలు కొట్టెన్

'రుద్రవీణ', 128.

అని ఆంగ్లేయుల పలాయనాన్ని, భారతసైనికుల పరాక్రమాన్ని కవి చిత్రించారు. ''తెలంగాణ'' అనే ఖండికలో తెలుగు శిల్పుల నైపుణాన్ని సూచిస్తూ

ఎల్లోరా గుహాలందున పల్లవించి
వేయిస్తంభాల గుడిలోన విరులుపూచి

'మహాంధ్రోదయం', 149.

నట్టుగా తెలంగాణానికటి ''అందాల జాణ''గా కవి చిత్రించారు. ఆధునికాంధ్రుడు ఆంధ్రచరిత్రలో మహావ్యక్తులకి వారసుడేకాక వారితో తాదాత్మ్యము చెందగల వ్యక్తి అని విశ్వసిస్తూ

ఏది కాకతి? ఎవరు రుద్రమ?
ఎవరు రాయలు? ఎవడు సింగన?
అన్నినేనే అంతనేనే
వెలుగునేనే తెలుగునేనే

'మహాంధ్రోదయం', 153.

అని త్రికాల బాధితంకాని ఆంధ్రత్వాన్ని కవి చిత్రించారు. మహాంధ్రోదయ శుభసమయాన అఖిలాంధ్ర చరిత్ర భూతకాల అవధుల్నిదాటి వర్తమానంతో సంలీనం చెందిందని ''కోటి గొంతులు'' అనే ఖండికలో తెలియచేస్తూ

ఓరుగల్లు కోటపై ఒలసియాడిన నాటి
తెలుగుజెండా నేడు తిరిగి వచ్చె
రాజరాజ నరేంద్రు రతనాలమేడ వి
చ్చిన తెలుగువెలుగు వచ్చినది మరల
కృష్ణరాయలవారి ఉష్ణీష మునుబోలి
తెలుగు భానుడు నేడు తెలిసి దేరె 157.

అని ఆంధ్ర చారిత్రక వైభవం సార్వకాలికమైన సత్యంగా కవి ప్రదర్శించారు. ''కాపయ నాయకుడు'' అనే ఖండికలో ఢిల్లీసులతానులనే భయపెట్టిన కాకతీయ ప్రతాపానికి ప్రతినిధిగా కాపయని వర్ణిస్తూ

చరితమ్మును గుడ్డిచేకటి జాడలందు
కనర దీపంబవై తెలంగాణభూమి
వెలిగి వెలిగించినావు దివ్యలోకకటి 199.

అని వర్ణించారు. చివరికి అటువంటి కాపయనాయకుడు తెలంగాణకి కాపుగా లేకపోవడంవలన నిజాంపరిపాలన సమయంలో రజాకారులు విజృంభించి ఓరుగల్లు పట్టణంలోనే పట్టపగలు హత్యలు చేశారని అలనాటి చారిత్రకవైరునికి ఈనాటి చరిత్రకి ఒక అవినాభావసంబంధాన్ని కవి కల్పించారు. ''పునర్నవం'' అనే గీతికలో వ్యక్తిగత స్వాతంత్ర్యం, రాజకీయ, మత, స్వాతంత్ర్యాలు అవసరం అని, మతం కలిగించే అంధత్వాన్ని మట్టుపెట్టాలని కోరుతూ

''పోపు''లాంటి మతాధికారిని
కూపంలోకి దొర్లించెబలాన్ని
''లూథర్'' వద్ద సంపాదించుకుని
మౌఢ్యానికి గోరీకట్టు

పునర్నవం, 232.

అని ప్రబోధిస్తారు. యూరప్ చరిత్రలో పోప్‌ల నిరంకుశ మతాధికారాన్ని అంగీకరించక సవాల్‌చేసిన లూథర్‌ని మతమౌఢ్యాన్ని అంతంచేసిన వ్యక్తిగా స్వేచ్ఛాప్రియత్వానికి సంకేతంగా కవి చిత్రించారు. ''దీక్ష'' అనే ఖండికలో పాతనిరంకుశత్వాలు గతించినా నియంతృత్వధోరణులు కొత్త ఆహార్యాలు ధరించుకుని రంగ ప్రవేశం చేస్తూనే ఉంటాయని తెలియచేస్తూ,

పాట్లూరు పోయాడని నమ్మేసి
చెట్లు మరల చిగురించాయి
ముసోలినీ ఇకలేనే లేడని
ముళ్ళు మల్లెలై విరిశాయి
''హాజో! జో! సమాధిలో'' అని
జాజులు పాటలు పాడాయి

ధ్వజమెత్తినప్రజ, 43.

అని హిట్లరు, ముసోలినీ, టోజోలని నియంతృత్వానికి సంకేతాలుగా ఉపయోగిస్తూ, మళ్ళీ ఈనాడు నయానయా ఫాసిస్టులు నాట్యంచేస్తూ వస్తున్నారని కవి హెచ్చరించారు.

<u>ప్రతీకాత్మక గీతాలు</u>

తమ దుఃఖాలని, విశ్వాసాలని కొంత పరిపుష్టంగా వెలువరించడానికి డా. దాశరథి కొన్ని ప్రతీకాత్మక గీతాలని రచించారు. చుట్టూ ప్రబలమవుతున్న ప్రజాస్వామ్యం ముందు రాచరికం నిలవలేదని విశ్వసించిన డా. దాశరథి 'నడిగడ్డ' అనే ప్రతీకాత్మక గీతంలో ప్రజాశక్తిని పొంగే సముద్రంగా, రాచరికాన్ని నడిగడ్డగా చిత్రించారు. ప్రజాస్వామ్య విజయంతథ్యం అని తెలియచేస్తూ,

నాలుకలుచాస్తూ సంద్రం
నేలను నాకేస్తున్నది

దాశరథి కవిత, 108.

అనే ప్రతీకని ప్రయోగించారు. 'ఉషస్సంధ్య' అనే గీతంలో ఉషస్సుని జలపాతానికి నాందిగా అభ్యుదయోదయంగా, తమస్సుని రాచరికాలకి ప్రతీకగా కవి ప్రయోగించారు. ప్రజాస్వామోదయంతో రాచరికాల తమస్సు విడిపోతుందని తెలియచేయడానికి

ఉషస్సు కిర్మీర కవాటం తీస్తూ
ఒకమాటు చూచిందిట
తమస్సు పాషాణ కిరీటం తేస్తూ
ఒకపరుగు తీసిందిట

దాశరథి కవిత, 218.

అని ప్రతీకాత్మకంగా చిత్రించారు. శాస్త్రప్రగతి మానవ కల్యాణానికి ఉపకరించాలనే ఆశని 'మస్తిష్కంలో లెబొరేటరీ' అనే గీతంలో కవి వ్యక్తంచేశారు. జీవితం నాగజెముడు కాక పూలు పుయ్యాలని ఆశిస్తూ మానవుని మేధస్సు

మథనపడే మేధావుల
శిథిలాశలు చిగురించే
రసరాజ్యం లెబొరేటరీ

దాశరథి కవిత, 245.

అని ప్రతీకకికూడా వైయక్తిక శోభని కవి కలిగించారు. 'కవితా పుష్పకం' అనే గీతం డా.దాశరథి సమన్వయ దృక్పథానికి సముజ్జ్వల ప్రతీక. తనహృదయం భిన్న సంస్కృతులకూడలి, గాలిబ్, కాళిదాసు, నజ్రుల్‌ఇస్లాం - టాగోర్ తన మిత్రులని స్పష్టంచేస్తూ

ఈ కవితాసౌధం పుష్పక విమానం వంటిది
ఇందులో ఎందరు ప్రయాణించినా ఇంకాచోటుంటుంది
అన్ని భాషల వారూరండి

దాశరథి కవిత, 411.

అని తమని తాము కవితా పుష్పకసారథిగా సమన్వయసారథిగా వర్ణించుకున్నారు. నిజమైన అధికారం అనురాగం వలన సిద్ధిస్తుంది, భయంవలనకాదు అనే సత్యాన్ని 'రావణవనం' అనే గీతంలో కవి ప్రదర్శిస్తూ,

ఇదంతా ఎందుకు జరుగుతోంది భయంతోనేకాని భక్తితో కాదు
..... దానికి కారణం ఒకటే; రావణునిలో హృదయంలేదు

దాశరథి కవిత, 423.

అని రావణున్ని బ్రహ్మాండమంతా పట్టేసిన సైంటిస్టుగా కవి చిత్రించారు. 'బాలమయూఖ విజయము' అనే గీతంలో బంగ్లాదేశ్‌మీద దండయాత్రచేసిన పాకిస్తాన్ సైనికులని రావణుని వారసులుగా చిత్రిస్తూ, మళ్ళీ రావణునిమీద రామవిజయం తథ్యంఅని

తామస గిరీంద్ర గర్వమ్ము తరణికిరణ
మొక్క త్రుటిలోన చేల్చి వ్రక్కలైపోయె,
రావణుని గుండెలందున రామబాణ
మిదిగొ! నాటెను ముక్తినాపాని విధాన

'తిమిరంతోసమరం', 66.

అని ప్రతీకాత్మకంగా తెలియచేశారు. 'వెలుగుల వంతెన' అనే ప్రతీకాత్మకగీతం కవి తాత్త్వికదృక్పథాన్ని వెలువరిస్తూ చావుపుట్టుకల మధ్య ఉన్న సముజ్జ్వలసంబంధాన్ని

క్రింద కాలప్రవాహం నిదరపోదు
రెండు తీరాలు కలిపే వెలుగులవంతెన

'ఆలోచనాలోచనాలు', 25.

తనకి అభిమానపాత్రం అని కవి వెల్లడించారు.

<u>వైయక్తికబింబ దర్శనం</u> :- తమ విశిష్టమైన అనుభవాలని వ్యక్తీకరించడానికి డా. దాశరథి వైయక్తిక కావ్యబింబాలని తమ కవిత్వంలో మొదటినుంచి ప్రయోగించారు. వీరు కవితారచనకి నిజాము ప్రభుత్వముయొక్క నిరంకుశప్రవర్తన ముఖ్యప్రేరణ. ఆ నిరంకుశత్వాన్ని ఎదిరించడానికి తమ మహోలేఖినిని ప్రయోగిస్తామని తెలియచేస్తూ 'అగ్నిధార' అనే కవితాసంకలనంలో తమలేఖిని ప్రత్యేకతని

మామక లేఖినీ ముఖం
బెండకు మండిపోయి రచియించును గ్రీష్మమహాప్రబంధముల్

'దాశరధి కవిత', 49.

అని తమ రచనలే గ్రీష్మప్రతాపాన్ని ప్రదర్శించగలిగినట్లుగా విశేషంగా కవి చిత్రించారు. కవితాసందేశం'లో శాంతి హితలైన పావురాలని రమణీయంగా భావించి

హరిణాంకుని తెల్లని మల్లికందునా
చల్లని గాలిలో నెగురు చాడ్పున కానబడెన్

దాశరధి కవిత, 184

అని వినూత్న కావ్యబింబ ప్రయోగం ప్రయోగించారు. కవి శాంతిప్రియుడు, శాంతి కారకుడు అని విశ్వసిస్తూ తమ విశ్వాసాన్ని

చితిమంటల యుద్ధానికి
ప్రతికవి ఒక ఫైర్ బ్రిగేడ్

దాశరధి కవిత, 228.

అని వినూత్నంగా చిత్రించారు. సమయంవస్తే ఎటువంటి మహాశక్తులైనా మట్టి కరవడం తప్పదు అని హెచ్చరించి, మానవుల అహంకారం అంతం అవుతుంది అని ప్రకటించడానికి

అంతటిలో అతిరథులపని ఆఖరు
అగరువత్తిలానుసి కురుస్తుంది పొగరు

దాశరథి కవిత, 229.

అని చిత్రించారు. జీవితంలో వేదనని దర్శించి కవిత్వంలో వ్యక్తీకరించడానికి ప్రయత్నిస్తే తగినభాష లభించని పరిస్థితిని కవి నూతనంగా

నా వేదనలో జన్మించిన ఊహింపులు
తొడగటానికి వ్యాకరణసూత్రపు రెడీమేడ్‌దుస్తులులేక
దిసమొలలతో ఉరుకుతున్నాయి లోకానపడి

దాశరథి కవిత, 241.

అని చిత్రించారు. క్షమ, ఔదార్యం రూపం దాల్చిన గాంధీజీని అపురూపంగా ఈశ్వరునిలో పోలుస్తూ

'క్షమ' శిశు శశి నవరేఖా
సదృశమయ్యె నతని శిరసి
'ఔదార్యం' అతనినుండి
అమరవాహినిగ దూకును

దాశరథి కవిత, 323.

అని చిత్రించారు. మిసిసిపీ విశ్వవిద్యాలయంలో తొలిపట్టభద్రుడైన జేమ్స్‌మెరిడిత్‌ని హింసాప్రవృత్తిని అహింసాయుద్ధంతో జయించే నైతికశక్తిగా భావించి

పరిమళాలు చిమ్మే హృదయపు అగరవత్తిని చేత పుచ్చుకొని
అణుబాంబుల వాళ్ళను ఎదిరించిన నేలమణి

దాశరథి కవిత, 435.

అని హృదయపు అగరవత్తిచిమ్మే పరిమళాలని శాంతిస్వరూపంగా కవి మనచేత ఆఘ్రాణింపచేశారు. 'జ్యోతిర్మయనాలు' అనే ఖండికలో చీకటిని జాతివివక్షత విధానాల నిరసనకి ప్రతీకగా ప్రయోగిస్తూ

నల్లవాణ్ణి హత్యచేసే తెల్లవాని
హృల్లదంవలె చీకటి

తిమిరంతో సమరం, 39.

అని చిత్రించారు. సమకాలీన సంఘంలో శోకాన్ని 'ఆలోచనాలోచనాల' తో దర్శించి తమ సానుభూతిని వ్యక్తంచేస్తూ లోకకన్యని

చీకటి చీర కట్టుకుని
ఆకలిరైక తొడుక్కుని
శోకంతో కుమిలిపోతున్న

ఆలోచనాలోచనాలు, 15.

దని చిత్రించారు. గాంధీజీని త్రికాలవేదిగా

నాజాతి గతజీవితాన్ని
వర్తమాన కాలంతో కూడి
భవిష్యత్తుతో హెచ్చవేసిన
పక్కా లెక్కల మాస్టారు

ఆలోచనాలోచనాలు, 87.

గా చిత్రించారు. ఆకాశంలో మంచుముసుగుని అపూర్వంగా భావిస్తూ

ఈ సమావృత హిమావగుంఠనం
దేవుడి తెల్లని చేతి రుమాలు,
ధ్యానేయునికి అతని జాడను
వెల్లుకడానికి ఇదో అనవాలు

ధ్వజమెత్తినప్రజ, 20.

అని రమ్యంగా చిత్రిస్తూ ప్రకృతిలో భగవత్స్వరూపాన్ని దర్శిస్తూ కనిపించే కనిపించని సూర్యబింబం 'దేవుడి పదచిహ్నం' అని, మేఘం 'అతడిశ్వేతాంచలం సంధ్య' అతడి పీతాంబరం అని వైయుక్తిక భావనతో కవి చిత్రించారు.

కంటికి కనిపించినదంతా కవితగా రాసేస్తాను అని నిర్ణయించుకుని కలంపట్టిన డా. దాశరథి మూడుదశాబ్దాలకిపైగా తనువెన్నుని గన్నుగా, తిమిరంలో సమరానికి అవసరమైన ఆయుధంగా, ఆలోచనలకి లోచనంగా, ధ్వజమెత్తినప్రజల 'నాడి' గా ప్రయోగించారు. మూడుదశాబ్దాలకి మించిన వీరి సుదీర్ఘ రచనా వ్యాసంగంలో పదికాలాలపాటు నిలిచే సత్కవితాప్రసూనాలు అనేకం. ఒక్క రమణీయ కావ్యబింబమే సత్కవిత్వం అని అన్న విమర్శకుల వివేచనని దృష్టిలో ఉంచుకుంటే, డా. దాశరథి కవితలో రమణీయ, వైయుక్తిక కావ్యబింబాలు పుష్కలంగా లభిస్తాయి.

రాజకీయ, సాంఘిక దురన్యాయాలని ప్రతిఘటించే సమయంలో డా. దాశరథి తీవ్రంగా ఆవేదనచెంది 'అగ్ని'ని ప్రముఖంగా తమ కావ్యబింబాల ప్రాతిపదికగా ప్రయోగించారు. తరువాత, 'మహాంధ్రోదయ' తరుణంలో ఆ 'అగ్ని' కొంత చల్లారి, ఆయనకి నలుదెసల 'వెలుగు'ని దర్శనీయం చేసింది.

అయినా లోకంలో అనేకరూపాల్లో తాండవమాడుతున్న తిమిరాన్నిచూసి ఆయన సమరంచేయక తప్పలేదు. ఈ సాంఘిక, రాజకీయ సమరం ఉపరితలానికి సంబంధించిందే. అంతరంగంలో డా.దాశరథి తాత్త్వికులు. అంతర్దర్శనం చేసుకోవాలి అని నిరంతర అన్వేషణచేసే జిజ్ఞాసువు. ఆ తాత్త్విక దర్శనం 'కోఽహం?' అనే మౌలిక ప్రశ్నలని రేకెత్తించి, వారి ఆత్మావిష్కరణకి సహకరించింది. ఈ ఆత్మావిష్కరణ వేరిలో ఒక నూతన పరిమాణాన్ని వెలువరించగలిగింది. విప్లవం అంటే వేరి దృక్పథంలో మౌలికమైన మార్పు కలిగింది. 'విప్లవం' అంటే 'రక్తం వెదజల్లులు కాదరా!' అని 'హృదయాల్లో విప్లవాలు ఎదగాలి' (ఆలోచనాలోచనాలు-100) అని ఆయన విశ్వసించడం మొదలుపెట్టారు. ఈ దృష్టికి గాంధీజీ నిజమైన 'విప్లవవీరుడు'గా కనిపించారు. గాంధీజీని

రేపు తనగుండెల్లోకి దూసుకుపోబోయే
తుపాకి గుండ్లకు అడ్డొస్తుందేమోనని
ఉత్తరీయాన్ని స్వతం ఎత్తిపారేసి
ఛాతీసాచి నిలిచిన భవిష్యద్వేది, విప్లవవాది

ఆలోచనాలోచనాలు, 87.

అని పరిణత తాత్త్వికదృష్టితో కని చిత్రించారు. ఈ తాత్త్విక పరిణామం దాశరథి వ్యక్తిత్వానికి మకుటాయమానం. రాజకీయ నినాదాలకి, నిబద్ధతలకి లొంగిన సంకుచిత కవితామార్గాన్ని విడదీపెట్టి సార్వకాలిక కళాత్మకవిలువలని పరిరక్షించుకుంటూ సజీవ భారతీయ సంప్రదాయాన్ని, సశాస్త్రీయ ఆధునిక దృక్పథంతో మేళవిస్తూ, ప్రజల 'వాడి' ని 'నాడి' ని అనుకరణం తన కవితరాగాలతో శృతిచేసుకుంటూ ప్రగమిస్తున్నా డా.దాశరథి సమన్వయ కవితాసారథి; 'కవితా పుష్పక సారథి'.



# డా. నారాయణ రెడ్డి

## సంప్రదాయాన్ని జీర్ణించుకున్న ప్రయోగం

## డా. నారాయణరెడ్డి

### 'సంప్రదాయాన్ని జీర్ణించుకున్న ప్రయోగం'

ఆధునికాంధ్ర కవిత్వంలో వివిధ ప్రక్రియలలో విశేషమైన కృషిచేసి, పట్టిందల్లా కవిత్వపుబంగారంగా మార్చి, అన్ని రంగాలలో సమున్నతశిఖరాలని అధిరోహించిన సాహితీమూర్తి డా. నారాయణరెడ్డి. 1949 వ సంవత్సరంలో ప్రారంభమైన వీరి కవితాప్రస్థానం ప్రబంధ, భావకవితా మార్గాలచేత ప్రభావితమై, 1980 వ సంవత్సరంలో ప్రచురించబడిన ''విశ్వంభర'' కావ్యంలో కవి సమ్యక్ తాత్త్విక దృక్పథాన్ని వెలువరిస్తూ, ఆంధ్రకవిత్వంలో అన్ని ప్రక్రియలకి సముజ్వల దర్పణంగా భాసిస్తోంది. మూడు దశాబ్దాలుమైగా సాగుతున్న కవితా వ్యాసంగంలో నాలుగు పదులు మైగానే గ్రంథాలని వీరు ప్రచురించారు. వీటిలో ఖండ కావ్య సంకలనాలు పదిహేను, గేయనాటికలు నాలుగు, సుదీర్ఘ కావ్యాలు మూడు, కథాగేయ కావ్యాలు ఆరు, నాటికలు రెండు, లలితగేయ సంపుటి ఒకటి, చిత్రసాహితి ఒక సంకలనం కనిపిస్తాయి. డా. నారాయణరెడ్డి కవేకాక, మార్గదర్శకులైన విమర్శకులుకూడా. ఆధునికాంధ్ర కవితా విశ్లేషణం చేసిన పరిశోధకగ్రంధంతోపాటు రెండు విమర్శన వ్యాస సంపుటులు, యాత్రా సాహిత్యానికి సంబంధించిన మూడు గ్రంథాలు, నాలుగు అనుసృజనలు ప్రచురించారు. నా పరిశోధనకి వీరి కవిత్వంలో కావ్యబింబపరికల్పన పరిశీలన ముఖ్యోద్దేశం. అందుచేత వారి విమర్శన గ్రంథాలు, యాత్రానుభవాలు ఈ పరిశీలన పరిధిలోకిరావు. నాటికలు, కథాగేయాలు వస్తు ప్రాధాన్యంకలవికాబట్టి కవి వ్యక్తిత్వావిష్కరణకి దోహదకారులుకావు. అందుచేత వీటినికూడా ప్రస్తుత పరిశీలనకి స్వీకరించలేదు. డా. నారాయణరెడ్డి బహుముఖవ్యక్తిత్వావిష్కరణకి ఉపకరించే వీరి ఖండ కావ్య

సంకలనాలలోను, సుదీర్ఘకావ్యాలలోను కావ్యబింబపరికల్పన సవిమర్శకంగా పరిశీలించడానికి నేను ప్రయత్నం చేశాను. అన్ని ప్రభావాలని, అన్ని కవితారీతులని విశాలహృదయంతో ఆహ్వానించి, తమ సుకుమారభావసంపదతో కవితాత్మకంచేసి తెలుగు కవిత్వానికి ఒక రసరమ్యమార్గాన్ని ఏర్పరచినకవి కవిత్వ,మానసిక,తాత్త్విక స్వరూపాన్ని అవగాహన చేసుకోవడం నాపరిశోధన ఆశయం.

కవి వ్యక్తిత్వాన్ని అవగాహన చేసుకోడానికి ఆ కవి ప్రయోగించిన వివిధవర్గాల కావ్యబింబపరిశీలన ఉపకరిస్తుంది, కావ్యబింబపరికల్పన కవి అనుభవ క్షేత్రంలో ఉద్బుద్ధమౌతుందని ప్రథమఖండంలో స్పష్టంచేయబడింది. భారతదేశపు కవులకి సాధారణంగా ప్రకృతితో సన్నిహితసంబంధం ఉండటం కనిపిస్తుంది. పల్లెల్లో పుట్టిపెరిగి, విద్యార్జనకోసం, వృత్తికోసం పట్టణాలకి చేరుకున్న కవులకి ప్రకృతితో సంబంధం సన్నిహితం, ఎల్లప్పుడూ ఉంటుంది. వారి రచనలలో ఆది నుంచి తుదివరకు ప్రకృతి బహుముఖంగా, బహురూపాలతో దర్శనమిస్తుంది. డా.నారాయణరెడ్డి కరీంనగరం జిల్లాలో హనుమాజిపేట అనే పల్లెలో జన్మించి తన శైశవాన్ని పల్లెప్రాంతాల్లో గడపడం వలన వీరి కవిత్వం అంతటా ప్రకృతిదర్శనీయమవుతుంది. ప్రకృతి వీరికి సౌందర్యమూర్తిగా, శృంగారదేవతగా, మాతృమూర్తిగా, భయంకరస్వరూపిణిగా, దయావిహీనగా, ఆశనిరాశలకి సంకేతంగా, చైతన్యసంకేతంగా, విశ్వమూర్తిగానేకాకుండా తాత్త్విక దృక్పథానికి అలంబనంగా కూడా సాక్షాత్కరించింది. వీరు సమకాలీన సంఘాన్ని సూక్ష్మంగా పరిశీలించి మత, రాజకీయ, సాంఘిక పరిణామాల చేత/ప్రభావితులై, ఆ పరిణామాలని తమ కవితాదృష్టితో సమీక్షించి, తమ

కవిత్వంలో నాటికి తగిన కావ్యబింబ పరికల్పనచేశారు. మానవతాదృక్పథం, అభ్యుదయవిప్లవభావ వ్యక్తీకరణ వీరికవిత్వంలో గోచరిస్తాయి. సమకాలీన సంఘాన్ని అతిసున్నితమైన పంచేంద్రియశక్తితో దర్శించే వీరి కవిత్వంలో నాగరక అనుభవాలు, వైజ్ఞానిక ప్రగతి సహా వీరి ప్రత్యక్ష పరిజ్ఞానాన్ని వెల్లడిస్తాయి. ఇవికాక కవి అధ్యయనం చేసిన పురాణాలు, ప్రబంధాలు, సంఘనిష్ఠమైన సంప్రదాయం అందించిన విజ్ఞానం వీరికి పరోక్ష జ్ఞానాన్ని సంతరించిపెట్టాయి. వీటి సహాయంతో వీరు పరోక్ష కావ్యబింబ పరికల్పనచేశారు. ఈ సందర్భంలో సంఘనిష్ఠమైన ప్రతీకలప్రయోగంకూడా విరివిగా కనిపిస్తుంది. ఇవికాక కొన్ని విశ్వాసాలని, తాత్విక దృక్పథాలని వెలువరించడానికి కొన్ని ప్రతీకాత్మక గీతాలు వీరు రచించారు. ప్రతిభావంతుడైన కవి తన విశిష్టవ్యక్తిత్వం, దృక్పథం, తాత్విక చింతన వెల్లడించడానికి వైయక్తిక కావ్యబింబాలని ప్రయోగిస్తాడు. ఇటువంటి వైయక్తిక కావ్యబింబాలపరికల్పన కవిగా అతని స్థానాన్ని నిర్ణయించడానికి ఉపకరిస్తుంది. డా.నారాయణరెడ్డి కవిత్వంలో ఇటువంటి కావ్యబింబ పరికల్పన సమృద్ధిగా కనిపిస్తుంది.

## ప్రకృతి దర్శనం

### సౌందర్యమూర్తి

ఇరవై సంవత్సరాలు దాటకుండా ఈ కవి రచించిన గేయాలు ''జలపాతం'' అనే ఖండకావ్య సంపుటిలో మనకి కనిపిస్తాయి. ఈ సంకలనంలోని కవితలలో ప్రబంధ, భావకవిత్వాల ప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ''మరీచికలు'' అనే ఖండికలో విరహబాధని ప్రబంధరీతిలో కవి

చలువ వెన్నెలలో మందమలయ వాయు
వీచికలలోన విహరింప వెడలిపోతి
చలువ వెన్నెల వేడిగా, మలయ మృదుల
వాయువులు వాడిగా నాది కోయ దొడగె

నని చిత్రించారు. ''ఉగాది'' అనే ఖండికలో

తరుణీ కుచాలు నొవ్వ
పువ్వు విలుకాడు బాణాలు రువ్వినట్లు

వేడితో ఉడికిపోయే వల్లెమొగలమీద వడగళ్ళు రాలాయని శృంగార భావ స్ఫోరకంగా కవి చిత్రించారు. ''నారాయణరెడ్డి గేయాలు'' అనే కవితా సంకలనానికి ''నా మాట'' వ్రాస్తూ నారాయణరెడ్డి ఈ కవితలలో 'కొన్ని

శృంగార భావనను పొదుగుకున్నవి''[1] అని తెలియచేశారు. ఇందులో ''యౌవనం'' అనే ఖండికలో యౌవనాన్ని ప్రకృతిలో అందంగా భావిస్తూ

బాల్య
తుహినావగుంఠనము
తొలగించి వెలువడిన
ఉదయ సంధ్యాకాంతి
ప్రమించు యౌవనము 1.

అని చిత్రించారు. ''ప్రకృతిలోని ప్రణయిని'' అనే ఖండికలో ప్రకృతిని తన ప్రేయసి రూపంగా నిలవాలని అభిలషిస్తూ చుక్కలు ఆమె ''నల్లని వాల్జడల సందున మల్లియలు''గా, మెరుపు తీవెలు ఆమె చిరునవ్వులుగా, మబ్బులు ఆమె ''ఫాలాంగణమున ముంగురులు''గా రూపుదాల్చాలని, ప్రకృతికి ప్రేయసికి తాదాత్మ్యాన్ని కని చిత్రించారు. ''మదనోల్బణం'' అనే ఖండికలో ప్రకృతికి మానవ సహజమైన ప్రణయభావనని ఆపాదిస్తూ

అస్త సూర్యుడు చుంబ
నాత్మక క్రియ సల్ప
సంధ్యాలతాంగి రో
ష కషాయ ముఖియయ్యె

''నారాయణరెడ్డి గేయాలు'',
20.

---

1. డా. నారాయణరెడ్డి, 'నామాట', 'నారాయణరెడ్డి గేయాలు'

నని చిత్రించారు. నూతన సంవత్సరాన్ని ''చంద్రముఖి''గా భావిస్తూ ప్రకృతిలో అందాల సమాహారంగా ఉగాదిని భావిస్తూ

అలరులను తలిరులను
వలువలుగ మలచుకొని
పూర్ణేందు బింబమును
మొగమందు ముడుచుకొని

దివ్వెలమువ్వలు, 71.

వచ్చిన సుచ్చెకంటిగా కవి రమణీయంగా చిత్రించారు. ''మాట్లాడేస్మృతులు'' అనే ఖండికలో తను ఆనందానుభూతులని స్మరిస్తూ, వెన్నెల చమురు వంటి బట్టించుకొని, పన్నీటి కుల్యాల్లో జలకాలాడుకుని, కస్తూరి గేర్నామం దిద్దుకుని, కలువ పుష్పాక్షు మెయినిండా అద్దుకుని, తెమ్మెరపల్లకీనై షికారు తిరిగిన క్షణాలు

కనిపిస్తున్నాయి పాత చుట్టాల్లాగ
తునిగిపోయిన కలలోని చిత్రాల్లాగ

''అక్షరాల గవాక్షాలు'', 105.

అని కవి చిత్రించారు. ''రేఖా చిత్రాలు'' అనే ఖండికలో హేమంతకాలపు పచ్చని పొలాన్ని వర్ణిస్తూ

హేమంత శర్వరి ఉషస్సు కిచ్చిన కానుక
పచ్చని గరిక మెళ్ళో పచ్చిముత్యాలసరం 115.

అని రమణీయంగా చిత్రించారు. ''వింత వసంతం''లో ఆకాశాన్ని ప్రతిభావంతంగా వర్ణిస్తూ

తెల్లని నల్లని మబ్బులు తొడుక్కుని
ఒళ్ళుదాచుకుంటుంది ఆకాశం

అని ఆకాశాన్ని ముగ్ధగా కవి మనముందు నిలబెట్టారు. ''పాపంశశి''అనే ఖండికలో మనిషి చంద్రునిపై కాలుపెట్టాక సుధకాదు నేలే ఉంది సుద్ద అని గ్రహించినా, రాకేపున్నమిరేయి చంద్రుణ్ణి చూశాక

మధ్య ఉన్న మచ్చకేంగాని
మా ముద్దుగా ఉన్నావు
మరిగిన పాల కుండమైన
నురుగు ముద్దలా ఉన్నావు

''మరో హరివిల్లు'', 8.

అని చంద్రుని అందాన్ని కొంత విచిత్రంగా, సానుభూతి పూర్వకంగా కవి చిత్రించారు. వివేకాన్ని ప్రకృతిలో అందానికి సంకేతంగా కవి భావించారు.

''నీటిపాట'' అనే ఖండికలో నీటిని అందానికి సంకేతంగా భావిస్తూ

నీరు పారుతున్నది
పాటలా
పరిమళంలా
వెన్నెలలా
వేకువవెలుగులా
నీరు పలుకుతున్నది
మువ్వలా
మురళిలా
శారికలా
మోహనరాధికలా

''మార్పు నాతీర్పు'', 5.

అని పారేనీటి అందాలని, పలికేనీటిమోహనరాగాలని కవి వ్యక్తంచేశారు. ''రవీంద్రు డొచ్చాడు'' అనే ఖండికలో రవీంద్రుని కవిత్వంలో సౌందర్యారాధన ఒక ముఖ్యభాగం అని తెలియచేస్తూ

రాగోదయాలు
రసోదయాలు
శిశిరం నొసట వసంత
శిశూదయాలు
పాటల దోసిళ్ళు
పలుకుల పుప్పొళ్ళు

ఇంటిపేరు చైతన్యం, 23.

ఆయన సౌందర్యారాధనకి సంకేతాలుగా కవి చిత్రించారు. ''మృత్యువునుంచి'' అనే సుదీర్ఘగీతంలో ఋతుచక్రభ్రమణం వలన వచ్చే అందమైన ఫ్రూలకాలాన్ని మానవునికి ఆనందకారకంగా భావిస్తూ ప్రకృతిలో అందాన్ని

మెరుపు మెరుపులో మింటి ఒంటిలో
మిరుమిట్లు కనుగీట్లను ఉరికించే
కరి మబ్బుల గజగమనలు

''మృత్యువునుంచి '', 17.

గా కవి ప్రదర్శించారు. ''కాగితం''అనే ఖండికలో కవికి

రాసిన కాగితం -
వెన్నెల్లో చిగు
రేసిన యవ్వనం

''మృత్యువునుంచి'', 49.

గా కనిపించింది. మానవుని ఆలోచనలని అక్షరరూపంలో వహించే కాగితం కవికి చిగురించిన యౌవనంగా వెన్నెలకి సార్థకతని కలిగిస్తున్నట్టు కనిపించింది. ''భూమిక''అనే కావ్యంలో ఆదికాలంనాటి భూమి కవికి సౌందర్యమూర్తిగా

పుడమి యేమో వెండ్రి పడుచై
పుల్ల హారితోత్పలకయ్మెక
శ్యాణ వేళా త్రపామాలా
లలితమూర్తి గ

''భూమిక'', 4.

స్వరూపస్వాక్కుల కాణాచిగా కనిపించింది. విశ్వమానవేతిహాసాన్ని తాత్త్వికదృష్టితో చిత్రించిన ''విశ్వంభర'' కావ్యంలో కని ప్రకృతిని సౌందర్యమూర్తిగా భావిస్తూ

ప్రతి తరువు ఎదుగుతున్నది
పచ్చని శ్వాసలతో
ప్రతి సుమము పలుకుతున్నది
పరిమళ భాషలతో

''విశ్వంభర'', 15.

అని ప్రకృతి పురుషుని భాగస్వామినిగా చిత్రించారు. ఒక్కొకసారి ప్రకృతి మానవునికి పసిపిల్లవానివలె కనిపిస్తుంది. ఆ సమయంలో కవికి ప్రకృతి

జాలువారే ఆయేరు తోచింది తనకు
పాల వేళ్ళతో నిమిరినట్లు

''విశ్వంభర'', 17.

అని ప్రకృతిలో పసిపిల్లల అమాయకపు వాత్సల్యాన్ని కని దర్శించారు. నిత్య సంఘర్షణలో ప్రగతి మార్గాన పయనించే మనసు ప్రకృతిలో వైరుధ్యాలని అధిగమించి అందాన్ని దర్శిస్తుంది అని విశ్వసించి,

అది చూసింది కటిక చీకటిని కాదు
కడకంటితో చిలికే కలికి చీకటిని

''విశ్వంభర'', 43.

అని మనసుని బాహ్యమైన పరిమితులని దాటగలిగే మహత్తరశక్తిగా కవి చిత్రించారు.

ఆశకి ఆకృతి

తత్వతః డా.నారాయణరెడ్డి ఆశాజీవి. తమ ఆశాభావాన్ని ప్రకృతిలో దర్శించి తమ కవిత్వంలో ప్రదర్శించారు. ఈ దృక్పథం వీరి కవిత్వంలో మొదటినుండి ఈనాటివరకు ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ''నారాయణరెడ్డి గేయాలు'' అనే సంకలనంలో ''చింతమానవుడు'' అనే ఖండికలో

పశ్చిమ దిక్కూలాంచల
పతత్ పతగ బింబములో
రేపటి అమృత ప్రభాత
రేఖల సందర్శించెడు
నేను చింత మానవుడను

''నారాయణరెడ్డిగేయాలు'', 41.

అని నిరాశలో సహితం ఆశని దర్శించగల ఆశావాదిగా కనిపించారు. ''ఆత్మదర్శనం'' అనే ఖండికలో ప్రకృతిలో ప్రతికూలశక్తులని అనుకూలంగా పరివర్తింపచేసుకోగల శక్తి తనకున్నదని తెలియచేస్తూ,

కాలమొక యెడారైతే
ఖర్జూరముగా మారి
ఆశయెండమావైతే
అందులోని జలమూరి
బ్రతుకు బురదనుడియైతే
పద్మంలా వికిలేచి

''దివ్వెలమువ్వలు'', 27-28.

ప్రకృతిని తమ వశవర్తినిగా తీర్చిదిద్దుకోగలనని కవి తమ ఆశాపూరిత విశ్వాసాన్ని ప్రకటించారు. తను ఇరవైయ్యోదవ జన్మదినసందర్భంలో ఆత్మావలోకనం చేసుకుందో తాను మిసిమిపండు లేబ్రాయము వారైనా

నమ్ముడు చీకటికడుపు చించి
బయటపడినట్టి నెల్బురు పాపనేను

దివ్వెలమువ్వలు, 50.

అని చీకటిపై విజయాన్ని సాధించగల వెలుతురుకి సంకేతంగా తమని తాము చిత్రించుకున్నారు. ''జాగృతుడు'' అనే ఖండికలో తమ చుట్టూఉన్న శత్రువులని

మిత్రులుగా మారుకోగలిగిన నిత్యజాగృతుడుగా

నాముందర గుడ్లగూబల్లె మసలెడు చీకట్లను
చుంచుదున్నై చకోరని పుంస్కోకిలలుగ మారుకొందు

''అక్షరాల గవాక్షాలు'', 12.

నని తమ విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. ''కోరికలు'' అనే ఖండికలో

జీవిత సంగ్రామంలో చితికిన బొమికలు
చిగుళ్ళు తొడుక్కోవాలి
మధ్యలో పుటుక్కున తెగిపడ్డ ఆశలకు
మళ్ళీరెక్కలు మొలవాలి

''అక్షరాల గవాక్షాలు'', 108.

అని చితికిన జీవితాలు నవచైతన్యంతో చివురులెత్తాలని, మానవుని ఆశలు రెక్కలు దాల్చి ఆశయాల ఆకాశాల్లో విహరించాలనే ఆశని కవి ప్రస్ఫుటంచేశారు. మానవుడు అనాదిగా ఎన్నో సమస్యలతో సతమతమవుతో సుఖాన్ని అన్వేషిస్తున్నాడు అనే భావాన్ని

అగ్ని పర్వతం అంచుమీద
ఆనందం వెతుకుతున్నాడు

''మంటలూ-మానవుడు'', 46.

అని ఆశాస్ఫోరక కావణించిబంధ్వారా వ్యక్తంచేశారు. ''ఏమిటి చీకటి'' అనే ఖండికలో చీకటిని అవివేకానికి, వెలుతురుని వివేకానికి సంకేతాలుగా స్వీకరిస్తూ, చివరికి వివేకం వికసిస్తుందని ఆశిస్తూ,

పాయదీసిన కురులమధ్య
పాపట కనిపించినట్లే
విరగబూసిన ఇరులమధ్య
వేకువ వికసిస్తుంది.

''ముఖాముఖి'', 25.

అని ప్రతిగృహంలో నిత్యమూ కనిపించే స్త్రీలపాపటని వెలుతురురేకగా కవి అతి సహజంగా చిత్రించారు. ''ఇప్పటికేనమ్ముతున్నాను'' అనే ఖండికలో ఎన్నో అపజయాలు ఎదురైనా, ఎన్నిగాయాలు తగిలినా హృదయం పచ్చగానే ఉందని ఆశని వెల్లడిస్తూ,

ఏన్నేవా దీపమో వెలుగుతుందని
ఇంతటి చిమ్మ చీకటి సంతలో
ఎలవెలుగుల తొలిరేక విరియనుందని
ఇప్పటికే నమ్ముతున్నాను

''మనిషీ-చిలక'', 46.

అని జీవితంలో చీకటిపై వెలుగు జయిస్తుందని కవి విశ్వసించారు. ''క్షణక్షణ నిరీక్షణ'' అనే ఖండికలో ప్రకృతిలో సర్వశక్తులు ఆశామయమైన భావికోసం ఎదురు చూస్తుంటాయని తెలియచేస్తూ ఎడారి గరిక పరకకోసం, పుడమి వానచినుకుకోసం, తోట వసంతంకోసం ఎదురుచూస్తాయని

ఎడారిలా మండుతూ
పుడమిలా ఎండుతూ
తోటలా తొంగిచూస్తూ

''తేజస్సు నాతపస్సు'', 38.

ఆశాజనకమైన భవిష్యత్తుని ఆహ్వానిస్తాయని కవి తెలియచేశారు. ''ఎందుకీ మూకానుకరణం?'' అనే ఖండికలో ఏనాటికైనా మతిమాసిన సగటు మనిషి హేతువాద గదాధరుడై ఉజ్జ్వలించే సుముహూర్తం రాదా అని ప్రశ్నిస్తూ, ఆ సుముహూర్తం తప్పక వస్తుందని ఆశిస్తూ

ఉన్ముక్త మానవతా విహంగం
ఉత్తాల గగనాల నందుకోరా?

''ఇంటిపేరు చైతన్యం'', 17.

అని ప్రశ్నిస్తూనే మానవుడు విహంగంలా ఎత్తైన ఆకాశంలో విహరించగలుగుతాడనే ఆశని స్పష్టంచేశారు. తమ ఆశాదృక్పథాన్ని ప్రకృతికి ఆపాదిస్తూ ''మథనం'' అనే కావ్యంలో

మోడు కలవరిస్తున్నది
పుష్పి జీవించాలని
నేడు కలవరిస్తున్నది
రేపై జీవించాలని

''మథనం'', 7.

అని కవి ప్రకృతితో 'సహానుభూతి' (empathy) ని ప్రదర్శించారు. ప్రకృతిలో అవంధ్యాలని అధిగమించే శక్తి తమకున్నదని వెల్లడిస్తూ

ఎంతటి చలివున్నా, క
ట్టెదురుగ పులి వున్నా, సరి
కొత్త మంట పదును పెట్టు
కుంటూనే వున్నాను

''మథనం'', 11.

అని చలిని పులిని ప్రకృతిలో అవంధ్యాలుగా చిత్రిస్తూ సరికొత్తమంటని తమ సరికొత్త ఆశగా కవి చిత్రించారు. జీవితంలో చీకటి వెలుగుల సంఘర్షణ నిత్యం అని, అయినా ఇంతటి ఒరపిడిలో తాను ఇంకా

మృతిలేని ఆశకు శృతి చేస్తుంటాను

''మథనం'', 45.

అని తమ ఆశని సంగీతంలో ముఖ్యమైన శ్రుతిలో పెల్చిచూపారు.  ఏ పక్షీ పాడని కోనలలో, ఎడారులలో చివరికి

పంచమ స్వరం ఎగురుతుంది
పక్షి పాడని ఈ కోనలో
చైత్రరాత్రి రగులుతుంది
సంకీర్ణ పత్రాల వానలో

''మథనం'', 76.

అని ఆశని స్వేచ్ఛగా ఎగిరే పక్షిలో, రాగంతో సమ్మేళనంచేసిన కావ్యబింబంద్వారా వెల్లడించారు.  ఆకులు రాలిన కాలం నిరాశగా, ఆ తరువాత రగిలే చైత్రరాత్రి చైతన్యజ్వాలగా, ఆశాకేలగా కవి చిత్రించారు. ''ఉరి''అనే ఖండికలో 'ఉరి' కే కొత్త ప్రయోజనాన్ని కల్పిస్తూ తన పేరుని తానే ఉరితీస్తున్నానని ప్రకటించారు. ఆ తరువాత తన ఉరిని వార్తాపత్రికలలో ఏమూలనైనా ప్రకటించమని కోరుతూ క్షణికమైన తమపేరు ఉరిని నిత్యోదయానికి నాందిగా భావిస్తూ

అంటున్నది నాపేరు
''ప్రతిరోజా అర్ధరాత్రి ఉరితీయండినన్ను
బ్రతికొస్తాను రేపటి ఉదయాని'' కని

తమ పేరు నిత్యనూతనంగా ఉదయిస్తుంది అనే ఆశని కవి వ్యక్తీకరించారు. ''విశ్వంభర''లో మానవుడు ఊపిరిని కోల్పోయి భూమిపై శాశ్వత స్థాణువుగా ఉండాలా అని ప్రశ్నిస్తూ మానవుడు నిత్యచైతన్యవంతుడు అనే తమ ఆశాభావాన్ని

కాదన్నది ఎలుగెత్తి జీవనది
కాదన్నది పువ్వుల్ని పులకిలిస్తూ
కదలివచ్చే వాసంత సంజీవనీహ్రాది

''విశ్వంభర'', 14.

అని జీవనది, వాసంత హృదయం చైతన్యసంకేతాలుగా కవి ప్రదర్శించారు. మానవ పరిణామ గాథలో ప్రగతి తప్పనిసరి అని తమ విశ్వాసాన్ని ప్రకటిస్తూ

అరుణోదయం ఊరుకోదు
కిరణాలను సారించనిదే
వసంతోదయం ఊరుకోదు
పరిమళాలను పారించనిదే

''విశ్వంభర'', 53.

అని తను ఆశని చిత్రించారు. ఏసుక్రీస్తుని అజ్ఞానతిమిరంపై జ్ఞానజ్యోతి విజయానికి ప్రతీకగా స్వీకరిస్తూ

విత్తనాన్ని మట్టిలోకి విసిరికొడితే
వృక్షమై వెలుతుందది

''విశ్వంభర'', 59.

అని జ్ఞానవాణి నాలుగు దిక్కుల్లో లక్షకంఠాలుగా మ్రోగుతుందని కవి వెల్లడించారు. ఆధునిక కాలంలో మానవజీవితంలో ప్రత్యక్షమయ్యే ఎగుడుదిగుళ్ళు, ఎదురుదెబ్బలు కవి ప్రదర్శిస్తూనే తమ అకుంఠిత ఆశాభావాన్ని ఈవిధంగా వ్యక్తంచేశారు.

ఆకులు రాలిపోతే నేమి ?
చిగురాకులు పుట్టవా?
నీళ్ళు ఇగిరిపోతేనేమి?
నీలిమబ్బులు గజ్జెకట్టవా?

అని మొదటి రెండు చరణాల్లో షెల్లీ ప్రకటించిన "If winter comes, can spring be far behind ?"[2]. అనే ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. తరువాత రెండు పాదాల్లో కవి తమ స్వానుభవ జనితమైన కావ్యబింబాన్ని ప్రయోగిస్తూ నదిలో నీరు ఆవిరిగామారి మబ్బుగా రూపధారణచేసి ఆ మబ్బులు ఆకాశప్రాంగణంలో

---

2. P.B.Shelley, Ode to the Westwind, 1.70.
డా.దాశరథి కూడా తమ ఆశని వ్యక్తంచేయడానికి షెల్లీ పాదాలనే అనుకరించారు. 'మహాంధ్రోదయం', 175.

నత్తలంచేసి చివరికి వర్షధారలు కురిపిస్తాయి అనే ఆశని ప్రతిభావంతంగా వ్యక్తం చేశారు. వీరి రచనలలో వీరిసమ్యక్ తాత్త్విక దృష్టిని ఆవిష్కరించిన ''విశ్వంభర'' కావ్యం ఆశామయంగా ముగియడం కవి పరిణత ఆశాదృక్పథానికి ఉత్తమ నిదర్శనం. కవికాని, ఏ రచయితకాని తమ రచనలలో ప్రముఖంగా ఆశాదృక్పథాన్ని వెలువరించడం ఆవశ్యకం అని జార్జి ఆర్వెల్ అనే ఆంగ్లేయ రచయిత నొక్కివక్కాణించడం ఈ సందర్భంలో గుర్తుంచుకోవలసిన విషయం.[3]

<u>చైతన్యస్ఫూర్తి</u>

జీవితం చైతన్యానికి సంకేతంగా భావిస్తూ ''మంటలూ-మానవుడు'' అనే సంకలనంలో

బ్రతుకంటే ఉద్దీప్త చైతన్యం
జలవిద్యుత్తు తో దాని బాంధవ్యం

''మంటలూ-మానవుడు'', 36.

---

3. George Orwell, "No honest person claims that happiness is now normal condition among adult human beings; but perhaps it <u>could</u> be made normal and it's upon this question that all serious controversy really turns", 'Inside the Whale and other Essays', 134.

అని తమ చైతన్యప్రియత్వాన్ని వెల్లడించారు. ''రూపము - ఊపిరి'' అనే ఖండికలో అంధ తమస్సులో చిక్కుకున్న మానవుని అపూర్వశక్తిగా తీర్చిదిద్ద గలిగే ఊపిరి అవసరం అని వెల్లడిస్తూ తాము కోరుకునే చైతన్యానికి

ఊపిరి పునాదిలాంటిది
ఉక్తి ముఖద్వారం లాంటిది
చూపు గవాక్షం లాంటిది
రూపు గోపురం లాంటిది

''మనిషీ-చిలక'', 60.

అని చైతన్యమార్గాన్ని కని సృష్టించారు. సకల సృష్టి చైతన్యానికి తమని పేరగత శక్తిగా భావించుకుంటూ తాము చేయికలిపితే సూర్యేందు చక్రాలు కదలు తున్నాయి, తాను అడుగువేస్తే గ్రహచరణాలు ఉద్వేగించి ఉరుకుతున్నాయి అని వెల్లడిస్తూ

నా యింటిపేరు చైతన్యమని
నా కంఠమే పాంచజన్యమని

''ఇంటిపేరు చైతన్యం'', 9.

ఒక అభినవ మహార్ణాదాన్ని కవి వినిపించారు. మానవ నాగరకతా ఆరంభదశలో సుప్తచేతన నుంచి దీప్తలయ స్పందనం పొందిన పరిణామ స్థితిని

అరికాళ్ళలో చొరబడ్డాయి
ఉరకలు తీసే లేళ్ళు
చరణాలలో పురివిప్పాయి
సంభ్రమించే నెమళ్ళు

''విశ్వంభర'', 24.

అని లేళ్ళని, నెమళ్ళని చైతన్యానికి సంకేతాలుగా ప్రయోగిస్తూ కవి చైతన్య దీప్తిని ప్రదర్శించారు. ప్రకృతికి, సృష్టికి, ఈ చైతన్యమే జీవహేతువు అని నమ్ముతూ

ఉండలేదు భూమి తిరగనిదే
నిలవలేదు నీరు పారనిదే
దాగలేదు వెలుగు తరలనిదే
ఆగలేదు గాలి కదలనిదే

''విశ్వంభర'', 25.

అని భూమి, నీరు, వెలుతురు, గాలి చైతన్యస్ఫూర్తిమంతాలుగా కవి చిత్రించారు. వీరు ఎక్కువగా అభిమానించే లక్షణాలలో చైతన్యం ముఖ్యమయింది. వీరికి

జడత్వం అంటే చెప్పలేని జుగుప్స నిత్యచైతన్యవంతుడైన మానవుడు అత్యంత అర్ధాభుడు. అందుకే తమ ఇంటిపేరులో ''సి'' అంటే సింగిరెడ్డి కాదు ''చైతన్యం'' అని ఆయన ప్రకటించినట్లు ''ఇంటిపేరు చైతన్యం'' అనే కావ్యసంకలన శీర్షిక వెల్లడిస్తోంది. ప్రగతిశీలమైన మానవపరిణామం నిత్యప్రస్థానం అని, నిరాశల కీనీడలకి జడుసుకోక, స్వప్నాల బుడగలకి భ్రమసిపోక

సాగిపోతాడు కాంతిలహరిలా
చైతన్య కేతనుడు మానవుడు

''విశ్వంభర'', 82.

అని చైతన్యంమీద నమ్మకాన్ని వెల్లడించారు.

<u>తాదాత్మ్య ప్రదర్శన</u>

''ఉభయ సంధ్యలు'' అనే ఖండికలో ప్రకృతి సుఖసంతోషాలతో తమ తాదాత్మ్యాన్ని వెల్లడిస్తూ

అశ్రు విపంచే ఝంకృతిలో తా
దాత్మ్యము పొందినదెవ్వరు - నేనే.....
సురప్రవంతీ తరంగ ధాటికి
ధరమై రాలిన దెవ్వరు - నేనే

''నారాయణరెడ్డి గేయాలు'', 45.

అని ప్రకృతితో తమ అవినాభావ సంబంధాన్ని చిత్రించుకున్నారు.

ప్రకృతిలో తాదాత్మ్యం అనుభవిస్తూ, తాము అఖిల విశ్వస్వరూపంగా భావించుకుంటూ

ఇనబింబం నాశిరస్సు
ఇందు బింబం నామనస్సు.....
గగనం నావదనం
ఉదయం నాహృదయం

''ఉదయం-నాహృదయం'', 111.

అని తమ విశ్వరూపాన్ని చిత్రించుకున్నారు. మాకందాలు అనే నూత్న ఛందో ప్రయోగాలల్లో తాము ప్రకృతి స్వరూపంతో తాదాత్మ్యాన్ని పొందినట్లు స్పష్టంచేస్తూ,

వేకువ ఉచ్ఛ్వాసంగా
చీకటి నిశ్వాసంగా
ఈ కాళ్ళే రెక్కలుగా ఎగిరి నడుస్తా
నా కళ్ళే చుక్కలుగా నవ్వుతూ చూస్తా

''ఇంటిపేరు చైతన్యం'', 12.

అని
కవి చిత్రించుకున్నారు. ప్రకృతిస్వరూపాన్ని తను రూపంలో దర్శించుకుంటూ ''ఉభయ పక్షాలు'' అనే ఖండికలో

చుక్కలు నాకనుపాపల్లో
చోటు చేసుకున్నాయి
మేఘాలు నాకళ్లల్లో
రాగాలు వర్షిస్తున్నాయి

''ఉదయం నాహృదయం'', 14.

అని శరత్తులు, పూర్ణకౌముదీ పరిత్తులు తమ పెదవులపై నవ్వుల నురగలుగా పొరాడు తున్నాయని కవి రసపారవశ్యంతో చిత్రించారు. ''ప్రకృతి + ప్రకృతి'' అనే ఖండికలో

ఉదయం
వికసించింది నానుదుట
అస్తమయం
ముకుళించింది నా కనుబొమ్మల కుదుట

''ఉదయం నాహృదయం'', 50.

అని ప్రకృతి పరిణామాలని తమ వ్యక్తిత్వంలోనే కవి దర్శించుకున్నారు. ''భూమిక'' లో మానవుడు ''ఇలనే స్వర్గీకరించు మహితుడు'' అని ప్రకటిస్తూ

ఈ పురోగమనానికి ఆశ భూమిక అని, ఆ ఆశని మానవుడు ప్రకృతిలో చిగుళ్ళలో దర్శించుకుని

కురిసే హిమబిందువు తన
తరళ బాష్పమే అనుకొని
విరిసే సుమ మసృణిమ తన
తరుణిమ యేమో అనుకొని

''భూమిక'', 82.

ముందుకు సాగే మానవుడు ''చచ్చి బ్రతికేది స్వయంభువుడు'' అని మానవునికి ప్రకృతితో తాదాత్మ్యాన్ని కవి ప్రదర్శించారు. మానవుని మనసులో ప్రభాత సమయంలో ఊర్ధ్వంగా ఎగిసే ''ఉన్మత్త నాద జలపాతం'' ఆతని నాదం దేని నినదించిన స్వరసంగమంగా భావిస్తూ, తమలోని సుఖసంతోషాలే సప్తస్వర సమ్మేళనంగా వినిపించాయని కవి తెలియచేశారు. మానవుని మనసుకి, ప్రకృతిలో నాదాలకి ఈ తాదాత్మ్యాన్ని స్పష్టంచేస్తూ

ప్రకృతిలోని మూలనాదమే
వెకలివచ్చిందా తనలోకి?
తనలోని జీవనాదమే
తరలిపోయిందా ప్రకృతిలోకి?

''విశ్వంభర'', 21-22.

అని కవి మౌలిక ప్రశ్నలు వేశారు. ఈ ప్రశ్నకి సమాధానంగా విశ్వాత్మ జీవాత్మల అద్వైకస్థితిని వెల్లడిస్తూ

తన తనువులో ఉన్నది ఆ భువనమే
తన శ్వాసలో ఉన్నది ఆ పవనమే
తన రుధిరంలో ఉన్నది ఆ ప్రసారమే
తన శిరస్సులో ఉన్నది ఆ భ్రమణమే

''విశ్వంభర'', 25.

అని చిత్రించారు. తను సుఖసంతోషాలని ప్రకృతిలో దర్శిస్తూ

తనలో ఒక కల్లోలం
ఘోషించింది కడలికెరటం
తనలో ఒక ఉల్లాసం
పులకించింది పున్నమి కిరణం

''విశ్వంభర'', 26.

అని కవి తమ 'సహానుభూతి' (empathy) ని తెలియచేశారు. మానవుడు ప్రకృతిచేతిలో కీలుబొమ్మకాదు. ప్రకృతినే తన అభిమతాలకి అనుగుణంగా పరివర్తన చేసుకోగలిగే సమర్థునిగా మానవుణ్ణిచిత్రిస్తూ

తన కన్ను పలికితే నే ఉదయం
తన మనసు మలిగితేనే అస్తమయం
తానే ఒకచైతన్య వారిధి
తానే దానికి కట్టిన వారధి

''విశ్వంభర'', 71.

అని మానవుడు ప్రకృతితో తాదాత్మ్యం చెందడం కాకుండా ప్రకృతిమీద విజయాన్ని కూడా పొంది, ప్రకృతిమానవులమధ్య సహకారాన్ని సంతరించే వారధిని కూడా నిర్మించగలుగలతాడని కవి తమ దృఢ విశ్వాసాన్ని వ్యక్యంచేశారు.

## భయానక రూప దర్శనం

కొన్ని సందర్భాల్లో, కొన్ని మానసిక పరిస్థితులలో కవికి ప్రకృతి భయానకంగా, దయావిహీనగా, నిరాశకి సంకేతంగా కనిపించింది. ప్రకృతి సహజమైన భయానక స్వరూపం దీనికి ఒక కారణం. అంతేకాకుండా ప్రకృతిని తన మానసిక సంచలనానికి దర్పణంగా కని భావించడంకూడా సర్వసామాన్యమైన కవితానుభవం. బెన్ జాన్సన్ వంటి ఆంగ్ల విమర్శకులు Literature holds mirror upto nature అని అన్న వాక్యాన్ని సాహిత్యం కవి మానసిక ప్రకృతికి దర్పణం అని వ్యాఖ్యానించుకవచ్చు. ఇలాగే బాహ్యప్రకృతి కూడా కవి మానసిక ప్రకృతికి దర్పణం అని భావించవచ్చు. ఇరాకీలో రాచరికాన్ని

అంతమొందించే జనశక్తి విజృంభించగా, ఆ జనశక్తిని ''జ్వాలాముఖి'' అనే ఖండికలో మహోఘనతనవహించిన ప్రభువులకి భయంకరమైన సముద్రతరంగ జ్వాలగా చిత్రిస్తూ

జ్వాలా జిహ్వలను సాచి
నేలాభ్రందాక లేచి
జంగ సాచివస్తున్నది
భంగపడ్డ జనహృదయం

''దివ్వెల మువ్వలు'', 71.

అని చిత్రించారు. ''మాధవవేల'' అనే ఖండికలో జీవితంలో కష్టాలని ప్రకృతిలో దర్శిస్తూ

కష్టాలనలె ముసురు కారుమబ్బులు.....
దుఃఖాలవలె జారు తుహినధారలు
పశువాంఛవలెరేగు శిశిరానిలము

''నారాయణరెడ్డిగేయాలు'', 17.

అని మధుమాసం వేదినన్నింటిని మరిపించే మధురమాసంగా కవికి కనిపించింది. ''వింతవసంతం'' అనే ఖండికలో వసంతకాలపు కిసలయాలు అందానికి ప్రతీకలుగా కాక, ప్రకృతిలో దైన్యానికి, భయానకతకి సంకేతంగా కవికి కనిపించాయి.

చిగుళ్ళు, పురిట్లో సంధికొట్టిన
శిశువుల్లా ఊడిపడుతున్నాయి
పండుటాకులేమో గబ్బిలాల్లాగా
పట్టుక వేళ్లాడుతున్నాయి

''అక్షరాల గవాక్షాలు'', 14.

లోకంలో క్వచిత్తుగా తరుణవయసులో మిసమిసలాడే యువకులు హఠాన్మరణం చెంది, ఎముకలు కుళ్లిన, వయసుమళ్లిన వృద్ధులు ఇంకా జీవించి ఉండే అస్తవ్యస్తపరిస్థితి కవి ఈవిధంగా చిత్రించడానికి కారణం కావచ్చు. కీట్సు

Where palsy shakes a few, and, last gray hairs,
Where youth grows pale and spectre-thin and dies[4].

అని అత్యంతప్రతిభావంతంగా చిత్రించాడు. ''రాత్రిపుట్టిన ఉదయం'' అనే ఖండికలో భావిఉదయానికి సమయం కాకముందు ఉన్న భయానకపరిస్థితిని

ఊడల మర్రిలా అల్లుకున్న అర్ధరాత్రి
పాడు నిద్రలో తూగుతున్న వృద్ధ ధాత్రి

''ముఖాముఖి'', 32.

---

4. John Keats, 'Ode to Nightingale', Ll, 25-26.

గా చిత్రించారు. 'మనసా, నీకు తెలుసా!' అనే ఖండికలో వర్తమానంలో మానవుని ఉన్మాదం మానవునిచుట్టూ ''ప్రళయతాండవం''చేస్తుంటే

ఈ పొద్దున మనం తాగేవి
కాళరాత్రి పితికిన
కారు చీకటిపాలు

''మనిషీ చిలకా'', 66

అని మానవుని వికృతరూపాన్ని కవి ప్రదర్శించారు. ఈనాటి ఉన్మాదం మానవుణ్ని భయంకరంగా మారుస్తోంది అని తెలియచేయడానికి ప్రకృతిలో భయంకరశక్తులని సంకేతాలుగా ప్రయోగిస్తూ

తన శిశువును తానేతినే వ్యాఘ్రిలాగా
తన ఆకుల్ని తానే కొరికే శిశిర తరువులాగా

''మనిషీ చిలకా'', 67.

మానవుడు తన వినాశనానికి తానే కారకుడు అవుతున్నాడని కవి హెచ్చరించారు. సంఘంలో ఆర్థిక అసమానత, దురన్యాయం సృష్టించేనల్లడబ్బుని ''నల్లవాన'' అనే ఖండికలో

వానకురుస్తున్నది నల్లగా
నగరం నడిబొడ్డుమీద
పగలారబోసిన రొడ్డుమీద

''మారునాతీరు'', 35.

అని నగరాల్లో విచ్చలవిడిగా నడిరోడ్డుమీద జరిగే అక్రమ వ్యాపారాలని కవి వ్యంగాత్మకంగా సూచించారు. తీరాంధ్ర ధరణికి జరిగిన తుఫాను ప్రమాదాన్ని

మూడు సార్లు వచ్చి ముంచెత్తి పోయినది
వెనుతుఫానా ? కాదు, కనులు మండిన ప్రకృతి

''ఇంటిపేరు చైతన్యం'', 52.

అని ప్రకృతి వైపరీత్యాన్ని మానవునిమీద ప్రకృతి ఆగ్రహంగా కవి చిత్రించారు. మానవప్రగతిలో శాంతం మూలం, సహనం మోక్షస్వరూపం అని భావిస్తూ, ఈ శాంత సహనాలు అదుపులో ఉన్నపుడే మానవప్రగతి సాధ్యం అని, లేకపోతే

పసరు మొగ్గలవైన రాలి
కుసుమములుగా మలచివేసే
మంచుకే శక్తి మించెనా
అది ముంచి వేయును మహీతలమును

''భూమిక'', 59.

అని నీరు నీరుగా ఉన్నప్పుడు వృక్షాలపెరుగుదలకి ఉపకరిస్తుంది. ఆ నీరు మున్నీరుగా మారితే లోకాన్ని ముంచివేస్తుంది అనే ప్రకృతి సత్యంద్వారా మానవునికి శాంత సహనాల ఆవశ్యకతని స్పష్టంచేశారు. ప్రకృతిలో భీతావహమైన పార్శ్వాన్ని ప్రదర్శిస్తూ, నదీగర్భంలో ఎడారి పడుకున్నది అని సస్యశ్యామలమైన భూములు బీళ్ళుగా మారిపోయిన దారుణపరిస్థితిని చిత్రిస్తూ, ఎడారి

పొంగే అలలను మింగేసి
మండు టిసుకను నెమరేస్తున్నది
కరుచు కున్నాయి మంచుగడ్డలు
పరుచు కున్న పచ్చిక బయళ్ళను

''విశ్వంభర'', 13.

అని చిత్రిస్తూ, కదలికలేని చెట్లు ''నిలబడ్డాయి శవాల్లాగా'' అని ప్రకృతి స్తబ్ధంగా మారిన భయంకర పరిస్థితిని కని కన్నులకు కట్టినట్లు చిత్రించారు. ''వెలుగు మొట్లు'' అనే ఖండికలో అసంఖ్యాకమైన సమస్యలతో సతమతమవుతున్న నవ భారతాన్ని

పగిలిన అద్దమునంది
వర్తమానమున స్వజాతి
నిండు మనము శత సహస్ర
ఖండాలుగ కనిపించెను

అక్షరాల గవాక్షాలు, 66.

అని తను ఆవేదనని వ్యక్తంచేశారు. ''ఒళ్ళంతా కన్నీళ్ళే'' అనే ఖండికలో తన ఒళ్ళంతా కన్నీళ్ళు, తెగిపోయిన నరాల తీగెలు మాత్రమే ఉన్నాయని వర్తమాన సంఘంలో నగ్నసత్యాలని వెల్లడిస్తూ

నువ్వు ఎగరాలను కున్నది గగనం
దిగుతున్నది పాతాళకుహరం
నువ్వుకోరుకున్నది ఏటిపాయ
చేరుకున్నది కొండలోయ

మనిషి-చిలక, 49.

అని గగనాన్ని ఆశయాలకి ప్రతీకగా, పాతాళకుహరాన్ని నిరాశలకి ప్రతీకగా, ఏటిపాయని స్వేచ్ఛకి ప్రతీకగా, కొండలోయ సంకుచితత్వానికి ప్రతీకగా కవి ప్రయోగించి, మానవునికి చివరికి ప్రాప్తించేది కారుచేకటి పాన్పు, నోరులేని నిట్టూర్పులని తమ క్షణికమైన నిరాశా దుఃఖాన్ని వెల్లడించారు. స్వేచ్ఛకి సంకేతమైన జీవితాన్ని గడిపే ప్రగతి విరోధిని

నీవు కోరుకుంటున్నచోటు
నిట్టూర్పుల ఊబిమడుగు
నిన్ను భుజాన వేసుకున్న కాటు
నేలి చిల్లుల పాతగొడుగు

మధనం, 19.

అని చిత్రిస్తూ, అటువంటివ్యక్తులు నిట్టూర్పుల ఊబిలో దిగబడిపోతారని, వేరు ఒక ఆశయాలకట్టుని వేసుకోడానికి బదులు చిల్లుల పాతగొడుగే వారిని భుజాన వేసుకుని, వారిని ఏవ్యక్తిత్వం లేకుండా "existential" వ్యక్తిగా తయారుచేస్తుందని కవి చిత్రించారు. ఆధునిక ప్రపంచంలో మానవుడు పరిస్థితులకి బానిసయి తాను వ్యక్తిగతంగా ఏపనీచేయక, పరిస్థితులు, ఇతర ప్రభావాలు నిర్ణయించిన కార్యక్రమాలు తన ఇష్టాయిష్టాలతో ప్రమేయంలేకుండా చేసే మానసికస్థితిని ఆధునిక తత్వవేత్తలు "existential" స్థితిఅని వర్ణిస్తారు. డా. నారాయణరెడ్డి ఆధునిక మానవుని ఇటువంటి పరిస్థితిని ప్రతిభావంతంగా సూచించారు. వర్గవిభేదాన్ని కాపాడుతూ, సంఘంలో అట్టడుగు ప్రజానీకానికి అనాదిగా అన్యాయంచేస్తున్న వ్యవస్థ స్వప్నజీవుల కలల గీతలచేత మారదని, ఆ వ్యవస్థని కవి 'గొడ్డుటావుల్లాంటి మబ్బులు' (మథనం, 65) అని చిత్రించారు. ఆధునిక కాలం ఒక ఊసరక్షేత్రంగా కవికి కనిపించగా

ఇక్కడ ఏ పక్షీ పాడదు
ఎండిన కొమ్మల ఎముకలు తప్ప
ఇక్కడ ఏ రెక్కా పలకదు
ఇంకిన కన్నీటి చినుకులు తప్ప

మథనం, 76.

అని చుట్టూ పేరుకున్న నిరాశకి కవి రూపకల్పన చేశారు. ఈ పంక్తులు టి.ఎస్.ఎలియట్ 'Waste Land'[5] ని జ్ఞప్తికి తెస్తాయి. విజ్ఞానశాస్త్రం

---

5. T.S.Eliot, A heap of broken images, where the Sun beats, And the dead tree gives no shelter, the cricket no relief, And the dry stone no sound of water. Only there is shadow under this red rock.

"The Wasteland", 7.

నెరిశతలలువేసి సహమానవ హననానికి, సమజీవన దహనానికి దారితీసినప్పుడు మానవుని మనుగడే సందేహాస్పదం అవుతుందని ఆ సమయంలో

వల్లకాటి దిబ్బలచుట్టూ
ఊళ్ల కాపురాలు
ఇసుక మండే ఎడారిచుట్టూ
పసిమి మండే మాగాణాలు
మారణధూమాన్ని ఊదేసే
జీవన పవనాలు

విశ్వంభర, 97.

తప్పవు అని విశదం చేశారు. కొన్ని సమయాల్లో ఇటువంటి నిరాశామయదృక్పథాన్ని కని వ్యక్తం చేసినా మౌలికంగా నారాయణరెడ్డిగారు ఆశామయ జీవి. వారి కవిత్వంలో ఆశాదృక్పథమే ప్రముఖస్థానాన్ని వహిస్తుందని, వారి వ్యక్తిత్వంలో కూడా ఈ ఆశయే విశిష్ట అంశం అని భావించవచ్చు.

అభ్యుదయ భావ ప్రదర్శనం

డా॰నారాయణరెడ్డి మొదటినుంచీ సర్వమానవ అభ్యుదయాన్ని కాంక్షించి, తమ కవిత్వంలో విశ్వశ్రేయ అభిలాషని ప్రదర్శించారు. ప్రబంధ యుగంలో ప్రబంధరచన అభ్యుదయ పరంపరకి అంకితమైన సంస్కృత కావ్యాలు విశ్వశ్రేయస్సు లక్ష్యంగా రచింపబడ్డా, ఈనాటి పురోగామి కవులు ''అభ్యుదయ'' కవిత్వం వ్రాసినా మౌలికంగా వీరంతా సంఘంలోని ప్రజల 'అభ్యుదయా' న్ని ఆశించారు. ఈ కాంక్షలో కొంత తరతమభేదం, తీవ్రతలో కొంత హెచ్చుతగ్గులు ఉన్నా , లక్ష్యం అందరిదీ ఒకటే. డా॰నారాయణరెడ్డి తమ కవిత్వంలో మొదటినుంచే ఇటువంటి విశ్వశ్రేయ దృష్టిని ప్రదర్శించి, అభ్యుదయ కాంక్షని తదుచిత కావ్యబింబాలద్వారా వెల్లడించారు. ఆర్థిక అసమానతలు పేరుకొన్ని నిలిచిన వ్యవస్థ మారాలంటే విప్లవమార్గం తప్పనిసరి అని భావించి అటువంటి విప్లవ భావనకి అనుకూలమైన విప్లవ కావ్యబింబాలనికూడా వీరు ప్రయోగించారు. డా॰దాశరథి కవిత్వవిశ్లేషణచేసిన సందర్భంలో వారికవిత్వంలో శృంగారం, అంగారం ముఖ్యాంశాలని తెలియచేయడం జరిగింది. అదే విధంగా వీరి కవిత్వంలోకూడా శృంగారం, విప్లవాభినివేశం ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ''నారాయణరెడ్డి గేయాలు'' అనే వీరి ప్రాథమిక దశకి చెందిన కవితాసంకలనంలో వీరే ఈగేయాలని గురించి ముచ్చటిస్తూ ''కొన్ని శృంగారభావనను పొదుగుకున్నవి ఉన్నా, కొన్ని సమకాలీన సమాజంలో రగిలేసెగలను, పొగలను వెలిగ్రక్కేవే ఉన్నవి''[6] అని తెలియచేశారు.

డా॰నారాయణరెడ్డి ప్రచురించిన ప్రథమ కవితా సంకలనం ''జలపాతం''. 1953 లో ప్రచురించిన ఈ కావ్యసంకలనంలో వీరు

---

6. డా॰నారాయణరెడ్డి, ''నామాట'', 'నారాయణరెడ్డి గేయాలు' పుట సంఖ్యలేదు

48-49 సంవత్సరం మధ్యలో రచించిన కావ్యఖండికలు కనిపిస్తాయి. ''ఉదయ ధ్వజం'' అనే ఖండికలో శ్రామికవీరులు ఎత్తిన అరుణధ్వజాన్ని ఉదయసూర్యునిలో దర్శిస్తా

కరకు రాచరికమ్మును తరిమివేయ
శ్రామికులు లేవనెత్తిన క్రాంతి **ధ్వజ**
యంతి పోలిక, నైశికాంధ్యమ్ముడంప
ప్రాగ్ధరణిసాచె ఉదయ సూర్యధ్వజమ్ము

''జలపాతం''.

అని శ్రామికవర్గ పక్షపాతాన్ని ప్రాథమికదశలోనే సూచించారు. ప్రజలు సుఖంగా ఉండాలంటే కొందరే అన్ని ఆర్థిక వనరులని చేజిక్కించుకునే వ్యవస్థ మారాలి అని ''యుగప్రగతి'' అనే ఖండికలో ఆశిస్తా

భారీ వృక్షం జారి పడ్డప్పుడే
లేతమొక్క మొకిలేస్తుంది
పసిడిమేడ ప్రక్కకొరిగి నపుడే
అడుసుగుడిసె నడవ నేరుస్తుంది

జలపాతం,.

అని వేలవమైన రాజకీయ సూత్రంలో ఇమిడిన వర్గసంఘర్షణ ఆవశ్యకతని కవి ప్రత్యక్షంగా కాక పరోక్షంగా, కవితాత్మకంగా ప్రస్ఫుటించేశారు. ఈ సంకలనంలో 'నిప్పు చెక్కిళ్ళు', 'అంగారశయ్యలు', 'అశ్రుతటాలు' నంటి అభ్యుదయ కావ్యబింబాలు తరచుగా కనిపిస్తాయి. ''మాధవవేళ'' అనే ఖండికలో జీవితంలో కష్టాలని మోదుపడ్డచెట్టుగా భావిస్తూ, ఆ కష్టాలని పరిహరించే విప్లవశక్తిగా

మోదుగుం టూల
కాగడాలెత్తిన జ
గన్మోహిని

నారాయణరెడ్డి గేయాలు, 18.

గా మధుమాసాన్ని కవి చిత్రించారు. ''అభ్యుదయకవి అన్వేషణ'' అనే ఖండికలో అందాన్ని హతంచేసే శిశిరాత్ములని దెబ్బతీసే చిత్రమైన మనిషిగా

పలాశ పతాకను ధరించి
విలాసంగా నడిచివచ్చే
విప్లవకారుని

నారాయణరెడ్డి గేయాలు, 66.

చిత్రిస్తూ, మోదుగు పూవుల అరుణిమని విషవారుణిమగా, కవి భావించారు. డా.దాశరథి తమ కవిత్వంలో పలాశపుష్పాలు విషవానికి సంకేతంగా తరచు ప్రయోగించడం ఈ సందర్భంలో గమనించతగిన విషయం. ఇరాక్ విషవాన్ని ''జ్వాలాముఖి'' అనే ఖండికలో

జనహృదయం నిద్రించే
జ్వాలాముఖి
జనహృదయం జడధిలోని
బడబాశిఖి

'దివ్వెలమువ్వలు', 76.

అని జనహృదయంలో విషవజ్వాలని, బడబాగ్నిని కవి ప్రస్తుతించేశారు. ''అగ్నిపిండం'' అనే ఖండికలో రగులుతున్న పంక్తులు విషవసంకేతాలుగా భావిస్తూ, పడమటి పాకశాలలో లానానారుని, దిక్కుల డొక్కల్లో కలవరాన్ని, దిక్తటుల చలిజ్వరాన్ని

ఎదట ఎర్రని ఇనబింబం
ఎన్నడూ ఆరిపోని అగ్నిపిండం

'ముఖాముఖి', 13.

అని మార్తాండ బింబాన్ని విప్లవసంకేతంగా కవి చిత్రించారు. ''నిప్పుల ఉప్పెన'' అనే ఖండికలో సంఘంలో ఆర్థిక అసమానతలు సృష్టించిన వర్గవిభేదాలని నిరసిస్తూ, ఈ వ్యవస్థ విప్లవానికి అంకురార్పణం చేస్తుందని

అస్థిపంజరాల్లో అగ్నిమొగ్గలు
చివికిన కండరాల్లో చెకుముకిరవ్వలు
నశించిపోయిన కరాల్లో జ్వాలాతోరణాలు
డిల్లపడిన నరాల్లో కంఠాల డిండిమాలు

'ముఖాముఖి', 20.

కనిపిస్తాయని అగ్నిమొగ్గలు, చెకుముకి రవ్వలు, జ్వాలాతోరణాలు, డిండిమాలు విప్లవానికి సంకేతంగా కవి ప్రయోగించారు. ఇటువంటి పరిస్థితిలో విప్లవం అనివార్యం అని భావిస్తూ

తూర్పు ప్రసవించక తప్పదు
మార్పు ప్రభవించక తప్పదు
అర్ధరాత్రి అనల పర్వతాగ్రం
బద్దలు కాకతప్పదు తప్పదు

'ముఖాముఖి', 21.

అని తమ విశ్వాసాన్ని ప్రకటించారు. సంఘంలో ఆకలి చీకటిమంటలు ఎదపొదలను కాల్చేస్తుంటే ''రాత్రిమేల్కొనివుంది'' అనే ఖండికలో

తట్టుకోలేని మార్తాండమూర్తి
నిట్టనిలువునా నెగలు ఎగజిమ్మే
నితాంత ప్రగతి పథాను వర్తి

ముఖాముఖి, 42.

ఇంకా మేల్కొనే ఉందని మార్తాండమూర్తిని విప్లవానికి ప్రతీకగా కవి ప్రయోగించారు. బంగ్లాదేశ్‌లో మతోన్మాదాన్ని ఎదిరించి స్వాతంత్ర్యాన్ని సాధించిన ముక్తివాహినిని సమరసంక్రాంతిలో రక్తోషస్సుగా భావిస్తూ, ఆ స్వాతంత్ర్యశక్తులని విప్లవసంకేతాలుగా భావించి, ఆ జనశక్తి

దూసుకొస్తున్న మార్తాండబింబం

'ముఖాముఖి', 58.

అని మార్తాండ బింబాన్ని విప్లవశక్తికి సంకేతంగా మరోసారి ప్రయోగించారు. వీరి కవిత్వంలో మార్తాండ బింబం విప్లవసంకేతంగా తరచుగా ప్రత్యక్షంకావడం గమనించతగిని విషయం. అభ్యుదయ కవితా సారథి శ్రీశ్రీని విప్లవభావాలకి ఆద్యునిగా భావిస్తూ

నిన్నటి చీకటి పురిటి
నెత్తుటి పిండం
నేటి మధ్యాహ్న మార్తాండం
రేపటి ఉదయార్క బింబం శ్రీశ్రీ

'మంటా హరివిల్లు', 54.

అని తోటిప్రజల కష్టాలని దర్శించిన కవి ఆవేదనని చీకటిగా, ఆ ఆవేదననుంచి ఉద్భవించిన విప్లవభావనని నెత్తుటిపిండంగా, ఆ విప్లవభావనని కార్యరూపానికి తెచ్చే ఆశని మధ్యాహ్న మార్తాండంగా, రేపటి ఆశయమైన ఆర్థిక వ్యవస్థని ఉదయార్క బింబంగా కవి చిత్రించారు. వీరి అభ్యుదయ భావన, విప్లవదృక్పథం ''మంటలా-మానవుడు'' అనే కవితా సంకలనంలో పరాకాష్ఠస్థాయిలో కనిపిస్తాయి. ఈ కావ్యంలో ఈ దుఃఖాలని వాచ్యంగానేకాక వ్యంగ్యాత్మకంగా కూడా కవి సూచించారు. అందుకే ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావుగారు ఈ కవితా సంకలనాన్ని ''ఉత్తమ ధ్వని కావ్యం''[7] అని అభివర్ణించారు. సంఘంలో సగటు మనిషిని అణచి ఉంచి, వారి జీవనభృతినే కొల్లగొట్టే పాలకవర్గాన్ని నిశితంగా విమర్శిస్తూ, ఉద్విగ్నుడైన మానవుడు కొంతకాలం అణచబడ్డా, నిజానికి

---

7. ఆచార్య కె. వీరభద్రరావుగారు,

'శ్రీ నారాయణరెడ్డి అనుభూతిలో విశిష్టత వుంది. తన అనుభూతిని దిగంతాలకి వ్యాపింపజేసి, దానికి విశ్వజనీనత తెస్తాడు. నేటి సామాజిక వ్యవస్థని, దాని దౌర్భాగ్యాన్ని అనితరసాధ్యమైన ధ్వనితో చిత్రిస్తాడు..... ఇది ఉత్తమ ధ్వని కావ్యం!
''ఆమోదం'', 'మంటలా-మానవుడు', V, VIII.

మార్తాండ బింబం నంటి
మహాదీపమం వంటి
మనీషి, మనస్వి, మనిషి చల్లారలేదు

'మంటలూ-మానవుడు,' 3.

అని దగాపడిన తమ్ముణ్ని విప్లవమూర్తిగా కవి చిత్రించారు. గోడమీద పిల్లులు, ఊసరవెల్లులు, సాంఘికవ్యవస్థని వికృతంగా మారుస్తున్న సందర్భాల్లో మధ్య తరగతి మందభాగ్యులుకూడా పరిస్థితులతో రాజీపడ్డం మాని ఎదురుతిరిగి విప్లవ మూర్తులై ధర్మస్థాపనచేయాలి అని సూచిస్తూ

తలలూపే బసవన్నలు కానక్కు
తాండవించే నందికేశ్వరులు కావాలి

'మంటలూ-మానవుడు', 9.

అని బసవన్నలని చైతన్యరాహిత్యానికి, నందికేశ్వరులని విప్లవచైతన్యానికి ప్రతీకలుగా కవి ప్రదర్శించారు. ''అనగనగా ఒక రాజుగారు'' అనే ఖండికలో రాజుగారిని ఫాసిస్టు నియంతలకి ప్రతీకగా, పచ్చదనంతో ఉల్లసిల్లే చెట్టుని చైతన్యానికి విప్లవానికి ప్రతీకగా స్వీకరించారు. విప్లవం అంటే నియంతలకి ఎప్పుడూ కంటగింపే. అందుకే ఆ రాజుగారికి చివుళ్ళంటే కంటగింపు. చెట్లని నిషేధిస్తూ శాసనం చేశాడు. చివుళ్ళని వెరికించాడు. కాని మర్నాటికి చివుళ్ళు మళ్ళీ చిగురించాయి. చెట్టు

విప్లవ విరాట్టుగా
విజృంభించింది
విక్రమించింది

'మంటలూ-మానవుడు', 12.

అని విజృంభించిన ప్రజానీకానికి చెట్టు విరాట్ స్వరూపాన్ని సంకేతంగా ప్రదర్శిస్తూ, ఏనాటికైనా పాపాల భూపాలుని వంటి నియంతలు మట్టికరుస్తారు అనే సత్యాన్ని కని స్పష్టంచేశారు. ''నీకూనాకూ ఏంపోలిక?'' అనే ఖండికలో 'నువ్వు'' ప్రతీప శక్తులకి, ''నేను'' అభ్యుదయశక్తులకి ప్రతీకలుగా స్వీకరించారు. ''నీకు'' శ్రమలో రుచి తెలియదు అని చైతన్యం తెలియని ఆ ప్రతీపశక్తిని

జ్వలించడం తెలియని మంచు ముద్దవు
గమించడం తెలియని గోడ సుద్దవు

'మంటలూ-మానవుడు', 34.

అని సహజంగా చిత్రించారు. పీడితమానవుల నిట్టూర్పులో సహనం నిర్దైన్యం మాత్రమేకాక విప్లవ వాంఛకూడా ఉంది అనే విషయాన్ని

పీడితుని వేడి నిట్టూర్పులో
పావురాయి మూలుగగా ఉంది
చెకుముకిరాయి మిణుగుగా ఉంది

'మంటలూ-మానవుడు', 3[illegible]

అని పావురాయిని దైన్యానికి, చెకుముకిరాయిని విప్లవజ్వాల సృష్టించేశక్తికి సంకేతాలుగా కవి ప్రయోగించారు. వేదనలో నుంచే విప్లవకాంక్ష విజృంభిస్తుంది అనే విషయాన్ని ''అగ్ని శిఖాముఖి''లో ''అంటుకుంటున్న కుంపటి'' (41) అనే ఖండికద్వారా కవి వెల్లడించారు. మానవచరిత్రలో దగా, దోపిడీ ఎల్లకాలం కొనసాగవని, విప్లవం తప్పదని ''ఎదురు తిరిగిన ఉదయం''అనే ఖండికలో స్పష్టంచేస్తూ, విప్లవాన్ని ఎదురుతిరిగిన ఉదయంగా కవి చిత్రించారు. ప్రజానీకాన్ని ఎల్లకాలం మోసం చెయ్యలేమని

మసిపూసి మారేడు కాయచేసి
ముసలిచీకటికి పసిమిరంగువేసి
ఇదే ఉదయమని టముకువేస్తే
ఇనబింబం ఎదురు తిరుగుతుంది

'మంటలూ-మానవుడు', 60.

అని హెచ్చరిస్తూ, రానున్నప్రభాతం రాకతప్పదు అని, విప్లవం తథ్యం అని కవి తెలియచేశారు. ''అగ్నిపిండం'' అనే ఖండికలో అధికారుల దమనకాండని ఉక్కు బూట్ల టకటక ధ్వనులుగా ప్రదర్శిస్తూ, ప్రజాశక్తిని ఏ శక్తీ అణచలేదని తెలియచేస్తూ

చిమ్ముకొస్తున్న వెల్తురు బుల్లెట్లు
చీకటి గుడారాలకు కొట్టేతూట్లు
ఎదుట ఎర్రని ఇనబింబం
ఎన్నడూ ఆరిపోని అగ్ని పిండం

ముఖాముఖి, 13.

చీకటిని అధికార ప్రయోగానికి, వెల్తురు బుల్లెట్లు, ఇనబింబం, అగ్నిపిండం ఆ చీకటిని ఛేదించే విప్లవశక్తికి సంకేతాలుగా కవి ప్రయోగించారు. ''ముఖాముఖి'' అనే ఈ సంకలనంలో కూడా మూకవేదనని తట్టుకోలేక ఎదురుతిరిగే విప్లవమూర్తిని మార్తాండమూర్తి (42) గా, బంగ్లాదేశ్‌లో ముజీబ్ ఆధ్వర్యంలో జరిగిన స్వాతంత్ర్యపోరాటం మతోన్మాదం అనే కారుచీకట్లని చీల్చివేసే సహస్రకిరణాలుగా భావిస్తూ, ఆ విప్లవమూర్తిని ''నాట్'' విమానంలా దూసుకువస్తున్న మార్తాండ బింబం (58) గా కవి చిత్రించారు. '''కొ అన్నది కొత్తతరం'' అనే ఖండికలో పట్టుతప్పిపోయిన ''ప్రగతి సూర్యుణ్ణి'' లేవనెత్తి దిక్కులని ఉదయ రాగంలో ముంచెత్తే కొత్తతరాన్ని చిత్రిస్తూ

ఇప్పటి శిశువుకు
పాలేకాదు జ్వాలలూ తాగాలని ఉంది

'మనిషీ-చిలక', 26.

అని ఈనాటి మానవుణ్ణి విప్లవమూర్తిగా, చైతన్యభాస్కరునిగా కవి చిత్రించారు. మతం మత్తుమందు అనే మార్క్సిస్టు అవగాహనని వ్యక్తంచేస్తూ ''కన్లిజ్ యువర్ షాప్'' అనే ఖండికలో మనిషిని భూతంగా మార్చే మంత్రదండాలనుంచి నిజాయితీకి జలసమాధికట్టే భజనకీర్తనల సుడి గుండాలనుంచి బయటపడమని మానవుణ్ణి ఉద్బోధిస్తూ

ఎన్నాళ్ళని అంటిస్తావు
చల్లారిన వంట చెరుకులు?
ఏరి తెచ్చుకో ఇరమ్మదాగ్నిని
వెలికి పట్టుకో బడబాగ్నిని

'మనిషి-చిలక', 33.

అని పాత బతుకికి స్వస్తిచెప్పి కొత్త విప్లవ పంథా అనుసరించాలని కవి కాంక్షించారు. ఆకాశంలో మేఘాల రాపిడికి ఉత్పన్నమయ్యే ఇరమ్మదాగ్నిలోను, నదిలోను విప్లవకాంక్షని దర్శిస్తూ పంచభూతాల్లో కూ విప్లవాభినివేశం ఉండాలని కవి కాంక్షించారు. ప్రజ్వరిల్లే ''మధ్యాహ్నవేళ'' ని

మాయని పుడమి గాయాలు
మార్తాండ బింబాన్ని మండుతున్న

'మనిషి-చిలక', 36.

వేళగా చిత్రిస్తూ, పేగులు రుద్రవీణలుగా, బొమికలు ప్రళయకాల డమరువులుగా విప్లవిస్తున్న కార్మికులని కవి చిత్రించారు. వ్యక్తిగత సౌఖ్యాలని విస్మరించి, త్యాగశీలురై, ఆత్మార్పణకి సిద్ధమయ్యే విప్లవ నాదుల్ని ''ఏమమ్మా దీపశిఖా!'' అనే ఖండికలో ''హృదయజీవులు'', ''విజయభావులు'' అని అభినందిస్తూ

రెక్కలు మాడినా సరే
ఆ కొవ్వొత్తే కావాలని
సొంతం మునిగినా సరే
ఆ సముద్రమే కావాలని

'మనిషీ-చిలక', 45.

మొండికేసే లక్ష్యశుద్ధి కలిగిన వీరులుగా కవి చిత్రించారు. ''ఇవాళ ఎవరూ లేరు!'' అనే ఖండికలో నవసమాజ స్థాపనకోసం జడత్వానికి చైతన్యాన్ని కలిగించి, అడవుల్లో చిక్కుకున్న విప్లవ సూర్యుణ్ని విముక్తుణ్నిచేసి శ్రీకాకుళం నుంచి తూర్పుదిశలో విప్లవ పతాకాన్ని ఎగరవేసే వీరులని

రాహువు కోరల్లో చిక్కిన చంద్రుణ్ని
రక్షించడానికి వెళ్లాం.....
చుక్కల దండులో చేరి
దిక్కుల అడవుల్లో దూరి
తూర్పుకటమ్మై ప్రభాత పతాక
ఎగరేసే

'ఉదయం నాహృదయం', 118

వారిగా చిత్రించారు. ''అడవులు'', ''తూరుపుకోట'' శ్రీకాకుళం జిల్లాలో విప్లవపోరాటాన్ని సాగించిన నక్సలైట్లని పరోక్షంగా సూచిస్తున్నాయి. వీరి తీవ్ర ధోరణిని కవి ఆమోదించకపోయినా, వీరి నైతికధైర్యాన్ని కని అభినందించక పోలేదు. ''ఇదేసత్యం'' అనే ఖండికలో నిట్టూర్పులు, నిరాశలు ఎల్లప్పుడు ఉండవు

హృదయం ఉరుకుతుంది
తనువు పొరలు చీల్చుకుని
ఉదయం ఉబుకుతుంది
చీకటి తెరలు చించుకుని

'ఉదయం నాహృదయం', 52.

అని విప్లవోదయాన్ని ''పట్టికందుళ్ళలో సముజ్వలించే మహోగ్రసత్యం'' గా కవి చిత్రించారు. ''దీప హాసితం'' అనే ఖండికలో సంఘంలో కల్తీ బుద్ధులు కాటువేసి పట్టిచీకట్లు పట్టపగలే పొరుస్తుంటే తాను భానుకిరణంలా, బాలహరిణంలా అందంగా, స్నిగ్ధంగా నవ్వలేనని తెలియచేస్తూ, తాము మరోలా నవ్వగలనని

తపస్సమాధిలో కట్టిన జ్వాలాధూప తోరణంలా
అమావాస్యను చీల్చుకొని పుట్టిన
అనంతదీపికా శిశుగణంలా
నవ్వుతాను
నిప్పులా నవ్వుతాను

'మార్పు నాతీర్పు', 4.

అని ప్రతీపశక్తులని ఎదిరించే విప్లవజ్వాలగా తమ నవ్వుని కవి చిత్రించుకున్నారు. గుంపులో గోవిందకాని ఉగ్ర విప్లవవాదిని ''జితేంద్రియుడు'' అనే ఖండికలో పంచేంద్రియాలని నిగ్రహించిన వీరునిగా కొనియాడుతూ, అతనిధ్యేయం కటకటాలకు లొంగని ''రక్తోషస్సు'' గా కవి చిత్రించారు. ఈతనిని

కనిపించని విప్లవాగ్నిలో
తనని తానే వేల్చుకుంటున్న
తపోధీరుడు - క్రాంతి కారుడు

'మార్పు నా తీర్పు', 21.

అని ఆత్మార్పణం చేయగలిగే నిస్వార్థజీవిగా చిత్రించారు. ''పడగెత్తిన దిక్చేతన'' అనే ఖండికలో కాంతిశిశువు కంఠంలో, కాలగర్భకోశంలో విప్లవచైతన్యాన్ని దర్శిస్తూ

పిండం కాదది అనలకుండం
పాప కాదని జ్వాలాధూపం
పొద్దుపొడుపు కాదది
పుక్కిలించిన రక్తస్రోతం
తరణి బరిణకాదది
ఎక్కుపెట్టిన మార్తాండబింబం

'మార్పు నా తీర్పు', 29.

అని చిత్రించారు. ''తొలగండి'' అనే ఖండికలో తాను నెత్తుటిముద్దను, జ్వాలా శిశువును అని వర్ణించుకుంటూ తనని ఎత్తుకుని, లాలించి, ఆవేశ విహీనునిగా చేయనద్దని తాను

ఉదయంలా ఎదుగుతాను
ఉదధిలా ఉప్పొంగుతాను
అన్ని దిక్కులను కలిపేసే
ఆకాశంలా ఆవరిస్తాను

'సూర్యు నా తీరు', 57.

అని తనకి శైశవము లేదు, నిరంతర యౌవనమే తన లక్షణం అని కవి వ్యక్తం చేశారు. శ్రమజీవులు విప్లవ పంథాని అనుసరిస్తే తమకి ఎంతో ఆనందం అని ప్రకటిస్తూ

ఎక్కడో ఒక చెమట చుక్కలో
ఇనబింబం ప్రజ్వరిస్తే
ఈ కంటికి అరుణోదయం

'తేజస్సు నా తపస్సు', 2.

అని చెమటచుక్కని శ్రమజీవులకి సంకేతంగా కవి చిత్రించారు. అరుణోదయాన్ని కంటికి ఆనందం కలిగించే విప్లవోదయంగా కవి చిత్రించారు. ''సూర్యుడు''

అనే ఖండికలో సూర్యుణ్ణి విప్లవచైతన్యమూర్తిగా భావిస్తూ

హొంగే నెత్తురు ముద్ద
పూచే అగ్ని పిండం
పొడిచే పరివర్తనం
నడిచే నవచైతన్యం

'తేజస్సు నా తపస్సు', 17.

అని నిన్న మరుగుపడి, నేడు తిరగబడే విప్లవవీరునిగా కవి చిత్రించారు. ''ఈ రాత్రి'' అనే ఖండికలో చిచ్చులాంటి చెమటలో శివమెత్తేక్షుధని చూస్తూ విప్లవాభినివేశంతో తాను

కటకటాలు చేల్చుకుని
పొటమరించే రవిబింబాన్ని
నిట్టూర్పులు నెట్టుకుని
నినదించే నవగీతాన్ని

'తేజస్సు నా తపస్సు', 58.

అని చిత్రించుకున్నారు. ''ఓజస్సు నా ధనుస్సు'' అనే ఖండికలో తను అక్షర లక్ష్యానికి అక్షరస్థితి అయిన ధనుస్సు ఓజస్సు అని ప్రకటిస్తూ తమ అకుంఠిత

సంకల్పబలంతో కోపాలని, పాపాలని తమధనుస్సు , భేధిస్తుందని, ఆ ఓజస్సు వలన

మంచు ముద్దలో
మార్తాండ బింబాలు ఉద్భయిస్తే
గులాబి తీగల్లో
ప్రణయానల జ్వాలలు ప్రసవిస్తే

'తేజస్సు నా తపస్సు', 65.

ఆగామి యుగశ్రుతి వినిపిస్తుంది అని తమ వజ్ర సంకల్పాన్ని ప్రముఖమైన ఆయుధంగా కవి ప్రకటించారు. ''ఇంటిపేరు చైతన్యం'' అనే ఖండికలో ఎత్తైన ఆకాశనేలిమలలోకి ఎగసిన తనగుండెని చుట్టూ ఎవ్వరో పారేసుకున్న నవ్వుల్లాంటి చుక్కల రజంగా, చిత్రిస్తూ, మంచెంక కసి లాంటి నలుపుతో ఉన్న విప్లవవేగులని

భగ్గుమని రగిలేటి కుంపట్ల కళ్ళలో
పాటలే మంటలుగ
పాడుతూ వున్నారు

'ఇంటిపేరు చైతన్యం', 1.

అని ఉద్రిక్త జలదనిర్ఘోషమైన విప్లవశక్తిని శ్వాసగా కవి చిత్రించారు. ''అ-భయం'' అనే ఖండికలో తాను అన్వేషించేది

కడలి కడుపులో
జ్వాలాక్షరాలు చెక్కే
బడబాగ్నులను

'ఇంటిపేరు చైతన్యం', 32

అని తమ విప్లవాన్వేషణని తెలియచేశారు. ''మథనం'' అనే నాలుగు ఖండాల కావ్యంలో ''జ్వలనం'' అనే ఖండం రక్తం ఎదురుతిరిగిన విప్లవ తత్త్వ సందేశాన్ని అందించింది. కవి తమ విప్లవ తత్త్వాన్ని వెల్లడిస్తూ

జనం నా జెండా
జాగృతి నా ''ఎజెండా''
ఎత్తిన పిడికిళ్ళే సవాళ్ళు
ఎలుగెత్తిన మూగనోళ్ళే
ఎర్రని పిలుపుల ఆనవాళ్ళు

'మథనం', 36.

అని ఎత్తిన పిడికిళ్ళుచేసే సవాళ్ళని, ఎర్రనిపిలుపులని మనకి ప్రదర్శించారు. సంకెళ్ళు తెంచుకుని విజృంభించే ప్రజాశక్తిని

ఈ కాళ్లే ఎవరెస్టులు
ఈ నోళ్లే శతఘ్నులు
ఈ కళ్లే త్రేతాగ్నులు[8]

మథనం, 40.

అని అత్యున్నత ఆశయశిఖరాలని అధిరోహించేశక్తిగా, అరిభయంకరమైన ఆయుధాలుగా, మతసంబంధమైన పునీతాగ్నులుగా కవి చిత్రించారు. పంట పండించడానికి శ్రమించే కర్షక వర్గానికి పండినపంట అందకుండా, యాజమాన్యవర్గం దోచుకునిపోయే పరిస్థితిలో ఆ రైతు కడుపుమంట విప్లవప్రేరకశక్తిగా భావిస్తూ

కాలు నేలను దున్నుతుందనే
చేయి విత్తనాలను చల్లుతుందనే
పండిన పంటలను చూసి పచ్చి ఆకలి
ఎండు టెండగా మండుతుందనీ

'మథనం', 39.

---

8. శ్రీశ్రీ, దాశరథిలా డా. నారాయణరెడ్డికూడా నిప్పువాగ్నులని త్రేతాగ్నులుగా చిత్రించడం గమనించదగ్గ విషయం. అయితే, వీరు వీటిని నిశ్చిత సంకేతాలకి ఉద్దేశించినట్లు కనిపించదు. మనిషి రెండుకళ్ళని త్రేతాగ్నులుగా భావించడం విచిత్రంగా ఉన్నా, విప్లవసమయంలో సామాన్యమానవుడుకూడా ప్రళయకాల రుద్రుడై మూడుకన్నులూ తెరుస్తాడని కవి సూచించి ఉండవచ్చు.

అని చిత్రించారు. జడత్వం నశించి విప్లవం ప్రభవించాలని ఆశిస్తూ,

చదివి పోవాలంటాను
చైతన్యాన్ని కప్పేమంచు
పుట్టి రావాలంటాను
రక్తాన్ని రగిలేసెంచు

'మథనం', 91.

అని ప్రకటించారు. ''కలలాగా ఆగండి'' అనే ఖండికలో విత్తనాన్ని నేలలోకి విసిరితే

అది పేలుతుంది
వెయ్యిముక్కలుగా
అప్పుడు మొలిచే మొక్కలు
అగ్నిప్రసవించే వాక్కులు

'మృత్యువునుంచి', 37.

అని కృషి విప్లవానికి నాందిగా కవి చిత్రించారు. సోవియట్ రష్యాని దర్శించిన సందర్భంలో అక్కడ ప్రజలని, దృశ్యాలని మననం చేసుకుంటూ

ఎన్నెన్ని ఎర్రని కవితల్లో
ఎత్తిన ఆ చేతుల జోతుల్లో
ఎన్నెన్ని పిడుగుల నుడికారాల్లో
ఎలుగెత్తిన ఆ పిడికిళ్ళ నోళ్ళల్లో

'మృత్యువునుంచి', 66.

అని రష్యాలో అంతటా విప్లవాన్నే కవి దర్శించారు.

ఉదయ సూర్యుణ్ణి ప్రగతిపథ నిర్దేశకునిగా భావిస్తూ, తాము అభ్యుదయపథంలో పురోగమిస్తామని తెలియచేస్తూ,

నడుస్తున్నాను నేనూ
మడమ తిప్పని మార్తాండునిలా

'విశ్వంభర', ౨.

అని వివరిస్తూ తమ ప్రగతిమార్గాన్ని తరుశిఖలు, వనవల్లికలు కూడా అనుసరిస్తాయని కవి ఆశించారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా, పురోగమనం తథ్యం అని విశ్వసిస్తూ,

ఏ అంకుశాలు నిషేధించినా
ఉదయించకుంటుందా కిరణసంపుటి

'విశ్వంభర', 85.

అని ప్రశ్నిస్తూ, ఆర్థికవనరులన్నీ గుత్తాధిపత్యానికి హస్తగతం అయితే, ప్రజాశక్తి ''రెచ్చిపోయిన రక్తఘోషతో చిచ్చురెక్కలు '' సాచుతుంది, పిడికిలెత్తి అడుగుతుంది, పిడుగులా ప్రశ్నిస్తుంది అని ప్రకటించారు. ఈ విప్లవభావనని ఆధునిక కాలంలో ప్రతిపాదించిన మార్క్సు వాదాన్ని

ఏ మనీషి శిరంలోనో
ఇగురులెత్తిన సామ్యవేదం

'విశ్వంభర', 87.

అని పూజనీయమైన రాజకీయతత్వంగా కవి చిత్రించారు. శ్రామికశక్తి సంఘటితమై ఎదురుతిరిగితే

కటిక చీకట్ల గట్లను చీల్చుకుని
పొర్లివస్తున్న పొద్దుపొడుపులు
కన్నీటి చుక్కల్లో
చెమట తుంపర్లల్లో
కణకణలాడుతున్న
దినకర బింబాలు

'విశ్వంభర', 89.

ప్రత్యక్షమవుతాయని ''పొద్దుపొడుపులు'', ''దినకరబింబాలు'' విప్లవ సంకేతాలుగా కవి ప్రయోగించారు. స్వాతంత్ర్యసమర కాలంలో జడపదార్థాలకి సైతం విప్లవచైతన్యం కలిగింది అని తెలియజేయడానికి మట్టిబెడ్డలు ''మండుతున్న స్ఫులింగాలు''గా, గడ్డిపరకలు ''లేస్తున్న ధ్వజస్తంభాలు''గా విక్రమిస్తున్నాయని కవి చిత్రించారు.

## మానవతా దర్శనం

డా. నారాయణరెడ్డి సామాన్యమానవుణ్ని మకుటాలంకృతుణ్ని చేసిన మానవతావాది. మధ్యతరగతి మందభాగ్యుల మీద వీరికి అమితమైన సానుభూతి, ప్రగాఢమైన అవగాహన ఉన్నాయి. ''మానవగీతం'' అనే ఖండికలో ఈనాడు సామాన్యమానవుడు పూజనీయుడు, అతని ఘర్మజలం ధర్మజలం అని శ్రీశ్రీ భావించినట్లు వీరుకూడా

చెమటను తడిసిన మట్టిని
శ్రీ గంధముగా ధరింతు
ఊర్పుల నొదిగిన స్వరమును
ఓం కారముగా స్మరింతు

'అక్షరాల గవాక్షాలు', 2.

అని శ్రమజీవిని పూజార్హునిగా సంభావించి, ''మందిరమెరుగని దేవుడు మనిషి'' అని స్పష్టంచేశారు. ఈనాటి వ్యవస్థలో ప్రముఖస్థానాన్ని వహించే మానవతా దృక్పథాన్ని ఏ సంకుచిత భావాలు ఆపలేవని విశ్వసిస్తూ,

పరిమళాల నెవడాపును
మైరగాలి నెవడాపును
ఎవడాపును మానవతా
రవి ముక్కును కవి వాక్కును?

'అక్షరాల గవాక్షాలు', 3.

అని ప్రశ్నిస్తూ, ఆ ప్రశ్నలోనే ఎవరూ ఆపలేరనే ఆశాభావాన్ని కవి వ్యక్తంచేశారు. మధ్యతరగతి జీవులమీద, అందులోను ఎన్జీవోలమీద కవికి అమితమైన సానుభూతి ఉంది. వీరిని పంచశీల సూత్రాలని అక్షరాల పాటిస్తున్న వారిలాగా ప్రసంగాలు దిగుమతిచేయక ''నూనెని బట్టి వత్తినిసేసుకున్న పరమ సాధువులు''గా భావించి, చంద్రునికన్న అదృష్టవంతులుగా భావిస్తూ,

ఒకేరాత్రి నిండుగా బ్రతికి
మర్నాడు కళల్ని కోల్పోరు;
అటు ఆఫీసర్ల కారు, ఇటుకారు చప్రాసీలు
అనిశం మిణుకు మిణుకుమనే అఖిలజగత్ ''ఎన్జీవోలు''

అక్షరాల గవాక్షాలు, 132.

అని వారి జీవితాలకి యథాతథంగా దర్శింపజేసి చూపించారు. ''మధ్యతరగతి మందహాసం'' అనే ఖండికలో మందహాసానికి ఛందస్సు ఉంటుందని, ఈ జీవులకి వంచన నుంచి మంచిని వేరుచేసే అంచముక్కుకూడా ఉందని గ్రహించారు. నగరజీవితంలో ''ప్లాస్టిక్‌నవ్వుల్లో దాగిన సుషిరహాసాలు'', నైలాన్ బతుకుల్లో మూసిన జాలిగాథలని సానుభూతితో చిత్రిస్తూ ''కిటికీలోంచి''లో ఈ సగటు జీవులని

> ఆకాశవాణి ఉచితంగా అందించే
> ధరల మరమరాలు తింటూ
> అందంగా ఊగిపోతూ.....
> కరువులతో అరువుల బరువులతో
> తరిగి పోతున్న ఉన్న కాస్త పరువులతో

'మధ్యతరగతి మందహాసం', 20.

వదలిపోతున్న జీవితాలని కవి మనముందు నిలబెట్టారు. ''పచని పండుగ'' అనే ఖండికలో జీవితంలో ఎన్నో కష్టాల కి గురి అయ్యే సామాన్యమానవుణ్ని ''సంసారపు తిరుగలిలో జర్ఝరితమ్మగు జీవి'' గా అతి సహజంగా వర్ణిస్తూ, జర్జరితమనే పదప్రయోగంలోకూడా సమస్యల రాపిడిలో సతమతమవుతున్న సామాన్యమానవుని ఆవేదనని కవి వినిపింపచేశారు. పండుగలు కడగండ్లతో నిండిన బ్రతుకులకి ఆశాజ్యోతులని తెలియచేస్తూ

కడలి వంటి బ్రతుకు లోన
పడిపోయెడి మానవునికి
పండుగలే ద్వీపమ్ములు
పథ దర్శక దీపమ్ములు

'మరోసారిపిల్పు', 778.

అని మధ్యతరగతి జీవితాలలో క్షణికమైన ఆనందాన్ని కవి సూచించారు. కష్టసుఖా లని లెక్కచేయక తమ జీవితాలని వెళ్ళబుచ్చుకునే విరాగులైన మధ్యతరగతి జీవులకి ''పరమ హంసల''ని ప్రతీకగా ప్రయోగించారు. ''పరమహంసలారా'' అనే ఖండికలో పండుగనాడు తమ జీవితాలలో విషాదాన్ని ఒక క్షణకాలం విస్మరించే వారి అల్పసంతోషాన్ని

అరువు తెచ్చుకున్న ఉల్లాసం
అరిగిపోయే వరకు
అతికించుకున్న దరహాసం
ఆరిపోయే వరకు

'మంటలూ-మానవుడూ', 75.

ఎదలో పచ్చిగాయాలని ''ఇస్త్రీ మడతల్లో కప్పేసి పబ్బం గడుపుకోండి'' అనే ఆ ఎన్జీవులని సానుభూతి పూర్వకంగా కవి హెచ్చరించారు. ఈ వర్గపు సామాన్య

ఉద్యోగులు ''ఉత్త ఉపసర్గలలో ఉపయోగిపోయే యోగులు'' అని వర్ణించడంలో వ్యాకరణ సంబంధమైన 'ఉత్' అనే ఉపసర్గతోపాటు, ప్రభుత్వం అడపాతడపా ప్రసాదించే కరువుభత్యం హెచ్చింపులుకూడా కవి వ్యంగ్యంగా సూచించారు. ఇటువంటి అల్పసంతోషి కర్మవశాత్తా విమూఢత్వానికి దారితీసి జీవితంలో ఉన్నత లక్ష్య సాధనవైపు వారిదృష్టిని మరలనివ్వదు అనే తపన వీరిలో కనిపిస్తుంది. కాని వీరిలో అంతర్గతంగా అమోఘమైనశక్తి ఉంది అని, వీరిలో కొందరు ''విక్రాంతి కాంతికోసం గంగవెర్రులెత్తే వియోగులు'' అని వీరి విప్లవవాంఛని [illegible] సూచించారు. కవికి వీరు ''వంతెన కింద నీళ్లలా'', ''విరుచుకుపడ్డ వడగళ్ల''లా కనిపించారు. ఎంతశక్తివంతమైన నది అయినా వంతెనకింద తనశక్తి కోల్పోయినట్లు కనిపిస్తుంది. వడగళ్లుకూడా భూమిమీద పడేవరకు నిజమైన శక్తిని ప్రదర్శించవు. అలాగే మధ్యతరగతి జీవులుకూడా అంతర్గతంగా ఉన్న తమ శక్తిని వెల్లడించకపోయినా, సమయం ఆసన్నమైనపుడు విప్లవమూర్తులుగా, 'రాకాసులని తరిమికొట్టే రామభద్రులు' గా మారగలరని కవి తమ విశ్వాసాన్ని ప్రకటించారు. ఇటువంటి కావ్య బింబప్రయోగంలో కవి తమ సూక్ష్మపరిశీలనా శక్తిని వెల్లడించారు. ''పొద్దుపొడుపు'' అనే ఖండికలో సంఘంలో ఆనందాలన్నీ 'ఏ కడుపు నిండిన శ్రీ పుత్రుని''కో ''బ్రతుకు పండిన సును గోత్రుని''కో మాత్రమేకాక అందరికీ సమంగా అందాలి అనే సామ్యవాదకాంక్షాన్ని

ఏ ఒక్కనొసటనో పొద్దు పొడవద్దు
ఏ ఒక్కనోటికో ముద్ద దొరకద్దు
అన్ని నొసళ్లకు కావాలి పొద్దు
అన్ని నోళ్లకు అందాలి ముద్ద

'మంటలూ-మానవుడు', 49.

అని పొద్దుపొడుపుని అభ్యుదయానికి, ముద్దని కనేసపు ఆర్థిక అవసరాలకి ప్రతీకలుగా కవి ప్రయోగించారు. సంఘంలో సగటు జీవులని దగాపడిన తమ్ముళ్ళని సానుభూతితో పరిశీలించి వారిస్థితిని అర్థవంతంగా ''ఎవరీ అర్హులు''లో

నీళ్ళకంటె పలచనైన వాళ్ళు
నిట్టూర్పుల కంటె తేలికైనవాళ్ళు
పసిడి పండించే వసుధ పెదవిపై
పగిలిపోయిన చిరునవ్వులు

'ముఖాముఖి', 54.

అని చిత్రించారు. ఆఫీసు ఫైళ్ళలో మునిగి, అరపస్తులతో తేలి జీవితాన్ని వెళ్ళబుచ్చే గుమాస్తాని

ఆ మనిషొక సగటు జీవి
వర్తమానంలోనే కొడిగట్టిన సముజ్జ్వలభావి
ఎన్నెన్ని ప్రభుత్వాలు మారుతూ ఉన్నా
ఎదుగూ బొదుగూ లేని ''ఎన్జీవో''

'మనిషి-చిలక', 5.

అని చిత్రిస్తూ, ఆతడు యంత్రం లాంటి వాడు, ప్రతి అంగానికీ రంగస్థలంమీద జారే యవనిక లాంటి వాడు అని, ప్రత్యేకమైన ప్రయోజనమేమీలేని నిరర్థకమైన సరంజామాగా కవి చిత్రించారు. ''అందుకే మనిషంటే జాలి'' అనే ఖండికలో మనిషి తాను గీసుకున్న నీతి, నియతి అనే గీతలని దాటకుండా ఉంటాడని, అటు వంటి సామాన్యమానవుని పై తనకి అపరిమితమైన జాలి అని తెలియచేస్తూ, ఆతడు

అద్దెకొంపే బృందావనిగా
అనుభూతిచెందే వనమాలి

'మనిషీ-చిలక', 41.

అని అందినవే స్వర్గాల అంచులని భావించి, పరిస్థితుల విషమ పంజరంలో పలవరించే మామూలు చిలక అని కవి సామాన్యమానవునిపై జాలి పరిమితులని అధిగమించలేని ఆతని అశక్తతపై కించిత్ నైతిక ఆగ్రహం వ్యక్తంచేశారు. ''ఉదయం నా హృదయం'' అనే శీర్షికాగీతంలో తను కవిత్వ లక్ష్యాన్ని, వ్యక్తిత్వ లక్షణాలని వివరిస్తూ,

నా వాదం సామ్యవేదం
కవిత్వం నా మాతృభాష
ఇతివృత్తం మానవత్వం

'ఉదయం నా హృదయం',
పుటసంఖ్యలేదు

అని తమ కవితా వ్యాసంగానికి మానవత్వం ముఖ్యమైన ఆలంబనం అని తెలియ చేశారు. ''పొగలో నుంచి'' అనే ఖండికలో ప్రమత్తుడైన మనిషిని సర్వనాశనం చేసేశక్తులని

నేలాంటి నా లాంటి మనిషిని
మకరందంలా పీల్చేసే మధుపాలు
ఒత్తిగిలి వున్న ఒంటిని తొక్కేసే
మత్తేభాలు

'ఉదయం నా హృదయం', 25.

అని చిత్రిస్తూ ఈనాటి మానవుడు పేటిని సహించలేని ''సలసల కాగుతున్న సహా-దేవుడు'' దేవుళ్లను ధిక్కరించే విప్లవమూర్తి అని మానవుని ప్రాముఖ్యాన్ని కవి ప్రకటించారు. అణిగి ఉన్న ప్రజానీకం ఎదురుతిరిగితే ప్రళయం అనే భావనని

ఒదిగి వుంటే నేరునేరే
ఎదురు తిరిగితే అది నిప్పే
జాగ్రత్త మరి
జలం లాంటిదే
జనం

'మార్పు నా తీర్పు', 6.

అని జనస్వామ్యాన్ని ''జలస్వామ్యం''తో పోల్చి చిత్రించారు. అణిగిఉన్న మానవులు తమ హక్కులకోసం ఎదురుతిరుగుతారనే విశ్వాసాన్ని కవి వెల్లడించారు. ''ఎక్కడివీ పక్షులు'' అనే ఖండికలో ఆకాశంలో వలసపోయే పక్షులని వలసపోయే ప్రజలుగా భావిస్తూ, ఆ నిర్భాగ్యుల కర్మసాక్షులు

కూటికి గూటికీ నోచుకోలేక
కోరికే ఆకలికి తట్టుకోలేక
ఆకాశంలోకి వలసపోతున్న
అమాయకప్రజలు

'హోరు నా తీరు', 15.

అని కూడుగుడ్డాలేని నిర్భాగ్యులమీద తమ సానుభూతిని వ్యక్తంచేశారు. జీవితంలో ఎన్నోకష్టాలని దిగమింగి సుఖాలని అందరికి అందించాలని ఆశించే సామాన్య మానవులని ''అ-భయం'' అనే ఖండికలో

నిత్యం మృత్యువును మింగి
సత్యాన్ని తేనేప

'ఇంటిపేరు చైతన్యం', 33.

వ్యక్తులుగా, ప్రతినిమిషం కుంగి ''శిఖరాలతో క్రీడించే చిరంజీవులు''గా కవి చిత్రించారు. ఓటమిలోకూడా విజయాన్ని సాధించగలిగిన కారణదక్షులుగా

సామాన్యజీవులని కని మెచ్చుకున్నారు. నెలలో మొదటితేదీ సామాన్యజీవి అసామాన్య జీవిగా కనిపిస్తాడు. ఆ రోజే అతని సంపాదన, ఆ రోజే అతని ఖర్చు. ఆ రోజు డబ్బు నీళ్ళలా ఖర్చు అవుతుంది అనే విషయాన్ని

ఆకాశానికి చిల్లులు పడుతుంటాయి
అప్పుడప్పుడు -
మొదటి తేదీన ఎన్జీవో జేబుకు పడ్డట్టు

'మథనం', 27.

అని అతని జీవితంలో ఒకే ఒక మంచిరోజు, అతడిని దగాచేసే రోజుకూడా అని వ్యక్తంచేశారు. ''ధ్వని'' అనే ఖండికలో పరమహంసలా''తరలిపోతున్న హిమ గిరుల తరంగాలమీద అరనవ్వు''తో పడుకుని

నల్లబడుతున్న సత్యాన్ని
తెల్లగా తొడుక్కున్న
సామాన్యుణ్ణి

'మృత్యువునుంచి', 53.

అని రూపుమారిపోతున్న సత్యానికి రూపకల్పనచేయగల వ్యక్తిగా, ''ప్రాణ

ఝుంఝా నిలాన్ని'' మౌనమునోధ్వనుల్నే చేల్చుకొచ్చే రేపటి చెవులగోడల్లో వినగల శక్తిగా సామాన్యమానవుణ్ణి చిత్రించారు. ఇతరులు జీవించాలని తన జీవితాన్ని అర్పించిన ఏసుక్రీస్తు వంటి మహనీయులు మానవత వెలిగించిన జ్ఞానజ్యోతిగా భావిస్తూ,

పులుముకున్న ఆకాశంలో
వెలుగుతుందది ఒక్క చుక్కలా
పేరుకున్న ఎడారి దిబ్బల్లో
వెరుగుతుందది గడ్డి మొక్కలా

విశ్వంభర, 59.

అని చిత్రిస్తూ ఆ''తేజం విశ్వచరితకు అభినవభూమిక'' ''ఆ జ్ఞానం నవ్య మానవతకు అఖండ దీపిక'' ( 60 ) అని మానవత అధిరోహించిన ఉన్నత శిఖరాలని కూడా కవి ప్రదర్శించారు.

## సామాజిక దర్శనం

డా॥నారాయణరెడ్డి తమ మత, సాంఘిక, రాజకీయ విశ్వాసాలని, దృక్పథాలని వ్యక్తీకరించడానికి తగిన కావ్యబింబాలని ప్రయోగించారు. ఇటువంటి కావ్యబింబాలు సమకాలీన సమాజానికి దర్పణం పట్టి, మానవ పరిణామాన్నికూడా ప్రతిబింబిస్తాయి. కవి వ్యక్తిత్వ ఆవిష్కరణకి ఈ కావ్యబింబ పరిశీలన దోహదం చేస్తుంది.

సంఘంలో మితిమీరుతున్న అవినీతిని, స్వార్థాన్ని పెంచుకుంటూ నైతిక విలువలని నాశనంచేసుకుంటున్న సంఘాన్ని

> ప్రణాళికల పసిడిగాదెల కింద
> పందికొక్కులు దాక్కున్నాయని
> ప్రవచనాల పట్టికల బయళ్ళ మాటున
> పన్నగాల గోతులున్నాయని

'మంటలూ-మానవుడు', 7.

చిత్రించడంలో ''పందికొక్కులు'' అనే సంప్రదాయ ప్రతీకని, ''పన్నగాల గోతులు'' అనే వైయక్తిక కావ్యబింబాన్ని కవి ప్రయోగించారు. సంఘంలో నాగరకారణ్యాలలో విచ్చలవిడిగా సంచరించే గోముఖ వ్యాఘ్రాలని ''పావురాళ్ళ ఈకలు తొడుక్కుని పంక్తిలో కూర్చున్న రాబందులు''గా చిత్రించారు. సంఘంలోను,

రాజకీయ రంగంలోను ప్రత్యక్షమయ్యే స్వార్థమూర్తులని జంతు సంబంధమైన కావ్యబింబాల ప్రయోగం ద్వారా చిత్రించి మానవునిలోని పాశవిక ప్రకృతిని వెల్లడించారు. ఈ నయవంచకులు

పొద్దున్న చూరుకంటుకునే బల్లుల్లా
మధ్యాహ్నం గోడమీద పిల్లుల్లా
సాయంత్రం కాగానే ఊసరవెల్లుల్లా

'మంటలూ-మానవుడు', 7.

మొదట అవకాశంకోసం పొంచిఉండే బల్లులుగా తరువాత పరిస్థితులకి అనుగుణంగా తమ నిర్ణయాలని మార్చుకునే పిల్లులుగా, క్షణ క్షణం తమ విశ్వాసాలని మార్చుకునే ఊసరవెల్లులుగా కవి రాజకీయ నాయకుల వికృత రూపాలని చిత్రించారు. పైకి అతి వినయంగా నటిస్తూ, అంతరంగంలో దుశ్చింతన దాచుకున్న వంచకులని

ప్రతి ఇద్దరిలో ఒక రాక్షసుడు
ప్రతి ఒక్కడిలో ఒక రాక్షసుడు

'మంటలూ-మానవుడు', 17.

అని పైకి కనిపించని రాక్షసుణ్ని కవి మానవుని మనసుపొరలలో కనుక్కున్నారు. '1972 లో కాంగ్రెసు పార్టీ రెండు పక్షాలుగా చీలిపోయిన పరిస్థితిని' 'జ'డెద్దుల

కుమ్ములాట'' అని, తాత్కాలికమైన ఈ రాజకీయపు కుమ్ములాట మానవజాతికి తరతరాలుగా సంక్రమించే జాడ్యం అని

ఈ కేచులాట
తర తరాలుగా ఉంది
నర నరాల్లో జీర్ణించింది
పురిటితో పుట్టింది
పుడకలతో కాని పోనిది

'మంటలూ-మానవుడు', 25.

అని సమకాలీన పరిస్థితికి సార్వకాలికత్వాన్ని కలిగించారు. ప్రజాస్వామ్యంలో గద్దెకెక్కిన అజ్ఞానాన్ని ''చీకటి చదువు'' అనే ఖండికలో ''చిరంజీవి చీకటి'' అనే కుతిభావంతమైన కావ్యబింబంద్వారా వ్యక్తంచేశారు. ఈ అజ్ఞానం చదివే చదువు ''అ'' తో కాక ''క్ష'' తో - అంటే ఆదితో కాక అంతంతో - ఆరంభం అవుతుంది అని, ఇటువంటి అజ్ఞానం అధికారంలోకి వస్తే

గుడ్లగూబలే వైతాళికులు
గుంటనక్కలే ఆస్థానకవులు

'మంటలూ-మానవుడు', 32.

అని అధికారుల ప్రాపకాన్ని సంపాదించేవారిని గుడ్లగూబలుగా, ఎన్నో నక్కజిత్తుల ద్వారా ఆస్థానకవులయిన వారిని గుంటనక్కలుగా కవి చిత్రించారు. ''చైతన్య ప్రగతి'' అనే ఖండికలో ప్రజాచైతన్యం టాక్టరులా ప్రగమించే సమయంలో, ఆర్థిక వనరులపై గుత్తాధిపత్యం కొనసాగదని తెలియచేస్తూ

మొత్తం సొత్తును గుత్తగా దాచుకున్న
ఊడల మర్రికి తావులేదు

'మంటలూ-మానవుడు', 32.

అని చిత్రిస్తూ ఆంగ్లభాషలో సామాన్యమైన Banyan tree అనే ప్రతీకని కవి ప్రయోగించారు. ''పాతికేళ్ల కథ.'' అనే గీతంలో ''అఖిల జగతి నిద్రిస్తున్నప్పుడు ఆత్మభారతి మేల్కొన్న'' స్వాతంత్ర్యోదయాన్ని విముక్త వాణిగా వర్ణిస్తూ ఆనాటి రాజకీయ, మత సంఘర్షణలని ఆవేదనాభరితంగా

నా తల్లి నుదుట మెరిసే
అరుణారుణ కాశ్మీర తిలకాన్ని
చెరిపేయాలనే కిరాతక కృత్యాలు
గాంధీ గంధ వహుడు నడచినతోటలో
పూలు పూలు, కొమ్మలు కొమ్మలూ
పోట్లాడుకున్న ఘాతుకకేళి

'మనిషీ-చిలక', 20.

అని చిత్రించారు. పేలవమైన రాజకీయ వాస్తవాలకి భావనాస్ఫూర్తిని జోడించి, కాశ్మీరాన్ని కాశ్మీరతిలకంగా, మందికి మారుపేరైన గాంధీని పరిమళాలు చిందే గంధవహునిగా, ఏ మతానికి చెందిన వాళ్ళైనా భారతీయులై సోదరులు కావల సినవారు జరిపిన ఘాతుక క్రియలని పూలు, కొమ్మల పరస్పర సంఘర్షణగా చిత్రించడంలో కవి తన సుకుమార హృదయాన్ని వెల్లడిస్తూ, ఆ సంఘర్షణలోని అమానుషత్వాన్ని కొంత తగ్గించడానికి ప్రయత్నించినట్లు కనిపిస్తుంది. భారత దేశం అన్ని రంగాలలోను ప్రగతి సాధించడానికి తయారుచేసుకున్న పంచవర్ష ప్రణాళికలని

అయిదు మెట్ల నిచ్చెనలు వేసుకొని
ఆశయాల అంచులు ముట్టాలనుకున్నాను

'మనిషీ-చిలక', 22.

అని కవి రమణీయంగా చిత్రించారు. ''ఈ గది కిటికీలు'' అనే ఖండికలో కిటికీని రాజకీయ చైతన్యభావాలని మనిషి మనసులోకి రానిచ్చే ప్రవేశద్వారంగా భావిస్తూ, ఆ కిటికీని తెరిస్తే ''ఝుంఝూ నిలం యువరుధిర దావానలం'' చేసే హోరు వినిపిస్తుందని అటే

పిడికిళ్ళు - మెరిసే కొడవళ్ళు
పడగెత్తిన చైతన్యం పరవళ్ళు

'ఉదయం నా హృదయం', 5.

తీసుకువచ్చే ''కొత్తవెలుగు, కొత్తగాలి'' అని మార్క్సిస్టు రాజకీయ దృక్పథం మీద తమకి ఉన్న అభిమానాన్ని కవి వెల్లడించారు. సంఘంలో స్తబ్దతని, జడత్వాన్ని ''జ్వలిత చేతన'' అనే ఖండికలో

తాబేలు డిప్ప లాంటి ఇల్లు
కీళ్ళు కొంకర్లు పోయిన గది
అవులించే మేజాబల్ల
అడపాదడపా కుక్కపిల్లలా
కుయికుయ్యమనే కుర్చీ

'ఉదయం నా హృదయం', 8.

అని ఇంటిని, ఇంట్లోని ప్రతివస్తువుని సంఘంలో జడత్వానికి, నిస్సహాయతకి సంకేతాలుగా కవి ప్రయోగించారు. మనిషి మేధ స్తంభిస్తే చుట్టూఉన్న పరిసరాలుకూడా మానవునిచేత ప్రభావితాలై స్తబ్దంగా మారతాయని కవి సూచించారు. అలాగే జ్వలితచేతనని

వేళ్ళు కదలాలి కొరడాల్లాగా
కాళ్ళు ఉరకాలి కిరణాల్లాగా

'ఉదయం నా హృదయం', 9.

చిత్రిస్తూ సంఘానికి ఉద్వేగచైతన్యం ఆవశ్యకం అని కవి స్పష్టంచేశారు.

''రెక్కలమేడ'' అనే ఖండికలో ''గుండెలమీద చెయ్యేసుకుని'' నిర్భయంగా నిదురించే నిరుపేదలకి వారిగుడిసెలని సంకేతాలుగా ప్రయోగిస్తూ,

సముద్రం మధ్య ద్వీపం
ఆకాశం మధ్య చంద్రబింబంలా
ద్వీపం మధ్య గుడిసెలు
తెగిన వెన్నెల తీగల్లా

తేజస్సు నా తపస్సు, 8.

అని గుడిసెల అందాన్ని, నిర్భయాన్ని, ప్రదర్శించారు. గుడిసెలమధ్య చంద్రుని లోని కళంకంలా ఉన్న మేడకే దిగులంతా అని కవి వివరిస్తూ, ఉప్పెనవస్తే తనకే ఉపద్రవమని గ్రహించి, ఆత్మరక్షణకై

గుడిసెల కప్పులు ఊడదీసి
మనుషులనెత్తురు జిగురుచేసి
రెక్కలుగా అతికించుకుంది
దిక్కులు కప్పుకుని పడుకుంది

'తేజస్సు నా తపస్సు', 9.

అని శ్రమజీవుల శ్రమఫలితాన్ని, దోపిడీవర్గం నిజస్వరూపాన్ని కవి ప్రదర్శించారు.

కాని ఉవెన విజృంభిస్తే ఈ వర్గం నిలవలేదని విషయాన్ని ఉవెనగా భావిస్తూ, మేడని దోపిడీ వ్యవస్థకి సంకేతంగా ప్రయోగించారు. చివరికి ఆ మేడ నేల మట్టంకాక తప్పదని, ఆ వ్యవస్థ అనంతరం శ్రామికశక్తి నూతన వ్యవస్థని నెల కొల్పుతుందనే మార్క్సిస్టు అవగాహనని

తెగిపోయిన రెక్కలేమో
కుదుట బడ్డాయి గుడిసెలుగా
ఓగురైన నెత్తురేమో
జీవించింది మనుషులుగా

'తేజస్సు నా తపస్సు', 9.

అని కవి శ్రామికవర్గ విజయాన్ని చిత్రించారు. మానవునికి మానవునికి మధ్య అగాధాన్ని సృష్టిస్తున్న ''వర్ణ'' వ్యవస్థని నిశితంగా విమర్శిస్తూ తెలుపునలుపుల కొలమానాలతో మానవుల విలువలని నిర్ణయించే విధానాన్ని

మల్లెపువ్వుకూ నల్లకలువకూ
ఎల్లలు పెడుతున్నావా?
ఏవన్నె గొప్పేలేమి?
ఇచ్చేపాలు తెలుపే

'విశ్వంభర', 84.

అని వర్ణ సామ్య సిద్ధాంతాన్ని కవి వివరించారు. అలాగే మతం మత్తుమందు అనే మార్క్సిస్టు సిద్ధాంతాన్ని దృష్టిలో ఉంచుకుని అనాగరకమైన ఆదిమదశలో గుహాలోఉన్న మనిషి, నాగరకతలోకి ఎదిగి తన స్వతంత్ర వ్యక్తిత్వాన్ని ప్రకటించుకుని, మళ్ళీ మతానికి దాసుడై తన వ్యక్తిత్వాన్ని కోల్పోతున్నాడనే విషయాన్ని

గుహనుంచి విడిపడ్డావు
గుడిలోకి చొరబడ్డావు

'విశ్వంభర', 84.

అని ''గుహ'' ని అనాగరకతకి, ''గుడి'' ని మతమౌఢ్యానికి ప్రతీకలుగా కవి ప్రయోగించారు. ఆర్థిక వనరులన్నింటిని కొందరే గుత్తాధిపత్యం చేజిక్కించుకుంటే, అచ్చమైన సౌజన్యం పిడికిలెత్తి అడుగుతుందని మార్క్సుభావాన్ని వెల్లడిస్తూ, ఈ భావన ఒక జాతికే పరిమితంకాక అంతర్జాతీయ భావన( Comintern) గా ఎదుగుతుందని కవి ప్రకటించారు. ఈ ''క్రాంతి నాదం''

దిక్కుల చిక్కులను విడిచి
దేశాల గేట్లను తుడిచి
చొరబార కుంటుందా
దేష్యమతుల నరాలలో

'విశ్వంభర', 87.

అని కవి తన విశ్వాసాన్ని ప్రకటించారు. Communist Manifesto లో మార్క్స్, ఏంజెల్స్ చేసిన "Workers of the world unite; you have nothing to lose but your chains" అన్న విప్లవ శంఖారావాన్ని

> పైకెత్తిన ఆ చేతుల్లో
> పేకలు తెగిన సంకెళ్ళు
>
> 'విశ్వంభర', 89.

గా సంకేతాత్మకంగా కవి చిత్రించారు. మేలుకొన్న శ్రామికజాతి పొందిన నవ చైతన్యాన్ని ''కటిక చేకట్ల గట్లను చేలుకుని / పొర్లివస్తున్న పొద్దుపొడుపులు'' గా వర్ణిస్తూ, శ్రీశ్రీ శ్రామికుల ''ఘర్మజలంలో ధర్మజలాన్ని'' దర్శిస్తే డా. నారాయణరెడ్డి

> కన్నీటి చుక్కల్లో
> చెమట తుంపరల్లో
> కణకణ లాడుతున్న
> దినకర బింబాలు
>
> 'విశ్వంభర', 89.

దర్శించారు. భారతదేశస్వాతంత్ర్యోదయ శుభసమయంలో ''విశ్వంభర'' కావ్యం శుభాంతం అయింది. ఆ సమయాన్ని

అపూర్వోదయం
అర్ధరాత్రి ఉషోదయం

'విశ్వంభర', 94.

అని పండిత నెహ్రూ "Freedom at Midnight" అన్న అభి భాషణని జ్ఞప్తికి తెస్తూ కవి చిత్రించారు. ఈ స్వాతంత్ర్యం మానవత పురోగమనం వైపు వేసిన మరో అడుగ్గా కవి భావించారు. అయితే ఆ శుభముహూర్తంలో కని పించిన మతసంబంధ సంఘర్షణని ''వేళ్ళ సందుల్లో పిచ్చిగేతలు'', మూలల్లో ముసురు కున్న నెత్తురు నీడలు''గా కవి చిత్రించారు.

వ్యవసాయక కావ్యబింబ ప్రదర్శనం

వరంగల్ జిల్లాలో హనుమాజీపేట అనే గ్రామంలో జన్మించి, అక్కడే తమ బాల్యాన్ని గడిపిన నారాయణరెడ్డిగారికి వ్యవసాయక రంగంతో ప్రత్యక్షపరిజ్ఞానం ఉంది. తమ కవిత్వంలో సందర్భోచితంగా ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ వ్యవసాయక కావ్యబింబాలని ప్రయోగించారు. ''ఊర్మిళ''

అనే ఖండికలో ఊర్మిళని త్యాగానికి ప్రతీకగా స్వీకరించి, ఆమె సహనశక్తిని భూదేవి వ్యవసాయ సందర్భంలో పొందే చేదు అనుభవాలుగా ఈవిధంగా వర్ణించారు.

కట్టనుభవముల నాగటిచాళ్ళు పడకముం
దే యింత శమము నేవెటుల పండించితివి

'దివ్వెలమువ్వలు', 4.

అని నాగటిచాళ్ళని జీవితంలో కష్టాలుగా కవి చిత్రించారు. కర్షక కుటుంబంలో జన్మించి సాహిత్య, సాంస్కృతిక రంగాలలో అసమానమైన సేద్యాన్ని చేసిన సురవరం ప్రతాపరెడ్డిగారిని

జీవనదివలె గలగలావిక
సించి పారిన అతని ధిషణా
పటిమ ఊసర భూములందున
పసిడి పంటల నెలారించెను

'దివ్వెల మువ్వలు', 8.

అని ఎడారి భూములని సస్యశ్యామలంచేయగల నిపుణుడైన కర్షకునిగా కవి చిత్రించారు. ఈ ఊసర భూములు విజ్ఞాన, సాహిత్యరంగాల్లో చైతన్య రాహిత్యానికి సంకేతం. ఈ చైతన్యరాహిత్యాన్ని అంతమొందించి తెలంగాణాలో

ఆయన కలిగించిన సాంస్కృతిక చైతన్యాన్ని ''పసిడిపంటలు'' గా కవి చిత్రించారు. ''లోకాలోకము'' అనే ఖండికలో ఆత్మదర్శనం చేసుకోగలిగిన వ్యక్తికి విశ్వాత్మ దర్శనంకూడా సులభం అని తెలియచేస్తూ,

ఆత్మ పాలసముద్రమటు నిం
డార పిచ్చిన దండి మనిషికి
విశ్వ గోళము పండువెన్నెల
వెన్నులొరిగిన పంటపొలమగు

'దివ్వెల మువ్వలు', 10.

నని స్పష్టంగా దర్శనీయమయ్యే విశ్వం తెల్లని వెన్నెలలో శోభించే ''పంట పొలము'' గా వ్యవసాయుజ్జ్వలకి అనుభవైకవేద్యమైన కావ్యబింబ ప్రయోగంద్వారా చిత్రించారు. ''దివ్య మానవుడు'' అనే ఖండికలో తాను కోరుకునేది ''ప్రతివానికి వెన్ని ధానమది స్నేహము'' అని ఒక సురభిళ శబ్దం, ఒక ''చాంద్రీమయ గవాక్షాలిక'' కనిపించినంత మాత్రమే

నా మనస్సులో పులకలు
నారుపోసినట్టు తాను

'దివ్వెల మువ్వలు', 47.

అని ఆనందానికి నాందిని ''నారు పోసినట్టు''గా కవి వర్ణించారు. ''వర్షా సుందరి'' అనే ఖండికలో ''కర్షక పక్షపాతి'' కవికోకిల దువ్వూరి రామిరెడ్డి

చిత్రించిన కృషీవలులని, కాపుభామలని జక్కన్కి తెస్తూ, ముందుగా కోడెర్రైతు హాలాన్ని నడిపిస్తూ ఉండగా, వెనక అతని రమణీమణి విత్తులు జారేవ దృశ్యాన్ని కవి చిత్రించారు. గాలితో పరిగెత్తే ''కాపు భామలకి'', ''వేగముగా పయనించే మేఘ సంపత్తి''కి ఎంతో సామ్యం ఉందని

ఇసుమంత విభేద మదేదియుండినన్
మొత్తముమై పయోధర సమున్నిషితాంగులు గాదెయిర్వురున్

'దివ్వెల మువ్వలు', 88.

అని రైతు భారతిని కవి చిత్రించారు. ''ఎందుకే మూకానుకరణం?'' అనే ఖండికలో వృత్తానుకరణాన్ని, ఘూకానుసరణాన్ని నిరసిస్తూ, మౌలిక ప్రతిభని

నింగి పొలంలో నీలాల మబ్బుల
నాట్లువేసే

'ఇంటిపేరు చైతన్యం', 16.

ప్రక్రియగా వ్యావసాయక దృష్టిలో కవి చిత్రించారు. ''తేజస్సు నా తపస్సు'' అనే శీర్షికాగీతంలో పరిసరాలలో ''అభినవ చేతనా నితాంత విద్యుత్తులు'' ఉదయించాలని, అహర్నిశం ''జగన్మంగళ గీతిక'' వినిపించాలని, నిర్జీవమైన క్షేత్రంలో నవసంస్కృతిని మానవుడు వికసింపచేయాలని

శవాల దిబ్బలో దిగిన కర్రు
సజీవ సంస్కృతిని పండిస్తే

తేజస్సు నా తపస్సు, 3.

అదే ''తేజస్సుకు తొలిమెట్టు' అని కర్రుని మానవకృషికి సంకేతంగా, పండే పంటని సజీవసంస్కృతిగా కవి ప్రదర్శించారు. మానవజాతి పురోగమనం వైపు వేసే అడుగులలో నిస్సారమైన భూమిని సస్యశ్యామలంగా చేసే ప్రయత్నంకూడా ఒకటి అని వెల్లడిస్తూ,

బిగుసుకు పడివున్న నేలను
చిగుళ్ళ నోళ్ళతో పలికించి

విశ్వంభర, 18.

నట్లు కవి చిత్రించారు. ప్రేమ వికసించడానికి ద్వేషం అవసరం కాదని తెలియ చేస్తూ,

ప్రేమ సస్యం పండాలంటే
ద్వేషం దుక్కి దున్నాలా?

విశ్వంభర, 79.

అని వ్యవసాయక కావ్యబింబ ప్రయోగంచేశారు.

నారాయణరెడ్డిగారు కర్షక కుటుంబంలో, పల్లెప్రాంతంలో జన్మించారు. వారికి ప్రత్యక్ష వ్యవసాయ పరిజ్ఞానం ఎక్కువగానే ఉంది. అయినా వీరి కవిత్వంలో వ్యవసాయ భావన చాలా తక్కువగా ఉండటం పరిశీలకులకి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ''దివ్వెల మువ్వలు'' వంటి ప్రారంభదశలోని కవితా సంకలనంలో వ్యావసాయిక కావ్యబింబాలు ఎక్కువగా కనిపిస్తాయి. కాని వీరి తరువాతి కవితలలో ఈ వ్యావసాయిక భావస్ఫురణ దాదాపు కనిపించదు. తిరిగి ''విశ్వంభర'' లో మానవపుంగమన గాథని చిత్రించే సందర్భంలో వ్యావసాయిక చిత్రాలని కవి ప్రయోగించారు. కని తమ పరిజ్ఞానాన్ని ఎక్కువ ఉపయోగించక పోవడం కవి వ్యక్తిత్వావిష్కరణకి ఎక్కువ ఉపకరించలేదు అని చెప్పక తప్పదు.

## నాగరక కావ్యబింబ ప్రదర్శనం

డా.నారాయణరెడ్డిగారు తమ విద్యాభ్యాస ఆరంభం నుంచి నగర జీవి. నగరదృశ్యాలని, అనుభవాలని తమ కవిత్వంలో ఉపయోగించుకుని నగర జీవన కావ్యబింబాలని ప్రయోగించారు. ఇవి సంఖ్యలో ఎక్కువగా లేకపోయినా తమ భావాలని, నగర జీవనంమీద వేరు చేయదలచుకున్న వ్యాఖ్యలని ప్రతిభావంతంగా వ్యక్తీకరించడానికి ఈ కావ్యబింబాలు కవికి ఉపకరించాయి. ''కొరడా కొసలు'' అనే ఖండికలో పురాణప్రసిద్ధమైన పుష్పక విమానంతో చోటుదొరకకపోతేనేమి కాని

ఏర్‌ప్లేన్‌లో
ఒకమారు ప్రయాణించు

'నారాయణరెడ్డి గేయాలు', 95.

అని ''ప్లేన్'' లో సేదిపిపించే వెండి కాగితాలు లేకుంటే పాటలరెక్కలమైన ఉడా యించమని కవి సలహా ఇచ్చారు. నాగరక సమాజంలో వెండికాగితాల విలువని వాటి నిరంకుశత్వాన్ని పూర్తిగా గ్రహించిన వాస్తవిక జ్ఞాని డా.నారాయణరెడ్డి. ఈ వాస్తవిక జ్ఞానంతోపాటు, కవితాభావుకశక్తిమై విశ్వాసం ఉన్నవ్యక్తి కనుకనే, కాగితాలు లేకపోతే భావాంబరవీధిలో విస్తృత విహారంచేయడానికి పాటల రెక్కలు చాలు అని స్పష్టంచేశారు. ''పాటల రెక్కలు'' అనే కావ్యబింబం Keats "Ode to a Nightingale" లో ప్రయోగించిన "Viewless wings of poesy" అనే కావ్యబింబాన్ని స్ఫురింపచేస్తోంది. ''మాట్లాడే స్మృతులు'' అనే ఖండికలో చిమ్మకౌగిట్లో వెచ్చగా పడుకున్న ఊళ్ళని చేదుజ్ఞాపకాలుగా పేర్కొంటూ అవి

అరుస్తున్నాయి పొగగొట్టాలు వికవిక నవ్వి

'అక్షరాల గవాక్షాలు', 105.

అని నాగరక జీవనంలో సర్వసామాన్యమైన చేదు అనుభవాన్ని తమ చేదుజ్ఞాపకాలని వ్యక్తీకరించడానికి కవి ప్రయోగించారు. ''జగత్తు మత్తుగా పడుకుంది''

అనే ఖండికలో నగరంలో సామాన్యదృశ్యాన్ని

గోడమీద గడియారం మాత్రం
గుండె దడల్ని కొలుస్తూ వుంది.
కారుమోత కుక్కకూతా కలిసి
సుగమ సంగీతాన్ని సృష్టిస్తున్నై

'అక్షరాల గవాక్షాలు', 123.

అని స్వార్థజీవితంలో విచిత్ర సంగీతాన్ని కని వినిపించారు. ధనవంతుల దోపిడీ విధానానికి గురిఅయిన సామాన్యమానవులని

రబ్బరు చక్రాలకింద
రుబ్బిన పిండిలా నలిగే
రెక్కలు రాని పక్షులు

'మరో హరివిల్లు', 51.

గా వర్ణించడం ఆధునిక నాగరక అనుభవాలకి సంబంధించినది. సాధారణంగా అణగబడిన వర్గాన్ని ఇనుప చక్రాలకింద నలిగినట్లు వర్ణించడం పరిపాటి. ఇనుప చక్రాలు దోపిడీ వర్గంచేసే బాహాటమైన దోపిడీని సూచిస్తాయి. ''రబ్బరు చక్రా''లు తడిగుడ్డతో గొంతులు కోసే నయవంచకులని సూచిస్తాయి. నాగరక

జీవనంలో ఇటువంటి వంచన, మోసం సర్వసామాన్యమైన అనుభవాలు. నాగరక ప్రపంచాన్ని జాగ్రత్తగా పరిశీలించిన కవికి

సిగరెట్టు సిగలో మెరిసే
నెగపువ్వు
ఇంధనం అధరంపై విరిసే
ఎర్రనవ్వు

'మంహారినిల్లు', 60.

సిగెరెట్టు, ఇంధనం స్త్రీమూర్తులుగా కనిపించాయి. సిగరెట్టు అంచుని 'సిగ' గా ఇంధనం ఉపరితలాన్ని ''అధరం'' గా భావించడం కవి ప్రతిభకి నిదర్శనం. పేలవమైన నాగరక వాస్తవాలని కవితా సత్యాలుగా మార్చగలిగే కవిత్వపు పరుస వేది డా. నారాయణరెడ్డిగారి సొత్తు. ఇటువంటి కావ్యబింబాలు వారి కవిత్వ స్థాయిని నిర్ణయించే నికషోపలాలు. 'మనిషీ-చిలక'' అనే గీతంలో ఆఫీసుల్లో అనవాయతీగా జరుగుతున్న లంచగొండి వ్యాపారాన్ని చిత్రిస్తూ, ఆ వ్యవస్థకిచెంది ఇంకా ఆత్మప్రబోధాలని లెక్కచేసే గుమాస్తాని నాగరకజీవిగా మనముందు నిలబెట్టారు. సినిమాహాళ్ల దగ్గర టిక్కెట్ల కోసం కాచుకునే క్యూ

తొక్కిసలాడుతున్న 'చిత్ర' ప్రవాహం

'మనిషీ-చిలక', 7.

గా కవి చిత్రించారు. టికెట్లని బ్లాక్‌మార్కెట్‌లో అమ్మడాన్ని

బ్లాక్ మార్కెటులో వైట్ టికెట్

'మనిషీ-చిలక', 7.

అని నాగరకజీవితంలో నితకసత్యాన్ని చిత్రించారు. నాగరకజీవిపొందే ప్రణయానుభవంకూడా తన ఆఫీసు పరిజ్ఞానం మీద ఆధారపడి ఉంటుంది. నగరంలో గుమాస్తా తన ప్రియురాలితో

క్షణంలో నే ఒళ్లో వాలుతాను
సౌఖ్యాలఫైళ్లమీద సంతకాలు చేస్తాను

'మనిషీ-చిలక ', 8.

అని ఆతని సౌఖ్యాన్ని ఫైళ్ల కావతిబింబం ద్వారా కవి ప్రకటించారు. ''క్లోజ్ యువర్ షాప్'' అనే ఖండికలో తనకి ఇష్టంలేని విషయాలని కట్టిపెట్టమని కోరుతూ ''చిల్లరకొట్టు కవిత్వాన్ని'', ''కలలను అచ్చు తెలిగించే యంత్రాన్ని'' పేర్కొంటూ

నైలాన్ చీకటిలో నర్తించే
నేటి ఆటవెలది నాగరికత

'మనిషీ-చిలక ', 32.

కూడా తనుకి ఆమోదయోగ్యంకాదని కవి స్పష్టంచేశారు. యాంత్రికమైన నగర జీవితం కాలానికి కట్టుబడి ఉంటుందని, ఆ యాంత్రికజీవిని ''ఓటమి ఓడి పోతుంది'' అనే ఖండికలో

కాలం ప్రసవించిన కాలండర్లమీద
గడియారం తొడుక్కున్న ముళ్లమీద
తిరుగుతున్నది నీ బతుకు
దిక్కులేని గడసాని లాగా

'మనిషీ-చిలక ', 34-35.

అని కవి ఆధునిక మానవుని స్వేచ్ఛారాహిత్యాన్ని చిత్రించారు. ''మధ్యాహ్నవేళ'' అనే ఖండికలో పట్టణాలు పారిశ్రామిక వాడలతోనిండి పారిశ్రామిక సంస్కృతిచేత ప్రభావితమవుతున్న దృశ్యాన్ని

పగలు పన్నెండు గంటలు
తెగ మోగు తున్న వేళ
ఫాక్టరీల్లో అంటుకునే
హాకుల పొలతభుక్కుల జ్వాల

'మనిషీ-చిలక', 36.

ని ప్రదర్శిస్తూ ఈ వాతావరణంలో చెలరేగే వర్గ సంఘర్షణని, హక్కులకోసం పెనుగులాటని కవి చిత్రించారు. కూలీలు సమ్మెచేస్తే యజమానులు లాకౌట్ ప్రకటిస్తారు. ఘర్షణ ఎక్కువై రంగంలోకి పోలీసులు ప్రవేశిస్తారు. అప్పుడు జరిగే రక్తపాతాన్ని, హింసని

టియర్ గ్యాస్ పేలిన చప్పుడు లోనుంచి
బుల్లెట్లు కంటుకున్న చల్లటి నెత్తుటి ఉప్పెనలోనుంచి
కోలాహలం గీపెట్టి

'మనిషీ-చిలక

నని కవి చిత్రించారు. నగరంలో కనిపించే అర్ధరాత్రి దృశ్యాన్ని చిత్రిస్తూ ''చెలియా కనరావా'' అంటూ విలపిస్తున్న గల్లీలని'', హరేకృష్ణ హరేరామ'' అంటూ అరుస్తున్న విల్లాలని కవి ప్రదర్శించారు. సికిందాబాదులోని అర్ధరాత్రి దృశ్యాలని

ఒంటి కంటిలో చూస్తున్న బార్లు
ఊపిరి దుస్తులు ఆరేసుకున్న కార్లు
పెరేడ్ మైదానం గర్భగుడిలో
మైలాపడేసు షికార్ల పూజార్లు

'మనిషీ-చిలక', 39.

గా కవి చూపించారు. బానెట్ పైకితీసి కారు ఇంజిను భాగాలకి గాలి తగిలేలా వదిలి పెట్టే ప్రక్రియని ఊపిరి దుస్తులు ఆరేసుకున్నట్లుగా చిత్రించడం ప్రతిభావంతంగా ఉంది. పెరేడ్ మైదానంలో కుర్రకారు ఆనందానికి ఉపకరించే గర్భగుడిని చూడటంకూడా కవి పరిశీలనాశక్తికి నిదర్శనం. నేటి విద్యాలయాల్లో పరీక్షా సమయాల్లో విస్తృతంగా సాగుతున్న కాపీ వ్యాపారాన్ని

పంతుళ్ళ గాలింపులను తప్పించుకొని
పరీక్షహాళ్ళ గర్భ గుళ్ళలోకి
సరాసరిగా దిగుమతి అవుతున్న
సరికొత్త కాపీకల్చర్

మార్పు నా తీర్పు, 18.

గా కవి చిత్రించారు. ''నగరం పడిపోతున్నది'' అనే ఖండికలో నవతరం ప్రభవించే సమయంలో పతనమౌతున్న నాగరక వ్యవస్థని

కొంకర్లు పోతున్నాయి
ఆకాశాన్ని గోకే మేడలు
బీటలు వారుతున్నాయి
కొవ్వు పెంచుకున్న గోడలు

"మార్పు నా తీర్పు", 27.

గా శ్రామికుల శ్రమఫలితాన్ని అనుభవిస్తూ, కొవ్వెక్కిన వ్యవస్థని ప్రదర్శించారు. ఈ సమయంలో విప్లవం చెలరేగితే ''మండిపడుతున్నాయి / మీటనొక్కకుండా కరెంటుతీగలు'' అని నగరజీవనంలో సామాన్యంగా కనిపించే కరెంటు తీగలని విప్లవశక్తికి సంకేతంగా కవి ప్రయోగించారు. నగరాల్లోని ఆఫీసుల్లో అప్పు డప్పుడు జరిగే గుమాస్తాల ఆందోళనని

సూర్యగోళాన్ని మబ్బులు చుట్టుముడతాయి
అడపా దడపా -
ఆఫీసర్ని కిందిసిబ్బంది ఘెరావ్ చేసినట్టు

'మథనం', 27.

గా కవి ప్రదర్శించారు. అవాంతరాలని దాటుకుంటూ 'ఉద్యమనం' సాగిస్తానని తెలియచేస్తూ

అన్నీ దాటుకుంటూ వస్తాను
ఆశల ఆటో చక్రాలమ్మె
అవికాస్తా గుడ్లు తేలేస్తే
ఎగిరొస్తాను రెండు కాళ్ళమ్మె

'మథనం', 59.

అని నగర జీవనంలో మానవుడు యంత్రాలపై ఆధారపడేస్థితిని వర్ణిస్తూ, ఆ యంత్రాలు విఫలమైతే మానవుడు మళ్ళీ స్వశక్తిమీద ఆధారపడి పురోగమించాలని కవి సూచించారు.

## పరోక్ష జ్ఞాన ప్రదర్శనం

ప్రత్యక్ష పరిశీలనపై ఆధారపడి కవి కల్పించిన కావ్యబింబాలతో పాటు పరోక్ష జ్ఞానంవలన కల్పించిన కావ్యబింబాలని కూడా డా.నారాయణరెడ్డి పరిమితంగా ప్రయోగించారు. ఇటువంటి కావ్యబింబ పరికల్పనకి వారి పురాణగ్రంథ పఠనం, సంప్రదాయ స్మృతి, చారిత్రక అధ్యయనం దోహదం చేశాయి.

పౌరాణిక కావ్యబింబ దర్శనం : ''దీపసుందరి'' అనే ఖండికలో దీపాన్ని

తిమిర లోకములోన
కనిపించినా వచ్చి
జనిత లక్ష్మి

'నారాయణరెడ్డి గేయాలు',

గా పౌరాణిక లక్ష్మీదేవితో పోల్చి కవి చిత్రించారు. ''లోకాలోకము'' అనే ఖండికలో స్నేహశక్తిని వర్ణిస్తూ

స్నేహపవమానము అగస్త్యఋ
షీంద్రు పోలిక సాగిపోయిన
నెత్తి బిగిసిన గిరులు నేతము
మెత్త బడిమును సాగిలంబడు

దివ్వెల మువ్వలు, 11.

అని పురాణప్రసిద్ధుడైన అగస్త్యుని అమోఘశక్తిగా కవి చిత్రించారు. ''స్త్రీ అనగా శ్రీ'' అనే ఖండికలో స్త్రీశక్తిని ''హరిహరులకు సంకేతము''గా వర్ణిస్తూ, ఆమె జోడుగరిస్తే ''లోకం రావణాసురుని కాష్ఠం' అని ఎన్నటికీ ఆరని కాష్ఠంగా లోకాన్ని చిత్రించారు. అంతేకాక

అంగనా బాహిరరూపం ప్రకృతి
అంతరంగం దానికి వికృతి
పురుషు డేరెందినే కోరి
పొందుతాడు త్రిశంకుని గతి

దివ్వెల మువ్వలు, 13.

అని స్త్రీమూర్తి గంభీర నిగూఢవ్యక్తిత్వం పురుషునికి అర్థంకాదని ప్రకృతి వికృతుల మధ్య శూన్యంలో ఆతడు త్రిశంకునిలా వేళ్లాడతాడని కవి తెలియ చేశారు. గోహ విముక్తికోసం జైత్రయాత్ర సాగించిన భారతీయ వీరులని

నేరథీవలె ఉప్పొంగిన
నియంతృత్వ దుశ్శక్తిని
అమాంతముగ మ్రింగివేయు
అగస్త్యు లైనారు

దివ్వెల మువ్వలు, 92.

అని నియంతృత్వాన్ని నేలకరపించే ఈనాటి భారతీయశక్తి, అనాదిగా ఉన్న పౌరాణిక శక్తిగా కవి భావించారు. ''ఆత్మీయం'' అనే ఖండికలో తనని ఆశీర్వదించిన వారు తనకి నిత్య కౌమారాన్ని ఆశించారని ''సనత్కుమార తేజస్సహస్రాంశం'' (అక్షరాల గవాక్షాలు, 69) లభిస్తే చాలునని ఆశించినట్లు కవి తెలియ చేశారు. ''అజ్ఞాతవాసం'' అనే గీతంలో పరస్త్రీ వ్యామోహ వాంఛని కీచకప్రవృత్తిగా చిత్రిస్తూ ఆ ప్రవృత్తిని హతమార్చే శక్తిని

ఆశయం వేసుకునే మేలి ముసుగు కప్పుకుని
ముచ్చటగా ముడుచుకు పడుకుంది ధర్మాంశం
కీచక ప్రవృత్తి దాన్ని స్పృశించింది
రెంటికీ జరిగిన సడిలేని సమరంలో
కీమన్నది కీచక ప్రవృత్తి
ఆశయానికి పీడా విరగడైంది

అక్షరాల గవాక్షాలు, 129-130.

అని ప్రతిభావంతమైన ధ్వనియుక్తంగా కవి చిత్రించారు. ధర్మానికి ప్రతినిధిగా భీముణ్ని, మానవునిలో రాక్షసప్రవృత్తికి ప్రతినిధిగా కీచకుణ్ని వర్ణిస్తూ రాక్షస

ప్రవృత్తినుంచి విముక్తమైన శక్తిగా సైరంధ్రిని ''ఆశయం''గా కని చిత్రించారు. ''అమృతం పంచిపెడుతున్నాను'' అనే ఖండికలో మధ్యతరగతి జీవులకి అమృతాన్ని పంచిపెడతానని వారిని ఆహ్వానిస్తూ ఆ అమృతం

సమాజమే సముద్రంగా
సంకల్పమే కవ్వంగా
ఆశయాల వాసుకుని చుట్టి
అంతు తేలేదాకా గిలకొట్టి
తీసిన నవామృతం

మరోహరివిల్లు, ౩.

అని ప్రకటించారు. ఈనాటి మధ్యతరగతి జీవులకి తాము అందించే ఆనందసుధ అనాదిగా ఉన్న అమృతమేనని కవి వెల్లడించారు. ''మంటలూ - మానవుడు'' అనే శీర్షికాగీతంలో ఉద్విగ్నుడైన మానవుణ్ని

మార్తాండబింబం వంటి.....
మార్కండేయుని లాంటి
మారుతి లాంటి
మహోజ్జ్వలభావి చిరంజీవి

'మంటలూ-మానవుడు', ౩.

అని నేటి మానవుణ్ణి పురాణకాలం నాటి మార్కండేయునితోను, మారుతితోను, సర్వకాలాలలో కర్మసాక్షి అయిన మార్తాండబింబంతోను పోల్చి మానవుని విప్లవ కాంక్ష భూత వర్తమాన భవిష్యత్కాలాలకి చెందిన సార్వకాలిక కాంక్షగా కవి చిత్రించారు. ''కొత్తముఖం తొడుక్కో'' అనే ఖండికలో పాతని త్యజించి కొత్తని స్వీకరించమని అర్థిస్తూ ఆ కొత్త ముఖంలోని చైతన్య దీప్తులు రవ్వలా, నిప్పు రవ్వలా

సత్యభామ ముక్కుపోగులో
నిత్యనూతనంగా మెరుస్తాయి
నరకప్రవృత్తిపై తిరగబడి
చెరచెరా దహించి వేస్తాయి

'మంటలూ - మానవుడు', 22.

అని వర్ణించడంలో ఈనాటి చైతన్యం పౌరాణికకాలం నాటి చైతన్యానికి ప్రతి రూపం అనే నిత్యనూతన సత్యాన్ని కవి సూచించారు. ''ఆనందగాత్రి'' అనే ఖండికలో ధాత్రిని పూలదుస్తులు తొడుక్కుని కటిచుట్టూ కుంపటి కట్టుకున్నట్టుగా వర్ణించి ఆనందం చీకటిపాలు కాకూడదు అనే తమ విశ్వాసాన్ని కవి

గప్పున వ్యాపిస్తున్న
చుప్పనాతి చీకటి నాతికి
కోదండ రాముడా లోకువ?

'మంటలూ-మానవుడు', 50.

అని అంటూ కోదండ రాముణ్ని సౌందర్యాభిరామునిగా, ఆతనిపై మరులుకొన్న శూర్పణఖని చీకటికి ప్రతీకగా కవి చిత్రించారు. అధికారమూ, ఐశ్వర్యమూ ఉన్నా అభిరామమైన అనుభూతి లేకుంటే ఆనందగాత్రి, అవనీపుత్రి లభించదు అని తెలియచేస్తూ,

లంకంత ఇల్లున్నా
లక్ష పసిడి లోగిళ్ళున్నా

'మంటలూ-మానవుడు', 50-51.

అని పెద్ద ఇల్లుని లంకంత **ఇల్లు** అనే దేశీయ నుడికారంతో వర్ణించారు. లంక అనే పదప్రయోగంలో రావణాసురుని లంకనికూడా కవి సూచించారు. ''పంథొమ్మిది వందలడెబ్భై'' అనే ఖండికలో పరిక్రమించే కాలాన్ని ''పంథొమ్మిది వందల డెబ్భై మేకులని సహించిన క్రాసు''గా కవి చిత్రించారు. కష్టాలని సహించే కాలాన్ని క్రాసుగా చిత్రించడం సంఘనిష్ఠమైన ప్రతీక అయినా సంవత్సరాలని మేకులుగా చిత్రించడం వైయక్తిక కావ్యబింబ పరికల్పన. కాలంలోని అనంత సహనశక్తిని వర్ణిస్తూ,

కాలం ఒక క్రీస్తులాంటిది
అది భరించింది
అణువణువునా నిమిషాల ఉక్కుబాకులు

'మంటలూ-మానవుడు', 69.

అని చిత్రించారు. ''నాదేశం కనిపించింది'' అనే ఖండికలో భారతదేశ సమ్యక్ స్వరూపాన్ని

నాదేశం పావన గంగ
నాదేశం కరుణాంతరంగ
నాదేశం భగవద్గీత
నాదేశం అగ్నిపునీత సీత

'ముఖాముఖి', 3.

అని రాజకీయ నాయకులు చేసే ఉపన్యాసాలలో కనిపించే భారతదేశ చిత్రాల్ని కవి వ్యంగ్యాత్మకంగా చిత్రించి, యథార్థంగా భారతదేశం అనైకమత్యంతో అస్తవ్యస్తమవుతున్న స్థితిని

ఎండిపోతున్న గంగానదిలో
రెండుగా చీలుతున్న కావేరిలో
మోడువడ్డ బోధి వృక్షంలో
పుండు వడ్డ భూమాత వక్షంలో
నాదేశం కనిపించిది.

'ముఖాముఖి', 5.

అని సమకాలీన రాజకీయ, సాంఘిక పరిస్థితికి దర్పణం పట్టారు. పురాణాలలో ప్రసిద్ధమైన భారతదేశం ఈనాడు కనిపించదనే వాస్తవికదృష్టిని కవి

వెల్లడించారు. నేటి సమాజంలో ధనం సాగిస్తున్న అధికారాన్ని, ధార్మిక విలువల చ్యుతిని వర్ణిస్తూ,

పచ్చకాగితాల మాంత్రికులలో
నీతి నాతి కట్టుకున్న
విలువల వలువల నూడ్చివేసే
అపర దుశ్శాసనుల ఆటవిక కృత్యాలు

'ముఖాముఖి,' 6.

ని కవి చిత్రించారు. మానవుని దుశ్చింత, దురాశ ఈనాటివి కావు అనాదిగా పీడిస్తున్న జాడ్యాలే అని కవి ఈ సందర్భంలో వెల్లడించారు. ''స్వేచ్ఛాఫలం'' అనే ఖండికలో బైబిలులో మానవునికి పచ్చని తోటని ఇచ్చిన భగవంతుడు ఒక పండుని నిషేధించిన ఆంక్షని

కలకలలాడే పండు పిలిచింది
కళ్లకూ పళ్లకూ చవులూరించింది

'ముఖాముఖి', 15

అని దేవుని ఆంక్షని మానవుని కాంక్షని చిత్రిస్తూ, దేవుని నిషేధాన్ని ప్రతిఘటించిన మానవ ప్రయత్నం స్వేచ్ఛకి చుట్టిన శ్రీకారం అని కవి కొనియాడారు.

''సమర సంక్రాంతి'' అనే ఖండికలో సంక్రాంతి ఉదయాన్ని విప్లవోదయంగా ''దూసుకొస్తున్న మార్తాండ బింబం''గా చిత్రిస్తూ, శాంతిప్రియ అయిన భారతమాత చల్లని చిరునవ్వుల తల్లి, కాని

కపిస్తే భద్రకాళి అని
గ్రహించలేరు మహిషాసురులు

'ముఖాముఖి', 58.

అని భారతమాతని శత్రుమర్దని మహిషాసురమర్దనిగా కవి చిత్రించారు. భారతీయ వీరసైనికుల్ని ''ఏ రామభద్రుని రోషమో, ఏ ప్రళయరుద్రుని ఆవేశమో ఉత్తేజ పరచిన వీరవరులు''గా కవి చిత్రించారు. ''మనిషి-చిలక'' అనే గీతంలో లంచంతో మభ్యపెట్టే ఫైలు ''సుదర్శన చక్రంలా ప్రతి అంచున మెరుస్తున్నది'' అని వర్ణించారు. సుదర్శనచక్రం అధర్మభేదకం. మానవుని మనసులో పెరుగుతున్న అధర్మాన్ని అంతం చేసే ఆయుధం అని కవి ఆ ఫైలు చివరికి అతని మనసులో ధార్మిక పరిణామాన్ని కలిగించగలిగే దివ్యశక్తిగా చిత్రించారు. దురాశతో ధనాన్ని అన్యాయంగా ఆర్జించాలని ఆశపడే మానవుణ్ణి

బాలుడిలా శిశుపాలుడిలా
పరుగుతీశాడు మనిషి

'మనిషి-చిలక', 13.

అని చిత్రించారు. శిశుపాలుడు మానవుని దుర్గుణాలకి ప్రతీక అయితే బాలుడు కూడా దుర్గుణాలకి ప్రతీకగా కవి చిత్రించడం కొంత ఆశ్చర్యకరంగా ఉంది. బాలుడికి శిశుపాలుడికి శబ్దసామ్యంతోపాటు ఈ ఖండికలో చిత్రించబడిన గుమాస్తా ధార్మికంగా ఎదగక నైతిక శిశువుగానే ఉన్న పరిస్థితిని సూచిస్తోంది. ''క్రో. అన్నది కొత్తతరం' అనే ఖండికలో ప్రతీపశక్తుల వినాశనాన్ని ప్రారంభించే యువతరాన్ని

వెత్తందార్లు పన్నుతున్న
కుత్సితాల పద్మవ్యూహాలను
ఆదిలోనే బద్దలు కొట్టే
అభిమన్యుల తరం

'మనిషీ-చిలక', 26.

అని పద్మవ్యూహ ఆరంభంలోనే ప్రతీపశక్తుల దుశ్చింత తెలిసికొని వారి ఆట కట్టించే విప్లవ శక్తులుగా కవి చిత్రించారు. ''వేరు ధర్మరాజు'' అనే ఖండికలో పాచికలాడి తన రాజ్యాన్ని, తమ్ముళ్లనే కాక పంచభర్తృక, అగ్నిపుత్రికనికూడా పందెంకాసిన ధర్మరాజుకి ధారిజిషీటు ఇస్తూ

నువ్వుఅసలు అలగనే అలగవట
అలిగితే సాగరాలు కలగునట
ఏమయింది ఆరోజు నీ అలక

'మనిషీ-చిలక', 29.

అని ప్రశ్నిస్తూ ''చేరలుదోచే అలవాటున్నా చేరలిచ్చి రక్షించాడు'' ఆ కర్ణో దొంగ నీకంటె నయం అని, ధర్మరాజుని ''మెత్తని పులి'', ''వేపవిత్తు'' గా కవి చిత్రించారు. ''చుకటనవ్వుకుంది'' అనే ఖండికలో తాము మంచులో కూడా విషవాగ్నిని దర్శించగలిగే వ్యక్తి అని తెలియచేస్తూ

బడబాగ్ని బడిలో
పాతాలునేరేపే ప్రహ్లాదుణ్ని

'ఉదయం నా హృదయం', 41.

అని తాము సత్యాన్వేషిని అని చిత్రించుకున్నారు. వర్తమానంలో విషవాన్ని సాధించే చైతన్యమూర్తులని జడంగా పడిఉండే బతికి ఉన్న శవాల్ని

విగ్రహాలలోన రంకెవేయునందికేశ్వరులని
వేడిచచ్చి తలలూపే డూడూ బసవన్నలవి

'మార్పు నా తీర్పు', 10.

పురాణాలల్లో వీరత్వానికి ప్రతినిధి అయిన నందికేశ్వరునిగా, స్వతంత్రబుద్ధిలేక బానిస భావాలు కలిగిన వ్యక్తులకి ప్రతినిధి అయిన బసవన్నగా కవి చిత్రించారు. ''ఇంటిపేరు చైతన్యం'' అనే ఖండికలో ఇతరులు సేవకోసం తన జీవితాన్ని అర్పించే పిచ్చి కెరటాలు పుడమిదోసిట్లో పాలనవ్వులాంటి పచ్చి ముత్యాలు పోస్తాయని ఆ సమయంలో తన హృదయం శరశయ్యమై ఉన్న భీష్మునితో తాదాత్మ్యం పొందుతుందని కవి తెలియచేశారు. పురాణకాలంనాటి భీష్ముడు,

క్రైస్తవ మతంలో ఏసుక్రీస్తు, తాము ఒకటే అనే భావాన్ని

నేను శరశయ్యనైనాను, నా
మైన పడుకుంది నా గుండె - మే
కులలోని ఒళ్ళంత కుట్టేసుకున్న జీసెస్‌లాగ

'ఇంటిపేరు చైతన్యం', ౬.

అని వ్యక్తంచేస్తూ, దేశమత పరిధుల్ని దాటిన త్యాగమహిమని కవి చిత్రించారు. ఇటువంటి విశ్వజనీన దృక్పథంలో తమశ్వాస ''విశ్వంభరా పథా పదములకు పారాణి పూసింది'' అని భావిస్తూ, తాము అభినవ మహార్నాదం విన్నామని వెల్లడిస్తూ

నా యింటిపేరు చైతన్యమని
నా కంఠమే పాంచజన్యమని

'ఇంటిపేరు చైతన్యం', ౧.

కవి ప్రకటించారు. చైతన్యవంతమైన వీరి కంఠం పురాణకాల పాంచజన్యంగా కాలావధిని అధిగమించిన శక్తిగా కవి చిత్రించారు. భారతమహేతిహాసంలో చిత్రితమైన ధర్మనీతికి, మోక్షనీతికి ఆధారమైన శ్రీ కృష్ణగాథని

చేరలొలిసిన మోరకత్వం
చేరలిచ్చిన శ్రీ కరత్వం

'భూమిక', 15.

గా పాశవిక ప్రవృత్తినుంచి స్త్రీమానాన్ని కాపాడిన దివ్యశక్తిగా, రాసకేళిలో గోపికలకి వీడవిడుపులు, మేలుకొలుపులు కలిగించిన స్వామికోడలని కవి చిత్రించారు.

దేవుడెక్కడ అని అహంకరించిన హిరణ్యకశిపుని మదమడగించిన నరసింహుని ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తూ

తామసం తలకెక్కి నర్తించ
దానవత స్తంభమును తాడించ
ఉద్భవించిన రూప వర్ణనం
ఊహా విగాహిత పదార్ణవం

'భూమిక', 27.

కవి చిత్రించారు. ధీరాలుబ్ధుడైన విశ్వవిజేతగా హిరణ్యాక్షుని

పుడమి నంతటినీ పుక్కిట బట్టి
కడలులన్నింటిని చాపగ చుట్టి

'భూమిక', 76.

నట్టి కేవల యశోముగ్ధునిగా కవి చిత్రించి ఈ విజయం క్షణికం, అర్థ రహితం అని స్పష్టంచేశారు. అణిగి మణిగి ఉన్న ప్రజాశక్తిని మరీ అణచాలని చూస్తే ఆశక్తి ఎదురు తిరుగుతుందని స్పష్టంచేస్తూ

> చేతిలోన కొరడా వుందని చెయి చేసుకుంటావు ఎందుకని
> తిరగబడితే ప్రతిస్తంభంలో నరసింహాకృతి పుడుతుంది
>
> 'మథనం', 14.

అని ఉరికి వచ్చే విప్లవమూర్తిని నరసింహాకృతిగా కవి చిత్రించారు. తమ ఉద్యమనంలో ఆశల్ని భుజాల మీద మోసుకువెడతానని తెలియచేయడానికి అలల్ని మోసుకుంటూ తిరుగుతానని వాటిని వాస్తవికతతో చేర్చనని తెలియచేస్తూ ఎటువెళ్ళినా రాతి సమాధులే ఎదురౌతున్నాయి.

> ఈ అలల్ని
> సమాధులపై దింపుకొను
> అవి తేరా అహల్య లై
> కాళ్ళబేరానికొస్తే
>
> 'మథనం', 64.

అని ఆశలు వాస్తవాలతో కలిస్తే అహల్యలా రూపధారణచేసి తమ ఉద్యమానికే ఆటంకాలవుతాయేమో అనే భయాన్ని కవి వ్యక్తంచేశారు. పురాణంలో ప్రసిద్ధ

చెందిన అహల్య శాప విమోచనంతో శ్రీరామ చంద్రునికి అవతారమూర్తిగా ప్రఖ్యాతి తెచ్చిపెట్టింది. కాని అది త్రేతాయుగం. ఈ కలియుగంలో శాప విముక్తి పొందిన స్త్రీ తనకి ఆటంకాన్నే కలిగిస్తుందేమో అనే ఈనాటి దృష్టితో కవి భావించారు. ప్రకృతిలో ఒక శక్తి బలహీనమైన మరిఒక శక్తిని కబళించాలని చూస్తుంది. ''ఎండాకాలం పరిశారు'' చివరి నీటిబొట్టుని పీల్చివేయాలని చూస్తుంది అని

యవ్వనం యయాతి లాంటిది
ఎంత దురాశ దానికి?

'మృత్యువు నుంచి', 3.

అని తన స్వార్థానికి తన పుత్రుని యౌవనాన్నే స్వీకరించిన యయాతిని దురాశకి చిహ్నంగా కవి చిత్రించారు. మనస్సు తనని మథించుకునే ప్రక్రియని

సంకల్పం తిరుగుతుంది కవ్వంలా
సంలక్ష్యం ఉబుకుతుంది విషంలా
పొగచూరి పోతోంది మనస్సు
నెగలు కక్కుతోంది విషతమస్సు

'మృత్యువు నుంచి', 7.

అని క్షీరసముద్ర మథన సమయంలో విషాన్ని స్వీకరించిన మృత్యుంజయుని రుద్రగళాన్ని, హాలాహలానంతరం పొంగి వచ్చిన అమృతకలశం వంటి మనస్సు కెరటాన్ని కవి మనకి చూపించారు. సత్యవంతుని ప్రాణాలని తిరిగితెచ్చిన సావిత్రిని

మృత్యువుకే వెన్ను విరుపు
యమ చెరలో గిజగిజలాడిన సత్యం
యమధర్మాన్ని గజగజలాడించింది స్వధర్మం

'మృత్యువునుంచి', 10.

అని మరణాన్ని గెలిచిన మానిని స్వధర్మ నిరతిని కవి ప్రదర్శించారు. ఈ ఉదంతం మానవునిలో ''చల్లింది ఆశల వసంతం'' అని కవి తమ ఆశని వెల్లడించారు. మృత్యువుని జయించిన విజయగాథలని వేర్కొంటూ

హావని తెచ్చిన సంజీవని
బ్రతికించింది సౌమిత్రిని
అసుర గురువు ప్రయోగించిన జీవనౌషధి
అసువులు పోసింది సురగురు సూతికి

'మథనం', 21.

అని సురేతరులు మృత్యువుని జయించగలరనే ఆశని కవి వ్యక్తీకరించారు. వద్దని గిరిగీసిన పండుటాకు నాలుకచివరికి కలిగిన కోరికని

సహచరి గుండెలో ఒకకోరిక
సర్పంలా తిరిగింది మెలిక

'విశ్వంభర', 7.

అని 'ఈవ్' మనసులో కలిగిన ప్రలోభాన్ని కవి చిత్రించారు. ఈ స్వేచ్ఛాభిరుచి అహంకృతిగా కనిపించినా, ''అక్కడే మొదలవుతుంది మానవ సంస్కృతి'' అని కవి తమ విశ్వాసాన్ని వెల్లడించారు. విశ్వామిత్రుని ఘోరతపస్సు తన అధికారానికి ముప్పుతెస్తుందని భయపడిన ఇంద్రుణ్ణి

వెరటప్లో కట్టేసిన వాహనంమీద
మరెవ్వడో ''ఊరేగి పోయినట్లు''
విలవిల లాడింది అధికారం
వెయ్యికళ్ళు మండిపోగా

'విశ్వంభర', 47.

అని చేజిక్కిన అధికారం జారిపోయే పరిస్థితికి భయపడే అధికారులకి సార్వకాలిక ప్రతీకగా కవి ప్రయోగించారు.

<u>సాంప్రదాయక కావ్యబింబ దర్శనం:</u> డా. నారాయణరెడ్డికి చిన్నతనం నుంచి హరికథాశ్రవణం, జంగం కథలు అభిమానపాత్రాలు. ఆ గాథల్లో ఉండే సంప్రదాయవిజ్ఞానం వారికి సంప్రదాయ స్పృహని అధికంగా కలిగించింది. విమర్శనా దృక్పథాని కేకాక వారి కవితావిధానానికికూడా సంప్రదాయము, ప్రయోగము వారికి మొదటినుంచే అభిమానపాత్రాలయ్యాయి. సంప్రదాయ జ్ఞానాన్ని విని యోగించుకుంటూ కవి కావ్యబింబపరికల్పనచేశారు. ''అభ్యుదయ కవి అన్వేషణ'' అనే ఖండికలో వ్యాందవ సంప్రదాయంలో యజ్ఞాన్ని కవి కృషికి సంకేతంగా ప్రయోగిస్తూ

ఆలోచనల ఆజ్యంతో
యజ్ఞం చేస్తున్నాడీకవి

'నారాయణరెడ్డి గేయాలు', 63.

అని కవి కృషికి ఆలోచనలు అవశ్యకం అని సంప్రదాయ ప్రయోగంతో తెలియ చేశారు. ''దివ్వెల మువ్వలు'' అనే ఖండికలో దివ్వెల మువ్వలతో నర్తించే జగన్మోహిని తమ మనస్సులోని తమస్సులని కడిగివేసిందని తెలియచేస్తూ

అపుడెగిసెను నా మనస్సు హవిరుద్గతధూమమట్లు
అపుడె చేపె నాదు అంతరాత్మ కామధేనువట్లు

'దివ్వెల మువ్వలు', 1.

అని మనస్సు స్వేచ్ఛగా పైకి ఎగరడాన్ని హవిస్సునుంచి పైకెగిసిన ధూమంలా

తమ అంతరాత్మని కోరికలన్నింటినీ ప్రసాదించే కామధేనువులా కవి చిత్రించారు. ఆ జగన్మోహిని మువ్వల ఘలంఘులలు వినిపిస్తే ''మృణ్మయమౌ ఈ దేహము చిన్మయ నాదాత్మకమగు''( 2 ) నని మిత్రి, చిన్మయంగా పరివర్తనం చెందగలదనే సంప్రదాయ భావాన్ని కవి వ్యక్తంచేశారు. ''దేశం ముందడుగు వేయాలి'' అనే ఖండికలో పార్టీ పేరుతో స్వప్రయోజనాలు సాధించే అనామకుల్ని

చెట్టుపేరుతో కాయలమ్మే అగస్త్యభ్రాతలు

'మార్పు నా తీర్పు', 17.

అని సంప్రదాయంగా పేరులేని పెద్దమనుషుల్ని అగస్త్యభ్రాతలని పిలవడాన్ని కవి ప్రయోగించారు. ''మనిషి-చిలక'' అనే ఖండికలో సంప్రదాయసిద్ధంగా చిలకని ఆత్మకి సంకేతంగా కవి ప్రయోగించారు.

పంచేంద్రియాల సంక్షోభంలో
పట్టు తప్పిపోయే మనిషికి
పంచవన్నెల ఆ రామచిలక
పరమాత్మకు మరో ప్రతీక

'మనిషి-చిలక', 3.

అని ఆత్మ పరమాత్మకి ప్రతిబింబం అనే భావాన్ని కవి వ్యక్తంచేశారు. మానవుని మనుగడకి చిలక పరమ ఆవశ్యకం అని, ఆ చిలక ( ఆత్మ )

పలికితే తప్ప ఆతనికి ఆత్మతృప్తిలేదని తెలియచేయడానికి

మందాకినైనా చిలకలేనిదే
వైతరణి అమాగ మనిషి

'మనిషీ-చిలక', 5.

అని ఆనందానికి సంకేతంగా వియద్గంగ మందాకినిని, కష్టాలకి సంకేతంగా వైతరణిని, నరకానికి సమీపంగా ఉన్న వైతరణి. కవి తమ సంప్రదాయ జ్ఞానంతో ప్రయోగించారు.

చారిత్రక కావ్యబింబ దర్శనం

డా.నారాయణరెడ్డికి చారిత్రక పరిజ్ఞానం పుష్కలంగా ఉంది. 'ఓక శాత్రాబ్ది'' అనే ఖండికలో 1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య సమరాన్ని విప్లవాధ్వరముగా భావిస్తూ ఝాన్సీలక్ష్మీబాయి ప్రారంభించిన విప్లవాన్ని

ఝాన్సీలో ఒక అపర చండిక
సటలు విదలిచి హుంకరించగ
జాతినెత్తిన నున్న దెయ్యము
జారిపడి బెంబేలు పడినది

'దివ్వెల మువ్వలు', 15-16.

అని చారిత్రక విషవమూర్తిని చండికగా కవి చిత్రించి చారిత్రక వ్యక్తికి పౌరాణిక స్ఫూర్తిని కలిగించారు. పరతంత్రాటవీ స్థలికి అగ్గిపెట్టే మిణుగురులే దావాగ్నిగా భావిస్తూ

ఒక మిణుంగురు ఝాన్సీ లక్ష్మి
ప్రకట రూపమ్మును ధరించెను
ఒక్క మిణుగురు వీరతాంతియ
ఉక్కు కత్తిగ అవతరించెను

'దివ్వెలమువ్వలు', 17.

అని ఝాన్సీలక్ష్మిని తాంతియాతోపే మిణుగురులవంటి వారలయినా బలవంతులైన తెల్లవారిని ఎదిరించిన దావాగ్నిగా కవి ప్రశంసించారు. ''సంస్కారధార'' అనే ఖండికలో తన రక్తనాళాల్లో ప్రవహిస్తున్న సంస్కార ధారల్ని సమన్వయ దృక్పథంతో చిత్రిస్తూ తాము ''సమీచీన మహోత్తుంగ ప్రాచీనాంధ్ర పతాకగా'' మారానని తెలియచేస్తూ, తాను ''హాలుని గాథా సప్తశతి''గా, '''నన్నయ ప్రసన్న కథాగీతి''గా, ''కవి బ్రహ్మ కావ్యరీతి''గా, రుద్రమ్మ 'కరాంచల చంచత్కృపాణ చకితద్యుతి''గా ''శ్రీనాథుని ప్రౌఢపద్య ఝంకృతి''గా, ''పోతన్న సుధా ధారా స్నాత భాగవత కృతి''గా, ''కృష్ణదేవరాయ భువన విజయ భవన రాజద్గోపురము''గా నిలిచి

అర్వాచీనాంధ్ర జగత్
సర్వతోముఖ ప్రతిభా
నిర్వచనము నేయు కవీ
న్నికర ముకురమ్మైతి

'దివ్వెల మువ్వలు', 24.

నని కవి తమ విశాల వ్యక్తిత్వాన్ని బహుముఖంగా వ్యక్తంచేశారు. 'విషవాచి' అనే ఖండికలో పరదేశాలపై దండెత్తే దురాశాపరులని

తోడిదేశము చొరబడి
దురంతాల కొడిగట్టే
బూజు బుద్ధి తగదుర, చెం
గేజు ఖాను సోదరా

'అక్షరాల గవాక్షాలు', 53.

అని స్వదేశాభిమానం, పరదేశాలని కొల్లగొట్టే దురాశగా మారిన మానవప్రకృతికి ప్రతీకగా చెంగేజుఖాన్‌ని చిత్రించారు. బంగ్లాదేశ్‌లో ఏడున్నరకోట్ల ముక్త కంఠాల స్వేచ్ఛాగానాన్ని అణగద్రొక్కే దుష్టశక్తులని

నరరక్త పిపాసులు
నాదిర్షా వారసులు
నాజీతత్త్వం నరనరాల్లో
నాటుకున్న నాటురక్కసులు

'ముఖాముఖి', 52.

అని చరిత్రలో నరరక్తపిపాసులుగా ప్రసిద్ధికెక్కిన వ్యక్తులుగా కవి చిత్రించారు. బంగ్లాదేశ్ స్వతంత్ర సమరంలో ప్రముఖమైన పాత్రవహించి అంతర్జాతీయ ఖ్యాతి వహించిన భారతదేశ సైనికశక్తిని'సమర సంక్రాంతి' అనే ఖండికలో ప్రశంసిస్తూ ''పేకముక్కలతో నిర్మించుకున్న ''పాకే'' మేడ చిట్లిపోతుంటే'' భద్రతా సమితిలో పిచ్చికుక్కలా అరిచిన దుర్మదాంధుణ్ని వర్ణిస్తూ,

భారతీయుల్ని కుక్కలనినాడు
ప్రల్లదాలు పలికిన భుట్టో
పుట్టెడు చెమట పుట్టి నేడు
మట్టిగొట్టుక పోయాడు

'ముఖాముఖి', 59.

అని భుట్టో ప్రల్లదాన్ని, పతనాన్ని కవి చిత్రించారు. ఈ యుద్ధంలో భారతీయ వైమానికులు, వీరసైనికులు ప్రదర్శించిన ప్రతాపాన్ని తమకు తెలియని రాణా ప్రతాపుణ్ని, వీరశివాజిని, ''పాండు పుత్రులు కురుక్షేత్రంలో జరిపిన ఆజిని'' జ్ఞప్తికి తెస్తున్నాయని కవి ఆనాటి యుద్ధానికి చారిత్రక శాశ్వతత్వాన్ని కలిగించారు. తలిదండ్రుల నుంచి సంక్రమించే ఛాందస భావాలని, బానిసత్వ తత్వాన్ని ''పొద్దుపొడుపు'' అనే ఖండికలో

వారసత్వంగా సంక్రమించిన సంకెళ్ళను
పిత్రార్జితంగా మిగిల్చిన పిరమిడ్లను

'మంటలూ-మానవుడు', 49.

విసర్జించి మానవజాతికి నోసటను పొద్దుపొడవాలని కవి ఆశించారు. ఈ సందర్భంలో ఈజిప్టులో చరిత్రప్రసిద్ధికెక్కిన పిరమిడ్లని పితౄర్జితమైన స్థిర అస్తిగా, చలనానికి వ్యతిరేకంగా కవి ప్రయోగించారు. భారత స్వాతంత్ర్య సమరంలో శాంతి, అహింసలు ఆయుధాలుగా జాతిని నడిపించిన గాంధీజీని

కత్తిలేదు కర్రలేదు
ఎత్తినవి జెండాల చేతులు
ఎక్కుపెట్టిన తుపాకీలవి
ఏమి చేసెను? లోకమ్ముడిచెను

'భూమిక', 61.

అని గాంధీజీ ఆత్మశక్తి ఔన్నత్యాన్ని, ఆంగ్లేయుల భౌతికశక్తి అశక్తతని కవి చిత్రించారు. నిరంకుశ శక్తులు సామాన్య ప్రజానీకాన్ని అసమర్థులుగా ఎంచి దోపిడీచేసే శక్తులని

జారుపాలనలో - ని
జాము పాలనలోన
మందలని అనుకున్న
మంది ఒకవేయి

'భూమిక', 62.

అని చిత్రిస్తూ ఈ ప్రజానీకాన్ని మట్టిమనుషులనుకుంటే వీరు చెకుముకి రవ్వల్లా విక్రమిస్తారని ప్రకటించారు. వీరు సంఘటిత శక్తులైతే పిడికిళ్ళు లేస్తాయని, సుత్తెలు బావుటాలెత్తుతాయని కవి తమ చారిత్రిక విప్లవ దృష్టిని ప్రకటించారు. పరాధరాక్రమణ ధ్యేయంగా కళింగరాజ్యాన్ని ఆక్రమించి విజయలక్ష్మిని కైవశం చేసుకున్న క్షణంలో శాంతి ఔన్నత్యాన్ని గుర్తించిన అశోకుని హృదయ పరివర్తనని

శోకశుక్తులలోన
మూకీకృతములైన
కన్నీటి ముత్యాలు స్వీకరించి

'భూమిక', 76.

నట్లు కవి చిత్రించి అశోకుని అశోకాత్మకతని ఆవిష్కరించారు. రాగరజ్జువులు ఛేదించుకుని రక్తబంధాలు తప్పించుకుని, సృష్టిరహస్యశోధనలో జీవితలక్ష్య సాధనలో మహాభి నిష్క్రమణం చేసిన బుద్ధుని జ్ఞానోదయాన్ని

తరుమూలంలో ఉన్న మనస్సే
తన శిరస్సు చుట్టూ వెలిగించి
జీవిని కమ్ముకున్న మంచుపొగ
ఆ వెలుగులో కరిగింది

'విశ్వంభర', 46.

అని ప్రకృతికి పురుషునికి మధ్య ఉన్న తాత్త్విక అనుబంధాన్ని కవి ప్రతిభావంతంగా చిత్రించారు. ఆశకి ప్రతీకగా ధరాగోళం తనచూపుడు వేలు నీడలో ఒదగాలని ఆశించిన అలెగ్జాండరుని చిత్రిస్తూ,

ఆక్రమణదాహం 'కరళ్ళెత్తి' ఎగా
యవనాశ్వాల వికట హేషల్లో
అవినిపోతున్న అష్టదిక్కుల

'విశ్వంభర', 47.

లని ఊహించారు. ఈ మారణప్రవృత్తిని ''పొగరు కత్తుల పాశవిక క్రీడ'' గా కవి వర్ణించారు. ఈ పాశవిక శక్తి అనంతంకాదని, రాజ్యదాహం తీర కుండానే వెనక్కితిరిగిన అలెగ్జాండరు దారిలోనే మరణించాడు అనే చారిత్రక సత్యాన్ని

పతాక తెగిపోయి
పట్టి కర్ర మిగిలిందని.....
విచ్చుకున్న ఆ పిడికిట్లో
ఆవులించింది దైన్యం
అహంకృతికి సమాధికట్టిన శూన్యం

'విశ్వంభర', 49.

అని మానవ అహంకృతి పరిమితులని కవి ప్రదర్శించారు. కోట్ల చెమటబొట్ల మూలాన్ని గ్రహించిన మార్క్సు అనే మనిషి శిరంలో ఇగురులెత్తిన సామ్యవాదాన్ని

క్రాంతినాదంగా భావిస్తూ

> అది ఉగ్రచేతన తెప్పించిన
> ఉదగ్ర భూకంపం
> కాలశిఖరం దూకించిన
> జ్వాలా జలపాతం
>
> 'విశ్వంభర', 88.

అని చిత్రించారు.

తాత్త్విక దర్శనం

డా. నారాయణరెడ్డి తాత్త్విక దృక్పథాన్ని, అవగాహనని కవిత్వంలో ఆవిష్కరించడానికి ప్రయత్నించారు. ఆరంభదశలో ఈ ప్రయత్నం కొంత స్థూలమైనా వీరు కవిత్వతత్వాన్ని అవగాహన చేసుకుని తాత్త్విక పరిణామాన్ని పొందినతరువాత కవిత్వం కేవలం రసనిష్పత్తికి, సాంఘిక రాజకీయ ప్రయోజనాలకి మాత్రమే పరిమితమైన ప్రక్రియగాకాక మానవ వ్యవస్థని కూలంకషంగా పరిశీలించి, తాత్త్వికచింతన చేయడానికి ఉపకరించే సాధనంగా వీరు భావించసాగారు. 1970లో ప్రచురించబడిన 'మంటలూ-మానవుడూ' తరువాత ఈ తాత్త్వికదృష్టి కొంత బలపడి 1977లో పద్మశ్రీ బిరుదు లభించిన తరువాత వీరిలో ప్రముఖపరిణామంగా రూపుదిద్దుకుంది. 'సాహిత్యం

మౌలికంగా జీవిత వివేచన[9] అని మాథ్యూ ఆర్నాల్డ్ చేసిన నిర్వచనానికి డా॰నారాయణరెడ్డిగారి ఇటీవలి కవిత్వం మంచి ఉదాహరణ॰

మానవుడు ప్రకృతిశక్తులమీద విజయం సాధించి మనిషిగా రూపుదిద్దుకుని పురోగమించే శుభక్షణాలు ''మానవతా'' అనే ఖండికలో

మనిషి మనిషిని మనస్సు మనస్సును
పరస్పరంగా పరిశీలించు కున్ననాడే
అణుజాలం నుండి అమృతం పిండి న్నాడే

'జలపాతం'॰

ఎదురౌవుతాయని కవి తెలియచేశారు॰ ఇదే ఖండికలో తమ యుద్ధవిముఖతని, శాంతి ప్రియత్వాన్ని వెల్లడిస్తూ తను వయసుకి మించిన తాత్త్విక దృష్టిని వెల్లడిస్తూ

వల్లకాడు స్మృతికి రాగానే
తుళ్ళి పడుతావెందుకు?
సమతాపాఠం నేర్చుకోవాలంటే
శ్మశానమే సహజకావ్యంసుమా!

'జలపాతం'॰

అని శ్మశాన సామ్యవాదాన్ని ప్రకటించారు॰

9. Matthew Arnold, 'Literature at bottom is a criticism of life', "The Function of criticism".

''ఆలోడనం'' అనే ఖండికలో ఊహాలోకంలో భావకవి లా అప్సరసలని దర్శించడమే కాక పరబ్రహ్మపదాన్నికూడ అందుకుంటా నని ఆశిస్తూ

ప్రళయ వీణలోన సృష్టి
రహస్య రాగాలు వినెడు
తాత్త్వికుని తిరస్కరించి
తాదాత్మ్యము నొందితి

'నారాయణరెడ్డి గేయాలు', 39.

నని ప్రళయకాల భయదగానంతో తాదాత్మ్యాన్ని పొందగలిగే అద్వైతస్థితి తాను చేరుకున్నట్టుగా కవి తెలియచేశారు. పంచేంద్రియాలతో మానవుడుచేసే భౌతిక పరిశీలనకంటె ఆధ్యాత్మికానుభూతి ఉన్నతమయిందనే తాత్త్విక అవగాహన కవి తమ యౌవనదశలోనే వెలునగించారు. ''శూన్య వరణం'' అనే ఖండికలో తాము''నిఖిల జగత్కుడ్యాలు దూకి నిశ్శబ్దశూన్యాబ్ధిలోకి'' వెళ్ళకపోయినా, తాము శూన్యాన్ని అనుభవిస్తున్నామని తెలియచేశారు. ఈ శూన్యం ఎక్కడుంది? అని ప్రశ్నించి మనస్సులో కాపురముంది అని జవాబిచ్చారు. అందుకే

చుట్టూ ప్రపంచం వున్నా
శూన్యంలో నిలుచున్నాను

'నారాయణరెడ్డి గేయాలు', 71.

అని మానసికశాస్త్రవేత్తలు తెలియచేసే lonely crowd అనే భావాన్ని కవి స్ఫురింపచేశారు. ''కడలేని కడలి'' అనే ఖండికలో ''విశ్వమానవుల నిర్వేదవేదధ్వనుల'' వినిపించే రత్నాకరాన్ని

శివమెత్తి కొనుచు వ
చ్చెడు వేదనార్మికల
నొక మహాయోగి పో
లిక నిగ్రహము సేయు

'దివ్వెల మువ్వలు', 60.

మహనీయశక్తిగా భావించి ఆ శక్తిముందు తాము''ప్రభాతవేళ దివ్వియలేల'' వెలవెలపోతాయని అనంతప్రకృతి శక్తికి పరిమిత మానవశక్తికి ఉన్న తారతమ్యాన్ని కవి వెల్లడించారు. మానవుని మనసు కల్మషరహితంగా ఉన్నపుడు ప్రకృతి ఆనందధామంగాను, మనసు కల్మషపూరితమైతే చీకటినిల యంగాను కనిపిస్తుందని తెలియచేస్తూ,

ఎదను ద్వేషము తెరచాప లెత్తినపుడు
నెదుట చీకటి దప్పి కల్పించ దొండు
ఎదను స్నేహము సురభియై కదలినపుడు
ఎదుట వెన్నెల మొలకలే యెదుగు చుండు

'దివ్వెల మువ్వలు', 69.

అని ప్రకృతి పురుషుల పరస్పర సంబంధాన్ని కవి చిత్రించారు. ''మానవుడు'' అనే ఖండికలో విశ్వంభర లో విచిత్రమైన మానవసృష్టిని, పరిణామ క్రమంలో అతని పాత్రని తాత్త్వికదృష్టితో చిత్రించిన రచనలలో ఒకటి. ఈ పరిణామాన్ని పరిశీలిస్తూ, డా. నారాయణరెడ్డి మానవుని అసంపూర్ణత నిజానికి ''అభ్యుదయ సేతువు'' అని విశ్వసించారు.

మానవతా మానస కాసారంలో
అసంపూర్ణత ఔనేమో రాజహంస,

'మంటలూ మానవుడూ', 21.

అని అసంతృప్తి, అసంపూర్ణత మానవపురోగమనానికి ఆవశ్యకాలని కవి స్పష్టంచేశారు. ''రెండు కొనలు'' అనే ఖండికలో భౌతిక వైరుధ్యాలవెనక ఉన్న తాత్త్విక సమన్వయాన్ని దర్శిస్తూ,

బిందువు సింధువని
మృత్ఖండం రత్నభాండం అని
ప్రతి అలిచిప్ప శుక్తికి
పాఠాంతరమని

'మంటలూ మానవుడూ', 31.

కవి చిత్రించారు. ''ఈ ప్రశ్నలు ఎవరికి?'' అనే ఖండికలో కూడా వైరుధ్యాల సమన్వయాన్ని దర్శిస్తూ ''పగలంటే జాగృతి, రేయంటే విస్మృతి'' అనే

సామాన్య దుఃఖాన్ని పునః పరిశీలనచేస్తే కవికి

పగలు
అజ్ఞానశాఖ చిగురు.....
నిశి
ప్రజ్ఞాన గగనశశి

'మరోహరివిల్లు', 36.

గా కనిపించాయి. తమస్సు ఉషస్సుకి, ఉషస్సు తమస్సుకి పరస్పరం కారణ భూతాలు. అలాగే జ్ఞానానికి అజ్ఞానం, అజ్ఞానానికి జ్ఞానం పరస్పరం దోహదకారులు అనే తాత్త్విక సత్యాన్ని కవి ఈ సందర్భంలో వెల్లడించారు. నిరంతరం పురోగమనం సాధించాలని ప్రయత్నించే మానవుడు తన మనస్సు పరిపక్వం కాకపోవడంవలన శోకముడుస్తున్నాడని ''అయ్యో మనిషి'' అనే ఖండికలో తెలియచేస్తూ,

మనిషి ఆలోచిస్తున్నాడు
దనుజత్వానికి ఎంతదగ్గరగా వున్నాడో
గుణింతంవేసి చూస్తున్నాడు
రేపటి పాటకు స్వరం కట్టబోయి
నిన్నటి బాణి అలపిస్తున్నాడు

'మంటలూ-మానవుడు', 58.

అని మానవ పరిణామగాథలో అపశృతులనికూడా కవి వినిపించారు. ''నువ్వు నువ్వేనా'' అనే ఖండికలో మానవుడు తన నిజస్వరూపదర్శనం చేసుకోవడం కష్టమైనా ఆవశ్యకం అని భావించి

ఇంతకూ నువ్వు నువ్వుకావు -
మానును పుష్పించలేని విత్తనానివి
మౌన గర్భాన్ని చీల్చలేని గీతానివి
దుఃఖాన్ని దిగమింగుకోలేని సుఖానివి
ఆవేశాన్ని సమర్పించుకోలేని ఆవేశానివి

'మంటలూ-మానవుడు', 66.

అని మనిషిలో వైరుధ్యాల సహజీవనాన్ని, అవి సమన్వయం కావలసిన ఆవశ్యకతని కవి సూచించారు. ''జీవితానికి, మృత్యువుకి మధ్య ఉన్నసేతువు ఈనాటికి రేపటికే మధ్యఉన్న సేతువు' కవికి ''ఏమిటి చీకటి'' అనే ఖండికలో

పాయదీసిన కురుల మధ్య
పాపట కనిపించినట్లే
విరగబూసిన ఇరులమధ్య
వేకువ వికసిస్తుంది

'ముఖాముఖి', 25.

అన్నట్టు కనిపించింది. చీకటి కవికి అంతాతెలిసినవాని అవివేకంగా కనిపించడం వీరి పరిణత తాత్త్విక అవగాహనకి నిదర్శనం. మానవ వికాసానికి ఆవశ్యకమైన

స్వేచ్ఛని ''రేఖా మాత్రంగా'' అనే ఖండికలో సూచిస్తూ,

ఎక్కడుంది స్వేచ్ఛ?
విత్తనాన్ని చీల్చినమొక్కలో
ఎక్కడుంది స్వేచ్ఛ?
వినోయసంలో పొడిచిన చుక్కలో

'ముఖాముఖి', 29.

అని పరిమితులని అధిగమించిన ప్రకృతి శక్తిని, స్వచ్ఛందంగా స్వయంప్రకా శంగా తళతళలాడే చుక్కలని స్వేచ్ఛకి ప్రతీకలుగా కవి ప్రయోగించారు. ''మనిషీ-చిలక'' అనే ఖండికలో చిలకని పరమాత్మకి మరో ప్రతీక అయిన ఆత్మగా చిత్రిస్తూ,

అతని ఉక్తి చిలక
అతని శక్తి చిలక
అతని ఊహా చిలక
అతని ఊపిరి చిలక

'మనిషీ-చిలక', 4.

అని చిలకని మనిషి సమగ్ర వ్యక్తిత్వానికి ప్రతీకగా భావించారు. ఈ చిలక మానవుని "Alter ego" గా కవి చిత్రించి మనిషి ఆశలవలయాల్లో చిక్కుకుని హరివిల్లు, మెరుపులకి ఆకర్షితుడు అయ్యే సమయంలో

పంచేంద్రియాలు అప్పుడప్పుడు
ప్రకంపించి పోతున్నా
ఆత్మమాత్రం దేహస్తంభంలా
అచంచలంగా నిలుస్తుంది

'మనిషీ-చిలక', 15.

అని చిలక అందించిన జ్ఞానాన్ని అభినవ శుకవాణిగా కవి చిత్రించారు. ''కో అన్నది కొత్త తరం'' అనే ఖండికలో ఈతరం మనిషిని, వర్తమాన భవిష్యత్కాలాల సమన్వయాన్ని సాధించగలిగే వ్యక్తిగా భావిస్తూ

నేటి బిందువుమీద నిలిచి
రేపటి సింధువుని కొలిచి
విశ్వమంత విశాలంగా పరచుకొని
వినూత్న వివేక నేత్రం తెరుచుకొని
గ్రహాలను గుప్పిట్లో పట్టుకునే
ముహూర్తం కోసం ఎదురుచూస్తున్నాడు

'మనిషీ-చిలక', 27-28.

అని భవిష్యద్వేదిగా కాలాతీతవ్యక్తిగా కవి చిత్రించారు. ''పొగలో నుంచి'' అనే ఖండికలో నేటి సగటు మానవుడు మనిషిని పీల్చేసే మధుపాలని, ఆటి మానవుణ్ని తొక్కేసే మత్తేభాలని సహించడని తెలియచేస్తూ

ఈ యుగం సాధించిన గుణం
మనుషుల్లా నివసించే దేవుళ్ళు
ఈ తరం సంపాదించిన వరం
దేవుళ్ళను ధిక్కరించే మనుషులు

'ఉదయం నా హృదయం', 20.

అని మనిషికి దేవునికి మధ్య ఉన్న సంబంధాన్ని కవి చిత్రించారు. ''ఎక్కడో ఎప్పుడో'' అనే ఖండికలో సుఖదుఃఖాల అనుభవాలని అధిగమిస్తూ తమ అనుభవాల జ్ఞాపకాలని బడబాగ్నిలా దావాగ్నిలాగా భావిస్తూ ఎప్పుడో నవ్వుతాడని కవి తెలియజేశారు. చావు పుట్టుకలు మానవునికి సమానం అనే తాత్త్విక అవగాహనని వెల్లడిస్తూ

ఉభయసంధ్యలు పుక్కిలించే రక్తమొకటే
జీవించే ఆ చావు
మరణించే ఈ బ్రతుకు
ఒకటే ఒకటే ఒకటే

'ఉదయం నా హృదయం', 35.

అని జీవన్మరణాల చక్రభ్రమణాన్ని కవి దర్శింపజేశారు. మానవుని మరణం భౌతికమైన అంతం అయినా ఆ మరణమే మరింత అర్థవంతమైన ఉన్నతమైన జీవితానికి నాంది ప్రవచనం అనే అవగాహన ఇందులో కనిపిస్తుంది. ''వారసుణ్ణి''

అనే ఖండికలో ప్రకృతిలోని వివిధ అంశాలని వికృతి రూపాలుగా భావిస్తూ, నక్షత్రాలు గడ్డకట్టిన కన్నీటిచుక్కలు, ఆకాశం పరచుకున్న నీలి నిశ్వాసం, వెలుగు దినదినం చచ్చిపుట్టే శిశువు, ఋతువులు 'కాలం దుప్పటికి వేసిన ఆరు అతుకులు' అని అతినూతనంగా తన వాస్తవిక దర్శనశక్తిని వెల్లడిస్తూ, కవి చిత్రించారు. కవికి ఋషికి యుగాదిగా ఉన్న అభేదాన్ని వేర్కొంటూ డా. నారాయణరెడ్డి ''తేజస్సు నా తపస్సు'' అనే సంకలనం ఉపోద్ఘాతంలో 'కవిగా నాదీ ఒక తపస్సే, కానీ దాని ఆకృతి వేరు, ఆత్మవేరు'[10] అని తమ కవిత్వ ఆదర్శాన్ని వివరించారు. ఈ సంకలనంలోని శీర్షికాగీతం లో 'వర్తమానంలో జీవిస్తూ, సమకాలీన సమస్యలని అనుభవిస్తూ, తాము కావ్యాగ్నులు అల్లుతున్నామని తెలియచేశారు. తాము చేస్తున్నది అనుభూతులని ఆవిష్కరించే అక్షర తపస్సు అని వెల్లడిస్తూ,

ఈ తపస్సు నిష్పరిధి
ఈ తపస్సు నిరుపాధి
ప్రగతికి - జడజంగమ
ప్రకృతికి - ఇది అది

'తేజస్సు నా తపస్సు', 5.

---

10. డా. నారాయణరెడ్డి, 'నమస్తే', ''తేజస్సు నా తపస్సు''.

అని తమ కవిత్వ ఉన్నత ఆదర్శాన్ని కవి వివరించారు. ప్రకృతి వైపరీత్యాన్ని తనుకి అనుకూలంగా మార్చుకునే ప్రయత్నమే తమ జ్వాలాతపస్సు అని స్పష్టం చేస్తూ,

ఎండను సిరిదండగా మార్చుకొని
వెన్నెలను వజ్రం వెన్నుగా తీర్చుకొని
చలిని నులిమంటగా కూర్చుకొని
శిశిరాన్ని రేపటి వసంతానికి
జేగంటగా సమకూర్చుకొని

'తేజస్సు నా తపస్సు', 6.

ప్రకృతిమీద విజయాన్ని సాధించే ప్రయత్నాన్ని కవి వివరించారు. తను ''వేలాతీత కవితావేలా హావిస్సు'' లక్ష్యం ''కర్మదీవిలో నవ విప్లవ క్షేమలక్ష్యం'' అని సంప్రదాయ పరిజ్ఞానానికి తమ నవ విప్లవతాత్త్విక దృక్పథాన్ని జతచేసి, ఆధునిక ఆంధ్రకవిత్వంలో గణనీయమైన ప్రయోగాన్ని కవి చేశారు. ''ఎంత? ఎంతెంత?'' అనే ఖండికలో తమ వర్తమానపు వ్యక్తిత్వాన్ని అనాదికాలంతో ముడివేడుతూ తాము భవిష్యద్వాదిగా కూడా నిలబడుతూ

నావయసు
వేదమంత
నా మనసు
వెన్నెలంత.....
ఇంతకూ నేనెంత?.....
మాపులో విరిసే రేపంత
రూపులో వెలిగే చూపంత

'తేజస్సు నా తపస్సు', 35.

అని కాలత్రయాన్ని సంధానించే భావసేతువుగా తమని తాము వర్ణించుకున్నారు. ''ఇంటిపేరు చైతన్యం'' అనే ఖండికలో స్పందించిన గాలిని జడత్వానికి సంకేతంగా ప్రయోగిస్తూ,

వెలికి చూస్తే - గాలి
పద్మాసనం వేసి కూచుంది
పరమ యోగినిలా

'ఇంటిపేరు చైతన్యం', [illegible]

అని చిత్రించి చైతన్యమే తమ వ్యక్తిత్వం అని వెల్లడించారు. తమ వైయక్తిక స్వరూపం విశ్వరూపంగా విజృంభించే చైతన్యస్ఫూర్తిమంతమని తెలియచేసి

కదిలింది నా చేయి
కదిలిపోతున్నాయి సూర్యేందు చక్రాలు
వేశాను అడుగు, ఉ
ద్వేగించి ఉరుకు తున్నాయి గ్రహ చరణాలు

'ఇంటిపేరు చైతన్యం', 8.

అని చిత్రించుకున్నారు. చీకటికడుపులో ఉన్న కాంతిని, వెలుతురుని కప్పే భ్రాంతిని కవి తమ తాత్త్విక పరిశీలనలో గ్రహించి

చీకటంటే మృత్యు
వా? కాదు, నిదురపోయేకాంతి;
వెలుతురంటే సత్య
మా? కాదు, కనులువిప్పే భ్రాంతి

'ఇంటిపేరు చైతన్యం', 8.

అని చిత్రించుకున్నారు. తమ విశ్వరూపాన్ని ''నాకందాలు''లో

వేకువ ఉచ్ఛ్వాసంగా
చీకటి నిశ్వాసంగా
ఈ కాళ్ళే రెక్కలుగా ఎగిరినడుస్తాను
నా కళ్ళే చుక్కలుగా నవ్వుతు చూస్తా

'ఇంటిపేరు చైతన్యం', '12.

అని చిత్రించుకున్నారు. ''భూమిక'' అనే కావ్యంలో జగత్తుకి ఆది ఉందా? అని సదసత్సంశయాన్ని వెల్లడించి ప్రాథమిక శిశునాగరకతనుంచి విడివడిన వైదిక నాదశక్తిని

జానపదమది, జ్ఞానపథమది
పరమమైన రసాత్మతరువున
పండి రాలిన భవ్యఫలమది

'భూమిక', 5.

అని వర్ణిస్తూ ఆ వేదకవిత ప్రకృతి పలికిన మాతృభాష అని వర్ణించారు. మానవజీవితంలో శాంతిసహనాల ప్రాముఖ్యాన్ని వివరిస్తూ

శాంతమే ఒక బీజమైతే
సహనమే సంజీవ రూపం
శాంతమే ఒకమూలమైతే
సహనమే ఒక వృక్ష స్వరూపం

'భూమిక', 58-59.

అని కవి శాంతికి సహనానికి అత్యున్నతస్థానాన్ని ఇచ్చారు. నీరు, నేల కలని, ధరాగోళంగా అవతరించిన సృష్టివైచిత్ర్యాన్ని సమదర్శనానికి, సహజీవనానికి నిదర్శనాలుగా భావించి

ఉంది బీజం, లేదు క్షేత్రమా మిందిలో
ఉంది క్షేత్రం, లేదు బీజమే మందిలో
ఈ రెంటి కలయికే ఉభయ తారకం
అది త్రికాలాత్మక సృజన మూలకం

'భూమిక', 71.

అని సృష్టిరహస్యాన్ని కవి తాత్త్విక దృష్టితో గ్రహించి ప్రతిభావంతంగా చిత్రించారు. ''మననం'' అనే కావ్యఖండంలో తాత్త్విక సూత్రాలలో వైరుధ్యాలలో ఉన్న సమన్వయాన్ని ఆవిష్కరిస్తూ

మృత్యువేదన్న అన్వేషణం నీకుంటే
ప్రతిరోజు నీడలా పక్కనున్నది చూడు
దైవమేదన్న 'సోదా' గుణం నీకుంటే
నాస్తికుని వాక్కులో నక్కివున్నది చూడు

'మథనం', 6.

అని జీవితంలో మృత్యువుని, నాస్తికునిలోనీ ఆస్తికత్వాన్ని కవి వెల్లడించారు. అణగిమణగిఉన్న ప్రకృతి అంశాలలోకూడా ప్రతిభ ఉంటుందని తెలియచేస్తూ

ఒత్తిగిల్లి పడివున్న విత్తులో ఒక వటవృక్షం పుడుతుంది

'మథనం', 14.

అని చిత్రించారు. మానవ జీవితంలో చావుపుట్టుకలని తాత్వికంగా భావించి

అయిదు చిలకలు మూగంటేనే
ఆ గూడేసుషుప్తి
అనంతాణువులు మోగిపోతేనే
ఆ హృద్దే నిత్యదీప్తి

'మథనం', 25.

అని చిత్రించారు. ''మృత్యువునుంచి'' అనే కావ్యఖండంలో ఋతుచక్రభ్రమణం జరిగే మార్పులని ''వర్షం తిరగానే సమాధులు గరికపోచల్తో నిక్కబొడుస్తాయి' అని తెలియచేసి

సుషోటిదిగా తెచ్చిపెట్టుకుంది
మిట్టపల్లాలను ప్రకృతి
జన్మ మొదలుగా కూడ గట్టుకున్నాడు
జయాపజయాలను మనిషి

'మృత్యువునుంచి', 12.

అని ప్రకృతిలో ఋతువుల తారతమ్యాన్ని మానవుని జయాపజయాలుగా చిత్రించారు

ప్రకృతిలో విరుద్ధాల సమన్వయాన్ని చిత్రిస్తూ

నక్కివుంది నాన్నిలోనే అన్ని
''కంగారూ'' కడుపులోని శిశువులా
దాగివుంది మృతిలోనే ప్రసూతి
కర్రను కాల్చిపుట్టే చిచ్చులా

'మృత్యువునుంచి', 19.

అని తమ తాత్త్విక అవగాహనని తెలియచేశారు. విశ్వమానవేతిహాసాన్ని, అనంతంగా సాగుతున్న మానవవికాసాన్ని, కళాత్మక, వైజ్ఞానిక, ఆధ్యాత్మిక ప్రస్థానత్రయంగా ''విశ్వంభర'' సమగ్రకావ్యంలో డా.నారాయణరెడ్డి చిత్రించారు. ఈ కావ్యంలో మానవుడు నాయకుడుగా, విశాల విశ్వంభర రంగస్థలంగా, ప్రకృతి నేపథ్యంగా ప్రయోగించి మానవుని తాత్త్విక వికాసాన్నికూడా కవి ఆవిష్కరించారు. ఈ మానవుడు కవికి వివిధ దేశాలలో, వివిధకాలాలలో ఆదిమదశనుంచి, ఆధునిక దశవరకు అలెగ్జాండరుగా, క్రీస్తుగా, అశోకునిగా, సోక్రటీసుగా, బుద్ధునిగా, లింకన్‌గా, లెనిన్‌గా, మార్క్సుగా, గాంధీగా కవికి కనిపించాడు.

మానవసృష్టికి ముందే ఉన్న ప్రకృతి స్వరూపాన్ని ''నెత్తిమీద నీలితెర, కాళ్ళకింద ధూళిపొర'' గా చిత్రించారు. ప్రకృతిలోని వివిధ అవస్థలమధ్య సమన్వయాన్ని దర్శిస్తూ

ముసుగుటాకుల్లో దాగిన చెట్ల
ముఖాలను మాడ్చే మండు టెండ,
మాడిన చెట్ల చెక్కిళ్ళను తడిమి
మళ్ళీ మెరుగుపెట్టే పిండి వెన్నెల - ఒకటేనేమో!

'విశ్వంభర', ౩.

అని ఎండ, వెన్నెల ప్రకృతి రెండు పార్శ్వాలని, అవి పరస్పర సమన్వయాన్ని కలిగి ఉంటాయని కవి సూచించారు. ఏడమ్ ఈవ్‌లు ఈడెన్ తోటలో ఆది మిథునంగా విరిసిన పరాగాల నగల్లా విహరించే సమయంలో నిషిద్ధఫలం వారి ''నాలుక చిలుకకు పదను గిరిగీసిన 'పండుమీద వాలాలని'' కోర్కె కలిగించింది. ఆ శాసనధిక్కారం కవికి అహంకృతిగాకాక ఆత్మవిశ్వాసంగా కనిపించింది. శాసన ధిక్కారానికి ఫలితంగా''భూమిమనిషీ మట్టిలోకి వెళ్ళిపో'' అని దైవం ఆదేశిస్తే

''అలాగే, వెళ్ళిపోంగిస్తాను ఆ మట్టిని నింగిన్నెకి''
''అందాకా వచ్చిందా నీ అహంకృతి?''
అక్కడే మొదలవుతుంది మానవ సంస్కృతి

'విశ్వంభర', ౯.

అని ఈ స్వాతంత్ర్యప్రియత్వమే మానవ సంస్కృతి వికసనానికి నాందిగా కవి చిత్రించారు. మానవుని మానసిక వికాసాన్ని ఉన్మత్త నాద జలపాతంగా

భావించి ఈ మానవ వికాస స్వరసంగమంలో షడ్జం, ఋషభం, గాంధారం, మధ్యమం, పంచమం, ధైవతం, నిషాదం అనే సప్తస్వర సమ్మేళనాన్ని మానవునికి ప్రకృతికి మధ్య అవిభాజ్యసంబంధంగా భావించి

ప్రకృతిలోని మూలనాదమే
వెకలి వచ్చిందా తనలోకి?
తనలోని జీవనాదమే
తరలిపోయిందా ప్రకృతిలోకి?

'విశ్వంభర', 21-22.

అని ప్రశ్నించారు. రూపరహితమైన మనసు బహురూపంగా విశ్వంభరలో రూపుదాలుస్తుంది అని నాదంగా, పదంగా, రేఖలుగా, మూర్తులుగా మనసు రూపాలని కవి దర్శించారు. మనసు అనుభవక్షేత్రం అని భావిస్తూ

మనసాకందని
పిడుగుల అడుగులు పడుతుంటాయి
మెరుపుల చురకలు అంటుతుంటాయి

'విశ్వంభర', 34.

అని మనసు పొందే అనుభవాల ముద్రలని కవి ప్రదర్శించారు. మనసొక నక్షమూలం అని, ఒకమహాసాగరం అని మనసు విశ్వరూపాన్ని ప్రదర్శిస్తూ

విత్తుగా ఉంటానే
వృక్షమై కూచుంటుందది
అంతరిక్షంగా ఉంటానే
అణువులా కుదించుకుంటుందది

'విశ్వంభర', 37-38.

అని మనసు Microcosm కి Macrocosm కి సంకేతంగా కవి భావించారు. విశ్వవిజేతల చరిత్రలు ప్రకటించే తాత్విక సత్యాన్ని వివరిస్తూ మానవప్రగతికి అహంకార వ్యామోహం, ఆక్రమణదాహంకాదు, ప్రేమ నిండిన హృదయం ఆవశ్యకం అని భావించి

వేయి తోటలను నరికిన చేయి
పూయిస్తుందా ఒక్క పువ్వును?

'విశ్వంభర', 48.

అని సూటిగా ప్రశ్నించారు. ఆ ప్రశ్నకి తామే

కుత్తుకలను నరికితే కాదు
గుండెలను కలిపితే గెలుపు

'విశ్వంభర', 52.

అని జవాబిచ్చారు. సోక్రటీసు వ్యక్తిత్వంలో అమృతత్వాన్ని వివరిస్తూ, జిజ్ఞాసని విశక్తి ఆపలేదని, ఆలోచనల పొద్దుపొడుపుని ఆపలేవు ఏ చీకట్లు అని స్పష్టం చేశారు. ఆత్మనిత్యం అని, శరీరం అనిత్యం అనే సోక్రటీసు విశ్వాసాన్ని తెలియచేస్తూ

తనువేమైనా ఆత్మ నశించదు
కనుమూసినా కాంతి నశించదు
మరణంలేని ప్రశ్నకు
పరిధిలేదు జ్ఞానతృష్ణకు

'విశ్వంభర', 56.

అని స్పష్టంచేశారు. మృత్యువు తరువాత ఏమవుతుంది? అనే ప్రశ్నగా మిగిలిన ప్రశ్నని వేసి

మృతికి పరిష్కృతి శూన్యమా?
శూన్యానికి ఆవిష్కృతి జననమా?

'విశ్వంభర', 63.

అని చావుపుట్టుకల పరస్పర సంబంధాన్ని కవి వెల్లడించారు. మనసుని పసిడి పంజరంలో చిలకగా భావించి

పంజరంలోని వాసనలు
పక్షి కెందుకంటవు?
ఆకృతిలోని వికారాలు
ఆత్మకెందుకంటవు?

'విశ్వంభర', 63-64.

అని పరమ తాత్వికునిగా ఆత్మస్వరూపాన్ని గూర్చి కవి మౌలికప్రశ్న వేశారు. ఈ ఆత్మ ఏ కత్తితో చేల్చలేనిది, ఏ నిప్పుతో కాల్చలేనిది అనే భగవద్గీతా సత్యాన్ని వివరించారు. మానవుడు తన పరిమితులను అధిగమించి విశ్వమూర్తిగా వెలుగుతాడని తెలియచేస్తూ

తనపాదం కరుచుకున్నది మట్టిని
తనమూర్ధం కుమ్ముతున్నది నిందిని

'విశ్వంభర', 70.

అని చిత్రించారు. మానవాతీతశక్తులు ఉన్నాయా? లేవా? అనే విషయంలో డా. నారాయణరెడ్డి కొంత సందిగ్ధ దృక్పథాన్ని వెలిబుచ్చుతూ సృష్టికందని దృష్టి, వాక్కుకందని అర్థం ఉందేమో అని సంశయించి

ఉన్నట్టే ఉంది -
ఊగింది శిరస్సు పరవశించి
ఉన్నట్టే ఉంది -
మోగింది శరీరం పరిష్వంగించి

'విశ్వంభర', 76.

అని తమ తాత్త్విక చింతనలో సందేహాన్ని వ్యక్తం చేశారు.

## ప్రతీకాత్మక గీతాలు

తమ విశ్వాసాలని దృక్పథాలని సమగ్రంగా వెలువరించడానికి కవి తను కవితా సంపుటాలలో ప్రతీకాత్మకగీతాలని కొన్ని ప్రచురించారు. వీటిలో కొన్ని ముఖ్యమైన గీతాలని పరిశీలించడానికి ప్రయత్నిస్తున్నాను. ప్రారంభదశలో ప్రచురితమైన ''దివ్వెల మువ్వలు'' అనే సంకలనంలో 'ఊర్మిళ' అనే ఖండిక సీతకంటె అధికమైన త్యాగంచేసిన ఊర్మిళని ''మనస్సునాశిని'' గా చిత్రించిన ప్రతీకాత్మకగీతం. ఆమెని 'ప్రాకృతులకొక దేవతాకృతిగ వెలసితివి'' (దివ్వెల మువ్వలు - 5) అని ఆమెని ప్రకృతి సహజ స్వరూపిణిగా, ఆత్మ సంభాషిణిగా కవి చిత్రించారు. ఓర్పుకి ప్రతిరూపంగా, సమ్యక్ ప్రతీకగా కవి ఊర్మిళని నిలబెట్టారు. ''ముఖాముఖి'' అనే సంకలనంలో మానవుని స్వేచ్ఛాప్రీతిని అరికట్ట ప్రయత్నించే దైవశాసనాన్ని కలకలలాడే పండుగా చిత్రించి, ''స్వేచ్ఛాఫలం'' మానవుడు స్వేచ్ఛకి చుట్టిన శ్రీకారంగా, ప్రతీకాత్మకంగా కవి ప్రదర్శించారు.

''ఆ పండు తినొద్దు జాగ్రత్త''
అంక్ష - దేవునిది.
''ఆ పండే కావాలినాకు''
కాంక్ష - మానవునిది

'ముఖాముఖి', 15.

ఆంక్షని జయించిన మానవకాంక్ష మానవ ప్రగతికి ప్రతీక. అందుకే ''సంకెళ్ళను తెంచుకున్న వాడి మానవుడు - సర్వదా ఆరాధ్యుడు'' (17 ) అని స్పష్టం చేశారు. ఇదే భావాన్ని ''విశ్వంభర''లో కూడా వెల్లడిస్తూ ''అందాకా వచ్చిందా నే అహంకృతి?'' అక్కడే మొదలవుతుంది మానవసంస్కృతి ( విశ్వంభర, 9) అని పునరావృతంచేశారు. ''మంటలూ-మానవుడూ'' అనే సంకలనంలో కాంగ్రెసు రెండుగా చీలిన ఉదంతాన్ని ''జోడెద్దుల కుమ్ములాట'' అనే ప్రతీకాత్మక గీతంలో రెండెద్దుల కుమ్ములాటవలన కాడివిరిగి బండి ఒరిగి, బండిలోని ధాన్యం బస్తాలు బజారులో పడ్డట్టుగా కవి వర్ణించారు. రాజకీయ నాయకుణ్ణి ఆసామిగా చిత్రిస్తూ, స్వార్థ చింతనతో మొండికేసిన జోడెద్దులు అతని మాటలు లెక్కచేయక కుమ్ములాట ప్రారంభించాయి. ఆ కుమ్ములాట తరతరాలుగా ఉంది అని ఈ కుమ్ములాటలో

లంకె పుటుక్కున తెగిపోయింది
మెడలమీద మిగిలింది విరిగినకాడి
నడి బజారులో ఒరిగింది ధాన్యంబండి

'మంటలూ-మానవుడు', 25.

అని కాంగ్రెసు అవస్థని చిత్రించారు. ''మూడు శిఖరాలూ - మూడు తలకాయలూ'' అనే గీతంలో తామే సర్వాధికారులం అని భావించే అహంకారాన్ని మూడు శిఖరాలుగా, ఆ భావం కలిగిన నియంతలని మూడు తలకాయలుగా చిత్రించి

వేళ్ళు నియంతలు
కళ్ళకు కట్టుకున్నారు
అహంతల గంతలు

'మంటలూ-మానవుడు' 29.

అని, ఈ అహంకారం అధః పతనానికి దారితీస్తుందని స్పష్టంచేశారు.[12] ''అనగనగా ఒక రాజుగారు'' అనే గీతంలో, రాజుగారిని నియంతగాను, చెట్టుని ''చైతన్యానికి చిహ్నం''గా, ''నవనిష్పన విరాట్టు''గా చిత్రించారు. పరిమిత కుటుంబం అపరిమిత ఆనందదాయకం అనే నినాదాన్ని కవిత్వీకరిస్తూ ''ఆకాశం ప్రసవించింది'' అనే గీతంలో ఆ కాశమాతకి సూర్యుడు, చంద్రుడు, చక్కని బిడ్డలు, లెక్కలేనన్ని వెలగలేని గాజుముక్కలవంటి నక్షత్రాలని కని ఏడ్చి లెక్కల చిత్రం'' ని వెంచాను అని వాపోయింది. చివరికి గణం కంటె గుణం ముఖ్యం అని, రాశికంటె రమ్యత శేషము'' (మంటలూ మానవుడా - 48) ప్రతీకాత్మకంగా వెల్లడించారు.

---

12. మూడు తలకాయలు త్రిమూర్తిత్వాన్ని స్ఫురింపచేస్తోంది అని సుధామ భావించారు ('ఇవేజగే', ''చైతన్య శిఖరం'', 55). మా దేవుడే గొప్ప అని భావించే మత'మౌర్ఖ్యాన్నికూడా ఈ ప్రతీక సూచిస్తుంది. ఇందులోని 'పర్వత గర్భం' ప్రజాహృదయానికి, 'జ్వాలా ద్వీపం' ప్రజాశక్తికీ ప్రతీకలుగా డా. శ్రీనివాసాచార్యకి కనిపించాయి ('నారాయణరెడ్డి సాహితీమూర్తి' 72).

''మనిషీ-చిలక'' అనే సంకలనంలో చేర్చినగీతం నిత్యజీవితంలో మానవుడు ధనం చూపించే ప్రలోభాలకి లొంగేసమయంలో అతనిని వారించే ఆత్మని చిలకగా చిత్రించే ప్రతీకాత్మకగీతం. ఆ ప్రలోభాన్ని తిరస్కరించి చిలకమాటవిని మానవుడు

స్వచ్ఛమైన కిరణాల జడిలో
స్నానమాడి.....
అఘేసుకొన్నాడు పునీతుడై
ఆత్మ శుకాన్వీతుడై

'మనిషీ-చిలక', 15.

అని ఆతని మేలుకున్న వ్యక్తిత్వం ''అనంతకోటి జనకోటి అంతరాణి''గా, ''అభినవశుకవాణి''గా కవి ప్రదర్శించారు.

'నేను - అతడు' అనే గీతంలో మానవునికి, దేవునికి మధ్యఉన్న బాంధవ్యాన్ని, తారతమ్యాన్ని వివరిస్తూ, వీరిద్దరిమధ్య 'అగుపించని సేతువుంది' అన్న నిజాన్ని

అతని కంటె నేనేగొప్ప
ఆత్మచేతనతంటూ వుంటే

ఉదయం నా హృదయం, 17.

అని మానవుడే మహనీయుడు అనే విశ్వాసాన్ని కవి ప్రతీకాత్మకంగా వివరించారు.

వైయక్తిక బింబాలు :- డా. నారాయణరెడ్డి తమ విశిష్టమైన అనుభూతులను ఆవిష్కరించడానికి వైయక్తిక కావ్యబింబం పరికల్పన పుష్కలంగా చేశారు. 'పాషాణ శశి' అనే ఖండికలో చంద్రుణ్ని వినూత్నంగా వర్ణిస్తూ,

మరిగిన పాలకుండ మైని
నురుగు ముద్దలా వున్నావు

'మం హరివిల్లు', ౬.

అని జనపదాలలో పరిచితమైన అనుభవాన్ని ప్రాతిపదికగా కవి చిత్రించారు. 'రేఖా మాత్రంగా' అనే గీతికలో ప్రగతిలేని గతిని గానుగెద్దుగా తిరగడం అనే ప్రతీక ద్వారా వ్యక్తంచేస్తూ, సుగతిలేని కార్యక్రమాన్ని అధిక్షేపిస్తూ,

గంగిరెద్దులా ఎగరడంలో
తమాషా ఉంది తాండవంలేదు

'సంభాషణ', [illegible]

అని వైయక్తికంగా గంగిరెద్దు గంతులకి వినూత్న వ్యాఖ్యానం చేశారు. మనిషిలో దురాశ అతిశయిస్తే పరిసరాలుకూడా దుష్ప్రభావానికి లోనవుతాయని తెలియ చేయడానికి వినూత్నంగా

టేబిలు గుడ్లగూబలా కూస్తున్నది

'మనిషీ-చిలక', 13.

అని చిత్రించి రాబోయే అనర్థాన్ని కవి సూచించారు. 'జ్వలిత చేతన' అనే ఖండికలో స్వప్నమేధస్సుని వర్ణిస్తూ

భయాల మంచు గడ్డలమాటున
ముద్దకట్టిన ఆలోచనలు

'ఉదయం నా హృదయం', 8.

అని భయానికి అపూర్వరూప కల్పన చేశారు. 'కాలం వేసిన ప్రశ్న' లో పరిమిత పరిసరాల్లో బంధితుడైన వ్యక్తి స్వేచ్ఛాసీమల్లో అనంతశక్తివంతునిగా ఎదుగుతాడని వ్యక్తంచేయడానికి

ఇక్కడ మూడు రెక్కలతో
మూలుగుతున్న పంఖా
స్వచ్ఛంద శాద్వలాలతో
లక్ష కాళ్ళతో దూకే ఆవేశాల జింక

'ఉదయం నా హృదయం', 22.

అని అపూర్వంగా చిత్రించారు. 'తెల్ల వర్ణచిత్రాలు'లో కవికి మబ్బులు 'సంశయాత్ముని ఊహల్లా' చిరుచిన్నని చినుకులు పిరికివాని కోరికల్లాగానేకాక

రెచ్చిపోతున్న వరదలు
పిచ్చివాని వెకిలినవ్వుల్లా
వెలిసిన ఆకాశం
వెలవెలబోయిన ముఖంలా

'ఉదయం నా హృదయం', 56.

కనిపించడం వీరి ప్రత్యక్ష విశిష్ట పరిశీలనాశక్తిని తెలియచేస్తోంది. 'నా పాట' అనే ఖండికలో అన్నిటినీ భరించే సాదా గుణాన్ని ప్రదర్శిస్తూ

ఒళ్ళు మండినా తిరగబడని
ఊదుబత్తిలా
గుండెకలిగినా తేండ్రించని
కొవ్వొత్తిలా

'తేజస్సు నా తపస్సు', 33.

తమ పాట నిశ్శబ్ద రాగానికి సంకేతంగా కవి ప్రయోగించారు. 'క్షణాలు రెండు' అనే ఖండికలో గతం 'బాదిలా విశ్రమించేది', ప్రస్తుతం సూదిలా పొడుచుకొచ్చేది అని వర్తమానం తీక్షణమైందని కవి తమ అభిమానాన్ని వ్యక్తంచేశారు. సూది నారాయణరెడ్డిగారికి అభిమాన పాత్రమైన కావ్యబింబం. వెన్నెల ఒక్కో క్షణంలో కొంత బాధని కలిగిస్తుంది. ఆ బాధని కవి సున్నితంగా వర్ణిస్తూ,

సూదిలా దూది వెన్నెల
పొడుస్తూ

'తేజస్సు నా తపస్సు', 55.

ఉందని చిత్రించారు. 'ఇంటిపేరు చైతన్యం', అనే ఖండికలో నక్షత్రాల అందాన్ని

ఎవ్వరో పారేసుకున్న నవ్వుల్లాంటి
చుక్కల రజం

ఇంటిపేరు చైతన్యం, 1.

అని చంద్రుణ్ని 'ఆవులించిన చమురుదీపం' అని వినూత్నంగా చిత్రించారు. ఈ శీర్షికాగీతంలోనే మనిషి చైతన్యవంతుడయితే, ప్రకృతికూడా తలవంచుతుంది అనే భావాన్ని

గొరిల్లా తలవంచు
కొని వెళ్ళిపోతూంది జాబిల్లి

ఇంటిపేరు చైతన్యం, 6.

అని అపూర్వంగా కవి చిత్రించారు. ఈ చిత్రణలో కవి పరిశీలనాశక్తితో పాటు, మానవునిశక్తిమీద కవికున్న విశ్వాసంకూడా వ్యక్తం అవుతోంది. సూర్యాస్తమయాన్ని వినూత్నంగా భావించి

సూరయ్య కేకలు
పగటి సముద్రంలో మునిగిపోయి
మధ్య మధ్యలేచి చూస్తున్నాయి
పగిలిన పడవల బొమికల్లా

ఇంటిపేరు చైతన్యం, 54.

అని చిత్రించారు. స్వప్నాలని జీవితంలోని వర్ణప్రయత్నాలుగా భావిస్తూ

కదురులేని బ్రతుకు మీద
కలలు పడుకుతున్నారు

'మథనం', 2.

అని చిత్రించారు. ఒక్కొకసారి మానవుడు అనుభవించే చేతనాచేతన అవస్థని అపూర్వంగా

ఎంతబాగుంది నగత
పండిన ఇసుకల ఊపిరుల్లా

'మథనం', 25.

అన ఊసరక్షేత్రం జీవకళలో ఉద్భవపడే వైరుధ్యాలు సమన్వయస్థితిగా కవి వర్ణించారు. నాగరిక సమాజం నగరాల్లో సృష్టించిన మురికి వాడలని ప్రతిభావంతంగా మన కళ్ళముందు నిలబెడుతూ

అడుసులో తలంగి పేసుకున్న
గుడిసె కొంపల్లో
ముట్టెమీద సందుల్ని మోసుకుతిరిగే
వరాహ వంశాలు

'మథనం', 61.

అని అభాగ్యస్త్రీల స్వరూపాలుగా, నరాహంకారాలుగా చిత్రించారు. ఉదయాస్త మయాలన్నీ మానవజీవిత ప్రతిబింబాలుగా భావిస్తూ

పొడుపుకొండమీద
శిరస్సు జెండా ఎత్తి
అడుగేసిన ఉదయం,
పడమటి ఉరికంబంమీద
వెలుతురు తలను వేలాడదీసిన
అస్తమయం

'విశ్వంభర', 3.

అని చిత్రించారు. నూతన నాగరకత ఆవిర్భావాన్ని

అలలన్నురగలమీద
అచ్చవుతున్న అక్షరాలు

'విశ్వంభర', 76.

గా కవి వినూత్నంగా చిత్రించారు.

డా॰నారాయణరెడ్డి తమ కవితాప్రస్థానంలో ఆరంభదశలో భావ, ప్రబంధకవిత్వ ప్రభావానికి లోబడి రమణీయ, శృంగారమయ కవిత్వాన్ని వెలువరించి, అందుకు తగిన భావుకశక్తిప్రధానమైన కావ్యబింబాలని ప్రయోగించారు. ఈ కావ్యబింబాలు ఆనాటి సాహిత్య సంప్రదాయాన్ని మాత్రమేకాక, వారి యౌవన ప్రాదుర్భావకాలభావనని కూడ వ్యక్తంచేస్తున్నాయి. తమ కవిత్వంలో మధ్యకాలంలో సామాజికస్పృహ అధికంకాగా, సాంఘిక, రాజకీయ వ్యవస్థలపై తమ అభిరుచులని, అభిప్రాయాలని వ్యక్తీకరించే అభ్యుదయ, రాజకీయ భావనాప్రేరితాలైన కావ్యబింబాలని వీరు ప్రయోగించారు. ఆదినుంచి వీరిలో మధ్యతరగతి మానవుడిమైనా, అనాథులైన అభాగ్యులమైనా అభిమానం అధికం. ఇందుకు తగిన మానవతా కావ్యబింబాలు వీరి కవిత్వం అంతటా దర్శనీయాలు అవుతాయి. పరిణత దశలో వీరి కవిత్వంలో తాత్త్వికదర్శనం ప్రముఖంగా కనిపిస్తుంది. 'భూమిక', 'మృత్యువునుంచి', 'మథనం' లో విశిష్టంగా కనిపించే ఈ అవగాహన, 'విశ్వంభర' లో విశ్వవ్యాప్తంగా దర్శనమిచ్చి, ఈ సమగ్ర కావ్యాన్ని వీరి సమ్యక్ తాత్త్విక అవగాహనకి, విశ్వాత్మకి జాజ్వల్యమానమైన ప్రతీకగా, 'ఆత్మకావ్యం', (Epic of the soul) గా ఈ కావ్యాన్ని సంతరించగలిగింది. వీరి కవిత్వంలో ఇటీవలికాలంలో శృంగార భావనకొంత తగ్గినదనే విషయాన్ని 'మథనం', లోని

పూలుసరే, వాటి అనుభ
వాలుసరే, మరి యిప్పుడు
పడగెత్తే ముళ్ళ మధ్య
అడుగేయాలని వుంది

'మథనం' 4.

అనే విశ్వాసనవీకరణలో సమష్టింతవుతుంది. మూడు దశాబ్దాలు మెగా కవితాగీతుల్లో, రాజకీయ విశ్వాసాల్లో, తాత్త్విక దృక్పథాలలో అన్నిదేశాలలోను నచ్చిన అంగీకరమైన నూతన ప్రయోగాలని ఆహ్వానిస్తూ, చేవగల సంప్రదాయాన్ని సజీవ సంస్కృతి విలసనంగా నిలబెట్టగలిగిన డా. నారాయణరెడ్డి 'సంప్రదాయాన్ని జీర్ణించుకున్న ప్రయోగం'.

# కవిత్వం - కావ్యసిద్ధాంతం

## విమర్శనాత్మక సమాలోచనం
## ఉపసంహారం

## కవిత్వం - కావ్యబింబం

## విమర్శనాత్మక సమాలోచనం - ఉపసంహారం

ప్రాథమికంగా కవి ద్రష్ట. కవి దార్శనికశక్తి చర్మచక్షువులకే పరిమితంకాదు. తన పంచేంద్రియాల అనుభవాలతో ప్రత్యక్షంగా, పౌరాణిక చారిత్రక, సంప్రదాయ జ్ఞానంతో పరోక్షంగా తనచుట్టూ ఉన్న ప్రపంచంలోని వాస్తవాలని, వాటి వెనకఉన్న సత్యాలని కవి దర్శిస్తాడు. అనుభవాలు, అనుభూతులు కవి హృదయంలో భావకల్పనచేస్తాయి. ఈ భావాలు అమూర్తంగా ఉంటాయి. ఒక సుముహూర్తంలో ఈ అమూర్తభావాలు మూర్తరూపం ధరిస్తాయి. ఈ మూర్తరూప ధారణకి కావ్యబింబాలు సమగ్రమైన వాహకాలు. కావ్యబింబాల సహాయంతోనే కవి తన హృదయంలోని భావాలని సహృదయ పాఠకుని హృదయంలో ప్రతిబింబింప చేయగలుగుతాడు. భావాలకంపన కవిది, వాటికి అనుకంపన పాఠకుడిది. అక్షర జగత్తులో ప్రజాపతి పదవిని అధిష్ఠించిన కవి తనకి కలిగిన భావాన్ని ఇతరుల హృదయాల్లో కూడా కలిగించే శబ్దకుశలుడు. శబ్దాన్ని పరిమితమైన అర్థంలోకాక అపరిమితమైన వ్యంజనాశక్తితో ప్రయోగించి అనంతమైన సూచనలని చేస్తాడు. యథాతథంగా వాస్తవాన్ని చిత్రిస్తే ఆ రచయిత కవి పదానికి అర్హుడుకాడు.

కావ్యబింబం కవి చెప్పదలచుకున్న విషయాన్ని సూటిగా, స్పష్టంగా, ప్రతిభావంతంగా, ప్రగాఢంగా పఠితలకి అందిస్తుంది. కావ్యబింబ వైశిష్ట్యాన్ని తెలియచేస్తూ డా.ధర్మశీల 'కావ్యబింబం రసం యొక్క వ్యక్తీకరణ, అలంకారానికి చెందిన శోభ, వ్యంజనయొక్క వక్రత, సంగీతం యొక్క ధ్వనిసాధన, చిత్రలేఖనం

యొక్క భావబోధనాశక్తి, శైలియొక్క వైయుక్తిక శక్తి కలబోసిన సమగ్ర సమాహారం''[1] అని వివరించారు. అపౌరుషేయమైన వేదవాఙ్మయం నుంచి అధివాస్తవిక కవిత్వం వరకు భావవ్యక్తీకరణ స్పష్టంగా జరగడానికి సాదృశ్య సారూప్య మూలకమైన ఉపమ ఉపకరించింది. ఉపమారూపకాలు జ్ఞాన గ్రహణసాధనాలు అని భావించి, ఒక మనోవైజ్ఞానిక శాస్త్రవేత్త వీటివలన పోలికలు గ్రహింపబడతాయి. ఇవే మనసుచేసే ఉన్నత వ్యాపారాల్లో ముఖ్యమైన అంశం అని తెలియచేశాడు[2]. ఇదే భావాన్ని Urban అనే భాషాశాస్త్రవేత్త ''జ్ఞానం ఒకవిధమైన ఉపమానం''[3] అని వెలువరించారు. కవులు తమ భావాలని స్పష్టంగా, ప్రగాఢంగా వ్యక్తీకరించడానికి సాదృశ్య సారూప్యాలని అలంబనంగా చేసుకుని భౌతికంగా విరుద్ధాలైన వస్తువాల మధ్య ఉన్న పోలికలని సత్యదర్శనం ద్వారా గ్రహించి కవితా సత్యాలుగా తమ కవిత్వంలో ప్రదర్శిస్తారు.

---

1. డా. ధర్మశీల, Ibid, 99.
2. Mcdougal W, Metaphor is apperception. By this operation are discovered all remote resemblances, all analogies, homologies, similes, metaphors. In fact, it is an essential part of all the higher operations of the mind, "Outline of Psychology", 383.
3. Urban W, Knowledge as a whole is a kind of simile, "Language and Reality", 411.

అందుకే కవులకి రూపక కల్పనా సామర్థ్యం అత్యుత్తమమయిందని అరిస్టాటిల్ స్పష్టం చేస్తూ, ఈ శక్తి సాదృశ్యాలని దర్శించగలిగే సహజదార్శనిక శక్తిగా వర్ణించాడు[4].

సాహిత్యాలనీ కావ్యబింబ పరికల్పన సింహావలోకనంచేసిన సందర్భంలో కవులు తమ వివిధ అనుభూతులకి, అనుభవాలకి భావప్రకంపనలకి రూపకల్పన చేయడానికి ఉపమా, రూపక సంబంధమైన కావ్యబింబ పరికల్పన చేశారని తెలియచేశాను. సంస్కృత వాఙ్మయంలో, ఆంగ్ల సారస్వతంలో, ఫ్రెంచి, జర్మన్, రష్యన్ కవితలలో ప్రాచీన ఆంధ్ర సాహితీ వల్లభుల కావ్యాలలో, ఆధునిక కవుల కవితలలో ప్రస్ఫుటంగా కానవచ్చే కావ్యబింబాలని దర్శించడం జరిగింది. ఈ పరిశీలనలో ఆధునిక ఆంధ్రకవిత్వంలో కావ్యబింబ ప్రయోగవైవిధ్యాన్ని కొంత విపులంగా సమీక్షించే ప్రయత్నం జరిగింది. 'ఆధునికత' కాలవాచిగా మాత్రమేకాక కొన్ని దృక్పథాలకి, శైలీవిధానానికి సంబంధించిన నవ్యతగా స్వీకరించి, ఇరవయ్యో శతాబ్దపు తెలుగు కవిత్వంలో ఈ నవ్యత ప్రదర్శించిన కవుల కవిత్వాన్ని సమీక్షించటం జరిగింది. మానవతా దృక్పథానికి ఉన్నత స్థానాన్ని, ఇచ్చిన గురజాడ ఆధునిక యుగకర్తలలో ఒకరు. వీరి కవితలనీ మానవతా కావ్యబింబాలని దర్శించి, ఆధునిక యుగకర్తలలో మరొకరైన రాయప్రోలు వారి కవితలనీ సౌందర్య కావ్యబింబ దర్శనం చేసుకుని, తెలుగు సాహిత్యంలో భావ సౌకుమార్యానికి, అపూర్వ భావుక శక్తికి పతాకగా నిలబడగలిగే కృష్ణశాస్త్రివంటి భావకవుల భావుక కావ్యబింబ దర్శనం చేసుకుంటూ

---

4. Aristotle, 'The gift for metaphor is the greatest of all. This alone cannot be taught, but is the mark of natural genius, for it implies an inborn eye for likeness', 'Poetics', (Tr. Gerald F Else), 32.

ఈ పరిశీలన సాగింది. భావకవిత్వం ''ఎస్పెస్ నీళ్ళకుస్ బంట్లు!'' బేల అయిపోయిన[5] తరువాత, నవకవిత ''వెనుకిద్దర వదిలించేది / మనను ముందుకు సాగించేది / పరిపూర్ణపు బ్రదుకిచ్చేది'' అని నిశ్చయించిన శ్రీశ్రీ కవిత్వంలోని అభ్యుదయ కావ్యబింబాలని, అధివాస్తవిక కావ్యబింబాలని దర్శిస్తూ, దిగంబరకవుల నగ్నప్రతిబింబదర్శనాన్ని చేసుకుంటూ, విరసం కవుల విరసమైన విప్లవ కావ్య బింబాలని దర్శిస్తూ, నవ్యభావకవుల రమణీయ కావ్యబింబాలని దర్శిస్తూ, తాత్త్విక కవుల తాత్త్విక కావ్యబింబాలని దర్శిస్తూ ఈ సమీక్ష పరిక్రమించింది. ఈ విభిన్న కావ్యబింబాలనన్నింటినీ సమాహారంగా సమన్వయ శక్తితో తన కవిత్వంలో ప్రదర్శించిన బాలగంగాధర తిలక్, డా. దాశరథి, డా. నారాయణరెడ్డి కవితలలోని సమన్వయ కావ్యబింబాలని విశదంగా, ప్రత్యేకంగా పరిశీలించడం జరిగింది.

వచన కవిత్వానికి కావ్యగౌరవాన్ని సంతరించిన ఆధునిక కవి బాలగంగాధర తిలక్. వీరికవిత్వంలో ప్రస్ఫుటంగా కానవచ్చేది సౌందర్యారాధన. ప్రకృతిని, పరిసరాలని తన సౌందర్యదృష్టికి ఆలంబనాలుగా వీరు ప్రయోగించారు. అందుకే వీరి కవితా ధ్యేయం

అగ్ని జల్లినా అమృతం కురిసినా
అందం ఆనందం దాని పరమావధి[6]

---

5. డా. కె. వీరభద్రరావుగారు, 'ఆమోదం', ''మంటలూ-మానవుడూ'' iii.
6. తిలక్, 'నవత-కవిత', ''అమృతం కురిసిన రాత్రి'', 76.

అని స్పష్టంచేశారు. కవిత్వం అందంగా ఉండాలి అనే అవగాహన భావకవితా సంప్రదాయ సంబంధమైనది. కాని ఈ భావకవిత్వ లక్షణం పలాయన సిద్ధాంతం కాకుండా సామాజిక స్పృహచేత సజీవమైనది. అందుచేతనే మార్క్సిస్టు విమర్శకులు కూడా తిలక్ ని ''శ్రీశ్రీ తరువాత ఇంత భావుకత్వంగల కవి బహుశా మనకు లేడేమో''[7] అని అంగీకరించారు. కాని ఈ భావకవిత్వం కవి లలిత హృదయ ఆవిష్కరణచేసే సాధనం. అందుకే ఈ కవిత్వాన్ని ఇంగ్లీషులోని 'lyrical Poetry' కి పర్యాయపదంగా 'లలిత కవిత్వం' గా అర్థంచేసుకోవచ్చు. అందుకే వీరికి 'గాజుకెరటాల వెన్నెల సముద్రాలు', 'జాజిపువ్వుల అత్తరుదీపాలు', 'మంత్రలోకపు మణిస్తంభాలు' ప్రీతిపాత్రాలు. జీవితంలో వాస్తవాన్ని దర్శించి, ఆ వాస్తవాల ఊబిలోకి దిగజారిపోకుండా తమ భావుకశక్తితో ఒక సురుచిర సుందర స్వాప్నిక లోకాన్ని సృష్టించుకున్న తిలక్ తెలుగు కవిత్వంలో 'దోసిళ్లతో అమృతం తాగిన' అమరుడు. ఈ సౌందర్యదృష్టి ప్రకృతిలోని సౌందర్యరాహిత్యాన్ని, భయంకర స్వరూపాన్ని తిలక్ ఏవగించుకోడానికి ముఖ్యకారణం. ఆంధ్రదేశంలో అరుదై పోతున్న అందాన్ని పేర్కొంటూ ''తెలుగు దేశంలో అందం, ఆనందం అనేవి దొరకవేమో'' అనే నిరాశని తమ లేఖల్లో వ్యక్తంచేశారు.

తిలక్ కవిత్వ స్వరూపాన్ని ఒక విమర్శకుడు ''కాల్పనిక శరీరం, అభ్యుదయ ఆత్మ సగానికి సగం ఆయనకవితలో కనిపిస్తే, మిగతాసగం, గొప్ప అనుభూతి అగరుధూమంలా పరిమళభరితంగా, పరమ ఆర్ద్రంగా ఆయన భావనలో కనిపిస్తుంది''[8] అని చిత్రించారు. ఇది తిలక్ కవిత్వానికి సమగ్రచిత్రణకాదు.

---

7. రాచమల్లు రామచంద్రారెడ్డి, ''సారస్వత వివేచన'', 109.
8. ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, ''సాహిత్య పరిచయం'', 124.

తిలక్ సామాన్య మానవుని మాన్యునిగా భావించిన మానవతావాది. ఈ మానవతా దృక్పథం వీరి వ్యక్తిత్వంలో మరో అంచు.

కవిత్వం ఒక ఆల్కెమీ అని భావించిన వీరి కవిత్వం యథార్థాలని కవిత్వ సత్యాలుగా పరివర్తించడమేకాకుండా, ఉదాత్త తాత్త్విక సత్యాలుగా కూడా సంతరించాలని ఆశించారు. తాత్త్విక చింతన వీరి కవిత్వంలో నాలుగవ పార్శ్వం. ''శిఖరారోహణం''లో కాలానికి వీరు చేసిన తాత్త్విక వ్యాఖ్యానం, మానవ వికాసచిత్రణలో ప్రదర్శించిన నిశితమైన అవగాహన, తమ అముద్రిత రచనలో మానవుణ్ని ''కాలంమీద స్థలం మీద గీసిన గీతలో / ఆఖరి ఒకబిందువైనా కాదు కదా'' అని పరిమిత శక్తిమంతునిగా చిత్రించడం వీరిని తాత్త్విక కవిగా నిలబెడతాయి. ''మంచు'' అనే అసంపూర్ణ ఖండికలో కూడా వీరు మానవ జీవితంపైన, మృత్యువుపైన నిశితమైన అవగాహన ప్రదర్శించారు. నలభై అయిదవ ఏట అకాలంగా మరణించే సమయానికి తిలక్ పరిణత తాత్త్విక చింతనని వెల్లడిస్తూ అముద్రితంగా ఉండిపోయిన రచనల్ని చేయడం గమనించతగిన విషయం. వీటిలో వీరు వ్యక్తంచేసిన, సూచించిన తాత్త్విక చింతన వీరు ఇంకొక పది సంవత్సరాలైనా జీవించి ఉంటే ఇంకా సమగ్రమైన ఆత్మకావ్యాన్ని (epic of the soul) రచించి తెలుగు సాహిత్యంలో ఒక లోటుని పూరించేవారని ఆశించవచ్చు. రెండు దశాబ్దాల తరువాత ఈ లోటుని పూరించడానికే ''విశ్వంభర'' సమగ్ర కావ్యంలో డా.నారాయణరెడ్డి ప్రయత్నించడం సాహితీప్రియులకి సంతోషించతగ్గ విషయం.

తిలక్ తన ప్రాంతీయ, దేశీయ సరిహద్దులని అధిగమించి అంతర్జాతీయ దృక్పథాన్ని తమ కవిత్వంలో వ్యక్తీకరించారు. 'వసుధైకగీతం'లో తమ అంతర్జాతీయ వ్యక్తిత్వాన్ని

అమెరికన్ పాల్ రాబ్సన్ సంగీత గీతాన జాలిగా
ఆఫ్రికా అంధకారాటవుల సింహగర్జానిర్ఘోషగా
కైలాస హిమగళము విడివచ్చు శాంతిసందేశమ్ముగా
పలికిందినేను, మానవాళికి అభయహస్త మిచ్చిందినేను

'అమృతంకురిసినరాత్రి', 8.

అనే కావ్యబింబాలద్వారా వెల్లడించారు. భూగోళ పరిమితుల్నే కాక విశ్వాంతరాళ పరిమితుల్నికూడా అధిగమించిన తమ విశ్వరూపాన్ని

భూ మధ్యరేఖ నా గుండెలోంచి పోతోంది
భ్రూ కుటిలోపల నక్షత్రగోళం తిరుగుతోంది
ఈ వేళ నన్నానవాలు పట్టలేవు నువ్వు
సూర్యుడిని చూడు నాతలమీద పువ్వు

'అమృతంకురిసినరాత్రి', 8.

అని ప్రదర్శించారు. తాను ప్రాదేశిక పరిమితుల్నేకాక, కాలపరిమితుల్నికూడా అధిగమించి కాలత్రయాన్ని సంధానించి ''ఆగామికాల గంభీరస్వామి కంఠాన

వేయబోయే మాల'' నని, ''ఈజిప్టు పిరమిడ్లమధ్య, బాబిలోనియా స్థూపాల మధ్య, మొహెంజొదారో శిథిలాలమధ్య నిలిచి కలలు కన్నానని తెలియచేశారు.

ఏ రాజకీయ పార్టీకో నిబద్ధమైన సంకుచిత తత్వం తమ కవిత్వం కాదని ధనికవాదం, సామ్యవాదం కాదని స్పష్టంచేస్తూ, కవి తమ సౌందర్యాత్మకమైన దూరాన్ని (aesthetic distance) సంరక్షించుకున్నారు. ఈ దూరం కవికి ఎంతో ఉపకారి. దీనివలన జీవితాన్ని సమగ్రంగా, సావధానంగా కవి పరిశీలించడానికి వీలవుతుంది. తిలక్ సామాజిక వ్యవస్థని సుకుమార హృదయంతో అనుభవించి, ఆ వ్యవస్థలో ఆర్థిక అసమానతలని నిరసించి, గచ్ఛత్ శవాకారులైన మానవులకి అర్థవంతమైన జీవితం అందాలని ఆశించిన అభ్యుదయ హృదయం కల వ్యక్తి. అందుకే అమృతం కురిసిన రాత్రికి పీఠిక వ్రాసిన కుందుర్తి ''తిలక్ అభ్యుదయ భావాలకు రమ్యమైన శైలిని సమకూర్చడంలో కృతకృత్యుడయ్యాడు. మొత్తంమీద చూస్తే అభ్యుదయ భావనా కాల్పనికోద్యమ కాలంనాటి శబ్ద సౌందర్యము - ఈ రెండి మేళవింపు తిలక్ కవిత్వం అని చెప్పవచ్చు''[9] అని వీరిని సమన్వయ ప్రతినిధిగా చిత్రించారు. భావనలో అభ్యుదయ స్ఫూర్తి, శైలిలో భావకవిత్వ సంప్రదాయం, అనగాహనలో మానవతా దృక్పథం, పరిణతదశలో తాత్త్విక చింతన వీరి కవిత్వంలో సంగమించి, సమన్వయ కవిత్వానికి వీరిని సముజ్జ్వల ప్రతినిధిగా నిలబెడుతున్నాయి. ప్రాక్పశ్చిమ సంస్కృతులని కూడా తమలో సమన్వయం చేసుకుని విశాల వ్యక్తిత్వాన్ని సంతరించుకున్న తిలక్ ''పూర్వ, పశ్చిమ

---

9. కుందుర్తి, 'మావాడు - మహాగట్టివాడు', ''అమృతంకురిసినరాత్రి'', IV.

దిక్కటాలనొరసి మెరసే ద్విశిఖర భూధరం'' అంటే సత్యదూరంకాదు. వీరి కవిత్వంలో పరోక్షజ్ఞానం కంటె ప్రత్యక్షజ్ఞానం ఎక్కువగా ఉండటం గమనించ దగిన విషయం. వీరి సృజించిన కావ్యబింబాలు ప్రముఖంగా ప్రత్యక్షజ్ఞాన సంబంధమైనవి. తమదైన అనుభవాన్ని ప్రతిభావంతంగా వ్యక్తీకరించడానికి కవి అందగా ప్రయోగించే కవి సమయాలని, ప్రతీకలని ఎక్కువగా అభిమానించక, తాము చెప్పేది తమలోనుంచి ''పెల్లుబుకు కావాలి'' అని విశ్వసించి విశిష్టమైన వైయక్తిక కావ్యబింబ పరికల్పన చేసిన భావుకచక్రవర్తి తిలక్.

కవిత్వానికి హేతువులేవైనా డా. దాశరథి కవిత్వానికి చుట్టూవున్న సాంఘిక రాజకీయ పరిస్థితులు ముఖ్యమైన హేతువులు. ''కనిపించిందంతా కవితగా రాసేస్తాను'' అని ఆయనే ప్రకటించారు. తమ కవిత్వానికి ఉద్యమాలే ముఖ్యమైన ప్రేరకాలు అనికూడా దాశరథి స్పష్టంచేస్తూ ''నేను ఉద్యమోపజీవిని. నాకు ఆరాటపెట్టే సమస్య ఏదో వెంట ఉండాలి. ఆ సమస్య నా వ్యక్తిగతమైనది కాకూడదు. అది పదిమంది సమస్య అయి ఉండాలి''[10] అని అన్నారు. నిజాం నవాబు పరిపాలనలో కష్టకష్టాలు అనుభవించిన తెలంగాణతల్లిని చూసి విచలితుడై దాశరథి ఆర్థిక అసమానతని, రాజకీయ నిరంకుశత్వాన్ని ప్రతిఘటించడానికి 1949 లో 'అగ్నిధార' ని కురిపించారు, 1950లో 'రుద్రవీణ' ని వినిపించారు. ఆరంభదశలో వీరి కవిత్వానికి ఈ విప్లవ భావనముఖ్య ప్రేరకం. అందుకే ఈ దశలోని వీరి కవిత్వంలో చైతన్యానికి ప్రతీక అయిన 'అగ్ని' వివిధరూపాల్లో సాక్షాత్కరిస్తుంది. పలాశ కుసుమాలు, రక్తిలు లోచనాలు, కెంపులు, గన్నేరు

---

10. డా. దాశరథి, 'తెలంగాణంలో కవితా మహోద్యమం', ఆంధ్రసచిత్రవారపత్రిక.

కన్నె మొక్కలు, కుంకుమ పువ్వు జవరాలునంటి అరుణ వర్ణశోభితాలైన ప్రకృతి అంశాలు విషాదదృష్టిని వ్యక్తీకరించే కావ్యబింబాలు అధికంగా కనిపిస్తాయి. 'అగ్నిధార' కి తొలిపలుకు వ్రాసిన దేవులపల్లి రామానుజరావుగారు ఆధునిక యుగము తెలుగు సాహిత్యములో అభ్యుదయ యుగమని చెప్పవచ్చును. భావకవిత ఇంచుమించుగా ఆధునిక తెలుగు సాహిత్యమునుండి నిష్క్రమించినది. శ్రీశ్రీ సంప్రదాయమునను సరించి కవిత్వము వ్రాయు యువకులలో శ్రీ దాశరథి ప్రముఖులు[11] అని అభిప్రాయపడ్డారు. కాని 1962లో మలిముద్రణకు మళ్ళీ తొలి పలుకు వ్రాస్తూ ''ఈ కవితా శరములన్నీ మధుర భావనలను పులకెత్తించెడి కుసుమ శరాలు''[12] అని దాశరథి కవిత్వంలని శృంగారం అంగారాల సమ్మేళనాన్ని సూచించారు. సమ్మేళనాన్ని సూచించారు. డా. దాశరథి రాజకీయ స్నేహ విప్లవ భావాలని కలిగిస్తే, వారు అధ్యయనంచేసిన ఉర్దూ కవిత్వం, వారి తరుణవయస్సు, వారిలో శృంగార భావ దీపకాలు అయ్యాయి. దాశరథి వ్యక్తిత్వం ఈ రెండు భావనలని సమన్వయం చేసుకగలిగింది. తను కవిత్వంలో ఈ రెండు భావాలని వ్యక్తంచేయుడానికి ప్రకృతిని అలంబనంగా చేసుకుని తదుచిత కావ్యబింబ పరికల్పన చేశారు. వారు ప్రకృతిని సౌందర్యమూర్తిగా, ప్రేయసిగా భావించారు. ఒకొక్క సారి ప్రకృతితో తాదాత్మ్యాన్ని అనుభవించి తమ సౌందర్యపిపాసని ప్రకృతికి ఆపాదిస్తూ '''పుష్యమాసంలో ప్రకృతి సమస్తం కుసుమగంధిగా, కుసుమహారగా, కుసుమ నేత్రగా'' కనిపించింది. సౌందర్యాన్ని వెలుగులో దర్శించి మహాంధకారము

---

11. దేవులపల్లి రామానుజరావు, 'తొలిముద్రణ' తొలిపలుకు, ''అగ్నిధార'' IX.
12. దేవులపల్లి రామానుజరావు, 'మలిముద్రణ, తొలిపలుకు', "అగ్నిధార," 6.

శుభసమయాన ''వెలుగు వెలుగు వెలుగు వెలుగు!'' తెలుగు తెలుగు తెలుగు తెలుగు!'' అని ఆనందపారవశ్యంతో ప్రకటించారు. దాశరథి వెలుగులో నే కాక చీకటిలో కూడా అందాన్ని దర్శించి ''చీకటులు కూర్చె నందమ్ము లోకమ్మునకు'' అని అపూర్వంగా తెలియచేశారు. తమ సౌందర్యదృష్టిని అతికోమలంగా వర్ణిస్తూ, ''ఆకాశంలో వెన్నెల అలముకున్నది'' అనే ప్రకృతి సత్యాన్ని ''వానిబుజముజారి ప్రాకె వెన్నెల వల్వ / నగ్నమైన నభము నడుము చుట్టు'' అని తెల్లని పావురాలు హరిణాంకుని తెల్లని మబ్బు కండువా' అని రమణీయంగా చిత్రించారు. రాజహంసల అసాధారణమైన తెల్లదనానికి కారణం ''వెన్నెలని గడ్డకట్టించి దాన్నొక్క హంసన్ని తయారు చేస్తారు'' అని వర్ణించారు. మొదట విప్లవావేశం అధికమైనపుడు అగ్ని సంబంధమైన కావ్యబింబప్రయోగం ఎక్కువగా ఉన్నట్టే 'కవితాపుష్పకం', 'పునర్నవం', 'మహాంధ్రోదయం'వంటి కవితా సంకలనాల కాలానికి వీరిలో సౌందర్యదృష్టి ఎక్కువై అందాన్ని సంకేతించే వెలుగుకు సంబంధించిన కావ్యబింబాల ప్రాముఖ్యం కనిపిస్తుంది. ఆరంభంలో సూర్యోదయం అరుణ విప్లవోదయంగా కనిపిస్తే, ఉషాకన్య కరతలాలన్నీ ''రక్తములో కననమ్ము లల్లెదన్'' అని తెలియచేశారు. కాని తరువాత దశలో మండుచున్న సూర్యుడు

విచ్చెను తన
కాంతినేత్రమును నేడు

'పునర్నవం', 207.

అని భావిస్తూ తమ సౌందర్యాభిలాషని వ్యక్తంచేశారు.

దాశరథి కవిత్వంలో మానవతా దృక్పథం మరొక ముఖ్యాంశం. ''నా పేరు ప్రజాకవి నా ఊరు ప్రజావాడి'' అని ప్రకటించిన దాశరథి వీధి మానవి స్వీయగాథలను విని, అతని కష్టాలని, సానుభూతితో పరిశీలించి కవిత్వంలో చిత్రించారు. ఎవడైనా మానవుడే ఎందుకు ద్వేషించడాలు అని ప్రశ్నించి, సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని దాశరథి కాంక్షించారు.

హింసా వాదాలన్నీ
ఇట్రింకు తింకాలి
మానవతా వాదమొకటే
మహిలో విలసిల్లాలి

'తిమిరంతో సమరం', 34.

అని తన మానవతా దృక్పథాన్ని తెలియచేశారు. ''నేనో మానవతా దేవాలయంలో / అనుక్షణం మ్రోగే కంచు కవితా ఘంటను'' అని ప్రకటించి కవి గజదంత గోపురాలలోకాక బాధలబస్తీలో దోస్తీచేయాలని ఆశించారు.

ప్రకృతి దర్శనంతో పాటు వీరి కవిత్వంలో వ్యావసాయకజ్ఞానం కూడా కనిపిస్తుంది. కాని అది పరిమితం. దాశరథి హైదరాబాదు చేరుకున్నాక చేసిన కవితాకృషిలో నాగరక కావణింబాలు పుష్కలంగా కనిపిస్తాయి. నగర జీవితపు బ్లాక్ మార్కెట్లు, సిండికేట్లు, బిజినెస్ మాగ్నెట్లు వీరి కవిత్వంలో కనిపిస్తారు. హింస మనిషికి అందం ఇవ్వదు అని తెలియచేయడానికి

''ఇస్త్రీ చెడిన బట్టలా / ఇంపునివ్వదు మానవ శరీరంమీద'' అని తెలియ చేశారు. పనికిరాని పాతమీద నాటి ఏవగింపుని తెలియచేయడానికి

గడియారం నడవని
పాతకటే గోడకన్న
నూరుణ్ణి ఉరికించే
ఫ్యాక్టరీ కూతమిన్న

'తిమిరంతో సమరం', 49.

అని నగరంలో నవత్వానికి ఫ్యాక్టరీని సంకేతంగా కవి ప్రయోగించారు. కవి సందర్భోచితంగా వైజ్ఞానిక కావ్యబింబాలనికూడా ప్రయోగించారు. ఆధునిక కాలంలో వైజ్ఞానికశాస్త్రం మానవునికి చేసిన సేవలని గుర్తిస్తూ, ఆ శాస్త్రమే మానవజాతికి కలిగించే విపత్తుని

న్యూట్రాను జోరుగా తగిలే
యురేనియం పరమాణువు పగిలి
కిరణాలు చిమ్మితే ప్రళయం

దాశరథి కవిత, 230.

అని చిత్రించారు. దాశరథి తను కవిత్వ ప్రయోజనాలకి అనుగుణంగా సాంకేతిక కావ్యబింబాలని ప్రయోగించి, మానవునిపై సాంకేతిక ప్రగతి కలిగించే ప్రభావాన్ని అవగాహనచేసుకుని తమ కవిత్వంలో అటువంటి కావ్యబింబప్రయోగం చేశారు.

సంప్రదాయబద్ధమైన వైష్ణవకుటుంబంలో పుట్టిన దాశరథికి పురాణపరిచయం, చారిత్రకజ్ఞానం, సంప్రదాయ స్పృహా పుష్కలంగా ఉన్నాయి. 'అగ్నిధార' నుంచి 'ధ్వజమెత్తిన ప్రజ' వరకు తను శృంగారభావాలకి, విప్లవ భావాలకి ఆలంబనంగా పౌరాణిక కావ్యబింబాలని కవి ప్రయోగించారు. విప్లవాన్ని ''విశ్వరుద్ర ఫాలంలో / విప్లవాగ్ని విరిసింది' అని ''పంచానన పాంచజన్య గర్జా నిధ్వానం'' అని చిత్రిస్తూ ఈ విప్లవ కాంక్ష ఈనాటిది కాదు, సార్వకాలికమైన వాంఛ అని కవి స్పష్టంచేశారు. మానవునిలో దుశ్చింతనకూడా దుర్యోధన, దుశ్శాసనాదులనుంచి వస్తున్నదే అని, నిజాము దుష్కృత్యాలు అనాదిగా వస్తున్న అత్యాచారాలకి వారసత్వమే అని కవి తెలియచేశారు. పౌరాణిక వ్యక్తులని తమ భావాలకి ప్రతీకలుగా ప్రయోగించటమేకాక సంప్రదాయంలో రూఢమైన ప్రతీకలకి కొత్త అర్థాలని, కొత్త ప్రయోజనాన్ని సూచించడంలో డా. దాశరథి మౌలికమైన ప్రజ్ఞని ప్రదర్శించారు. రావణవనంలో రావణుని భక్తితోకాక భయంతో అధికారాన్ని చెలాయించడానికి ప్రయత్నించే నిరంకుశులకి ప్రతినిధిగా కవి ప్రయోగించారు.

మానవునిలో మితిమీరుతున్న యుద్ధోన్మాదం దాశరథిని కదిలించింది. యుద్ధాన్ని నిరసిస్తూ శాంతిని ఆహ్వానిస్తూ ''రావమ్మా శాంతమ్మా'' అనే ఖండికలో

నేవు రావన్నాయి మోళ్ళు
నేవు లేవన్నాయి ముళ్ళు
నిజం నిజమన్నాయి రాళ్ళు
నమ్మలేకున్నాయి నాకళ్ళు

'తిమిరంత సమరం', 21.

అని శాంతి ఉదయిస్తుందనే విశ్వాసాన్ని కవి వ్యక్తంచేశారు.

కంటికి కనిపించింది అంతా క్షుత్తగా వ్రాసినా డా.దాశరథి తమ కవిత్వంలో వాస్తవాలని తాత్త్విక సత్యాలుగా పరివర్తించగలిగారు. కాల పరిమితుల్ని అధిగమించి, త్రికాల బాధితంకాని శాశ్వత సత్యదర్శనానికి కవి ప్రయత్నించారు. ''పాడు పడిన పాతకాలం రానున్నలేత కాలమునకు నెత్తుర్లు రంగు చందనమురాయు'' నని, తాను కాలానికి కంఠమాలనని కవి చిత్రించారు. తిలక్‌కూడా తాను ''ఆగామి కాలస్వామి కంఠమాల'' నని స్పష్టంచేయడం ఈ సందర్భంలో గుర్తించతగింది. సృష్టి, స్థితి, లయ అనే మూడు దశలు నిజానికి పరస్పర విరుద్ధాలైనవికావు వీటికి అవినాభావ సంబంధం, కార్యకారణ సంబంధం ఉన్నాయి. లయసృష్టికి ప్రాతిపదికఅని భావిస్తూ

లయ మహాహోమ వేది నా త్రిమ్మునందు
సృష్టి సుందరదేవి కనిపించవచ్చు

'అగ్నిధార', 67.

నని సృష్టిలో విరుద్ధాల సమన్వయాన్ని సాధించగలిగిన తాత్త్విక దృష్టిని దాశరథి ప్రదర్శించారు. 'ఆలోచనాలోచనాలు' రచించే కాలానికి డా.దాశరథి తాత్త్విక చింతన పరిణతస్థాయికి చేరుకుంది. ''వెలుగుల వంతెన''లో రెండు చీకటి కొండలు కలిపే వంతెనని మానవ మేధస్సుకి అర్థంకాని, పుట్టుకకి, చావుకి

సంకేతాలుగా కని చిత్రించారు. అర్థంకాని సృష్టిరహస్యాల్లో అర్థమయ్యేది పరిమితమైన జీవితకాలమే అని కని సూచించారు. అందరికీ కావలసింది అంతర్దర్శనం అని భావించి ఆ అంతర్దర్శనం ఆత్మదర్శనంగా పరిణమించి మానవుని సమ్యక్ స్వభావ దర్శనానికి దోహదం చేస్తుందని డా.దాశరథి విశ్వసించారు. 'ధ్వజమెత్తిన ప్రజ' అనే వీరి ఇటీవలి సంకలనంలో తాత్త్వికదృష్టిలో కొంత పరిణామం కనిపిస్తుంది. 'అదృశ్య కావ్యాలు' అనే ఖండికలో భౌతిక చక్షువుకి కనిపించని అనంత సత్యాలని దర్శించడానికి మనోనేత్రం అవసరం అని భావిస్తూ ''కనిపించిందంతా సత్యంకాదు, కనిపించనిదంతా అసత్యంకాదు అనే తాత్త్విక సత్యాన్ని

''శ్వాస కోశంలోని
పవనం కనిపించదు,
పసందైన మల్లెలోని
పరిమళం కనిపించదు

'ధ్వజమెత్తిన ప్రజ', 71.

అని తెలియచేశారు. తత్వతః ప్రజల నాడిని, వాడిని గ్రహించి తను కవిత్వంలో వ్యక్తీకరించే దాశరథి కవిత్వంలో తాత్త్విక చింతన సందర్భోచితంగా కనిపిస్తుంది. నేటికి మానవజీవితంమైన తాత్త్వికావగాహన ఉంది. ఈ అవగాహన సమగ్ర కావ్యరూపందాల్చి ఆంధ్ర సాహిత్యానికి ఒక అమూల్యహారాన్ని భవిష్యత్తులో ప్రసాదిస్తుందని ఆశించవచ్చు.

శృంగారాభిలాష, విప్లవ ఆవేశం, ప్రకృతిదర్శనం, నాగరక వైజ్ఞానికస్పృహ, మానవతా దృక్పథం, తాత్త్విక చింతన వీరి కవిత్వంలో వివిధ దశలలో సాక్షాత్కరించి, వారిని సమన్వయకవిగా చూపిస్తున్నాయి. వీరి కవిత్వాన్ని ''సామాజిక స్పృహ, అనుభూతి స్పందనం, రచనాశిల్పం అన్న మూడు లక్షణాలు సుసంయోజితమైనవి''[13] గా విమర్శకులు వివరించారు. డా. నారాయణ రెడ్డి దాశరథి కవిత్వంలో సౌందర్యారాధన, విప్లవవాంఛల కలయికని

శరదిందు చంద్రికా
పేశల కావ్యఖండముల పిండిన నే కలమందునన్ మహో
గ్రాశని పాతముల్ వెలయునో రా! మహేశుని కంఠిలో సుధా
రాశి తరంగముల్ కటు హాలాహల కేలలు పొంగినట్లుగా

'నివేదన', ''జలపాతం''.

అని ప్రశంసించారు. వివిధ ప్రక్రియలకి, వివిధ దృక్పథాలకి, ప్రబంధ రచనా విధానంనుంచి గేయకవితా విధానం వరకు అన్ని కవితాప్రక్రియలని సాదారంగా ఆహ్వానించిన దాశరథి కవిత్వానికి, వ్యక్తిత్వానికి ''కవితాపుష్పకం'' కేంద్రప్రతీక. వారి సమన్వయ దృక్పథానికి ఉజ్జ్వల పతాక.

ఆధునికాంధ్రకవిత్వంలో ప్రధానమైన ఉద్యమాలుగా దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు కాల్పనికోద్యమం, మానవోద్యమం, అభ్యుదయోద్యమం పేర్కొని

---

13. మాదిరాజు, 'దాశరథి కవితాదర్శనం', ''భారతి'', సెప్టెంబరు, 197

తమ స్వభావానికి అనుకూలంగా కాల్పనికోద్యమం అన్నింటిలోకి విశిష్టమయిందని అభిప్రాయపడ్డారు. ''కాల్పనికోద్యమంలో కాల్పనికవేగం, లక్ష్యావేశం, విశృంఖలత, విజిగీష, సాహసం, అద్భుత పూర్ణమైన మనస్థితి''[14] ఆత్మపరమైన ఈ కావ్యాలని ఉత్తమ కావ్యాలుగా నిలబెడతాయి అని వారు తెలియచేశారు. ఈ శతాబ్దంలో కవిత్వం నాయుడానికి కలంపట్టిన ప్రతికవి యౌవనాంగణంలో అడుగు పెట్టిన క్షణంలో అయినా కాల్పనికోద్యమ ప్రభావానికి లోనుగాక తప్పలేదు. సుకుమారమైన హృదయతత్వం, సూక్ష్మగ్రాహణశక్తి కవులకి ఈ వయసులో సహజాలంకారాలు. ఈ సమయంలో ''దాక్కొని ఉండి దారి పక్క నిక్కుకొని ఉండే గడ్డిపువ్వుకి'' నక్షత్రానికిచ్చే దివ్యగౌరవమిస్తాడు యువకవి. దీనికి మూలశక్తి అతని భావనాశక్తి. డా.నారాయణరెడ్డి కవిత్వం ఆరంభించిన దశలో ఈ భావనాశక్తి ఆయనలో పుష్కలంగా ఉంది. వీరి కవిత్వాన్ని 'నవ్వని పువ్వు' నుంచి 'విశ్వంభర' వరకు సన్నిహితంగా పరిశీలించిన డా.దాశరథి ''నారాయణరెడ్డి శృంగార, కరుణ రసాల పోహళింపులో తన కవితారచన ప్రారంభించాడు''[15] అని తెలియచేశారు. ''నవ్వని పువ్వు''లోను, ''జలపాతం'' లోను ''నారాయణరెడ్డి గేయాలు''లోను భావ కవిత్వప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ప్రకృతి వీరికి సౌందర్యమూర్తిగా, శృంగారాధిదేవతగా కనిపించింది. ప్రకృతే తమ ప్రియురాలిగా రూపధారణచేయాలని

---

14. దేవులపల్లి కృష్ణశాస్త్రి, 'పాతిక సంవత్సరాల తెలుగు కవిత్వము' ''భారతి'', జనవరి, 1949.

15. డా.దాశరథి, 'తిరుమల శ్రీ నారాయణీయం', ''నారాయణరెడ్డి సాహితీమూర్తి'', XI.

ప్రకృతి ముందు చేతులెత్తి
ప్రార్థింతును కడసారిగ
నారమణికి బదులుగ ఆ
కారం ధరియించాలని

'నారాయణరెడ్డి గేయాలు', 13.

పేరు కోరుకున్నారు. 1955లో ప్రచురించబడిన నారాయణరెడ్డి గేయాలు అనే సంకలనానికి వేరు వ్రాసిన 'నామాట'లో తమ హృదయంలోని భావ వైవిధ్యాన్ని

కొన్ని శృంగార భావనను పొదుగుకున్నవి ఉన్నా,
కొన్ని సను కాలేన సమాజంలో రగిలే సెగలను,
పొగలను వెలిగ్రక్కేవి ఉన్నవి[16]

అని తెలియచేశారు. తమ శృంగారభావనని ప్రకృతికి ఆపాదిస్తూ,

అస్త సూర్యుడు చుంబ
నాత్మక క్రియ సల్ప
సంధ్యాలతాంగి రో
ష కషాయ ముఖియయ్యె

'నారాయణరెడ్డి గేయాలు', 20.

---

16. డా.నారాయణరెడ్డి, 'నామాట', ''నారాయణరెడ్డి గేయాలు''.

నని 'సహానుభూతి' (Empathy) ని చిత్రించారు. 1981లో ప్రచురితమైన 'విశ్వంభర'లో కూడా వీరి ప్రణయార్ద్ర భావన దర్శనీయమవుతుంది. ప్రకృతిని అర్ధాంగిగా మలచుకొన్న ప్రతి పురుషుని స్వరూపాన్ని మానవపరిణామ క్రమంలో ప్రధాన దశగా కవి చిత్రించారు. ప్రకృతి కవికి కొన్ని సమయాల్లో పసిపిల్లలా అమాయకంగా కనిపించింది. ''జాలువారే ఆ యేరు తాచింది తనకు పాల వేళ్లతో నిమిరినట్టు'' (''విశ్వంభర'', 17) గా వీరు చిత్రించారు. తమ హృదయంలోని ఆశని ప్రకృతిలో దర్శిస్తూ, వీరు ''పాయదీసిన కురుల మధ్య / పాపట కనిపించినట్లే / విరగబూసిన ఇరులమధ్య / వేకువ వికసిస్తుంది'' (''ముఖాముఖి'', 25,) అని తమ ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. తమ ఆశాపూరిత తత్వాన్ని స్పష్టీకరిస్తూ 'శిశిరం నుంచి వసంతానికి, చీకటి నుంచి ప్రభాతానికి, నిరాశనుంచి ఆశా శిఖరానికి / అశ్రు జలధినుంచి ఆనంద తీరానికి / నడపించే మార్పు' (మార్పు నా తీర్పు 2) తమ తీర్పు అని తమ సాహితీవ్యక్తిత్వాన్ని వెల్లడించారు. ''ఇంటిపేరు చైతన్యం'' అని ప్రకటించి సృష్టి సమస్తంలో చైతన్యస్ఫూర్తిని దర్శిస్తూ, భూమి, నీరు, వెలుతురు, గాలి చైతన్య సంకేతాలుగా ''విశ్వంభర''లో ప్రయోగించి ''సాగిపోతాడు కాంతి లహరిలా / చైతన్య కేతనుడు మానవుడు'' అని తమ చైతన్యాభిమానాన్ని వెల్లడించారు.

ఉన్నతపాఠశాల విద్యార్థిదశలోనే నారాయణరెడ్డి నైజాం రాష్ట్రానికి స్వాతంత్ర్యం రావాలని విద్యార్థులు జరిపిన సత్యాగ్రహంలో పాల్గొన్నారు[17]. వీరిలో స్వాతంత్ర్యపిపాస, మానవధర్మవిజయ సాధనకి విప్లవావశ్యకతని తాత్త్వికంగా సమర్థించడం వీరిలో మొదటినుంచే ఉన్నాయి. ''జనహృదయం నిద్రించే జ్వాలాముఖి'' అని విశ్వసించి ప్రతీప శక్తులు సామాన్యప్రజలని అణచుకపోవడం కొనసాగిస్తే, స్తంభమైన ప్రజాశక్తి విప్లవించి

అస్థి పంజరాల్లో అగ్నిమొగ్గలు
చిటికిన కండరాల్లో చెకుముకి రవ్వలు
సక్లిపోయిన కరాల్లో జ్వాలల తోరణాలు
డిల్లపడిన నరాల్లో కల్లోల డిండిమాలు

'ముఖాముఖి', 20.

ప్రదర్శిస్తుందని కవి స్పష్టంచేశారు. విప్లవమార్గాన్ని, అనుసరించే సామాన్య మానవుణ్ణి వీరు ''జలపాతం''లో ఉదయసూర్యునిగా, ''దివ్వెల మువ్వ'' ల్లో జ్వాలాముఖిగా, ''ముఖాముఖి''లో మార్తాండమూర్తిగా ''మం హరి విల్లు''లో ఉదయార్కబింబంగా, ''మంటలూ-మానవుడూ'' లోను ''మనిషీ-చిలక''లోను మార్తాండబింబంగా, ''తేజస్సు నా తపస్సు'' లో

17. తిరుమల శ్రీనివాసాచార్య, 'నారాయణరెడ్డి సాహితీమూర్తి', 376.

ఇనబింబంగా, ''విశ్వంభర''లో 'మడమతిప్పని మార్తాండు'నిగా చీకటిని ఛేదించే సూర్యుణ్ణి కేంద్ర ప్రతీకగా ప్రయోగించారు. తను ఆరంభదశనుంచి పరిణత తాత్త్విక దశవరకు డా.నారాయణరెడ్డి కవిత్వంలో ఈ ప్రతీక పునరావృతమై వారి ప్రగాఢమైన విప్లవ వాంఛని నిర్ద్వంద్వంగా తెలియచేస్తోంది. సామ్యవాద సిద్ధాంతంలో వీరికి పరిపూర్ణ విశ్వాసం ఉంది. అందుకే ఈ దృక్పథాన్ని ''ఏ మనీషి శిరంలోనో / ఇగురులెత్తిన సామ్యవేదం''గా కొనియాడారు. శ్రామికశక్తి ప్రాముఖ్యాన్ని గ్రహించి శ్రమజీవుల ''చెమట తుంపరల్లో / కణ కణలాడుతున్న / దినకరబింబాలు'' వీరు దర్శించారు. శ్రీశ్రీకి ఘర్మజలం ధర్మజలం అయితే వీరికి ఆ ఘర్మజలంలో దినకరబింబాలు సాక్షాత్కరించాయి. వీరి అభ్యుదయ భావన, విప్లవాభిమానం ''మంటలూ-మానవుడు''లో పరాకాష్ఠ స్థాయిని చేరుకున్నాయి. మతం మత్తుమందు అనే మార్క్సిస్టు అవగాహనని, విప్లవాభిమానాన్ని వెల్లడిస్తూ ''జాతకం విస్మరించాను / జ్వాలను చుంబించాను'' అని వెల్లడించారు. మానవులు రాజీపడే మనస్తత్వాన్ని విడిచిపెట్టి విప్లవమార్గంలు కావాలి అని ఆశించి, వారు తలలూపే బసవన్నలుకాక, తాండవించే నందికేశ్వరులు కావాలని ఆశించారు. కాని వీరి విప్లవం నిర్మాణాత్మకమైనదేకాని విధ్వంసకారి కాదు. అందుకే నక్సలైట్ల తీవ్రధోరణిని, హింసాపూరిత రాజకీయ నిబద్ధతని వీరు ఆమోదించలేదు. కాని వారి ఆత్మస్థైర్యాన్ని మెచ్చుకుంటూ, ''రాజీపడే అవసరం ఇద్దరికే లేదు / రస్తాలు వేరని చాటుతున్నాను'' అని ఏ ఇజాలకు కట్టుబడని తను విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. అందుకే వీరు ''ఏ ఇజాలకు కట్టుబడరని, ఎవరికీ అందకుండా, ఎందులోనూ ఇరుకోకుండా ఎగిరెగిరి పోతారు''[18] అని ఒక విమర్శకులు అభిప్రాయపడ్డారు.

---

18. డా.జి.వి. సుబ్రహ్మణ్యం, 'మనిషికిపెట్టిన నగిషీ', ''నారాయణరెడ్డి సాహితీమూర్తి''XXI.

మధ్యతరగతి మందభాగ్యుల కన్నీళ్ళని, మందహాసాలని సానుభూతితో పరిశీలించి ప్రతిభావంతంగా చిత్రించిన ఆధునిక కవులలో ఆరుద్ర, తిలక్‌ల తోపాటు డా. నారాయణరెడ్డికి ప్రముఖస్థానం ఉంది. 'కవిత్వం తమ మాతృభాష, ఇతివృత్తం మానవత్వం' అని స్పష్టంచేసిన వీరు సర్వమానవ సౌభాగ్యాన్ని ఆశించి ''అన్ని నొసళ్ళకు కావాలి పొద్దు / అన్ని నోళ్ళకు అందాలి ముద్ద'' అని ఆశించారు. ఉత్త ఉపసర్గలతో పొంగిపోయే యోగులుగా, పరమ హంసలుగా 'ఎన్జీవో'లను వర్ణించి వారి రంగు, రుచిలేని జీవితాలకి తమ కవిత్వంలో దర్పణం పట్టారు. ''ఆఫీసరుతో మాట్లాడడమే ఎడ్వెంచరు''గా భావించే గుమాస్తాలని వాస్తవికదృష్టితో చిత్రించిన ఆరుద్ర ''మీసం మెలేసుకుని'' మాట్లాడకుండా జెంటిల్మన్‌లా మెత్తగా, గొంగళీపురుగులా'' పడుకున్న గుమాస్తా కోటేశ్వరావుని చిత్రించిన తిలక్ నారాయణరెడ్డికి ఈ చిత్రణలో మార్గదర్శకులు కావచ్చు.

డా. నారాయణరెడ్డికి సమకాలీన సామాజిక స్పృహ, వర్తమాన రాజకీయ పరిజ్ఞానం పుష్కలంగా ఉన్నాయి. కాంగ్రెసు రెండుగా చీలిపోయిన సంఘటనని, ఇరాక్‌లో విప్లవాన్ని, రష్యాలో కమ్యూనిస్టు విప్లవాన్ని, భారత స్వాతంత్ర్య అపూర్వోదయాన్ని వీరు సందర్భోచితంగా చారిత్రక అవగాహనతో తమ కవిత్వంలో తదుచిత కావ్యబింబాలద్వారా చిత్రించారు. కర్షక కుటుంబంలో జన్మించినా వీరి కవిత్వంలో వ్యావసాయిక కావ్యబింబాలు తక్కువగా ఉండటం కొంత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కవిగా వీరి వ్యక్తిత్వం నాగరక వాతావరణంలోనే వికసించడం దీనికి కారణం. నాగరక కావ్యబింబాలు వీరి కవిత్వంలో ప్రముఖంగా కనిపిస్తాయి. ప్రత్యక్షజ్ఞాన పరికల్పితాలైన కావ్యబింబాలతో పాటు పరోక్షజ్ఞానం ప్రసాదించిన పౌరాణిక, చారిత్రక, సాంప్రదాయిక కావ్యబింబాలు తమ కవిత్వంలో వీరు తగు మాత్రంగా ప్రయోగించారు. శబ్దవిదులు, రసవేదులు అయిన

డా॥ నారాయణరెడ్డి తమ వైయక్తిక అనుభూతిని వ్యక్తీకరించడానికి తమ స్వంత ముద్ర ఉన్న వైయక్తిక బింబాలని విరివిగా ప్రయోగించడం ప్రత్యేకంగా పేర్కొనదగిన విషయం. మొదటి నుంచే వీరికి శబ్దంపై అధికారమేకాక, శబ్ద రమణీయకతపై అభిమానం ఎక్కువ. ఈ అభిమానం ఒక్కొక్కసారి ''బాలుడు, శిశుపాలుడు'' వంటి శబ్దాలంకార ప్రయోగానికి దారితీసింది.

వీరి కవిత్వంలో 1972 వ సంవత్సరం తరువాత సూచనా ప్రాయంగాను, 1977లో వీరికి పద్మశ్రీ బిరుదు లభించిన తరువాత ప్రముఖంగాను తాత్త్విక చింతన కనిపిస్తుంది. ప్రారంభదశలోనే నారాయణరెడ్డి గేయాల్లో ''చుట్టూ ప్రపంచం / శూన్యంలో నిల్చున్నాను'' అని భావించిన వీరు మానవుని అసంపూర్ణత నిజానికి అభ్యుదయ సేతువు అని గ్రహించగలిగిన తాత్త్వికశక్తిని వెల్లడించారు. మానవునిలోని ఆత్మని చిలకగా ''మనిషీ-చిలక'' లో చిత్రించి, పంచేంద్రియాలకి లొంగని ఆత్మ దీపస్తంభంలా అచంచలంగా నిలుస్తుంది అని అనశ్వరమైన ఆత్మశక్తిని చిత్రించారు. భౌతిక వైరుధ్యాల వెనక ఉన్న ఏకతా సూత్రాన్ని గ్రహించి, ఉభయ సంధ్యలు ఒకటేనని ''జీవించే ఆ చావు / మరణించే ఈ బ్రతుకు / ఒకటే ఒకటే ఒకటే'' అని స్పష్టంచేశారు. తమ కవిత్వమే ఒక తపస్సు అని భావించిన డా॥ నారాయణరెడ్డి తాము భూత, వర్తమాన, భవిష్యత్కాలాలని ఏకసూత్రంలో సంధానించే అనంతశక్తిగా, 'నేటి బిందువుమీద నిలిచి, రేపటి సింధువుని కొలిచి' కాలత్రయాన్ని కలిపే భావ సేతువుగా తమని తాము వర్ణించుకున్నారు. తాము విశ్వమంతా వ్యాపించగల విశ్వరూపంగా నిలిచి

కదిలింది నా చేయి
కదలిపోతున్నాయి సూర్యేందుచక్రాలు
వేశాను అడుగు, ఉ
ద్వేగంగా ఉరుకుతున్నాయి గ్రహాచరణాలు

''ఇంటిపేరు చైతన్యం'', 8.

అని తమ ఆత్మస్వరూపాన్ని తాత్విక కావ్యబింబంద్వారా కవి ఆవిష్కరించారు. ''విశ్వంభర''లో మానవప్రగతి గాథని తాత్వికంగా సమాలోచించి, మానవుని ప్రగతి తథ్యమనే ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. కాని మానవాతీతశక్తులు ఉన్నాయా లేవా ? అనే విషయంలో కొంత సందేహాన్ని వెలిబుచ్చుతూ

ఉన్నట్టే ఉంది -
ఊగింది శిరస్సు పరవశించి
ఉన్నట్టే ఉంది -
మోగింది శరీరం పరిస్పందించి

''విశ్వంభర'', 76.

అని తమ తాత్విక సందేహాన్ని బౌద్ధమతసన్నిహితంగా వెల్లడించారు.

మూడు దశాబ్దాలపైగా వివిధ కవితా రీతులని, రాజకీయ సాంఘిక, తాత్విక దృక్పథాలని తమ కవిత్వంలో సముగ్రంగా ప్రదర్శించి వాటి లోని సుగుణాలకి సమన్వయం కలిగించి ఆధునికాంధ్ర కవిత్వంలో సంప్రదాయాలకి

ప్రయోగాలకి సముజ్జ్వల ప్రతీకగా నిలిచే వీరి కవిత్వం ''సంప్రదాయాన్ని జీర్ణించుకున్న ప్రయోగం''. వీరి కవిత్వం ఆధునిక విమర్శకులు తెలియ చేస్తూ, ''రెడ్డిగారి కవితలో హేతువాదం, సౌందర్యవాదం, విషణ్ణవాదం, ఆశావాదం, అనుభూతివాదం, రీతివాదం, అలంకారవాదం, చమత్కారవాదం, ప్రతీకవాదం ------అంతర్లక్షణాలుగా అలంకృతులవుతున్నవి''[19] అని వివరించారు.

ప్రత్యేక అధ్యయనానికి నేను ఎన్నుకున్న ముగ్గురు కవులు ఏ సంకుచితవర్గానికి చెందక సమగ్ర సాహిత్య దర్శనానికి ఉపకరించే సమన్వయ మూర్తులు. సాహిత్యంలో శాశ్వత విలువలని గ్రహించి సమకాలీన సమాజాన్ని సూక్ష్మంగా పరిశీలించి వారు గ్రహించిన వాస్తవాలని తమ కళాత్మక దృష్టిలో, కవిత్వ కళా వైదగ్ధ్యంతో రమణీయ కవితాసత్యాలుగా, కమనీయ కవితా ఖండాలుగా పరివర్తించి ఆంధ్ర సాహిత్యానికి అలంకారాలుగా సమర్పించారు. సాహిత్యం తాత్కాలికరాజకీయ ప్రయోజనాలకి, రాజకీయ పక్షాల నేతలకి అమ్ముడుపోయే సరుకుగాకాక సార్వకాలిక సత్యాలుగా అందంగా, ఆనందంగా ఆవిష్కరించే శిల్పంగా వీరి కవిత్వంలో సాక్షాత్కరిస్తుంది. చెప్పే విధానంకాదు చెప్పేదే ముఖ్యం అని medium కి message కి మధ్య అసహజమైన అగాధాన్ని సృష్టిస్తున్న సంకుచిత విమర్శకులకి వీరికవిత్వం శోభాయమానమైన, సుందరమైన సమాధానం. సింబలిస్టు కవులు ఆశించిన సౌందర్య లక్ష్యం (La Beau)

---

19. డా. జి. వి. సుబ్రహ్మణ్యం, Ibid.

ఈ ముగ్గురు కవుల కవిత్వంలో ప్రముఖంగా దర్శనీయమవుతోంది. వీరి కవితాదృష్టిని, సౌందర్యాభిమానాన్ని, అభ్యుదయదృక్పథాన్ని, మానవతాభిరుచిని, తాత్త్వికఔన్నత్యాన్ని స్పష్టంగా, ప్రగాఢంగా వెలువరించడానికి అనువైన కావ్య బింబపరికల్పనలో వీరు నిష్ణాతులు. ఈ కావ్యబింబాలు వీరి వ్యక్తిత్వ దర్శనానికే కాక, సమకాలీన సాంఘిక, రాజకీయ, నైతిక, తాత్త్విక వాతావరణాన్నికూడ అవగాహనచేసుకోవడానికి అత్యంత ఉపస్కారకాలు. త్రికాలాలని తమ కవితలో ఏకతాసూత్రంలో సంధానించి, విరుద్ధసంస్కృతీప్రభావాలని, రాజకీయ విశ్వాసాలని సమగ్రంగా పరిశీలించి, వీటి బాహ్యాకారాలవెనక ఉన్న అంతస్సూత్రాలని దర్శించి, తమ కవిత్వంలో సమగ్ర కావ్యబింబాలద్వారా ప్రదర్శించిన ఈ ముగ్గురు కవితామూర్తులు ఆధునికాంధ్ర కవిత్వంలో సమన్వయమూర్తులు. తెలుగు కావ్యాత్మ ఉపరితలంలోని తుఫానులకి విచలితంకాక, అచిరకాలంలో సత్య, శివ, సుందర దర్శనాన్ని చేసుకోగలదని కవితాప్రియులు అందరు ఆశించవచ్చు.

---

# ఉపయుక్త

# గ్రంథదర్శిని



## ఉపయుక్త గ్రంథ దర్శిని

అ. ముఖ్య కృతులు

### బాలగంగాధర తిలక్

1. బాలగంగాధర తిలక్ ''అమృతం కురిసిన రాత్రి'', విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, 1968.

'శర్వరీ ప్రియ', ప్రతిభ, 1938.
'భ్రాంతి', ''ప్రతిభ'', 1942.
'నెమ్మి సుందరి', ''ప్రతిభ'', 1943.
'సంధ్య', 'ప్రతీక్షణ', 'చింతం జిల్లు', 'శిశిరం', ''ప్రభాతము'', ''గోరువంకలు'', 1945.
ఆవాహనము, ''ప్రతిభ'', 1945.
'దీక్ష', ''భారతి'', డిసెంబరు, 1946.
'స్వయంవర', ''భారతి'', ఫిబ్రవరి, 1959.
'నిషణ్ణ వైదేహి', ''భారతి'', జూన్, 1961.
'సర్పహేల', ''భారతి'', డిసెంబరు, 1961.
'యౌవనావాహనము', ''సాహితి'', అక్టోబరు, 1962.
'అటవెలది', ''భారతి'', జూలై, 1963.
'సమవాకారం', 'ఆంధ్రప్రదేశ్', 1968.
'తిలక్ లేఖలు', విశాలాంధ్ర ప్రచురణలు, విజయవాడ, 1968.
'నగరంలో హత్య', 'నగరంలో పేడనీడ', ''కళాకేళి'', ఆగస్టు, 1969.
'మంచు', ''కళాకేళి'', ఆగస్టు, 1970.
'ఆవాహన', కళాకేళి, ఆగస్టు, 1971.

వాటసం

'కానకసుష్టి', ''భారతి'', జూన్, 1944.

2. డా. ఎ. నరసింహారావు — ''తిలక్ కవిత్వ తత్త్వం'', అముద్రిత సిద్ధాంత గ్రంథం, ఆంధ్ర విశ్వవిద్యాలయం, 1978.

Dr.S.S.Prabhakar — "The Song of the Cosmos and other Poems", Writers Workshop, Calcutta, 1975.

''ఆనంద వాణి'', తిలక్ సంచిక, 1965.

''సృజన'', తిలక్ ప్రత్యేక సంచిక, 1966.


## డా. దాశరథి


1. డా. దాశరథి — ''దాశరథి కవిత''- ''అగ్నిధార'' (1949)
''రుద్రవీణ'' (1950)
'మహాంధ్రోదయం' (1955)
'పునర్నవ' (1961)
'అమృతాభిషేకము' (1962)
'కవితాపుష్పకం', (1966)
మహాంధ్ర ప్రచురణలు, మద్రాసు, 1977.

''మహాబోధి'', కొండా శంకరయ్య, సికింద్రాబాదు చతుర్థ ముద్రణము, 1971.

''తిమిరంతో సమరం'', మహాంధ్ర ప్రచురణలు, మద్రాసు, 1973.

''ఆలోచనాలోచనాలు'', మహాంధ్ర ప్రచురణలు, మద్రాసు, 1975.

''ధ్వజమెత్తిన ప్రజ'', యం. శేషాచలం అండ్ కంపెనీ, సికింద్రాబాదు, 1981.

2. డా. లలిత కుమారి — ''దాశరథి సాహిత్య దర్శనం'' రచయిత్రిచే ప్రచురితం, విశాఖపట్నం, 1981.

Dr.S.S.Prabhakar — "Duel with Darkness & other Poems", Mahandhra Publications, Madras, 1977.

Dr.G.V.Subrahmanyam — Synthesis of Tradition and Experiment, "The Hindu", 6-11-77.

''కాంతి కవాటం'' 'తిమిరంతో సమరం సమీక్షలు', మహాంధ్ర ప్రచురణలు, మద్రాసు, 1975.

డా॥ సి॥ నారాయణరెడ్డి

డా॥ నారాయణరెడ్డి సృజనా సాహితి

''జలపాతం'', హైదరాబాదు, 1953.

''నారాయణరెడ్డి గేయాలు'', కొండా శంకరయ్య, సికిందరాబాదు, 1955.

''నాగార్జున సాగరం'', కొండా శంకరయ్య, సికిందరాబాదు, 1955.

''కర్పూర వసంతరాయలు'', రచయితచే ప్రచురితం, 1957.

''దివ్వెల మువ్వలు'', కొండా శంకరయ్య, సికిందరాబాదు, 1959.

''అక్షరాల గవాక్షాలు''.

''మధ్యతరగతి మందహాసం'', ఎమ్.శేషాచలం అండ్ కంపెనీ, సికిందరాబాదు, 1968.

''మరోహరివిల్లు'', సంజా ప్రచురణలు, హైదరాబదరు, 1969.

''మంటలూ-మానవుడూ'', రచయిత, హైదరాబాదు, 1970.

''ముఖాముఖి'', రచయిత హైదరాబాదు, 1971.

''మనిషీ-చిలక'', రచయిత హైదరాబాదు, 1972.

''ఉదయం నా హృదయం', రచయిత, హైదరాబాదు, 1973.

''మార్పు నా తీర్పు'', రచయిత, హైదరాబాదు, 1974.

''తేజస్సు నా తపస్సు'', రచయిత, హైదరాబాదు, 1975.

''ఇంటిపేరు చైతన్యం'', రచయిత, హైదరాబాదు, 1976.

''మథనం'', మనస్వినీ ప్రచురణలు, హైదరాబాదు, 1978.

''మృత్యువు నుంచి'' మనస్వినీ ప్రచురణలు, హైదరాబాదు, 1979.

''భూమిక'', మనస్వినీ ప్రచురణలు, హైదరాబాదు, 1977.

''విశ్వంభర'' రచయిత, హైదరాబాదు, 1980.

## విమర్శనా సాహితి

''వ్యాసవాహిని''.

''ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు - ప్రయోగములు'' రచయిత, హైదరాబాదు, 1967.

''సమీక్షణం'', వంశీ ఆర్ట్స్ థియేటర్స్ ప్రచురణ, హైదరాబాదు, 1981.

2. డా. జి. వి. సుబ్రహ్మణ్యం (సం) ''చైతన్య శిఖరం'' 'మంటలూ-మానవుడూ కావ్యసమీక్ష', నవోదయం, హైదరాబాదు, 1975.

డా. తిరుమల శ్రీనివాసాచార్య ''నారాయణరెడ్డి సాహిత్యమూర్తి'', యువభారతి, సికిందరాబాదు, 1981.

డా. రావూరి వేంకట సత్యనారాయణరావు ''వెన్నెల తెరచాప నారాయణరెడ్డి'', వంశీ ఆర్ట్స్ థియేటర్స్ ప్రచురణ, హైదరాబాదు, 1981.

''నారాయణరెడ్డి 50వ జన్మదిన అభినందన సంచిక'', వంశీ ఆర్ట్స్ థియేటర్స్ ప్రచురణ, హైదరాబాదు, 1981.

## ఆ. లాక్షణిక, విమర్శన గ్రంథాలు

### సంస్కృతము


అథర్వ వేదము

అభినవగుప్తుడు — 'ధ్వన్యాలోక లోచనము', కుప్పుస్వామి శాస్త్రి, రిసెర్చి ఇన్స్టిట్యూట్, మదరాసు, 1944.

ఆనంద వర్ధనుడు — 'ధ్వన్యాలోకము' (ఆంధ్రీకరణం, పంతుల లక్ష్మీనారాయణశాస్త్రి, రచయిత, విజయనగరము, 1954).

ఈశావాస్యోపనిషత్తు — (సం. పుల్లెల శ్రీరామ చంద్రుడు) సురభారతి సమితి, హైదరాబాదు, 1981.

గురుబాలప్రబోధిక

జగన్నాథ పండితుడు — రసగంగాధరము (ఆంధ్రానువాదము, వేదాల తిరువేంగళాచార్యులు,) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1973.

దండి — కావ్యాదర్శము (సం.) యం. రంగాచార్య, ఓరియంటల్ రిసెర్చి ఇన్స్టిట్యూట్, మదరాసు, 1910.

ధనంజయుడు — దశరూపకము.

భరతుడు — నాట్యశాస్త్రము, కాశీ సంస్కృత సిరీస్, చౌకంబా, వారణాసి, 1929.

భామహుడు — కావ్యాలంకారము.

మమ్మటుడు — 'కావ్యప్రకాశము' గవర్నమెంటు ఓరియంటల్ సిరీస్, 60, మైసూరు, 1922.

ముండకోపనిషత్తు

యజుర్వేదము

రుద్రటుడు — 'కావ్యాలంకారము', కావ్యమాలసిరీస్, 1928.

విద్యానాథుడు — ప్రతాప రుద్రీయము (ఆంధ్రానువాదం, చెలమచెర్ల రంగాచార్యులు, శ్రీనివాస పబ్లికేషన్స్, హైదరాబాదు, 1972).

వాల్మీకి — శ్రీమద్రామాయణమ్.

విశ్వనాథుడు — సాహిత్య దర్పణము, నిర్ణయసాగర్ ప్రెస్, 1951.

డా. వేలూరి సుబ్బారావు — (సం.) ''సంస్కృత కావ్య సంగ్రహము, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు, వాల్తేరు, 1978.

వ్యాసమహర్షి — శ్రీమత్ భగవద్గీత, శ్రీ రామకృష్ణ తపోవనమ్, 1969.

## హిందీ

డా. కుమార విమల్ — ''సౌందర్యశాస్త్ర కా తత్వ''.

డా. ధర్మశీల — 'కావ్యబింబ్ ఔర్ కామాయనీకి బింబ్ యోజనా', నేషనల్ పబ్లిషింగ్ హౌస్, న్యూఢిల్లీ, 1977.

డా. నగేంద్ర — ''కావ్యబింబ్'', నేషనల్ పబ్లిషింగ్‌హౌస్, న్యూఢిల్లీ, 1968.

డా. పద్మా అగర్వాల్ — మనోవిజ్ఞాన కోశ్.

డా. బ్రజనందన్‌ప్రసాద్ అఘోరి — కావ్యాత్మక బింబ్.

డా. భగీరథ మిశ్ర — కావ్యశాస్త్ర.

## తెలుగు

## విమర్శన గ్రంథములు


అప్పలస్వామి పురిపండ
నరసింహశాస్త్రి ఎ.రి (సం) ''సారస్వత వ్యాసములు (1-5)'' ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1971-79.

అప్పారావు బసవరాజు ''ఆంధ్ర కవిత్వ చరిత్రము''.

ఆర్వీ యార్ ''సాహిత్య తత్వము''.

ఆచార్య తిరుమల ''ఆధునికత-అభిప్రాయ వేదిక'' కిన్నెర ప్రచురణలు, హైదరాబాదు, 1981.

డా. కృష్ణమూర్తి ఇరివెంటి (సం.) ''మహతి'' యువభారతి, సికిందరాబాదు, 1972.

డా. నరసింహం కె.వి.ఆర్ ''సాహిత్య దర్శనము'' క్వాలిటీ పబ్లిషర్స్, విజయవాడ, 197[illegible].

డా. నరసింహం అంతటి ''ప్రబంధములలో ప్రకృతి వర్ణనలు'', సమతా సాహితి, హైదరాబాదు, 1979.

డా. నారాయణరావు వెల్చేరు ''తెలుగులో కవితావిప్లవాల స్వరూపం'', రచయిత, హైదరాబాదు, 1978.

డా. రామకృష్ణ మిరియాల ''శ్రీశ్రీ కవిత్వం - వస్తువు, సంవిధానం'', రచయిత, కాకినాడ, 1980.

రామచంద్రారెడ్డి రాచమల్లు ''సాహిత్య వివేచన,'', విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, 1976.

డా. రామకోటిశాస్త్రి కేతవరపు (సం.) ''విమర్శిని'', స్నాతకోత్తర విద్యాకేంద్రం, వరంగల్లు, 1976.

రామమోహనరావు అద్దేపల్లి ''విమర్శ వేదిక'', ప్రభాకర్ పబ్లికేషన్స్, కాకినాడ, 197[illegible].

రామిరెడ్డి దువ్వూరి ''కవి కోకిల గ్రంథావళి'' - 4, కవికోకిల గ్రంథమాల, తిమ్మారెడ్డిపాళెం, 1959.

డా. లలితకుమారి. డి. ''ఆధునికాంధ్ర కవితాతత్త్వం'', రచయిత్రి, విశాఖపట్టణం, 1980.

డా. విశ్వం, అరిపిరాల ''ఆధునిక కవిత్వము నందలి మానవుడు ప్రకృతి'', (అముద్రిత సిద్ధాంతగ్రంథం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1965.

డా. వీరభద్రరావు కొత్తపల్లి ''తెలుగు సాహిత్యము - ఇంగ్లీషు ప్రభావము;'' రచయిత, నాష్విల్లే, 1960.

శేషేంద్ర శర్మ ''కవిసేన మేనిఫెస్టో'' ఇండియన్ లాంగ్వేజస్ ఫోరం, హైదరాబాదు, 1977.

శ్రీకాంతశర్మ ఇంద్రగంటి ''సాహిత్యపరిచయం'', నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1979.

''ఆలోచన'', నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1981.

సత్యనారాయణ విశ్వనాథ ''అల్లసాని వాని అల్లిక జిగిబిగి'', వి. ఎస్. ఎన్. అండ్ కో, విజయవాడ, 1970.

సత్యనారాయణశాస్త్రి మధునాపంతుల ''ఆంధ్ర రచయితలు'', సరస్వతీ పవర్ ప్రెస్, రాజమహేంద్రవరము, 1950.

డా. సుబ్రహ్మణ్యం, జి. వి. (సం.) ''సమాలోచనం'', ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1981.

సూర్యనారాయణశాస్త్రి సన్నిధానం (ఆంధ్రానువాదము) ''కావ్యాలంకార సంగ్రహము, యం. శేషాచలం అండ్ కంపెనీ, సికిందరాబాదు, 1969.

సూర్యనారాయణశాస్త్రి ఖండవల్లి ''కాళిదాస హృదయం'', రచయిత, రాజమండ్రి, 1966.

స్వామి శ్రీ 'చంద్రాలోక సమున్మేషము' (జయదేవుని చంద్రాలోక ఆంధ్రవ్యాఖ్య) మహతీ గ్రంథమాల, గుంటూరు, 1973.

## కావ్యాలు, కవితా సంకలనాలు


| | |
|---|---|
| అప్పారావు గురజాడ | ''ముత్యాలసరాలు'', విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, 1955. |
| ఆరుద్ర | ''త్వమేవాహమ్'', విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, విజయవాడ, 1971. |
| | ''ఏటికేడాది'', కె.రామలక్ష్మి, మదరాసు, 1979. |
| ఆంజనేయులు కుందుర్తి | ''కుందుర్తి కృతులు'', కుందుర్తి సన్మాన సంఘం, హైదరాబాదు, 1975. |
| " (సం.) | ''తరంతరం'', ఫ్రీవర్స్ ఫ్రంట్, హైదరాబాదు, 1976. |
| కృష్ణదేవరాయలు | ''ఆముక్త మాల్యద'', వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్సు, మదరాసు, 1969. |
| కృష్ణశాస్త్రి దేవులపల్లి | ''పల్లకి'', ''కృష్ణపక్షము'', దేవులపల్లి కృష్ణశాస్త్రి సన్మానసంఘం, మద్రాసు, 1976. |
| డా. గోపాలరెడ్డి బెజవాడ | ''ఆమె'', ఆంధ్రసారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1978. |
| | ''కాలవాహిని'', ఆంధ్రసారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1979. |
| గోపాలకృష్ణ రెంటాల | 'సర్పయాగం'. |
| తిక్కన | ''ఆంధ్ర మహాభారతము'', వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మద్రాసు. |
| దిగంబర కవులు | ''మూడు కవితా సంకలనాలు'', యం.శేషాచలం అండ్ కంపెనీ, సికిందరాబాదు, 1971. |
| దేవిప్రియ | ''అమ్మచెట్టు'', సమతాబుక్స్, హైదరాబాదు, 1979. |
| నగ్నముని | ''కొయ్యగుర్రం'', సృష్టి ప్రచురణ, హైదరాబాదు, 1980. |

| | |
|---|---|
| నన్నయ | ''ఆంధ్ర మహాభారతము'', వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మద్రాసు. |
| నన్నెచోడుడు | ''కుమార సంభవము''. |
| పఠాభి నారాయణబాబు శ్రీరంగం | 'రుధిర జ్యోతి', నవోదయ పబ్లిషరు, విజయవాడ, 1976. |
| పఠాభి | ''ఫిడేలు రాగాలు డజను'', వర్ధమాన సమాజము, నెల్లూరు, 1973. |
| పెద్దన | ''మనుచరిత్రము'', వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మద్రాసు, 1969. |
| పోతన | ''శ్రీమదాంధ్ర మహాభాగవతము'', వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మద్రాసు. |
| బాపురెడ్డి, జె. | ''అనంతసత్యాలు'', సుభేలానికేతన్, హైదరాబాదు, 1979. |
| భీమన్న బోయి | ''మణిమానసం'', సుఖేలానికేతన్, హైదరాబాదు, 1972. |
| | ''బొమ్మ'', సుఖేలానికేతన్, హైదరాబాదు, 1975. |
| | ''గుడిసెలు కాలిపోతున్నాయి'', సుఖేలానికేతన్, ద్వితీయ ముద్రణం, 1977. |
| ముద్దుకృష్ణ (సం..) | ''వైతాళికులు'', విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, విజయవాడ, 1978 (తొమ్మిదవ ముద్రణ) |
| రామకృష్ణుడు తెనాలి | ''శ్రీ పాండురంగమాహాత్మ్యము'', వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మద్రాసు, 1968. |
| రామకృష్ణారావు అబ్బూరి | ''ఊహాగానం ఇతరకృతులు'', కవిత, న్యూఢిల్లీ, 1973. |
| రామిరెడ్డి దువ్వూరి | ''కృషీవలుడు'' కవికోకిల గ్రంథావళి, తిమ్మారెడ్డి పాళెం, 1959. |
| డా. విశ్వం ఆరిపిరాల | ''రేపటి స్వర్గం'', రచయిత, హైదరాబాదు, 1968. |
| శివారెడ్డి, కె. | ''నేత్రధనుస్సు'' ఝరి పొయిట్రీ సర్కిల్, హైదరాబాదు, 1978. |

| | |
|---|---|
| శివాజీనాయుడు అడపా (సం.) | ''రాత్రి'', అమరసాహితి, సికిందరాబాదు, 1964. |
| శేషేంద్రశర్మ | ''శేష జ్యోత్స్న'', ఇండియన్ లాంగ్వేజస్ ఫోరం, 1972. |
| | ''నాదేశం నాప్రజలు'', ఇండియన్ లాంగ్వేజస్ ఫోరం, హైదరాబాదు, 1975. |
| శేషేంద్రశర్మ | ''నీరై పారిపోయింది'' ఇండియన్ లాంగ్వేజస్ ఫోరం, హైదరాబాదు, 1976. |
| శ్రీకాంతశర్మ ఇంద్రగంటి | ''అనుభూతి గీతాలు', నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1976. |
| శ్రీశ్రీ | ''మహాప్రస్థానం'', విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, 1978. |
| | ''ఖడ్గసృష్టి'', విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, 1966. |
| | ''మరో ప్రస్థానం'', విప్లవ రచయితల సంఘం, హనుమకొండ, 1980. |
| సత్యనారాయణ విశ్వనాథ | ''కిన్నెరసాని పాటలు'', వి.ఎస్.ఎన్. అండ్ సన్స్, విజయవాడ, 1959. |
| | 'శశిదూతము', వి.ఎస్.ఎన్. అండ్ సన్స్, విజయవాడ, 1970. |
| | ''శ్రీమద్రామాయణ కల్పవృక్షము', వల్లి పబ్లికేషన్సు, విజయవాడ, 1976. |
| సుబ్బారావు నండూరి | ''ఎంకిపాటలు'', రచయిత, ఏలూరు, 1953. |
| ఆచార్య సుబ్బారావు రాయప్రోలు | ''తృణ కంకణము'', వంశీ ఆర్ట్ థియేటర్స్, హైదరాబాదు, 1981. |
| | ''రమ్యాలోకము''. |
| | ''మాధురీ దర్శనము''. |
| | 'మిశ్రమంజరి'. |
| సోమనాథుడు పాల్కురికి | ''బసవ పురాణము''. |

## BOOKS IN ENGLISH

### Critical


Abrams M.H. "The Mirror and the Lamp", Oxford University Press, London, 1959.

Aristotle "Poetics", tr. by S.H.Butcher, London, 1907, tr.by Gerald F.Else, The University of Michigan Press, Ann Arbor, 1967.

Arnold Matthew "The Function of Criticism at the present Time" (First Series).

Auden W.H. "The Enchafed Flood", University of Virginia Press, Virginia, 1950.

Aurobindo (Ghosh) "The Future Poetry", Sri Aurobindo Ashram, Pondicherry, 1957.

Bodkin Maud "Archetypal Patterns of Poetry", Oxford University Press, 1934.

Bowra C.M. "The Heritage of Symbolism", The Macmillan Press, London, 1973(Rpt.).

Chadwick Charles "Symbolism", Methuen & Company, London, 1978.

Coleridge S.T. "Biographia Literaria" (ed.by G.Shaw Cross), Oxford, 1907.

Day Lewis, C. "The Poetic Image", Jonathan Cape, London, 1947.

Eliot T.S. "Selected Essays", Penguin Books, Middlesex, 1957.

Emerson R.W. "The Poet The Works", Fireside Edition, New York, 1909.

Encyclopaedia of Religion, Vol XIII.

Fry Northrope — "Anatomy of Criticism", Princeton University Press, New Jersey, 1973(Rpt.).

Handy J.William & Westbrook Max (Eds) — "Twentieth Century Criticism The Major Statements" (Indian Edn.) Light/Life Publishers, /& New Delhi, 1907.

Horace — "Ars Poetica", (Loeb Classical Library Edn.), Cambridge, Mass, 1936.

Jelliff A Robert (Ed.) — "Far at Nagano" (Interviews with William Faulkner), Kenkyushe, Tokyo, 1956.

Macleish Archibald — "Poetry & Experience".

Macaulay T.B. — "Essays" Everymans' Library, London, 1907.

Mcdougall W. — "Outline of Psychology".

Orwell George — "Inside the Whale and other Essays", Penguin paper back Edn, Middlesex, 1957.

Patridge E.B. — "The Broken Compass".

Plato — "Dialogues" tr. by Benjamin Jowett, Oxford, 1953.

Pound Ezra — "Literary Essays", New Directions Publishing Corpn., New York, 1935.

Richards I.A. — "The Foundations of Aesthetics", Harcourt, Brace & Company, New York, 1925.

"Coleridge On Imagination", Indiana University Press, Bloomington, 1965, (Rpt.).

Santayana George — "The Sense of Beauty", Philosophical Society, New York, 1896.

Shelley P.B. — "A Defense of Poetry"(ed.by A.S.Cook), Boston, 1891.

Spurgeon Caroline — "Shakespeare's Imagery & What It tells us" , Cambridge University Press, Cambridge, 1935.

Tindall W.Y. — "The Literary Symbol" , Columbia University Press, New York, 1955.

Urban Wilbur — "Language and Reality", The Macmillan Company, New York, 1939.

Viswanatham K — "Essays in Criticism & Comparative Poetics, Andhra University Press, Waltair, 1976.

Weitz Morris — "Problems in Aesthetics".

Wellek Rene & Warren Austin — "Theory of Literature", Penguin Books, Middlesex, 1978.

Wells Henry — "Poetic Imagery", New York, 1924.

Wimsatt K.William & Brooks Cleanth — "Literary Criticism; A Short History", Oxford University Press, Bombay(Indian edn.), 1974.

Wordsworth W. — "Prose Works", ed. by Grosert.

Yeats W.B. — "Ideas of Good and Evil", Macmillan, London, 1903.

Ziolkowsky Theodore "Disenchanted Images A Literary Iconology", Princeton University Press, New Jersey, 1977.

Journal Special Issue on "Metaphor" Critical Enquiry (Autumn 1978) University of Chicago, Illinois, Contains Ted Cohens "Metaphors & Cultivation of Intimacies", Donald Davidson's "What Metaphors Mean?", etc.

Creative

Auden W.H. The Refugee "Selected Poems" Faber, London, 1933.

Donne John 'The Flea' & 'Valediction forbidding Mourning', "Poems" ed. by H.J.C. Grierson, Oxford, 1912.

Eliot T.S. 'The Love Song of J Alfred Prufrock', "Poems", Faber, London, 1936. "The Wasteland," (ed. by Valery Eliot), Faber, London, 1971.

Keats John 'Ode to Nightingale', 'Ode to Grecian Urn', 'Endymion', "Poetic Works", ed. by H.B.Formen, (English Men of Letters), London, 1885.

Milton John 'Lycidas', "Poetical Works" (ed. by H.C.Beaching), Oxford, 1900.

Shakespeare W. 'Sonnets', 'Venus and Adonis,'A Midsummer Night's Dream', 'King John, Antony and Cleopatra', New Variorium Shakespeare, Philadelphia, 1875.

Shelley P.B. 'Ode to Skylark', "Complete Works"(Every man's Library Edn.) London, 1901.

Thwaite Anthony "20th Century English Poetry", Heineman Educational Publishers, London, 1978, Contains George Barker's 'Calamiterror & David Gaskoyne's In Defence of Humanism", etc.

Wordsworth W. "The Prelude", Oxford, 1926.

Yeats W.B. "Collected Poems", Macmillan, London, 1925.

'Modern French Poetry' Ed. and tr.by Serge Gavronsky & Patricia Terry. Contains translations into English of French poems - Mallarme's "L' Azur", Verlaine's 'Moonlight', Appolinaire's "Nuit Rhyme" etc. C.M.Bowra's' Heritage of Symbolism' "contains translations into English of Rilke's "Wendung", Stefan George's "Weili" & Alexander Blok's 'Neva Delta' etc.

---oOo---